ప్రదర్శింపవలె నని నే నారంభించిన నవలా
నది. నారాయణభట్టులో నన్నయను, రుద్రమదేవిలో
రెడ్డిలో ఎర్రయను ప్రధానపురుషులనుగా గ్రహించితిని.
తారికయు ఆశ్వాసాద్యంతపద్యములును, ఎర్రయ ఇతర గ్రంథము
పలుమారు పఠించుటచే ఇందలి కథాభాగము లెన్నియో సృష్టించుటకు
చనలు లభించినవి. సూక్ష్మగ్రాహులగు సహృదయులకు నా కల్పనలు
హ్లాదావహములు కాగలవు.

శ్రీనాథుని హరవిలాసావతారిక నుండి అవచిదేవయగ్రశ్రేష్ఠి వైభవము
గ్రహించితిని.

ఆనాటి చరిత్ర గ్రహించుటకై శ్రీ మల్లంపల్లి శోమశేఖరశర్మ 'History
f the Reddi Kings' & 'Forgotten Chapter of Andhra History'
డాక్టరు నేలటూరి వెంకటరమణయ్య 'Kampili and Vijayanagara',
Vijayanagara', శ్రీ చిలుకూరి వీరభద్రరావు, 'ఆంధ్రుల చరిత్ర', ఆంధ్రేతి
హాసపరిశోధక మండలివారు ప్రచురించిన రెడ్డిసంచికయు, ఇతర వ్యాసములును
నేను శ్రద్ధగా పఠించితిని. రెడ్డిసంచికకు 'Forgotton Chapter' కును అనుబంధ
ములుగా ప్రచురించిన ఆనాటి శాసనములు నాకు విశేషముగా ఉపకరించినవి.
ప్రసిద్ధులగు చరిత్రకారులకు బహువిషయములలో అభిప్రాయభేదము లున్నవి.
ఒక్కొక్క విషయములో ఒక్కొక్కరి అభిప్రాయము నేను గ్రహించుటయు,
కొన్ని విషయములలో వారెవ్వరితోడను ఏకీభవింపక స్వతంత్రనిర్ణయము చేసి
కొనవలసి వచ్చుటయు తటస్థించినది. ఐనను వారందరు చేసిన కృషికి నేనెంతయు
కృతజ్ఞుడను.

మల్లారెడ్డి ప్రతీపథరణీపాలావళిని తోలి మోటుపల్లి పట్టుకొనుటను
ఎర్రయ మహాకార్యముగా వర్ణించినాడు. కాని ఆ ప్రతీపథరణీపాలు రెవరో
ప్పలేదు. చరిత్రకారులు బహువిధముల ఊహలు చేసిరి. ఆనాటి స్థితిగతులను
ఢిల్లీసుల్తాను సేనలే అందుండుట కవకాశ మెక్కువ ఉన్నందున నే నట్లే
గ్రహించితిని.

అలావదీనాది తురుష్క మల్లులను మల్లారెడ్డి జయించినట్లు కల్వవాముల
శాసనశ్లోకములో కనబడుచున్నది. అలావదీనుఖిల్జీ అంతకు పూర్వమెన్నడో
తించియుండెను. మొదటి బహమనీసుల్తాను క్రీ॥ శ॥ 1347 లో అలావదీను
ము బిరుదనామముతో సింహాసన మెక్కెను. అతడు 1350, 1351 ప్రాంతము
లో తెలుగు దేశముపై దండెత్తెను. అందుచేత మల్లారెడ్డి జయించినది ఈ అలా
ను అని కొందరు చరిత్రకారు లూహించినారు. కాని 1345 కు పూర్వమే
ల్లారెడ్డి స్వర్గతుడైనట్లు అమరావతిలోని శాసనమొకటి స్పష్టమొనర్చుటచేత

ఆ యూహ సరికా నేం
సరదారు ఉండియుండవలెను.
యర్థము. అందుచేత మోటుపల్లి దుర్గాధిప
నూహించినది సత్యమగుటకు ఎక్కువ యవకాశమున్న

ఆనాటి శాసనములు, గ్రంథములు ముసల్మానులను, -
శీకులు, యవనులు, మ్లేచ్ఛులు - అను వేరువేరు పేర్లతో అభేదము
రించి యుండుటచేత ఈ నవలలో నేనును వారిని ఆన్ని నామములతో అ
ముగా నిర్దేశించితిని.

ఎర్రయ శంభుదాస బిరుదాంకితుడగుటచేత పలువు రాతడు శైవు
వ్రాసినారు. ఆతని గురువుకూడ శైవు డని యట్టివారు తలంచిరి. వేమా రెడ్డియ
వారి కుటుంబమువారును శైవులనియే వ్రాయుట పరిపాటియైనది. శైవశబ్దము
నేడు స్మార్తులని వ్యవహారములో నున్నవారికి అన్వయించు నన్నచో చిక్కు
లేదు. కాని లింగధారణము, ఖననము ప్రధాన చిహ్నములుగా గల నేటి శైవ
శాఖలలో వేనికిని వారు చెందినవారు కారని నిర్ధారణగా చెప్పవచ్చును.
వారందరు శివకేశవులకు భేదము చేయని శివభక్తులనుట నిశ్చయము.

ఎర్రయ గురువు నిత్య శివరాత్రి వ్రతముగా గలిగి ఎనిమిది యామములలో
శివార్చనము చేసెడివాడు. ఆరాధ్యబ్రాహ్మణులలో షట్కాలార్చన మున్నది
కాని ఎనిమిది యామములలో శివపూజలేదు. స్మార్తులు మహాశివరాత్రినాడు
దీక్షగా ఎనిమిది యామములలో శివార్చన మొనర్చుట యున్నది. అదిగాక
అతడు శంకరస్వామి! ఆ నామము శాంకర పీఠస్థులకు అందరికి సుప్రసిద్ధమైనది.
వారందరు భారతీ సంప్రదాయయతులు. ఎర్రయ నృసింహావతారావతారికలో
భారతిని యతిరూపముతో స్తవమొనర్చుట గమనింపదగినది.

ఎర్రయ రచించిన గ్రంథములు - హరివంశము, నృసింహావతారము, మహా
భారతము, రామాయణము - అన్నియు విష్ణుపరము లైనవి. హరివంశములో
శ్రీ కృష్ణుడు శివుని గూర్చి తపస్సు చేయగా శివుడు ప్రత్యక్షమై తా నెల్లప్పుడు
నారాయణునే ధ్యానించుచున్నానని చెప్పను. ఆ ఘట్టము ఎర్రయ స్మార్తు డి
స్పష్టము కావించును. అందులకు నిదర్శనముగా నృసింహపురాణావతారికల
నృసింహభక్తుడగు ఎర్రయ తాతగారి ప్రత్యక్షవచనములు కూడ ఉన్నవి.

వేమా రెడ్డి అగ్రహారము లెన్నియో దానము చేసెను. అవి యన్నియు
యజ్ఞయాగాది క్రతువు లొనర్చిన స్మార్తబ్రాహ్మణులకే ఇచ్చినవి. కొన్నిటిలో
ప్రతిగ్రహీతల నామముల పట్టికలు త్రిపురుషముగా నున్నవి. ఎక్కడను
ఆరాధ్యబ్రాహ్మణుల నామములు కనబడవు. అంతియకాక వేమా రెడ్డి శ్రీశైలమ
నకును అహోబలమునకును సోపానములు నిర్మించినాడు. ఈ మొదలైన కారణ
ములచేత వేమా రెడ్డి కుటుంబమును స్మార్తకుటుంబ మైనట్లే గ్రహించితిని.

[illegible]రడ్డికి చెంచుమల్లచూపు కల్గి అను బిరుదము కలిగెను. అది ఇప్పటి తమిళనాడులోని జింజీకోట జయించుటవలన రాదగినది కాని వేమారెడ్డి అంత దూర మెన్నడు దండయాత్ర చేయలేదనుట నిశ్చయము. అందుచేత చరిత్రకారులు ఎన్నో ఊహలు చేయవలసి వచ్చినది. చెంచులు నివాసమైన శ్రీశైలములోని చెంచులను అదుపులో పెట్టుటచేత ఈ బిరుదము ప్రాప్తించినట్లు ఇందులో చమత్కరింపబడినది.

ఇతర కులస్థులగు గ్రంథకర్తలు తమతమ కులములలో స్వల్పసిద్ధికలవారిని గూడ ఎంతో యతిశయముగా వర్ణించుట ఈ కాలములో పరిపాటియైనది. కాని బ్రాహ్మణ గ్రంథకర్తలు బ్రాహ్మణ ప్రశస్తి ఉన్నదున్నట్లు వర్ణించినంతనే [illegible]భిమానమని దానికి ముద్రవేయుట నేటి యాచారముగా పరిణమించు ఆకాలపు గ్రంథములు, శాసనములు ఇత్యాదులు ఎంతమాత్రము నిష్పక్షపాతివినవారికైనను, నాడున్న బ్రాహ్మణ ప్రాశస్త్యమును బ్రాహ్మణ [illegible]ప్రధానముగ గోచరించును. ఇది చారిత్రక నవల యగుటచేత అందుకు [illegible]ద్ధముగా వ్రాయుట సత్యదూరమగును గాన ఉన్నదున్నట్లు చిత్రించితిని,

అది గాక ఈ శతాబ్దిలో బ్రిటిషువారు స్వార్థమునకై భేదములు కల్పించునంతవరకు, మనదేశములో కులభేదము కులములమధ్య సామరస్యమే కలగించుచు వచ్చెనుగాని, నేటివలె అభిమానములకు, భేదములకు, కక్షలకు కారణభూతము కాకుండెననునది గ్రహింపవలసి యున్నది. ఈ నవలలో బ్రాహ్మణ ప్రశస్తితో పాటు వైశ్యుల అతిశయము, రెడ్డి మహత్త్వము వర్ణింపబడినవి. అన్ని కులముల లోను అన్ని మతములలోను ఉత్తములు అధములు - లోకములోవలెనే - ఇందు లోను వత్తురు.

పూర్వము మతాంతరులైన వారిని ఇప్పటి ఆర్యసామాజికుల వలె మరల శుద్ధులనుగా జేసి కలుపుకొనుటలేదని నేటివారు సర్వసామాన్యముగా భావించుచున్నారు. ఈ నవలలో వివిధ కారణములచేత ఇస్లాము మతము స్వీకరించిన ముగ్గురు ఎవరి సంఘములోనికి వారు మూడు విధములుగా తిరిగి గ్రహింపబడుట చదువరులకు విపరీతముగా తోచవచ్చును. కాని విజయనగర సామ్రాజ్య స్థాపకులగు హరిహరరాయలు, బుక్కరాయలు ఇస్లాముమతము స్వీకరించిన పిమ్మటనే ఢిల్లీ సుల్తాను కారాగారమునుండి విముక్తిపొంది, సుల్తాను ప్రతినిధులుగా కంపిలికి పంపబడిరనియు, వారక్కడ శ్రీ విద్యారణ్యుల ప్రభావముచేత ఇస్లాము వదలి సుల్తానుకు ఎదురు తిరిగి విజయనగర సామ్రాజ్యము స్థాపించిరని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిరి. దానిని నేటి చరిత్రకారు లంగీకరించు చున్నారు. ఆ నాడు శ్రీ విద్యాశంకర పీఠాధిపతులును ప్రామాణికాగ్రేసరులును అగు శ్రీ విద్యారణ్య పూజ్యపాదులు అనుష్ఠించినది అశాస్త్రీయమనుట సాహసము. బసవన్నను పూతుని గావించుటకు నాకు గౌతమ ధర్మ సూత్రములు ప్రధానాధారమైనవి.

అలౌకిక ఘటనలు విన్నచో పుక్కిటి పురాణములని త్రోసివేయుట యిప్పుడు సామాన్యమై పోయినది. ఇప్పటికిని అలౌకిక విషయములు మన మెన్నియో చూచుచున్నాము, వినుచున్నాము. మణిమంత్రములు విషము హరించుట, భూగర్భములోని జలము గ్రహించుట, హస్తరేఖలు చూచి జన్మ కాలాదులే కాక జాతకుని పితృనామాదికము చెప్పుట - ఇత్యాదు లెన్నియో మన మందర మెరిగినవే. అందుచేత సామాన్య ప్రకృతి శాస్త్రవేత్తలు హేతువు నిర్ణయింప లేకున్న అలౌకికౌద్భుతము లున్నవని బుద్ధిమంతు లంగీకరింతురు. కావున ఈ నవలలో అక్కడక్కడ కనిపించు అసామాన్య సంఘటనలు సహృదయులు నిరసింపరాదు. అదియు గాక కావ్య సృష్టిలో ఎట్టి కల్పన చేసినను దానిని గ్రహించుటకు పాఠకుల నున్ముఖులను జేయు పూర్వరంగమున్నచో చాలును. ఈ నవలలో నందికంత పోతరాజు ఆవిర్భావము, బసవశంకరుని అవతారము, ఎర్రయ యోగదృష్టి, అతడు దుర్గమారణ్యమునుండి ఉద్ధరింపబడుట - వీనివిగా తలంచువారుకూడ – అధమ పక్షము, కావ్యసత్యములుగా గ్రహింపవచ్చును.

దోషాదోష నిర్ణయమునకు ఆ కాలములో మడ్డు (ఎర్రగా కాల్చిన గుండు) పట్టుట మొదలైన దివ్యములు ఆచరణలో నుండెడివి. ఈ నవలలో మహాలక్ష్మి అగ్నిప్రవేశము అట్టివానిలోనిదే. దేవాలయములలో ఉత్సవసమయములందును, పీర్ల గుండములో పడునప్పుడును కణకణలాడెడు నిప్పులు త్రొక్కినను కాళ్లు కాలని వానిని చూచియున్న ప్రాజ్ఞులకు మహాలక్ష్మి అగ్నిప్రవేశము ఆశ్చర్యము కలిగింపరాదు. మహాలక్ష్మి కథా కల్పన కొంతవరకు సీతాకథను అనుసరించి నందున ఆ ఘట్టము శ్రీ మద్రామాయణ స్మరణముచేత సహృదయామోదము పొంద గలదని భావింతును.

రెడ్డి ప్రభువులది బసవశంకర ముద్ర, వారికి నందికంత పోతరాజు అను కఠారి ఉండెడిదనియు, దానిని శ్రీనాథుని కాలములో దేవరకొండవారు హరింపగా తమ యైశ్వర్యమే దానితో పోవునని దిగులు పడుచుండగా శ్రీనాథ మహాకవి వారి యాస్థానమునకు పోయి అర్థించి తెచ్చె ననియు ఐతిహ్యము కలదు. కఠార మంత్రమును కంత మంత్రమును మంత్ర శాస్త్రవిదులకు సుజ్ఞాతములే. ధర్మమును వృషభ స్వరూపముగా భావించుట సంప్రదాయ సిద్ధము. ఈ భావనల వల్లనే వాని ఆవిర్భావ స్వరూపము స్ఫురించినది.

హేమ విద్యనుగూర్చి ప్రత్యేక మొకింత చెప్పవలసి యున్నది. ప్రపంచమం దంతటను ఇతర లోహములను బంగారముగా మార్చుట కెన్నియో ప్రయత్నములు జరిగినవి. ఎవరో కొంద రది సాధించినట్లుకూడ ప్రసిద్ధి కలదు.

కొండవీటి దండకవిలెలో దొంతి అల్లాడరెడ్డియను వాడు కోమటి వేమన యనువానిని మోసగించి పరశువేది సంపాదించెనను కథ కలదు. అది ప్రోలయ వేరుగాని ఇంటివేరు గాని చెప్పదు. కాని మొత్తముమీద నది యతని కన్న

యించుటకు వీలుగా నున్నది. అది కల్పిత కథ కావచ్చును. కాని రెడ్డిరాజ్య స్థాపకుడగు వేమారెడ్డి మంచాళ దాన శాసనములో స్పష్టముగా వేమారెడ్డి తండ్రియు అన్నమాంబాపతియు నగు ప్రోలయ స్వర్ణము చేయు 'ప్రసిద్ధి కలవాడను నీ వాక్యము లున్నవి :

"తద్వంశ భాతామల పంటకిడ్డి కులామృతాంభోనిధి పూర్ణచంద్రః
ప్రోలాభిధః ప్రాప పురాతనోత్థ పూజావశాత్ బ్రాహ్మణ పాదుకార్చామ్.
యదృచ్ఛయా స్వర్ణకర ప్రసిద్ధిం లబ్ధ్వాన్నమాంబాపతి రాబభూవ—"

ఇది క్రీ. శ. 1340 నాటి శాసనము. దీనినిబట్టి ప్రోలయ హోమవిద్య దెనియు, కొండవీటి దండకవిలెలో చెప్పిన మోసపువిధమే కొన్ని జరిగె ననియు భావన చేసితిని.

ప్రోలయ వేమారెడ్డికి దొడ్డయ యను సోదరుడు కూడ నుండెనని మంచాళ శాసనములో కనబడుచున్నది. ఎర్రయ హరివంశావతారికలో మిగిలిన మువ్వురు సోదరులను వర్ణించి దొడ్డయ పేరెత్తలేదు. తర్వాత చరిత్రలో ఈ దొడ్డయ వంశమువారైన వినరాకున్నారు. అందువలన అతడు ఏవో కొన్ని కారణములవలన ఇస్లాము మతము స్వీకరించి మరల కులములో కలిసి అవివాహితుడుగా జీవితము గడపెనని కకథాల్పన మొనర్చితిని. పూర్వాచార పరాయణుడగు ఎర్రయ అతని పేరు ఉదాహరింపకుండుటకు అదే కారణ మనవచ్చును. ఈ కల్పన యథార్థము నకు దూరము కానేరదు.

చరిత్రకారులు వేమారెడ్డి వంశపురుషుల వివరము లెన్నియో ప్రస్తావించిరి కాని తల్లియగు అన్నమాంబ పాత్ర తగినంతగా వారి శ్రద్ధ నాకర్షింపలేదు. ఆ పుణ్యమూర్తుల కుటుంబము నంతటిని ధర్మజ్యోతియై వెలిగింప చేసినది మహా పుణ్యరాశి యగు అన్నమాంబగా నా బుద్ధికి భాసించినది. హరివంశము మొదటి పద్యములో ఎర్రయ అన్నమవేమభూవిభు డని వేమారెడ్డిని ప్రస్తావించెను. ఆశ్వాసాదిపద్యములలో నల్లే యాతని ప్రోలయవేము డన్నల్లే అన్నమవేము డనియు సంబోధించెను. అమరావతిలోని శిలాస్తంభముపై నున్న యొక శాసనములో, 'అన్నమాంబా తనూజేన కృతినావేమ భూభుజా' అని యున్నది. మంచాళ దానశాసనములో ప్రోలయ అన్నమాంబాపతి అను విశేషణముతో నుదాహరింపబడెను. ఇట్టి గౌరవ ప్రస్తావము ఆ కుటుంబములో మరి యే స్త్రీ వ్యక్తికిని రాలేదు. ఇట్టి కారణములచేత ఈ నవలలో అన్నమ్మకు విశేష పూజ్యస్థాన మొసంగితిని.

నన్నయ కాలము మొత్తముమీద సుఖముగానే వెళ్లిపోయినది. అప్పటి యలజడు లన్నియు చోళులకు పశ్చిమ చాళుక్యులకు తూర్పు చాళుక్యులకు కల పరస్పర కలహములవల్లనే కలిగినవి.

తిక్కన కాలములో కాకతీయ సామంతుల అంతఃకలహము లు తెలుగు దేశమును కలత పెట్టినవి. ఆ కలహము లేవియు సామాన్య ప్రజల నంతగా బాధింపలేదు.'

ఎర్రయ కాల మట్టిది కాదు. అతనికి యౌవనము వచ్చువరకు ప్రతాప రుద్ర చక్రవర్తి పరిపాలించుచు ఆంధ్రుల కీర్తి నత్యున్నత శిఖర మధిరోహింప జేసెను. ప్రబల సేనలతో దండెత్తి వచ్చిన ఢిల్లీ సుల్తాను సేనల నాతడు ఏడు మారులు పారద్రోలెను. మరి ఎనిమిదవమారు ఢిల్లీ సేనలువచ్చి 1323 లో ప్రతాపరుద్రుని బందీగా కొనిపోయెను. ఆ పిమ్మట నాలుగైదేండ్లు సుల్తాను భటులు ఆంధ్రదేశములో కావించిన హింసాకాండ ఇట్టిదని వర్ణింపరానిది. అన్ని కులములవారు అన్ని వృత్తులవారు అన్ని యంతరువులవారు పడిన య నలు 'విలస శాసనము' వర్ణించినది. అట్టిదశలో ఈ కథ ప్రారంభించున

ఈ స్థితిలో నున్న ఆంధ్రదేశమును ఉద్ధరించుటకు ముం కొన్నది కృష్ణవేణికి దక్షిణ భాగములో వేమారెడ్డి ప్రభృతులు. వేమారెడ్డి సోదరులయు బంధువులయు సాహాయ్యముతో ఆ దుర్భర కార్యమునకు ముందు పూనుకొని సుల్తాను సేనలను పారద్రోలి మరల ధర్మమును కృతయుగములో వ ప్రతిష్ఠించెను. అతనికి కడగొట్టు తమ్ముడైన మల్లారెడ్డి కుడి భుజముగా నుండెను. అతడు మోటుపల్లి రేవు పట్టుకొనుటతో ఆ స్వాతంత్ర్య సమరము స్థిరరూపము తాల్చెను. ఈ దశ వచ్చినదానితో ఇందలి కథయు సమాప్తి నొందుచున్నది.

ఇట్టి విపరీత సంఘటనలు స్వయముగా యెరిగి యుండియు మహాయోగి యగుటచే ఎర్రయ ఎట్టి యావేశమునకు లోనుగాక ఉదాత్త రచన కావించెను. అతడు రచించిన లక్ష్మీనృసింహావతారమే (నృసింహపురాణము) ఆనాటి యమ యాతనలను ఎంత ధీరతతో జీర్ణమొనర్చుకొనెనో స్ఫురింప జేయుచున్నది. పూజ్యమైన కవిత్రయములో ఎర్రయ పూజ్యతముడుగా కనుపట్టును. ఎర్రయకు మల్లారెడ్డియన్న నెంత ప్రీతియో, వేమారెడ్డి కంకితమైన హరివంశములోని ఆశ్వా సాంత పద్యములలో మల్లారెడ్డిని పునఃపునః ప్రస్తావించుటచే విస్పష్టమగు చున్నది.

నారాయణభట్టును, రుద్రమదేవిని ఆదరించిన ఆంధ్రపాఠకలోకము మల్లా రెడ్డినిగూడ సహృదరింపగల దను స్థైర్యముతో నేను ఎనిమిది సంవత్సరములు చేసిన కృషిని ఆంధ్రలోకమున కందజేయుచున్నాను.

ఈ నవల రచించుటలో నాకు బహువిధముల తోడ్పడిన శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యులకును, దీని ప్రథమ ముద్రణభారము వహించుటకు ఉత్సాహముతో పూనుకొన్న కవితాపబ్లికేషన్స వారికిని నా ఆశీస్సులు.

రేపల్లె,
జూలై 25, 1958.

నోరి నరసింహశాస్త్రి.

మా మా ట !

కవితా ప్రచురణల్లో 12 వ దిగా కవిసమ్రాట్ నోరి నరసింహశాస్త్రిగారి "మల్లారెడ్డి" నవలను తెనుఁగు పాఠకలోకానికి అందజేయ గలిగినందులకు సంతసిస్తున్నాం.

మా కోరికను మన్నించి "మల్లారెడ్డి" ని ప్రచురించుటకు దయతో అంగీకరించిన శ్రీ నరసింహ శాస్త్రిగారికి మా కృతజ్ఞతాభి వందనములు. ఈ గ్రంథ ప్రచురణకు సహృదయతతో మాకు తోడ్పడిన సుప్రసిద్ధ పత్రికా రచయిత శ్రీ మద్దాలి సత్యనారాయణ శర్మగారికి, తదితర మా శ్రేయోభిలాషులకు మిత్రులకు మా ధన్యవాదములు.

ఇంతకుముందు మా ఇతర ప్రచురణలను ఆదరించినట్లే పాఠకులు 'మల్లారెడ్డి' ని కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాం.

మంచి సాహిత్యాన్ని తెనుఁగు పాఠకలోకానికి అందచెయ్యాలని మా అభిలాష. అందుకు ఆంధ్ర రచయితల, పఠితల సహకారం పూర్తిగా లభిస్తుందని ఆశిస్తున్నాం.

— ప్ర కా శ కు లు.

మల్లారెడ్డి

→ నరసింహశాస్త్రిగారు.

1

జిగజ్జీవనకారుడైన కామదేవుడు హరనేత్రాగ్నిసందగ్ధు డైనంతనే లోకము మహాశ్మశానమైనది. ఆ యెడ కామని గతి నవలోకించిన వసంతుడును తన బలగ మంతటితో కానరాకుండ నదృశ్యుడయ్యెను. రసమెల్లెడ నింకి పోయినది. నేల బీటలువారినది. భూదేవిని శిశిర మావహించి యెల్లకడల బూడిద లెగజిమ్ముచున్నట్లున్నది మరల నెన్నటికైన ఈ భూదేవికి మాతృత్వ సౌభాగ్యముండునా యనిపించుచున్నది. ఇంద్రాది దిక్పాలక సమూహము నిస్సారమైనది. తారకాసురుని మూకల ప్రతిఘటించువారే లేరు.

అట్టి మహాశ్మశాన తుల్యముగా నున్న దీ ఆంధ్రభూమి; దీనికి నాథుడు లేడు. నాథుడైన కాకతి ప్రతాపరుద్రధరణీశుడు శత్రువశుడైనంతనే నాయకు లందరు వెనుకంజ వేసిరి. వారిలో పలువురు ప్రాణములు కోల్పోయిరి. ఈ భూమిలో వేల్పు లదృశ్యులైరి. దేవాలయములలో దేవతామూర్తులు మాయ మైనవి. పుడమివేల్పులు కనిపించుటే లేదు. పురములలో పౌరులు లేరు. జన పదములలో జానపదులులేరు. దుర్గములలో సేనలులేవు. పచ్చగా పండి కన్నుల పండు వొనర్చు పైరులు క్షేత్రములలో లేవు.

మరి యీ యాంధ్రభూమిపై సముద్రు డాగ్రహించి ముంచియెత్తెనా? కాక దావానల మేమైన నావహించెనా? ఆదిశేషుని విషఫూత్కారములచే భూకంపము ప్రాప్తించినదా? ఈ యాంధ్రభూమి ఎవరి యాగ్రహమున కగ్గ మైనది?

లోకారాధ్యుడగు కామదేవుడు పవిత్రమగు హరనేత్రాగ్నిచే నందగ్ధు డయ్యెను. అట్టి యగ్ని కాహుతియైన కామదేవుడు కృతార్థుడు. ఆ[illegible]తడు కాలాంత రమున లలితాంబికాఖ్య సంజీవ నౌషధముచే పునరుజ్జీవితుడై పవిత్రతర మూర్తితో నుద్దీపింపగలడు.

అయ్యో, ఈ యాంధ్రభూమి - అగ్గమైనది అపవిత్రమగు యవనాగ్నికి. సదాశుచియగు అగ్ని భట్టారకునకును అపవిత్రత ఉండనోపు! భృగుశాపము నొంది సర్వభక్షికుడైన అగ్నియే నేడాంధ్రదేశమును భస్మమొనర్చినాడు, శుచి గల బ్రాహ్మణ గృహములలో స్వాహాస్వధాకారము లణగిపోయినవి. వారి అగ్నులు శాంతించినవి.

సుక్షత్రియుల ప్రాసాదములలోని గరడీలు నిర్మానుష్యములైనవి. వారి బాహువులు నిస్సారము లైనవి.

సంపన్నవైశ్యశ్రేష్ఠుల హర్మ్యములందు తాండవించు లక్ష్మి నేల బొరియలలో డాగినది. వారు పొదలమాటున గుట్టల మాటున అడగియున్నారు.

భూభారమంతయు ప్రస్తుతము పుణ్యపురుషులగు శూద్రులపై బడినది, వారిలో పవిత్రనామములు గల తెగలెన్నో కలవు. పంటరెడ్లు, దేసటరెడ్లు, సరిసరులు, ఒంటరులు, కమ్మలు, కాపులు - మరియు నెన్నో తెగలవారున్నారు. కాయకష్ట మొనర్చి వారెట్లో భూమిదున్ని పండించుచున్నారు. సరిగా పంట కారుకు యవనతండములు ప్రత్యక్షమై సిద్ధమైన కృషిఫలము బలవంతముగా తరలించుకొని పోవుచున్నవి. వారిలో కొందరు తెగించి అడ్డగించి తమ ప్రాణములు బలి యిచ్చుచున్నారు. మరికొందరు అప్పటి కోర్చుకొని రహస్యముగా వెంటనంటి రాత్రివేళల వివిక్త ప్రదేశముల నిదురించు మ్లేచ్ఛులపైబడి సంహరించి తమ ధనధాన్యాదికము మరల నెట్లో పడయగలుగు చున్నారు. ఐనను మరియొక యవనతండము వచ్చి మరల నెత్తుకొని పోదని నమ్మక మేమున్నది!

వారి కాయుధములు లేవు. తత్సాధనము వారు పూర్వ మెరుగరు. ఇప్పుడవి యవసరము లైనవి. గ్రామములలో కమ్మరులచే మోటుగా కత్తులు, గండ్ర గొడ్డళ్ళు, బరిసెలు చేయించుకొని పదిలము చేసికొని కొంచెము కొంచెము సాధన చేయుచున్నారు. విధిలేక వాణిజ్యముకూడ వారి కిప్పుడభ్యస్తమగు చున్నది.

అన్యాయము, అబద్ధము, మోసము ఎరుగని నిర్మలహృదయులు వారు. ఈ నూతన పరిస్థితులలో వారికి ధర్మ నిశ్చయము భాసింపకున్నది. వారి హృద

A00A104B113

యములలో నిరంతరము వేధించుచున్న చింత యొక్కటే. వారి ప్రయత్నము లకు ధైర్యము చేకూర్చు దేవతామూర్తులు దేవాయతనములలో లేవు. వారికి సందేహనివృత్తి చేయుటకు అగ్రహారములలో భూదేవులు లేరు. ఇదే వారిని హృదయశల్యమై బాధించుచున్నది.

వారి హృదయాంతరాళములలో పుట్టుచున్న ధైర్యము హృదయకుహర ములలో నడగిపోవుచున్నది; భుజములలో పుట్టుచున్న పౌంగు కరాగ్రముల నుండి జారిపోవుచున్నది; అతి కష్టమున సాధించుచున్న కొంచెపు లక్ష్మియు కాంతిహీనమై కనుపట్టుచున్నది. వారికి బలమున్నది కాని దాని నుద్దీపింప జేయు శక్తిలేదు; దేహసౌష్ఠవ మున్నది కాని కళలేదు; శౌర్యమున్నది కాని తేజస్సు లేదు; సాహస మున్నది కాని ధైర్యము లేదు; మహారత్న సంఘాత మున్నది కాని వాని నేరి అనర్ఘహారముగా కూర్చు సూత్రములు లేవు.

అనాదిగా నల్లమలకొండలు చెంచు దొరలకు నివాస స్థానములు. అందలి యరణ్యములే వారికి వలసిన యాహారము నొసంగును. చెంచు గూడెములేకాక పర్వత మధ్యప్రదేశముల గల లోయలలో కొన్ని కుగ్రామములును వెలసినవి. ఇప్పటికి కొలదికాలము క్రిందటనే శ్రీ కాకతీ ప్రతాపరుద్రదేవమహారాజు అడ వులు నరకించి మరికొన్ని గ్రామములు వెలయింపజేసినాడు. అందుచే శ్రీశైల మల్లికార్జునుని శ్రీ భ్రమరాంబికా మహాశక్తిని ఏటేట దర్శింపబోవు యాత్రికు లకు విశ్రమాహారాదికములకు వసతు లెక్కువైనవి.

పర్వత సానువులనుండి జలజల ప్రవహించు సెలయేళ్ళ నీటివలన అచ్చటి క్షేత్రము లించుక ఫలవంతములే. కాని యది విస్తారభాగము రాతినేల యగుటచే జలము విస్తారము నిలువయుండు నవకాశము లెక్కువలేవు, అందు వలన యథాచారముగా మహాశివరాత్రికో, చైత్రోత్సవములకో బహు సహస్ర సంఖ్యాకముగా వచ్చిపోవు తీర్థయాత్రికుల నప్పటి కెప్పటికో ఆ గ్రామములు

భరింపగలవు గాని ఆ జనము లచ్చట స్థిరనివాసములకు కుదురుకొన్నచో వారిని భరింప నచ్చటి పంటలు చాలవు. ప్రతాపరుద్రదేవుడు తురుష్కులచే విజితుడైన తర్వాత ఈ నాలుగైదేండ్లనుండి కొందిశీకులు వేనకువేలుగా ఈ నల్లమల పర్వతారణ్యముల నాశ్రయింప వచ్చుచున్నారు. వచ్చినవారు యాత్రికుల వలె తమ దారిన తాముపోక ఏ మూల నెంత యల్పాచ్ఛాదనము దొరకినను దానిని వదలక అందే నిలుచుచున్నారు.

సామాన్యముగా జనులు రాకపోకలు సలుపు రాజమార్గములే తురుష్కసైనికుల రాకపోకలకును అనుకూలముగా నున్నవి. ఆ కారణమున కొందిశీకులు ఆ దారులకు దూరము తొలగి తల దాచుకొనుచున్నారు. అందును ముఖ్యముగా బ్రాహ్మణ కుటుంబములు రాజమార్గములకు మరింత దూరము తొలగుచున్నవి. తురుష్కుల కఠినదృష్టి ప్రధానముగా ద్విజులపై ప్రసరించుచున్నది. విప్రుల వేదఘోష విన్నంతనే వారి చెవులలో నిప్పులు వేసినట్లగును. వారి అగ్నిహోత్రములు కనులార చూడలేరు. శిఖాయజ్ఞోపవీతమూర్తుల సాన్నిధ్యమే వారికి భరింపరాకుండును. తురుష్కుల చేజిక్కిన అభాగ్య బ్రాహ్మణులు బలవంతముగా మధ్యము ద్రావి, గోపిశితము భుజించి బ్రాహ్మణ్యమైన గోల్పోవలెను; కాకున్న ప్రాణములైన విడువవలెను. వారు తరచుగా ప్రాణములు కోల్పోవుటకే ఇచ్చగించుచున్నారు. ఆ ప్రాణత్యాగ మైనను నికృష్టమార్గమున జరుగుచున్నది. పాపిష్టిచావు! సర్వవిధముల వారట్టి యాపదకు తొలగియుండుటకై యత్నించుచున్నారు. ఈ కారణముచే విప్రకుటుంబములే ఇప్పుడు నల్లమల గుట్టలను, అడవులను, లోయలను ముఖ్యముగా నాశ్రయించుచున్నవి. ఇప్పు డక్కడనే వారి వేదఘోష, ఎండుటాకుల గలగలతో కలసి, నిట్టూర్పు వలె మధ్యమధ్య వినవచ్చుచున్నది.

అట్టి కుటుంబ మొకటి ఈ ఆశ్వయుజ పూర్ణిమా రాత్రివేళ నొక గుట్ట చాటుననున్న వటవృక్షముక్రింద విశ్రమించి యున్నది. పూర్ణచంద్రుడు ఊడలలో నుండియు, ఆకులమధ్య నుండియు వారివంక జాలిగా తొంగితొంగి చూచుచున్నాడు. ఆ కుటుంబములో నలుగురే యున్నారు. వృద్ధదంపతులు, వారి కుమారుడు, కోడలు. ఆ ఉదయమున వారేదో భుజించి యాకలి తీర్చుకొన్నారు. ఈ సాయంత్రము వారి కాహారము లభించినట్లు లేదు. శిలాతలముపై విశ్రమిం

దాహము తీర్చుకొని ఆకాశమువంక తిలకించుచు శిలాతలమ్మపై పరుండినాడు. మధ్యమధ్య ఆకాశమున శారదమేఘములు దాల్చుచున్న దివ్యరూపములు అవధరించుచు, పూర్ణిమ చంద్రుడు కురియుచున్న జ్యోత్స్నామృతములు త్రావు చున్నట్లే ఆనందపరవశుడై స్ఫురణకు వచ్చిన సంస్కృతాంధ్ర పద్యములు ఆలపించుచున్నాడు. మంత్రమగు నాతని కంఠధ్వని వటవృక్ష చ్ఛాదన మెల్ల నిండి నిబిడీకృతమై పత్రముల సందులలోనుండి పొంగి పైకెగసి పూర్ణతరమై ఆ యరణ్య మాక్రమించి విహంగ మార్గమున పయన మొనర్చి రెండు యోజనముల దూరమున గల శ్రీశైల మల్లికార్జునస్వామి చెవిటి చెవులలో మారుమ్రోయుచున్నట్లున్నది. కుమారుడీను సంధ్య వార్చెను. తల్లిదండ్రులతో ప్రియురాలితో పా టా జలమును తానును సేవించెను. వా రె వ్వరు నొక్కమాటయు అనకుండుటే ఆతని చింతను శతగుణ మొనర్చు చున్నది. వారు కోపించినను, సుంత విసుగైన ప్రదర్శించినను కొంత యుప శాంతి యుండెడిది. ఏమి చేయగలడు!

ప్రక్కనే వృద్ధుడగు తండ్రి మనోజ్ఞ శ్లోకములు పఠించుచు రసానంద పరవశుడై యుండ, ఆ యువకుడు విరసుని వలె నే ముడుచుకొనిన ముఖ ముతో పరుండి యున్నాడు. తండ్రి చదువుచున్న శ్లోకము లాతని కలతను ద్విగుణీకృత మొనర్చుచున్నవి. కవుల కావ్యములు ఆపన్నుల ఆకలి తీర్చ గలవా? ఆతని కేమి యాలోచన లుదయించినవో! ఆతడు శిలాఫలక మొకటి తలగడగా నిడుకొని పరుండి యున్నాడు,

నన్నయ చివరిపద్యము వినుచుండగా ఆతని కేకధారగా కన్నీరు ప్రవ హింపసాగినది. ఆతడు మౌనముగానే యుండెను. కాని శ్వాసలో ఏ కొంచెమో మార్పు వచ్చినట్లున్నది. అది గమనించి ముద్దరాలగు నాతని సతి కూడా ఏడ్వ సాగినది. ఆ చిన్నది కొంత సే ప ట్లేడ్చి ప్రయత్నపూర్వకముగా ఆపుకొనుచు ఏడ్పు గొంతుతో, 'ఆకలి వేయుచున్నదా?' అని ప్రశ్నించినది.

ఏమి టా ప్రశ్న! ఆ చిన్నదానికి కడుపులో నాకలి మండిపోవుచున్నది. తన యాకలి నామె ప్రస్తావింపలేదు. తన యాకలి బాధచేతనే భర్తకు ఆకలి వేయుచున్న దని గుర్తించి అట్లడిగినది. భర్త బదుల్ప్రాపలుకలేదు. ఆమె లేచి అడుకులు ఏమైన మిగిలియున్నవేమో యని చేరువ ఓజ్జిన్న స్వల్పపాత్ర సంచ

యము గాలించినది. ఏమియు నగపడలేదు. సిగ్గుతో తిరిగివచ్చి ఆ పిల్ల దీన ముగా నన్నది: 'ఏమీ కనబడలేదండీ!'

ఆ మాటలు విని యువకుడు మరింత ఏడువ నారంభించెను. వారి కదలికలు వృద్ధురాలగు తల్లికి మెలకువ తెప్పించినవి. 'ఏమి కావలె నమ్మా? ఏమి కావలె నాయనా?' అనుచు నామె లేచినది. వారు మాటాడలేదు. వారిద్దరు నేడ్చుచున్నారని ఆమె గమనించి సమీపమునకు జేరి ఇట్లన్నది:

"అమ్మా, మీ కాకలి వేయుచున్నదటే? ఎంత కష్టకాలము వచ్చినదే, ఫదిమందికి లేదనకుండా పెట్టి తినే వారికి ఈ నాటి కీ స్థితి వచ్చినది. మన మీ రాత్రికి పెట్టి పుట్టలేదు తల్లీ! తెల్లవారిన తర్వాత పండో ఫలమో, ఆకో అలమో దొరకకుండునా?"

"నా కాకలి లేదత్తా! మీ కుమారుడు కన్నీరు కార్చుచున్నారు!"

"కన్నీరు విడుచుట శుభము కాదురా నాయనా!"

తల్లి యా మాట లన్నందుకు కుమారుని మనస్సు చివుక్కు మన్నది. వీరి మాట లేవియు నావల వృద్ధుని చెవుల బడినట్లే లేదు. ఆతనికి కుమారు డింకను మేలుకొని యుండు టొక్కటే స్ఫురించినది.

"ఈ శరద్రాత్రులను ఆ నన్నయ భట్టారకు డెంత రమ్యముగా వర్ణించి నాడోయి! ఇంత మధురమైన పద్యము నాల్కపై నాడుచుండగా జన్మ చాలించిన కవీశ్వరుడే ధన్యుడు!"

ఈ సహృదయ వాక్కులు కుమారుని చెవుల పడ్డట్లు లేదు. తాతపాము తన్ను పల్కరించుచున్నారని మాత్రమే గమనించి యాతడు వెంటనే కన్నీరు ఉత్తరీయపు కొంగుతో నద్దుకొనుచు తండ్రి మాట లాలకింప చెవి యొగ్గెను. వృద్ధు డప్పటికే మాటాడుట చాలించి ఇంకొకమారు నన్నయ చివరి పద్యమే ప్రీతిపరవశుడై పఠించి మరియు శరద్రాత్రి నిట్లు స్మరించినాడు:

'తారాగణ ప్రవరభూషణ ముద్వహ న్తీ
మేఘావరోధ పరిముక్త శశాంక వక్త్రా
జ్యోత్స్నాదుకూల మమలం రజనీ దధానా
వృద్ధిం ప్రయా త్యనుదినం ప్రమదేవ బాలా :'

ఋతుసంహారము నుండి ఆ కాళిదాస శ్లోకమును ఆనందముతో శాంతము పొంగారుచున్న కంఠముతో తన తండ్రి యావేళ పఠించుచుండుట యువకున కాశ్చర్యమైనది. వృద్ధుని కెంతటి నిత్యయౌవనము! ఆ చదివినది పూజ్యుడగు తండ్రి. కాక మరియొకరైనచో, ఆతనికి కోపము కలిగియుండును. తండ్రి యుత్సాహ మాతనికి రుచింపలేదు. ఆత డప్రయత్నముగా దీనావస్థ స్ఫురించు నట్లు ఋతుసంహారము నుండియే శ్లోకము పఠించెను.

'నష్టం ధను ర్బలభిద జలదోదరేషు
సౌదామనీ స్ఫురతి నాద్య వియత్పతాకా
ధున్వంతి పక్షిపవనై ర్న నభో బలాకాః
పశ్యంతి నోన్నతముఖా గగనం మయూరాః'

చింతాసూచకమగు నా శ్లోక మాతడు పఠించుచుండ నాతని కంఠము చిత్రముగా ఖంగునమ్రోగి చుట్టుపట్టుల శిలాతలములు తాకి గిరగహ్వరముల నెల్లెడ ప్రతినదించినది.

అది విని వృద్ధు డింకను శ్లోకము లందుకొనినాడు. ధైర్యమును నిబ్బ రము ప్రదర్శించి జ్ఞానమునకు దాతిచూపు భావములు గల శ్లోకము లవి :

వారిరువురు నిట్లు శ్లోకపఠన మారంభింపగనే అత్తకోడండ్రు శాంతించి నిశ్శబ్దముగా తా మంతకుముందు శయనించిన శిలాభాగములకు తొలగిపోయిరి. కావ్యవ్యసనముగల తండ్రికొడుకు లిక నితరము సమస్తము మరచి తెల్లవారులు ఆ గొడవలో పడిపోదురని వా రెరుగుదురు.

అత్తకోడండ్రకు కూర్మ పట్టినది. పితాపుత్రులట్లే చాల ప్రొద్దుపోవు వరకు కావ్యనాటక ప్రశంసలు చేసికొనుచుండిరి. కుమారునికి తండ్రియెడ గౌరవ మున్నది. తండ్రికున్న విద్వత్తుగాని అనుభవము కాని ఆతనికి లేకు

న్నను తీవ్రత ఎక్కువ. అందువలన నాతడు ఇష్టానిష్టములు గాఢముగా ప్రదర్శించును. ఆ కారణమున నతనికి తండ్రికంటె వాక్పటుత్వ మలవడినది. కుమారుని మాటలు వినుటన్న తండ్రికి వేడుక. తాను సాధింపజాలక విడిచినది కుమారుడు సాధింపగలడని తండ్రి ధైర్యము.

ప్రొద్దుపోయినది. చంద్రబింబము నెత్తిపైనుండి వ్రాలినది. మధ్యమధ్య వృద్ధ పురుషుడు కునికిపాట్లు పడుచున్నట్లు గమనించి కుమారుడు మాటలు చాలించినాడు, ఆతనికి నిద్దుర వచ్చుటలేదు. నిద్దురపోవుట కాతడు ప్రయత్నించుటయులేదు, ఆతని మనస్సు తీవ్రముగా నాందోళన పడుచున్నది. దాని నాతడు గాఢముగా మథించుచున్నాడు.

"ఎన్నాళ్లు ఇట్లు దిక్కులేమండ నల్లాడుట! ఇళ్ళు వాకిళ్ళు వదలి ఎంత కాల మిట్లు తిరుగాడుట! ఆకస్మికముగా గ్రుడ్లూరు వదలి ఎందుల కిటు వచ్చినట్లు!"

సమీపమున నున్న యాపదకు వెరచి దూరము తొలగుట మానవ స్వభావము. ఆ దూరమున నుండు నాపద లప్పటికి స్ఫురింపవు. తురకలదండు గ్రుడ్లూరువైపు వచ్చుచున్నదని విని విలువగల వస్తువులు పాడియావు తీసికొని వడివడి ఊరు వదలి వచ్చినారు. దారి పొడవునను 'తురక లీవైపున నున్నారు. ఆ వైపున నున్నారు!'అను వార్తలతో వారు నెలరోజులు నిలుకడ గాని శాంతి గాని లేక తిరిగి, అట్టి భయవార్తలు ప్రచలించు భాగములకు కొంచె మెడ మైరి. ఆ తర్వాత గూడ నెలకు రెండు నెలలకు ఒకమారైన 'అరుగో తురకలు!' అను మాటలు వినకుండ వారు నల్లమల చేరికొనలేదు.

తమవెంట దెచ్చిన ద్రవ్య మంతయు సెలవైనది, కొంత దీనుల కిచ్చి యుండిరి. కొన్ని వస్తువులు ప్రయాణ భారముచే విసర్జింపవలసి వచ్చినది. కొన్ని తస్కరుల వశమైనవి. ఆ తండ్రి కొడుకుల కిప్పుడు మిగిలియున్నవి వారి విద్వత్తూ, గోమాత కోడెదూడతో నిచ్చు పుణ్యదర్శనమును మాత్రమే!

తురుష్కప్రమాదము తప్పించుకొంటి మనుకొనుచు ఈ పర్వతారణ్య ప్రదేశము చేరికొనిరి. ఇదియో. చిరుతగండ్లు, బెబ్బులులు తరచుగా సంచరించు

ప్రదేశము. వారి కెదురైన భల్లూకము లసంఖ్యాకములు. వరాహతండములును దర్శన మిచ్చినవి. యువకునకు స్వయముగా భయములేదు. తండ్రి భయ భ్రాంతుల కతీతు డని అత డెరుగును. భీరు వగు భార్యయు వృద్ధురాలగు తల్లియు అడలిపోదురని ఆతని చింత. ఘాతుకమృగములు సెలయేటి యొడ్డులకు దాహ నివారణమునకును, దాహబాధతో వచ్చిన క్షుద్రమృగముల నేయుటకును వచ్చి డాగియుండు నని తద్విదు లందురు, వారా రాత్రి విశ్రమించిన వటవృక్ష సమీప ముననే సెలయే రొకటి పారుచున్నది. ఆ సెలయేటి మర్మరశ్రుతికి ఎంత మాత్రమైన భంగము కలిగించు శబ్దము పుట్టినను వ్యగ్రతతో నత డాలకించు చుండెను. క్రూరమృగములు బెదరి పారుటకై వారి చుట్టు వేసికొన్న నెగళ్ళ యందలి అగ్ని తగ్గినప్పు డెల్ల అతడు లేచి నూతన కాష్ఠములు తగిలించి వచ్చు చుండెను.

మర్రిచెట్టున కావల పొదలో నించుక యలికిడి యైనట్లున్నది. అంతలో నట్టిదే గుట్ట కీవలి వైపున నైనది. అది సద్దు మణగిన పిమ్మట అటువంటిదే ఇంకొక దిక్కునైనది. ఏమది? మెక మేదైన పొంచి తామున్న ప్రదేశమును ప్రదక్షిణించుచున్నదా? ఆ యువకుడు లేచి కూర్చుండెను. మరల నలికిడి యైనది. అత డటు పారజూడగా మర్రియూడ మాటున గల పొద నీడలో రెండు బంగారు ముద్దలు నెగడి వెలుగున తళతళ మెరసినవి. అవి రెండును మండు చున్నట్లుండి కాంతి ప్రవాహమును ప్రసారించుచున్నవి. అవి పెద్దపులి పింగా క్షిములై యుండునని యాతనికి స్ఫురించినది. ఆ వెన్నెల వెలుగులో ఆకుల రంగులలో కలసిపోయి దాని శరీరము భాసించుట లేదు.

ఆ కన్నుల కాంతిప్రవాహము లేచి కూర్చున్న తన వైపే సూటిగా ప్రసరించుచున్నది. మధ్య నది తన ప్రియురాలి వైపొకమారును, తండ్రివంక నొకమారును చంచలముగా పోయి మరల తన వంకకే తిరిగి తప్పక నిలిచినది.

ఆ పురుషసింహుడును ఆ పింగాక్షముల వంక తీక్ష్ణతరముగా విలో కించుచున్నాడు. మధ్యమధ్య సమాధిదశ ననుభవించిన యోగీశ్వరుని చూ పది! ఆ చూపులో నిప్పుడు భీతిని దిగమ్రింగిన రౌద్రము వ్యక్త మగు చున్నది. పులియు నాతని వంక క్రూరమగు నేకాగ్రదృష్టి పరపు

చున్నది. వా రొండొరుల నట్లు నిముసముపాటు నిర్నిమేష నయనములతో చూచుకొన్నారు. ఎవరును కదలలేదు. ఆ యరనిముసము యువకున కొక యుగముగా తోచినది. తా నిప్పు డేమి చేయవలె!

ఆ యరణ్య ప్రదేశములో మెకము యాత్రికుల దారి నిరోధించుట సర్వ సాధారణము. ఆ వైపుల జను లట్టి వేళల బిగ్గరగా కేకలు పెట్టి గోల చేయగా దీర్ఘకాలమున కది తొలగిపోవునట! కాని వీ రా ప్రాంతములకు క్రొత్త. ఆ యువకు డట్టిదాని గూర్చి విని యుండెనే కాని అనుభవము లేనివాడు. అది గాక ఇప్పు డా పులి ఒక్కగంతు వేసిసచో తన కుటుంబములో నొకరిని కబళించు కొని పోవ గలుగునంత సమీపమున నున్నది. తీవ్రదృష్టితో దానివంక చూచు చునే అతడు కర్తవ్య మాలోచించుచున్నాడు.

బిగ్గరగా కేక వేయ వలె నను కోరిక యాతని కుదయించినది. అది బెదరి మీదపడు నేమో! తనవారు భీతితో తల్లడిల్లెద రేమో! అదియు గాక అతని నాల్క నోటినుండి పెకలుటయే లేదు. అది అంగిలి కంటుకొనిపోయి యున్నది. మొనలు నాలుక యొకటి నోటిలో నున్నదా యను సందేహమే కలుగుచున్నది. ఎంతసే పని ఆ వ్యాఘ్రమువంక నిర్నిమేషముగా చూచుచుండగలడు!

ఆతని కనురెప్పలు నిలుచుటలేదు. ఆర్పుకొనవలసి వచ్చినది నిక్క పొడుచుకొని నిలిచిన తన దేహపు బిగువు కూడ సడలుచున్నది. సరిగా నా సమయముననే ఆ జంతువు కూడ అతని పై బడుటకు పూర్వకాయము కదల్చుచున్నట్లున్నది. చప్పున ఆ పురుషసింహుడే ముందు గంతువేసి నెగడిలో మండుచున్న కాష్ఠముచేత నందుకొన్నాడు.

ఆకాశమున గుంపులోనుండి తప్పి ఏకాకియైన క్రౌంచమొకటి అప్పుడే పెద్దగా క్రీంకార మొనర్చినది.

ముందుకు దుముక బోవు చున్న పులి ఆ కదలికతోడనే ప్రక్కకు దూసి కొని పొదల లోని కదృశ్యమైనది. అప్పు డేమియు సవ్వడి కాలేదు. ఎండిన యాకుల గలగలయే దాని గమనము సూచించినది. ఆవల సెలయేటి నీటిలో నడక చప్పుడును కొంత ప్రదర్శించినది. మెకము సమీపమున కారాడుచున్న

లక్షణము లిక లేవు. చెట్లపై పక్షుల కదలికలు శాంతించినవి. కొంతవడికి బహుదూరమున పులి గాండ్రింపు వినవైనది. కాని అది భీషణముగాలేదు; దెబ్బ తిని ఒదిగి మూలుగు ఱునకరోదనము వలె నున్నది.

ఆ గాండ్రింపు చెవుల బడుటచే వృద్ధునికి మెలకువ వచ్చినది. ముం దాతని దృష్టి కుమారు డంతవరకు శయనించి యుండిన శిలాఫలకప్రాంత మున ప్రసరించినది. అది శూన్యముగా నుండుటచే తత్త్వరముతో నాతడు లేచి చూచెను. నెగడి వద్ద కుమారుని జూడగా వృద్ధునికి పోయిన ప్రాణములు లేచి వచ్చినట్లు గద్గదకంఠముతో, 'నాయనా, ఇంకను నిద్దుర పోలేదా?' అని ఆతు రముగా ప్రశ్నించెను.

'ఇప్పుడే ఈ నెగడి సరిచేయుచున్నాను.'

తండ్రికి కుమారునికి ఒకరితో నొకరు బెబ్బులి విషయము ప్రస్తావించు నిచ్చలేదు. వా రిద్దరు ఎవరికి వారు తనకే యా విషయము తెలియు ననుకొను చుండిరి.

కుమారుడు మరలి వచ్చి యథాస్థానమున శయనించెను. ఆతనికి నిద్దుర వచ్చుటలేదు.

3

ప్రశాంత మగు నా నిశీథ సమయమున ఈ మారు సముద్రఘోష వలె దూరమున నుండి ఒకానొక శబ్దము యువకుని చెవులలో జొచ్చినది. ఇప్పు డిక్కడ నీ సాగర ఘోష యేమి!

నౌక సముద్రములో మునిగిపోవుచుండ ఆర్తనాదము లొనర్చుచు, ఒకరి నొకరు తిట్టుకొనుచు, కేక లిడుచున్న బహుజనముల ఘోష వలె, నా శబ్దము వినవచ్చుచున్నది. ఏ మది? తాను కునికిపాటు పడి కలవరించుచున్నాడా? కాక

నిజమా ? యువకుడు లేచి కూర్చుండెను. విశాలమగు నాతని వక్షఃస్థలముపై ఆతని కంబుగ్రీవము నిలువున నిటారుగా నిలిచి శిరస్సును నిశ్చల మొనర్చినది. చెవులు రిక్కించి అత డాలకించుచున్నాడు. కన్ను లేమియు చూడజాలవు కాని యా పురుష సింహుని పింగాక్షములు రెప్పపాటు లేక నిలువబడిపోయినవి.

అంత ఆశ్చర్యపడ నవసరము లేదు. స్పష్టముగా నవి స్త్రీ బాలపురుషుల యార్తనాదములు. అచ్చటికి కొంత దూరమున గల అడవిబాట వైపు నుండి ఆ నాదములు వినవచ్చుచున్నవి. దిక్కులేనివారు పగలు ప్రయాణము చేయ వెరచి రాత్రుల రాకపోకలు సలుపుచున్నారు. ఆ వేళలందు కూడ దుండగుల బాధ తప్పుట లేదు. ఆ కాలపు యవన సైనికులకు దోపిడి మూకలకు భేదము లేదు.

ప్రతాపరుద్ర చక్రవర్తిని తాను యువరాజుగా నుండి చెరగొనిపోయిన ఉలుగుఖాను తండ్రియగు సుల్తానును చంపించి ఇప్పుడు మహమ్మదు బిన్ తుగ్లకు పేరుతో ఢిల్లీ సుల్తానై రాజ్యమేలుచున్నాడు. అతడు చాల చదువుకొన్న వాడు. స్వయముగా సరసమగు కవిత్వము చెప్పగలడు. ఆతని కాదరము కలిగి నను కోపము వచ్చినను పట్టరాకుండును. అతడెంత కరుణార్ద్ర హృదయుడో అంత క్రూరకార్యము లొనర్చెను. అతడెంతో తెలివిగా ఆలోచించి చేసిన పనులే తెలివితక్కువగా పరిణమించినవి. అత డుత్తర హిందూస్థాన విజయముతో తృప్తినొందక దక్షిణభారత మంతయు గూడ తన యేలుబడిలోనికి తేవలెనని నిశ్చయించెను. అందు కనువుగా రాజధాని దేహళినుండి దేవగిరికి తరలించుట కాజ్ఞాపించినాడు. రాజధాని తరలించుటయన్న నక్కడి రాజపురుషులను కదలించుటే కాక అందు నివాసమున్న ఆబాలగోపాలము, బధిరపంగ్వంధ భిక్షువులతో సహా కదలి రావలె నని యాతడు చండశాసన మొనర్చెను. కదలలేని రోగులను గూడ కదలనందుకు నిష్కరుణముగా నతడు నరికి వేయించెను. పేదలు వృద్ధులు బలహీనులు రోగులు బాల బాలికలు ఎందరో మార్గమధ్యమున మరణించిరి. బలశాలులుకూడ అంటువ్యాధులు తగిలి పలువురు చనిపోయిరి. దేవగిరి చేరునప్పటికి బయలుదేరిన వారిలో నాల్గవ వంతు కూడ మిగులలేదు.

రాజ్యవిస్తరణ తృష్ణతో నాతనికి యుద్ధములు పెరిగిపోయినవి. అందుకు ధనవ్యయము విపరీతమైనది. కావున ప్రజలను పీడించి పన్నులపేరిట విశేష

ధనము సంగ్రహింపపలసి వచ్చినది. క్రొత్తక్రొత్త పన్నులబాధ పడలేక రాష్ట్రములలో ప్రజలు తిరుగుబా ట్లొనర్చుచుండిరి. వాని నడచుటకు యుద్ధము లవసరమైనవి. అందుకు మరల మరింత ధనము కావలసి వచ్చినది. భరతదేశమునంతటినే కాక చీనాదేశమునుగూడ జయించు తృష్ణ యాతని కుండుటచే సేనాపతులు సేనలను యుద్ధపరికరములను నిరంతరము విస్తారముగా సేకరింపవలసి వచ్చుచున్నది. నిత్య ప్రవృద్ధమాన మగు ఈ వ్యయములతో నెంత ధనమైన చాలుట లేదు. బుద్ధిశాలియగు సుల్తాను ధనవృద్ధికి అనేకోపాయము లపూర్వమైన వాలోచించినాడు. చర్మఖండములపై రూప్యములు ముద్రింపజేసినాడు ఆతడూహించినట్లు దాని వలన ధనవృద్ధి యగుటకు మారు రాజకోశములోనున్న ద్రవ్యమే నష్టమైనది. పూర్వపు సుల్తాను లెవ్వరు నూహింపని క్రొత్తక్రొత్త పన్నులే కాక నజరానాలు తీసికొనుట ఇత్యాదిపద్ధతుల వలంబించి ప్రజలనుండియు సరదారులకడ నుండియు ధన మాకర్షించినాడు. అయినను ఆతని వ్యయమునకు ధనము చాలుటలేదు. ఈ ధనసంపాదన తృష్ణచే నతడు తన యుద్యోగులను క్రమశిక్షణలో పెట్టజాలకున్నాడు. వారిని అదుపులో పెట్టినచో తాను కోరినంత ధనము వారెట్లు కూర్చిపెట్టగలరు?

యువరాజుగా నున్నపుడే అతడు దక్షిణాపథములో దేవగిరి ముందు జయించి పిమ్మట ఆంధ్రరాజధాని యైన ఏకశిలానగరము ముట్టడించి పట్టుకొని ప్రతాపరుద్రుని బందీ చేసినాడు. ఆ పిమ్మట కొలది కాలమునకే ఆతడు డిల్లీ సుల్తా నయ్యెను.

ఏకశిలానగరము పట్టుకొనిన పిమ్మట నాతని సేనానులు ఆంధ్రదేశమునం దెల్లెడల దాడులు సాగించినారు. కొంద రంతటితో తృప్తి నొందలేక చోళ పాండ్య మండలముల మీదుగా పోయి దక్షిణ సముద్రతీరము చేరికొన్నారు. మధురలో నొక సేనాని రాజ్యస్థాపన మొనర్చినాడు.

ఇంత విస్తార మగు దక్షిణాపథములో సుల్తానుసేనలు సాధించినది యుద్ధవిజయములు మాత్రమే. ఆ విశాల భూభాగము ఆతని రాజ్యపరిపాలనము క్రింద సక్రమముగా స్థిరపడలేదు. ఆ యా ప్రదేశముల నాతడు తన రాజ్యభాగములుగా పరిగణించుచు పాలనకై అమీరులను, మలికులను, ఇతరోద్యోగులను

నియమించుచుండెను. ఆ ఉద్యోగులు ప్రజాపాలన మొనర్చు రాజ్యపాలన మొనర్చుటలేదు. వారి మాట కెవ్వ రేమాత్ర మెదురాడినను కఠినముగా దండించుచు, దొరికినంతవరకు కొల్లగొట్టుటకు వీలున్న శత్రు భూభాగముగనే భావించుచున్నవారివలె నిరంకుశముగా చరించుచుండిరి. ప్రజలుకూడ వారిని పాలకులుగా గాక దోపిడి మూకలుగనే భావించుచుండిరి.

ఆ ప్రజలు అట్టి అరాజకస్థితి మున్నెన్నడు ఎరిగినది కాదు. వింధ్యకుత్తర భూములలో నట్టి యకృత్యములు జరుగుచుండె నని తీర్థయాత్రికులు మధ్య మధ్య చెప్పుచు వచ్చిన వార్తలు కొంత కాలము నుండి వారి చెవుల బడుచున్నను, వా రవి విశ్వసింపక తైర్థికులు తమ యూహలకొలది అల్లి చెప్పెడి కల్పనా కథలుగనే గ్రహించుచుండిరి. మనుష్యజన్మ మెత్తినవారు అంత నిష్కరుణముగా ప్రవర్తింతు రనుట వారి యూహల కందరాకుండెడిది. నిషాదులు, కిరాతులు, రాక్షసులు చేయుదు రను ఘాతుక కృత్యములు రాజభటులు చేయ సాహసింతురా. అట్టి వారికి రాజదండన ముండదా అని వారు తలంచుచుండిరి. వారు మున్ను నమ్మకున్న యవస్థ యిప్పుడు తమకే వచ్చిపడినది. ఏళ్ళు గడచిపోవుచున్నను దీనికి నిర్వ్యతి కనిపించుట లేదు.

ఈ మధ్యనే విశేష మొక్కింత యవగత మగుచున్నది. దుర్జయము దేశమంతట విస్తరించుచు, బాధయు విస్తృత మగుచున్నను దాని తీవ్రత క్షీణించుచున్నది. గండిపడి తెగబారిన నదీజలము లోకమెల్లడ విస్తరించి ఎంత కాలము బాధింపగలదు? గట్లమధ్య పారని జలప్రవాహము వలెనే యవన బాధయు విస్తరించి బలహీన మగుచున్నది. సాహసించి ప్రతిఘటించిన వారి కాపద తొలగిపోవుచున్నది. తురకల మూకలు చెల్లాచెదరై మారుమూలల సంచరించుచు ఎదురుదెబ్బలు తగులుచున్న తావులు పరిహరించి మెత్తని చోటుల వీరవిహారము లొనర్చుచున్నవి. వారి నెదిరించు తెగువ ఎందరికుండును?

ఆ యువకు డట్లా రాత్రి ఆర్తనాదము లాలకించి యాలకించి ఒక్కపెట్టున నాగసర్పము వలె నూర్చుచు నిలువున లేచి నిలుచుండెను. ఆతని కడ నాయుధము లేమియులేవు. అవి యెన్నడో అపహరింపబడినవి. ఈ ప్రాంతము

లలో మల్లారెడ్డి కొందరు వీరులను కూర్చి దీనానాథులను రక్షింప కంకణము ధరించెనని ఆతడు వినియుండెను. గాని ఇప్పు డావల ఆర్తనాదము లొనర్చు చున్న ఆ దీనుల యార్తి తీర్చువారు ఎవ్వరు కనిపించలేదు. తా నిట్లు ప్రమాద భయముతో తలదాచుకొని యుండు టెన్నాళ్ళు! ఆవల దీనులు నిస్సహాయులై అట్లు విలపించుచుండ తనకు చేతనైన సాయము చేయక యూరకున్నచో తన యీ దేహ ముండి ప్రయోజన మేమి? హృదయావేగ మతిశయించెను. సటలు విదలించు సింహము వలెనే ఆ పురుషసింహు డొక్కపెట్టున ప్రమాదభయము విదలించుకొనెను.

'నాయనా, నమస్కారము, సెలవు!'

పరున్న తండ్రి నివ్వెరపోవుచు, 'ఏమిరా, నాయనా?' అనుచునే యుండెను. ఆ యువకు డది వినిపించుకొన దలపలేదు. చిక్కని దండము చేత బట్టి మౌనముద్ర ధరించి కొలది దూరము సాగి అక్కడ నెగడియొద్ద విశ్రమించియున్న కుటుంబములో తన యుపసయని కేకవేసెను.

'పంటా!'

ఆ పిలుపు వన దేవత నిట్టూర్పువలె నున్నది. అప్పటికే మేలుకొని జాగరూకుడైయున్న పంటయువకుడు వెంటనే నిండు కంఠముతో నుత్తర మొసగినాడు.

'బాబా!'

ఆ కంఠధ్వని వినబడినదే తడవుగా చువ్వ వలె ఉన్నతకాయుడగు యువకుడు దండధరుడై ప్రత్యక్షమయ్యెను.

మొదటి యువకుడు: 'వింటివా?'

రెండవ యువకుడు: 'పులి గాండ్రింపా?'

మొ. యు: 'అది యిక్కడికి వచ్చియే పారిపోయినది!'

రెం. యు : 'ఆవల కేకలా, బాబా?'

మొ. యు: 'అవును. మనము బయలుదేరుదమా?'

రెం. యు. 'నీ చిత్తము వచ్చినట్లే, బాబా! ఇంతవరకు గోమాత కోడె దూడతో నిద్దురలేక ఎంత యలజడి చేసినది! పట్టలేకపోతిని. ఇప్పుడు కాంతించినది. ఇక భయము లేదులే!'

ఆ యువకు లిద్దరు గోమాతకు నమస్కరించి సెలవు తీసికొని శీఘ్ర గమనమున ఆర్తఘోషలు వచ్చుచున్న దిశగా బయలుదేరిరి. వారి కుటుంబముల లోని వారు లేచి వారించుటకు గాని, అనుగమించుటకు గాని వ్యవధి నీయ నిచ్చగింపక, తిరిగి చూడకుండ, వడివడిగా వా రా యరణ్యములోనికి నిర్గ మించిరి.

వారి హృదయములలో నిండిన యావేగముతో వారికి ముచ్చెమటలు పోయుచుండుట గమనించి కాబోలు వాయువు వారిపై మందముగా నొలయు చుండెను, నిండు జాబిల్లి అమృతము కురియుచుండెను. దారి తీయుచున్న పంటయువకుని ప్రాంశుమూర్తి మెరుగులీనెడి నీల తనుకాంతితో నడచుచున్న ఇంద్రకీలాద్రి వలె నా పెన్నెలలో ప్రకాశించుచుండెను. దానిమ్మ పూ చాయగల మొదటి యువకుడు అరుణగిరి వలె ధగధగ లాడుచు నాతని వెంట సాగిపోవు చున్నాడు. ఆతని భుజమునుండి తెల్లని యజ్ఞోపవీతములు ప్రేలుచున్నవి. వా రిద్దరు తమ పుట్టములు వెనుకకు బిగించి వీర వేషముగా కట్టి, పై యుత్తరీయ ములు నడుములకు కాసెల వలె చుట్టి బిగించినారు. వారి రొమ్ములకు కంఠము లకు శిరోభాగములకు ఆచ్ఛాదనములే లేవు.

ఆ యిద్దర పదఘట్టనములతో పర్వతసానువు లదరుచు దడదడలాడి ప్రతిధ్వనించు చున్నవి. క్షుద్ర జంతువులు ప్రక్కల కొదిగి తప్పుకొని పారి పోవుచున్నవి. బెదరి తత్తరపాటున ఇటునటు పారుచున్న నక్కతోక యొకటి వారి కాళ్ళక్రింద పడగా ఆ శుభశకునమునకు వా రుప్పొంగిరి. ఆవల నేదో పొడుగుపాటి సరీసృపము సరసరమని పొదలలోనికి దూసికొని పోయినది. ప్రక్కల నున్న రాళ్ళలో, పొదలలో, జొంపములలో, చెట్లలో జంతువులు దారి

తప్పుకొనుచున్న కదలికలు సూచితము లగుచున్నవి, నిద్రించుచున్న పక్షులు మేల్కొంచి మధ్యమధ్య నెగురులాడుచున్నవి. అవి ప్రదక్షిణముగా సాగుచుండుట గమనించి జన్నిగట్టు యువకుడు లోలోపల నానందించుచుండెను.

అయినను ఆ యువకు లిరువురు ఆ ధ్వనులుగాని చలనములుగాని పట్టించుకొన్నట్లే లేదు. వారొక్క మాటయు పలుకుటలేదు. ఆవల వినవచ్చుచున్న యార్తనాదములే వారి శ్రవణములు నిండి నిబిడీకృతము లగుచుండ ఇతర శబ్దము లందు చొచ్చుటకు తావెక్కడిది? తమ దేహములలోని సత్వమంతయు ముందుకు సాగుటకే వారు వినియోగించుచున్నారు.

ఆ యేడ్పుల ధ్వని అంతకంతకు చేరువవుచున్నది. ఆ యార్తనాదములు వినబడుచున్నకొలది వడి ఎక్కించి నడచుచున్న వారి కాళ్ళు అప్రయత్నముగా పరువెత్త సాగినని. తా మక్కడికి పోయి ఏమి చేయవలె? వా రది ఆలోచింపలేదు. తమకు ఖడ్గములు, శిరస్త్రాణములు, తనుత్రాణములు లేవు. వా రది ఆలోచించు కొనుచున్నచో ఒక్క యడుగైన ముందుకు వేయజాలి యుండరు. యువసుల శూలములకు ఖడ్గములకు కృపణు లెవరో ఎర యగుచున్నా రనియే వా రెరిగినది. ఆ దీనులకు తమ చేతనైనట్లు సాయపడవలెనను చింత తప్ప వేరు విచార మా వీరపురుషులకు పట్టలేదు. పోయిపోయి రెండువిండ్ల వెడల్పుగల అడవిబాట దరిసిరి. అక్కడ నంతయు గందరగోళముగా నున్నది.

ఇంచుక పరికింప శీఘ్రమే దాని స్వరూప మవగత మైనది. రమారమి ముప్పదిమంది యాత్రికులున్న తండముపై యవనులు పడినారు. వారు పది పండ్రెండుమంది కంటె లేరు. ప్రయాణీకులలో వృద్ధులు, శిశువులు, బాలురు, స్త్రీలు పోను పడుచువారే పదునైదుమంది కలరు. గాయపడి మూల్గుచు నేల కొరగిన ముప్పురు తప్ప మరియెవ్వరు యవనులను ప్రతిఘటించినట్లు లేదు. తక్కిన వా రందరు వారల పై యుత్తరీయముల తోడనే పెడరెక్కలు విరిచి చెట్లకు కట్టి వేయబడి యున్నారు. అందులో నెవరైన కట్లు విప్పుకొన యత్నించిన అరచిన ప్రాధేయ పడిన అట్టివారిని యవను డొకడు తన్నగా, మరియొకడు శూలము చర్మముపై గ్రుచ్చి బాధించుచుండెను. శూలము లోతుగా గ్రుచ్చినకంటె పై చర్మముపద్ద గ్రుచ్చిననే బాధ యెక్కువయని వారి కనుభవ

మున్నట్లున్నది. వా రట్లు హింసించుచు కసి తీరక తిట్టుచు ఏక్కృతపు నవ్వులు పెద్దగా నవ్వుచున్నారు. నిర్దోషు లగు దీనానాథుల బాధ వారి కానంద కారణ ముగా నున్నది.

మిగిలిన జనము ఆలగోలు బాలగోలుగా నున్నది. వారి వెంట వచ్చిన ఆవులను, లేగలను, కోడెలను, పశువులను కొందరు యవను లప్పటికే తోలు కొనిపోయి ఉండుటచే వాని అంబారవములు దూరదూర మగుచు కరుణముగా వినవచ్చుచున్నవి. ఇక్కడ నొక మానవతి తనబిడ్డను రొమ్మునకు హత్తుకొని తన శిశువును రక్షింపుమని ప్రతిమాలచుండ, యవను డొక డా శిశువును బల వంతముగా లాగుచున్నాడు. ఆ లాగులాటలో తన శిశువుకు నొప్పిపుట్టి ఏడ్చు చుండ చూడలేక వదలినది. తన చేతులలోని కట్లు వచ్చిన యా పసిపాప నాత డావల పారవైచుచు ఫక్కున నవ్వినాడు. ఆమె శిశువుకొరకై యేడ్చుచు నటు పోవుచుండ వాడు వికృత హాసముతో నడ్డు నిలిచినాడు.

వృద్ధులు దుఃఖ మాపుకొనలేక బిగ్గరగా నేడ్చుచుండ నోరు మూయుడని యవనులు వారిని తన్నుచు, 'ధన మెక్కడ దాచినారో చెప్పు'డని వారందర బాధించుచున్నారు. నిర్ధనులమని యెంత చెప్పినను నమ్మక దొంగమాటలు పలుకుచున్నారని దూషించుచు పరిపరివిధముల పీడించుచున్నారు.

ఆ దోపిడి గాండ్రకు స్త్రీలపై కామవాంఛ యున్నట్లు తోపదు. ప్రతిఘ టించినవారిని అవమానింప వలెనను కసిమాత్రమే ఉన్నది. కట్టువడియున్న యువకులలో దృఢగాత్రు డొకడు ఎన్నితన్నులు తిన్నను, ఎన్ని గాయములు పడినను గింజుకొనుచు రోషముతో కేకలు వేయుచున్నాడు. ప్రతిఘటించుట కాతడు సిద్ధ మగుచుండగనే, పలువురు యవను లొక్కమ్మడి ఆతనిపైబడి పట్టి బలవంతముగా చెట్టుకు కట్టివేసినారు. ఆతడేమియు చేయనేర కున్నను కట్టు తప్పించు కొనుటకై గింజుకొనుచున్నాడు. అది చూచి యవను లాతని విశేషబాధ పెట్టుచుండగా ఆ బిడ్డతల్లి వ్యధనొందు చున్నది. అది గమనించి వారు భార్యాభర్తలై యుందురని యవను లూహించిరి.

యవను లిద్దరు పట్టి బలవంతముగా నామెను భర్త కొక వింటి దూరమున నిలువబెట్టిరి. ఒక డామెను కదలకుండ గట్టిగా పట్టుకొనగా, రెండవవాడు

దృఢగాత్రునితో, 'ఇదిగో చూడు, నీకు శిక్ష చేసెదను కాఫర్' అనుచు తన చేతిలోని శూల మాపలబెట్టి, కత్తిమాత్రము చేతబట్టి యువతిని సమీపించినాడు. ఆ మానవతి దేహము సిగ్గుతో ముడిచికొని పోవుచున్నది. వాడు పకపక నవ్వుచు బలవంతముగా నామె పైటకొంగు లాగుచున్నాడు. ఆ దుశ్శాసన రాక్షసుని ఊహ యేమో!

దండధారులైన యువకు లిద్దరు అక్కడికి రాగానే ముందు వారి కన్నుల బడిన దా దృశ్యమే. ఆ యవనుని వికృతాట్టహాసము చూచినంతనే అది వారి హృదయములలో ఒక్కపెట్టున కోతలు కోయుచున్న ట్లయినది. వారొం డొరుఁబు మంతన మాడుకొనలేదు. ఆ యువతిని పట్టుకొనియున్న యవనుని నడుము విరుగునట్లు జన్నిగట్టు తన చేతి లోని కర్రతో బాదినాడు. కత్తివట్టి పైట లాగుచున్న యవనుని కత్తిపట్టిన చేతిని గురిచూచి పఁట యువకు డదే సమయమున తనకర్రతో బలముగా మణికట్టుపై కొట్టినాడు. కత్తి ఎగిరి నేలపై బడినది. ఆ యవను డాశ్చర్యముతో వెనుదిరిగి చూచులోపుననే పంట మెరపు మెరసినట్లు దుమికి ఆకత్తి చేబూని ఆవల నెదురుగా చెట్టునకు కట్టబడి గింజు కొనుచున్న యువకుని బంధములు ఛేదించినాడు.

అట్లు ముక్తుడైన యువకుడు రోషావేశముతో పరువున వచ్చి యవను డావలనుంచిన శూల మందుకొని దానితో నాతని పొడువబోయెను. ఒడుపుగా యవనుడు ప్రక్కకు తొలగి ఆ పోటు తప్పించుకొనెను, గాని కాలుజారి క్రింద పడినాడు. తన చేతిలోని శూలము ప్రక్కకు దూసికొని పోవుటచే ఆ యువకుడు తూలి ముందుకు పర్వతమువలె యవనునిపై నొరగెను శూలము చేతనుండి జారినది.

పడిన యవనుడు లేచుచుండగా దృఢకాయుడగు నా యువకుడు ఆతని లేవనీయకుండ ఒడిసిపట్టి తలపట్టి నేలపై పడవేసెను. ఆతని చేతులలోనుండి తప్పించుకొనుటకై యవనుడు పెనగుచుండ యువకు డాతని మెడ ద్రొక్కి ముష్టితో గాఢముగా పొడిచెను. యవనుని నోటినుండియు ముక్కునుండియు రక్తపూరము లొరసినవి. ఆ రక్తము నల్లగా నా వెన్నెల కాంతిలో పాపము వలెనే మెరసినది స్థూలకాయుడగు నా యువకుడు అంతటితో నూరకొనక యవనుని పిండికూడుగా మర్దించి, ఎత్తి త్రిప్పి భూస్థలిపై పడవైచి ముఖము

తల ప్రహారములతో నడిచెను. భీమబలుడగు నాతని చేతులతో నా యువనునకు సరిగా భీమసేనుని చేతులలో ద్రౌపదిని హరించిన సైంధవున కరణ్యములో పట్టిన గతియే పట్టినది. ఆ యుషకునికి యవనుని మర్దించుటే తప్ప మరియొక యాలోచన పట్టినట్లు లేదు. ఆతని భార్య ఆవల పడియున్న శిశువు నందుకొని ఉరమునకు హత్తుకొని ఓదార్చుచు, భర్త భీమన్మృత్యము చూచి నాగసర్పము వలె నూర్చుచు ఆ యవనుని పంక కసితీరిన తుష్టితో చూచుచు ద్రౌపదిని స్మరణకు తెచ్చుచున్నది.

ఇంతసేపును పంట యువకుని బుద్ధియు చేతులు నూరకుండ లేదు. తన చేతికి జిక్కిన ఖడ్గముతో నాతడు బద్ధులైయున్న యాత్రిక యువకు లందర బంధములు చరచర ఛేదించి వేయుచుండెను. ఆతని చేతిలో కత్తి చిత్రముగా కొడవలివలె ప్రసరించుచు పనిచేయు చున్నది. ఇది యంతయు నొక్క త్రుటిలో జరిగిపోయినది

దోచుకొనుటకై యాత్రిక తండము వస్తువులు మూల మూలల వెదకి గాలించుచున్న యవనులకు తమపై కిట్లు పరులెవరో ఆకస్మికముగా వచ్చి పడుట కాశ్చర్యమై వెంటనే భయ మావేశించినది. వారిలో నుగు రావలనున్న తమ సహచరులను సాయము రమ్మని పొలికేక లిడుచు పారిపోయిరి. మిగిలిన వారికి తమపై నిట్లాకస్మికముగా వచ్చిపడినది ఇద్దరే యనియు వా రాయుధ ములు తేలేదనియు తెలియుటకే కొంత వ్యవధి పట్టినది. అది తెలిసినంతనే వారికి ద్విగుణీ కృతముగా కోప మావేశించినది.

అప్పటికి యాత్రిక తండములోని పడుచువా రందరు బంధవిముక్తులై రి. యవన తండము తాకినప్పు డుండిన భయము వారి కిప్పుడు లేక ఎంతటి సాహ సమునకైన సిద్ధముగా నున్నట్లున్నారు. అందుచే యవను లిప్పుడు త మ్మోది రించుచున్న పడుచువారి నెందరినో ఎదుర్కొన వలసి వచ్చినది. అంతేకాదు. ఆ యాత్రిక తండములోని స్త్రీలు కూడ ఇప్పు డబలలవలె కన్పించుటలేదు. ఆ పసిబిడ్డ తల్లి రోషముతో నిప్పుడు నిలువున నిలిచి యవనులను నిర్భయముగా తర్జించుచున్నది. వృద్ధులకు వార్ధకము పోయినట్లున్నది. త్వరలో నెట్లయిన వదలవలసి యున్న తమ ప్రాణములపై తీపి యెందుకని వారికి విరక్తితోపాటు

సాహస మంకురించినది. వారలుకూడ చేతికి చిక్కిన రాయి తోడనో రప్ప తోడనో, కొయ్యతోనో, గణతము తోనో కొట్టనచ్చునట్లున్నారు. సాహసు లిద్దరు దారి చూపగా అందరికి సాహస ముదయించినది అంతవరకు తాము ప్రదర్శించిన ధైన్యము తమ కేమాత్రము నుపకరింప లేదని వారల కిప్పు డనుభవము నకు వచ్చినది.

అయిననేమి ? వారెల్లరు నిరాయుధులు. పంట యువకుడును విప్ర యువకుడును మాత్రమే పడిపోయిన యసనయోధుల ఖడ్గములు తీసికొని ప్రయోగింప సిద్ధముగా నున్నారు. యవనుని మర్దించుచున్న భీమయువకునకు ఇంకను ఒడలు తెలిసినట్లు లేదు. అతడు తనచేతికి చిక్కిన శూలము జార విడిచి మరల గ్రహింపకుండెను. పంట యువకుని చేతిపట్టు వలననే అతనికి ఖడ్గము పట్టుటయే చేతకాదని ద్యోతమగుచున్నది. బ్రాహ్మణ యువకు డొక్కడే కరవాలము లీలగా ధరించి ఎదిరింప నిబ్బరముగా నిలిచి యున్నాడు.

"మనము సాయుధులము. ఆయుధసాధన చేసినవారము. మెత్త లున్నవి మనకు. మన మార్వురమే అయినను ఈ మూకకు చాలమా ?" అని తలచినాడు యవన నాయకుడు. అతడు స్వయముగా భయ మెరుగనివాడైనను, తన యనుచరుల ధైర్య సాహసములం దాతనికి విశ్వాసము లేదు. అనుచరులు సందేహముతో వెనుకాడు చుండుట యాతడు గమనించి కఠినముగా నాజ్ఞాపించినాడు :

"చూచెదరేమి? నరకి వేయండి!"

ఆ కంఠము రూక్షమై అరణ్యప్రదేశ మెల్లకడల మారుమ్రోగి మరింత రూక్షముగా వినవచ్చినది. యవన నాయకుడు దృఢకాయుడు. అతని మెడ మిగుల లావై కర్కశముగా నున్నది. అంత లావుపాటి కంఠమునుండి నిర్గతమై వచ్చిన అజ్ఞావాక్కు పాతాళ కుహరములో నుండి పైకి వచ్చిన తక్షకుని శిరస్సు వలె భయంకరముగా నున్నది. అనుచరులు ఉలిక్కిపడి కత్తులు సరిచేసికొని పూని పోరి కాయితమైరి.

నాయకుడు వారి నట్లాజ్ఞాపించి తాను వెనుక నిలువలేదు. ఆజ్ఞాపించు చునే సింహనాదము గావించి అందరి కంటె తానే ముందు విప్రయువకుని పైకి

లంఘించినాడు. బ్రాహ్మణుడు నేర్పుగా ప్రక్కకు తొలగి తిరిగి యెదుర్కొని నిలిచినాడు. వారి కర నిముసము ద్వంద్వయుద్ధము జరుగు లోపుననే మరి యిద్దరు యవనులు తమ నాయకునితో కలసి బాసటగా నిలిచినారు. ఒకేమారు మువ్వురతో పోరాడుట విప్ర యువకునకు దుర్భరముగా నున్నది. అతడలసి నాడు. వారి దెబ్బలు తప్పించుకొనుట కష్టతరముగా నున్నది. అతని యొడ లెల్ల గాయము లగుచున్నవి. అతి ప్రయత్నమున గాని ఆతని కాలుసేతు లాడుట లేదు. యవనులు సులభముగా నాతనిపై క్రమ్ముచున్నారు. ఆతని కాయశ్శేషము స్వల్ప మనిపించుచున్నది.

ఆవల భీమనృత్యము చేయుచున్న యువకు డది యుపలక్షించినాడు మెరపు మెరసిన వేగముతో నాతడు పడిపోయిన శూల మందుకొని పోరిలో జొరబడి యవన నాయకుని కండగా నిలిచిన యోధు లిద్దరిలో నొకనిని దానితో పొడిచి పడవేసినాడు. సరిగా నదే సమయమున పంట యువకుడు తనకు ప్రయోగించుట చేతకాకుండుటచే నిరుపయోగముగా నున్న కృపాణ మావల పారవైచి తాను తెచ్చిన దండము చేత ధరించినాడు. అత డెట్టి కాలభుజంగము నైనను ఒడుపుగా కర్రతో కొట్టగల నేర్పరి. యవన నాయకునికి తోడుగా నిలి చిన రెండవ యోధుని చేతిలోని ఖడ్గము త్రాచుపాముగా నూహించుకొని, గురి చూచి పిడియొద్ద కర్రతో బలము కొలది కొట్టినాడు. ఆ దెబ్బకు యవనుని చేతిలోని ఖడ్గము ఎగిరి దూరముగా పడిపోయినది. మరల వెంటనే కర్రయెత్తి ఈ మారా యవనుని శిరస్సుపై మోదినాడు. యవనుని శిర స్సా పెట్టుకు పెటుక్కుమని చిట్లి నల్లగా నెత్తురుబికి ప్రవాహము కట్టుచుండ వాడు పడి పోయెను.

అంతవరకును మిగిలిన యవన యోధులు మువ్వురును పోరుటో పారి పోవుటో నిశ్చయింప లేకుండిరి. ఇప్పుడు పడిపోయిన యవన యోధుల నిద్దర జూచి సహాయులకై కేక నిడుచు వారు వెన్నుచూపి పారి పోదొడగిరి. నాయకు డొక్కడే మిగిలియుండి ఏకాకిగా పోరుచున్నాడు. పారిపోవుచున్న యవనులు, 'ఆయియే, బడే సాహబ్!' అనుచు నాతనిగూడ రమ్మని పిలుచుచు పరువెత్తు చుండిరి.

యవన నాయకుడు లెక్కచేయక ఆ ఎర్రని భూసురునితో పోరుచునే యుండెను. విప్రు డలసి నీరసించి యుండెను. యవను డొంటరితనముచే నపాయములో నుంటినని యెరిగియు క్రోధ మాపుకొనలేక తన ప్రధాన శత్రు వును శిక్షించిగాని విడిచిపోవ నిచ్చగింపలేదు. భీమ యువకుడును పంటయు ఆ విప్రునకు తోడై ఆతని పొడిచి వేయుటకు సందు చూచుచున్నారు. ఆతనికి నెమ్మదిగా ధైర్యము సన్నగిల్లు చున్నది. కట్లలోనుండి విడివడిన యువకు లందరుగూడ నతని మీదికి వచ్చుచున్నారు. ఇందరితో తా నొక్కడు నెట్లు పోరగలడు ! క్షణక్షణ మాతడు వెనుక వెనుకకు ఒక్కొక్క యడుగే వేయు చున్నాడు ఇప్పుడు రెండురెం డడుగులు వేయుచున్నాడు, కేవలము పారిపోయి నట్లుగాక, పోరు వదలించుకొని పోవుట ఎట్లాయనియే అత డిప్పు డాలో చించుచున్నాడు.

క్షుద్రమైన ఆపోరిలో తన యనుచరులు నల్వురు పడి పోయిరి. వారి నాలుగు ఖడ్గములును నాలుగు శూలములను యువకులు హరించి ధరించినారు.

బ్రాహ్మణయువకున కారాత్రి యాహారములేదు. దీన సంరక్షణార్థము చేయుచున్న యీ పోరాట మాతనికి కడుపు నింపు భోజనముగా నున్నది, అత డీరాత్రి పడ్డ హృదయా వేగమునకు మాదకౌషధముగా నున్నది. అయిన నేమి ? అతని దేహము నిస్సార మగుచున్నది. అతడు నిలువలేక తూలుచున్నాడు. అదృష్టవశాత్తుగా యవన నాయకుడే పోరినుండి తొలగి పోయినాడు. బ్రాహ్మణ యువకుడు రోజుచు రొమ్ముపై చేయి పెట్టుకొని కూలబడినాడు.

యువకు లిప్పుడు యవన నాయకుని వెంటనంటి పైబడి తుదముట్టింప నుత్సహించు చుండిరి, రోజుచునే బ్రాహ్మణుడు వారిని వారించి వెనుకకు మర ల్చెను. ఎగరొప్పుతోడనే లేచి ఆకడు ముందు యాత్రికులతో గాయపడినవారి ఉపచారముల కుపక్రమింప వారిని నియోగించెను.

4

బ్రాహ్మణ యువకుడు ; 'పంటా !'

పంట : ఏమి బాబా ? అలుపుగా నున్నదా ?'

బ్రా. యు : 'నా బడలిక కేమిలే. వారి యనుచరులు సమీపములోనే యుందురు. వారందరు కలసి మనపై బడ రావచ్చును. ఈ మారు వారి కే మాత్రము కరుణా శేషము సంకోచవేశము నుండవు. ఈ స్త్రీ బాలవృద్ధులను ముందేదో సురక్షితస్థానమునకు చేర్చవలె !'

పంట 'మంచిది బాబా !' అనుచు ఆలోచించుచుండెను. మరొక క్షణము నకే విప్రు డాతని పలుకరించెను.

'అది విను ! ఏమిటా ధ్వని ?'

పంట యాలకించెను. 'యవనులు పలువురు కూడుకొనుచున్నారు.' ఇట్లనుచునే అతడు దురితముగా ఆలోచించుచు నిట్లు పలికెను.

"బాబా, మనము వచ్చిన దారిలో మలుపువద్ద వంకలు తిరిగిన వేపచెట్టు కనపడ్డది జ్ఞాపక మున్నదా ? అక్కడ చిన్న లోయ యున్నది. దాని కీవలదారి సన్నగా నున్నది. వీరి నా లోయలోనికి చేర్చి మన మూదారి కాయవచ్చును."

బాప డించుక యత్నించి స్మృతి యవలోడన మొనర్చి ఆయాలోచనము బాగున్నదని యంగీకరించెను, వెంటనే యాత్రికులను తమ వస్తువులన్నియు వదలి తమవెంట రావలసిన దని చెప్పి యాతడు బయలు వెడలుచుండెను, ఆతని పలుకు లాలించినవారే లేరు.

ఈమారు యవనుల కోపపు కేకలు స్పష్టముగా నందరకు వినవచ్చినవి. యాత్రికు లందరు భయభ్రాంతులైరి. వారిలో యువకుల కుద్రేకము తగ్గి ఉత్సాహము వెనుక పట్టినది. వృద్ధులు తమ్ము కాపాడినవారను మాటను మరచి పంటను విప్రుని నిందింపసాగిరి.

"అయ్యో ! మా దారిన మేము వాళ్ళనెట్లో కాళ్లు గడ్డములు పట్టుకొని తల కాచుకొనుచుండగా. వీరిద్దరు వచ్చి వృథాగా వారితో కయ్యము పెట్టుకొని మా ప్రాణములు తీసినారు. అరుగో ! తురకలు వచ్చుచున్నారు, ఇప్పుడు మా వస్తువులన్నీ వదలివేసి పారిపోండనియా మీ సలహా ! మా బాగున్నది."

ప్రయాణికు లొక్కరు కదలలేదు, ఎవరి నోటికి వచ్చినట్లు వారు యువకులను తిట్టుచు అక్కడనే నిలిచి తమ ప్రాణముల వదలుటకు సిద్ధపడుచుండిరి. విప్రయువకుడు వారి కెన్నివిధముల చెప్పి చూచినను వినిపించుకొన

కండిరి. అతడు మఁచిగా చెప్పుచున్న కొలది వారి ధూషణ మెక్కువ కాజొ చ్చినది, "ఏమి బ్రాహ్మణుడఁయ్యా, కత్తి చేత పట్టుకొని కలుకఁచు నిలువున మా ప్రాణాలు తీయుటకు దపురించినావు!" - అతని కేమియు పాలుపోక చీకాకు పడుచు చిన్నపుచ్చుకొని యుండెను.

అది గమనించి పంట యువకు డొక్కఁపెట్టున రౌద్రాకారము దాల్చి వృద్ధుల తలలు పగులఁగొట్ట బోవుచున్నట్లు కర్రపైకెత్తి పెద్దగా అరచి ఆజ్ఞా పించినాడు.

"బుద్ధి హీనులారా, నోరు మూయండి. మెదలినచో చంపి వేసెదను. వెంటనే నడవండి!"

పంటకు తోడై దృఢముగా శూలము పూని భీమయువకుడు కదలినాడు, అతని భార్య పిల్లవానిని చంక నెత్తుకొని ముందు సాగినది. వారు ముందు స్త్రీబాల వృద్ధులను కదల్చ, తక్కినవారు కిక్కురు మనకుండ గజగజలాడుచు బయలుదేరిరి. గాయములతో పడియున్న ముగ్గురు యువకులు కూడలేచి మూల్గుచు కుంటుచు సాగివచ్చిరి.

అందరు స్వప్నములోవలె నడచుచుండిరి. పంటదారి తీయుచుండ నందఱికి వెనుక భాగమున బ్రాహ్మణుడును భీమయువకుడును కాపుకాయుచు వచ్చుచుండిరి.

ఆ లోయయు ఎక్కువ దూరము లేదు, సందడిచేయక అందరు నక్క డికి చేరికొనిరి.

సరిగా నా సమయమునకే వారు వదలివచ్చిన అడవిబాట కడకు ఆర్భా టములో ,యవనులు చేరిరి, అక్కడ నెవ్వరు లేకుండుట వారి కాశ్చర్యమైనది. వస్తువు లన్నియు అచ్చటనే ఉండుటచే వారు దూరముపోయి ఉండరని యవన నాయకు డూహించెను. క్రొత్తగా పెరుగుచున్న తన గడ్డము దువ్వుకొనుచు యాత్రికులకై వెదకుడని యత డాజ్ఞాపింపగా, భటులు బీరములు పలుకుచు ఆ చుట్టుపట్టుల నరణ్యము నాలుగు చెరగులు గాలించుచుండిరి. బడేసాహబ్ కూడ ఆ వేగముతో స్వయముగా వెదకుచున్నాడు. తనతో నెదురొడ్డి సాహ సించిన యా పౌరుని శిక్షింప నాతడు ఆత్రపడుచున్నాడు. అందు కాతడు ఎన్నియో మార్గములు చింతించుచు ఊహాసౌధములు నిర్మించుచున్నాడు. వధిం

పవాసని కాదతని ఆలోచన, అదియొక లెక్కలోనిది కాదు. వంటయింటి కుందేలు, అతని నెట్లు పరాభవింతునా. ఎన్ని విధముల బాధించి చిత్రవధ కావింతునా యనియే ఆతని యోచనా పరంపర.

"కవచము లేదు. మెత్తయైన లేదు. తలకు గుడ్డకూడ లేదే! నడుముకు ఉత్తరీయము బిగించి ఎక్కడనో చేతికి చిక్కిన కత్తితో నాబోటి శూరుని ఎదిరింప సాహసించుటా? ఆ చిత్రమేమో! కాలుసేతులు నాకు యథాప్రకార మాడలేదు. లేనిచో అతని ప్రాణమెప్పుడే పోయెడివి కావా?"

అట్లు వెదకి యాత్రికులు డాగియున్న లోయ కనిపెట్టినది యవన నాయకుడే, ఆ లోయకు ముందు పర్వతశిల రెండు ప్రక్కల ద్వారబంధమువలె నిలువున నెత్తుగా పెరిగినట్లు నిలిచి యున్నది. తడవకు నలుగురైదుగురుకంటె ఎక్కువమంది అందులో పోలేరు. ఆదారి కాయుచు మధ్య బ్రాహ్మణయువకుడును, ఒకప్రక్క పంటయు, రెండవప్రక్క భీమయువకుడును కనిపించిరి. వారి కావల యుషకులు కొందరు యవనులు పారవైచిన ఆయుధములు ధరించి గజగజలాడుచు కానవచ్చిరి.

వారిని చూడగానే బడేసాహబుకు నవ్వు వచ్చినది. అది వికృతపు నవ్వు, క్రోధమూర్తియై ఘోరముగా కేకలుపెట్టుచు అనుచరుల రమ్మని పిలుచుచు భయంకరముగా నతడు యాత్రికులపై బడెను.

ఏందరో యవను లటువైపు శీఘ్రముగావచ్చిరి. వారు పాతికమందియో, ఏబదిమందియో, వేయిమందికంటె ఎక్కువ కోలాహలము చేయుచున్నారు.

వారు మాటాడు భాషయు నొక్కటికాదు. ఆరె భాష రాజస్థానీ, కన్నడము, తెలుగు - ఈ అన్నిభాషల మాటలును స్వతంత్రముగా అంతములు మార్చి పార్శీవలెనో, అరబ్బీవలెనో, ధ్వనించులాగున పలుకుచున్నారు. వారిలో ఒక్కొక్క దొక్క కోశకర్త, ఒక వ్యాకర్త, ఒక భాషాబ్రహ్మ! ఆవేశ మెట్లు పలికించిన నట్లు మాటలు మలచి నోట నుచ్చరించును. అతని భావము ఆవలివారి కెట్లో సందర్భవశమున వ్యక్తమగును. ఆ నూతన భాషలో మోటు సైనికుల స్వభావము ముద్రిత మగుచున్నది. అందులో ఒకానొక కాఠిన్యము, క్రౌర్యము, భయానక ప్రకృతి మూర్తీభవించి కఠోరముగా చెవులకు తాకుచున్నది.

"మారో ! మారో ! మారో !"

వారి తాకిడి కీ మారు బ్రాహ్మణయువకుడు తాళజాల కున్నాడు. మొదటి పోరితోడనే అతడు నీరసించెను. పైగా ఇంతవరకు విశ్రాంతి లేదు. ఒడలంతయు చిన్న గాయము లైనవి. ఇప్పు డాతని దక్షిణ బాహువు తీవ్రముగా గాయపడి రక్త మోడుచున్నది. పంట కర్రయు భీమయువకుని భూలమును చేయుచున్న సాయ మాతనికి చాలకున్నది. లోయలోని స్త్రీ బాలవృద్ధులు బావురుమని ఏడ్చుచుండ నక్కడి యువకులును వారితో గలసి ఆయుధములు వదలి వీరించుచున్నారు. ఆ లోయలోనుండి తప్పించుకొని పారిపోవుటకు గూడ మార్గ మగపడలేదని వారి గోల: "మల్లయ్యా, రక్షించు: చెవిటి మల్లయ్యా, రక్షించరా !" అని కొంద రాఘోషణ మొనర్చుచుండిరి.

భూసురయువకుడు తూలిపడినాడు. ఆతని వధించుటే యవన నాయకుని కాంక్షయైనచో అందుకు మంచి యవకాశము చిక్కినది, ఆ బాపని పట్టి పరిభవించి పరిపరి విధముల బాధించిగాని చంపుట కాత డిచ్చగింపలేదు. అందుకు నాందిగా అసభ్యముగా తిట్టుచు పడియున్న యా భూదేవుని తన్ను టకై కాలెత్తినాడు.

ఎత్తినకా లెత్తినట్టే స్తబ్ధహతమైనది. బాధతో నాతడు కాలు వెనుకకు లాగికొనెను.

ఆజానబాహు వగు మహావీరు డొక్క డెచ్చటినుండియో వచ్చి యవనుల నెదుర్కొనెను, అతడా పర్వత శిలే ఛేదించుకొని వచ్చెనో అరణ్యములోనుండి ఆకస్మికముగా పుట్టుకొని వచ్చెనో ! అతడు కవచాచ్ఛాదిత సర్వగాత్రుడు. ఆతని కుడిచేత ఖడ్గమును ఎడమచేత గుండ్రముగా నున్న లోహపు డాలును గలవు. ప్రక్కన చేనందుటకు వీలుగా మహాభూల మొకటి నిలువున నున్నది. ఆ వచ్చినది ఒక్కడే యైనను శ్రీశైల పర్వతమువలె స్థిరముగా నిలిచిన ఆతని రీతికి యవనుల మూకలు నివ్వెరపోయి ఒక్కడుగు వెనుకంజ వేసెను. ముందున్న ముగ్గురు యవనుల నాతడు కత్తితోనైన తాకక కఠినమగు తన పలకతో ప్రహరింపగా వారు వెనుకకు పడిపోయిరి. వారులేచి నిలువ ద్రొక్కుకొను లోపుననే, ఆవిపిన మంతయు శంఖనాదములతో బోరు కలగినది. యవనులకు మహాభయ మావేశించినది.

"ఆల్లా! వల్లారెడ్డీ ఆయా!. ఆల్లా! వల్లారెడ్డి బాబో! వల్లారెడ్డి వచ్చాడ్. సైతాన్ ఆయా! పారిపోదామ్! అయ్యో జిన్నాతీ! మల్లారెడ్డీ!."

ఇట్లనేకవిధముల నరచుచు యవనుల మూక విరిగి పారిపోయినది. వారి నాయకుడు వెంటనే పారిపోక ఆవచ్చిన నూతన వీరునివంక తేరిపార జూచుచు క్షణకాలము గాయపడ్డ తన కాలిని పట్టుకొని నిలువబడెను. ఆ చూపులో ఒకానొక చిత్రమగు వాత్సల్య మున్నట్లున్నది.

నూతన వీరుడును యవననాయకుని వంక సాలోచనముగా తిలకించెను శిరస్త్రాణముచేతను క్రొత్తగా పెరుగుచున్న గడ్డముచేతను పొనుగువడియున్న బడేసాహబు ముఖము సరిగా గుర్తింప వీలుగాకున్నను, ఆతడు నిలిచిన తీరు, కదలికల వైఖరి నూతన వీరునిగూడ నాకర్షించినట్లున్నవి. అతడును యవనుని తప్పక చూచెను. ఆ యవన వీరునితో నిక పోరాడుట కా నూతన వీరు డిష్టము చూపలేదు. ఆతని కన్నులు చెమర్చి నట్లున్నవి.

యవననాయకు డాతనివంకకు తిరిగి తిరిగి చల్లని దృష్టులు పరపుచు, కాలికైన గాయముచే కుంటుకొనుచు నెమ్మదిగా వనభూమిలోని కదృశ్యు డాయెను.

5

శ్రీశైలమువలె నట్లచ్చట నిలిచిన వీరుడు నిజముగా మల్లారెడ్డియే. పడిపోయిన ఎర్రని యువకుని మెడలో యజ్ఞోపవీత ముపలక్షించి నంతనే ఆతడు వంగి తనకరములతో నాతని రెండు పాదములు భక్తి పూర్వకముగా స్పృశించి కన్నుల కద్దుకొనెను.

యవనుల కేకలచే నా వచ్చినది మల్లారెడ్డి యని తోచినంతనే పంట యువకు డానందపరవశు డయ్యెను. ఈ కొండలలో నడవులలో ఎక్కడనో మల్లారెడ్డి యుండుననియు, ఆర్తులను రక్షింప తానుగా పిలిచినట్లు వచ్చుచుండు మల్లికార్జునమూర్తి యనియు నాతడు వినియుండెను. మల్లారెడ్డియు నాతని యనుచరులును ఎట్లు వత్తురో అట్లే ఆకస్మికముగా అదృశ్య లగుదురట. యవనులతో పెద్దయెత్తున యుద్ధమున కెన్నడు నాతడు తలపడకున్నను,

ఆ చుట్టుపట్టుల విహరించుచున్న యవనుల దోపిడి మూకలకును సేనాఖండము లకును మల్లారెడ్డిపేరు సింహ స్వప్నముగా నున్నది.

ఆతని గూర్చిన గాధలెన్నియో ఆవైపుల జనశ్రుతిలో ప్రాకిపోయినవి. ఎన్ని కథలైనను ఆతని ధైర్యమును సాహసమును వీర్యమును సమయస్ఫూర్తిని ఆర్తత్రాణ పరాయణతను దాతృత్వమును ధర్మనిష్ఠను వర్ణించుకథలే. అతనిని శస్త్రము లేవియు భేదింపలేవట. ఆతని గమనమునకు నదులు పర్వతములు అరణ్యములు నడ్డురావట. యవనులు నాలుగు తండములుగా చీలి ఒకేరాత్రి నాలుగు దూరదూర ప్రదేశములలో ప్రయాణికులను కొల్లగొట్టుచుండగా, ఆ రాత్రి యానాలుగు ప్రదేశములందును మల్లారెడ్డి ప్రత్యక్షమై వారిని రక్షించినట్లు యవన స్కంధావారము నుండియే వార్తలు వ్యాప్తమైనవి. ఆర్తులు బిగ్గరగా దీనాలాపములు చేసిన జాలును. ఆ యరణ్యములే, కొండలే అతని కావార్త చెవిలో జెప్పునట. ఉత్తరక్షణమునకే అతడక్కడ ప్రత్యక్షమగునట. అట్లని యవనభటు లాతని నాకర్షించి బంధించు మూహతో కొన్నిమారు లార్తనాదములు కృత్రిమముగా చేయించి చూచిరి. అట్టియెడల నాతడు రాలేదు.

మల్లారెడ్డి కేవలము దేవాంశసంభూతుడే యనియు, కాక సిరిగిరి మల్లయ్యయే ఆరూపముతో తన శ్రీ పర్వతభూములు రక్షించుకొనుచున్నాడ నియు, ప్రథ జనము లందంతట ప్రాకిపోయినది.

అతడు నిజముగా 'జిన్' అను నమ్మకముకూడ యవనులలో ప్రబలినది. దీను లరచినచో అది మల్లారెడ్డికి వినబడి వచ్చునేమో యనెడి భయముచేతనే, వారు తాము బాధించుచున్నవారిని అరవనీయక నోళ్ళు నొక్కుచుండిరి.

మల్లారెడ్డిని చేరికొనుటకే పంటయు బ్రాహ్మణయువకుడును వారము దినముల నుండియు ఏకదీక్షగా యత్నించుచుండిరి. ఇన్ని కథలాతని గూర్చి ప్రచారము గాంచుచున్నను, ఆతని ఉనికి ఇదమిత్థమని చెప్పగలవా రొక్కరైన దొరకరైరి. ఆతని ఉనికియే నిజమా, కల్పితకథయా అను సందేహముకూడ వారికి నడుమ నడుమ నంకురింప సాగినది. వా రీరాత్రి దూరమున నార్తనాద ములు విని బయలుదేరుటలో, దీనులను రక్షింపవలె ననువ్యగ్రతతో బాటు అచ్చట తాము మల్లారెడ్డిని దర్శింపవచ్చుననునాశకూడ మిళితమై యున్నది.

అట్టి యా మల్లారెడ్డి తన ఎదుట నిజముగానే ఇప్పుడు నిలిచియున్నాడని గ్రహించిన పంటయువకుని యానంద మేమని వర్ణింపగలము : స్వయముగా శ్రీశైలమల్లికార్జునుడే తన కాయాకారమున ప్రత్యక్షమయ్యే నని భావించుకొని రెండు చేతులు జోడించి శిరస్సుపై నుంచుకొని దండముపెట్టెను. ఆదండమును మల్లారెడ్డి ఎదురు దండముతో నాదరింపలేదు. తన కితరులు పెట్టు దండము లన్నియు అత డెన్నడో శ్రీశైలపతి కర్పణచేసియుండెను.

పంట తనమిత్రుని గాయముల చికిత్స విషయము ముందు చూడుమని మల్లారెడ్డిని మరిమరి వేడుకొనుచుండెను. అత డది వినిపించుకొన్నట్లే లేదు.

అడవి నాలుగు మూలలనుండి మల్లారెడ్డి యనుచరు లింకను మూగు చునే యుండిరి. వారు వివిధాయుధధారులు. కొందరు ధనుర్ధరులు. ఆవచ్చు చున్న వారిలో తనకు ముందు కావలసిన వానికొరకై మాటిమాటి కాతడు వ్యగ్రతతో తలయెత్తి చూచుచుండెను. అట్లు చూచుచునే పంట నడిగి ఆరాత్రి జరిగిన వృత్తాంతమంతయు ఓకచెవితో నాలకించుచున్నాడు. పంటయు కొద్ది మాటలతో జరిగిన ఉదంతము స్పష్టముగా వర్ణింప గలిగెను. అంతలో మల్లా రెడ్డి నిరీక్షించుచున్న వ్యక్తి వచ్చినట్లున్నాడు.

"విస్సన్నా, ముందీ బాపనయ్య గాయముల చికిత్స సంగతి చూడండి!"

బాపన యువకుని దేహము విస్సన పరీక్షించెను, "ఇతని ఒళ్ళంతయు గాయములే. కాని చాలవరకు చిన్నవి. కుడి దండ మీదిదే పెద్దది, ప్రమాద ముండగూడదు."

ఇట్లనుచునే ఆతడు తన యొద్ద సిద్ధముగా నున్న యాకుముద్ద తీసి ఆ పెద్దగాయములో కూరి కట్టుకట్టెను. ఆ యాకు తోడనే మిగిలిన గాయములకు గూడ చికిత్స ప్రారంభించెను.

ఆ వచ్చినది వైద్యు డని తెలియగనే తన భార్య చూపందుకొని భీమ యువకుడు తనబిడ్డను విస్సనకు చూపి, ఆ పసికందును యవను డావల విసిరి వేసినది చెప్పెను. విస్సన ఆబిడ్డను పరీక్షించుచుండ ఆబిడ్డ యతని వంక కనులు విప్పి చూచి నవ్వెను.

"ఇతనికి కాదు నేను వైద్యము చేయవలసినది. ఇతడు పడ్డచోట భూదేవికి, పాపము, గాయమై యుండును. కుంతీదేవి చేతిలోనుండి భీముడు

క్రిందపడగా కొండ చిదికినదట - ఇతడును వజ్రకాయుడే. భయములేదు !" అనుచు అతనిని తిరిగి యిచ్చుచు భీమయువకుని కర్కశ దేహమువంక తుష్టితో తిలకించెను.

గాయపడిన యితర యువకులును చికిత్స నొందిరి.

యాత్రికులు బాటలో వదలివచ్చిన వస్తువు లన్నియు మల్లారెడ్డి అను చరులు తెచ్చి ఎవరివి వారి కప్పగించిరి. అంతసేపును మల్లారెడ్డి దుర్గము వలె నున్న ఆ లోయ వంక ముగ్ధుడై మరల మరల చూచుచు లోలోన మెచ్చుకొను చుండెను.

"రక్షణార్థము వీరి నీప్రదేశమునకు చేర్చినది నీవా, గాయపడిన ఈ పూజ్యుడా ?"

పంట : "ఈ పూజ్యుని అనుమతితో నేనే, బాబా !"

దుర్గమువలె నున్న ఆ ప్రదేశమును విస్మయను చూడుమనుచు మల్లారెడ్డి మురిపెముతో నటు చూచి చూచి సంతోషము పట్టలేక, పంట యువకుని వీపున దక్షిణ హస్తముతో మణుగు బరువుగా ఒక్క చరపు చరచెను. బద్దవంటి తన శరీరము వంచి పంట ఆ దెబ్బను లీలగా చిరునవ్వుతో స్వీకరించెను.

మల్లారెడ్డి: 'నీవు ఎక్కడికి పోవుచు ఇటు వచ్చినావు ?'

పంట : 'మిమ్ముల దర్శించి మీసేవ సంపాదించుటకే !"

మల్లారెడ్డి పక్కున నవ్వెను. అతని అట్టహాసము సింహ గర్జనము వలె అరణ్యమును దద్దరిల్ల జేసెను.

'నీకు కత్తిపట్టుటే రాదే: కర్రసామైన నేర్చితివా ?

'లేదు. కాని ఎట్టి పామునైనను కర్రతో ఒడుపుగా కొట్టగలను, బాబా! '

'నిజమా? ఏనీ, ఇదిగో పాము! కొట్టు దీనిని !'

ఇట్లనుచు మల్లారెడ్డి తన యనుచరులలో నొకనియొద్ద నున్న పాశ మందుకొని, దానిని ఆకాశములోని కెగురవేసి చురుకుగా పామువలె నాడింప సాగెను. అది యాడుచు పంట పైకి మెరపుతీగ వలె వచ్చుచున్నది,

దాని కదలికలు మెలకువతో నుపలక్షించుచు పంట తన చేతికర్ర గట్టిగా పూనినాడు. కదలక నిల్చినాడు. ఆ పాశగ్రంధి ఆతని హృదయమును కాటు వేయుటకు వలె దూకినది. పంట చెంగున గంతువేసి ప్రక్కకు తొలగి, ఆత్రాటిచివర నున్న పెద్దముడినే గురిచూచి గట్టిగా కర్రతో కొట్టి పడవేసినాడు.

'భళి భళీ!' అనుచు మల్లారెడ్డి యీమారు పంటను కౌగిలించుకొన్నాడు. నీకు పదిమంది అనుచరుల నిత్తును, వారిని పోరులలో నడిపింపగలవా ?'

'మెరక భూమిలో నాగలితో కొండ్రలు సమముగా వేయుట నా కను భవమే, బాబా !'

'తగినవాడవే దొరకినావు. శత్రుసేనలలో కొండలువేసి దున్నివేయగల పంటరెడ్లకై నే నెదురు చూచుచున్నాను.'

'ప్రభూ, నేను పంటరెడ్డిని. నా పేరు పంట.'

మల్లారెడ్డి యాశ్చర్యపడుచు, 'మన కీనాడు అదృష్టము పట్టినట్లున్నది. విన్సన్నా, విన్నావా?' అనెను.

పంటరెడ్డి అందుకొని, 'మే మీనాడు దారిలో నిజముగానే నక్కను త్రొక్కి వచ్చినాము' అనెను.

మల్లారెడ్డి: 'విన్సన్నా, ఇతని మాటలు విన్నావా? ఈతనికి ఆయుధసాధన ఏమియు లేదు. చూపులోను చేతిలోను గురియున్నది. శరీరములో చురుకుదన మున్నది. ఆయుధసాధన ఇతనికి అలవడుట ఎంత పని! ఈతడు మహాసేనలే నడిపింపగలడు, దుర్గము దుర్గములే లక్షించి నిర్మింపగలడు - మరచినాను, పంటరెడ్డీ, నీకు ధనుఃప్రయోగమైన అభ్యస్తమేనా?'

పంట: 'కాదు కాని నా వడిసెలయు ఉండేలుబద్దయు ఎన్నడు గురి తప్పవు. పరీక్షింపవచ్చు, ప్రభూ!'

మల్లారెడ్డి: 'అక్కరలేదు. నీ మాటలో అబద్ధము రాదు. సరేకాని మీ వారు, ఈ బాపనివారు ఎక్కడ?'

పంట: 'సమీపముననే బాబా!'

వెంటనే మల్లారెడ్డి యాజ్ఞగొని పదిమంది యనుచరులు పంటరెడ్డితో కలసి వారిద్దర కుటుంబములను తేరబోయిరి.

మల్లారెడ్డి తన దృష్టి యా యాత్రిక తండమునపై బరపెను. అది చంచలముగా ప్రసరించి ప్రసరించి తుదకు భీమయువకునిపై నిలిచినది. అందుకే నిరీక్షించుచున్న ఆతడు భయభక్తులతో వెంటనే నమస్కరించెను.

మల్లారెడ్డి : 'వీ రందరు నెవరు ?

భీమయువకుడు : 'ఎరుగను ప్రభూ, నేను మీకొఱవునకై వెదకికొనుచు వచ్చుచుంటిని. నా తల్లిదండ్రులను దారిలో యవనులు సంహరించిరి. ఆ సమయములో సరిగా కొంచె మావల నన్న నేను నా భార్య పిల్లవాడు వారికి గనపడక పోవుటచే ప్రాణములు దక్కినవి. జీవచ్ఛవములమై సాగి వచ్చుచుండ దారిలో నిన్నటి మధ్యాహ్నమే వీరందరు కలసినారు.'

మల్లా : 'నీపేరు, కులము ?'

భీ.యు 'నాపేరు దేసటిరెడ్డి. కులము నదే!'

మల్లారెడ్డి అబ్బురముతో గూడిన కృతజ్ఞతా భావముతో విస్మనవంక జూచుచు నిట్లనెను.

'ఏమయ్యా, నీ వెంత మహానుభావుడవయ్యా ! నీ వన్నట్లు పంటరెడ్డి దేసటిరెడ్డి కలసినారు! ఇక ఎవరు, మా వంశము అదృష్ట భావమునకు కలియ వలసినది? ఎర్ర-ఎర్ర-ఎర్రగా నున్నా డీ బాప డాపేరింటివాడై యుండునా?'

విస్మన చిరునవ్వు నవ్వెను.మల్లారెడ్డి కా విప్రునిపేరు తెలిసికొనవలె ననిలోలోందరగా నున్నది. ఆ భూసురుని కింకను స్మృతి రాలేదు. అక్కడ నున్న వారందను ఆతనిపేరు ఎరుగ మనిరి. ఎరిగిన పంటరెడ్డి అక్కడలేడు. మల్లారెడ్డి మనస్సులోని ఉత్కంఠాతిశయము గమనించి, ఆ బాపనినే అడుగుమని విస్మన పలికెను,

ఆయువకుని జూచినప్పటి నుండియు మల్లారెడ్డికి హృదయములో నుండి కొంత గౌరవముతో కూడిన ప్రేమ యుబికి వచ్చుచున్నది. ఎన్నో జన్మాంతరములనుండి అనుస్యూతమై వచ్చుచుండిన గాఢస్నేహ మొక్కసారిగా ఈ నాడాతనిలో ఉద్బుద్ధమై నట్లున్నది. స్మృతి తప్పియున్న యాతని పలుకరించిన యెడల బాధ కలిగింతునేమో యను సందేహ మొకవంక పీడించుచున్నది. అయినను అతడు మనస్సు నుండబట్ట జాలక, ఎట్టకేలకు విప్రుని పాదములు

ముట్టి, గగుర్పాటు నొంది, తన హస్తముతో మృదువుగా కదలించి, 'బాప నయ్యా, బాపనయ్యా!-' అని ప్రేమ గద్గదమగు కంఠముతో పలుకరించెను.

ఆ కంఠములోని యార్ద్రత ఆ యువకుని నుజ్జీవింపజేసి నట్లున్నది. అతడు హీనస్వరముతో 'ఊ!' అనెను.

ఈ మారు మరికొంచెము ధైర్యముతో మల్లారెడ్డి ప్రశ్నించెను. 'బాప నయ్యా, నీపేరేమో చెప్పు, బాపనయ్యా!'

'ఎర్రయ్య అందురు!'

మల్లారెడ్డి సంతోషాతిశయముతో ఉలికిపడినట్లయి ఒక్కగంతు పెట్టెను.

'విస్సన చెప్పినది వేదము!'

ఆ మాటలకు విస్సన ముసిముసి నవ్వులు నవ్వెను.

ఆకాశములో హంసల పిండొకటి మనోజ్ఞముగా పారుచు మధుర గంభీరముగా ఓంకారనాదము లొనర్చెను.

6

మల్లారెడ్డి కొంతవడి ఆనందతన్మయు డైయుండి, ప్రకృతవిషయములకు ప్రయత్నపూర్వకముగా మనస్సు మరల్చుకొని ఇంచుక విసువుతో యాత్రికుల వంక నొకమారు తేరి చూచెను. వారిలో పడుచు వారెవ్వరును ముందుకు రాలేదు. ఆ రాత్రి జరిగిన విపరీతఘటనలతో వారికి మతులే పోయినట్లున్నవి. ఏ క్షణములో ఏ ప్రమాదము వచ్చునో అనుభయమే వారిని వేధించుచున్నది. వారిలో ఏ కోశమునను ధైర్యసాహసములే కనబడుట లేదు. ఇప్పుడు మాత్రము మరల యవనులు రారని నమ్మిక మేమి? వార లందరలో వృద్ధుడు వచ్చి మల్లారెడ్డిని దీవించుచు ఇట్లు నివేదించెను.

"మమ్ములను కాపాడిన మీకందరకు సిరిగిరి మల్లన్న మేలుకలిగించుగాక! నాయినా మేమందరము తలకొక షష్టి కొండ్ర దున్నుకొనే వారమే. పండించిన పంటలో సగము పన్ను పేరుపెట్టి యవనభటుల తండ మొకటి ముందు తీసుకొని పోవును. ఎక్కువే అయినను పన్ను కదా యని ఎట్లో సరిపెట్టుకొని

అప్పటి కది సంతోషముతోనే ఇత్తుము, అంతలో మరియొక తండము వచ్చి మరల పన్ను చెల్లింపు డని బలవంతము చేయును. పన్ను ముందే ఇచ్చినామని చెప్పినను నాయకు డాలింపడు సరికదా ముందువచ్చిన వాడు మావంటి దొంగయే అవియు, మేము అబద్ధ మాడుచున్నా మనియు దౌర్జన్యముచేసి ఉన్న సగములో సగ మెత్తుకొనిపోవును, మరి కొద్దిరోజులకు మరియొక తండ మట్లే వచ్చి ఆ మిగిలినదానిలో సగ మట్లే తీసికొనిపోవుచు, పైపెచ్చు, 'ఇంతేనా పండిన పంట? పంట దాచినారు!'అని పైబడి మమ్ము కొట్టవచ్చును. వీని కన్నిటికి దోడు మధ్యమధ్య యవనతండములు గ్రామము పైట విడిసి, అందులో నివారి కాహారము కావలెనని భటులను బంపి మూలమూలల దాచుకొన్న ధాన్యాదులు బలవంతముగా నెత్తుకొని పోవుదురు. ప్రజలు చెప్పి కొంద మన్న మొఱాలకించు నాధుడు కనబడడు. ఒకడు తీసికొన్నది రెండవ వా డంగీకరింపక పంటల పశువుల గూడ నెత్తుకొనిపోవును.అంతటితో నైన నూరకొనక ఇంకను పంటలు పదిలపరచితి మని చొరబడి ఇళ్ళు వాకిళ్ళు దొడ్లు గాలింతురు; స్త్రీ పురుషులను బాలవృద్ధులను నానాహింసలు పెట్టుదురు. అన్నిటికి దోడు దొంగలు. దరిద్ర బాధ పెచ్చుపెరుగుటచే వారి బాధ యతిశయించినది. ఇట్టికష్ట దశలోగూడ ఇళ్ళు వాకిళ్ళు, ఉన్న కొంచెము కొండ్ర వదలజాలక, వారినే కాళ్ళా గడ్డములు పట్టుకొని బ్రతిమాలియు, వారి మూటలు ముల్లెలు మోసిపెట్టియు, వారు దయ కలిగి ఏమైన ఇచ్చినచో, ఆ కొంచెమే పదివేలుగా భావించి సంతోషించుచు. ఈహుకాల మెట్లో ఒంటి ప్రొద్దుల తో పొట్ట గడుపుకొంటిమి. తుదకది దుర్భరమైనది. ఇక నిలువలేక, అలో లక్ష్మణా అని ఏడ్చుచు ఇళ్ళు వాకిళ్ళు పొలము బుట్ర పశువులు - సమస్తము వదలి ఆకు లలమలు తినియైన నిర్భయముగా బ్రదుక వచ్చునుగదా అను నాశతో అడవులు పట్టినాము, తండ్రీ!—చివరకు ఇక్కడికి కూడ మేము చేసిన పాపము వదలక వెన్నంటి వచ్చినది!—"

దుఃఖకథ నాత డింకను పొడిగించుచునే యుండెను. మల్లారెడ్డి కిట్టిది వినుట మొదటిమారు కానందున కొంచెము విసువుతో అడుతగిలెను.

"తాతా,ఇక్కడ వ్యవసాయము చేయదలచినవారికి భూమి సిద్ధముగాలేదు చూచుచుంటివి గదా, మహారణ్యము, కొండరాళ్ళు; చెట్లు చేమలు కొట్టి చదును చేసినచో కొంతభూమి పండించుకో వచ్చును గాని అందుకు వ్యవధానము

కావలెను. అంతవరకు జీవించు పెట్లు? ప్రస్తుతము శత్రుకాంతారములు నరకి వేయగల వీరు లవసరము!"

ఆ మాటలకు భయముతో వడకుచు వృద్ధు డిట్లనెను: "మాకు పోట్లాటలే ఇష్టములేదు. ఊరిలో దుష్టులకు దూరము తొలగి ఉండెడివారము !"

మల్లారెడ్డి: "తాతా, నీబోటి వృద్ధులను, కొందరు అబలలను, బాలురను ఎట్లో ఒక విధముగా పోషింప వచ్చునుగాని, నీతో బాటుగా ఈ పడుచువారిని ఊరక మేపుట సాధ్యపడునా ?"

వృద్ధుడు : 'పుల్లలు కొట్టుకొనియో, పశువులు కాచుకొనియో బ్రతుక లేరా, బాబా ?'

మల్లారెడ్డి జాలితో నవ్వెను. 'ఈ అరణ్యము లోనీ పిల్లలు కొట్టిన కట్టెలు ఎపరికి కావలె తాతా? పశువులు కాయుటకైనను చిరుతగండ్లను, పెద్దపులు లను, తోడేళ్ళను ఎదిరించు సాహసముండని దిక్కడ సాగదు !'

ఆ వృద్ధుడు నిరాశాదృక్కులు తండములోని స్త్రీలవంక బరపెను. వారు బ్రతిమాలినచో మల్లారెడ్డి కఠిన హృదయము కరగునని ఆతని ఆశ.

ఇతరస్త్రీలు తమ ఏడుపుల గోలలో ఏమియు కల్పించుకొనలేదు. దేసటి రెడ్డి భార్యమాత్రము ఆవేశముతో ఒడలంతయు కంపించుచుండ, రోషముతో కందగడ్డవలె నెర్రనైన ముఖముతో, శిలచాటుకు వడి వడి వచ్చి ఓరగానిల్చి ఇట్లందుకొన్నది :

"తాతా, మనమంచి తనమీ నాడేమి అక్కరకు వచ్చినది? ఆ రాక్షసుల నెంత బ్రతిమాలి నా మీ రాత్రి ? ఏమి లాభించినది? దేవతల వలె ఆ పడుచు వా రిద్దరు రాకున్న మనము బ్రతికెడివారమేనా ?"

తండములోని స్త్రీలందరు తమ యేడ్పులెట్లో ఆపుకొనుచు. నిజమేయని యందుకొరి. ఆ రాత్రి సంఘటనలచే వారు మొండి చరచిరి. దానితో దేసటి రెడ్డి భార్య ధైర్యము వహించి మల్లారెడ్డికి దండము పెట్టుచు నిట్లన్నది. "రెడ్డిబాబూ, మీరు నా అన్న వంటి వారు. ఆడుదానను. ఎదుటబడి మాటలాడు చున్నందుకు మన్నించండి : నారాయణమూర్తివలె మమ్ము మీ రీనాడు రక్షించి తిరి. నాబిడ్డను కాపాడు కొనుటకై, ఆ రాక్షసుని కాళ్లు పట్టుకొని బ్రతిమాలు

కొనగా, వాడు నా చేతిలోని ఈ పసిపాపను లాగి నేలమీదికి విసరినాడు బాబూ, నే నాడుదాననే. నాబిడ్డను కాపాడండి, చాలును. నాకు సాము నేర్పండి! పది మంది యవనులను హతమార్చి సంతోషముతో ప్రాణములు వదలెదను."

ఆ సాహస వచనములు విన్న వా రందరి ఒడళ్లు జలదరించెను. మల్లా రెడ్డి కన్నుల నీరు గిర్రున దిరిగినది. విస్మన సంతుష్టనీక్షణము తండము వంక బరపెను. వనిత లందరు ఆ వీరనారి నగ్గించు చున్నారు అప్పటికి యువకులలో గూడ మార్పు వచ్చినది. వా రొక్కరొక్కరే, 'మాకు కత్తిసాము నేర్పండి! మీకు యుద్ధములలో తోడయ్యెదము!' అని ముందుకు వచ్చుచుండిరి.

మల్లారెడ్డి దేసటి భార్య పాదముల వంక దృష్టి పరపుచు నిట్లనెను: "అమ్మాయీ, నాకు అప్పచెల్లెండ్రు లేరు. ఆ సౌభాగ్య మెరుగను. ఇక నీవు మాకు చెల్లెలివే. మా అన్నమ్మతల్లి నిన్ను తన కన్న కుమార్తె వలెనే చూడ గలదు. నీబోటి వీరవనితలు మాకు మంగళవాక్యములు పలుకుచుండిన జాలును. నీ చేత యుద్ధము చేయించ వలసిన దౌర్భాగ్య మింతవరకు పట్టలేదు పట్టదు. చూచితివా. ఈ యువకు లెట్లు ముందుకు వచ్చినారో ?"

మల్లారెడ్డి కిట్టి యనుభవము పూర్తిగా క్రొత్తకాదు. నూటికి తొంబది మంది యిట్టి వారే. వారికి పూర్వము యుద్ధానుభవము లేదు, పోరన్న నే అస హ్యము. వారు మేకలు, గొర్రెల వంటి వారు. యవనుల రాక్షస కృత్యములచే వారు మొండి చరచుచున్నారు. మల్లారెడ్డి దర్శనముచే సుద్భవించిన యుత్సా హము వారిని పులులనుగా, సింహములుగా మార్చుచున్నది. ఆ మార్పు ఒక్క సారి రాదు; నెమ్మదిగా పెంపొందును. ముందు పిరికివారుగా కనిపించిన వారే కార్యరంగములో దక్షత ప్రదర్శింతురు. సాహసుల సహచర్య నాయకత్వము లచే ధీరులు వీరు లగుచున్నారు.

ఎర్రయ, పంటరెడ్ల కుటుంబములవారు ఆ రాత్రి విశ్రమించిన యెడ కనబడ లే దనియు, వారు యవనులకే చిక్కిరో, పులివాత బడిరో, అడవిలో దారి తప్పిరో, తెలియకున్న దనియు, వారి కోసమై పంటరెడ్డి వెర్రి యెత్తిన వాని వలె అరణ్య మంతయు గాలించు చున్నాడనియు భటు డొకడు వార్త తెచ్చెను, మల్లారెడ్డి క్షణకాల మాలోచించి అనుచరుల కిట్లా జ్ఞాపించెను:

"ఎర్రయను శ్రీ శంకరస్వాముల యాశ్రమమునకు చేర్చి ఉపచారములు చేయింపుడు: గాయము లైన యువకులను పదకొండవ నిలయమునకు, మిగిలిన వారిని నలువదవ గరిడీకి చేర్పుడు:-"

ఆ యాజ్ఞలు ఇచ్చుచుండగనే భటు లవి నిర్వర్తించుచుండిరి. కర్రలతో సవారివలె కట్టి దానిపై ననాయాసముగా ఎర్రయను తీసికొని పోయిరి. మల్లారెడ్డి స్త్రీ బాలవృద్ధుల సంగతి యాలోచించుచుండెను.

తెల్లవారుచున్నది. పంటరెడ్డియు నతని నెంట వెళ్ళిన వారును తిరిగి వచ్చి ఆ రెండు కుటుంబముల జాడ కనబడలేదని విన్నవించుచుండగా, పంటరెడ్డి నిలువున కూలబడిపోయెను.

ఆత డట్లు కూలబడినది కేవలము దుఃఖావేశముతో నని తలంచి, మల్లారెడ్డి యనాదరముతో గూడిన విసువుతో, 'ఇతని సంగతికూడ చూడు, విస్సన్నా!' అనెను.

'ఇతనిని చూచు న దేమున్నది? ఆహారము, విశ్రాంతి! ఈ పూటకు పాలు, తేనె, నిద్ర, మధ్యాహ్నము కడుపునిండ అడిగిన భోజనము! - అంతే!'

ఈ లోపున దేసటిరెడ్డి తన భార్యతో సంప్రదించి మల్లారెడ్డితో నిట్లనెను: మల్లప్రభూ, శరణార్థులై వచ్చు స్త్రీలు వృద్ధులు మనకు భారము కాగలరు! వారిని రోగులను, గాయపడిన వారికి ఉపచరించుటకు ఉపయోగింప వచ్చును. మరియు యోధులకు వస్త్రములు, మెత్తలు, పటకుటీరములు, భోజనసామగ్రులు- ఇత్యాద్యవసరద్రవ్యములు సమకూర్చుటకు స్త్రీల దళ మొకటి యేర్పాటుచేసిన నెట్లుండును?,

మల్లారెడ్డి ఉత్సాహముతో విస్సన వంక జూడ నాతని ముఖమును ప్రసన్నముగా కనిపించెను.

'విస్సనమంత్రీ! దేసటిరెడ్డి సూచన నాకు దివ్యోపదేశముగా స్ఫురించుచున్నది. ఇది దేవకార్యము వలెనే నిరాఘాటముగా సాగిపోవుచున్నది.'

విస్సన: 'ఔను. ఆ దళమునకు దేసటిరెడ్డి భార్యయే అధిపురాలుగా నుండ దగును! నీ పేరేమి, తల్లీ?'

'వీరమ్మ!' అన్న దా వనిత సిగ్గుతో.

దేసటి : 'చండిక వలె యుద్ధము చేయుటకై వీర నారీదళ మొకటి సిద్ధము చేయనే ఉత్సహించు చున్నది.

విస్సన . 'మంచిదే కాని వెనుకసుండి సర్వము సిద్ధము చేయుచుండి నచో చాలును ! - వీరమ్మ పేరు సార్థకము కాగలదు, తల్లీ !'

బాగుగా తెల్లవారినది. మల్లారెడ్డి యిట్లనెను :

'దేసటిరెడ్డీ, నీ వీ నాడే మా దేశ మన్ని మూలలు పోయి చూచి ఆక ళింపు చేసికొనుము. ఈ తోయ త్వరలోనే స్కంధావారముగా మారగలదు. నీ పత్నిని మా అమ్మగా రున్న స్థానమునకు ఈ స్త్రీ బాల వృద్ధులతో చేర్చవలె. విస్సన మంత్రీ, నీవా ? స్నాన సంధ్యాదులకు తొందర పడుచున్నా వని నీ ముఖమే చెప్పుచున్నది. పంటరెడ్డి, ఎర్రయ్య కుటుంబములజాడ నాకు త్వరలో చేర్చవలె. వారికై అడవి యంతయు గాలింప వలె సుమా !'

ఈ చిన్ని మాటలు తన దళపతికి చెప్పుచునే, మొదట వచ్చినంత యాకస్మికముగా మల్లారెడ్డి అరణ్యములోని కదృశ్య డయ్యెను.

వేంగినాటిలో ప్రజల స్థితి దుర్భరముగా నున్నది. గోదావరి కుత్తరము నను దక్షిణమునను గల భూము లన్నియు యవనుల యలజడికి గురియైనవి. అక్కడి జనములు భద్రాచలారణ్యములకు వలసలు పోవుచున్నారు.

అదృష్ట వశమున గోదావరి లంకలలో నున్న కోనసీమ కా బీభత్స కాండ యంతగా ప్రాకలేదు, యవనులకు నౌకలు లేవు, నౌకా నిర్మాణము వారెరుగరు. పడవలు నడపు వా రెక్కడి వా రక్కడ ప్రాణభీతిచే తలలు దాచు కొన పారిపోయిరి ఎందే నొకచో లభ్యమైన కొలది పడవలతో పెద్దయెత్తున నా లంకల లోనికి బోవుటకు యవన భటులు సాహసించుట లేదు, అయినను కోనసీమ లోని చిల్లర నాయకులకు భయ మావేశించినది. అగ్రహారములలో నలజడి యారంభించినది.

అక్కడ కరాపర్తి అను నగ్రహార మున్నది. దాని కగ్రణి బొల్లన. తన చెల్లెలు పోలమయు చిన్ని తమ్ముడు సూరనయు నివసించుచున్న పాకనా

టిలో నలజడులు విస్తారముగా రేగుచున్న వని వార్తలు బహుకాలము నుండి వచ్చుచుండుటచే ఆతని మనస్సులో తాపము చెలరేగు చున్నది. ఈ మధ్య కొన్ని మాసముల నుండి వారి యొద్దనుండి వార్తలే లేవు. పైగా ఏమేమో విపరీత వార్తలు మధ్యమధ్య చెవుల బడుచుండుటచే ఆతని భార్యా పుత్రాదులు వడకిపోవు చుండిరి.

అగ్రహారాగ్రణులకు ఎక్కడికి బోయినను గౌరవాదరములకు కొదువ లేదు. లోకము తలక్రిందు లగుచున్నదని ఎన్ని వాడుకలు వినవచ్చుచున్నను అది యింకను స్వానుభవమునకు రానందున, వానిపై బొల్లనకు విశ్వాసము లేదు. అతడు అధైర్య మెరుగడు. అతడు మహాలయ పక్షముతో తన చిన్న సోదరునికి, చెల్లెలికి పంపిన వార్తాహరు లేలనో తిరిగి రాలేదు.

అతడు శరన్నవరాత్రములలో శ్రీదేవ్యర్చనము దీక్షతో కావించెను. కలశోద్వాసన మైనప్పటినుండియు ఆతని గుండెలలో గుబులు వలె విచారము ముంచుకొని రా సాగినది. చెల్లెలిని చిన్నతమ్ముని వారి కుటుంబములను ఆపదలో నాదుకొని, అవసరమైనచో తనయింటికి తెచ్చి పోషించుట తన విధి కాదా? కుటుంబములో తాను జ్యేష్ఠుడు, అగ్రహారమునకు అగ్రణి!

అత్యవసరములైన పనులు వడివడి దీర్చుకొని యాతడు ప్రయాణమునకు సిద్ధమగుచుండెను. ఆతని భార్యకు పిల్లలకు అది ఎంతమాత్రము నిష్టములేదు. ఆరోజులలో పాకనాటికి ప్రయాణమైన వారు తిరిగి వచ్చుట దుర్లభమని వారు వినియుండిరి. కాపురమునకు వచ్చినదాది ఎన్నడులేని విధమున ఆతని భార్య చిత్రముగా ఇప్పుడాతని ప్రయాణము నిషేధించినది. బొల్లనకు ఆగ్రహము వచ్చినది.

'మీ మాటకు ఎన్నడు ఎదురాడి ఎరుగను. మీ రీ ప్రయాణముచేయుట నా కే మాత్రము ఇష్టములేదు.'

బొల్లన విభ్రాంతుడయ్యెను. తనమాట కెదురు ఇంతవరకు ఎదురు చెప్పి ఎరుగరు. అందులో తన భార్యయా? ఆతనికి రోషాశ్చర్యములతో కొంతవడి మాటయే రాలేదు.

'నీ ఇష్టానిష్టము లడిగితినా?'—ఇట్లనుచు నాతడు ముఖము చిట్లించి ఆవేశముతో నావలి కేగుచుండెను.

మండువాలో నతని జ్యేష్ఠపుత్రుడు భీమన్న సందేహించుచు గద్గదస్వరముతో పలుకరించెను.

'నాన్నా!'

'ఏమిరా?'

'నీ ప్రయాణ ప్రయత్నము బాగుండలేదు!'

ముఖము జేవురింప కోపముతో కాళ్లు పడకుచుండ నతడు వాకిటిలోనికి గంతుపెట్టగా, అక్కడ అతని ఎనిమిదేళ్ళ ముద్దుల కూతురు శ్రీదేవి దిగులు చూపులతో కాళ్లు చుట్టగించినది.

'ఏమే తల్లీ? - నిన్నెవరైన ఏమన్నా అన్నారా?'

'లేదు నాన్నా!'

'మరేమిటమ్మా?'

అది వచ్చుచున్న కన్నీళ్ళు తుడుచుకొనుచు, 'నాన్నా' అని ఆపైన మాట రాక ఆగినది.

తండ్రి దానిని బుజ్జగించి చేతుల నెత్తుకొని రొమ్ముకు హత్తుకొన్నాడు. కొంతవడి కది ధైర్యము తెచ్చుకొని అన్నది:

'నాకు దిగులుగా ఉన్నదే, నాన్నా - నీవు ఊరికి వెళ్లుచున్నావంటే ఊరంతా ఏమో ఏమోగా చెప్పుకొనుచున్నారు.'

బొల్లనకు నిప్పులమీద అడుగు పెట్టినట్లయినది. అందరు ఇట్లనుచున్నారేమి? అంతలో చేతులు నులుముకొనుచు అతని పెద్దపాలేరు అక్కడికి వచ్చెను.

'బాబయ్యగారూ, ఈ చోద్య మేమిటండీ?'

'ఏమిటిరా?'

'ఎవరైనా కష్టము కావలె నని కోరి తెచ్చుకొందురా?'

'కష్టమేమిరా?'

'అందరు అనుకొనుచున్నారు, అబ్బో! - ఆ తురకల దేశము వెళ్ళవద్దండి, బాబూ!'

బొల్లన త్రుళ్ళిపడెను. ఈవేళ నన్నందరు ఎదిరించవారే యని కోపము వచ్చినది. అంతేకాని అతని వనస్సుకు జంకకాని కొంకుకాని కలుగలేదు. ఏమిటీ అపశకునపరంపర, అని యైన నాతనికి తోచలేదు. అయినను అత డా నాటికి ప్రయాణ మాపకొని మరునాడు చీకటితో లేచి భార్యను పిల్లలను లేపి ఐదారు నెలలలో తిరిగి వత్తుననియు, అంతవరకు ఇంటి వ్యవహారము లన్నియు తన తమ్ము డగు జన్ననతో సంప్రదించి చూచుకొనవలసిన దని అప్పగించి బయలుదేరెను. ఈ నా డాతని కెవరు నెదురాడలేదు.

సాయంకాలమున నాతడు వశిష్ట గోదావరి నుత్తరించి చీకటి పడుచున్న వేళకు దొడ్డిపట్ల గ్రామము చేరికొనెను. ఆ యగ్రహార మాతడు మున్ను బాగుగా నెరిగినదే. కాని దాని నిప్పుడు చూడగా అతనికి ఆ గ్రామమేనా యిది యని సంశయ ముదయించుచున్నది. వేదపాఠములు చెప్పు ఉపాధ్యాయులతోడను. వల్లించు విద్యార్థులతోడను, శాస్త్రప్రసంగములతోడను, పురాణ ప్రవచనముల తోడను కలకల లాడుచుండెడి ఆ గ్రామ మేనా ఇదిగ పరదేశు లెవరైన గ్రామ ములో నడుగు పెట్టినంతనే ఆతిథ్య మిచ్చుటకు అక్కడి బ్రాహ్మణులు 'మా యింటికి దయచేయవలసినది, మా యింటికే దయచేయుడు!' అనివం తులు పడుచు ఆహ్వానించెడివారు.

ఈ నా డక్కడ వేదనాదమే వినవచ్చుట లేదు. శాస్త్ర పురాణ ప్రవచన ములు లేవు. ఆతిథ్యమునకు తన్ను రమ్మన్నవారు లేరు. గ్రామములో మనుష్య లున్న జాడయే లేదు. ఆశ్చర్యపడుచు బొల్లనయే ఆ యగ్రహారాగ్రణియగు అన్నయ్య యింటికి బోయెను.

అది దివాణము వంటి పెద్దలోగిలి. వాకిటి లోని యరుగుల పై నెవ్వరు లేరు. తలుపులు తీసియే యున్నవి. లోపల దీపము వెలిగించిన జాడయే లేదు. ఆతడు పందేహించుచు కొంతసేపు నిలిచి, 'ఎవరమ్మా, లోపల' అని ప్రశ్నిం చెను. దానికి జవాబు రాలేదు. కొంత తడవాగి మరల నటే కేకవేసెను. ఈ పర్యాయమును జవాబు రాలేదు. మూడవ మా రట్టే ప్రశ్నించినను ఉత్తరము రామిచే నాశ్చర్య పడుచు నాతడు వెడలి పో బోవుచుండెను. సరిగా నప్పుడేకో ఇంటిలో నించుక యలికిడి కాగా నాతడు నిరీక్షించుచు నించుకవడి యాగెను. మరల నిశ్శబ్దము!

మరల నాతడు బయలుదేరెను. మరల నింటిలో నలికిడి.

ఆతని కి కొంచెము విభ్రాంతి కలిగెన. ఈయింటిలో నున్నది మనుష్యులా పిశాచములా? చిత్రమైన ప్రాకుడు వీపు వెంట ప్రాకి నట్లయినది. అది యొక చక్కిలిగింత, ఒక బెదరు, ఒక స్పందనము. అది ఒడలెల్ల ప్రాకినది. అతడు భయమెరుగడు. పరికి దనము వారి యింటలేదు, కాని చిత్రమైన ఆ యాపరి యపూర్వపరిస్థితి ఆతని కవ్యక్తమై ఏయ సదృశ మగు నూతన భావ మావే శింప జేయుచున్నది. కలవైవ మగు శ్రీలక్ష్మీనృసింహ స్వామిని ధ్యానించుచు నాత డిట్లు పెద్ద గొంతుతో ప్రశ్నించెను.

'ఎవ రది?'

'బాబూ, వెళ్ళిపోవుచున్నావా?—' అది యొక స్త్రీ కంఠము. గద్గద ముగా వినవచ్చినది.

'అమ్మా, ఎవ్వరు కనిపింపక పోగా వెడలుచున్నాను?'

'బాబూ, ఎవరో నీవు, ఇక్కడి స్థితిగతు లెరుగ నట్లున్నావు. భయ ముతో దాగుకొన్నాను. తొంగి చూడగా సౌమ్యమైన నీముఖము కనబడి ధైర్యము కలిగినది—మా వాని వార్త ఏమైన చెప్పగలవా?'

బొల్లన నివ్వెరపోయెను.

'అమ్మా, నాకు అర్థము కాలేదు. ఈ గ్రామములో మనుష్యులులేరేమి? అభ్యాగతులను మాయింటికి మాయిటి కని పంతులుపడి యాహ్వానించు ఈ యగ్రహారములో నన్నీనాడు పలుకరించిన వారే లేరేమి?'

'అయ్య బాబూ! మాగతి ఇట్లు పట్టినది!'

'ఏ మైనది?'

'తరకలు వచ్చి ఈ ఊరిపైన పడినారు.'

'ఎప్పు డమ్మా?'

'ఈనాటి ఉదయమే.'

'పురుషు లే మైనారు?'

'బాబూ, ఏమని చెప్పేది—నీ వెఱవో -'

'భయము లే దమ్మా! - కరాపర్తి అగ్రహారాగ్రణిని బొల్లన్నను, మీ యింటికి వచ్చిన వాడనే!'

'అయ్యో, నాయనా, మా యింటి లో ఈరోజు పొయ్యి రాజలేదు - గాని మీ బోటి అతిథులను ఊరకే పోనిచ్చినచో ఎంత పాపము వచ్చును తండ్రీ! పూర్వజన్మలో ఎంతపాపము చేసినామో! - నీవు వెళ్ళవద్దు!-

'అమ్మా, నాకు ఆకలిలేదు. జరిగిన విషయమేమో చెప్పు తల్లీ!'

'అట్లుకాదు, నాయనా! మచ్చు మీద అటికలో అటుకు లున్నవి. అవియే మా కీ నా డాహారము. నీవును కొంచె మవి షచ్చుకో!- ఓయటి తలపు లాగి లోపలికిరా-!'

బొల్లన చిత్రములోని ప్రతిమవలె ఆమె చెప్పినట్లు లోనికి బోయెను. ఎనుబదేళ్ళ వృద్ధురాలు పెరటిలో నూతి వద్దకు దారి చూపి సడిచేయ వద్దని రహస్యముగా చెప్పినది.

బొల్లన పాదప్రక్షాళన మొనర్చి, చీనాంబరము ధరించి సంధ్య వార్చి లోనికి వచ్చెను. ఆప్పటి కా వృద్ధురాలు అడుకులు తీసిపెట్టి సందేహించుచు నిలుచున్నది.

'ఏ మమ్మా, సందేహించుచున్నావు?'

'మజ్జిగచుక్కైన ఇంటిలోలేదు, నాయనా!- ఆ పాపిష్ఠివాళ్ళు కనపడ్డ కుండలు బానలు అన్నీ పగులగొట్టి పోయినారు. ఇవ్వాళ పాలుతీసినవారేలేరు!

'ఎవరో, జరిగినదేమిటో చెప్పు తల్లీ! నానబెట్టుటకు అటుకులలోనికి నాకు నీరే చాలును!'

ఆమె నీటిలో అడుకులు పోసి నెమ్మది నెమ్మదిగా కథ సాగించినది.

'బాబూ, నీ విప్పుడు గుర్తుకు వచ్చినావు. మతి చెడిపోయినది. నాయనా నిన్నటిరాత్రి నిద్రించువరకు ప్రపంచమంతా యథాప్రకారముగానే ఉన్నది. తెల్లవారిన తర్వాత ఇప్పటివరకు జరిగిన కాలము ముప్పది గడియలే అంచే నమ్మ రా కున్నది. నూరేళ్ళు గడచిపోయి నట్లున్నది—

తెల్లవారు జాముననే ఏదో పెద్దగోల దూరముగా గోదావరి ఒడ్డున విన బడ్డది. ఏమిటో ఆని మా వాడు అదరిపడి పక్కమీదినుండి లేచినాడు. ఎవరో

పాప మాపదలో నున్నారని ఊరివారిని లేపినాడు. కాపు కావలులు కలసికొనిరి. అందరు కూకుకొని బయలుదేరి వెళ్ళి చూడగా వారి కెదురైనది ఆర్తులుకారు. యుద్ధోన్మత్తులైన తురకలు. ఆ తురకలు కాపుల నందరను నరకివేసి పిమ్మట పెద్దలు నందరిని మూర్ఖముగా బంధించినారట తరువాత వారిని డబ్బు తెమ్మ నిరట!'

'ఎంత డబ్బు? ఎందులకు?'

'వారి బొందలమీద పెట్టుకొనను. ఊరి వా రాలోచించుకొని వేయి రూప్యము లిత్తుమని చెప్పగా, తురకలు పదివేలు కావలె ననిరట. అంత తే లేమని ఎంత చెప్పికొన్నను తురకలు తగ్గలేదు.

'పెద్ద లాలోచించుకొనిరి. అంత ధన మీ గ్రామములో పుట్టించుట అసాధ్య మనిపించినది వారికి. ఆ మాట యవననాయకునికి చెప్పివేసిరి. వాడి పేరు అలావదీ నట! వాడు శిష్టులైన బ్రాహ్మణుల యింట పుట్టినవారి వలెనే స్వచ్ఛముగా మాట్లాడు చుండుటచేత, ఊరి పెద్దల కించుక ధైర్యము వచ్చిన దట, తమ ప్రాణము తీసినను వా రంత ధనము పుట్టి ప లేమని ఖండితముగా చెప్పివేసిరి. అలావదీను కహకహ నవ్వగా బ్రహ్మరాక్షస్సును చూచి నట్లు వారు ఉలిక్కిపడిరట, తండ్రీ,! 'ఓహో, చూచెదను,' అన్నాడట వాడు!

'వెంటనే అతని కనుసన్న అందుకొని కరకు తురకభటులు మా వానిని మిగిలిన పెద్దలను పట్టుకొని చంపుటకు సిద్ధపడిరి. అప్పుడు నాయకుడు పకపక నవ్వుచు, 'ఇప్పుడు పదివేలు ఇవ్వలేరా?' - అనెనట!

'వెంటనే మా వాడు ఇట్లనెనట, 'ఆడవాళ్ళ మెడలలో సొమ్ములు తీసి యయినను అచ్చుకొందుము, బ్రహ్మ హత్య కట్టుకోకండి!' అని.

'అచ్చా! ఇరవై వేలు ఇవ్వనిది మిమ్మును అందరిని హత్య చేస్తాము,' అనుచు అలావదీను కహకహ మని రాక్షసుల నవ్వు నవ్వెనట మరల.

'మావాడు, నాయనా, నిలువున వడికిపోయినాడట. ఏ మన్న ఏమి వచ్చునో అని భయమైనది వాడికి. ఒక్క క్షణ మాతడు సంశయించి తోడి పెద్దలవంక చూచెను. అప్పుడే రాక్షసు డది గమనించి దుష్టమైన చూపు

చూచెను. పెదలందరు ఒప్పుకొని వ్యవధి కావలె ననిరి. 'ఎంత వ్యవధి?' అని పిడుగు వలె ప్రశ్న వేసినాడటవాడు 'చిత్తము, చిత్త,' మనిరట పెద్దలు

'అందువల్ల అలావదీనుకు వారిపై తన కోపము చూపుటకు అవకాశము చిక్కలేదు. వెంటనే వాడు, 'మీరు దొంగలు, మీరు నలభై వేలు తీసికొని రాగలరు. నలభై వేలు!- ఒక్క ముహూర్తము వ్యవధి!'-ఇట్లనుచు మందిరము లోని గతియారము వంక చూచెనట!

'అగ్రహారికుల గుండెలలో రాయిపడినది. ఆ దుర్మార్గుని ఆశకు మితము లేకున్నది. ఊరిలో వెండిబంగారమంతయు ప్రోగుచేసినను అంత కాదు. వా రందరు నిస్సాహముగా నిట్టూర్పులు పుచ్చుకుంటిరి. శరీరముల చెమటలు ముంచెత్తుచున్నవి. నోట మాటలు పెకలుట లేదు. కన్నులలో నీరు గిర్రున తిరుగుచున్నది, అలావదీను అది గమనించి అతిగా పోయినానని తలచినట్లు న్నాడు. కాని అభిమాన మడ్డువచ్చినది. 'విన్నారా, ముహూర్తమే వ్యవధి! ఊరిలోకి వెళ్ళండి!'—అన్నాడట వాడు. పెద్దల బంధములు తొలగించిరి.

'నిరాశతోపాటు అగ్రహారము కప్పుకు మొడితన మావేశించినది. మూల నున్న పిల్లికి వలె రౌద్రము వచ్చినది వా రందరికి. అట్లు జరుగు నని అలావదీనుకు స్ఫురింపలేదు. భటులు నిర్లక్ష్యముగా చుట్టుపట్టుల నుండిరి.

'మా వాడు ఎగిరి దూకి ముందు అలావదీనుపై పడినాడట, నాయనా! మిగిలిన పెద్దలు భటుల కత్తులు ఒరలలోనుండి లాగికొనిరట! భటులందరు తెల్లవోయి తమ నాయకుని వదలి పారిపోగా, మా వాడును తక్కిన పెద్దలును అలావదీనును తమ ఇష్టము వచ్చినట్లు మర్దించిరట. వాడు యవనులలో కలసిన బ్రాహ్మణుడని తెలిసి బ్రహ్మ హత్యకు వెరచి, వానిని ప్రాణములు తీయక వదలి, తత్తరపాటుతో ఊరికోనికి మూడు జాముల వేళ వచ్చినారు, అప్పటికే కొందరు తురకలు ఊరిలో జొరబడి ఇళ్ళన్నియు గోల గోల చేసి వెళ్ళి ఉండిరి. ఊరిలోని ఆడువారు పిల్లలు ఎవరి చారినవారు పారిపోయినారు. గోదా వరి కావలి ఒడ్డున ఎవరో మహావీరు డున్నాడని ఆతని సాయము అర్థించుటకు మా వానితో కలసి అగ్రహారికులు వెళ్ళినారు. మా కోడలు పిల్లలతో పుట్టింట నున్నది. ప్రాణములకు తెగించి ఇల్లు వదల లేక నే నొక్కతెనే ఇక్కడ ఉన్నాను—అటుకులు నానినవి, ఇవిగో, తిను నాయనా!—'

బొల్లనకు కడుపు లో నుండి దేవుచున్నట్లు వికారము పుట్టుకొని వచ్చు చున్నను, ఆ వృద్ధురాలిని తృప్తిపరచుటకై దానినెట్లో అడచుకొని, ఆమె పెట్టిన యడుకులెట్లో భక్షించెను. ఆత డా పిమ్మట వృద్ధురాలికి భయపడవద్దని ధైర్యము చెప్పి, ఆమె యిచ్చిన తాటియాకుల చాప పరచుకొని వాకిటి యరుగు మీద శయనించి భగవన్నామ స్మరణము చేయుచు నిద్రించెను.

అర్ధరాత్రిమున నేదో అలికిడియై బొల్లన ఉలికిపడి మేల్కాంచెను. ఆ వచ్చిన వ్యక్తియు నాతడక్కడ నుండుటకు విభ్రాంతు డయ్యెను. రెండు నిముషములు గడచునప్పటికి వా రొండొరుల గుర్తించుకొని ముందు కలిగిన సంభ్రమము శాంతింపజేసికొనిరి.

ఆ వచ్చినది ఆ యగ్రహారాగ్రణి అన్నయ్య. ఆతడు తన తల్లి నక్కడి నుండి సురక్షిత స్థానమునకు రహస్యముగా తరలించుకొని పోవుట కప్పుడు వచ్చియుండెను. చుట్టుప్రక్కల చెదరియున్న తురక లందరు పెద్ద గుంపుగా కూడుకొనివచ్చి ఊరిపైబడి తగులబెట్టి పోనున్నా రని తెలిసి యాతడు మాతృ రక్షణకై తెగించి వచ్చియుండెను. అతడు తల్లి నెట్లో ఒప్పించి తనతో చేరువ నున్న పడవ కడకు తీసికొనిపోవుచు, బొల్లనను గూడ రమ్మని ఎన్నో విధముల ప్రతిమాలెను. బొల్లన మరల వెనుకకు గోదావరి దాటుటకు ఇచ్చ గింపక, ఎంత చెప్పినను వినుపించుకొనక అక్కడనే నిలిచిపోయి నిర్భయ ముగా తెల్లవారుజాముపరకు సుఖనిద్ర పోయెను.

అప్పుడు చిటపట ధ్వనులు, భగభగధ్వనులు, మధ్యమధ్య పొలికేకలు వినవచ్చుచుండుటచే, ఏవో ఇళ్లు పరశురామప్రీతి యగుచున్నవని సంభ్రమముతో నతడు లేచెను. పిశాచముల వలె నుండి చేతులలో కాగడాలు ధరించి గ్రామము లోని ఇళ్ళ కన్నింటికి నిప్పు అంటించుచున్న యవనభటులే కాని ఆతని కక్కడ గ్రామీణు లెవ్వరు కనిపింపలేదు. ఆత డున్న అగ్రణి అన్నయ్య ఇల్లు ఒక మూల నిప్పంటుకొని మండుచున్నది. బొల్లన నిర్భయముగా పెరటిలోనికి పోయి, చేతి కందిన కడవలతో నీళ్లు తోడి తెచ్చి ఆమంట చల్లార్చుచుండెను. ఆ యింటిని భక్షించుటకు సందేహించుచున్నదో అన్నట్లు మందముగా ప్రస రించుచున్న అగ్ని బొల్లన ప్రయత్నములచే చల్లారినది.

అప్పటికి తెల్లవారినది. గ్రామములోని యిండ్ల కన్నిటికి అగ్నిముట్టించి శేషమేమైన ఉన్నవేమో చూచుటకు తిరుగుచున్న తురకల తండ మొకటి

అటు వచ్చినది. కొంచెము మెరకపై వేరుగా నున్న అగ్రణి పెద్దయిల్లు చిత్రముగా తగుల బడకుండుట వారు గమనించి మరల అగ్ని రగుల్ప నారంభించిరి. బొల్లన వెంటనే నిర్భయముగా వారి నదిలించి కేకలువేయుచు అడ్డు నిలిచి కాగడాలు లాగికొనుచుండెను. మ్లేచ్ఛభటులు రౌద్రావేశముతో నాతనిపై బడి కొట్టి, పట్టి, కట్టి, ఊరిబయట మర్రిచెట్టుక్రింద నున్న తమ నాయకుని వద్ద శిక్షకై నిలువబెట్టి ఆతని యకార్యము నివేదించిరి. వా రాతని నట్లు కట్టి తీసికొని వచ్చుచుండ దారి పొడవున నాతడు వారిని క్రుమ్ముచు తిట్టుచు కేకలు వేయుచునే యుండెను. అట్లే ఇప్పు డాతడు యవన నాయకుని జూచి, 'అరే భడవా. నీవేనురా ఊరు తగులబెట్టించు చున్నది? చెంపలు పగుల గొట్టెదను!' అనెను. యవన నాయకుడు వికృతముగా పెద్దనవ్వు నవ్వెను. వెంటనే ఆతడా వెర్రి బ్రాహ్మణుని చంపివేయకుండుట చూడ భటుల కాశ్చర్య మైనది. వారిలో సూక్ష్మబుద్ధి గలవారు ఆ వెర్రి బ్రాహ్మణుని పిచ్చి కేకలకు అలావడీను చిత్రముగా జంకుచుండెనని యుపలక్షించి యబ్బురమందుచుండిరి.

8

నాలుగై దేండ్లనుండి ఆంధ్రభూమి చూడ నోచుకొనకున్న విశేషదృశ్య మీ నాడు చూడ నగుచున్నది. సమున్నతమైన మదగజముపై తీవిగా నధిష్ఠించి శ్రేష్ఠి యొకడు తెలుగుదేశమున ప్రయాణము చేయుచున్నాడు. ఎక్కడినుండి ఎక్కడికి?

అతనితో నైదు ఆందోళిక లున్నవి. వానిలో స్త్రీ జన మున్నట్లు తోచును రెండువందల మంది యాశ్వికులాతని బరివేష్టించి యున్నారు. వా రందరు కవచాచ్ఛాదితసర్వగాత్రులై ఉక్కుకోట వలె నడచుచున్నారు. వారి వద్ద శూల, ఖడ్గ, పరశు, కుంతాది సమస్తాయుధము లున్నవి. వారి డాళ్లు మిక్కిలి పెద్దవి.

వారి నడక చిత్రమగు దర్పముతో నొప్పుచున్నది. వారి కేకోశమునను తొందర యున్నట్లు తోపదు. అట్లని వా రెక్కడను ఎక్కువ యాగుటయు లేదు, జాప్యము చేయుటే లేదు. వారి కడ వర్తకము చేయు సరకులు బరువుగా

నున్నట్లు కనిపింపవు. అంతమాత్రమున సరకులు లేవనుటకును వీలులేదు. హాయములు పూన్చిన కొన్ని శకటము లున్నవి.

వారి రాకకు యవనుల మూకలు విచ్చిపోవుచున్నవి దోపిడులకై చెల్లా చెదరై గ్రామములలో పదులుగా పాతికలుగా చీలిపోయిన యవనబలములు కూడుకొని తమ్ము ముట్టడించుటకు గాని, ఎదురొక్కనుటకు గాని, వెంట బడుటకు వాడివకాశమిచ్చుటలేదు. యవను లెదురైనను మరెవ్వ రెదురైనను ఎవ్వరిని వారు వత్తిడిచేయరు. కాని తమ కెట్టి యాటంకము కలిగించినను సహింపమని నిష్కర్షగా చెప్పుచున్నవారివలె, చెప్పకయే వారు ధీరగమనముతో సాగిపోవు చున్నారు. ఎదురైన యవనులు వారికి నమ్రతతో తొలగి దారి ఇచ్చుచున్నారు. ముందు పోవుచున్న యవనులు వారిని గాంచి యాగి సాగుటకు వారికి త్రోవ యిచ్చుచున్నారు. వెనుకనుండి వారిని జూచిన యవనులు నివ్వెరతో నిశ్శబ్దముగా కన్ను లప్పగించి చూచుచున్నారు.

అట్లు నిర్భయముగా పోవుచున్న వారిని మీ యధికారపత్రము లేవి యని యడుగ సాహసించు వారే లేరు'. వారి నిబ్బరము చూడ సర్వాధికారము లున్న వారుగనే కనిపించుచుండిరి. వారు దాటిపోయిన తర్వాత ఎవరో సాహసులు, 'ఎవరు వీరు?-ఎవరు వీరు?-' అను ప్రశ్నలే ఆవల సాహసు లుత్తరముగా నిత్తురు. సాక్షాత్తు ఢిల్లీ పాదుషా వారి యనుమతి వారి కుండవలె!

చెదరిన దళములు కూడుకొని అన్యోన్య మాలోచించుకొను లోపుననే, ఆ శ్రేష్ఠి తన పరివారముతో అంద రానిదూరము సాగిపోయి యుండును. అంతలో యవనులా సంగతియే విస్మరింతురు. దానిని తరచి దూరము విమర్శ చేయుట వారికి క్షేమమును గాదు.

ఇట్లు ప్రయాణములు చేసి చేసి పూర్వవర్ణిత పోరాటము జరిగిన అరణ్య మార్గమును ఆవర్తకతండ మీనాడు చేరుకొన్నది. చీకటి పడినది. వారందించుక విశాలప్రదేశము నిర్దేశించుకొని అచ్చట రెండు పటకుటీరములు నిర్మించుకొని చినచీనాంబరాదుల తోడను, రత్నకంబముల తోడను రమ్యముగా నలంకరించిరి. భోజనాదికప్రయత్నము లొనర్చి సుష్ఠుగా భుజించిరి. ఒక పటకుటీరము లో ప్రధాన శ్రేష్ఠియు, రెండవదానిలో స్త్రీజనమును ప్రవేశించిరి. మిగిలినవారు ఆరుబయటనే ఉచిత స్థానములు చూచుకొని విశ్రమించిరి.

కొందరు మాత్రము ప్రహరలప్రకారము తిరుగుచు ఆ విడిదలను కాపుకాయు చుండిరి. అష్టదిక్కులఁ పెద్ద నేగళ్లు మండుచున్నవి. మదగజగంధము వాసించు చున్నందున నటునుండి పులులు చిరుతగండ్లు వైదొలగి దూరము పోయినవి.

అది సామాన్యవర్తకతండము పోవు బిడారుగాలేదు. సేవాదళమట్లును లేదు. ఒకే ఒక వర్తకుడు కతిపయపరివారముతో నట్లు ప్రయాణించుచున్నాడు. ఆతని వెంట ప్రభువులకు వందిమాగధులు, కవులు, గాయకులు, గలరు; వాంశికులు, వీణావినోదకులు నున్నారు. ఇప్పు డా శ్రేష్ఠిమహారాజు విశ్రమింప బోవుచున్న ట్లున్నాడు. సర్వాంగసుందర మగు నాతని పటకుటీరమున పరాకులు గూడ పలుకుచున్నారు.

'శ్రీ త్రిపురాంతకదేవ దివ్య శ్రీ పాదపద్మారాధక, పరమ సాధక బహు పరాకు ! - కమల భవోరు సంభన విమల వంశధార, ధర్మ ద్రావిడ బిరుదా ధార బహుపరాకు ! - సుజన విధేయ, కర్పూర వసంతరాయ ఋహుపరాకు ! - కీర్తి వనితావల్లభ, నిరంతర దీపాంతరవర్తి శతాధికానేక మహాపోత పాత్రాధి వల్లభ బహుపరాకు ! - ప్రతిదిన సమారాధిత పరమేశ్వర, మాణిక్య సింహాసనా ధీశ్వర బహుపరాకు ! - అంగీకృత భూసురాశీర్వాద, సంతతశ్రుతి భూషాయ మానసంగత వేదవాద బహుపరాకు ! - దానధర్మ పరాయణ, ఇమ్మడి గరుడ నారాయణ ఋహుపరాకు ! - నిజకీర్తి శాసన స్తంభాయ మాన దిగంత దంతావళ దంత బహుపరాకు ! - అభయ ద్రావిళ ఋహుపరాకు ! - కిష్కింధాచల క్రీడా వినోద బహుపరాకు ! - వినిర్మల కులశీల, పాండ్యరాయి కందుక క్రీడావిలోల బహుపరాకు ! - కవిజన స్తోత్రపాత్ర, కౌండిన్యగోత్ర పవిత్ర, బహుపరాకు ! - చతుష్షష్టి విద్యా జన్మభూమి, అయోధ్యానగరస్వామి రఘురామాభిరామ బహు పరాకు ! - వీరమాహేశ్వరాచార, దురితదూర బహుపరాకు ! - చిరుతొండనంబి పయఃపారావార రాకాసుధాకర బహుపరాకు ! - పరమ వైష్ణవ కాంచీనగర కుటుంబి శ్రీ కంచినంబి వంశాంబుధి చంద్ర బహుపరాకు ! - సింహ విక్రమ పట్టణ శ్రేష్ఠ సెట్టి జగజెట్టి పావాణి సెట్టి విభుని యవచియ దేవయసెట్టి బహు పరాకు ! - మాచాంబాగర్భ ముక్తి ముక్తాఫల బహుపరాకు ! -'

తర్వాత కర్ణాటక భాషలో పరాకులు చెప్పిరి. ఆ వెనుక అరువ భాషలో ప్రశస్తిగద్య సాగినది. తుదకు కమల నాభామాత్యు డను విద్వత్కవి సంస్కృత శ్లోకముతో నాతని నాశీర్వదించినాడు.

అటుపిమ్మట మహారాజులకు వలె నృత్తగీతములతో పవళింపు సేవ జరిగినది. కాని యాత్రామధ్య మగుటచే సమస్తము సంక్షేపముగా జరిగిపోయినది. వీణానాద మా శిలాతలముల ప్రతిధ్వనించి, చిత్రమగు తారస్థాయిలో వినవచ్చినది. వంశీవిరావ మా యరణ్యాం తరముల జొచ్చుకొని ప్రకృతి సిద్ధముగా పెరిగియున్న వెదురు పొదలలో దూరి, ప్రధమ రాగమువంటి కలవరము కలిగించినది. మంజులగీత ధ్వనులు దశదిశల బ్రసరించి కస్తూరి సుగంధ గంధవాహునితో లీనమైనవి. వర్తకుల పాదకింకిణీ రవము సమీపమున నృత్య మొనర్చు సెలయేటి జలజలలో నడగి పోయినది. ఎన్నాళ్ళ కిట్టి సౌభాగ్యమును తెనుగు గడ మరల నింతమాత్రమైన చవిచూడ గలిగినది!

నెమ్మది నెమ్మదిగా నా ప్రదేశము శాంతించినది అశ్వఘోషలు అడగినవి. అశ్వికుల కదలికలు యడగినవి. ఆ వీటిపట్టున గలవారు నిద్రల కొరగినారు. రక్షకులు మాత్రము జాగరూకులై ప్రహర తిరుగుచున్నారు. ఈవలి వారు నావలి వారు కలసినప్పుడు, 'సమగ్రము! - సర్వసమగ్రము!' అని యొకరి నొకరు హెచ్చరించుకొను కేకలు తప్ప ఇతర శబ్దము లేదు.

అర్ధరాత్ర మైనది. అప్పుడే క్రొత్త జట్టు ప్రహర తిరుగ నారంభించెను. మరల నిశ్శబ్దమైనది.

ఇంతలో చుట్టుపట్టుల నరణ్యమంతయు ఒక్కసారిగా చిరుగాలికి రాలిన ఆకులు గలగల వలె నడియైనది; రాలిన చినుకుల తాకిడి వలె చిరుశబ్దమైనది. గాలిలేదే! ఆ కల్లాడలేదే! ఒక్కచినుకు పడలేదే! మధ్యాకాశములో మేఘశకలము కూడలేదు. వెన్నెల కాంతిలో ప్రకాశమానములై గాడిదమబ్బులు దిగంచలముల సంచరించుచున్నవి. మరి యీ యలికిడి ఏమి?

జాగరూకు లగు రక్షకులు తలలెత్తి చూచిరి. ఆవలి వా డీవలివానిని, 'బహుపరాకు!' అని హెచ్చరించెను. హెచ్చరిక!' అని యొక ప్రక్క కావలి తెలుపగా, 'హెచ్చరిక!' అని యా ప్రక్క కావలి యుత్తర మొసగెను.

'వింటివా?'

'వింటివా, నీవును? ఏమది?'

'వింటిరా, అందరును?—ఏ మా గలగలలు?—హెచ్చరిక!'

ప్రహర తిరుగుచున్న రక్షకభటులు మరికొందరిని హెచ్చరిక చేసి లేపిరి. అందరు నాలకింప సాగిరి. గలగల వారి చుట్టు నన్ని వైపుల చేరు వగు చుండ మరికొందరు భటులనుగూడ లేపిరి.

అంతలో సన్నని పిట్టలు దూసికొనిపోయిన పుట్టురెక్కల చప్పుడు వలె శబ్దము వినసైనది. ఇక్కడ నొకసారి! అక్కడ నొకసారి! రక్షకు లిక నాల సింప వీలులేదు. వెంటనే ఆ బిడారున కష్టదిక్కుల శంఖధ్వనులు బోరు కలగి నవి. అందున్న జను లెల్లరు జాగరూకులై ఆయుధములు ధరించిరి. వీటి పట్టు సన్నగిల జేసిరి. దాని చుట్టును వీరులు దృఢముగా నిలిచి తమ పెద్ద డాళ్ళు పట్టుకొని వీటికి డాలుకోట కట్టిరి. డాళ్ళ సందుల లో నుండి వారి శూలములు పొడుచుకొని వచ్చినవి. తన ముళ్ళ శరీరము పోరికై ఒక్కసారిగా నిగిడించి విచ్చిన ఏదుబంది శరీరము ననుకరించుచున్న దా వీడిప్పుడు :

ఈ మారు వచ్చినది పిట్టలు దూసికొనిపోయిన సడికాదు. ఆన్ని దిక్కుల నుండి బాణములు వర్షపు జడి వలె ఒక్కసారిగా కురిసినవి. బాణము లన్నియు డాలు కోటలో చిక్కు కొన్నవి;

మరల నొకబారు బాణవర్షము! ఆ బాణపాతము సుశిక్షితులు ప్రయో గించిన చాతుర్యము ప్రకటించినది. ఇది వెనుకటి కంటె దృఢముగా తాకినది. మరల దానిని డాలుకోట ప్రతిఘటింప గలిగినది. కాని ఆ తాకిడి కీమాటు అదరి దద్దరిల్లినది. శ్రేష్టి యాజ్ఞచే నా డాలుదుర్గము మరింత కుంచితము చేయ బడినది.

మరల బాణవర్షము! ఈ మారది యింకను సమీపమున నుండి వచ్చినది. మరల డాళ్ళకోట పరిహరించినది. కాని యీ మారు రెండు గుర్రములు గాయ పడినవి.

'ఎవరో దస్యులు మన వీడు చుట్టు ముట్టినారు!'

'ఎవరై యుందురు?'

'తురుష్కులా, సుశిక్షితమైన విధముగా వచ్చుచున్నవి?'

దళపతి లిట్లు వితర్కించుచుండ కమలనాభామాత్యుడు అందుకొని. 'ఆ బాణములు మీరు చూడలేదా: అవి తురుష్కులవి కావు!' అనెను.

అవచిదేవయ గంభీరస్వరము వినవైనది.

'చెంచులు!'

అతడా బాణములు జాగ్రత్తగా పరిశీలించి యుండెను. శీఘ్రమే యాజ్ఞ లిచ్చెను. పదిమంది యాశ్వికుల దళము నొక వైపుకును, మరి పదిమందిని రెండవ వైపునకును ఆ యడవి దారిలో మెరపు మెరసిన ట్లాతడు పంపెను. ఆశ్వికు లాకస్మికముగా రెండువైపుల దూసుకొనిపోయిరి.

ఆ దారిలో నున్న మనుష్య లడవి జంతువుల వలెనే ప్రక్కలకు తప్పు కొనిరి. ఐనను ఆశ్వికు లంతకంటె రయమున ప్రవర్తించుటచేత, అట్లు తప్పు కొనుచున్నవారిలో కొందరికి కాళ్లు, కొందరికి చేతులు త్రెసినవి. ఆశ్వికుల కిద్దరు చిక్కిరి. ఆ చిక్కిన ఇద్దరిని వెంటనే వారు బలవంతముగా తెచ్చి అవచిదేవయ ముందు పెట్టిరి.

పట్టుపడిన వారిలో నొకడు వేషమును బట్టి ముఖ్యుడుగా దోచుచుండెను. అతడు దృఢమై చురుకైన దేహము కలవాడు. ఉన్నతకాయుడు ఆతని బట్టి తెచ్చుట సామాన్యులకు నలుగురికి గాని సాధ్యము కాదు.

అవచిదేవయ పరివారములో ప్రధానుడుగా వికృత చిత్రాకారు డొక డున్నాడు. ఆతని దేహము కర్కశమయ్యు, ఉప్పు తినివేయుటచే కాబోలు, చిల్లులు పడి నల్లగా నున్నది. ఆతని మీసములు గండువై భయమావేశింప జేయు చున్నవి. దవుడలు మిక్కిలి పెద్దవి. అత డీ దేశము వాని వలె నున్నను నిజాతీయ లక్షణముల తో గనబడుచున్నాడు. అతడే ఆ చెంచునాయకుని, పులి మేకను పట్టినట్లు, అవలీలగా దండచేయివద్ద ఒడిసిపట్టి తెచ్చి, నవ్వుతో విస్తరించిన ముఖముతో అవచిదేవయ వంక తిలకించెను. అవచిదేవయ యాతని వంక సంతుష్ట దృష్టి పరపి, భటుల నాజ్ఞాపింప, వా రా చెంచుల నిద్దరను వెన్నెలలో నున్నత ప్రదేశమున నిలిపి దృఢముగా బంధించిరి.

ఆజ్ఞలు ప్రకటించు దూత ఆ యరణ్య రాజ్యమునకు అవచిదేవయశ్రేష్ఠి యాజ్ఞ లిట్లు ప్రకటించెను.

"ఓహో! చెంచులారా! - మీ రందరూ వెంటనే దూరము తొలగిపొం డోహో! లేకుంటే ఈ ఇద్దరిని ప్రభువువారు చిత్రవధ చేయింతు రోహో!

ఇకపై ఒక్క-బాణము ఈ శిబిరముమీద పడిందంటే, మీ వారిలో ఒకరికి చేతి వేలు తెగిపోతుం దోహో ! విన్నారా, సిరితిప్పయ్యదేవ సిరి పాదపద్మా రాధక అవచిదేవయ్య సెట్టివారి ఆజ్ఞ ! తొలగిపోండోహో ! చెంచుల్లారా, తొలగిపోం డోహో ! -"

ఎవరి కా ప్రకటన? ఈ యరణ్యములోని చెట్లకా? గుట్టలకా? ఎవరికైన నేమి ? మొత్తముమీద ఆ ప్రకటన ఫలించిన ట్లున్నది. బాణపాత మాగినది. అంతయు నిశ్శబ్ద మైనది.

అంతలో నా ప్రశాంతిని భంగపరచుటకు సందేహించు చున్నట్లే, ఒక్కటే ఒక్క బాణము వచ్చినది. అది మంచి లక్ష్యశుద్ధితో విడువబడిన వజ్రసదృశమైన బాణము ! ఆ బాణము సరిగా ఆవచిదేవయ ఎదురు రొమ్ముకే తగిలినది. అతని ఉక్కు-రొమ్ము నది గ్రుచ్చుకొనలేక ఖంగుమని ఏడ్చుచు విరిగి నేలకు వ్రాలిపోయినది. ఆతడు చలింపలేదు, ఆతని ముఖమున చిరునగ వంకు రించినది. మహాసముద్రములమీద ఎన్నిమారులు భయంకరులగు దేశదేశముల వీరుల బాణములను శూలాఘాతములను తన వక్షఃస్థలము రుచిచూచి యున్నది: శ్రేష్ఠి రెండవ యాజ్ఞను దూత ఘోషించెను.

'ఈ బాణము ప్రభువువారి నేమియు చేయలేదు !. దీనితో మీవాని చిటికెనవ్రేలు పోవుచున్న దోహో !'

ఆ ప్రకటన జరుగుచుండగనే భటు డొకడు చిక్కిన చెంచులలో సామాన్యుని చిటికెనవ్రేలు బలవంతముగా రాతిపై పెట్టించి చురక త్తితో నరకి వైచెను.

ఆ దౌర్భాగ్యుని కేకలతో నా యరణ్యమంతయు మారుమ్రోగినది. వాడు తనతోడివారిని దూరము పొండని, తన్ను రక్షింపుడని చెంచుభాషలో బ్రతి మాలినాడు. అవచిదేవయ యాతని చిటికెనవ్రేలు తెగుటచేనైన గాయమునకు వైద్యునిచే కట్టుకట్టించి మరల దూతచే ప్రకటన యాఘోషింప జేసెను.

అరణ్యములో నొక్కసవ్వడియు లేదు.

మూడవమా రదే ప్రకటన చేయించి యింకను ఇట్లు ప్రకటింపజేసెను.

"చెంచులారా, వినండొహో! ప్రభువువారు ఈ ప్రాంతంలో కొద్దికాలమే ఉందురు: మావారికి ఎవరిపల్ల ఏ అపాయము వచ్చినా, మీరే బాధ్యులగుదురు: ఈ బందీలను చిత్రవధ చేయింతుము. మీ గూడెములు తగులబెట్టి నేలమట్టము చేయుదుము. కాక మీరు సక్రమంగా ప్రవర్తించినారా, పోయినవేలు పోను, ఈ యిద్దరిని క్షేమంగా మీకు అప్పగించే ఏర్పాట్లు చేయగలరు. శ్రేష్ఠి ప్రభువులు మీకు బహుమానము కూడా చేయగలరు: విన్నారా? ఈ చెంచులకు అతిథులముగా వచ్చిన మమ్ము ఏ ప్రమాదము లేకుండా ఆవలికి చేర్చవలసిన బాధ్యత మీకున్నది. మెట్ట మెట్టకు మీకు రావలసిన కట్టడికి మూడురెట్లు శ్రేష్ఠివారు దయ చేయగలరు: విన్నారా, చెంచులారా: మరి మీవిధి మీరు మరచినారా అంటే, ఇదిగో ఈ యభాగ్యుని చిటికెనవ్రే లైనా గుర్తు చేయగలదు:- అదుగో!"

ఆ చిటికెనవ్రేలి ముక్కును గడ్డకట్టిన రక్తముతో భటుడొకడు ఎత్తైన చెట్టు కొమ్మకు వ్రేలాడ గట్టెను.

అది చూచి ఆ యిద్దరు చెంచులలో ప్రభానుడు పెద్దకేక వేసెను. ఆ కేక పులికేక వలె భయంకరముగా నుండుటచే ఆ తండ మంతయు నాశ్చర్య చకితమై జాగరిత నుయ్యెను. ఆ కేక పెట్టి 'సుగ్రీవా:' అని అరచెను. అట్లు అరచుచు అతడు వినీతుడై అవచిదేవయకు నమస్కరించెను. దాని యర్థ మిప్పుడు అవగతమైనది. ఆ చెంచు దొరపేరు సుగ్రీవుడు. అవచిదేవయ యాజ్ఞలు తన యాజ్ఞగా పాలింపుడని అత డా కేకతో తన చెంచు పరివారమున కాజ్ఞాపించెను.

అరణ్యములో నీ మాట మనుష్యకంఠముల వినవచ్చినవి. అందులో మాట లెక్కువ లేవు.

'చిత్తము: — చిత్తము: — చిత్తము:' అన్నట్లు వినిపించినవి. ఆ తర్వాత అడవి యాకులతో గలగల మను శబ్దము వినసైనది. అది యనేక పాదములు దూరము పోవుచున్న సవ్వడి:

అవచిదేవయ అది విని తృప్తి పొందుచు మరి యించుక సే పాలించెను. శాంతముగా నున్నది.

సుగ్రీవుడు చెంచుపెద్ద యని మొదటనే దేవయ ఊహించి యుండెను. ఆ యుహ యిప్పుడు స్థిరపడినది. ఆతని దృఢముగా బంధింపజేసియు నాదర

ముతో జూచుచుండ ననుచరుల కాజ్ఞాపించి, అవచిదేవయ ఆకాశమువంక జూచుచు కమలనాభునివంక ప్రశ్నార్థకముగా జూచెను. తా మా రాత్రి చేయ నుద్దేశించిన పని కింకను వ్యవధి యున్నదని ఉభయులు నేకీభవించిరి. దేవయ భటులకు విశ్రమింప ననుజ్ఞ యిచ్చి తానును పరుండబోయెను. రక్షక ల ప్రహరలు యథాపూర్వముగా సమగ్రమై సాగుచుండెను.

మూడు జాములైనది. ప్రహారభటులు మారిరి. అవచిదేవయ పవటకుటీ రమునుండి బయటకి వచ్చి ఆకాశమున నక్షత్రములవంక జూచెను. అశ్వనీ తారలు చంద్రుని సమీపమున పశ్చిమాకాశమధ్యమున మినుకు మినుకు మను చుండెను. మృగశీర్షములో మినుకు మినుకు మను మూడు తారలును శిరస్సు మీదికి వచ్చుచున్నవి. వాని సమీపమున గారకొయ్యలు మూడును ప్రకాశమాన ములై శిరఃప్రాంత మున గానవచ్చుచున్నవి.

అవచిదేవయ తన యనుచరుల నిద్దర బిలిచి, మల్లారెడ్డికై కేకలువేయ నాజ్ఞాపించెను. వా రట్లు చేసిరి, ముందు మొదటివాడు మంద్రస్వరముతో పిలిచెను.

'మల్లారెడ్డీ ! — మాల్లారెడ్డీ ! — మల్లారెడ్డీ!'

అది యార్తుల కుయ్యికాదు. అది ఆప్తుల పిలుపుగా నున్నది. అది ధీరముగా చెట్లలోనుండి పొదల సందులలో దూరి పర్వతసానువులు చేరి గిరి శిఖరము లధిరోహించెను, ప్రత్యుత్తరము రాలేదు. కొంతసేపు నిరీక్షించి రెండవ యనుచరుడు మధ్యమస్థాయిలో మల్లారెడ్డిని పిలిచెను.

ఆ పిలుపునకును ప్రత్యుత్తరము రాలేదు.

అంతట మొదటివాడు మరల మల్లారెడ్డిని పిలిచెను. ఈ మా రాతడు గొంతెత్తి అతితారస్థాయిలో కేకలు వేసెను. ఆధ్వని తీక్ష్ణముగా పర్వత శిలలలో ఖంగు ఖంగునుని గంటవలె మ్రోగినది. ఈ మారు ప్రతిశబ్దము వినవచ్చినది.

'మల్లారెడ్డిని పిలుచు వా రెవరది ?'

అవచిదేవయ యాజ్ఞగొని రెండవ యనుచరుడిట్లనెను.

'మల్లారెడ్డి మైత్రి యర్థించు వీరమాహేశ్వరాచార దురితదూర మహాను భావుడు !'

ఈ మారు వెంటనే ప్రతిశబ్దము ప్రశ్నించినది,

'ఆ మహానుభావుని నామధేయము ?'

మొ. అను. 'శ్రీ శ్రీషరాంతకదేవ దివ్య శ్రీపాదపద్మారాధక, ధర్మ ద్రావిడసెట్టి ఉగజెట్టి పావణిసెట్టివిభుని అవచిదేవయసెట్టి!'

ప్రతిశబ్దము : 'మల్లారెడ్డికి నివేదింతుము. రేపు మీకు ప్రత్యుత్తరము రాగలదు!'

9

మల్లారెడ్డి యుత్కంఠతో పలుకరించినప్పుడు ఆ బ్రాహ్మణ యువకుడు తన పేరు యర్రయ యని చెప్పెనే కాని యాతని కప్పుడు సరిగా స్మృతి వచ్చి పలికినది కాదు. అతని తల తిరిగిపోవుచున్నది. మేఘాచ్ఛాదిత మైన యాకాశమున గ్రుడ్డివెన్నెల అస్పష్టముగా మధ్యమధ్య గోచరించునట్లే, మొద్దు వారిన యాతని మనస్సులో గూడ ఎప్పుడో కొంచెము స్మృతి వచ్చుచున్నది. అది కనిపెట్టియే ఏమైన యటనినే పేరడుగు మని మల్లారెడ్డికి చెప్పెను. అట్టి స్మృతి యున్న సమయమననే ఎర్రయ తననామ మభ్యాసవశమున మల్లారెడ్డికి చెప్పగలిగెను.

ఆ మధ్యాహ్నవేళ మరల నతని కట్టి స్మృతియే వచ్చినది. తన్నెవరో ఆదరముతో పేరడుగుచున్నట్లు తాను చెప్పుచున్నట్లు ముందు భాసించినది. ఆ కంఠస్వరము ఎన్ని జన్మాంతరములనో మధురముగా విన్నట్లున్నది. ఆ స్మృతి వెంటనే యిప్పుడాతని శ్రవణములతో మంజుల పవిత్రఘంటానాదముతో బాటు శతరుద్రీయము వినవచ్చుచున్నది.

'నమ స్సోమాయచ రుద్రాయచ నమస్తామ్రాయ చారుణాయచ నమ స్తామ్రాయ చారుణయ చ నమ శ్శంగాయ చ పశుపతయే చ నమ ఉగ్రాయ చ భీమాయ చ నమో అగ్రేవధాయ చ దూరే వధాయ చ నమో హంత్రే చ హనీయసే చ నమోవృక్షేభ్యోహరికేశేభ్యో నమస్తారాయ నమ శ్శంభవే చ మయేభవే చ నమశ్శంకరాయ చ మయస్కరాయ చ నమశ్శివాయ చ శివతరాయ చ :—'

శ్రావ్యమై మధురమై శాంతమై శివమై కల్యాణమై ఆ మంత్రము ఎర్రయ చెవులలో అమృతస్రావమువలె చల్లగా ప్రసరించినది. గ్రుడ్లూరులో సుఖజీవనము గడపుచుండ తన తండ్రి దేవతార్చనము చేయుచుండిన రోజులు జ్ఞప్తికి వచ్చి ఈ మా రాతని కన్నులు విచ్చుకొన్నవి, క్రొత్త యోపిక వచ్చిన ట్లయినది.

అది చూచి చేరువ నున్న బ్రహ్మచారి యొకడు ముఖశౌచమున కాతనికి జల మందిచ్చెను. ఆ బ్రహ్మచారి ఎవరో ఎర్రయ గ్రహింపకేదు. ప్రయత్న పూర్వకముగా నాతడు ముఖశౌచ మొనర్చుకొని మరల పరుండి కన్నులు మూసికొని బ్రహ్మచారిని ప్రశ్నించెను.

'ఇప్పు డేవేళ యైనది ?'

'మధ్యాహ్నము'

ఎర్రయ కింకను స్మృతి యుండుట కనిపెట్టి బ్రహ్మచారి యాతనికి భస్మ మందిచ్చెను. ఎర్రయ అది యెట్లో లలాటమునను భుజములను ఉదరము నను వక్షోభాగమునను ధరించి మానసికముగా స్నాన సంధ్యాదికమంత్రములు స్మరింపసాగెను. బ్రహ్మచారి లోని కేగి ఎర్రయకు తెలివి వచ్చిన సంగతి తెలిపినాడు. లోపల శివపూజ యైనట్లున్నది.

'ఈ ప్రసాద మాకుర్రవాని కిచ్చి రా !"

ఈమాటలు కృపారసార్ద్రమైన యొక దివ్యమధుర కంఠము లోపలి నుండి పలికినాడు. అది తన తండ్రి కంఠముకంటె వాత్సల్యముతో నిండి యున్న ట్లాతనికి భాసించినది. తా నప్పుడు మానసికముగా సంధ్యావందన మొనర్చుచుండెను. అది యాసంధ్యాదేవత కంఠస్వరమా ? సావిత్రీ మంత్ర ద్రష్టయైన యా విశ్వామిత్ర మహర్షికంఠ మిట్లే దయార్ద్రమై యుండునా ? ఇట్లు తలంచుచుండగనే తా నప్పుడు జపించుచున్న గాయత్రీ మంత్రమునకు విశేషశక్తి స్ఫురణ మాతనికి ప్రత్యక్షమైనది. అభ్యాసవశమున నిత్యమావృత్తి చేయు నామంత్రములో ఈనా డాతనికి నూతన చైతన్య మేదో గోచరించినది.

అత డంత మాధ్యాహ్నిక సూర్యోపస్థానమంత్రము స్మరించుచుండెను. 'పశ్యేమ శరదశ్శతమ్ జీవేమ శరదశ్శతమ్-' పిమ్మట సంధ్యాదిదేవతలకు నమస్కరించుచుండగా అందుగూడ విశేషస్ఫూర్తి ఇప్పు డాతనికి ప్రకాశించినది,

సంధ్యావందనములు పూర్తిచేసి యాతడు కన్నులు తెరచునప్పటికి, ముందే వచ్చి సందేహించుచు నిల్చియున్న బ్రహ్మచారి, 'స్వామివారు మీకీ ప్రసాదము పంపినారు' అనుచు తాను తెచ్చిన గోక్షీరపాత్ర ఎర్రయచేతి కిచ్చెను.

'మహాప్రసాదము!' అనుచు ఎర్రయ లేచి భక్తితో నాపాత్ర కన్నుల కద్దుకొని సేవించెను, ఆ పదుద్ధారకు డగు పటుకమూర్తి తనకు తెచ్చిన ఆవృత పాత్రగనే భావించి యాత డది గ్రహించెను.

ఎర్రయ ఆపాత్ర స్వీకార మొనర్చి మరల శయ్యపై విశ్రమించెను. ఈమా రాతనికి దేహము బరువుగా నున్నట్లు తోచినది. రాత్రి తగిలిన గాయ ముల బాధకంటె నిద్రాభార మిప్పు డెక్కువగా నున్నది. ఈ పర్యాయ మాతనికి వచ్చినది మైకము కాదు. నిద్ర అతడు సుఖముగా నిద్రింపసాగెను.

మరల ఘంటా నాదముతో ఎర్రయకు మెలకువ వచ్చినది. అప్పుడే సాయంకాల మైనదా? బాగుగా వెలుతు రున్నదే! ఇప్పు డభిషేక మంత్రము వినబడుచున్నదేమి? ఎర్రయ బ్రహ్మచారిని ప్రశ్నించెను.

'ఈ వేళ ఆ పూజ చేసెడి దెవరు?'

'శ్రీ శంకరస్వాములకు నిత్య శివరాత్రి వ్రతము, యామము లెన్మిదింట శ్రీ శివార్చనము నిర్వర్తింతురు.'

ఎర్రయ యాశ్చర్యముతో నా బ్రహ్మచారివంక తిలకించెను. ఈభూమిలో నింకను శివార్చనము చేయువా రున్నా రన్నందులకే ముందాతని కెంతో సంతోష మయ్యెను. నిత్యము శివరాత్రి వ్రతముగా ఎనిమిది యామములలో శ్రీ శివార్చనము చేయు భవ్యయోగామృతమూర్తు లున్నారని యిప్పుడు విన్నం తనే, ఆతనికి నిర్భరానంద మైనది. దేహము రోమాంచకంచుకిత మైనది. గద్గదకంఠముతో నత డిట్లనెను.

'ఆ మహానుభావుని నేను దర్శించి వందనము చేసి రావచ్చునా?.

'లేపు.'

'ఏమి?'

'విస్సనమంత్రి యాజ్ఞ!.

'విస్సన్నమంత్రి ఎవరు ?'

'మీకు కట్టు కట్టిన వైద్యుడు, నారాయణమూర్తి.'

'మరి నన్ను కాపాడిన మల్లారెడ్డి ఎక్కడ?'

'తెలియదు'

'నే నిప్పు డెక్కడ నున్నానో చెప్పవచ్చునా ?'

'నిరభ్యంతరముగా. శ్రీ శంకరసంయమీంద్రుల యాశ్రమమున.'

'భూలోకమందేనా?'

బ్రహ్మచారి చిరునవ్వు నవ్వెను. అదియే ఎర్రయ సంశయవేశమును తీర్చెను. ఆతని కిప్పుడు తల్లిదండ్రులు భార్యయు స్పష్టముగా జ్ఞప్తికి వచ్చిరి. దానితో నాతని మనస్సున చింతామేఘము లావరించినవి,

వా రేమైరి? ఈ నాడు వారి కాహారము లభ్యమైనదా? తనకై వా రెత దిగులు పడుచున్నారో! ఆపారిపోయిన పాడు పులి మరల వచ్చి యుండదుకదా! గోమాత వత్సముతో క్షేమముగా నున్నదా? పంటరెడ్డి కూడ కనపడడేమి ? నన్ను కాపాడిన మల్లారెడ్డి నావారిని కాపాడి యుండడా ?—

ఇట్టి యూహ లాతని మనస్సులో నిభీడమై ఒక దాని వెనుక నొకటి త్రోసికొని వచ్చుచున్నవి. అయ్యో, ఎవరో అజ్ఞాతు లగు వారిని రక్షించుటకు పరమాప్తులను విడిచి వచ్చితినే యనుమాట ఏకోశమున నాతనికి స్ఫురింప లేదు. అనాధుల రక్షించుట కంతమాత్రమైన తాను సాయపడితి ననుసంతృప్తియు. ఒక మానవతి మర్యాద కాపాడ గలిగితి నను సంతుష్టియు నాతని మనస్సులో నిండినవి. ఆ రాత్రి జరిగిన దంతయు స్మృతిలో బారుచున్నకొలది ఉత్సాహము హృదయము నావేశించి, తన కుటుంబమును గూర్చిన చింతను గూడ ఇంచుక వెనుక బట్టింపజేసెను. ఆ రాత్రి సంఘటన లాతనికి స్వప్న సదృశములుగను ఇంద్రజాలము వలెను భాసింప సాగెను. నెమ్మదిగా నాతని జిహ్వాగ్రమున శ్రీమదాచార్య విద్యాశంకరుల శ్రీ దక్షిణామూర్తి స్తవము లోని శ్లోక మొకటి నాట్యమాడెను.

'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాం తర్గతమ్
పశ్య న్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా
య స్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమే వాద్వయమ్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే !'

బ్రహ్మచారి యాశ్చర్యముతో నాలకించెను. రణకుశలుడైన యీ బ్రాహ్మణుని నోట నింత స్వచ్ఛముగా శ్లోక మా వృత్తమగుట యద్భుత మనిపించి, కన్ను లప్పగించి ద్విగుణీకృత గౌరవముతో నత డెఱయనంక చూడసాగెను.

అంతలో లోపలినుండి బ్రహ్మచారికి పిలుపు వచ్చినది. మరి కొలది సేపటి కాతడు తిరిగి వచ్చి ఎర్రయకు తీర్థప్రసాదమును సమర్పించెను. ఎర్రయ లేచి కూర్చుండి మహాప్రసాదమని కన్నుల కద్దుకొని గోక్షీరమును ఫలములు సేవించెను.

ఫలాహార స్వీకరణముతో ఎర్రయ కొకింత శక్తి వచ్చినది. దానితో గాయముల బాధ తోచినది. ఒడలంతయు బిగిసికొని పోయిన ట్లున్నది. దక్షిణ బాహువుకు తప్ప కట్లులేవు. ఆతని దేహమంతట చిన్న చిన్న గాయములే. వానికి విస్సన వేసిన పసరు ఆ శరీర భాగములను బిగించి పట్టివేసి నట్లుండెను. వానినుండి నెత్తురు కారుటలేదు. ఒడలిపై నుండిన రక్తపు జారలన్నియు శుభ్రముగా కడిగివేయబడియున్నవి, ఆతని కుడిదండకు కట్టిన కట్టు, ఆ చేతి నెత్తుటకు అనురోధముగా నున్నది.

మరల నతనికి తల్లిదండ్రులును భార్యయు గట్టిగా తలపుకు వచ్చిరి. పంటరెడ్డియు నతని తమ్ముడును వారి వెర్రిబాగుల తల్లియు తలపున బారిరి. స్మృతితప్పు వరకు నుండిన పంటరెడ్డి ఇప్పు డేమయ్యెను? ఇట్లాతకు తీవ్రముగా నాలోచించుచు, 'పంటా!' అని బిగ్గరగా పిలిచెను.

పంట పలుకలేదు. 'బాబా!' అనునాతని ప్రీతికంఠము వినబడలేదు. అయ్యో. ఏమైనాడు ?

'పంటా !'

ఈ మారు మరింత బిగ్గరగా పిలిచినను జవాబు రాలేదు. ఎర్రయకు ఆవేగ మెక్కువైనది.

'పంటా, బ్రదికి యున్నావా, నా పంటా ? ప్రాణముతో నున్నావా, మాపంటా? నాయనా!'

ఎర్రయ బిగ్గరగా కేకలు వేయసాగెను.

మొదటికేకకే బ్రహ్మచారి త్రుళ్ళిపడెను. మరల మరల నధిక మవు చున్న కేకలు విన్నకొలది, అతడు సంధిచేష్ట యని భయపడి, వెంటనే విస్సనకు వార్త పంపెను. గడియలోపల విస్సన వచ్చెను.

అంతపరకు పంట కొరకై వెర్రికేకలు పెట్టుచున్న ఎర్రయ ఇప్పుడు విస్సనను చూడగనే శాంతించి ప్రశ్నించెను.

'మా పంట ఏడి, బాబూ ?'

విస్సనమంత్రికి కొంత యాశ్చర్యమైనది. పాప మీ బ్రాహ్మణ యువకుడు ఎట్లున్నాడో యను నాందోళన తోడనే అత డచ్చటికి వచ్చి యుండెను. బ్రహ్మ చారి పంపిన వార్త వలన ఏదో ప్రమాదావస్థ వచ్చిన దని యాతడు తలంచెను. ప్రమాదము రాదగిన గాయము కాదని యాతనికి ధైర్య మున్నది కాని, ఇట్టి విషయములలో సర్వజ్ఞత కలదని భ్రమపడరాదని స్వానుభవమున నాత డెరుగును. ప్రమాదము రా దనుకొన్న రోగికి ఆకస్మికముగా ప్రమాదము స్థితి ముంచుకొని రావచ్చును; ఆశ వదలిన రోగి చప్పున తేరు కొనుటయు కద్దు. అందుచే వైద్యు డశ్రద్ధచేయరాదు, ఆ కత్తులలో ఏమి విషపదార్థము లున్నవో ఏమి యెరుక, అనుకొనుచు విస్సన వచ్చియుండెను. ఎర్రయ ముఖ వర్చస్సు చూడగనే ఆతని యావేగము శమించెను. అనవసరముగా తొందరవార్త పం పిన బ్రహ్మచారిపై నించుక చిరాకుకూడ కలిగినది. విస్సన తనకు ప్రత్యుత్తర మీయకుండుటచే ఎర్రయ మరల నడిగెను.

'పంట ఎక్కడ నున్నాడో దయ యుంచి చెప్పెదరా ?'

'చెప్పలేను.'

'పోనీ, అతడు క్షేమముగా నున్నాడా ?'

'ఆ!'

'ఇక్కడి కాతని బిలపించగలరా!'

'చెప్పలేను, ప్రయత్నింతును'

'నా తల్లిదండ్రులను కుటుంబమును అడవిలో వదలి వచ్చితిని, వారి యొద్దకు నన్ను బోనిత్తురా?'

'నీవు పోజాలవు. నిన్ను నిర్బంధించువారు లేరు.'

'నే నిప్పు డెక్కడ నున్నాను ?'

'శ్రీ శంకరసంయ మీంద్రుల యాశ్రమములో'

'నేను గాయపడిన చోటు న కెంతదూరము ?'

'అది అడుగరాని ప్రశ్న.'

'నా కుటుంబమును పంట కుటుంబమును రక్షింతురా ?'

'అట్టిదానికి సమస్త ప్రయత్నములు జరుగుచున్నవి.'

'వా రెల్లరు క్షేమమేనా ?'

'నీవే వారి నరణ్యమధ్యములో నిస్సహాయులుగా వదలి వచ్చితివాయెను నేనేమి చెప్పగలుగుదును ?'

తన ప్రశ్నకు నూటిగా సమాధానము రాకపోవుటచే ఎర్రయకు దిగులు క్రమ్ముకొని వచ్చుచున్నది. అది కనిపెట్టి విస్సన బయలుదేరెను.

'నీతో తీరికగా మాట్లాడవలె ననునభిలాష నాకును గలదు. కాని ఇప్పు డెంతమాత్రము తీరిక లేదు. నీ కుటుంబముకొరకై దిగులు పడక ముందు నీ గాయములు నయము చేసుకో !'

ఇట్లనుచు విస్సన మంత్రి యట నిలువక వెడలిపోయెను.

10

ఎర్రయ యట్లు బయలుదేరుచు తన సెలవు తీసికొనియు, తన పైపైన జూడక తప్పించుకొని పోవుచున్నది సూర్యకవి వెంటనే గ్రహించెను. తాను నిషేధించినచో అత డాగిపోవలసి వచ్చును. అందువలన నట్టిదాని కవకాశము

లేకుండ కుమారుడట్లు శీఘ్రగతి నరుగుచున్నా డని యాతని కవగతమైనది. 'విద్వత్సంస్తవ సీయి భవ్య కవితావేశు'డగు నా ప్రజ్ఞామూర్తి కంతమాత్రము తెలియదా ?

కాని అతనికి మొదట తనకుమారు డెందులకట్లు బయలుదేరు చుండెనో తెలియలేదు. అతని కప్పుడే మెలకువ వచ్చినది. భార్యయు కోడలును తండ్రి యొద్ద కుమారుడు సెలవు తీసికొనుచున్నమాటల సవ్వడికి లేచి యుండిరి. వారి కసలే తెలియదు, 'ఎక్కడికి వెళ్ళుచున్నావు?' అని వా రప్రయత్నముగా అడిగి యుండెడివారే, అది యతని కపశకునముగా స్ఫురించెడిదే ! అయితే వారి కందు కవకాశము చిక్కలేదు. ఆవల నాతడు పంటరెడ్డిని కేకవేయు చున్న ప్పుడుగాని, అత డెక్కడికో వెళ్లచుండె నని వారికి తోచలేదు. సూర్యకవి మాత్ర మాలోచించినాడు, 'ఈత డిప్పు డిట్లేల బయలుదేరినాడు?' అని.

అంతలో నాతనికిని దూరమున నార్తనాదములు వినబడినవి. తామింటి యొద్దనుండి బయలుదేరిన దాది, ఆతడెన్నియో ఆర్తనాదము లాలకించి యుండెను. ఇతరులు ఎన్నోవిధముల కష్టములు పడుచుండుట చూచెను. అంతే కాదు. తానును తన కుటుంబమును స్వయముగా కష్టము లెన్నియో అనుభవించి యుండిరి. మహాపదలో నున్న వారి క్షేమాత్రము సాయ మొనర్చినను, అదే మహోద్ధరణముగా భావింతురు. సహాయ మొనర్పలేక ఒక్క యాదరవాక్య మాడినను, అట్టివారు మహాప్రసాదముగా స్వీకరింతురు. అట్లు మాటాడనైన వీలుగాకున్న దూరముననుండి ఒక్క కృపాపూర్ణమగు కటాక్ష వీక్షణము ప్రసరింపజేసిననే అట్టివారు పొంగిపోవుదురు.

'ఆ యాపన్నుల కుయ్యాలించి నా కుమారుడు బయలుదేరి నట్లున్నాడు.'

సూర్యకవి యిట్లనుకొను చుండగనే, ఆవల తన కుమారునకు పంటకును జరుగుచున్న సంభాషణము చెవుల బడినది. దానితో నాతని యూహ ధ్రువపడినది.

కుమారుడు తొందరపడి ఈ యర్ధరాత్రివేళ నపాయ మున్నకడకు వెళ్లుచున్నమాట నిజమే. అయితే ఈ యరణ్యములో నపాయములేని దెక్కడ ? ఇక్కడికి అనతి దూరముననే బెబ్బులి గాండ్రింపు వినబడె గదా ! కర్మగతి గహనమైనది. అపాయమునుండి తప్పించుకొన దలచి డాగినిచోట అనుకొనని

ప్రమాదము రావచ్చును. అపాయమునకు జంకక ప్రమాద భూయిష్ఠ భూమి కురికిన నుపద్రవము విచ్చిపోవచ్చును. పురుషోచితకార్యమున కుద్యమించు వారిని వెనుకకు లాగరాదు. ఆర్తత్రాణపరాయణులకు సర్వార్తిహరు డగు నాభగవంతుడే అండగా నుండగలడు. 'నారాయణమూర్తీ, లోకము నుద్ధరించిన ఆదివరాహరూపా, మా కులదేవత వైన అహోబల నృసింహా, ఎర్రన్ను కాపాడు, తండ్రీ!'-ఇట్లనుచు భక్తివినమ్రుడై సూర్యకవి అహోబలేశుని మనసా ధ్యానించి నమస్కరించి మ్రొక్కుకొనెను.

ఆతని భార్య పోతమాంబయు, కోడలు మహాలక్ష్మియు నప్పటికే లేచిరి. ఆవల ఎర్రయ పంటను లేపి పిలుచుకొని పోవుచుండుట వారికిని వినవచ్చినది. ఏమిచేయగలరు వారు? ఏమనగలరు? వారికి నిద్దుర పట్టలేదు. చెవులొగ్గి యాలకింప సాగిరి. నిర్లిప్తుడై సమీపమున నున్న సూర్యకవి సాహచర్యము వారిని నిర్వాక్కులను గావించెను.

వారికిని దూరమున నార్తనాదములు వినవచ్చినవి. అంత కొంతసేపటికి పోరాడుచున్న శబ్దమును కొంచెము కొంచెము వినవచ్చినది. ఎవరో కూలుచున్న ధ్వనియు వినబడినది. అంత కొంతవడి నిశ్శబ్ద మైనది. వారి కిద్దరకు ప్రాణము లెగిరిపోయిన ట్లయినవి. అంతలో మరల పోరాడుచున్న యలజడి కొంచెము సమీపమున వినసైనది. ఆ లోనరణ్య మంతయు శంఖనాదములతో బోరు కల గుట వినిపించినది, అవి మల్లారెడ్డి యనుచరులు గావించిన శంఖనాదములు.

వా రాలించుచున్నట్లుగనే, కొంచె మావల పంట తల్లి సివ్వక్కయు, ఆమె చిన్న కుమారుడు చిన్నయ్యయు నిద్దురపోకుండ ఆ ధ్వను లాలకించు చుండిరి. వినుచున్న కొలదిని వారికి భయ మెక్కువగు చుండెను. శంఖనాద ములు వినవచ్చుటతో సివ్వక్క అక్కడ నాగలేక సమస్తము వదలివైచి చిన్న య్యను దీసికొని సూర్యకవి కడకు వచ్చినది, ఆమె అమాయికముగా తన పెద్ద కుమారుని ఊరకే తిట్టిపోయ సాగినది.

'అయ్యో, పోతమ్మ తల్లీ, మా పెద్దవాడు వట్టి దున్నపోతమ్మా! చావుకు సిద్ధముగా నున్న నన్ను, ఏమీ ఎరుగని ఈ పసికాయను, ఒంటరిగా వదలి ఎక్కడికో చావబోయినాడమ్మా! - వీడి కెందుకు, ఎవరో చస్తూఉంటే అటు పోవడము? - పొయ్యే కాలము కాకపోతే, చచ్చేవాళ్ళను రక్షించేది ఈ పడిచచ్చినవాడేనా? -'

తిట్లరూపములో నున్న సివ్వక్క-దీవనలు అల్లాకే రీతిగా సాగిపోవు చున్నవి. వినలేక పోతమ్మ అడ్డు వచ్చినది.

'సివ్వక్కా, అట్లా అనరాదు, తప్పు ! - తిట్టబోకు !'

సివ్వక్కకు వలెనే పోతమ్మకును అక్కడ కాళ్లు నిలుచుటలేదు. కుమారు లేగిన చోటికి పోవలె నని ఆత్రము వా రిరువురు కనబరచిరి. సూర్యకవి వెను కాడెను. అతనిని ప్రాణభీతికంటె మాన భీతి ఎక్కువ బాధించు చుండెను. గట్టిగా నెప్పుడు భర్తతో మాటాడు నలవాటులేని పోతమ్మ ఈరాత్రి వాక్కులో గడుసు దనము చూపినది.

'మన పిల్లవాని కంటె మన కిహములో ఎక్కువ వేమున్నది ? మన పర మున్నకైనా వాడేగతి కదా !'

సూర్యకవి యంతమాత్ర మెరుగును. 'ఈ యవనులున్న చోటికి స్త్రీలను తీసికొని పోవుటకు జంకుగా నున్నది.' - ఇట్లనుచు నాతడు కోడలి వంక జూచెను.

మహాలక్ష్మి కేమియు దోపక కన్నీరు కార్చుచున్నది. పోతమ్మ యూరు కొనలేదు.

'నా కొడుకును రక్షింపు డని ఆ యవనుల కాళ్లు పట్టుకొని బ్రతిమాలు కొందును - వారు మాత్రము మనుష్యులు కారా ? జాలి యుండదా, అంత మాత్రము ?' - ఆపై నామెకు ఏడుపులో మాటలు మాటువడినవి. ఆపాదమస్తకము కంపింప నామె యేడ్చుచున్నది.

సూర్యకవి చకితు డయ్యెను, ఆతడు కిట్టూర్చుచు కోడలి వంక జూడ, నామెయు భర్తయున్న కడకు పోవలెనను వ్యగ్రత యున్న దాని వలెనే కని పించెను. స్వయముగా సూర్యకవికిని పోవలె నని కాళ్లు తొందరించుచున్నవి. పోవుట క్షేమము కాదని యాతని ప్రాజ్ఞత నిగ్రహించు చుండుటచే సంకోచించు చున్నాడు.

'ఈ గోమాతను వత్సమును ఏమి చేయుదుము ? జెబ్బులి యింతకు ముందే యావల బొబ్బ పెట్టినది. ఈ కులదేవతను వదలిపెట్టిన మనకు శుభమా ?'

సూర్యకవి మాటలు విని పోతమ్మ మాటాడ లేక ఏడ్వసాగినది. సివ్వక్క తొందర ఎక్కువైనది.

'వాని కేమీ భయము లేదు, సూరయ్యతండ్రీ! వెంటనే పోయి వద్దాము. బయలుదేరు నాయనా !'

శంఖారావములు వినవచ్చిన దిక్కుగా వారందరు బయలుదేరిరి. వృద్ధుడగు సూర్యకవి తనకూతగా వెదురుకర్ర తీసికొని సాగెను. పోతమ్మయు సివ్వక్కయు చెరియొక ఊతకర్రయు కొనిరి.

వా రెక్కువ దూరము పోలేదు. చుట్టును అరణ్యములోనుండి అనేక నాగసర్పములు బుసకొట్టు చున్నట్లు ధ్వని వచ్చినది. వారికి కాళ్ళు సాగుటలేదు. అందులో బుసయొకటి వాగ్రూపము దాల్చినది.

'ఆగండి !'

సూర్యకవి క్షణమాగి చుట్టుపక్కలు పరికించెను. ఏమియు కనబడలేదు. అది పిశాచముల అరుపా? అతనికి పిశాచభయము లేదు. మరల నాతడు దారి తీయుచు బయలు వెడలెను.

ఈమారు మరింత స్పష్టముగా, 'ఆఁ! ఆగండి!' అనునాజ్ఞ గర్జనమువలె వినబడినది. దానితో పాటుగా వారిమార్గము నిరోధించుచు శరవర్షము పడినది.

'బాబో!' అనుచు సివ్వక్క కర్రవదలి కుప్పకూలినది. చిన్నయ్య భయా వేశముతో తన కాళ్ళు తీసికొని పోయినదారిన పారిపోయెను. అది చూచి సివ్వక్కయు ఏడ్చుచు లేచి పరుగెత్తినది. భయముతో పోతమ్మయు మహాలక్ష్మయు పరుగెత్తిరి. నలుగురు నాలుగు దారులైరి. సూర్యకవియొక్కడు ఏమిచేయను తోపక నిలిచిన వాడు నిలిచినట్లే కర్ర యూతగా నిలువబడి పోయెను.

అరగడియ గడచిపోయినది. పోతమ్మ ఆతురతతో కోడలేదని వెదకుచు నచ్చటికి వచ్చినది. ఇరిరెండు నిముషములకు చిన్నయ్య కొరకు వెదకుచు సివ్వక్కయు నక్కడికే చేరినది. ఆమె ఏడుపు తిట్లు సమపాళముగా నున్నవి. తిట్లన్నియు పెద్ద కుమారునకు, ఏడుపంతయు చిన్నవాని కొరకు !

'నీవు చచ్చినది కాక, దిక్కుమాలినవాడా, నా పసితండ్రిని కూడా నాకు కాకుండా చేయదలచినావురా !- అయ్యో !-'

పోతమ్మ కాలు కాలిన పిల్లి వలె నిలువజాలక అపరాధ మొనర్చినట్లు భర్తవంక దీనముగా చూడసాగినది. సూర్యకవి నిశ్చేష్టుడయ్యెను.

అంతలో నావల కొంతదూరమున చెంచులు జేజేలు పెట్టుచు, వెర్రికేకలు గంతులు వేయుచు వెళ్ళుచుండుట వారికి వినవచ్చినది, అటువైపు వెళ్ళుటకు దారి ఏదో కూడ వారికి తోచలేదు.

చేతనైనంతవరకు వా రా చుట్టుపట్టుల నెల్లెడల వెదకిరి. కేకలు వేసిరి. బదులు రాలేదు. మహాలక్ష్మి కనబడలేదు. చిన్నయ్య కనబడలేదు. వారిజాడయే లేదు. వారికై వెదకుచు పోయి పోయి వీరును అరణ్యము పాలైరి. చెంచుల ఘోషకూడ అడవిలో నడగిపోయినది.

11

చెంచులు మనకు సమీపభూములనే నివసింతురు. వారు మనము నివసించు తావులకు వచ్చుచు బోవుచు నుందురు. మనము వారు నివాసస్థానముల గుండ యాత్రలు చేయుచుందుము. వారిని గూర్చి యనేక గ్రంథములు పుట్టినవి. అయిన నేమి? వారు మనకు క్రొత్తవారే. చిత్రమైనవారే. మన మెరుగని ఆచారములు గుణములు దోషములు వారి కెన్నియో కలవు. వారు కృపణులవలె కనబడినను అభిమాన మున్నవారు, అభిమానభంగము వారు సహింపరు. వారప్పుడు కసి తీర్చుకొందురు. అది వారు చేయు దండనము దుర్మార్గులని మన మప్పుడు వారిని నిందింతుము. వారిజాతి వేరు. వారి లక్ష్యములు వేరు, వారే వేరు.

చెంచుల ప్రకృతి తెలిసికొనవలె నన్న. వారి యాత్మాభిమానము ముందు అవగాహన మొనర్చుకొనవలెను. సృష్టిలో నెల్ల తామే యుత్తమ జాతివార మని వారు విశ్వసింతురని మన మూహింపగలమా? ఎవరికి వార మటువంటి విశ్వాస మున్నవారమే యైనను, ఇతరుల కున్న దన్నచో నమ్మలేము. వారి యాచారములే వారి యూహలో నుత్తమోత్తమములు వారి నమ్మకములే నిజమైనవి. వారి దేవతలే సత్య మున్నవారు. వారి కట్టువేరు. వారి యలంకారము వేరు. వారి వాలకమే యోగ్యులెల్లరు ననుసరింప దగినది. వా రితరులతో గలియరు; ఇతరులను తమలో గలిపికొనరు. అదియే వారి యాత్మగౌరవమునకు

పరమావధి. గీటురాయి. వారిలోకూడ కులము లున్నవి. అందులో ఒక కులము వారు ఇంకొక కులము వారి తో కలసిపోవరు.

వారి వీటిపట్టులు అరణ్యములు, పర్వతములు. పర్వతారణ్యములు వారి స్వదేశములు, స్వత్వములు. అందలి వెదురు పొదలు వారివి. అరణ్యవస్తువు లన్నియు వారివే. అన్నిటిలో విలువగల తేనెతెట్టెలు వారి పెన్నిధులు.

తేనెతెట్టెలు చెంచుల జీవితములో అవినాభావముగా మిళితమైపోయి నవి. ఇతరజాతి మానవు లెవ్వరు సమీపింపనుగూడ సాహసింపని కొండ యీగలు పట్టుతేనె పెరలనుగూడ వా రవలీలగా కొట్టగలరు. తక్కిన మానవ జాతికి ఇతర విషయము లెన్నిటిలో ఎంతటి నేర్పున్న మాత్ర మేమి ప్రయోజ నము ! అమూల్యము లైన కొండ యీగల తెట్టెను కొట్టలేని నేర్పు లన్నియు వ్యర్థములు.'

ఆ యీగలు మనుష్యమాత్రుల కందని ప్రదేశమున కొండరాతికి తమపెర పెట్టును. అదిచూడ ప్రేలుచున్న మహాకాళిశిలవలెనే భయంకరముగా నుండును. దానినిచూచిననే ఇతరుల కంతదూరమునుండియే అసహ్య మావేశించును. మరి చెంచుకో? అతనికి దానియెడ ననిర్వాచ్య మగు నాకర్షణము ఉదయించును. ప్రియురాలి ముఖమును. యౌవనముతో పొంగారు దాని యవయవ్వనలమును, దాని సర్వాంగ సౌష్ఠవమును చూచినపుడు కలుగు ఉత్కంఠవంటిదే, అట్టి తెట్టెను చూచినప్పు డాతనికి కలుగును. దాని ననుభవింప నాత డుద్రిక్తు డగును, దానిని లభించి యనుభవించు పెట్లా యను నాలోచన యాతని వేధించును.

ఆతేనె తెట్టె ప్రేలుచున్న కొండరాతి యడుగున అగాధ మగు లోయ యుండును. ఆలోయ కీవలకొండపై అనువైన వృక్షము చూచుకొని దాని నత డధిరోహించును. ఆచెట్టుకొమ్మకు బలమైన త్రా డు ప్రేలాడగట్టి వాడు ఆత్రాడు పట్టుకొని తేనెతెట్టె వైపునకు ఊగును. ఆట్లు ఊగి ఊగి ఓడుపుగా చరియ కావలనున్న కొండ తేనేపెర నందుకొని ఆ ఊపులోననే దానిని కోసివేయును. ఆకోసిన పెర అతనిది. అతని కది రాజ్యలాభమువంటిది, నూతన ప్రియాస మాగమము వంటిది. కవీశ్వరునకు ఆత్మలో ప్రత్యక్షమైన ఉత్తమకావ్య సత్యమువలెనే ఆ మధుకోశ మాతనికి విందొనగూర్చును. అత డాడుచు పాడుచు దానిలోని మధు వంతయు తన ప్రియురాలితో, పిల్లలతో, బంధువులతో, మిత్రు

లతో విందారగించును, తేనెయే కాదు. అందలి మైనముకూడ చెంచు లాప్యా యముగా భుజింతురు. వారు సృష్టిలో విశిష్టులు కారా ?

చదువు లున్నవారు తమతమచదువులకు గర్వింతురు. చెంచులవలె కొండతేనె పెరలు కొట్టి విందారగించు విద్య మరియెవరికి వచ్చును? మంచి వ్రాయసకాడు క్రొత్తగా వ్రాయనేర్చుచున్నవాని చేతుల మోటు కదలికలు చూచి హేళన చేయునట్లే, ఇతరులు తేనెతీయుటను చెంచులు పరిహసింతురు.

చలియైన వానయైన వారిలో పురుషులు గోచితప్పి ధరింపరు. ఆగోచి ఎంత యందముగా ధరింతురు! ఆ రంగులు అంచులు పట్టెలు - వానిముందు విలువగల అంగీలు ఎందుకు! అడుగడుగునకు నడక కడ్డము వచ్చి, మానవ స్వేచ్ఛను నిరోధించు వస్త్రభారము భరించు జనులు వారి దృష్టిలో వెర్రివారు. వారికే ఏమి? కాపీనవంతః ఖలు భాగ్యవంతః - అని పెద్దలు చెప్పలేదా ? వారికి కాపీన ధారణమునందు గల యభిమానము దురభిమాన మనిపగదు.

వా రట్లు గోచులే ధరించినను రాజులు, వారు చెంచుదొరలు. పురుషులు చెంచురాజులు, స్త్రీలు చెంచురాణులు. వారితో వ్యవహరించువారు ప్రభువులతో వ్యవహరించునట్లు వ్యవహరింపనిచో వార లోర్వరు. వారికి గౌరవమిచ్చిన, వారును మనకు గౌరవ మిత్తురు. లేనిచో వారు వట్టిమాటలతోకాదు కాస్తి చేయు నది! అంపటలుగుతో వారు కాస్తి చేయుదురు. అది వారి యాచారము, వారి కాస నము. అందుచే వారిని క్రూరు లనరాదు, నిర్వీర్యు లైనవారే. అవమానము పొందియు కసి తీర్చుకొనలేనివారు ! మరి చెంచులో ? వీరులగు ప్రభువులు ! అందుచే వారికి ప్రాణభయము లేదు. దేహముపై అభిమానము కల యజ్ఞా నులు కారు వారు. హత్య చేసిన వారిని మనము న్యాయాధికారి కప్పగించి మరణదండన విధింపజేయుట లేదా ? అది తప్పా ? మరి చెంచులో ? వారు స్వయంప్రభువులు ! కావున తమ్మవమానించిన వారికి స్వయముగా మరణ దండన విధించి, వారే వెంటనే యా శిక్ష బాణప్రయోగముతో నిర్వర్తింతురు. అది వారి శిక్షాస్మృతి. క్షణక్షణము మారుచున్న మన శాసనములు మే లైనవని మన కభిమాన మున్నప్పుడు, అనాదిగా వారికి విహితమైన చెంచుశాసనములు వారేల వర్తింప జేసికొనరాదు !

వారు నివసించునవి పర్వతారణ్య భూములు : లోయలు సెలయేటి యొడ్డులు వారి విహార స్థానములు. విశాలమగు బయళ్ళలో పెద్ద పట్టణములు కట్టుకొని గోడలమధ్య చెరసాలలోవలె రాత్రింబవళ్ళు నివాసము చేయువారికి ఎట్లు ప్రొద్దుపోవునో చెంచుల కర్థముకాదు. అడవిమధ్య, కొండపడియ వద్ద, చదరపు రాతిమీద, తమ గుడిసెలు గుంపుగా నిర్మించుకొందురు. వారికి కను చూపు మేరలో అడవి, కొండ, లోయ, వాగు, కనబడకున్న ప్రాణములు పోయినట్లుండును. కవు లెందరో కాకలె నని కలలు కనునట్టి జీవితములు వారికి నిత్యవ్యవహారము లోనివి.

భరతదేశములో వారెక్కడ నేపేరుతో నున్నను అందరు నొక్కటే మొదలు : వా రాదిదంపతుల స్వీయ సంతానము; పార్వతీ పరమేశ్వరుల కన్న బిడ్డలు. తాము మానవులం దెల్ల నుత్కృష్టు లని చెంచుట పొరపాటా ?

అంతేకాదు, శ్రీకృష్ణుడు వారి బావమరది. వారి యింటి యల్లుడు చెంచు కులమున బుట్టిన చెంచులక్ష్మిని శ్రీకృష్ణు డనాది కాలములో వివాహ మాడెను. అప్పు డాతడు ఓలిగా చెంచులకు వెదురుపిడియము శాశ్వతముగా నిచ్చి యుండెను. ఓలి చెల్లింపనిది పిల్ల నెవరిత్తురు ? చెంచేతను మోహించి శ్రీకృష్ణు డామెను తన కిమ్మని వేడుకొనగా, చెంచులు ఆమె నాతని కనుగ్రహించి, ప్రతి ఫలముగా వెదురు జీవనము సంపాదించు కొనిరి. వా రది ఏల వదలుకొందురు? వెదురు పొదలు వారివి, వెదుళ్ళు వారివి. వెదురుచే సంగీతము పాడించు విద్య వారిది. వేణువు వారిది. వేత్రకృతవస్తువు లన్నియు వారివే! తమ ద్రవ్యము లితరు లెత్తుకొని పోయిన వారు సహింతురా ?

శ్రీకృష్ణు డిచ్చిన ఓలిని ఓబివేశుడు స్థిరపరచెను. ఏడుకొండల వెంకటే శ్వరుడు దానిని మరల దృఢ మొనర్చెను. మరియు కొండలపై వెలసిన దేవత లెందరెందరో దానిని అంగీకరించిరి. అహోబిలేశ్వరుడు, ఏడుకొండల వెంక టేశ్వరుడు చెంచులనుగ్రహించిన రాణుల వల్లనేగదా, ఒక యింటివారు కాగలిగినది !

ఇంతేకాదు. వనదేవత చెంచులది. నదీదేవత వారిది. కొండదేవత వారిది. శ్రీశైల పర్వతములోని ప్రతిశిలయు శివలింగ మహిమ కలదని శైవు లందురుగదా! ఒక్క శ్రీశైలమే యేమి? అన్ని కొండదేవతలు చెంచులవే!

వారిని మనము నిరసింప గారణమేమి ? ఎల్లప్పుడు ఇప్పిపూవుల మద్యము త్రావి మత్తిల్లియుందు రనియా? నిజమే, ఇప్పసారము వారికిష్టమే. ఇష్టమేకాదు, వారికది ప్రాణము. వారికి ప్రియమైనవికదా, తేనెపెరలు; చెంచుల జాతియే తేనెటీగల జాతి. అవి ఇప్పపూల తేనె త్రావి రేయింబవళ్లు ఝంకార మొనర్చును. వీరు ఇప్పపూవుల సారాయము త్రావి పాటలు పాడుచు గంతులు వేయుదురు. ఇప్పచెట్లు వనదేవతా ప్రత్యక్షమూర్తులు. ఇప్పచెట్ల నీడలనే వారు విశ్రమింతురు. ఇప్పపూలు వారి యాహారము. మాదకములు, ఇప్పసారాయ ముతో ప్రాణములు వదలుట వారి కభిమతము. రఘువంశరాజులు అంతకాల మున యోగముతో తనుత్యాగము చేయువా రని మహాకవి కాళిదాసు గొప్పగా వర్ణింపలేదా? ఈ చెంచురాజుల కీది యోగము !

వారు మత్తిల్లి తేనెటీగలవలెనే గానము చేయుదురు. తేనెటీగల గానము వారు చిత్రించినట్లు మరియొకరి భాషలో చెప్పలేము, చెంచుల సోదరు లైన సవరలపాట చూడండి :

* 'బుజ్, బుజ్, గామ్లై గూతాఇ
తర్బా పోజ్ ఇజ్ తాఇ పోజ్, ఎజ్జా పోజ్-'

చెంచుల గూడెములు తేనె పెరలనే అనుకరించును. వెదుళ్లు వంచి వారు గుడిసెలు కట్టుకొందురు. ఒక గుడిసె మరియొక గుడిసెకు సమీపముగా నుండి రెండును కలసినట్లే యుండును; సరిగా తేనెపెరలోని గదులు దగ్గర దగ్గరగా నుండునట్లే! ఈగల రాణివలెనే మధ్య గూడెము దొర యుండును, పైనుండి చూచినచో చెంచుగూడెము సరిగా నేలపై పరచిన తేనెతెట్టెవలెనే కన్పట్టును

చెంచుల కాత్మాభిమాన ముండుటలో ఆశ్చర్యము లేదు. ఎవరికి లేదు? లోకములో నెవడైనను తన దేహమునకు తన పిల్లలకు బదులుగా మరియొక దేహమును మరియొకరి పిల్లలను - ఎంత మంచివానితోనైనను - మార్పుచేసి కొనుట కంగీకరించునా ?

---

* 'బుజ్ బుజ్ అని ఝంకారము చేయుచున్నాను. పువ్వేదైనా దొర కును దొరకదా ?' ఇది సవరల తేటిపాట. దీనిని శ్రీ చింతాదీక్షితులు 'శబరి'లో తెలుగులోకానికి ముందు పరిచయము చేసిరి.

చెంచుల కింతే కాక మరియొక విశేషమున్నది.ఒక నొకప్పుడు చెంచుజాతి ఇతరుల జోలి యేమాత్రము లేక తమ పర్వతారణ్య భూములలో స్వర్గములో వలె సుఖముగా స్వతంత్రముగా మనియుండెను. అప్పు డీ ప్రపంచ మంతయు విహారణ్య పర్వతమయము. ఈ సంగతి వారి జాతిస్మృతిలో గాఢముగా నాటుకొన్నది. వరల నట్టిరోజులు రాగల వనియు, చెంచుఁ బ్మీ యవతరించి అట్టి యానందస్థితి తమకు ప్రసాదింపగల దనియు వారి దృఢ విశ్వాసము.

మధ్యమధ్య వారి కట్టి స్వాతంత్ర్యము వచ్చు సూచనలు కనిపించును. సోదెలు చెప్పువారు దేవత పూని మాట్లాడుదురు. చెంచుపెద్దలకు పిన్నలకు కల లలో నానా రూపములతో కొండదేవత కనిపించును. దానితో చెంచుగూడెము లలో నుత్సాహము వెల్లివిరియును, మద్యపాన మెక్కువగును, పాట లతిశయించును, ఆటలు చెలరేగును. వారికి మొండిధైర్య మావేశించును. వా రొక్కమ్మడి విజృంభించి చుట్టుపట్టుల గ్రామములపై బడి దోచివేయుదురు. ఎదురైన బాటసారుల హింసించి చంపి దోచుకొందురు. చెంచులలో పిచ్చి సాగిన దని ప్రాంత జనులు భయపడి నిర్ణిద్రు లై యుందురు.

ఇప్పటికి కొంతకాలముగా నటువంటి కదలికయే నల్లమల యడవుల చెంచులలో వ్యక్తము కాజొచ్చినది. సాధువుగా కనబడుచున్న చెంచు ఒకడు మాటాడుచు మాటాడుచునే ఒకనాడు ఎదుట నున్న యొకగ్రామస్థుని పైన ఆకస్మికముగా పడి నిష్కారణముగా చంపివేసెను.

పిడుగు లేల పడవలెను ? ఉరుము లేల ఉరుమవలెను ? వర్షమేల కురియును? ఒక్కొక్కసారి పడగండ్లేల పడును? కారణము ఎవరికీ చెప్పశక్యము కాదట. శాస్త్రజ్ఞులు వారే మో! ఈ సందర్భములలో ఉరుమును, వర్షము కురియును, పడగండ్లు పడును.- అని భౌతిక శాస్త్రజ్ఞులు చెప్పగలరు. జ్యోతిష్కులు జాతకము చూచి, జరిగిపోయిన దానిని ఇట్టి గ్రహస్థితిచే ఇది సంభవించిన దని సమర్థించు దానివంటిదే. ఆదియును ఇక్కడే ఈవర్షము, ఇప్పుడే ఈ ఉరుము ఈపిడుగు, ఈ పడగల్లు ఏల పడవలె? ఆదెబ్బ ఇతనికే తగులు టేల? ఎవరు చెప్పగలరు? మరి మిడుతలదండు ఏల వచ్చును? ఇక్కడే ఏల? ఇప్పుడే ఏల ?—

ఈ చెంచు విచిత్రకర్మను గూడ, భౌతికశాస్త్రజ్ఞులు వై విషయములను గూర్చి చెప్పునంత మాత్రము విస్పష్టముగా, మానసిక శాస్త్రజ్ఞులు వివరింప

లేకపోరు, అతని కాబుద్ధి పుట్టినది కనుక అని. ఎందుకు పుట్టినది ? అతని సంస్కార మట్టిది. అకారణముగా వనకొకరిపై ప్రీతి కలుగును, ఇంకొకరిపై నసహ్యము కలుగును. అందుకు కారణ ముండ ను కాని మన కది యవగతము కాదు. అవగతము కాని కారణమునే విధి యందుము.

అట్టి విధి వలననే కావచ్చును. చెంచులలో మధ్యమధ్య ఈపిచ్చి యల జడి పుట్టుట: ఆకు రాలినచెట్లు చిగిర్చినట్లే, ఆకు పు చినట్లే, కాచినట్లే, సెల యేరు, పట్టి నట్లే పారినట్లే ఉపశమించినట్లే:

కొంతకాలముగా సేనాసమూహము లీ దరిని సాగిపోవుచున్నవి. వారి దురంతములను నిరాఘాటముగా సాగుచున్నవి. ఇప్పుడు తురకల మూకలు శ్రీశైలారణ్యముల చట్టుపట్టుల చెలరేగు చున్నవి. కనబడిన జనులను తురుష్కులు నిష్కారణముగా హింసించుచు దోచుచున్నారు. శరీరవ్యాధుల లెనే మాంసాజుద్ధి కూడ అంటువ్యాధియే. అది యొకరి నుండి యొకరికి ప్రాకును. తురుష్కులనుండి ప్రాకి కాబోలు, ఇప్పు డా హింసావ్యాధి నల్లమల చెంచు గూడెములకు సోకినది.

ఒక్క చెంచుకు ముందు సోకిన యీవ్యాధి మరియొకచోట నలువరకు అంటినది. ఇంకొకచోట ఒక గూడెము గూడెమే అట్లయినది. తమ కుపకారము చేసినవారికే వా రపకారము చేయ సాగించినారు. కొలది వస్తువు లపహరించుటకే కనబడినవారిని నరికివేయుచున్నారు. రాత్రు లూళ్ళపై దోపిడులకు పడుచున్నారు. తమ్ము ప్రతిఘటించి నరకి వేయుచున్నను వారు లెక్కచేయుట లేదు. తమ ప్రమాదము ఎదిరి ప్రమాదము వారు గమనించుట లేదు. ఇప్పికల్లు సేవించుట మితిమీరు చున్నది.

గూడెము గూడెమునను కొలుపులు సాగుచున్నవి. రాత్రులలో గూడెముల చుట్టును నెగళ్ళు ప్రకాశాతిశయముతో వెలుగుచున్నవి. చెంచుల తప్పెటలు రుంజలు మ్రోయుచున్నవి. వారి నాట్యములు సాగుచున్నవి. స్త్రీలు బాలురు వృద్ధులు పదములు వేయుచున్నారు. సోది చెప్పువారు చెంచులక్ష్మి ఆగమనము చెప్పుచున్నారు. గణాచారులకు గణముహూని చెంచులక్ష్మి అవతరించిన దని నిర్ధారణగా ప్రకటించు చున్నారు.

అట్లవతరించిన చెంచులక్ష్మైకి వా రన్వేషణ మారంభించినారు. ఆమె యెడ వర్ణింపరాని భక్తి ఆకస్మికముగా వారి నావేశించుచున్నది. చెంచులకు అరణ్య స్వరాజ్యము శీఘ్రమే నిష్కంటకముగా స్థిరపడునను నాశ దృఢమైనది.

మరి ఈ చెంచులక్ష్మి ఎవరు? అది చెంచులకే తెలియదు. చెంచులక్ష్మి యే రూపములో నుండును? అదియు వారికి తెలియదు. మరి వారు చెంచు లక్ష్మిని గుర్తించు పెట్లు? చెంచుల కదియు తెలియదు, ఏమైన నేమి? చెంచు లక్ష్మి శీఘ్రముగా ప్రత్యక్షమగు ననుమాట నిశ్చయమే.

చెంచులక్ష్మి చెట్టుగా నుండునో, పుట్టగా నుండునో, గుట్టగా నుండునో- అవి యన్నియు నైయుండునో? ఏమియు కాకయు పోవచ్చును. కరుణింప దలచిన చెంచులక్ష్మి ఆవేళకు తానే వారికి తన్ను గుర్తించు దారి అనుగ్రహింప లేదా? ముందుగా నట్టి దీర్ఘవిచారణ కావించుటకు, నాస్తికుల కండునట్లు వారికి వ్యర్థ సందేహములు వృథాలోచనలు లేవు. వారి హృదయములు నిర్మల మైనవి, మోసము తెలియనివి.

కృష్ణవేణీనది శ్రీశైల పర్వతమును ప్రదక్షిణించుచు పాతాళగంగయొద్ద ఉత్తర వాహినిగా ప్రవహించుచు పూజ్యతరముగా నున్నది. ఆ సమీపముననే నృసింహ బిలమొకటున్నది. దానియొద్ద చెంచుగూడె మొకటి కలదు. అదే పెద్దగూడెము. దానిపెద్దయే నల్లమల చెంచుల కందరకు పెద్దదొర.

శ్రీశైల క్షేత్రమునకు వచ్చిన యాత్రికులు పాతాళ గంగాతీర్థములో తానమాడుటకు వేనకువేలుగా పోవుదురు. అక్కడికి పోవుటకు మెట్లులేవు. చుట్టుగా పోవు కొండబాటమాత్ర మున్నది. ఆ సన్ననిదారిని క్రోశముదూరము వారు నడచిపోవలెను. ఆదారిని కాచుచున్నది చెంచుగూడెము. కొంతకాలమునుండి తీర్థయాత్రికులు పాతాళగంగకు స్నానమాడ బోవుటకు చెంచుల భయముచే జంకుచున్నారు. ఆ మెట్ల యొద్ద చెంచుల కట్టడిపన్ను చెల్లించినవారికే ఆపద తప్పుట లేదు. మరి తక్కినవారికో?

కొంతకాలమునుండి జనులు తండములు తండములుగా చెంచులకు పలకలు వచ్చుచున్నారుగదా! వారిలో కొందరు చెంచులకట్టడి చెల్లించుచున్నారు; కొందరు చెల్లించుట లేదు: పలువురు చెల్లింపలేకున్నారు ఎవరు చెల్లించిరో ఎవరు చెల్లింపలేదో గుర్తించుట వారి కిప్పుడు అవసరముగా నున్నది. కట్టడి

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I 77
Acc. No.
1787

చెల్లింపక తమ రాజ్యములో ప్రవేశించినవారిని శిక్షించుహక్కు చెంచుదొరలకు అనాది సిద్ధమైనది.

చెంచుల పెద్దదొరయైన భీమరాజు ఆ శరత్పూర్ణిమారాత్రమున వేటకు బయలుదేరెను. ఆతని కట్టహాసము చాల కలదు. పరిజను లెందరో వెంట నానాయుధములు ధరించి వత్తురు. ఆ యట్టహాస మంతటితోడ నాతడు బయలుదేరెను.

ఈనాడాతడు బయలుదేరినది మృగముల వేటకుకాదు, పక్షుల వేటకును కాదు—మనుష్యుల వేటకు! పన్నులీయక తప్పించుకొని తన రాజ్యములో ప్రవేశించిన వారిని బట్టి శిక్షించు వేటకు ఆత డట్లు బయలుదేరి పన్నులీయని వారిని పలువుర బట్టుకుని కఠినముగా శిక్షించెను. మరల గూడెమునకు చేరుకొంద మనుకొనుచుండగా, నావల బెబ్బులి గాండ్రింపు వినబడినది. అది యాతనికి శుభసూచనముగా తోచినది. వ్యాఘ్రము చెంచులక్ష్మి వాహనము కదా! చెంచులక్ష్మి తన కారాధ్రి ప్రత్యక్షము కానున్న దను దృఢభావ మాతని కుదయించినది.

వారు సాగుచుండగా సూర్యకవి ఇత్యాదులు అడవిలో పోవుచు పొడ కట్టిరి. వారు కట్టడి చెల్లించిన వారో కాదో తెలిసికొనుటకై 'ఆగండి!' యని వారిని నిలువ వేసిరి. సూర్యకవి తప్ప తక్కినవా రడవితో చెల్లాచెదరైరి. భీమరాజును పరివారమును వారికై అరణ్యము నాలుగు చెరగులు గాలించుచుండిరి.

భయముతో పారిన మహాలక్ష్మి పోయిపోయి వారినుండి తప్పించుకొనుటకై యొక ఇప్పచెట్టు చాటున దాగినది. ఇప్పు డామె చెంగావిచీర కట్టుకొనియున్నది. అది మాసియున్నను వెన్నెలలో ఒకానొక వింతకాంతు లీనుచున్నది, ఒక ప్రక్కనుండి పడుచున్న వెన్నెలకాంతి యామె శిరస్సుచుట్టు చిరుమంచుతో నొకకాంతి చక్రమును పరివేష మట్లు కన్పించినది.

అట్లున్న మహాలక్ష్మిని కొంత దవ్వుననుండి భీమరాజు ఉపలక్షించినాడు. ఆతని జూడగనే ఆమెకు భయ భ్రాంతితో నొక్కమారుగా కన్నులు నిర్నిమేషము లైనవి. ఆమె కేవలము దేవతా మూర్తిగనే అప్పుడున్నది.

అట్లా ఇప్పచెట్టుక్రింద ప్రత్యక్షమైన మహాలక్ష్మిని చూచి చెంచుదొర ముగ్ధుడయ్యెను. ఆతడు పిన్న బెబ్బులి బొబ్బ ఆ ప్రాంతమునుండియే వచ్చి యుండెను. కవికి కావ్యమువలెనే ఋషికి మంత్రము వలెనే, పెద్ద చెంచుదొర భీమరాజుకు మహాలక్ష్మి పరదేవతామూర్తిగా భాసించినది. ఆమెయే వనదేవత. ఆమెయే కొండ దేవత. ఆమెయే చెంచులక్ష్మి! హృదయములోనుండి యాత నికిభక్తి యొక్కపెట్టున మహోల్బణమువలె పొంగినది. వెంటనే వాడామెకు దేవతకువలె సాగిలపడి మ్రొక్కెను. అదిచూచి వెంటనున్న చెంచు లందరు ఒకరి తర్వాత నొకరు వచ్చి ఆమెకు సాష్టాంగముగా ప్రణామ మొనర్చుచుండిరి.

ఒకడు, 'చెంచులక్ష్మి, దండము తల్లీ!' అనెను.

మరి యొకడును అట్లే పేరుపెట్టి నమస్కరించెను.

ఇంకొకడును ఆపేరనే సంభోధించి మ్రొక్కెను.

'చెంచులక్ష్మి! చెంచులక్ష్మి! చెంచులక్ష్మి!' - అందరు నదేమాట!

'మనల నుద్ధరించే రాణి! - రాణి యవతరించినది! - మన దేవత! - మన తల్లి! - చెంచుల రాణి! - లక్ష్మి! - చెంచులక్ష్మి! - చెంచులక్ష్మి! -'

ఎన్నాళ్ళుగానో అవతరింప జేయుటకు చెంచులు తపస్సు చేయుచుండిన చెంచులక్ష్మి వారి కీనాడు ఈ రూపముగా ప్రత్యక్ష మైనది! వారి వెర్రి భక్తి ఎవరు వర్ణింప గలరు!

జేజే నినాదములు చేయుచు కొంచెము సేపటి లో వారు పచ్చి కొమ్మలు నరకి వానితో అందలము కట్టి, దానిని ఇప్ప చిగుళ్ళతో పూలతో నలంకరించిరి. భయభక్తులతో, గద్గదమైన కంఠముతో, కన్నుల నోడికలు కట్టుచున్న యావేశ బాష్పములతో భీమరాజు దూరమున నుండి మహాలక్ష్మికి మ్రొక్కి యామె నా యందల మెక్కుమని ప్రార్థించెను. ఆమెను సమీపించుటకు గూడ నాతడు సాహసింప లేదు.

మహాలక్ష్మి భయ సంభ్రమాశ్చర్యములతో నిశ్చేష్టయై యాయుత్సవము నకు దేహ మప్పగించి అందల మధిరోహించెను. మహోత్సాహముతో చెంచు లా డోలికను తమ బుజములపై మోసికొనుచు పోయి మధ్యాహ్నవేళకు పెద్ద దొర చెంచుగూడెము నానుకుని యున్న నృసింహబిలము నొద్ద చేర్చిరి.

నృసింహ బిలములో ఆదికాలమునుండి తపస్సు చేసికొనుచు, సామాన్య మానవులకు కనిపింపని మహర్షులు నివసించుచున్నా రను ప్రతీతి కలదు. ఆ బిలము పవిత్ర క్షేత్రముగా భావించి యాత్రికులు మ్రొక్కి పోవుచుందురు.

చెంచులక్ష్మి విడిదికి యోగ్యమైన పుణ్యభూమి యది యని పెద్దచెంచు దొర యాకారణముననే నిశ్చయించెను. అక్కడ నున్న నృసింహమూర్తిని జూచినంతనే మ లక్ష్మి డోలిక దిగుచు నమస్కరించెను.

'చెంచుల మ్మ ఓ బిలేశునికి మ్రొక్కుచున్నది!—' ఇట్లనుచు చెంచులు చూపిన యుత్సాహమునకు మేరలేదు.

12

సర్వభూతములకు నేది నిశాకాలమో, ఆవేశ సంయమి జాగరూకు డై యుండునట! మల్లారెడ్డి అట్టి సంశయముల వలెనే రాత్రుల నిద్దుర పోడు. స్థూలకర్కశమగు నాతని కాయము వరుసగా నెన్నిరాత్రులు నిద్ర లేకున్నను ఏమాత్రము వసివాడదు సరికదా, పై పెచ్చు వన్నె పెరిగినట్లు కనబడుచుండును. ఆతని యనుచరులు పలువురు రాత్రులు నిద్దుర లేకుండగను, పగ లాహారము లేకుండగను నిరంతరాయముగా శ్రమపడ నభ్యసించినవారే. కాని వారందరలో మల్లారెడ్డి శక్తి అద్వితీయము, నిరుపమానము, అమానుషము!

అంతమాత్రమున నాతడు నిద్దుర పోనేపోడని కాదు. తరచుగా నాతడు విశ్రాంతి సమయము కనిపెట్టి పగలే గాఢమైన నిద్దురపోవును. అది నిర్వికల్ప సమాధినే యనుకరించును. విశ్రాంతికై పరున్న మరు నిమిషమునసే యాతని యంగము లన్నియు నిశ్చేష్టము లగును; మనస్సు నిర్విషయ మగును. ఆ నిద్దురయు నెక్కువసేపు పోడు అయిననేమి? సామాన్యుడు ఇరువది గడి యలు పోవు నిద్దుర అతడైదు గడియలలో పోగలడు. మిగిలిన సమయ మంతయు నాతని దేహము మనస్సు ఏదో కార్యమునలో ఆలోచనయందో నిమగ్నమై యుండును. కాని యాత డాందోళన పడడు. నిష్కామ కర్మయోగు లట్లే యుందురు కాబోలు! ఏపని యైనను సమగ్రముగా యోజించి సర్వాత్మనా వ్యవహరించి యత డాచరించును. తొందర లేదు. విసుగు, చిరాకు లేవు.

పనికి విఘ్నము కలిగినచో దానిని సాధించు నుపాయ మాలోచించునే కాని నిరు త్సాహ పడడు. ఎంత శ్రమపడినను అతని ఉత్సాహ మతిశయించును; ముఖ కళ పెరుగును.

ఎర్రయను పంపివేసినంతనే మల్లారెడ్డి మొదటి స్కంధావారమును చేరి కొనెను. అది మూలస్కంధావారము. అచ్చట ముందాతడు తల్లియగు నన్న మకు నమస్కరించి పెద్ద యదృష్టము తనకు త్వరలో రానున్నదని నివేదించెను. అతడు తల్లియొద్ద నింకను పసిపిల్లవాడే! ఆ తల్లికిని తన యైదుగురి పుత్రులలో కడసారివా డగు మల్లారెడ్డిపై మమకార మెక్కువ. అతనికి సంతోషము కలిగి నచో తల్లికి చెప్పికొననిది తృప్తి యుండదు.

'విస్సన జోస్యము ఫలించినదే అమ్మా! రాత్రి ఒక్కసారిగా పంట రెడ్డి, దేసటరెడ్డి, ఎర్రయ్య కలసినారు!'

తల్లి కించుక ఆశ్చర్యమైనది. ఏమి ఇత డిట్లను చున్నాడు? తాను పంట కులమురెడ్డి కాడా? దేసటి యన్వయమునాడు కాడా? ఎవరో పంటరెడ్డి, దేసటి రెడ్డి కలియు టేమి? ఎర్రయ ఎవరో?

ఇట్లామె తనమనస్సులో ననుకొన్నదేకాని పై కనలేదు. తొందరపడి మాట్లాడి పుత్రున కుత్సాహభంగము కావించు తల్లి కాదామె! ఆమె యిట్లన్నది:

'నాయనా, నిజముగానా నాతండ్రీ! నీకు కాకున్న మరి ఎవరికి అదృష్టము పట్టునురా! మరి పంటరెడ్డీ వాళ్ళేరీ?'

'పంటరెడ్డి, పాపము ఆకలితో అలసి పడిపోయినాడు. దేసటి రెడ్డిని పని మీద పంపినాను. అతని భార్య మిగిలిన యువతులు ఇక్కడికి వచ్చినారుగదా! అతని భార్య వీరమ్మట. ఆమెను నీవు పెంపుడు కూతురుగా చూచుకోవలె సుమా!'

'వీరమ్మ నా కడుపున బుట్టిన బిడ్డవలెనే అనువర్తనగా ఉన్నది. అప్పుడే ఇక్కడి పెత్తనము తన నెత్తిన వేసికొను చున్నది. మరి ఎర్రయ్య ఎవరు తండ్రీ? అత డేడీ?'

'ఎర్రయ్యా? అత డొక బ్రాహ్మణయువకుడు. బాటసారులను రక్షింప బోయి వీరోచితముగా పోరాడి గాయ పడినాడు, పాపము! అమ్మా, అతడెంత

చక్కని వాడనుకొన్నావు! పాలు గారు దేహము, దానిమ్మ పువ్వు వంటి రంగు. ముట్టుకున్న మాసిపోవునట్లున్నాడు.'

'పాప మా కుర్రవాని గాయము ప్రమాద మైనది కాదు గదా!'

'కాదని విన్నన చెప్పినాడులే, సుకుమారుడైన నేమి? వీరపురుషుడమ్మా! అరణ్య వాసము చేయుచుండిన లక్ష్మణస్వామి ఇట్లే యుండెనా అనిపించినదే. అతనిని చూడగానే పాదము లంటి కన్నుల కద్దుకొనవలె నని పించినది.'

'అదృష్టవంతుడవే నాయనా నీవు! ఎవరు పాప మాతని గాయ పరచినది? -'

ఆ ప్రశ్నకు మల్లారెడ్డికి శీఘ్రముగా నుత్తరము రాలేదు మాట తడబడ సాగినది. అత డెవరో తెలిసిన వాడుగా - పరమాప్తుడుగా - ఉన్నాడు కాని తన సందేహము ధ్రువపడలేదు, తల్లి కదిచెప్పి బాధ పెట్టుట కాత డిష్టపడ లేదు. అబద్ధ మాడుటయు సమ్మతము కాలేదు.

'ఎవరో నమ్మా, క్రొత్తగా పెరుగుచున్న గడ్డము గల ముసల్మాన్ యోధుడమ్మా! అతడు ఎర్రయను తన్నబోవుచుండునే! -'

'ఎంత పని? నీ వూరకొంటివా?'

'ఆకాలు నరికినా నమ్మా! -' కాని యామాటలో మల్లారెడ్డికి సంతోషము లేదు. ఆ యవనుడు పూర్వము తనకు పూజ్యు డను సందేహ మాతనికి దృఢముగా నున్నది.

'మరి నిద్ర పోవా, నాయనా?'

'ఆకలిగా నున్న దమ్మా!'

వెంటనే తల్లి యాతనికి పుష్కలముగా శుచియై పుష్టికర మగు నాహారము పెట్టినది. అది భుజించి యాతడు ముఖ్యాను చరులకు కొన్ని యాజ్ఞలిచ్చి తనకు పట్టనున్న యదృష్టము తలచు కొనుచు నిద్ర కొరగినాడు. అది కుంభకర్ణుని నిద్ర!

మల్లారెడ్డికి నిద్రలో కలలు రావు. అత డెప్పుడు పలవరింపడు. ఆతడు నిదుర పోవుచున్నంతసేపును, అన్నమ్మ తన కెన్ని పను లున్నను,

అవి యన్నియు కట్టిపెట్టి యాతని గనిపెట్టి యుండును. ఆతడు నిద్దురపోవు కొంచెముసేపే. అది భంగమైనచో నెట్లు? ఆతని నిద్రాభంగ మామె సహింపదు.

మల్లారెడ్డి రాత్రింబగళ్ళు ఎన్నియో పోరులలో కల్పించుకొనుచున్నాడని ఆమె యెరుగును, అందు కామె కలతపడదు. అతడు శ్రీశైల మల్లికార్జునుని వరప్రసాదమున తన కుదయించినాడు. అతనికేమి భయము, సాక్షాత్తు మల్లయ్య యాయెను! విశ్రమించిన మల్లయ్య కామె నిద్రాభంగము కానీయదు.

సుఖనిద్ర తీయుచున్న తన కుమారుని జూచుట యామె కొకపండుగ. ఇతరుల తల్లులు పిల్లలకు భోజనముపెట్టి వారు సుష్ఠుగా భుజించుచుండ చూచి యానందింతురు. మల్లారెడ్డి నిద్రచూచి అన్నమ్మ యానందించును.

అప్పు డాతని దేహమంతట సుఖము మూర్తీభవించి యుండును. ముఖ ముస చిరునవ్వుకూడ నుండదు; ఏభావమును ముఖము వ్యక్తము చేయదు. అతని యంతఃకరణములోని ఆనందసముద్రము తరంగములై ఉచ్ఛ్వాస నిశ్వా సములుగా భాసించును.

ఎప్పటివలెనే కుమారుని నిద్రాసుఖము చూచుకొనుటకు అన్నమ్మ మరల మరల వచ్చుచు బోవుచు నేడుకూడ మురియుచున్నది. ఇంతలో నొక చిత్రము జరిగినది. మల్లయ్య నిద్దురలో నవ్వి నట్లున్నాడు. ఆవల పని చూచుకొన బోయిన అన్నమ్మ ఆధ్వని విని ఉలిక్కిపడి వెళ్ళి చూచినది. ఏమియు లేదు. యథాప్రకారము సుఖముగా నిద్రపోవుచుండెను. మఱికొంతసేపు చూచినది విశేష మేమియు లేదు. మరల నావల పనిమీద వెళ్ళినది.

ఇంకొకసారి అదే శబ్దమైనది. ఈమారు స్పష్టముగా మల్లయ్య నవ్వి నట్లే వినబడినది. మరల వచ్చి చూచుచు నెంతసేపున్నను ఏశబ్దము రాలేదు. మల్లయ్య సుఖముగా నిద్రించుచున్నాడు.

కొంచె మాశ్చర్యపడుచు నీమారు ఆమె యావలికి సాగుచున్నది. అట్లు సాగినదే వ్యవధానముగా మరల నాశబ్దమే వినసైనది. అంతేకాదు, ఫక్కున ఒక్కమారు నవ్వుటతో ఈమా రాగలేదు. అతడు పకపక నవ్వుచునే యుండెను. అన్నమ్మ తిరిగివచ్చి చూచినను నవ్వుచునే యున్నాడు. ఆ నవ్వు ఆగుట లేదు!

మెలకువ వచ్చినదా యని యన్నమ్మ పరీక్షించెను. లేదు. నిద్దురపోవు చునే ఇంకను అట్లే నవ్వుచున్నాడు.

ఏమి నవ్వది? అది యాగుటలేదు. మెలకువగా నుండగా ఎప్పుడైన నాత డిట్లు నవ్వుట యున్నది. నిద్దురలో నిట్టి దెరుగడు. అదిగాక గ్రుక్క త్రిప్పుకొనకుండ నవ్వుచున్నా డిదేమి నవ్వు? పసిబిడ్డ గ్రుక్కపట్టి ఏడ్చు చున్నచో తల్లి సంభ్రమముతో దగ్గరకు తీసికొనును గదా! మల్లయ్య అట్లు గుక్కపట్టి నవ్వుచుండగా నాతని తల్లికిప్పుడు తత్తరపాటు కలిగినది.

'ఇదేమిటి నాయనా?' అనుచు అన్నమ్మ ఆతని శయ్య ముందు కూర్చుండి, వీపున చేయి వేసి మృదువుగా రాయ సాగినది. ఆ నవ్వు తరంగ ములకు ఆమె దక్షిణ హస్తము ఎగుర లాడుచున్నది.

ఆమె దేహము ఎండి ఃడలిపోయి యున్నది. ఈ చిన్న బలహీనపు శరీరమేనా ఈ మహా భుజానికి జన్మస్థాన మైనది, అనిపించు చున్నది. ఇప్పు డామె యాతని సమీపమున నుండి వీపు నిమురుచున్నప్పుడు ఆమె దొడ్డియ సేనా నాయకుని పుత్రిక. మహావీరుల కులమున జన్మించినది. స్వయముగా వీర ప్రసువు. అయినను బహు సుకుమార. మహా భూరుహములు మెత్తనినేలలో గొప్పగా వృద్ధి పొందునుగదా!

ఆమె నివురు చున్నది, మల్లయ్య వకపక నవ్వుచునే యుండెను.

అంతలో నాతడు గ్రుక్క త్రిప్పుకొనుచున్న చిన్నె లగపడినవి. తల్లి ప్రాణములు లేచి వచ్చినట్లయి కుమారుని బిలిచినది - 'మల్లా!'

అకస్మాత్తుగా మల్లయ్య నవ్వు ఆగిపోయినది. బలవంతముగా నాతడు కన్నులు పెకల్చుకొని తెరచినాడు నవ్వుతో తాండవించిన యాతని ముఖమున నిప్పు డొక్క పెట్టున తెరవలె కోపరేఖ పొడసూపినది. అన్నమ్మ సంభ్ర మించినది.

తన కట్లు నిద్రా భంగము కావించినది. పూజ్యురా లగు తన మాతృ దేవత యని యాతడు గుర్తించి నట్లున్నాడు. నిద్రా భంగమే కాదది, సుఖ స్వప్న భంగము: సుఖనిద్ర సుఖతరమో, సుఖస్వప్నమే సుఖతరమో ఎవరు నిర్ణయింప గలరు?

భూమిని ఆదివరాహమూ ర్తి వలె ఉద్ధరించుటకు మన కుల దైవము నందికంత పోతరాజు మన యింటిలో దర్శన మిచ్చునట. అప్పు డొక్కసారిగా మన కుల ములో మహావీరులు పుట్టి ప్రభువులై ఈ మధ్యాంధ్ర భూమిని, సముద్రములో మునిగిన వసుంధరను ఆదివరాహస్వామివలెనే, ఉద్ధరింతురట ! పోతరాజు ప్రథమదర్శన మిచ్చినప్పుడు పెద్ద యుత్సవముచేసి గుండ్ల కమ్మలో నాతని స్నానము చేయించవలె నమ్మా ! గుండ్లకమ్మ నీరు ఎంతరుచి కలదో ఎరుగు దువు గదా ! పోతరాజు అభివ్యక్త మగువరకు ఈ రహస్యము ఈ యింటి కోడ ళ్లలోనే ఉండవలె సుమా ! నా కాలములో పోతరాజు దర్శన మీయనిచో, నా కోడళ్లలో నా కిష్టురాలికి ఈ రహస్య ముపదేశింప వలెనని మా అత్త ఆదే శించినది. నా కోడళ్లలో పుణ్యాత్మురాల వని ఈ రహస్యము నీ కుపదేశించు చున్నాను. ఇది మన కుల ధనము, అప్పగించుకో ! - తెలిసినదా, తల్లీ ! -'

ఇట్లనుచు అత్త లేచి నందికంత పోతరాజు ప్రత్యేక స్థానము దేవమంది రములో తనకు నిర్దేశించి తాను భక్తితో మ్రొక్కి తనచే మ్రొక్కించినది.

ఈ కథ యంతయు అన్నమ్మకు స్పష్టముగా స్ఫురించినది. వెంటనే యుత్కంఠాతిశయముతో నామె దేవర లుండు పీఠమునొద్దకు పోయి చూచి నది. అక్కడ నింతకాలముగా శూన్యముగా భావనామాత్రముగా నుండు తన ప్రత్యేక పీఠమున నేడు నందికంత పోతరాజు ఆమెకు ప్రత్యక్ష మైనాడు.

అన్నమ్మ యొడలు జలదరించినది. భ్రాంతిపడుచున్నానేమో యని యామె కన్నులు తన రెండు చేతులతో తుడిచికొని మరల పీఠమువంక చూచి నది, అక్కడ చిత్రవర్ణములతో నలంకృతమై నంది ముఖాకారమున నున్న విశిష్టమగు కోశము, అందులో భద్రపరప బడి యున్న కఠారి యాకారముతో వ్యక్త మగుచున్న మూర్తి ఆమె కన్నులార జూచినది. మరల నాశ్చర్యముతో కన్నులు తుడిచికొని చూచినది.

ఈ మారు అపరూపమైన ఒకానొక కాంతిపుంజమగు విగ్రహాకారముగా ఆ కఠారి భాసించినది.

దేవరలకు రూప మెట్టిది ? మన మేమని ధ్యానించిన నదియే దేవరరూప మని తాను కుమారునితో నన్నదే ! అట్లుగా తోచుట లేదీనందికంతపోత రాజు. ఇతనికి ప్రత్యక్షముగా ప్రత్యేకమగు నాకార మున్నది. కఠారియే అది !

కతారి కొనయే చిన్న శిరస్సుగను, మధ్యభాగము శరీర మధ్యముగను, అంచులు రెండును రెండు బాహువులుగను, పిడి శరీరాధోభాగముగను, పంచావయవము లతో కన్పట్టుచు విశిష్ట దివ్యమానుషాకారముతో అన్నమ్మ కాతడు ప్రత్యక్ష మైనాడు.

నందికంత పోతరాజు పకపక నవ్వినట్లనది.
నందికంత పోతరాజు తకతక నాట్యమాడినట్లనది,

అన్నమ్మ గుండెలు దడదడ లాడినవి. ఆమె దేహములోని రక్త మంతయు ఒక్కసారిగా తలలోనికి ఎగిరి దూకుచు, క్రిందికి దిగుచు, ఎక్కుచు దిగుచు నున్నట్లయినది.

పరమశాంతురా లగు అన్నమ్మ కెవ్వున కేకవేసి పడిపోయినది!

14

విస్సనమంత్రి వెళ్ళిపోయిన దాది ఎర్రయ దీర్ఘచింతలో మునిగెను. తండ్రి యే మయ్యెను? తల్లి యేమైనది? పత్ని యేమైనది? అయ్యో. పూజ్యుడగు తండ్రి ఏ మైనాడు ?

అతనికి తల్లియందు ప్రేమగౌరవము లున్నవి. భార్యయెడ ననురాగ మున్నది. సూర్యకవియెడల ఎంత పూజ్యభావ మున్నదో, ఎంత ప్రేమాతిశయ మున్నదో చెప్ప శక్యము కాదు. ఆతని మనస్సు మువ్వురమీద, తండ్రియందు గాఢతరముగా, లగ్న మగుచున్నది.

అంతలో మరల శ్రావ్యమైన ఘంటానాద శ్రుతితో కలసి శ్రావ్యతర మగు 'నమస్సోమాయ రుద్రాయ చ నమస్తామ్రాయ చారుణాయ చ—' ఇత్యా దికమంత్రము వినిపించినది. ఆ ఘంటానాదమునను ఆ మంత్రాక్షరములను ఆతని మనస్సు లీన మైనది. అందులో నది దృఢముగా బంధింపబడనది. ఆ లానమునకు కట్టువడిన మహాగజమువలెనే ఆతని మనస్సుకూడ అక్కడనే ఇటు నటు లూగులాడుచే గాని వేరు చాంచల్యము లేక కట్టువడినది. పూజాం తమున తీర్థప్రసాదములు వచ్చినవి. మరల నతనికి తండ్రి, తల్లి, పత్ని-తండ్రి తండ్రి-మనస్సులో మెసల సాగినారు. దిగులు పెరిగిపోవు చున్నది.

'అయ్యో, నీవటమ్మా నా స్వప్న భంగము కావించినది ? - అయ్యో, నీవటమ్మా, తల్లీ ! - నిన్నేమనందునే అమ్మా ! -'

మల్లయ్య గొంతులో విసుగు విచారము స్పష్టమైనవి, కుమారునకు కష్టము కలిగించితి నని తల్లి గుర్తించినది. కాని అది యేమో ఆమె కర్థము కాలేదు, పరదేవతను వలె కొడు కామెను పూజించును. తనపై చింతాకంత విసుగేని అతనికి మున్నెన్నడు కలుగుట యామె యెరుగదు.

'నేనేమి చేసితినిరా, నాయనా ?'

'ఏమున్న దమ్మా ! రెడ్ల యదృష్టము శాశ్వతముగా సాగనీయకుండ భంగము చేసినావే !'

'అయ్యో, నేనురా ? -' అని యప్రయత్నముగా నామె యన్నది. అయితే ఆతని మాట లింకను ఆమెకు బోధపడలేదు, అప్పుడప్పుడు మల్లారెడ్డి విచిత్రముగా మాట్లాడుచుండుట యామె యెరుగును. అయినను ఈనాటి విపరీతపు నవ్వు వెంటనే ఈ యర్థము కాని మాటలు అపూర్వముగా నున్నవి. ఆమె నివ్వెర పోయినది.

మల్లారెడ్డి మౌనముగా కొంతవడి కన్నులు మూసికొని సుఖస్వప్న మనుభవింప యత్నించెను. లాభము లేక పోయినది. నిరాశతో నాతడులేచి పాన్పుపై కూరుచుండెను. తనదృష్టి ఎక్కడనో కనబడకున్న వస్తువుపై లగ్నముచేసి యున్నట్లు చూచుచు తల్లిని ప్రశ్నించెను.

'అమ్మా, పోతరా జెట్లుండు నమ్మా ?'

'పోతరాజు దేవర కాదా, నాయనా ?'

'దేవర యైతే రూప ముండదా.?'

'దేవరకు భక్తులు ఏమనుకొంటే అదే రూపము!'

'ఏమీ అనుకోకుండా దేవర కనబడితే?'

'ఆ భక్తుని కదే రూప మనుకోవలె !'

'మరి దేవుళ్ళకు ప్రత్యేకరూప మొక టుండదా? భూసురులకు మనము పూజ చేయుచుందుముగదా, వారు మన కందరకు ఒకేరూపముతో కనిపింతురు గదా!'

'వారు మాత్రము ఒకేరూపముతో కనిపింతురని నిర్ధారణచేయు టెట్లు? ఐనా ఈ విషయములు నాకేమి తెలియును నాయనా?- శ్రీశంకరస్వాముల వంటి వారిని అడుగవలె!'

మల్లారెడ్డి కొంచె మాగి యున్నాడు. 'నాకు పోతరాజు ప్రత్యక్షమైనాడు.'

'ఎప్పుడు, తండ్రీ?' తల్లి సంభ్రమముతో ప్రశ్నించినది.

'ఇప్పుడే నమ్మా, కలలో.'

'ఏ ఆకారముగా?'

'కఠారుగా!'

తల్లికి గుండెలలో బరువు కలిగినది,

'కఠారుగానే?—ఏమి చేసినాడు?'

'నాకు చక్కిలిగింత పెట్టినాడు,'

'నీవేమి చేసినావు?'

'పకపక నవ్వినాను. నీకు వినబడలా?'

'వినబడకేమి? ఎంతసేపు, ఎంతసేపు! ఒకటే గుక్క-పెట్టి నవ్వినవ్వు వినబడినది. నాకు భయమైనది.'

'ఆనవ్వు ఆపకుండా నవ్వుదా మనుకొన్నాను. ప్రాణములు పోవువరకు గుక్క త్రిప్పుకొనకుండా నవ్వుదా మనుకొంటిని. నవ్వుచుండగా ఒక ఏడాది గడచినది. కలలో రెండేళ్లు గడచినవి. మూడేళ్ళు గడచినవి. అన్న వేమన్న సింహాసనముపై గూర్చుండి మధ్యాంధ్రభూమికి క్షేమము కూర్చుచున్నట్లు భాసించినాడు. ఎంతమంది భూసురోత్తములను పిలిచి. పోయిన వారి యగ్ర హారములు మరల వారి కిప్పించినాడు; ఇంకా క్రొత్తవెన్నో ఇచ్చుచున్నాడు. నేను వేమన్నను దక్షిణ బాహువువలె సేవించి, ద్వీపాంతరములనుండి మిత్రు

లను సమకూర్చుచుంటిని—ఇంకను నవ్వుచుంటిని. పోతరాజు వేమన్న దక్షి ణాంకమున పసించిన ఆతని శ్వేతచ్ఛత్రమునకు కానగా అయినాడు. మరియు బహురూపములు దాల్చినాడు. నేను నవ్వుచుంటిని. ఒక్కొక్క గ్రుక్కకు ఒక్కొక్క సంవత్సరము గడిచిపోవు చున్నది. ఆనందముతో తొంబది యేళ్లు లెక్కపెట్టినాను. అయ్యో! పోతరాజు నాట్యము చాలించెను - ఎవరో మన పోతరాజును ఎత్తుకొని పోయినారు. మన శ్వేతచ్ఛత్రము కనిపిం చలేదు. నాగలి కనిపించినది. కథారి పోతరాజు నాగలియై సాగినాడు! -'

ఇదంతయు కొంత తల్లికి చెప్పుచుండెను. కొంత తనలో తనకే చెప్పు కొనుచున్న ట్లున్నది. అతని కన్నుల యెదుట పోతరాజు నాట్యము చేయుచు చక్కిలిగింత పెట్టుచుండినది ఇంకను ప్రత్యక్షముగా నున్నట్లే అతడు మాటాడు చుండెను. అతనివి పిచ్చి మాటలు కావని అన్నమ్మ గ్రహించినది. పుణ్యాత్ము లకు భగవంతుడు ప్రత్యక్షమై ఒక్కొక్కప్పుడు దివ్యదృష్టి ప్రసాదించును. అట్టి యదృష్టము మల్లారెడ్డికి నేడు పట్టిన దని ఆమె గ్రహించినది. తానా స్వప్నము భంగ మొనర్చి కుమారుని ప్రాణములు కాపాడు కొన్నది. లేకున్న నాతడు కొనప్రాణ మున్నవరకు నవ్వివేసి రెడ్ల ప్రభుత్వము పురికొంత కాలము సాగుట చూచెడివాడే!

అంతలో అన్నమ్మకు పూర్వస్మృతి ఎన్నాళ్ళ నాటిదో స్మరణకు వచ్చి నది. అది నీలాకాశమున సంధ్యావేళలో స్ఫురించు పునర్వసు నక్షత్రము వలెనే భాసించినది. ఏమి టది?

13

అది ఇప్పటి కెంతకాలము క్రిందటనో జరిగిన సంగతి. అయిన నేమి? అన్నమ్మ కది నేడో నిన్ననో జరిగినట్లే అంతకంతకు స్ఫుటతర మగుచు, ఆమె స్మృతివీధిలో ప్రకాశించుచున్నది—సంధ్య ముదిరిన కొలది పునర్వసు నక్షత్రము కాంతిమంతమై వెలుగునట్లే!

ఆమె యత్తగారికి అవసానకాల మాసన్నమయ్యెను. అత్త యాదర ముతో అన్నమ్మను తన పడుక దగ్గరకు పిలిచినది.

'అమ్మాయీ !'

'ఎట్లున్న దత్తా ?'

'నా కెట్లుండే దేమున్నది? ఎక్కువకాలము జీవించును—'

'అట్లనరా దత్తా !'

'పెద్దదానను, నాకేమి తప్పే ?- నీకొకటి అప్పగింత పెట్టనలసిన దున్నది, ఆమూల్యమైన ధనము !'

'ధనము నా కెందు కత్తా? నీ కొడుకుకు అప్పగించరాదా ?'

'ఇది వాడికిచ్చేది కాదు నీకే. ఇది పరమ రహస్యము, మనయింటి రహస్యము! మన కుల రహస్యము! మన యింటిలో త్రికరణశుద్ధి గల పుణ్యస్త్రీకి మాత్రమే అప్పగించ దగినది—మాఅత్త చివరి గడియలలో నాకప్పగించినది.'

అత్తకు పైత్యభ్రమ యని అన్నమ్మకు తోచినది. అయిన నేమి? పెద్దదానియందు గౌరవ భావముచే వినుచు ఊఁ కొట్టుచున్నది.

'ఇదిగోనే, ఏదో పెద్దది వాగుచున్న దనుకొను చున్నావా? మా అత్త చెప్పినప్పుడు మొదట నేను అట్లే అనుకొంటిని ! - ఇట్లారా ! - నా చేతిలో చేయి వేయి !'

కన్నులలో తిరుగుచున్న బాష్పములు నిరోధించు కొనుచు అత్తచేతిలో అన్నమ్మ చేయి వేసినది. అత్త మరల నారంభించినది.

'మనము పంట రెడ్ల మమ్మా! ఒక మహాత్ము డేనాడో మన పెద్దలకు ఒక కఠారి ఇచ్చినాడు. దానిపేరు పోతరాజు. దానిని చిత్రవర్ణములు గల కోశములో ఉంచి అనుగ్రహించినాడట ! ఆ కోశము నంది ముఖముగా నుండును. ఆ కోశము పేరు నందికంత. అవి ఏవో ఒక కోశమూ ఒక కటారి కాదుసుమా! కంత మంత్రము తోడను కఠార మంత్రము తోడును ఆ మహాత్ముడు జోడించెనట. వాటి జోడింపు 'నందికంత పోతరాజు' ఆతడు మన కుల దైవము. అతడు వదలక మన దేవమందిరములలో పదిలముగా నుండును అతడు మనకు కనబడడు. కాని అతనికి ప్రత్యేక స్థాన మున్నది. తల్లీ, జాగ్రత్తగా వినుఁ ! ఎప్పుడో ఈ భూమిలో వేద ధర్మము వినాశ ప్రాయ మగునట ! ఈ

భూమిని ఆదివరాహమూ ర్తి వలె ఉద్ధరించుటకు మన కుల దైవము నందికంత పోతరాజు మన యింటిలో దర్శన మిచ్చునట. అప్పు డొక్క-సారిగా మన కుల ములో మహావీరులు పుట్టి ప్రభువులై ఈ మధ్యాంధ్ర భూమిని, సముద్రములో మునిగిన వసుంధరను ఆదివరాహస్వామివలెనే, ఉద్ధరింతురట! పోతరాజు ప్రథమదర్శన మిచ్చినప్పుడు పెద్ద యుత్సవముచేసి గుండ్ల కమ్మలో నాతని స్నానము చేయించవలె నమ్మా! గుండ్లకమ్మ నీరు ఎంతరుచి కలదో ఎరుగు దువు గదా! పోతరాజు అభివ్యక్త మగువరకు ఈ రహస్యము ఈ యింటి కోడ ళ్లలోనే ఉండవలె సుమా! నా కాలములో పోతరాజు దర్శన మీయనిచో, నా కోడళ్లలో నా కిష్టురాలికి ఈ రహస్య ముపదేశింప వలెనని మా అత్త ఆదే శించినది. నా కోడళ్లలో పుణ్యాత్మురాల వని ఈ రహస్యము నీ కుపదేశించు చున్నాను. ఇది మన కుల ధనము, అప్పగించుకో!. తెలిసినదా, తల్లీ!-'

ఇట్లనుచు అత్త లేచి నందికంత పోతరాజు ప్రత్యేక స్థానము దేవమంది రములో తనకు నిర్దేశించి తాను భక్తితో మ్రొక్కి తనచే మ్రొక్కించినది.

ఈ కథ యంతయు అన్నమ్మకు స్పష్టముగా స్ఫురించినది. వెంటనే యుత్కంఠాతిశయముతో నామె దేవర లుండు పీఠమునొద్దకు పోయి చూచి నది. అక్కడ నింతకాలముగా శూన్యముగా భావనామాత్రముగా నుండు తన ప్రత్యేక పీఠమున నేడు నందికంత పోతరాజు ఆమెకు ప్రత్యక్ష మైనాడు.

అన్నమ్మ యొడలు జలదరించినది. భ్రాంతిపడుచున్నానేమో యని యామె కన్నులు తన రెండు చేతులతో తుడిచికొని మరల పీఠమువంక చూచి నది, అక్కడ చిత్రవర్ణములతో నలంకృతమై నంది ముఖాకారమున నున్న విశిష్టమగు కోశము, అందులో భద్రపరప బడి యున్న కఠారి యాకారముతో వ్యక్త మగుచున్న మూర్తి ఆమె కన్నులార జూచినది. మరల నాశ్చర్యముతో కన్నులు తుడిచికొని చూచినది.

ఈ మారు అపరూపమైన ఒకానొక కాంతిపుంజమగు విగ్రహాకారముగా ఆ కఠారి భాసించినది.

దేవరలకు రూప మెట్టిది? మన మేమని ధ్యానించిన నదియే దేవరరూప మని తాను కుమారునితో నన్నదే! అట్లుగా తోచుట లేదీనందికంతపోత రాజు. ఇతనికి ప్రత్యక్షముగా ప్రత్యేకమగు నాకార మున్నది. కఠారియే అది!

కతారి కొనయే చిన్న శిరస్సుగను, మధ్యభాగము శరీర మధ్యముగను, అంచులు రెండును రెండు బాహువులుగను, పిడి శరీరాధోభాగముగను, పంచావయవము లతో కన్పట్టుచు విశిష్ట దివ్యమానుషాకారముతో అన్నమ్మ కాతడు ప్రత్యక్ష మైనాడు.

నందికంత పోతరాజు పకపక నవ్వినట్లనది.

నందికంత పోతరాజు తకతక నాట్యమాడినట్లనది.

అన్నమ్మ గుండెలు దడదడ లాడినవి. ఆపె దేహములోని రక్త మంతయు ఒక్కసారిగా తలలోనికి ఎగిరి దూకుచు, క్రిందికి దిగుచు, ఎక్కుచు దిగుచు నున్నట్లయినది.

పరమశాంతురా లగు అన్నమ్మ కెవ్వున కేకవేసి పడిపోయినది:

14

విస్సనమంత్రి వెళ్ళిపోయిన దాది ఎర్రయ దీర్ఘచింతలో మునిగెను. తండ్రి యే మయ్యెను? తల్లి యేమైనది? పత్ని యేమైనది? అయ్యో. పూజ్యుడగు తండ్రి ఏ మైనాడు ?

అతనికి తల్లియందు ప్రేమగౌరవము లున్నవి. భార్యయెడ ననురాగ మున్నది. సూర్యకవియెడల ఎంత పూజ్యభావ మున్నదో, ఎంత ప్రేమాతిశయ మున్నదో చెప్ప శక్యము కాదు. ఆతని మనస్సు మువ్వురమీద, తండ్రియందు గాఢతరముగా, లగ్న మగుచున్నది.

అంతలో మరల శ్రావ్యమైన ఘంటానాద శ్రుతితో కలసి శ్రావ్యతర మగు 'నమస్సోమాయ రుద్రాయ చ నమస్తామ్రాయ చారుణాయ చ—' ఇత్యా దికమంత్రము వినిపించినది. ఆ ఘంటానాదమునను ఆ మంత్రాక్షరములను ఆతని మనస్సు లీన మైనది. అందులో నది దృఢముగా బంధింపబడనది. ఆ లానమునకు కట్టుపడిన మహాగజమువలెనే ఆతని మనస్సుకూడ అక్కడనే ఇటు నటు లూగులాడుచే గాని వేరు చాంచల్యము లేక కట్టువడినది. పూజాం తమున తీర్థప్రసాదములు వచ్చినవి. మరల నతనికి తండ్రి, తల్లి, పత్ని-తండ్రి తండ్రి-మనస్సులో మెసల సాగినారు. దిగులు పెరిగిపోవు చున్నది.

చంద్రోదయ మైనది. సరాసరి ఎదురుగా నున్న గవాక్షములోనుండి ఉద యించుచున్న చంద్రబింబ మాతనికి ప్రత్యక్షమైనది. ముందు 'నమ స్సోమాయ చ' ఇత్యాది మంత్రము కొంతవడి యాతనిమనస్సులో నావృత్తి నొందినది. తరువాత నతని మనస్సు తండ్రిపై లగ్నమైనది. ఆకాశమున సోముడు కొంచెము తామ్రవర్ణముగా కొంచె మరుణవర్ణముగా కనబడుచున్నాడని యాతనికి తోచి నది. ఆతని మనస్సు సోమునిపై నిలిచినది. అప్రయత్నముగా నాతనిని శారద రాత్రి యావేశించినది. శారదరాత్రితోపాటు నన్నయ భట్టారకు డాతని నావే శించిన ట్లుండెను. 'శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులన్—' ఇత్యాది గల పద్యము అప్రయత్నముగా నాతని నోట వెలువడినది. ఒకసారి, రెండు పర్యాయములు. మూమ్మారు—బహు పర్యాయములు అది వదలుట లేదు. ఏమిది?

క్రిందటిరాత్రి ఈ పద్యమే తన తండ్రి సూర్యకవి చదివినమాట జ్ఞప్తికి వచ్చినది. అది చదువుచున్న కొలదియు పితృసామీప్య మాతనికి భావనలో ప్రాప్తించు చున్నది. తనతండ్రియే ఈ పద్యము. ఈ పద్యము తన తండ్రి వంటిది. మరల మరల నదే పద్యము!

ఇంతలో రాత్రి రెండవ యామపూజ సాగుచున్నది. ఘంటావాద శ్రుతితో గలసి, 'నమ స్సోమాయచ రుద్రాయ చ నమస్తామ్రాయ చారుణాయచ.' వినవచ్చినది.

మరల తీర్థప్రసాదములు వచ్చినవి.

ఈ మారు మరల 'శారదరాత్రు లుజ్జ్వల-' పద్యము జిహ్వాపై నావృత్త మగుచున్నది.

'ఇంత మధుర మైన పద్యము నాల్కపై నాడుచుండగా ప్రాణములు వద లిన కవీశ్వరుడే ధన్యుడు!' అని పలికిన తండ్రిమాటలు తాను అస్పష్టముగా విన్నవి ఇప్పుడు చిత్రముగా చెవులలో ప్రోయుచున్నవి. ఈమా రవి గింగురు మని ప్రోసి స్పష్టతరము లై ఘంట కొట్టిన ట్లయినది. ఎర్రయను భయ మావే శించినది.

'రాత్రి ఈపద్యమే తండ్రి పలుమారు ఉచ్చరించెనే!- ఏమి కర్మము!'

ఆరాత్రి ఎర్రయకు కలత నిద్దుర తప్ప సరిగా నిద్దుర పట్టలేదు. ఆ నిద్దుర లో సూర్యకవియు, సూర్యకవితో నన్నయ చివరిపద్యము, వానితో నన్నయ భట్టారకుడును మాటి మాటికి భాసింపసాగిరి.

చతుర్థయామపూజ కాబోలును సాగుచున్నది. మరల ఘంటానాదము ! మరల 'నమ స్సోమాయ చ రుద్రాయ చ నమస్తామ్రాయ చారుణాయచ—' వినిపించినది.

ఆ కస్మికముగా ఎర్రయ యాందోళన మంతయు శాంతించినది. 'నమస్తా మ్రాయ చారుణాయ చ-నమస్తామ్రాయ చారుణాయ చ-నమస్తామ్రాయ చారుణా య చ-' అను మంత్రభాగము పునఃపునఃజప్యాపై నృత్యము చేయజొచ్చినది.

'నే నెవరను? నా పేరేమి? ఎర్రయ, ఎర్రయ ! నమ స్తామ్రాయ చారు ణాయ చ—'

పరమహంస ఘంటాశ్రుతి మ్రోసినది. అది తనకేదో ఆదేశించు చున్నట్లు, మాంద్యమునుండి మేల్కొలుపు చున్నట్లు తోచినది.

సుకుమార మైన పద్మగంధము నాసాపుటముల నిండి యుల్లసిలినది.

దూరమున సారసము కూత శ్రవణపర్వమొనర్చినది.

మధువ్రతము జుం జుం అని చెవులలో రొద చేయు చున్నది. కన్నులు విప్పి చూడగా గవాక్షమునుండి లీలగా అరుణరాగచ్ఛాయలు స్ఫురింప సాగినవి.

బ్రాహ్మీముహూర్త మట్లున్నది. ఎర్రసుకవికి అప్రయత్నముగా వాక్కున పద్యము వెలువడినది.

'స్ఫుర దరుణాంశు రాగ రుచిఁ బొంపిరివోయి నిరస్త నీరదా
వరణము లై దలత్కమల వైభవజృంభణ ముల్లసిల్లను
ధ్వరతర హంస సారస మధువ్రత నిస్స్వనముల్ చెలంగఁగాఁ
గరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళఁ జూడఁగన్.'

తనవాక్కువెంట నీ పద్యము వెలువడినంతనే ఎర్రయ కాశ్చర్యమైనది. అతడు చిన్నతనము నుండి కవియే. సూర్యకవి కున్న విద్వత్తులో దశాంశము లేకముండే ఎర్రకవి పద్యములు తండ్రి పద్యములకంటె మెరుగుగా నుండెడివి. ఆ పిమ్మట ఎర్రకవి తండ్రితో కొంచెము కుడి యెడమగా సమానమగు పాండి త్యము సంస్కృతాంధ్రములలో సంపాదించినాడు. పాణినీయము అభ్యసించి నాడు. బహు పురాణములు అధ్యయన మొనర్చి నాడు, దండి కావ్యాదర్శము మమ్మటుని కావ్య ప్రకాశిక ఋణముగా నవగతము చేసికొన్నాడు. ధ్వన్యా

లోకము కరతలామలక మైనది. క్రొత్తగా పండితులలో ప్రచారము గనుచున్న ప్రతాపరుద్రీయము చూచినాడు.

ఇంతవరకు నాతడు వ్రాసినవి లఘుకృతులే. ఏమి ఉద్గ్రింథము వ్రాయ వలెనో అతనికి తోచలేదు. అనుదిన ప్రవర్ధమాన మగుచున్న యాతని కవితా ప్రౌఢి చూచి తండ్రి యానందించుచు, మహాగ్రంథ రచన కుపక్రమింపుమని ఉద్బోధించు చున్నాడు. కాని తానేమి వ్రాయును ?

కొన్ని సంవత్సరములుగా దేశ మంతట వ్యాపించియున్న జనసంక్షోభముతో నాత డుద్రిక్తు డైనాడు. ఉద్రేకములో నుత్తమకవులు రచనలు చేయరు గదా !

క్రిందటి రాత్రి సూర్యకవి నన్నయ చివరి పద్యము పలుకుటలో విశేషముండవచ్చును, లేకను పోవచ్చును. ఇప్పుడా పరమహంస ఘంటానాదముతో నేకశ్రుతియై తన వాక్కున ఈ పద్యము నేదో శక్తి పలికించినది. తాను చెప్పినదికూడ అప్రయత్నముగా శరద్వర్ణన పద్యమే.

నన్నయ చివరి పద్యముతో కలిపి తన పద్యము చదివినాడు. నన్నయది ఉత్పలమాలావృత్తము; తనది ఆద్యక్షరమున మాత్రమే భేదము కల చంపకమాల, ప్రాసాక్షరము కూడ నొకటే. అవి రెండును కలిపి చదువగా అదుకు లేకపోయినట్లే అతనికి తోచినది. ఆత్మాతిశయముతో ఒక్క క్షణకాల మాతడు పొంగిపోయినాడు.

మరుక్షణములో నాతని నధైర్య మావేశించినది, ఏకవి కృతి యాతని కానందము కలిగింపదు ? లేకున్న ఇన్ని వందలు వేలమంది కవులు రచనలకేల పూనుకొందురు ? సామాన్యుడగు తాను తన పద్యము నన్నయ భట్టకవి కుంజరుని పద్యమువలె చెప్పితి నని తలచినాడు, ఏమి యహంభావము ! సూర్యకవి యీ పద్యము విని యేమనునో ? వారిపేళ ఎక్కడ ఎంతదూరమున నున్నారో గదా ! వారిని మరల దర్శించుభాగ్య మెప్పుడో ! నిస్స్పృహ కలిగినది. మనస్సు నిర్విషయ మైనది. కునికు పట్టిన ట్లున్నది. సూర్యకవి ప్రత్యక్షమై నాడు.

'నాయనా, ఇదిగో !' - ఇట్లనుచు శ్రీమదాంధ్ర మహాభారతము లో అరణ్య పర్వకోశ మొకటి ఇచ్చినాడు. ఎర్రయ వినయ గౌరవముతో దాని నందుకొని పత్రములు త్రిప్పసాగినాడు. చివర నెన్నియో పత్రములు వ్రాతలేకుండ శూన్య

ముగా నున్నవి. ఆట్లాకోశము చూచు చుండగనే వనగజ మొకటి తనవైపుకు ధీరగమనముతో వచ్చుచున్న ట్లయినది. సూర్యకవి కనబడలేదు.

ఆ వచ్చుచున్న ఏనగజమును జూడగనే ఎర్రయకు భయమైనది. వన గజ మాతని సమీపించుచున్నది, చేరువ యగుచున్నకొలది నది చిన్నది కాజొచ్చినదిఁ ఎర్రయకు భయమును తగ్గజొచ్చినది. తుదకది చిన్నది చిన్నదై ఆతని హృదయములో జొరబారినది, ఆ వనగజము ఎర్రయ నావేశించినది. తా నిప్పుడు పెద్దవాడ నైతి ననుభావము తట్టినది. ఆతని దేహము, ప్రాణము, మనస్సు, బుద్ధి, అహంకారము—అన్నియు విస్తరించుచున్న ట్లనిపించినది. తానే ఉబ్బి బూరటిల్లినాడు.

సరిగా నదే సమయమున పరమహంస యొక డాతనిపై కరుణారస దృష్టి పరపుచు దర్శన మిచ్చినాడు. యథావిధిగా ఎర్రయ యాతనికి, 'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాఃసన్న్యాసయోగా ద్యతయ శ్శుద్ధసత్త్వాఃఇత్యాదిక శ్రుతి మంత్రస్మరణ పూర్వకముగా సాష్టాంగపడి గోత్ర నామాదికము చెప్పుచు అభి వాదనము చేసినాడు. ఆ పరమహంస నారాయణస్మరణ మొనర్చి తనిచేత చెప్పించినా డీశ్లోకము ;

'నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ !'

ఆ శ్లోక మాతడు చెప్పుచు తనచేముమ్మా రనిపించి సంపూర్ణమగు వ్యాస మహాభారత కోశమును, హరివంశోత్తర మగుదానిని, ప్రసాదించినాడు. 'మహా ప్రసాద' మని ఎర్రయ గ్రహించినాడు.

- సరిగా నప్పుడు ఎర్రయకు మెలకువ వచ్చినది. 'నారాయణం నమస్కృత్య' ఇత్యాదియగు మహాభారత ప్రథమ శ్లోకము ఆతని నాల్కపై నృత్యము చేయుచునే యున్నది; అది యాతని చెవులలో రొద చేయుచున్నది.

'ఏడీ, ఆ పరమ హంస ? - ఏడీ ? - ఏడీ ? లేడే ! ఎక్కడను లేడే ! కలయ జూచినాడు ఎర్రయ. పరమహంస లేడు. తనతండ్రి లేడు. అసంపూర్ణ మగు ఆంధ్రమహాభారతారణ్య పర్వకోశమును లేడు. కాని - కాని -

ఏమి టిది ? సంపూర్ణమగు వ్యాసమహాభారత కోశము: హారివంశోత్తర మైనది. ఆతని శిరస్సమీపమున నున్నది. ఇది యెక్కడిది ? ఎవరుంచిరి ? ఎర్రయ తెల్లపోయెను.

అతడది సగౌరవముగా చేతులతో స్పృశించి కన్నుల కద్దుకొన్నాడు. ఆతని మనస్సులో కలలో వినిపించిన శ్లోక మావృత్త మైనది.

దూరమున గజబృంహితము వినిపించినది. ఎర్రయ జిహ్వాపై శరదృతు వర్ణన పద్యము మరియొకటి నాట్య మాడినది.

'ధానాంభః పటలంబునం బృథుపయో ధారావలిం దాల్చిగ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతండిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విరద సంఘంబుల్ వనాంతంబునన్.'

అంతలో నరణ్యమం దెల్లెడల నీలకంఠకోలాహలములు హంససారస ధ్వనులతో గలసి చెలరేగినవి. సువాసనలు గుమాళించినవి. మరియొక పద్యము పుట్టినది.

'కలనీలకంఠ కోలా
హలలీలలు సెందె రాజ హంసకులములం
దిలకించె సప్తపర్ణా
వలి విగలిత కుసుమ కుటజ వాటి కలగెడన్.'

సువాసనలు వెదజల్లు నీ కవిత్వము తనదేనా యని ఎర్రయ యాశ్చర్య పడెను. తన్ను కలలో నావేశించిన వనగజమే తనచే నిట్లు పలికించుచున్నది. కలలో కనబడిన సూర్యకవియే తన్నందుకు మావటీనివలె ప్రచోదించు చున్నాడు. పరమహంస కటాక్షములు తనకు దివ్యశక్తి ప్రసాదించుచున్నవి. కన్నులయెదుట నున్న శ్రీకృష్ణ ద్వైపాయనకృత జయకోశమునకు ఎర్రయ మనసా వందన మాచరించెను.

ఒక చిత్రమైన యూహ ఆతనికి జనించినది. తన దేహమేమైనా పెరిగి నదా? చూచుకొన్నాడు. ఆ గదిలో ఎప్పటివలెనే శయ్యయున్నది, ఆశయ్యపై తాను నిన్నటివలెనే అంచు పావాగ్రములు సోకుచుండ పరుండి యున్నాడు.

శరీర మేమాత్రమును పెరుగలేదు. ఎర్రయ ముఖమున చిరునవ్వు మొలక లెత్తినది.

సరిగా నప్పుడే విస్సన యచ్చటికి వచ్చి యాతని చిరునవ్వు కాంచి తృప్తిపడెను. నాడి పరీక్షించి గాయము లన్నియు జూచెను.

'ఎర్రయా నీకు స్నానము చేయవలెనని యున్నదా ?'

తన స్వభావమునుబట్టి ఆ బాపని మనస్సుగూడ ప్రాతఃస్నానము మీదికి పోవుచున్నట్లు విస్సన గమనించినా డట్లున్నది.

'మీ యనుజ్ఞకై నిరీక్షించుచున్నాను.'

'చేయవచ్చును. వారమురోజులపాటు ఈ పెద్ద గాయమును మాత్రము తడియనీయ వద్దు - నీ కిక పథ్యము లేదు.'

ఎర్రయ తన కుటుంబము సంగతి ప్రశ్నింపబోవుచున్న ట్లుండెను. అది చెప్పుట తనపని కాదన్నట్లు వినిపించుకొనక విస్సన దులబరించుకొనిపోయెను.

15

కెవ్వున కేకవేసిన తల్లి యొద్దకు మల్లారెడ్డి పరుగెత్తెను. ఆమె స్మృతి లేకుండ పడియున్నది. కాని యామె ముఖకాంతి తరుగలేదుగదా, శరీర మంతటను నిర్మలానంద మొకటి విస్ఫారి వాకలు కట్టుచున్నట్లు కనబడినది.

'నాకు కొలుపు చేయండి ! నాకు కొలుపు చేయండి !—నాకు కొలుపు చేయండి !'

ఇట్లు కేకలువేయుచు అన్నమ్మ లేచి కూర్చున్నది. ఆమెకు పైత్యభ్రమ ఎన్నడు లేదు. వెంటనే మల్లారెడ్డి విస్మయ సంభ్రమములతో నామెకు దండము పెట్టినాడు. తల్లికి వలెనేకాదు, దేవరకు దండము పెట్టునట్లును !

అమ్మలక్కలు ప్రోవైరి. వీరమ్మ వచ్చినది. ఆ క్రిందటి రాత్రి రక్షింప బడిన యాత్రికతండములోని యితర స్త్రీలుగూడ వచ్చిరి, బంధువులును హృద్దులును పరిచారకులును జేరిరి.

'నీ వెవరు? —నీ వెవరు? —నీ వెవరు?'

మల్లారెడ్డి ప్రశ్నించెను. అక్కడ చేరిన స్త్రీ పురుషులను ప్రశ్నించిరి.

'నేనా? కులదేవతను! పోతరాజును. నన్ను గుండ్లకమ్మలో స్నానము చేయించండి! నేను నందికంత పోతరాజును!'

కూడిన పలువుర కామాట లర్థము కాక మరిమరి ప్రశ్నించినారు.

'ఎవరు నీవు?—ఎక్కడనుండి వచ్చినావు?—ఎక్కడ ఉన్నావు?—ఏమి కావలె?—నీవు గాలివా, ధూళివా?—'

అన్నమ్మ కన్ను లింకను మూసియే యున్నవి. ఆమె పలుక సాగినది.

'మల్లయ్య కైనా నేనేవరో తెలియదా? అయ్యో! నేను మీకు కనబడ డము లేదా? అడుగో, అక్కడ! అడుగో, నే నడుగో!'

దేవరల పీఠముపై నున్న కోశమును కఠారిని కన్నులు తెరువకయే ఆమె నిర్దేశించుచున్నది, అందరి దృష్టులును అటువైపు ప్ర సరించినవి,

ముందు దానిని గుర్తించినది మల్లారెడ్డి. అతనికి కలలో ప్రత్యక్షమైన రూపమే సాక్షాత్తుగా నిది. ఈ కఠారియే ఆతనిని కడుపుబ్బ నవ్వినట్లు చక్కిలి గింతలు పెట్టినది.

దానిని చూచినంతనే తన పూర్వమిత్రమును, తన యొజ్జను, తన దైవ మును, తన ప్రాణమును, రెడ్డివంశము ప్రాణమునే చూచిన ట్లయిన దాతనికి. ప్రేమ గౌరవము భయము - పెద్దలను దర్శించినప్పుడు కలుగు నొకానొక భయము.—భక్తి ఆతని నావేశించెను. ఆతడు కాలుచేతులు కడిగికొని శుచియై పోతరాజుకు నమస్కరించినాడు. వెంటనే యుత్సవ మొనర్చుటకు మల్లారెడ్డి తన యనుచరుల కాజ్ఞాపించినాడు. ఊరేగింపు ప్రారంభమైనది,

అన్నమ్మ లేచినది సదా శుచిగా నుండునామె నందికంత పోతరాజును క్రొత్తగా పుట్టిన బిడ్డనువలెనే, చేతుల నెత్తుకొని రొమ్మునకు హత్తుకొన్నది. పిమ్మట తన ఎడమ బుజముపై నానించుకొని పట్టుకొన్నది. పోతరాజు శిరస్సు ఆమె ఎడమచెక్కిలి నొరయుచున్నది. అట్లామె యాతని నెత్తుకొని దారి తీసినది.

వివిధము లగు మేళతాళములు సాగినవి. నానాయుధ ధారు లగువీరులు తరలినారు. ఆ వీరులలో పలువురు తమ చేతులలోని ఆయుధములు సరిగా

నెట్లు ఎక్కడ పట్టవలెనో కూడ పూర్వ మెరుగనివారు. నేడు వారికి తమ యాయుధముల పట్టు సరిగా చిక్కినట్లున్నది. ఎక్కడినుండియో వేళకు దేసటి రెడ్డి వచ్చి అందుకొని మల్లారెడ్డికి ఎడమ ప్రక్కనే సాగుచున్నాడు. దేసటి భార్య వీరమ్మ అన్నమ్మ కుడిదండనే యుండి, ఇంటి యాడు పడుచువలెనే, ఉత్సవములో భక్తి భావముతో పాల్గొనుచున్నది.

కొందరకు గణములు పూనినవి. వారు వేపకొమ్మలు తీసికొని, 'వాల వాలా' యనుచు నానందనాట్యములు చేయజొచ్చిరి. భక్తులు వారిపై కడవల కొలది నీళ్ళు దొరకినచోట్ల నెల్ల పోయుచుండిరి. గుగ్గిలధూపములు వేయు చున్నారు.

అన్నమ్మకు గణము పెరగలేదు. ఆమె తన చేతులలోని పోతరాజుపై ఒక్కచుక్క నీరైనా పడనీయక భద్రముగా తెచ్చుచున్నది, తెలియక ఎవరైన నీటి కడవలు తెచ్చినచో ఆమె తీక్ష్ణమైన చూపు చూచును. వారు భయపడి దూరము తొలగుదురు. పోతరాజు గుండ్లకమ్మ నీట తప్ప స్నానము చేయడు. కమ్మని గుండ్లకమ్మ నీరే గాని పోతరాజు ముట్టడు. శీఘ్ర గమనముతో నామె గుండ్లకమ్మకు దారి తీసినది. గుండ్లకమ్మ వచ్చినది.

ఏమి గుండ్లకమ్మ యిది! పలువురు గంగా సింధు నదుల గొప్పదన మెరుగుదురు. కొందరు యమునను, కొందరు నర్మదను శ్లాఘింతురు. గోదావరి కవులు పలువు రున్నారు, కృష్ణ కవులును చాలమంది కలరు, కావేరీ జలమును విరజాతోయమని పొగిడినవా రున్నారు. తుంగభద్రను గుణభద్ర యని స్తోత్ర పాఠము చేసినవా రున్నారు, కాని గుండ్లకమ్మ సౌభాగ్యము తెలుగు కవులకే తెలియదు. దాని రెండు గట్టుల నివాసము చేయు దాని కవల పిల్లలు రెడ్లు కమ్మలే మరచినారు. దాని కమ్మదనము నందికంత పోతరాజు కొక్కనికే ఎరుక.

గుండ్లకమ్మ సమీపించుకొలది అన్నమ్మ యుత్సాహ మెక్కువైనది. ఆమె గమన వేగము దురుసైనది. తుదకు పరువే యైనది. అందరు నామెవెంట పరుగెత్తుచుండ నా యుత్సవము పరుగు పందెము ననుకరించు చున్నది.

ఒక్కపరుగున అన్నమ్మ గుండ్లకమ్మ కట్ట యెక్కినది, మరియొక పరుగుతో లోనికి దిగినది. నీటిని సమీపించినది. ఆమెచేత లన్నియు పోతరాజే ఆమెచే జేయించు చున్నాడు.

పొత్తిళ్ళలోని పసిబిడ్డ నట్లు పోతరాజు నామె బుజముపై నుండి తన రెండు చేతులలో దీసికొన్నది. గుండ్లకమ్మ యొడ్డున నున్న రెండు బండలు చూచి జాగ్రత్తగా నందొక దానిపై గూర్చుండి రెండవదాని మీదికి కాళ్లు చాచి నది. శిశువును లాల పోయటకు పరుండబెట్టుకొను నట్లే, అన్నమ్మ తన కాళ్లపై పోతరాజును పరుండబెట్టు కొన్నది. కోశముతో గూడ పోతరాజుపై నామె ముందు గుండ్లకమ్మ నీరు చిలికినది. ఆ పిమ్మట కోశములో నుండి పోతరాజును బయటికి తీసినది. ఆ కథారిని చూడగా నందరికి కన్నులు మిరు మిట్లు గొన్నవి. అనేక సూర్యుల కాంతితో ప్రకాశించినది. జనములు జేజేలు పెట్టుచు పరిపరి విధముల పోతరాజుకు మ్రొక్కిరి.

ముత్తైదువ లందించిన సువాసన గల చిట్లాముదము పోతరాజు మాడున అన్నమ్మ మెల్లగా ముమ్మారు పెట్టినది. పిమ్మట ముక్కులలో చెవులలో నా యాముద ముంచినది. అంతట నది యొడలి నిండ పట్టించినది. తర్వాత కచో రములు బాషంచాలు కలసి ఘుమఘుమ లాడుచున్న మెత్తని నలుగు పిండి యాతని ఒంటికి పట్టించి నలుగు పెట్టినది. తదనంతరమున దోసిళ్ళతో గుండ్ల కమ్మ నీళ్ళు అతని తలపైన, వీపున పోసినది. అప్పుడు త్రిప్పి కాళ్ళపై పండు కొనబెట్టి, పొట్టమీదను చేతుల మీదను కాళ్ళమీదను దోసిళ్ళతో నీళ్లు పోసినది, అంతట కాళ్ళపై తూర్పు ముఖముగా కూర్చుండ బెట్టుకొని, ముక్కుల లోనికి చెవుల లోనికి కన్నుల లోనికి నీరు పోకుండ, ఆమె తన చేయి ఆదిశేషుని పడగవలె నడ్డముపెట్టి ఏకధారగా గుండ్లకమ్మ నీరు ఏకధారగా పోసినది.

వీరమ్మకూడ సమీపించి పోతరాజు శిరస్సుపై నీరు పోసినది. అక్కడ నున్న ముత్తయిదువు లందరు దోసిళ్ళతో కడవలతో బిందెలతో పోతరాజు శిర స్సుని గుండ్లకమ్మ నీరుపోసి ధన్యుల మైతి మని భావించిరి. వాల వాల యను శబ్దములు చెలరేగినవి. పోతరాజును సువాసిను లందరు కలసి తనివితీర జల కము లాడించు చున్నారు.

అన్నమ్మ కాళ్ళపైనున్న పోతరాజు సంతోషము పట్టలేక పోయినాడు. ఆబిడ్డ లేచి తప్పటడుగులువేసి నడచినాడు. అంతట దృఢమైన ఆడుగుతో నాతడు గుండ్లకమ్మ నీటిలోదిగి ఈ వైపునుండి యావైపుకు. ఆ వైపునుండి యీవైపుకు ఈదులాడ సాగినాడు. అందరు నాశ్చర్యచకితులై గుండ్లకమ్మలో పోతరాజు జలక్రీడ తిరికించుచుండిరి.

ఆనా డా యుత్సవముతో వచ్చినవా రెల్లరు ఆ పోతరాజు ఈదులాట కన్నులార కాంచినవారే కాని డాని గూర్చి ఒకరు చెప్పినట్లుగా ఇంకొకరు చెప్పరు.

శిరస్సున నెమిలిపించము, కాకపక్షములు, బంగారు మొలత్రాడు, పట్టు దట్టి. సందిట తాయతులు, సరిమువ్వ గజ్జెలతోగూడ బాలకృష్ణునివలె పోతరాజు కనిపించె నని కొంద రందురు.

కొంద రాతడు శ్రీరామాకారముతో వీరవేషమున ధనుస్సు శరములు ధరించి, సీతాదేవి ప్రక్కన నుండ, లక్ష్మణ భరత శత్రుఘ్నులును, సుగ్రీవాది వానరవీరులును, విభీషణాది రాక్షసులును సేవించుచుండ, హనుమంతుని వీపున నెక్కి కనిపించె నందురు.

ఎబ్బే! అశ్వరాజముపై నెక్కి తన కరవాలముతో మ్లేచ్ఛులను నరికి వేయుచు కల్కి రూపముతో గుండ్లకమ్మ నీటిపై నీ రంటకుండ ఉభయకూట ముల సంచారము వొనర్చుట చూచినాము. మ్లేచ్ఛుల రక్తముతో సిక్తమైన తన కరవాలము తొంబది మూరులు గుండ్లకమ్మ దాటినాడు. మా కన్నులే సాక్షి! - ఇట్లని మరికొంద రందురు.

మరికొంద రిట్లందురు 'ఇవేవియు నిజము కావు. కాలికా రూపముతో భయంకర ప్రళయ నృత్యము చేసినాడు. దానిలో కాలాగ్ని పుట్టి యవనులపై ప్రసరించినది.'

అయ్యో, మీకేమైన పిచ్చియా? కన్ను లేమైన భైరులు క్రమ్మినవా? నాగచర్మాంబరుడైన పార్వతీశ్వరుడు పరమ శాంతముగా యోగనిమీలిత లోచనుడై పద్మాసనమున గుండ్లకమ్మ మధ్య ప్రత్యక్షమైనాడు. ఈ గుండ్లకమ్మ పొంగి శిరస్సు చేరి యతనిని గంగవలె నభిషేకించినది. గంగమ్మయు గుండ్లకమ్మయు అభేదముగా కన్పించిరి. మేము స్పష్టముగా చూచినాము!' అని కొందరు గట్టిగా వాదింతురు.

ఒకరికి తోచినట్లు ఒకరికి తోపలేదు. ఒకరు చెప్పినట్లు ఇంకొకరు చెప్పరు. అందరు స్వయముగా చూచినా మని గట్టిగా వాదించువారే!

పూజ్యురాలగు అన్నమ్మతల్లికి మరియెట్లు కనిపించెనో! ఆమె యితరుల వలె పోతరాజుకి మ్రొక్కి లిడుటలేదు. కొంతవడి తన గర్భవాసమున బుట్టిన

పుత్రుని జూచునప్పటి యతనివంక నామె వాత్సల్యముతో చూచును మరికొంతపడి మన్నుతిన్న కుమారుని నోటిలో విశ్వరూపము చూచిన యశోదాదేవివలెనే విభ్రమ పరవశమై ఆమె పోతరాజు వంక చూచును.

మరి మల్లారెడ్డికో? అతనికి పోతరాజు సాక్షాత్తుగా తన చిన్నన్న వేమారెడ్డి స్వరూపముతో కవచగాత్రుడై యుద్ధ సన్నద్ధమూర్తియై దర్పముగా కనిపించినాడు. ఆతని కొకప్రక్క కరవాలము వ్రేలు చున్నది. మరియొకప్రక్క శూలము తగిలించి యున్నది. సజ్య మొనర్చిన మహాధనుస్సు నెడమచేతిలో బూని, కుడిచేతితో నారిబట్టి టంకార మొనర్చు చున్నాడు. ఆ ధనుష్టంకారమే మల్లారెడ్డి శ్రవణములలో వీరగానమువలె శ్రావ్యగంభీరముగా నిండుచున్నది.

తన చిన్నన్నతో నతనికి పలువురు వీరులు కనిపించిరి. వారెక్కువ భాగము తన యాప్తబంధువులు. అందరు గలసి ఆవల శత్రువుల నెవరినో దూరమునకు తరుమగొట్టు చున్నారు. వేమన్న ధనువునుండి బాణములు వదలు చున్నాడు చేత బాణము పట్టిన వేమన్నకు కుడిదండగా మల్లారెడ్డికి తనరూపమే అద్దములో చూచినట్లు స్పష్టముగా భాసించినది. ధనువు పూనిన ఎడమ భుజముగా తన చిట్టియన్న అన్నారెడ్డి కనబడినాడు.

ఆవలినుండి వేదవాదు లగు విప్రోత్తములు యాశీర్వచనములు వినబడు చుండ నాతనికి తనువు పొంగినది. తన ప్రియమిత్రము ఎర్రయ మనోజ్ఞ కంఠ ముతో తన యన్న వేమారెడ్డిని, తన సోదరులను, బంధువులను తన్ను కీర్తించు చుండుట వినబడినట్లయి పొంగిపోయినాడు.

మల్లారెడ్డికి ఒకటే అర్థము కాకున్నది. పూజ్యుడైన మా పెద్దన్న మాచా రెడ్డి రూపముతో కాక చిన్నన్న ఆకారముతో పోతరాజు కనిపించుచున్నాడేమి?

ఒక్కదాని కాతనికి చింతకూడ కలిగినది. తన సోదరుల వంటివాడే వీరు డొకడు, ఆవల తమచే పారగొట్ట బడుచున్న వారితో కనిపించినాడు. తాను కాలు నరికిన యవన వీరుని వాలకము తోడనే ఆ వ్యక్తి యున్నాడు. ప్రయత్న పూర్వకముగా తన దృష్టి యా వైపుననుండి మరల్చుకొని, మల్లారెడ్డి వేమన్న రూపముతో నున్న పోతరాజును ఆనందముతో చూచినాడు. ఆ పోతరాజు కాతడు రెండుచేతు లెత్తి నమస్కరించెను.

ఈ ఇంద్రజాలము చిత్రచిత్రాకారములతో ఎంతసేపు కనిపించినదో ఎవరును చెప్పలేరు. నెలలో, ఏళ్లో, గడచిన ట్లున్నవి.

కొంతవడికి అందురును పోతరాజును శిశువును స్నానము చేయించుటకు చాపియున్న అన్నమ్మ కాళ్ళపై పసిపాపవలె కదలక మెదలక యుండుట చూచిరి. తన పైటచెరగుతో అన్నమ్మ ఆదరముతో పోతరాజుకు తడియార్చినది. ముఖమునకు బొట్టు, కన్నులకు కాటుక తీర్చినది, ధూపము వేసినది. ఇంత వరకు తన శిరస్సుపై పడిలముగా నుంచుకొన్న నందికంతను తీసి అందులో ఉయ్యాలలోవలె పోతరాజును పరుండబెట్టి రెండుచేతులలో నుంచుకొని యిటు నటు ఊపుచు జోల పాడినది.

'జో సచ్చిదానంద, జో జో ముకుందా
రార పరమానంద, రామగోవిందా !— జో జో!
తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించి
నాలుగు వేదముల గొలుసు లమరించి
పరువైన ఫణిరాజు పాను పమరించి
చెలియ డోలికలోన చేర్చి లాలించి— జో జో!—'

అన్నమ్మ జోలపాడిన పిమ్మట వీరమ్మ మొదలుగా వచ్చిన తక్కిన ముత్తయిదువులును బహువిధముల జోలలు పాడిరి. నందికంత పోతరాజు నిద్ర కొరిగిన ట్లున్నాడు.

అంత కొంతవడికి నందికంత పోతరాజును తన సందిట నిరికించుకొని అన్నమ్మ యింటికి మరలినది. మల్లారెడ్డియు నతనివెంట దేసటిరెడ్డియు కదలిరి. అన్నమ్మకు కుడిప్రక్కను స్త్రీ జనముతో వీరమ్మ తరలినది. ఉత్సవము మేళతాళములతో కోలాహలముగా జరిగినది.

సంధ్యాకాల మగుసరికి పోతరాజును దేవమందిరములో నాతని పీఠము మీదికి అన్నమ్మ చేర్చినది. దీపారాధన చేసినది. భక్తులప్పుడు వెలిగించిన దీప సహస్రములతో, ఆనాడు పోతరాజుకు దీపావళి యైనది. అరాత్రి యంతయు పూజలు జరుగుచునే యుండెను. ఆంత్రమెల్ల ప్రధాన స్కంధా వారమున నందరు జాగరణ మొనర్చి మహాశివరాత్రివలె పోతరాజుకు ఉత్స వము గావించిరి.

16

ఇట్లు పోతరాజుకు ఉత్సవము జరిగిన మరునాడు ఉదయమునను మల్లా రెడ్డి స్నానముచేసి వచ్చి తల్లికిని, దేవాయతనములోని దేవతలకును, ప్రత్యేక ముగా పోతరాజుకును దండము పెట్టెను. భర్త దేశాంతరగతుడైన దాదిగా అంతవర కెన్నడు లేనిది. అన్నమ్మ యానాడు తన శిరోజములకు సంస్కా రము చేసికొనుచున్నది. ఇన్నిసంవత్సరములు సంస్కారము లే కుండుటచేత అంట కట్టు కొని పోయిన తన కేశములకు వీరమ్మ సాయముతో ఈనా డామె చిక్కు తీయించుకొనుచు సుగంధతైలము రాయించుకొని సంస్కరించుటకు యత్నించుచున్నది. అట్లు చిక్కుతీయుటలో నామె కేశ పాశము సగమై తల పరియలు పరియలుగా కానవచ్చు చున్నది. 'ఈమె భర్త రాకకై నిరీక్షించు చున్నదా? నాకు ఇన్నాళ్ళకు మరల నీనాడు మా తండ్రి దర్శన మగునా?' - ఆనుకొన్నాడు మల్లారెడ్డి.

ఇట్లనుకొనుచుండగా నతని దర్శనమున కెవరో వచ్చినారను వార్త వచ్చినది. అతడున్న ప్రదేశము పరులకు దుర్లభగాహ మైనది. క్రొత్తవా రెట్లు రాగలిగిరా యని యబ్బుర మందుచు మల్లారెడ్డి యావలకు వచ్చెను

ఆ వచ్చినవా రిద్దరు శిల్పులవలె కనిపించు చుండిరి. ఈ దేశపువారు కారు, దాక్షిణాత్యులుగా నున్నారు. వారు వినీతులై మల్లారెడ్డికి దండము పెట్టి రెండు ఖడ్గములు, రెండు విండ్లు, అంబులతో నిండిన రెండు తూణీరములు కానుకగా నర్పించినారు. ఆశ్చర్యముతో నాత డవి తిలకించెను. ఆయుధములం దాతని కలమక్కువచే వచ్చిన యిద్దరిని పలుకరింపకయే, అవి యొక్కొక్కటే తీసి పరీక్షింప సాగినాడు. ముందు ఖడ్గము లందుకొనెను.

అవి రెండును శ్రేష్ఠమగు అసి జాతికి చెందినవి. రెండును ఏబది యంగుళముల నిడివి కలవే. కాని రెండింటి రంగులు ఆకారములు వెడల్పులు గుర్తులు చేతలు వేరు. ఒకటి చిట్లాముదపు రంగు కలది. రెండవది తెల్లని తెలుపు. ఒకదాని వెడల్పు మూడున్నర యంగుళములు, రెండవదాని వెడల్పు రెండువేళ్లే. మొదటి దానిపై దుర్గిబీజము ముద్ర యున్నది. రెండవ దానిపై

చక్ర చిహ్న మున్నది. మొదటి కత్తికి ఐదు దోర్యములు. రెండవదానికి మూడు కలవు. మొదటిది గట్టిగా నున్నది. రెండవది జవజవ లాడుచు తెల్ల క్రాచువలె ఆడి పోవుచున్నది. మొదటిదాని వాయికూడ కొంచెము కరకుగా నున్నది. రెండవదాని వాయి చురకత్తికి వలె తాకితేనే కోసికొని పోవునట్లున్నది. మొదటి దెక్కువ బరువు. రెండవది యాకు వలెనే తేలికగా నున్నది. మోహముతో మల్లారెడ్డి ఆ రెండు ఖడ్గములు నిశితముగా పరీక్షించినాడు. ఏ దోషమును కని పింపలేదు.

పిమ్మట నాతడు ధనుస్సులు రెండు చూచినాడు. ఒకటి యఖండమై గట్టి వెదురుతో చేసినది. రెండవది సఖండము, కాని యందులో ఎన్ని ముక్కలున్నవో తెలియ రాకుండ ఏకముగా నదుకబడినవి. రెండు విండ్లును యుద్ధాను కూలములై పదునారు పిడికిళ్ళ పొడవున నున్నవి. ఒకదానికి రెండు చివరలను బంగారు పూత పూసి యున్నది. రెండవదాని కోటీరములకు వెండి పూత యున్నది. మిగిలిన భాగము లన్నియు చిత్రచిత్ర రూపములతో చిత్రితములై యున్నవి. ఒకదానికి బంగారు నళిక యున్నది. రెండవ దానిది వెండి నళిక. ఆ రెండు నొకదాని తర్వాత నొకటి పరీక్షించినాడు. చూచినకొలది అతనికి ముచ్చట యతిశయింప జొచ్చెను.

పిమ్మట అంబుల పొదులపై నాతడు దృష్టి సారించినాడు. అవి ఎంత యందముగా రంగులతో చిత్రింపబడినవి! నున్నగా లక్క-పూత పూసి దానిపై చిత్రములు వ్రాయబడినవి. ముందరి రెండుకాళ్ళను ఆకాశములోని కెత్తి చెంగున ముందుకు దుముకుచున్న వృషభచిత్రములు రెండిటిపైనను గలవు. ధర్మదేవతయే ఆరూపమున చెంగు మని యుత్సాహముతో ముందుకు దుముకుచున్నదా అన్నట్లున్నవి. ఈ చిత్రకారుడు ధర్మదేవతా విజృంభణకై ఎంత తపించినాడో! అయ్యో, మనధర్మ మడుగంటిన ఈకాలములో ధర్మదేవత ఎంత యానందాతిశయముతో చెంగువిడుచున్న ట్లున్నది ఈధర్మ వృషభముచే ఒక్క గంతైన ముందుకు వేయింపటకు నెనే మాత్రము నిమిత్త భూతుడనైనను ధన్యుడ కాదును గదా!' - ఆతని మనస్సులో నీ విధముగా ఊహలు రేగుచుండెను.

ఆ తూణీరములలో నుండి బాణములు తీసి యాత డంతట పారజూచెను. వాని కెన్నెన్ని ముఖము లున్నవి: సూచీ ముఖములు, అర్ధచంద్ర ముఖములు

శిలీ ముఖములు, నాళీకములు, శునక ముఖములు, కంకముఖములు, ఉలూక ముఖములు శునక ముఖములు, నాగ ముఖములు - మరియు బహువిధ ప్రయోగముల కనువుగా ములుకు లమర్చ బడినవి.

ఆ బాణము వొక్కొక్కటే తీయుచు మధ్యమధ్య కొన్నిటి నాతడు పరీక్షించు చుండెను. ఎన్ని ముక్కలతో చేసినవి? వాని తుల యెట్లున్నది? బాణము పొడవు మూడు సమాన భాగములుగా చేసి, అందులో ములికి యొద్ద నుండి యొక్క భాగమును, మొదటినుండి రెండు భాగములును కలియు చోట బాణము తన వ్రేలిపై నిలిపి, తుల చూచుచుండెను. అన్నియు సరిగా నక్కడ సమానముగా తుల తూగు చుండెను.

బాణముల గదులో? అవి ఎంత చక్కగా కట్టబడినవి! కొన్నిటికి మూడు; కొన్నిటికి నాలుగు - ఆయా బాణమునకు తగినట్లుగా గదులు కూర్చ బడినవి.

ఆ తరువాత మల్లారెడ్డి యా విండ్ల నారులు పరిశీలించెను. ఎంత గట్టి, ఎంత ఊపు నిచ్చుచు చున్నవి!

ఇ ట్లాయుధములు పరీక్షించుచు ముగ్ధుడై మల్లారెడ్డి యా కాన్క్‌లు తెచ్చిన దూతల విషయమే మరచినట్లున్నాడు. వారును మల్లారెడ్డి ముఖములో వ్యక్తమగుచున్న మురిపెము గమనించి తామును ఆనంద పడుచుండిరి, వారే మాత్రము సద్దు చేయక మౌనముగా నుండి మల్లారెడ్డి పలుకరించు వరకు వినీ తులై వేచి యుండిరి,

'మీ దే యూరు?'

"కాంచీపురము, ప్రభూ!' వారి మాట ఉచ్చారణ కొంత దాక్షిణాత్యుల యాసతో నున్నది.

'మీరు వచ్చిన పని యేమి?'

'మీ దర్శనార్థము.'

'నే నిక్కడ నున్నట్లు మీ కెవరు చెప్పిరి?'

'మా ప్రభువులు శ్రీత్రిపురాంతకదేవ దివ్యశ్రీ పాద పద్మారాధక అభయ ద్రావిళసెట్టి జగజెట్టి అవచిదేనయ సెట్టివారు.'

మల్లారెడ్డి యాశ్చర్య నందములతో నాలకించెను. అవచిదేవయ పేరు జగత్ప్రసిద్ధము. 'నిన్నటి రోజున పోతరాజు అవతరించుట, నేడు జగజెట్టి సెట్టి దర్శనము. ఏమి భాగ్యము!' అనుకొనుచు గంతు లేయుచున్న హృదయ ముతో ప్రశ్నించెను.

'ఏమీ, అవచిదేవయ సెట్టివారా? ఎక్కడ నున్నారు?'

'వారు మీ దర్శనము కాంక్షించుచు సమీపముననే యున్నారు.'

'ఎంత మాట! వెంటనే వారిని దయచేయు డని చెప్పుడు.'

అట్లు మల్లారెడ్డి యనుజ్ఞగొని వారు వెళ్ళి కొలది సేపటికి ఆవచిదేవయ సెట్టిని తీసికొని వచ్చిరి. సెట్టి వెంట నిద్దరు పెద్దలు కూడ వచ్చిరి. మల్లారెడ్డి ఎదురేగి తోడుకొని వచ్చి వారి కందరకు గౌరవాసనము లిచ్చి ఆదరవచనము లతో కూర్చుండ జేసెను. ఆచార సిద్ధమైన మర్యాద వాక్యములు ఉభయ పక్ష ముల ముగిసినంతనే అవచిదేవయ సరాసరి విషయ ప్రస్తావన ప్రారంభించెను.

'మీ యన్నగారు వేమారెడ్డిగారిని దర్శించితిని. మీమేనమామలు పోతయ చిట్టయ నాగయ ప్రభువులను గూడ చూచితిని. మీ అన్నారెడ్డి అన్నయ్యగారిని కూడ కలసికొంటిని—'

'ఏమి భాగ్యము! వా రందరు కుశలులేగదా!'

'అందరు కుశలముగా నున్నారు. అందరు వారి ధర్మోద్యములలో అప్రమత్తులై యున్నారు. వార లందరతో సంప్రదించితిని. మీరును మీబంధు జనమును ఈ మచ్యాంధ్రదేశమును యవనకంటక నిర్ముక్తము చేయుటకు గావించుచున్న ప్రయత్నములు విన సంతోషమైనది. మీ కందరకు ఉత్సాహ సంపద యున్నది. సహాయులగు జనసంపదయు నున్నది. మీకు ముఖ్యముగా కొరతగా నున్నది. ఆయుధములు, అశ్వములు, గజములు - వీని సంపద. అట్టివి మీకు కావలసి నన్ని శీఘ్రముగా అందజేయించెదను. తురుష్కులతో వర్తకము చేయుచున్న వారిని కూడగట్టుకొని వారికి యుద్ధసామగ్రు లంద కుండను, అందిన కొంచెమును దోష భూయిష్టములుగా నుండునట్లును చేయు టకు ప్రయత్నములు కొంత ముందుకు సాగుచున్నవి—

'వీరు వెలకడలను తల యెత్తుచున్నారు. ఎక్కడి నాయకుల నక్కడ బలపరచవలె. మధ్యమధ్య వారికి అధైర్యము కలుగకుండ, ఆవల దేశములో

నలమూలల జరుగుచున్న ప్రయత్నములు ఒకరి నొకరికి ఎరుకపరచు చుండవలె, రాపని సరకులు తెచ్చువర్తకులే చేయుచుండవలె.

'మధ్యాంధ్రదేశము మీకుటుంబమువారి వంతుకు పడినది. గోదావరీ మండలమున ప్రోలయ నాయకుడు కాపయాదులతో కలసి యిప్పుడిప్పుడే కొంత ప్రయత్నములు చేయుచున్నాడు. కర్ణాటక భూమిలో స్థితిగతు లయోమయముగా నున్నవి. దక్షిణమున మధురలో వీరు లెందరో తమ శక్తికొలది ప్రయత్నించుచున్నారు. దేవగిరి మొదలగు ఆరెమండలములలో తల ఎత్తువారే లేకున్నందున ముసల్మానులలోనే ఔత్తరాహులకును దాక్షిణాత్యులకును ఉన్న ద్వేషాగ్నికణములు రగులుకొట్టు ప్రయత్నములు సాగుచున్నవి, వింధ్యకు దక్షిణమున నున్న భూమి యంతయు యవననిర్ముక్తము కానున్న శుభసమయ మాసన్నమైన దని ఆశించుచున్నాను.

'కాని యిది యంతయు ముఖ్యముగా ముందిక్కడ మీరందరు సాధించు కార్యములపై నాధారపడి యున్నది. ఈ మధ్యాంధ్రభూమిలో ఇంతబంధు సంపత్తి గల మీకుటుంబము పూనుకొనుట విశేషము. ఇతర భాగములకు ముందుగా దారి చూపినవారే మీరు. ఇక్కడ యవనుల బలమును ప్రస్తుతము ప్రబలముగా లేదు.

'ప్రతాపరుద్రదేవ మహారాజులే తురుష్కుల చెరనుండి తప్పించుకొని వచ్చిన వార్తలుకూడ వినబడుచున్నవి. అవి నిజమైనను కాకున్నను నిజమనియే వాడుకచేయుట క్షేమకరము. ఢిల్లీసుల్తాను రాజధాని దేవగిరికి మార్చుటకు చేసిన ప్రయత్నములో చాల నష్టపడినాడు. ఉత్తరదేశములో కరువులు కాటకములతో పన్నులభారము భరింపలేక ప్రజలు తిరుగబడుచున్నారని తెలియవచ్చుచున్నది.—'

ఇది యంతయు మల్లారెడ్డికి మధురస్వప్నము వలె నమ్మరాకున్నది. ఈ శ్రేష్ఠినౌకలు సప్తసముద్రములలో నడయాడుచుండును. భరత ఖండముననే కాక సప్త ద్వీపములను ప్రభువు లెందరో ఆతని కాప్తమిత్రములు. దేశ మంతటిలో ఈతనికి తెలియనిది యుండదు. ఈ శ్రేష్ఠి ధర్మనిష్ఠ జగత్ప్రసిద్ధము. ఎంత మహత్కార్యము తలపెట్టినను సాధింప నితడు సమర్థుడే. సందేహము లేదు.

'కాని ఈత డెంతచెప్పినను బేహది కదా! అభిమాన మెంతైన చూప గలడు. అయినను ధనము లేకుండ ఊరక ఇన్ని వస్తువు లిచ్చునా? విలుచుటకు మావద్ద ధనము లేదే!"—ఈ సందేహములు మల్లారెడ్డి మనస్సును బాధింప సాగినవి. అది అవచిదేవయ గ్రహించిన ట్లున్నాడు.

'మీకు కావలసిన వన్నియు తెప్పించి యిత్తును. వాని మూల్యము మీరేమియు నీయనక్కరలేదు. మోటుపల్లి రేవు తురుష్కుల బారినుండి తప్పించిన జాలును. ఆరునెలల లోపల అంచెలమీద ఆయుధములు మీరుకోరిన రకములవి లక్షకు తక్కువ కాకుండను, రెండువేల గుర్రములును, నూరు ఏనుగులను మీకు కోరినచోట అప్పగింత చేయుదును. వానితో పని తీరిన తర్వాత అందులో మిగిలియున్నవే మా కప్పగింపవచ్చును. కాకున్న మీ కప్పటికి చాలినంత ధనము లభించినచో, మీకు ధర్మమని తోచిన మొత్తమిచ్చి యవి విలిచి కొనవచ్చును. ఈ ధర్మకార్యములో నష్టమైన గజాశ్వములకు ఆయుధములకు మూల్య మాశింపను. అవి భగవదర్పితములు!—'

అవచ్ఛిన్నవయ మాటలు వినుచున్న కొలది మల్లారెడ్డి నమ్మలేకుండెను, ఏ వర్తకుడును ఇట్టి బేరము చేయుట అతడెరుగడు. అవచిదేవయ ఉదార బుద్ధినిగూర్చిన కథ లెన్నియో వినియున్నవా డయ్యును, ఇందులో నేదో అంతర్య ముండవచ్చు నను సందేహ మాతనికి కలుగుచుండెను; సందేహ మతిశయించు చున్నకొలదియు నాతడు నిరుత్తరుడై, కొంతవడికి దేవయ యనుమతితో, విస్సనమంత్రికి రమ్మని కబురంపి, ఆతడు వచ్చునంతవరకు కాలక్షేపమునకై శ్రేష్ఠి కానుకగా పంపిన ఖడ్గములను ధనుష్తూణీరములను ప్రశంసించుచు, వాని చేతనుగూర్చి ప్రశ్నించుచు, వాని బహూకరించినందులకు కృతజ్ఞత తెలిపెను. ఆ పిమ్మట కుశల ప్రశ్నాదికము చేయ నారంభించెను.

'మొదలనే యడుగుట మరచితిని. వీ రెవరు?'— ఇట్లనుచు దేవయతో వచ్చిన భూసురుని నిర్దేశించెను.

'వీరా? కమలనాథాత్యులు. వీరు ప్రతాపరుద్ర దేవ భూజానిచే పూజలు గొన్న కాల్పట్టణాధీశులు. కాల్పట్టణ మిప్పుడు తురకల వశమైనది. ఈవైపున నన్నీ ప్రయత్నములకు ముందు పురి కొల్పినది వీరే. మహా విద్వాంసులు!'

వెంటనే మల్లారెడ్డి వినమ్రుడై కమలనాభామాత్య చూడామణికి వందన మాచరించుచు. 'మీ దర్శన భాగ్యముచే ధన్యుడ నైతిని' అనెను. 'శీఘ్రు మేవ విజయీభవ!' అని కమలనాభు డా శీర్వదించెను.

'మరి వీరో ?' - ఇట్లనుచు అవచిదేవయవెంట వచ్చిన పర్వతాకారు డగు వికృత విచిత్రవీరుని నిర్దేశించెను.

'వీరు మన కాప్తులు. శత్రువులకు అంతక తుల్యులు. శ్రీ విషయ వాసులు. వీరి నౌకల స్థావరము మధ్య ద్వీపములలో. పేరు రత్తగేహి !'

మల్లారెడ్డి ఆదరాతిశయములతో నాతని రెండు చేతులు గ్రహింప, నాతడు తన పెద్ద నోరు తెరచి, సంతోషముతో నవ్వెను. మహాకాయుడగు మల్లారెడ్డి యాతని చేతులు గ్రహింప, కుంభకర్ణుని చేతులు గ్రహించు అతికాయుని వలెనే పిన్నగా భాసించెను.

ఇంతలో విస్సన మంత్రి వచ్చెను. అతనికి మల్లారెడ్డి అంతవరకు జరి గిన దంతయు చెప్పి అతిథులతో పరిచయ మొనర్చెను. అంతట విస్సనయే ప్రధానముగా అవచిదేవయతో సంభాషణము సాగించెను.

విస్సన : 'మోటుపల్లి పట్టుకొనుటకు గజాశ్వ బలము, ఖడ్గాద్యాయుధ సామగ్రి మాత్రము చాలవు గదా !'

దేవయ : 'ఇంకేమి కావలె ? నా శక్తికి మించనిచో మీ రడిగిన వన్నియు నిప్పింతును '

విస్సన : 'నౌకలు !'

దేవయ ; 'మంచిది, ఎన్ని కావలె ? ఎట్టివి ?'

విస్సన : అదే ఆలోచించుచున్నాను. నౌకల యనుభవము మాకు తక్కువ. సరకులు తెచ్చు జోగులే కాక, యుద్ధమునకు అనువగు పెద్ద నౌక లెన్ని మీకు -'

కమలనాభు డడ్డు వచ్చి కల్పించుకొనెను. 'విస్సన మంత్రీ, మీరు పొర పాటుగా మాట్లాడుట లేదు కాని అవచిదేవయ స్వరూపము మీకు సరిగా తెలి యక సంభాషించు చున్నారు. వారి సంగతి నన్ను వివరింపనిండు !'

విస్సన : 'నా పొరపాటు పెద్దలు మన్నింపవలె. దయచేసి వివరింపుడు, విందుము.'

క. నా : 'కప్పలి, జోగు, సంపాను అని నౌకలు సామాన్యముగా మూడు విధములు. అవి కట్టిన ప్రదేశములను బట్టి రూపములోను భాషలోను మార్పే కాని, ఉపయోగములో అన్నియు అన్ని పనులకు ప్రయోగింపవచ్చును. కొద్ది మార్పులు చేసినచో ఆ మూడు రకములను యుద్ధ నౌకలుగా ఉపయోగింపవచ్చును. ఈ అరాజక సమయములో నౌక లన్నియు యుద్ధమున కెల్లప్పుడు సిద్ధముగానే ఉండును. లేకున్న వ్యాపారము సాగదు. పై మూడు రకములే కాక పల్లిపలిక లనునౌకలు కూడ వాని కనుబంధములుగా నుండును.'

విస్సన 'మంచిది' అనెను. మల్లారెడ్డి శ్రద్ధతో, పిల్లవాడు వీరగాథను వలె, ఉత్సుకుడై యాలకించుచుండ, కమలనాభుడు సాగించెను.

'అవచిదేవయ నౌకలు ప్రధానముగా వ్యాపారము నిమిత్తమే సప్త సముద్రములు సంచరించును. శ్రీవిషయము, మలయము, యవద్వీపము, సువర్ణద్వీపము, బలిద్వీపము - ఇవి యన్నియు సింహపురిమీదుగా పోవలసిన భూములు—'

'మీరు చెప్పుచున్నది మాకు బాగుగా నర్థమగుట లేదు' అని విస్సన యడ్డుతగిలెను.

వెంటనే కమలనాభుడు రత్తగేహి యొద్ద చుట్టియున్న పట మొకటి యందుకుని అది విప్పి చూపెను. ఏఏ ద్వీపములు దేశములు ఎక్కడెక్కడ నున్నవి, నౌక లాగు పట్టణము లేవియో, మొదలగు విషయములందు స్పష్టముగా వివరింపబడి యున్నవి. ఎక్కడెక్కడ సముద్రపు దొంగల కేంద్రములున్నవో కూడ నందు గుర్తింపబడి యున్నవి. విస్సనయు మల్లారెడ్డియు ఆ పట మవగాహనము చేసికొను నంతవరకు వేచియుండి, మరల కమలనాభు డారంభించెను.

'మీ కిప్పుడు అవచి దేవయశ్రేష్ఠి వర్తక మెట్టిదో కొంతవరకవగతమై యుండును. సముద్రముమీద ఓడ బయలుదేరిన దాది సముద్ర తరంగములను ప్రతికూలవనములనే కాక, ఎన్నెన్ని ప్రతిబంధకముల నెదుర్కొన వలెనో, ఇంచుక యాలోచింపుడు. ఏ క్షణమందైనను సముద్ర

దస్యులు వచ్చి ఓడను ముట్టడింప వచ్చును, వారికి రాత్రి లేదు పగలు లేదు. వారితో పోరాటమున కెప్పుడు సిద్ధముగా నుండవలెను. సముద్ర దస్యు లెంత మోటువారో, నేల విడుపునివా రుహింపలేరు. వారితో ఎన్నో పోరులు పోరిన ఈ రత్నగేహికిని అవచిదేవయశ్రేష్ఠికినే ఎరుక. ఇక రేవులలో దిగిన తర్వాత కూడ స్థానికాధికారుల తోడను, అక్కడ నివసించు జనుల తోడను ఒక్కొక్క తరి తీవ్రమైన చిక్కులు వచ్చును. అవసరమైనచో ఎప్పటి కప్పుడు బలప్రయోగ మొనర్చి కార్యసాధన చేయుటకు సిద్ధముగా నుండవలెను. ఈ సింహపురి యొద్ద చూడుము! సింహపురి కావల నున్న ద్వీపము నకును సింహపురికిని మధ్య ఎడము అర్ధక్రోశమే యున్నది. అటునుండి యిటు నాలుగు సూత్రములు బిగించి పట్టినచో ఇటు నౌక లటు, అటు నౌక లిటు రాకుండ స్తభించిపోవును. మధ్యమధ్య దస్యు లా ప్రదేశ మాక్రమించుకుని విపరీతముగా సుంకము వసూలు చేయుదురు. చతుర్విధోపాయములు ప్రయో గింపవలసి వచ్చును. కొన్నియెడల మంచిమాటలు, కొన్నియెడల దానము, కొన్నియెడల ఒకరితో మంచితనము మరియొకరితో బెదరింపు ఉపయోగించి భేదము పుట్టించుట, కొన్నియెడల దండప్రయోగము చేసి వారీ వర్తకము నయ మున భయమున సాగించుచున్నారు. కాని మూలస్థానమైన ఈ భరతఖండ తీర ములో ఈమధ్య చెలరేగిన అశాంతితో వ్యాపార మంతయు క్రొత్తచిక్కు ఎదు ర్కొనవలసి వచ్చుచున్నది. శ్రేష్ఠివారికి ఎనుబది నౌక లున్నవని ప్రసిద్ధి. ఆ సంఖ్య నాకాంగము లగు పల్లి పలికలు కలసినది కాదు. పెద్ద నౌకలలో వేయి మందికి తక్కువ ప్రయాణము చేయరు -'

విస్సన కిపుడు అవచిదేవయ మహాశక్తి కొంత యవగత మైనది. అంతట ఆత డింకను ప్రశ్నించుచుండ, వివరముగా అవచిదేవయము రత్న గేహియు కమలనాభుడును, ఆయా నౌకల స్వభావము స్వరూపము, వైశాల్యము శక్తి, వేగము ఇత్యాదులు వివరించిరి. మల్లారెడ్డి సర్వము తన యూహలో నవగత మొనర్చుకొనుచుండెను అత డెక్కువ ప్రశ్నలు వేయలేదు.

అంతయు తృప్తికరముగా నున్నది; విని విని విస్సన ఇట్లడిగెను.

'మీరు చెప్పిన దంతయు బాగున్నది. నమ్మరానంత బాగున్నది. ఏమై నను మీరు వర్తకులుగదా! వర్తకులు లాభములేని వ్యాపారము చేయుట అప్ర సిద్ధము! ఈ బేహారములో చూడగా, లాభమంతయు మాది, శ్రమయు

వ్యయము అంతయు మీదిగను తోచుచున్నది. ఇందులో సూక్ష్మ మేమున్నదో వివరింతురా ?'

విస్సన మోటు దనమునకు మల్లారెడ్డియే ోచకితు డయ్యెను, కమలనాభుడు తెల్ల పోయెను. రత్నగేహి నల్లని దేహమున రక్తము చిమ్ముటచే కొంచె మెర్ర వారినది. అవచిదేవయ మాత్రము అచంచలుడై పరమ శాంతముగా నుత్తర మొసగెను. ఆతని ముఖమును చిరునవ్వు వెలిగించుచుండ ఉదాత్త గంభీర మూ రిగా నాతడు కనుపడెను.

'మీ రింత మోమోటము లేకుండ నడిగినందుకు సంతోషము. మేము లాభము చూచుకొననిది వ్యాపారములోనికి దిగమన్నదియు సత్యమే. ప్రయో జన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే: మా నౌకలు సప్తసముద్రములలో సంచా రము చేయుచు సరకులు తెచ్చుచు పంపుచు నుండును. ఓరుగల్లునుండి మధుర వరకు దేశమును తురుష్కులు పాడుచేసినారు. రేవులలో వర్తక మంతయు పాడై పోయినది. మును పింతటి భూభాగమునను మా సరకులు విరివిగా చెల్లు బడి యవుచుండెడివి. ఇప్పు డది యంతయు నాగిపోయినది, ఒక్క ఈమద్యాం ధ్రములోనే మా వ్యాపారము యథాప్రకారము మరల సాగినచో ఐదారేండ్లలో ఈ పెట్టుబడి యంతయు పూడి లాభము కనబడగలదు. అదిగాక మరియొక సూక్ష్మముకూడ గమనింపవలె: మీ రందరు ఈ దేశోద్ధరణకి ఏమి లాభ మాశించి పూనుకొన్నారు ? అట్లే మాకున్న బిరుదములు మేము సార్థకము చేసి కొనవద్దా. మా శక్తి కొలదిగ ఇదే మీరింకొక విధముగా భావించినను మాకిష్టమే. మాకు అనేక కోట్ల ధనము సరకులు దూరపు రేవులలో మూలుగుచున్నది. అందులో కొంతయైనను ధర్మోద్ధరణమున కుపయోగించినచో, పుణ్యము లభిం చునుగదా : మా పరలోక సుఖమునకై ఇది ఇక్కడ మేము పెట్టుచున్న పెట్టు బడి - సంచ కరువు - అని మీ రనుకొన్నను మా కభ్యంతరము లేదు: -'

ఆ మాటలు విని విస్సన సిగ్గుపడెను. అతనికి అవచిదేవయశ్రేష్ఠిపై వర్ణింపరాని గౌరవభావము కలిగినది. వెంటనే యాతడు మల్లారెడ్డివంక తిరిగి యిట్లనెను:

'మల్లారెడ్డీ, అవచిదేవయ రూపమున మన కిప్పుడు భగవంతుడే సాక్షాత్కరించినాడు. మన యదృష్టము పండినది. సమస్త సందేహములు

విడిచి, ఇక నాతని యుపదేశములు మనము శిరసా వహింప వచ్చును - శ్రేష్ఠి, మిమ్ముల శంకించినందులకు క్షంతవ్యులము !'

అవచిదేవయ : 'అదేమిటి? కొత్తవారు వచ్చి చెప్పినంతనే నమ్మినచో వ్యవహారము సాగునా? మీ శంకలు మాకు ప్రీతియే కలిగించినవి, నిజము!'

అవచిదేవయ ప్రీతిప్రసన్న విలోకనములు ఆ మాటలాతడు మనస్ఫూర్తిగా పలికినని తెల్లముగావించెను. ఆత డంతట ముఖ్యముగా మల్లారెడ్డి నుద్దేశించి యిట్లనెను.

'పెన్నానదికి ఉత్తరమునుండి కృష్ణవేణికి దక్షిణమువరకు, గుండ్లకమ్మ కిరుప్రక్కల నున్న యీ భూమిని, తూర్పుసముద్రమునుండి పశ్చిమమున అహోబలమువరకు యవననిర్మ్మక్తము చేయు భారము మీ చిన్నన్న వేమారెడ్డి తన భుజస్కందములపై వేసికొన్నాడు. మీ కుటుంబము బంధుసమృద్ధి, సమర్థత ధర్మదీక్ష కలది. ఇతరప్రాంతములలోగూడ మీవలెనే మహావీరులు ఇట్టి ప్రయత్నములే బహుముఖముల సాగించుచున్నారని వివరించితినిగదా! ఈ మధ్యాంధ్ర దేశము ముందు విముక్తి పొందిననే గాని మిగిలిన భాగములలో కార్య సాఫల్యము కాదు. దీని యంతటికి సాధనముగా మీరు మోటుపల్లి పట్టుకొనుట ముఖ్యము. ఆ రేవు సమస్త సౌకర్యములు కలది. అది చేజిక్కించుకొన్నచో మా నౌకల సాయముతో దానిని సులభముగా రక్షించుకొనవచ్చును. అది మన స్వాధీనములో నున్నచో నిరంతరాయముగా సమస్తసాధనములు అందించు చుండగలుగుదుము. యుద్ధసాధనములే కాదు - ఈ ఎండిపోయిన భూమిలో ఎంత సాగుచేసి, బీజావాపము చేయవలెనో ఆలోచింపుడు. అన్నియు మోటుపల్లి మనహస్తగతమైనచో సుకరము. ఈ మధ్యాంధ్రభూమి కంతటికి అది ఆయువుపట్టు. మీ సమర్థత ఎరిగి మోటుపల్లి గ్రహించుభారము మీ భుజములపై పెట్టదలచితిమి. మీ రంగీకరింపవలెను. ఆరునెలలలో ఇది సాధింపవలెసుమా!'

మల్లారెడ్డి ఊఁకొట్టుచుండెను. ఆతడును విస్సనయు తమ కల లన్నియు నిజము లగుచున్న భావముతో ఆనందతన్మయు లగుచుండిరి.

'అవచిదేవయశ్రేష్ఠి, మా కించుక జ్యోతిషము ఎరుక. మీరు వచ్చిన వేళావిశేషము మంచిది! గోచార రీత్యా మన మిప్పుడు తలపెట్టిన కార్యములు అనుకొన్నకంటె శీఘ్రముగా సఫలములు కాగల సూచన లున్నవి.'

అవచిదేవయ కమలనాభామాత్యునివంక స్మితవికసితాననముతో చూచుచు నిట్లుత్తర మిచ్చెను :

'విస్సనమంత్రీ! నిత్యసత్యవచనుడ వగు నీ వాక్కులమోహము లని మాకు తెలియును. మీబోటి సద్బ్రాహ్మణుల ఆశీర్వచన బలము మాత్రబలము నమ్ముకొనియే మేమును ఈ మహాకార్యమునకు కడగినాము. మీవలెనే కమలనాభులును ఉపదేశించిరి. మన ప్రయత్నము ధర్మసమ్మతము. జయము చేకూర్చుటకు ధర్మదేవత మనపక్షమున నున్నందున జయము చేకూరు ననుటకు ఎట్టి సందియమును లేదు. మనుష్య ప్రయత్నములో అప్రమత్తులమై యుండ వలె గదా !'

మల్లారెడ్డి ఏదో తీవ్రముగా నాలోచించుచుండెను. అవచిదేవయ యది కనిపెట్టి 'మీరేదో ఆలోచించుచున్నట్లున్నారే ?' అనెను.

మల్లారెడ్డి : 'ఔను. మోటుపల్లి చుట్టుపట్టుల భూప్రాంతము మేము బాగుగా నెరిగినదే, కాని సముద్ర తీరమున ఎక్కడెక్కడ నౌకలు ఒడ్డు చేర గలవో, ఎక్కడెక్కడ డాగియుండగలవో ఎరుగము. ఆ వివరములు గల పట మొకటి మీ నావికులచేత సిద్ధము చేయించి పంపుదురా ?'

'సిద్ధముగానే ఉన్నది. ఇదిగో !' అనుచు నాతడు రత్తగేహి యొద్ద నుండి రెండు పటముల చుట్టలు తీసికొని మల్లారెడ్డి కిచ్చెను. మల్లారెడ్డియు విస్సనయు ఉత్సాహముతో వానిని విప్పి పరీక్షించుచుండిరి. ఒకటి వారికి తెలి సిన భూభాగ పటము. రెండవది తీరపటము,

అవచిదేవయ మరియు వారలతో నిట్లనెను. 'ఎన్ని పటము లున్నను తెలిసికొనవలసిన విశేషములు అనేకము మిగిలిపోవును. ఈ పటములలో సమ స్తము హృదయ ఫలకములో అచ్చొత్తినట్లు చిత్రించుకొనవలెను. ఐనను మీకు సముద్రుని విశేషములు, నౌకల రహస్యములు, వాయుప్రసారవైచిత్యములు, అవగాహనము చేసికొనుటకు, మీకు కావలె నన్నచో, కమలనాభామాత్యులును రత్తగేహియు కొంతకాల మిక్కడ నుండగలరు,'

మల్లారెడ్డి : 'అనుగృహీతులమా. నా బాహువు లుప్పొంగు చున్నవి. ఈ ప్రాంతములో ఈమధ్య చెంచుల యలజడి విపరీతముగా నున్నది. వారిని శిక్షించిన వెంటనే మోటుపల్లి యాత్రకు సిద్ధ మయ్యెదము. ఏ మందువు విస్సన్నా ?'

విస్సన అంగీకారము తెలుపుచు తల యూచెను.

అవచిదేవయ : 'చెంచులు మమ్ముగూడ అలజడి వెట్టిరి. నేను కొంత కఠినముగా వ్యవహరించితిని.'

విస్సన : 'మిమ్మా ? ఏమైనది ?'

కమలనాభామాత్యుడు రాత్రి జరిగినది వివరించెను. తామా ప్రాంతములు వదలి పోవునప్పుడు తమకు చిక్కిన చెంచుల నిద్దరను మల్లారెడ్డి కప్పగింతు మని అవచిదేవయ చెప్పి బయలుదేరుచుండెను. మల్లారెడ్డి, 'మా యడవి వారి ఆతిథ్యము పొందిపోవలె'నని వారల బలవంతపెట్టెను.

'మా పరిజనము మా కొరకై నిరీక్షించుచుందురు.'

'మీరు సపరివారముగా మా యతిథులుగా నుండవలె ననియే మా యభ్యర్థనము.

'మీ కది బహుప్రయాస మగును.'

'అతిథులను పూజించుటకూడ ప్రయాసముగ భావించు నికృష్ట స్థితి ఈ భాగమున కింకను పట్టలేదు!'

'అ ట్లున్నారు గనుక ఈ సాయంకాలము మీకు మేము సపరివారముగా నతిథులముగా నుందుము లెండు!'

'సంతోషము. మీకు శ్రీ శంకరస్వాముల దర్శనముకూడ చేయింతుము'

అవచిదేవయ 'మహాప్రసాద' మనెను.

17

అంతలో వాకిట నొక పిచ్చివాని గొంతు వినవచ్చినది.

'ఏమిరా, మల్లా!—నన్ను గుర్తించినావురా ?'

ఆ గొంతు వినిపించుచున్నదే వ్యవధానముగా. ఆ పిచ్చివాడు సరా స రా రున్నచోటికి వచ్చెను. అందరు నివ్వెరపడి చూచుచుండిరి.

అపరిమితమైన వాత్సల్యముతో పిచ్చివాడు మల్లారెడ్డిని నిలువున నున్న వాని నున్నట్లు గాఢముగా నాలింగన మొనర్చుకొనెను.

'నాయనా, ఎంతవాడ వైనావురా ఆహా! నీ కౌగిలి ఏమి చల్లగా ఉన్నదిరా!—'

అట్లాతడు కౌగిలించుకొని మల్లారెడ్డికి ఊపిరి సలుపనిచ్చుట లేదు. ఆ పిచ్చివాడు ఉన్నతకాయుడు. స్థూలదేహము కాకున్నను శక్తి సంపన్న మగు శరీరావయవములు కలవాడు. పిచ్చివా డెంత బలశాలియో గాని మహాబాహు డగు మల్లారెడ్డియే ఆతని ప్రేమాలింగనము భరింపజాల కున్నాడు.

ఆతని యొడలు సంవత్సరముల తరబడి స్నాన మెరిగినట్లే లేదు. కేశ ములు సంస్కారము పొందినట్లే లేవు. దిగంబరుడై యాతడు చూచిననే అసహ్యము కలిగించుచున్నాడు. ఆతని దేహము ముట్టుకొన్నచో గొంగళి పురుగువలె జలదరింపజేయు చున్నది. అన్నిటికి దోడు అతనిపద్ధ భరింపరాని దుర్గంధము కొట్టుచున్నది.

అయితే నేమి? ఆతని కంఠస్వరములో మల్లారెడ్డి పై ప్రేమ ఉట్టిపడు చున్నది. అందుచే మల్లారెడ్డి యించుక యోర్చుకొన కలిగెను. అతడు ఎమ్మది గా ఆ ప్రేమ బంధమునుండి తన్ను తప్పించుకొన యత్నించెను. అది యంత తేలికగా లేదు. అందుకు మల్లారెడ్డి తన దేహములోగల బలమంతయు నుపయోగించి విదలించుకొనవలసిన యవసర మేర్పడుచున్నది. ఊపి రాడుట లేదు. దుర్గంధము భరింప శక్యముకాక వాంతివచ్చున ట్లున్నది. అయినను అత డెట్లో ఓర్చుకొని సగౌరవముగా ప్రశ్నించెను.

'ఎవరు బాబూ, మీరు?'

ఆ ప్రశ్నకు పిచ్చివా డెగిరిపడెను. బిగికౌగిలి ఒక్కసారిగా వదలి వేసెను. ఇంతవరకు ప్రేమపూర్ణమైన యాతని దేహములో ప్రతి యవయవమున నిప్పుడు రౌద్రరేఖ మూర్తీభవించినది. ఒడ లంతయు వడికి పోవుచున్నది, పెదవు లదరుచుండ నాత డిట్లరచెను :

'ఎవరా? నీయబ్బ! నీ యబ్బనురా!—దరిద్రుడా! నీకు మహాభాగ్యము కట్టిపెట్టవలె ననిరాగా, నీవెవర వని నన్నడుగు చున్నావటరా. ఛీ! - పెద్దవాడు దగ్గరకే రానీయలేదు. ఎట్లో మనస్సు సరిపెట్టుకొని చిన్నవాడవ్ గదా యని నీవద్దకు రాగా, నీవెవరవని యడిగితివా?— ముజ్జగములలో నింతపనికి మాలినవా డుండునా?—ఛీ!—'

ఇట్లనుచు నాత డక్కడ కా క్రించి ఉమ్మివేసెను.

మల్లారెడ్డికి కోపము రాలేదు. విభ్రాంతి కలిగినది.

అవచిదేవయ సహచరులతో కన్ను లప్పగించి చూచుచుండెను.

విస్సన శీఘ్రగతితో అన్నమ్మను తీసికొని వచ్చుటకు లోని కేగెను.

ఆ పిచ్చివాడు, వచ్చినంత యాకస్మికముగానే, కోపావేశముతో ఏమేమో గొణుగుకొనుచు, తిట్టుచు ఆచటినుంటి వెడలి పోయెను.

అట్టివానిపై కోప మెట్లు రాగలదు? వానిని శిక్షించు టెట్లు? ఏల? అత డెక్కడినుండి వచ్చెనో? ఎట్లు వచ్చినాడో ఇక్కడికి? ఇప్పు డెక్కడికి పోయినాడో?—పాపము, ఎవరో పిచ్చివాడు!

ఇట్టి భావములతో జాలిపడుచు పిచ్చివానిగూర్చి వారందరు చింతించుచు ఒకరివంక నొకరు చూచుకొనుచుండిరి. ఒక్కరును మాటాడలేదు.

ఆవల అన్నమ్మ వచ్చి వేచియున్నదని విస్సన చెప్పగా విని మల్లారెడ్డి తల్లి దర్శనమున కేగెను. ఆమె సర్వాంగ లంకృతయై క్రొత్తగానుండి గుర్తింప రాకున్నది. ఎన్నడు లేని యుత్కంఠతో నామె యడిగినది.

'మల్లా, ఆ వచ్చిన దెవరో జాగ్రత్తగా చూచినావా నాయనా?'

'పాప మెవరో పిచ్చివా డమ్మా!'

'ఎంత పొడుగున్నాడురా?'

'ఒక్క ధనుఃప్రమాణ మున్నాడు'

'నోరు పెద్దదా? చిన్నదా?'

'నన్ను మ్రింగునంత యున్నదమ్మా!'

'ఆయ్యో! - ముక్కో?'

'ఆ పెరిగిన గడ్డము మీసములలో మునిగిపోయి సరిగా కనపడలేదమ్మా!- పిచ్చివానికై ఇంత విచక్షణ ఎందుకే?'

'ఏరీ ఆయన?'

ఆ గౌరవ వచనమునకు ఆశ్చర్య పడుచు మల్లారెడ్డి యుత్తర మిచ్చినాడు.

'ఎక్కడికో వెళ్ళిపోయినా డమ్మా! ముందు పాపము, నన్నెంతో ఆపేక్షతో, కుమారుని తండ్రివలె గట్టిగా కౌగిలించుకొన్నాడమ్మా. కాని చూపులకు

చాలా అసహ్యము వేసినాడు, దానికి తోడు దుర్వాసన. అబ్బా! ఆ కౌగిలిలో నలిగిపోయి నా ప్రాణము పోవునట్లనిపించి ఉక్కిరి బిక్కిరి యైతిని -'

అన్నమ్మ ఆ కౌగిలి గాఢత ఎరిగి సుఖముతో స్మరించుచున్నట్లు ఒడలంతయు కుంచుకునిపోవుచుండ ఒక్క క్షణకాలము పులకరించినది. మరు క్షణమున ఆమె గొంతు ఆర్చుకొని పోయినది. 'నాయనా!' అనుచు ఆమె నోట మాటరాక ఆగిపోయినది. తాను ధరించిన తన ప్రాతకాలపు సొమ్ము లన్నియు నిర్దక్షిణ్యతతో ఒక్కటొక్కటే నెమ్మదిగా చింతాక్రాంత హృదయముతో తీసివేయుచున్నది. మల్లారెడ్డి తలయెత్తి ఆమెవంక తేరిపార జూచినాడు. అన్నమ్మ కన్నులలో నీరు గిర్రున తిరుగుచున్నది.

మల్లారెడ్డి కానాటి ఉదయమే తనతల్లి తల దువ్వుకొని సింగారించుకొన్న మాట యిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. పవిత్రమూర్తి ఆమె! అవ్యక్తమైన భావ మావేశించి అత డడిగినాడు.

'ఏమి టమ్మా, ఇది?'

'మీ నాయన గుర్తన్నాడు రా?'

మల్లారెడ్డి కొక్కసారిగా తన తండ్రి రూపము జ్ఞప్తికి వచ్చినది. అది పదునై దేండ్లనాటి మాట, తన కప్పుడు పదేండ్ల వయస్సు!

వారి గ్రామమునకు కొందరు గోసాయీలు వచ్చిరి. వారు గ్రామములో నున్నంతకాలము తనతండ్రి ప్రోలయ వారియొద్దకు రాకపోకలు తరుచుగా సలుపుచుండెను. తద కొకనాడు గోసాయీ లాయూరు పదలివెళ్ళిరి. తదాదిగా ప్రోలయయు కనఁబడకుండ పోయెను.

కొన్ని రోజులవరకు ఎవరికి నేయనుమానము కలుగలేదు. ప్రోలయ ఎప్పుడును చిత్రమైనవాడే. ఇంటిలో నెవరికి చెప్పకుండ కార్యాంతరములపై అన్యగ్రామములకు వెళ్ళుట కద్దు. పది పదిహేనురోజులు రాకపోగా, ఈమారు ఇంటిలోనివారికి సందేహ మంకురించినది. సరిగా గోసాయీలు గ్రామమునుండి వెళ్ళిపోయిన నాటినుండియే ప్రోలయ కనబడుటలేదని స్మరణకు వచ్చినది. కాని ప్రోలయ గోసాయీలతో కలసిపోయియుండు నని ఊహించుట కైన సాధ్యమా?

ప్రోలయ యంతటి విలాసప్రియు డాగ్రామముననే గాక ఆచుట్టు పట్టు లనే లేడు. ఇంటిలో తిండికి లేకున్నను విలువగల జిలుగు వసనములు ధరించి, కస్తూరి, కర్పూరము, జవ్వాజి, గోరోచనము, కుంకుమపువ్వు మొదలగు సుగంధ ద్రవ్యములు విరివిగాకొని యనుభవించుచు, కంఠమునను శిరస్సు నందును పుష్పమాలలు ధరించుచు, కర్పూరవసంతరాయనివలె నుండు నాత డెక్కడ ? గోసాయీలతో కలసిపోవు టెక్కడ? ఐనను అంతకంటె నాత డదృశ్య మగుటకు వేరుకారణ మగపడదు. అతనికి శత్రువులు లేరు. అతడన్న గ్రామములో నందరికి ప్రీతియే. కష్టకాలములో నున్న ఎట్టి వారినైనను అత డాదుకొనును. అతనికి దుర్వ్యసనములులేవు. మాటలో తీపి యున్నది. అతనికి ప్రమాదము సంభవించుటయు సాధ్యముకాదు. పరదలో నున్న గుండ్లకమ్మనే అవలీలగా ఈవలనుండి యావలికి ఈది దాటు చుండు గజ యీతగాడు. ఎట్టి కోడెత్రాచు నైనను ఇట్టె ఒడుపుగా పట్టుకొన గలడు. ఖడ్గప్రయోగము బాణ ప్రయోగము మొదలగు ఆయుధ సాధనలలో నతనికి విశేష కౌశల మున్నది. అతడు కర్ర చేత పట్టుకొని సాము చేయుచు న్నచో దూరమునుండి శిలావర్షము కురిపించినను అతని నొప్పింపలేరు. నన్నయ భారత మాతని కభిమాన గ్రంథము. అందులో చాలభాగము నోటికి వచ్చును. సంస్కృతము గూడ నభ్యసించినాడు. శ్రీమద్రామాయణ మాత డెన్నిమారులు శ్రవణ మొనర్చెనో ! కొంతకో కొంత రససాధన చేసినాడు. అతని కెట్టి విషయములు నెక్కువు. క్రూరమృగ మైనను అతడు తీక్ష్ణముగా చూచినంతనే భయపడుచుండెడిది. ఒకమా రాతడు గ్రామములో లేని సమయ మున, సమీపమున గల పర్వతారణ్యమునుండి చిరుతపులి యొకటి ఊరిలో ప్రవే శించి చెప్పరాని గోల చేసినది, ఊరంతయు గగ్గోలు పుట్టినది. ఆత డింటికి రాగానే ఆసంగతి విని చేతిలో కర్రయైన లేకుండ పులియున్న చోటికి వెళ్లినాడు. ఆతని పొడకట్టి ఆపులి యొక యింటిలోనికి పోయి దాగినది. ఆ యింటివాకిట నాతడు నిలిచి తీక్ష్ణముగా నాత డా పులివంక చూచినాడు. వెంటనే ఆపులి నక్కుచు ఒదిగిఒదిగి భయముతో పడచు బయటికి వచ్చినది. దాని నాత డొకతన్ను తన్నగా, వెనుదిరిగి చూడక పారిపోయినది. ఇది కన్నులార చూచినవారు విసువు లేకుండ చెప్పినదే ఎన్నిమారులో అబ్బురముగా చెప్పెడివారు. ఆతనిది దీర్ఘాయు ర్దాయమని జ్యోతిష్కులు సాముద్రికులు ఒకటే మాట। అదిగాక శక్తి సంపన్న మగు నా దేహము మృత్యువుతో సరిసమానముగా పెనగులాడ జాలినది ।

'ఆ పెద్దనోరు, ఆ ధనుఃప్రమాణ విగ్రహము' తల్లి మాటలచే జ్ఞప్తికి వచ్చినవి. పెరిగిపోయిన ఆగడ్డము మీసముల యరణ్యముపైగా కోపేరువేసి నట్లున్న ఆతని ముక్కు కూడ చూచినట్లు అంతలో నిప్పుడు లీలగా మల్లారెడ్డికి స్ఫురించినది. ఆతడు విభ్రాంతి నొందెను.

'నీ యబ్బనురా!' అన్నా డతడు కోపముతో. ఎంత వాత్సల్యముతో నాతడు తన్ను కౌగిలించుకొనెను! ఎంత మందమతి యయ్యెను తాను! మర్యా దగా ఎవరో పరునివలె 'ఎవరు బాబూ, మీరు?' అని యడుగుటయా, తాను తనతండ్రిని ? ఎంత పొరపా టైనది !

'అయ్యో. అమ్మా, నీకు కలిగిన ఆశాభంగము నా కిప్పటికి అర్థమైనదే. క్షంతవ్యుడను.' ఇట్లనుచు మల్లారెడ్డి కంట తడిపెట్టుచు తల్లికి పాదాభివందన మాచరించెను.

చప్పున అన్నమ్మ కంటతడి యొత్తుకొని కుమారుని వంక ప్రయత్న పూర్వకముగా చిరునవ్వు ప్రసరింప జేసినది.

'అమ్మా, ఈ యరణ్య మంతయు గాలింప జేసెదను !'

తల్లికడ సెలవు పొంది మల్లారెడ్డి అవచిదేవయ యొద్దకు వచ్చి, 'ఆ వచ్చినది ఎన్నడో పదునై దేండ్లనాడు గోసాయిలతో కలసిపోయిన మాతండ్రి యని తోచుచున్నది. మి మ్మింతసేపు నిలిపినందుకు వేరుగా తలంపకుందురు గాక!' అనెను.

ఆవచిదేవయ యాతనితో సాదరముగా భాషించి ఆ యడవులలో వెదకు టకు తన పరివారమును గూడ సాయ మిచ్చెద ననెను. ఆ సాయంకాలమున వారల కతిథిసపర్య లొనర్చు ప్రయత్నములో విస్సన నిమగ్నుడయ్యెను.

మల్లారెడ్డి యనుచరులతోపాటు అవచిదేవయ యనుచరులును ఆనా డంతయు చుట్టుపట్టుల నరణ్య ప్రదేశమంతయు ఆ పిచ్చివానికై వెదకిరి. కాని యాతడు కనబడలేదు. ఆతడు వెళ్ళిన జాడయైన దొరకలేదు,

18

వారి కాపిచ్చివా డెట్లు కనబడును ?

వానికి అరణ్యములో అడవి మృగమువలెనే సంచరించుట చిరకాలా భ్యస్తమైనది. సరాసరి పొదలోనుండియే ముందుకు పోగలడు. మండలు ముండ్లు నాతని చర్మములో దూరలేవు. ఎలుగుబంటి చర్మమువలె నాతనిదియు మొద్దువారి పోయినది.

మృగములు పోవు సన్నని అడవిబాటను కొంత దవ్వాతడు పోయి పోయి పొదల కడ్డముపడి సాగిపోయెను. అక్కడ మానిసి నడచిన జాడయే కానరాదు. ఆతడు నడచునప్పుడు పదముల గుర్తులే కనబడకుండ చేయుట ఆతనికి బహుకాలాభ్యస్తమైనది. మృగముల దారిన పోయినచో కూతవేటు దూరము పోవలసినచోటికి నూరంగలలో అత డిట్లడ్డము పోయి చేరికొనును. అడ్డము వచ్చిన సెలయేళ్ళను మృగములు చేసిన దారుల యొద్దగాక ఎగువనో దిగువనో దాటుచు పోయి పోయి ఆత డొక సెలయేటి యొడ్డు చేరెను.

ఆక్కడ నా పిచ్చివాని కుటీర మున్నది. అది కుటీర మనుట దానిని సరిగా వర్ణికంచుటకు సంస్కృతాంధ్రములలో మాట లేకయే. అది గుహ యన వచ్చును; పొద యన్నను తప్పులేదు; ఏది యనుటకు వీలులేదు. కొండరాయి యొకటి ముందుకు పొడుచుకొని వచ్చి ఆచ్ఛాదనముగా నున్నది. ప్రక్కల నడ్డముగా తీగెలు కొమ్మలు పెరిగి యున్నవి. దృఢమైన ద్వారముగా నాము లడ్డముపెట్టి యున్నవి.

పిచ్చివా డందులో ప్రవేశించినదే తడవుగా బోర్లబుక్కల పండుకొని దీనముగా మూల్గ సాగినాడు. ఆతని చుట్టునున్న వస్తువు లన్నియు సువర్ణ మయములే. నెగడి ఒకటి, కుంపటి యొకటి, ఏన్నో మూసలు అక్కడ నున్నవి.

ఎంతయో సేపు ఆత డట్లే మూల్గుచుండెను. దెబ్బతిన్న అడవి జంతువు-వ్యాఘ్రమో, సింహమో—కోపతాపములతో మూల్గెడి మూల్గువలెలే అదియు

దూరము వ్యాపించి కొండకోనలలో ప్రతిధ్వనించుచున్నది. అది అడవిమృగము కాదనుటకు మధ్య మధ్య నోట వెలువడుచున్న మనుష్యవాక్కులే నిదానము. ఆత డట్లు ఎంతోసేపు మూల్గు చుండెను.

దారి తప్పిపోయిన సూర్యకవియు, అతని పత్ని పోతమ్మయు, పంట రెడ్డి తల్లి సివ్వక్కయు, దారికై ప్రయత్నించుచున్న కొలదియు దుర్గమారణ్య మధ్యమునకు పోవసాగిరి. వారిప్పుడు పిచ్చివాని కుటీరమునకు ఎక్కువ దూర మున లేరు. వారి కామూలుగు వినిపించినది.

ఆ మూలుగుధ్వని మొదటిమారు చెవుల బడి నంతనే, సివ్వక్క అదరి పడుచు, 'అయ్యో, పులి! చస్తిమి!' అని కేకవేసి వడకుచు ఏడువజొచ్చినది. పోతమ్మయు నాపాద మస్తికము కంపించుచున్నది, 'అయ్యో, ఈ భయంకరా రణ్యములో కోడ లేమైనదో కదా? కొడు కేమైనాడో?' అను చింత యిప్పు డామెకు తీవ్రతర మైనది.

సూర్యకవి జాగరూకుడై యాలకించి అది బాధపడుచున్న దీన మానవుని కంఠధ్వని యని నిర్ధారణ మొనర్చెను. శీఘ్రముగా నచ్చటికి పోయి సాయము చేయవలెనను ఉత్సుకత యాతనికి కలిగినది. ఆ మూలుగుచున్నది తన కుమా రుడే యేమో! పంట రెడ్డియా, అతని తమ్ముడు చిన్నయ్యయో - తన కోడలే కాకూడదా? పరమదైన్యములో కంఠధ్వని గుర్తించుట సాధ్యమా?

ఆత డటువైపు బయలుదేరుచు స్త్రీలకు ధైర్యము చెప్పజొచ్చెను. సివ్వక్క అడ్డముపడి ఆతని రెండు కాళ్ళు కౌగిలించుకొని తమ్ము విడిచిపో వ ద్దని వేడుచు గోల చేయసాగినది. పోతాంబ యాశ్చర్య దృక్కులతో తిలకిం చుచు నిషేధించు చుండెను.

'ఆ మూలుగుచున్నది మనవారే నేమో! ఎవరైనను సాయము చేసి పత్తును. ఆతడు మనకు సరియైన దారి చూపగలవాడు కావచ్చుగదా! మన కా అహోబల నారసింహుడే రక్ష!'

బహు ప్రయాస పడి వారి నెట్లో ఒప్పించి సూర్యకవి ఎట్టకేలకు బయలు దేరెను. ఆ మూలుగు శబ్దమును బట్టి యాతని పదములు ప్రయాణ మొనర్చెను.

పిచ్చివాడు మూలుగుచు బాధతో మైమరచియున్నను, దూరమునుండియే సూర్యకవి అడుగుల యలికిడి విన్నాడు. దుర్గమకాననములో ఘాతుక మృగ

ముల నడుమనట్లు ఎన్నియేండ్లో గడపిన యాతనికి నిత్య జాగరూకత స్వభావ సిద్ధముగా నలవాటైనది. లేకున్న నాత డచ్చట నపాయము లేకుండ ఏండ్ల తర బడి ఎట్లు మనగలిగెను! అతనిచుట్టు నదిగాక బంగార మున్నదాయెను బంగారమున్న వేదాంతులే దాని రక్షణకై కను మూయకుందురు గదా, మరి బంగారపు పిచ్చివాడు ఎంత జాగరూకుడై యుండును!

ఆతడు మూలుగు చాలించి సడి చేయక త్రుటిలో లేచి కూర్చుండెను. తన యేకాంత వాసముపై దాడి చేయుచున్న ఆ యజ్ఞాత శత్రువును నిష్కారణముగా శిక్షింప నిశ్చయించి, నిడువెల్ల కన్నులుగా దిక్కులు పరికించుచు, అడవి జంతువు వలెనే యాతడును పొంచియుండెను.

వచ్చుచున్న సూర్యకవికి ఆకస్మికముగా మూలు గాగిపోవుట యాశ్చర్యమనిపించినది, ఆ మూల్గినది మానవుడే యైయుండునా? దారితప్పి కాంతార మధ్యమున ఒంటరిగా తిరుగాడుచున్న ఎట్టి ధీరుల కైనను, విచిత్రములగు నూహలు పొడమును 'గ్రామములందును, పట్టణములను ఒకానొకప్పుడు పూజింపబడుచుండిన దైవతకోటి వలెనే, ఈ శ్రీశైల దేవతయు కావింపబడియిట్లు మూల్గుచున్నదా? లేక బలవన్మరణము ప్రాప్తించి దహనాదిక సంస్కారములు లేమిచే ప్రేతత్వ విముక్తి గాంచని నిర్భాగ్యు డగునే భూదేవుడో బ్రహ్మరాక్షస్సులు, పాప మిట్లు విలపించుచున్నాడా?

మూలు గాగిపోవుటచే అక్కడికి పోవుటకు దారి యేదో స్పష్టముగా తెలియక సూర్యకవి యాగిపోయెను.

'ఎవరది తండ్రీ అట్లు మూల్గినది?'

సూర్యకవి మాటలకంటె నాతని కంఠము ప్రేమార్ద్రమై వినవచ్చినది.

ఆ పిచ్చివాని యాటవిక మృగత్వమునకు ఆయార్ద్రిత ఆశ్చర్యము కలిగించినది. ఆదరముతో పలుకరించు శత్రువు లుందురా? ఉందురను నూహ కూడ ఆతనికి తట్టలేదు, ఆతని సంశయము భయము వైరభావము సడలసాగినవి. మచ్చిక పడుచున్న యాటవిక జంతువు స్థితిలోనే ఆతని మతి యున్నది. ఆదరగౌరవము లర్థించి ఆతడు వెళ్ళిన రెండు ఎడలను, గౌరవింప వలసిన యాప్తులే తన కనాదరము చూపియుండిరి. ఆదర మేమియు తానాశింపని అర్థింపని యజ్ఞాత శత్రువుకు ఇంత ప్రసన్న కంఠమేమి? 'మా తండ్రి వేమయ్య

చిన్నప్పుడు నాకు బాధ కలిగిన వేళలలో సన్నాహరముతో దగ్గరకు తీయుచు బుజ్జగించు కంఠమువలె తియ్యగా నున్నదే. యిది! - అయ్యో, మా తండ్రి పరలోకగతుడై యెంతకాల మైనది?'

ఏ పాతికేండ్లనాడో పోయినతండ్రి తలపకు రాగా పిచ్చివాని కది యప్పుడే జరిగినట్లుగా దుఃఖము పొంగి బావురు మన ఏడ్వసాగెను.

మూలు గాగినపిమ్మట సూర్యకవి యాగి యట్లు ప్రశ్నించి ప్రత్యుత్తర మునకై నిరీక్షించుచుండ. ఇంతలో ఈ యేడుపు వినిపించినది. వెంటనే సూర్యకవి మరల కదలుచు నిట్లు ప్రశ్నించెను.

'ఎవరు నాయనా, అట్లేడ్చేది?—ఎందుకు నాయనా ఏడ్చుట?—మానాయనవా?—'

కాళ్లు గజగజలాడుచుండ సూర్యకవి పరుగే ఎత్తెను. పసివానివలెకొండ రాళ్ళపై లంఘించుచు, ఒడలెల్ల రక్కుచున్న పొదలలోనుండి దూసికొనుచు పోయి, అత డాకటీరద్వార బంధము తొలగించి లోపల నిశ్శంకముగా ప్రవేశించెను.

19

లోపలికి వెళ్ళగానే సూర్యకవి దృష్టిపడిన డాయేడ్చుచున్న వ్యక్తి మీదనే. చుట్టు నున్న బంగారు వస్తువు లేవియు నతడు గమనింపలేదు.

ఆవ్యక్తికి కాపీనముకూడ ఉన్నదోలేదో, దిగంబరుడే! ఏమైన నేమి? ఆతడు మానవుడు. ఆతని దేహమునుండి వచ్చుచున్న దుర్గంధము నిత్యశుచి యగు సూర్యకవి నాసారంధ్రములలో ప్రవేశించి పరిశుద్ధ మైనది. అందుచే నది యెట్టి వికారమును గలిగింపలేదు. ఆ గంధ మాతనికి తట్టనేలేదు. అడవి మనుష్యునివలె నున్న యాతని యాకారమును తట్టలేదు. ఆతనిలోని మానవత్వమే, ఆతని దైన్యమే సూర్యకవికి కనబడినవి: ఆతని రోదనమే వినబడినది.

'ఎందుకు నాయనా అట్లేడ్చుచున్నావు ?'

ఇట్లనుచు సూర్యకవి యాతని శిరస్సును ఎడమచేతను గడ్డము కుడి చేతను ఆదరముతో గ్రహించి, ఏడ్చుచున్న పసిపిల్లవానిని తల్లి ఓదార్చునట్లే ప్రశ్నించెను, ఆతడు తన కుమారుడు కాడని స్పష్టమైనను సూర్యకవికి వాత్స ల్యము పొంగి పారుచునే యున్నది.

ఆ యనునయవచనములతో అడవి మనుష్యుని ఏడు పొక్కసారిగా విజృంభించినది. అతనికి నోట మాటరాలేదు. వెక్కి వెక్కి యేడ్చి యేడ్చి యాతడు తుదకు కూర్చుండ నోపిక లేక, సూర్యకవి రెండు పాదములపై, శిశువువలె తలవాల్చి, యాతని యొడిలోని కొరగెను.

సూర్యకవి యాదరముతో తన ప్రేక్షాతని వెండ్రుకలలో దూర్చి తల దువ్వసాగెను. ఆ జుట్టు అంటలు కట్టుకొనిపోయి యున్నది. 'ఈ యడవి జంతువేమి? దీనిపై నింత యాదరమేమి?'—ఇట్టి యాలోచన లేవియు సూర్య కవి మనస్సున స్ఫురింపలేదు, పుణ్యపాపముల పుంజమే ఈ మానవ శరీరము! ఇది కొంత ఉజ్జ్వలము, రమ్యము, పవిత్రము; మిగిలినది అసహ్యము, దుర్గంధి, అపవిత్రము. ఎవరిదేహమైన నంతే! దేహములే యేమి? ఈలోకమే పుణ్యపాపములు పడుగు పేకలుగా నేసిన మహాపటము! అట్టిచో నొకటి యస హ్యమని, రమణీయ మని, ఒకటి నింద్యమని, ఒకటి ప్రేమాస్పద మని యున్నదా? ఇది ప్రాజ్ఞులదృష్టి. అట్టి ప్రాజ్ఞాదృష్టి కల సూర్యకవికి పిచ్చివాని శరీరము దుర్గంధభూయిష్టమై, రోమకంచుకిత మైనను, వెగటనిపింపలేదు. ఆతని బాధ అనుకంప కలిగించినది. సింహము జూలువలె పెరిగిపోయిన ఆ పిచ్చివాని కేశారణ్యాంధ కారములో సూర్యకవి ఉజ్జ్వలకరములు సంచార మొనర్చుచుండెను. దానితో నా పిచ్చివాని శిరస్సు నావహించిన అంధకారము విరియుచున్నది.

'ఎందుకు నాయనా, ఇట్లు దీనముగా నేడ్చుచున్నావు?— నీ బాధ ఏమిటి?—' సూర్యకవి ప్రశ్న లివి.

'నీకు కొడుకు లున్నారా, బాపనయ్యా?—'

తా నడిగినదానికి జవాబు యీ ప్రశ్నయే. ఈ ప్రశ్న యేమిటి? ఇతడు, పాపము, కొడుకుల కేదో ఆపద కలిగి బాధపడుచున్న ట్లున్నాడు, నావలెనే!

'— ఉన్నాడు, ఒక్కడు'

'అత డెప్పుడైన నీవెవరవు. అని నిన్నడిగినాడా, బాపనయ్యా?'

ఇది యేమిటి ? ఇతని రూపమే కాదు, ఇతని మతికూడ భ్రమించినది, పిచ్చివాడే మాటాడసాగెను.

'బాపనయ్యా, నీ కొడుకు నెప్పుడూ నమ్మబోకుసుమా ! ఆతని కేమీ ఉపకారము చేయ పోబోకు ! ఇదిగో, చేయబోయినావా, నీ వెవరు, అని నిన్నే అడుగ గలడు -'

అతని మతి చాంచల్యపు మాట లాగిపోవువరకు మౌనముగా నుండి సూర్యకవి యాలకించుచు నాతని తల నిమురుచునే యుండెను.

'నా కైదుగురు కొడుకు లున్నారు బాపనయ్యా, ఎందుకు, ఏడువను ?'

ఆమాట లనుచు అదే తలచుకొని తలచుకొని, పిచ్చివాడు దుఃఖము పట్టలేక మరల బావురుమని ఏడ్పు సాగించెను. సూర్యకవి కేమియు నర్థము కాక తల నివురుచునే పిచ్చివాని వాక్కులకై నిరీక్షించుచుండెను.

'ఐదుగురు ! ఒక్కొక్కపుడు ఒక్కొక్క ఎద్దు ! - ఎందుకు : వట్టి యెద్దులు,'

ఆలోచించి సూర్యకవి తుదకు ప్రశ్నింప సాహసించెను,

'ఏమి చేసినారు ?'

'ఏమి చేసినారా ? - కొడుకుమీద నీకు ప్రేమ యున్నదా, లేదా ?'

'ఉన్నది.'

'నాకూ ఉన్నది. కాని ఏమి ప్రయోజనము ? వారి మేలుకోరి బంగారముతో నింపివేయవలె నని దగ్గరకు పోగా, పో పో పో, అని గెంటివేసిన నెట్లుండును ? వారి కేమి ఉపకారముచేయ బుద్ధి పుట్టును ?'

'ఔనుగాని వా రట్లెందుకు గెంటివేయుదురు ?'

'నమ్మబోకు ! నీకూ నీ కొడుకుమీద నాకు వలెనే వెర్రి అపేక్ష ఉన్నట్లున్నది. వాడు నిన్ను మరల సరిగా కళ్ళజూడడు సుమా !'

సూర్యకవి హృదయము కలక్కు మన్నది. శల్యముపెట్టి లోపల కలచి నట్లున్నది. అది పిచ్చివాని మాటయే యైననేమి? ఆతని కన్నుల నీరు చెమర్చినది.

'బాపనయ్యా, నీ కొడుకు కూడ నిన్ను వదలి పోయినాడు కాదూ? - నా కైదుగురు కొడుకులు. వారికోసము ఈ యడవులలో, కొండలలో, కోన లలో, ఆకు అలములు తిని పదిహేనేళ్ళు గడపి బంగారము కూడబెట్టినాను. పెద్దవానివద్దకు పోగా, తోటకూర కాడ పురుగునువలె నన్ను వాడు విదలించి కొట్టినాడు. కోపముతో ఒళ్ళు మండిపోయినది. మరల కొన్నాళ్ళకు నా పాపిష్ఠి మనస్సు ప్రేమతో ద్రవించినది. అందరిలో చిన్నవాని యొద్దకు గంపె డాసతో, పొంగి పొరలుచున్న ఆపేక్షతో వెళ్ళి కౌగిలించు కొంటిని. ఆ దరిద్రుడు, 'నీ వెవరు?' అని అడిగినాడు. ఎవడనా? వాడి అబ్బను. నీ కొడుకు నిన్నట్లు అడిగితే మండిపడవా, బాపనయ్యా? పిచ్చి యెత్తదు బాపనయ్యా? ఏడుపు రాదు బాపనయ్యా? -'

తిరిగి పిచ్చివా డేడువ నారంభించెను.

చూడగా ఈ మాటలు పిచ్చివాని మాటలుగా లేవు. సందర్భ మెచ్చటను చెడుచుండుట లేదు. ఏడుపు తగ్గు మొగము పట్టువర కాగి సూర్యకవి ప్రశ్నించెను.

'ఎప్పుడు?'

'ఎప్పు డేమిటి? ఇవ్వాళ ఇప్పుడు! ఎద్దువలె బలసినాడు మా మల్లడు. నే నడవులు పట్టినప్పుడు పదేళ్ళ చిన్నకుంక. వాడా, నన్ను నీవెవరు, అని అడుగునది, వేలెడు లేడు!'

'గుర్తు పట్టలేదేమో, నిన్నీవేషములో.'

పిచ్చివా డెగిరిపడెను. 'గుర్తు పట్టలేదా? గుర్తుపట్టడూ? తండ్రిని గుర్తు కూడా పట్టని కొడుకెందుకు? ఎద్దువలె బలసి యున్నాడు. వెధవను చూడగానే ఎంతో ముద్దయినది. అయితే అబ్బను గుర్తుపట్టని కొడుకెందుకు? — ఈ బంగార మంతా ఏమి చేయను?'

మాటి మాటికి బంగారము సంగతి ఎత్తుచుండుట సూర్యకవి కాశ్చర్య మనిపించినది. అంతవగ కాతడు పిచ్చివానివంకనే గాని చుట్టు నున్న వస్తు

వులవంక చూడనేలేదు. ఇప్పుడు తలయెత్తి చూచినాడు. చూడగా అన్నివైపుల బంగారు వస్తువులే. చెంబులు బంగారు. గిన్నెలు బంగారు. పళ్లెములు బంగారు బిందెలు బంగారు. అవి మోటుగా చేయబడినవి. అయిననేమి? అన్నియు బంగారు మయములు. సమస్తము బంగారమే. సూర్యకవి తనకన్నులు తాను నమ్మలేక పోయెను.

ఇంతవరకు హేమమును గూర్చి ఆపిచ్చివాడు పలుకుచు వచ్చిన మాటలు ఒక్కటొకటే స్పృహలోనికి వచ్చుచున్నవి. పరశువేది, హేమవిద్య సంగతులు జ్ఞప్తికి వచ్చినవి. హేమవిద్య సాధించు కోర్కెతో నెందరో శ్రీశైలారణ్యములలో ఓషధుల కొరకై సంచరించుచుండు రను జనశ్రుతి యత డెరుగును. హేమవిధ్యను గూర్చిన యోగములు మంత్రములు తంత్రములు నాతడు చదివియుండెను. వాని సాధనము గురువులు నిషేధించుటయు ఆతని కెరుకయే. హేమవిద్యకై సాధనచేయువారు అపవిత్రులు, వారు పిచ్చివారుగా అడవి మనుష్యులవలె నుండుట వింత కాదు. ఈ పిచ్చివాడట్టివాడగునా?

హేమము పవిత్రమైనది. కాని హేమ సంపాదనమందు తదేకనిష్ఠ కలవారు నికృష్టులు. హేమము పాత్రదానమునకే యోగ్యము కాని కూడ బెట్టుటకు కాదు అందును తంత్ర మంత్రాదియోగములచే హేమము సృష్టించువారు మహా పాపులు, ఆ సాధనల కెన్నో చెప్పరాని అపవిత్ర కార్యములు చేయగలెను. వారందువలన నపవిత్రులు. అట్టి అపవిత్రుడా యీ పిచ్చివాడు?- 'అపవిత్రుడా ?- అపవిత్రుడా ?'

అంతవరకు సూర్యకవి ఆదరముతో నాతని తల నిమురుచుండెను. ఆ వికృతాకారము అసహ్యమనిపింపలేదు; ఆ శరీర మాలిన్యము వెగటు పుట్టింపలేదు; ఆ దుర్గంధము దుర్భర మనిపింపలేదు ! 'కాని, అపవిత్రుడా ?—'

అపవిత్రుని తానెట్లు స్పృశింపగలడు? ఆతని తలపైనుండి సూర్యకవి చేతులు తీసెను.

'అపవిత్రుడా ?—' ఇట్లనుకొనుచు సూర్యకవి యించుక దూరముగా జరిగెను.

'అపవిత్రుడా ?' అను సందేహముతో సూర్యకవి యా పిచ్చివాని ముఖము దేహము తేరిపార జూచెను. ఆతని శరీర మంతట స్పష్టముగా అపవిత్రత మూర్తీభవించి పొడకట్టినది, 'ఆయ్యో ! అపవిత్రుడా ?'

సూర్యకవి లేచెను. ఆతని కా గుహలో నిక నుండుట సాధ్యము కాక పోయెను, పిచ్చివంటిదేదో ఆవహించినది. అచ్చటినుండి పారిపోవలె నని పించినది.

ఈ పాపిష్ఠిని తాకితినే ! - ఈ అపవిత్రుని స్పృశించితినే !'

సూర్యకవిలోని మార్పు పిచ్చివాడు గమనించెను. ముం దాతని కాశ్చర్య మైనది. అంతవరకు తన్ను తండ్రివలె తల్లి వలె నాదరించిన యీ పుణ్యపురుషు డిట్లాకస్మికముగా నేల మారినాడు ? సూర్యకవి బయలుదేరి పోవు చున్నాడని తోచినంతనే పిచ్చివానికి దిగులు పుట్టినది.

'అయ్యో ! నీవుకూడా నన్ను వదలిపెట్టి పోయెదవా; బాపనయ్యా ?'

ఆ కంఠములోని యార్ద్రి, కదలుచున్న సూర్యకవి కాళ్లు కట్టి వేసెను. సావిత్రీ మంత్రస్మరణము చేయుచు నాత డాగిపోయి, పిచ్చివానివంక జాలితో తిలకించుచుండెను.

'బాపనయ్యా, నామీద నీ కెందుకయ్యా కోపము ?'

'నీమీద కోపమా ? - లేదు.'

'నీవు అబద్ధ మాడవని యెరుగుదును గాని, కోపము రాకున్నట్లు దూర ముగా జరిగినా వెందుకు ? వెళ్ళిపోవలెనను కొన్నావు కాదూ ? నిన్ను నే నే మన్నాను ?'

'నీ వేమియు ననలేదు. నా కే పోబుద్ధి పుట్టినది.'

'అంత పోవలె ననిపించుటకు హేతు వేమి ?'

'ఈ బంగారము ! -'

'ఈ బంగారము నీకు కావలెనా ? పేదవానివలె కనబడుచున్నావు. నీకు కావలసినంత తీసికో !'

'నే నిప్పుడు పేదవాడనే యౌదును గాని, ఇంతకంచె పేదరికము వచ్చినను ఈ బంగారము నే నొల్లను !'

'ఇది మాయ బంగార మనుకొంటివా, బాపనయ్యా ? మేలిమి బంగా రము. బంగారమంటే నీ కెందుకంత యసహ్యము ? నీకేమైన పిచ్చియా ?'

'బంగారమంటే నా కసహ్యము లేదు, అది పవిత్ర మైనది. కాని -'

'ఏమి టా కాని ? ఈ బంగారము చేయుటకు దావాపు పదునై దేళ్ళు ఈ యడవులలో సంచరించినాను. తుదకు గురు కటాక్షముచే లభ్యమైనది కాని యిప్పు డది ఏమిచేయను ? బంగారము సాధించినచో జగత్తంతయు సాధించి నట్లే యనుకొంటిని, ముల్లోకములు సాధింపవచ్చు ననుకొంటిని. బంగార మున్నచో సాధ్యముకాని దేది ? పుణ్యము, పురుషార్థము ? కాని -'

'ఇందులో నొక రహస్య మున్నది నాయనా. పెద్దలు పదేపదే చెప్పునది. నిజము చెప్పినచో నీకు కష్టము కలుగునేమో !'

'నీ మీద నాకు విశ్వాసము కుదిరినది, బాబా ! నీవు విడిచి పోయినచో నేను భరింపలేను. నిజము చెప్పివేయుము. ఇప్పుడు పడుచున్న కష్టముకంటె ఏమి కష్టము కలుగగలదు ? నా భార్యకు బిడ్డలకు కాకుండ పోతినిగదా !'

'ద్రవ్యమే పాపిష్ఠిది.'

'అదేమి ? పురుషార్థముల కన్నిటికి సాధన మని చెప్పెడి ద్రవ్యమును నిందింతు వేమిటయ్యా ?'

'అందులో ఈ ద్రవ్యము పరమ పాపిష్ఠిది !'

'అంటే ?— ఎంత కష్టపడి ఈ హేమవిద్య సంపాదించితినో ఎరుగు దువా ?'

'ఎరుగకేమి ? ఎంత యపవిత్ర జీవనము గడపి యుందువో కూడ కొంత యూహింపగలను.'

'బాపనయ్యా, నీ వెంతో జ్ఞాని వనుకొన్నాను. అయ్యో, ఈ జీవితమే హేయ మైనప్పుడు, హేయకార్య మనుచు నొకటి వేరుగా నుండునా ?—ఇది మా గురువుగారు తరచుగా చెప్పుచుండెడి మాట.'

సూర్యకవి మౌనము వహించెను. అతడాలోచనలో పడిపోయెను. నూనె గారుచున్న పిచ్చివాని మురికిశరీరము తనకు అసహ్యము కలిగింపలేదు. అయితే అతని అశుచిభావము వెగటు కలిగించినది. పిచ్చివాని గురువు వాక్యములు స్వతంత్రముగా సూర్యకవికి ఆత్మవిమర్శనము రేపినవి.

'అశుచిభావన మాత్రము అజ్ఞానకృతము కాదా? నాకీ యశుచిభావము ప్రై నసహ్య మెందువల్ల?'

తన పితృపాదులు ఎరపోతసూరి తనకు పెట్టిన యాత్మనామము సూర్య కవి స్మరించెను. సూర్యుడు దర్శింపని ప్రదేశమున్నదా? సూర్యుడు స్పృశింపని వస్తు వున్నదా? ఆ మహాకాంతిలో సర్వము పునీత మగుచున్నది. మన అల్ప కాంతులకే శుచి అశుచి యను నజ్ఞానకృతభేద భావము.

ఆ హేమగురువు చెప్పుచుండిన వాక్యములు సత్యమూలములే, సత్య ములు కావుగాక! లోకప్రతారణమునకు శిష్య వంచనమునకు ఉద్దేశింపబడిన మెట్టవేదాంతపు మాటలవి. అట్టి భేదభావము నశించిన జ్ఞానికి హేమకాంక్షి యుండునా? హేమ సంపాదనకు అవసరమైన తుచ్ఛవస్తువులు సంగ్రహించుట, వానిని సేవించుట, వాని నుపాసించుట, జ్ఞానోద్రేకము వల్లనా? కాదు. కేవలము తామసగుణ ప్రేరేపణమువల్లనే. అశుచిభావన పోవునంతటి జ్ఞాననిష్ఠ, తన కింకను అబ్బలేదని సూర్యకవికి తోచినది. శౌచము వదలుట శ్రేయోదాయకము కాదనిపించినది. పిచ్చివాని కతడుత్తర మిచ్చెను.

'నాయనా. నేనంత జ్ఞానిని గాను. నాకు శౌచము శౌచమే, అశౌచము అశౌచమే. పాపము, మీగురువు లా భావముల కతీతు లైనచో, ఈ హేమకాంక్షి యెందుకో?'

పిచ్చివాని కీమాటు రోషావేశము వచ్చి ఉగ్రుడై మండిపడినాడు.

'మాగురువుల నేమాత్రము నిందించినను నేను సహింపను. గురునింద చేసినవాని శిరస్సు తరిగి వేసెద నని ఘోరప్రతిజ్ఞ చేసినాను సుమా!'

సూర్యకవిమీదికి లంఘించి గొంతు పట్టుకొనబోవుచున్న వానివలె పిచ్చి వాడు లేచెను. సూర్యకవి ఏ మాత్రము తొణకక యిట్లనెను:

'నేను మీ గురువు నేమియు నిందింపలేదే! మీ గురువు స్వరూపము వివరించితిని. స్వరూప వర్ణనము నిందగా నీకు భాసించిన నేనే మనగలను!'

ఈ మారు పిచ్చివాడు శాంతించి వెనకకు తగ్గి ఆలోచనలో పడెను. 'ఏమి టీ బాపనయ్య మాటలు నా పాదులు కదలించి వేయుచున్నవి! నిజమే, నా గురువులు సాధించిన మోక్షమేమి? బంగారము, బంగారము, బంగారము.

ఆతడు దుఃఖావేశముతో దుర్మరణము పాలయ్యెను. నేనిట్లు నా భార్యకు, బిడ్డలకు, బంధువులకు, మిత్రులకు, ఎవ్వరికి కాకుండ పోతిని. మా గురువునకు గూడ కావలసినవా రెవరు నున్నట్లు తోపదు. అన్నేళ్ళు సేవించిన నాకే ఆంతర్యము ఈయలేదు ?' ఇట్లాలోచించుచుండగా సంశయ మొకటి కలిగి సూర్యకవిని ప్రశ్నించెను.

'బాపనయ్యా, నిన్నొకటి అడుగ దలచినాను. మోమోటము లేకుండ దాపక చెప్పెదవా ? హేమమే బ్రహ్మస్వరూప మని చెప్పెడి శ్రుతులు స్మృతులు గాని లేవందువా ?'

'ఎట్లుండును, నాయనా ? హేమమే బ్రహ్మమైనచో, వీది కాదు ? హేమము ఒక సాధనము. బ్రహ్మము దేనికిని సాధనము కాదు. అది స్వయం పరిపూర్ణము.'

'ఏమో బాపనయ్యా, నీ మాటలు నానెత్తి కెక్కుటలేదు. ఇన్నేళ్ళు అష్ట కష్టముల కోర్చి సాధించిన హేమవిద్య యంతయు వృధయే యందువా ?'

'అట్లనట లేదు. ఆ విద్య నుపయోగించుట పై సమస్తము నాధారపడి యుండును, ఈ హేమ మేమి చేయవలెనని నీ యూహ ?'

'నీవేమైన పిచ్చివాడవా బాపనయ్యా ? అట్లడుగుదు వేమి ? డబ్బు ఎవరికి చేదు ? ఎవరికి దొరికిన డబ్బు వారి కడుపున పుట్టిన పిల్లలకు పెట్టుకొని అనుభవింపవలె నని యుండదా ? ఇంకొకరికి చిన్నమెత్తు ఈయ బుద్ధి పుట్టునా ?'

'అయితే ఒకటి గమనించు ! నీ పిల్లలు సంపన్ను లగుటకే కదా, ఈ హేమ విద్య నీవు సాధించినది ? బంగారము బ్రహ్మమైనచో, అది నీ కొడుకులను సంపన్నులను చేసి భోగము లనుభవించుటకేనా ఉపయోగించునది ?'

'నీ మాటలు నానెత్తి కెక్కుట లేదు. హేమము బ్రహ్మమను భావన లేకున్న దానిని సాధింప సాధ్యమా ?'

'కావచ్చును. హేయమగు వస్తువును, ఉత్తమ వస్తువు లన్నింటికంటె పరమోత్తమ మగు బ్రహ్మముగా భావించుటకంటె నీచభావము వేరొకటి యుండునా ? అందువల్లనే హేమవిద్య పరమా పవిత్రమైనదని శిష్టులు నిర్ణయించినారు.'

ఈ మారు సూర్యకవి మాటలు పిచ్చివాని తలకెక్కిన ట్లున్నవి. ఒక్క సారిగా నతనికి తనపై తనకే అసహ్యము పుట్టినది. అతని ఒడలంతయు తేళ్ళు జెర్రులు ప్రాకుచున్న ట్లయినది. గతమైన తన పదునేడేండ్ల చరిత్ర యంతయు నొక్కసారిగా నాతని స్మృతిలో భాసించినది.

* * *

భార్యాపుత్రులకు చెప్పకుండ వారి కర్మమునకు వారిని వదలివేసి తాను గోసాయివెంట శిష్యుడై పోయెను. అప్పుడు తన కడసారి పిల్లవాడు మల్లడు పదేండ్లవాడు. ఆ గోసాయితో కలసి తాను పోరాని తావులకు పోయినది, చేయరాని పనులు చేసినది. సమస్తము జ్ఞప్తికి వచ్చినది. తనకున్న సాహసమును శక్తిని ఆ గోసాయి గురువు ఉపయోగించుకొనెను. తా నెంతగా గురువును ఉపచరించినను తన కాతడు హేమవిద్య నుపదేశింపనే లేదు. ఎన్ని మారులు ప్రార్థించినను హేమవిద్యను గూర్చిన కథలే చిత్రవిచిత్రములుగా గురువు చెప్పుచుండెడివాడు. ఆ కథలు తన యుత్కంఠను మరింత యతిశయింప జేసెడివి. కథలు చెప్పి చెప్పి తుదకిట్లు పూర్తిచేయువాడు. 'హేమవిద్య చెప్పరానిది. ధన మీయవచ్చును. పుత్రుల నీయవచ్చును. కాని హేమవిద్య యీయదగదు!'

తనచే ననేక ఘోరప్రమాణములు చేయించుకొన్న గురువు నిరంతరము ఉపదేశించునది హేమవిద్య గోప్యతయే, దాని గుహ్యాతిగుహ్యతయే! అట్లయినచో ఇంతకాలము తా నాతని సేవించిన ప్రయోజనమేమి?

అన్నాళ్ళు సేవించినను ఆ గోసాయి ఏకులమువాడో కూడ తనకు తెలియలేదు. అతడు బ్రాహ్మణుడై యుండవచ్చును. చండాలుడై యుండవచ్చును, మొదలు వేదధర్మమందు ప్రమాణబుద్ధి కలవాడో లేదోకూడ తెలియదు. జైనుడను సందేహ మతనికి పలుమారులు కలిగినది. అతడు ఇతరులు వండిన యాహారము ముట్టెడువాడు కాదు.

ఏండ్లు గడచి పోవుచున్నవి. ఆలోచించిన కొలదియు తనకు గురువుపై కొంచెము కొంచెము అసహ్యము జనింపసాగినది. మధ్య మధ్య గురువుపై కడుపులో కోపపుమంట ప్రజ్వరిల్లును, దానితోపాటు ఎట్లయినను హేమవిద్యా రహస్యము గురువు వద్దనుండి లాగవలె ననునిశ్చయమును దృఢతర మగుచుండెను. తనచేత గురువెన్నియో పాపకార్యములు అసహ్యపు పనులు చేయిం

చెను. అబ్బబ్బా! ఆవి యన్నియు హేమవిద్య సంపాదించు నధికారమునకు సాధన లని గుర్వాజ్ఞవలననే తానాచరించెను. అట్టి కార్యములచే తనకు పుణ్య పాప విచక్షణ పోయినది. కార్యాకార్య వివేకము మొద్దువారినది.

అప్పుడు గురువుసద్దనుండి హేమవిద్య ఎట్లయిన లాగవలె ననెడి యాలోచనయే నిరంతరము బాధింపసాగినది. కాని యెట్లు? గురువు ఎప్పుడో ఏ రాత్రివేళనో ఎక్కడికో తనకు తెలియకుండ బోయి ఏవో తీగెలు ఆకులు తెచ్చును. అవి తాను చూడకముందే క్రొక్కి పిండి పసరు సిద్ధము చేయును. ఏ యాకో ఏ తీగయో గుర్తింప తనకు సాధ్యపడదు. వాని వాసన చూచినను ఒక్కొక్కమారు దివ్యవాసనయు, మరియొకమారు భరింపరాని దుర్వాసనయు కొట్టుచుండును. ఏమిచేయగలడు?

ఒక్కొక్కయెడ నాతని గురువు తీవ్రముగా తదేక దీక్షతో నేదో మంత్రానుష్ఠానము ప్రారంభించును. మద్యమాంసము లనేక విధములైనవి తనచే తెప్పించుకొనును. గురువు చేతలు మిగిలిన వెట్టివైనను ఆతడు ఎన్నడును స్త్రీ ముఖము చూడని యస్ఖలిత బ్రహ్మచారి. ఆతని ముఖమున ఊర్ధ్వరేతస్కుల కుండునట్టి వింత తేజస్సు ఉండెడిది. అట్టి గురువు గదిలోనుండి యపర రాత్రములలో ఒక్కొక్కసారి స్త్రీల కాంచీనినాదము వలెను, కింకిణీ రావము వలెను వినిపించును. తన సమీపమునకు రావద్దనియు, వచ్చినచో ప్రాణములు దక్కవనియు గురువు ముందుగనే శాసించి తర్జించి యుండుటచే, నట్టి సమయములలో వెళ్ళి చూడవలెనని తన కెంత కుతూహల మున్నను, భయము వల్లనేమి భక్తివలన నేమి, అటు పోవుటకు తనకు కాళ్లాడవు, ఏమి చేయగలడు?

గురువెంత రహస్యముగా దాచినను, తా నొక్కరహస్యము మాత్రము నిరంతర సాహచర్యముచే గ్రహింపగలిగెను ఏదో మార్గమున తనగురువు కొన్ని కణికలు సిద్ధము చేయును. అవి యాతడు కణికలుగా మాత్రము ఎప్పుడో కాని ఉండనీయడు. అవి యాతడు లింగాకారములను పూజావస్తువుల రూపమునను ఇతరాకారములను గుప్తము చేయుచుండును. ఆతని మందిరములో నొక నేల మాళిగ కూడ కలదని తన కనుమానము కలిగినది.

ఆ కణికలో నేదో మహత్త్వమున్నది. అందులో చిన్నభాగము తీసి కరగుచున్న రాగిలో వేయగా కొంతవడి కారాగి యంతయు బంగారముగా

మారిపోవును. ఒక రాత్రివేళ తానిది దొంగతనముగా కనులార చూచెను. ఆ సంగతి తనకు తెలిసినట్లు గురువునకు తెలియ నీయలేదు! అట్లే మరల రెండు మూడు మారులు రహస్యముగా చూచి అది ధ్రువపరచు కొనెను.

ఆ యరణ్యములో నేకాంతముగా నుండుటచే మధ్య మధ్య నాకస్మికముగా ఉన్మాదమువలె తీవ్రమైన ఆవేదన పుట్టుచుండెను. నిరుత్సాహమతిశయించి దేహము వ్రేలాకి పోవును. తన బాధ కనిపెట్టి గురువు తనచే గురువొక పర్యాయము కోడెత్రాచును పట్టించి దానివిష మొకకొంచెము త్రావించెను. దానితో తనకెన్నడు లేనంత యుత్సాహము కలిగెను. ఆ పిమ్మట తన కెప్పు డట్టి నిస్సారత వచ్చినను పాము విషము తినుట యభ్యాసముగా మారెను. ఇట్లు దొంగతనముగా గురువు రహస్యము చూచిన పిమ్మట నిస్సారత రాగా తాను త్రాచుపాము విషము సేవించెను.

అట్లు తాను త్రాచుపాము విషము తరుచుగా సేవించుట చూచి గురువు సందేహించి ఎక్కువ జాగరూకుడై యుండెనో, మరేమోగాని తాను చివరి పర్యాయము చూడబోయినప్పుడు, గురువు అలికిడి పసిగట్టి రివ్వున బయటికి వచ్చెను. తాను శీఘ్రముగా తన కుటీరము సడిచేయక చేరికొని శయ్యపై నొరగి నిద్ర నటించెను. గురువువచ్చి తన నాడి పరీక్షించెను. రొమ్మ్మపై చేయిపెట్టి చూచెను. ముక్కునొద్ద వేలుపెట్టి చూచెను. ఇట్లే మరియు ఎన్నియో పరీక్షలు చేసి వెళ్లెను.

ఆ మరునాడు తన గురువునకు తనపై సందేహము కలిగినదని చూపుల వలననే దృఢనిశ్చయ మొనర్చెను. గురువు చెప్పియుండిన కథ వలననే అతడిక తనపై నెట్టి జాలియు చూపడని తాను నిశ్చయించెను. ఆ రాత్రి తాను నిద్ర నటించుచుండ తనకు గురుని చేతులతో పెద్ద గండము తన కదృష్ట వశమున తప్పిపోయినదని తోచెను. ఆ మరునాడు తెల్లవారు లోపల అక్కడినుండి తాను పారిపోవనిచో, గురుని చేతులలో తనకు మరణము తప్పదని నిశ్చయించెను. తాను మేల్కొని యుండగా తనగురువెంత బలాఢ్యుడైనను తన్నేమియు జెనకలేడు. మరి నిద్రించిన? విషప్రయోగము చేసినచో? తనకు సాధారణవిషము లెక్కువు. కాని తనగురునకు త్రాచు విషముకంటె కఠోరతరము లగు విషము లెన్నియో తెలియును. ఆత డానాడేమియు నాహారము ముట్టలేదు.

వెంటనే ఏకో తేల్చుకొన వలసిన సమయము వచ్చినది. గురు వికతనకు హోమవిద్య ఉపదేశించు ననుట కల్ల. వృధా ఆశ, ఆతనియొద్ద నున్నచో ఇక తన ప్రాణము లుండుటయు సంశయాస్పదము. పొంగుచున్న ఆ వేగమును తీవ్రతరము చేసికొనుట కాతడు కోడెత్రాచును పట్టి దాని విషము సేవించెను. ఆత డావేశముతో శీఘ్ర నిశ్చయ మొనర్చెను.

ఆనాడు గురువు కుటీర మెప్పుడు వీడునా యని తాను వేచియుండెను. సాయంతనము వరకు గురువు కుటీరము వదలలేదు.సరిగా చీకటి పడబోవు వేళకు గురు వెందులకో కుటీరము విడిచి అడవిలోనికి బోయెను తనపై ప్రయోగించుటకై విషము తెచ్చుటకే కావచ్చును. తా నప్పుడు మెరపు మెరసినట్లు గురుకుటీరమున దూరి చేతికి చిక్కినన్ని బంగారుచేయు కణికలను, ఆ కణికల ద్రవ్యముతో చేసిన లింగరూపములు పూజావస్తు సంచయములు సేకరించి దూరమున రహస్య స్థలమున పదిలపరచెను. ఆ వెంటనే కుటీరము వెనుక ప్రోవుగా నున్న ఎండుటాకులను దగ్గరకు త్రోసి గురు కుటీరమునకు అగ్ని ముట్టించెను. ఆ కుటీరము భగభగ మండిపో సాగినది. అది ప్రమాదవశమున జరిగిన దని నమ్మించుటకు తాను స్వయముగా గురువును వెదకుచు బోయి పొదలో నాకులు కోయుచున్న గురున కావార్త ఎరిగించెను. గురువు ఒడలు తెలియకుండ చేతిలో నున్న యాకు లావల పారవేసి యావేగముతో పరుగుపరుగున కుటీరమునకు వచ్చెను. ఏ మున్నదిగ ఆతడు జీవిత మంతయు దేనికై ధారపోసెనో, అది యంతయు అగ్నిహోత్రున కాహుతి యగుట కన్నుల యెదుట ప్రత్యక్షమయ్యెను. అందులో నెన్నియో తాళపత్ర కోశములును భూర్జపత్ర గ్రంథములును దగ్ధమైనవి. ఆ కుటీరముతోపాటు తన శరీరమును సర్వాత్మయు మండుచున్న ట్లాగోసాయి కనిపించినది. ఆవేశముతో నతడింకను చల్లారకున్న యామంటలలో దూకి దగ్ధ మగుచున్న తన సర్వస్వముతోపాటు ఆతడును ధగ్ధు డయ్యెను.

తన గురు విట్లు చేయు నని తానూహింపలేదు. ఆతని వారించుటకును అవకాశము లేకపోయినది. ఇంత సాహసమున కత డొడిగటు పని ఊహించనచో తానాపని చేయ సమకట్టి యుండడు, ఇప్పు డొక్కసారిగా తానుచేసిన దెంత ఘోరకార్యమో తెలిసినది. 'గురుద్రోహిని! గురుహంతను!' అని తన్ను తాను పరిపరి విధముల నిందించుకొనెను. తానును ఆ మంటలలో దుముకవలెనని

ఒక్కక్షణకాలము తాత్కాలికావేశముతో తలంచెను గాని, ఇంతలో తన కుమారులు జ్ఞప్తికి వచ్చిరి. వారికి ధనము కట్టబెట్టవలె నని గదా తా నిన్నేళ్ళు ఈ యడవులలో గడపినది! తన పిల్లల కీ బంగార మప్పగించి తిరిగి యడవులకు వచ్చి తపస్సు చేయ నిశ్చయించి మనస్సు నాత్మహత్యనుండి మరల్చుకొనెను.

గురు కుటీరమును దహించిన యగ్ని చల్లారినది. తన పాదము లప్రయత్నముగా నా ప్రదేశమున సంచరించెను. తన చేతు లప్రయత్నముగా నాతావెల్ల తడవెను. ఏమి యదృష్టము! నిజముగానే చిన్న నేలమాళిగ కన బడినది. అందులో నింకను ఎన్నియో కణికలు దొర కినవి. మూసలు దొరికినవి. అవి చెడిపోలేదు. పరమానందముతో వాని నన్నిటిని గూడ ముందు భద్రపరచిన వానియొద్ద చేర్చెను.

అయిన నేమి? ఆతని కన్ని సాధనము లున్నను, సరిగా బంగారు చేయుట తెలియలేదు. రాగి కరగించి ఆ కణిక ముక్కలు అందులో గురువు వేసినట్లే వేసి చూచెను. బంగారము కాలేదు. తనకు తెలియని మంత్ర మేదో యున్నది, కీలకమేదో యున్నది. కణిక లొక్కొక్కటే వృథాగా ఖర్చగుచున్నవి. బంగారు రాకున్నది. అయ్యో!

పాళములలో కొంది మార్పులతో చేయగా చేయగా చివర కొకనాడు బంగార మైనది, మరల నట్లేచేసెను. మరల బంగార మైనది, మరల చేసి చూచెను. మరల బంగారమే! ఆతని యానందమునకు మేరలేదు. ఆరాత్రి యాతనికి నిద్దురబట్టలేదు. ఎప్పుడు తన కుమారులను చేరికొని వారి కీ బంగారపు ముద్దలు కట్టిపెట్టుదునా యనియే తా నాలోచించుచుండెను.

'తుచ్ఛుడా!'

స్వచ్ఛముగా నది తనగురువు కంఠము! అది భయంకరముగా నున్నది. త్రుళ్లిపడి తాను లేచెను, గురు వెదుట లేదు. ఆ చుట్టుపట్టుల వెదకెను. కనబడ లేదు. తాను చేసిన మూడు బంగారు ముద్దలును మెరమెర మెరయుచున్నవి. మరల నానందముతో తన్మయు డయ్యెను.

ఈమారు తన గుండెలపై నెవరో కూర్చుండి గొంతు గట్టిగా పట్టుకొని పిసుకుచున్నట్లు ఐనది. గురుకంఠము వినబడినది.

'దొంగా !'

తాను తన కుత్తుక ఆ పట్టునుండి విడిపించుకొనుచు లేచి కలయజూచెను, ఎవ్వరు లేరు. తాను భయమనునదియే మరచియుండెను. గాని యిప్పుడు భయము వేసినది. ముచ్చెమటలు దేహమున దిగజారినవి. ఒడలంతయు వణకిపోవనారంభించినది. మొద్దు వారిన తన హృదయము దిటవు చేసి కొన్నాడు, బంగారు ముద్దలు చూని వాని దరిచేరి, ప్రేమతో వానిని తడవి చూచి, పోలేదని నిశ్చయించుకొని తృప్తితో మరల శయ్యపై మేను వాల్చినాడు. మరల కునుకు పట్టినట్లున్నది.

ఈమారు దీనముగా నున్న తన గురువు రూపము కనిపించినది. చిత్రముగా నది మాడి బొగ్గుగా మారియున్నను గురువు నాకారము స్పష్టముగా పోల్చుకొనుటకు వీలుగా నున్నది.

'ప్రోలయ్యా ! -'

ఆప్రయత్నముగా తాను, 'ఏమి సెలవు ప్రభుజీ ?' అనెను; గురువు నెప్పుడును 'ప్రభుజీ' యని సంబోధించుటయే తనయలవాటు.

'ప్రోలయ్యా ! - పాపము, నీవు చాలకాలము నన్ను సేవించినావు. నీవు చేసిన దుర్మార్గము నీది కాదు. హేమమే నిచే నది చేయించినది ని న్నొకటి అర్థింతును. అది చేయుదు నని వాగ్దాన మొనర్తువా ? -'

తనకు గురువుపై జాలి కలిగినది. 'నా కుమార్ల తోడు ; మీరు చెప్పినట్లు చేసెదను, ప్రభూజీ !' తా నా ప్రతిజ్ఞ చేసినంత గురువు ప్రసన్నుడై పలికెను.

'ప్రోలయ్యా, నా తండ్రీ,నన్ను రక్షించినావు నాయనా ; నీవును కృతార్థుడవు కాగలవు. ధర్మకార్యములకు వినియోగించుటకే నేనీ విద్య సాధించితిని. ఎప్పటి కప్పుడు మరింతచేసి మరింత ధర్మ కార్యములు చేయు నాశతో చేయుచునే యుంటిని. నీవు చేయు బంగార మంతయు లోకసంగ్రహమునకును, ధర్మరక్షణకును, దేవ బ్రాహ్మణోద్ధరణమునకును, దీనానాథ జీవ వనమునకును మాత్రమే ఉపయోగింతునని నీ కుమారులమీద ప్రమాణము చేయి ?'

తా నట్లు ప్రమాణ మొనర్చెను,

'అట్లు చేయనినాడు నీ వంశము సర్వనాశన మగునుసుమా !' అనుచున్న గురువు మాటలు చెవులలో గింగురుమని మ్రోయుచుండ తాను

మేల్కాంచెను. అప్పుడు మరియొక మాట వినిపించెను. 'ని వంశములో ప్రియ పుత్రునికి 'కోమటి' యని నా పేరు చేర్చవలె సుమా!'

ఆ పిమ్మట తనకు గురు వెన్నడు ఏ రూపమునను కనబడలేదు. తనపై నిప్పుడు పెద్ద భారము పడినది. కొడుకులకు గాని యీ బంగార మేమిచేయను! లోక సంగ్రహమా? ధర్మ రక్షణమా? దేవ బ్రాహ్మణుల ఉద్ధరణమా? దీనా నాథ జనావనమా? బాగున్నది. తన్ను మాలిన ధర్మ మున్నదా? ఈ పాటి భాగ్య మునకే బంగారముతో నింటికి పోవుటేల? అత డక్కడనే యుండి బంగారము చేసి దానితో ప్రొద్దుపోవుటకై గిన్నెలు పళ్లేములు బిందెలు మొదలగునవి చేయుచు వాని జూచి యుప్పొంగు చుండెను.

ఏ కాంతవాస మిప్పు డంతకంతకు కష్ట మనిపించుచున్నది. ఒకనా డని పించినది. కలలోని మాటలకు ఇంత పట్టింపేల? అంతలో వంశనాశన మను మాటలు హృదయములో ప్రతిధ్వనించినవి. మనస్సు వెనుకాడినది. జనుల మొగమే చూచుట కాత డిచ్చగింప లేదు.

ఒకనా డుదయవేళ మొగలిపూవుల వాసన కలసిన మందమారుతము తనపై నొసిసినది. తన ధర్మపత్ని స్మృతిలో పారినది. ఆకస్మికముగా నాతని కింటిపై గాలి మళ్లినది. భార్యాపుత్రు లెక్కడ నున్నారో ఇప్పుడు?

తా నడవి మనుష్యునివలె నున్నా ననియైన గమనింపక స్వగ్రామము చేరుకొనెను. అక్కడ తన భార్యయు పిల్లలు లేరు తన యిల్లు దగ్ధము చేయ బడి యున్నది. ఊరిలో నెవరో తప్ప మనుష్యులే లేనట్లున్నది. అట్లే యాత డచ్చటచ్చట విచారింపగా చూచాయగా తనవారి జాడ తెలిసినది. తన ఐదుగురు కొడుకులలో దొడ్డని దేశములు పట్టిపోయెనట. మిగిలినవా రందరు బాగున్నారు. వారు వ్యవసాయము వదలి శస్త్ర జీవులై కొంత పేరు ప్రసిద్ధులు పడయుచున్నా రట. వారు నలుగురు నాలుగూళ్ళలో నున్నారు. పెద్దవాడు మాచయ్య సనద వోలు ప్రాంతములో తురుష్కులను సమయించుచున్నాడట.

తన కెంతో సంతోష మైనది. తనహేమ మాతని కీప్పు డెంత ఉపయో గించును! తన పెద్దకుమారుడు, తన కభిమానపుత్రుడు, తన్ను ఎంత ఆద రించును! పదునేనేళ్లుగా భార్యాపుత్రులను చూడకుండుటచే అంతర్గర్భితమై యున్న ఆతని ప్రేమ యంతయు నిప్పు డొక్కసారిగా పొంగి పెద్దకుమారు

నిపై ప్రసరించినది. ఆ పొంగులో నాతడు తనవేషము గమనింపక గోచిపాత యొకటి పెట్టుకొని సనదవోలు వెళ్లెను.

మాచయ్య జాడ తెలిసినది. కాని యాతని సమీపింపబోవ నందరు నడ్డుతగిలిరి. అతడు పగలు తన మూకలతో సముద్రప్రాంతములందు అడవులలో దాగియుండి రాత్రుల తురుష్కులపై బడుచుండెనని తెలిసినది. అట్టి దండుపనిమీద బోవుచున్న రాత్రి వేళ దారిలో నతడు మాచయ నాకస్మికముగా కలసికొని, 'నాయనా!' యనుచు గాఢముగా కౌగిలించుకొనెను.

మాచయ తొందరలో నుండి చీకటి రాత్రి పిచ్చి వేషములో నున్న తండ్రి నాతడు గుర్తింపలేదు. పిచ్చి వా డెదురువచ్చుట తాను పోవుచున్నపనికి అపశకునముగా తోచినది. అతడు తండ్రి కాగిలి బలవంతముగా విడిలించుకొని తన భటులతో వెడలిపోయెను.

ప్రోలయ ప్రేమయంతయు నొక్కసారి కోపముగా మారినది. ఆతడు రౌద్రమూర్తి యైనాడు. అయిన నేమి చేయగలడు? తన కసి వెళ్ళబోయుటకు మాచయ ఎదుటనైన నిలువక విదలించుకొని వెడలిపోయెను.

మానధను డైన యాతనికి ప్రాణమే పోయిన ట్లైనది. తిరిగి తన యరణ్యావాసమున కాతడు వచ్చెను. ఎన్నియో కణికలు చిదుకగొట్టి యావల పారవేసెను. ముఖములో పెనుకటికంటె వెర్రిరూప మావేశించినది. కొన్నినెల లిట్లు చెప్పరాని బాధపడెను.

అయిన నేమి? పుత్రమోహము బలవత్తర మైనది ఆతని మనస్సీమారు చిన్నకుమారు డగు మల్లనిపై ప్రసరించినది. ఈనాడు ప్రేమ నుండజట్టలేక మల్లయ్య యొద్దకు పోయెను. వీడును తన్ను గుర్తింపలేదు. తన యబ్బను గుర్తింపలేని కొడుకుపై తన కీ వ్యామోహ మెందుకు? ఈ దరిద్రుని తాను నేలపై దింపక ఎప్పుడు నెత్తిపై పెట్టుకొని అడిగిన దెల్ల తెచ్చి యిచ్చు చుండెడి వాడే!

* * *

ప్రోలయ మనస్సులో నీపూర్వకథ యంతయు నావృత్త మైనది. ఇప్పు డాతనికి క్రొత్తబాధ యుదయించినది. ఈ బాపడు హేమవిద్య యపవిత్ర మను చున్నాడు. పదునై దేండ్లు భార్యాపుత్రుల విడనాడి, కొండలు అడవులు పట్టి

తాను తిరుగాడెను. నిస్సారముగా నున్నవేళల తా నిప్పుడు త్రాచుపామును బట్టి దాని విషము పిండుకొని త్రావి ఉత్సాహము తెచ్చుకొనుచున్నాడు, సహజముగా తాను ధర్మపరుడైనను, ఈ బంగారమునకై తానెన్నో యకార్యము లొనర్చి, తుదకు గురుద్రోహము తలపెట్టెను. గురువు స్వప్నములో దీనిని లోక సంగ్రహాదులకు వినియోగింపు మని యాదేశించెను. తన బిడ్డలకు కాకుండ దానము చేయుటకేనా యింతశ్రమ !— 'ఈ బాపడు చెప్పుచున్నట్లు ఈద్రవ్యము అపవిత్ర మైనందువల్లనే భార్యాపుత్రులకు దూరమైనా నేమో ! అయినను ఈతని నడిగి చూచెదను' అనుకొనుచు నిట్లు ప్రశ్నించెను.

'బాపనయ్యా. హేమవిద్య యపవిత్ర మంటివి. ఈ బంగార మంతయు నావల పారవేయు మందువా ?'

'అది నాకు సమ్మతమే !' సూర్యకవి యుత్తరము వెంటనే వచ్చినది.

'ఎంత బంగారమో ఎరుగుదువా ?'

'ఎంత యైనను అంతే !'

'అయ్యో, వెర్రి బాపనయ్యా! ఏ బది అరువది పుట్ల బంగారము చేయగలనయ్యా! తెలిసినదా? ఏబది అరువది పుట్ల బంగారము సుమా !'

సూర్యకవి కాశ్చర్యమైనది. ఈతడు పిచ్చివాడు కాడనియు హేమవిద్యా ప్రభావముననే ఇతని కీ పిచ్చిరూపము వచ్చిన దనియు నిశ్చయించి శాంతముగా నాతడు ప్రత్యుత్తర మిచ్చెను.

'ఎంత యైననేమి? అశుచిపదార్థము అశుచియే !'

పిచ్చిరూపున నున్న ప్రోలయకు చిరాకు పుట్టినది.

'బాపనయ్యా నీ వొక సన్యాసివి వలె మాట్లాడుచున్నావు. ఈ బంగారము నా కొడుకుల కిచ్చినచో వారికి జయము కలుగ దందువా ? వారి వంశములు వృద్ధికావా ?'

'అట్లనను హేమము పాపిష్ఠిది. నీకొడుకులలో నెవరైనను నీ విచ్చు హేమము స్వప్రయోజనములకు, స్వీయభోగములకు ఉపయోగింపక, లోకసంగ్రహమునకు, ధర్మరక్షణకు, దేవబ్రాహ్మణోద్ధరణమునకు, దీనాన్ధు జనావనమునకు మాత్రము ఉపయోగింపగలుగుచో నిది దిగ్విజయము చేకూర్ప గలదు !'

ప్రోలయ నిర్ఘాంతపోయెను. సరిగా తన గురువు స్వప్నములో పలికిన మాటలే ఈ ముసలి బాపనయ్య పలుకుచున్నాడు :

'నిజమా, బాపనయ్యా ? సరిగానిదే మా గురువు స్వప్నములో చెప్పెను. నా కొడుకు లట్లు చేయనినాడు వారేమౌదురు ?'

'నా నోట దుర్వాక్కులు పలికింపబోకు ! - నీ పేరేమి ?'

'ప్రోలయ అందురు పెద్దలు. అయితే నన్నేమి చేయమందువు ?

'మరల నీ పెద్దకొడుకు కడకు పో !'

'ఆ చండాలుని వద్దకా ? పోను, ఎన్నటికీ పోను !'

'పోనీ, నీ కైదుగురు కొడుకు లంటివిగదా ! రెండవవాని యొద్దకు పోతివా ? అత డెట్టివాడు ?'

'పోలేదు, బాపనయ్యా, పోలేదు. మా వేమన్న ఉత్తమ డు. వాడన్న మాట తప్పడు '

'నిజమా ? నీ పుత్రప్రేమచేత చెప్పుచుండ లేదుగదా !'

'నాకు పుత్రప్రేమ లేకుండు టెట్లు ? నాకు పక్షపాతము లేకుండు టెట్లు? ఎంత మంచివాడవు బాపనయ్యా ! మా వేమన్న తండ్రిని జ్ఞాపకము చేసినావు. వాడు నా కొడుకు లందరిలో ఉత్తముడు. మాతండ్రి వేమన్నయే అన్నిరూపుల అచ్చముగా నా రెండవ కుమారుడు !'

'అయినచో నాతని యొద్దకు పొమ్ము ! అతడు నీ గురువుల యాదేశము పాలించునని నీకు విశ్వాసము కలిగినప్పుడే నీ హేమ మాతని కిమ్ము !'

ప్రోలయ పొంగిపోయెను. తన రెండవ కుమారునికి పెట్టిన తన తండ్రి పేరుతోపాటు గోమతేశ్వరుని పేర కోమటి యని కూడ పిలిచెడి యలవాటు స్ఫురించినది. తన గురువు వాక్యములు తన రెండవ కుమారుడు కోమటి వేమ నకు అన్నివిధముల అన్వయించు నని తోచినది.

'మంచి మాటలు చెప్పితివి, బాపనయ్యా ! మా గురువుల యుపదేశ మిప్పుడు పాలింతును. ఇప్పు డీ గుహలో ఉన్న బంగార మంతయు నీ కిదే యిచ్చుచున్నాను. తీసికొని నన్నుద్ధరించు !'

'మంచిది, ప్రోలయ్యా ! నేను బంగార మితరుల యొద్ద యిప్పటికి ప్రతిగ్రహించి యెరుగను. నే నిది తీసికొనుటకు వీలులేదు. కాని నీవు నా కది ఈయ నుద్దేశించితివి గనుక అది యెవరికి దొరకిన వారు తీసికొనునట్లు అనుజ్ఞ యిచ్చితిని. పదలివేసి బయలుదేరుము !'

ప్రోలయ కాశ్చర్య మైనది. ఏమి టీ బ్రాహ్మణుడు! మాటలు చెప్పుటే కాక క్రియచేగూడ తృష్ణాహీనుడుగా కనబడుచున్నాడు !

'నీవు నాకింత ఉపకారము చేసితిని. నీ ఋణము తీర్చుకొను మెట్లు? నీకు నన్నేమి ప్రత్యుపకారము చేయు మందువు ?'

'ప్రోలయా, నీకు నేనేమి ఉపకారము చేసితిని? మే మీ యరణ్యములో దారి తప్పితిమి. నా కోడలు కనిపింపలేదు. నా కుమారుడు మల్లారెడ్డిని వెదకుచు యవనుల మూకపై బడినాడు. వానికి భగవంతుడు అహోబలన్యసింహుడు క్షేమము చేకూర్చుగాక ! మమ్ము దారిలో పెట్టి మల్లారెడ్డి యొద్దకు చేర్పించిన జాలును.'

'మల్లారెడ్డి ఎవరు ?'

'నీ మాటలను బట్టి నీ చిన్నకొడు కని ఊహింతును.'

'మా మల్లుని యొద్దకా? వానియొద్దకు పోను బాపనయ్యా, పోను. మా వేమన్న యొద్దకు పోయెదను. నీవుకూడ నాతో రా!'

సూర్యకవి యాలోచించి ఏదోవిధముగా నీ యరణ్యములోనుండి బయట పడవచ్చుగదా యని యందుల కంగీకరించెను.

20

ఎర్రయ స్నానము చేసి సంధ్యావందన మాచరించెను. అప్పుడే పరమ హంస ఘంటానాదము వినరాగా, ఆతడు వెంటనే శ్రీ శంకరస్వాముల దర్శన మున కేగెను. స్వామివారు శివార్చన మొనర్చుచుండిరి. తురీయాశ్రములకు వందనముచేయు విధానమున ఎర్రయ సాష్టాంగ దండప్రణామ మాచరింపగా, శ్రీ శంకరస్వాములు నారాయణస్మరణము చేసిరి. పూజాసమవసానమున వారు

తీర్థప్రసాదము లొసగి యాతని వారు పలుకరించిరి. ఆ వాక్కులో నెంత వాత్సల్యము !

'నీ గాయములు నయమైనవా ?'

'తమ యనుగ్రహముచే నవి బాధించుట లేదు.'

'నీకు పంపిన మహాభారతకోశము చూడగలిగితివా ?'

ఎర్రయ కద్భుత మనిపించెను. ఆ జయకోశము తనకు పంపిన దెవరో ఆతని కంతవరకు నవగతము కాలేదు. అది యనుగ్రహించినది శ్రీ శంకర స్వాములే యని యిప్పుడు తెలిసినది.

'తమరు కేవలము వేదవ్యాస భగవానుల యవరావతారముగా భాసించు చున్నారు.'

శ్రీ శంకర గురుదేవులు చిరునవ్వు నవ్విరి. 'ఆ మహానుభావుని శిష్య పరంపర లోని వారము. వారి కలావేశ మేకో విధిగా మమ్మావహించియే యుండును.'

'స్వామీ, సంపూర్ణముగానే ఆవహించినది. ఉదయోన్ముఖ మగువేళ స్వప్నములో నొక పరమహంస నాచే 'నారాయణం నమస్కృత్య' ఇత్యాది మహాభారత ద్యానశ్లోకము ముమ్మా రనిపించెను. లేచి చూడగా తమరు ప్రసా దించిన జయకోశము ప్రత్యక్ష మయినది. నా స్వప్నములో దర్శన మిచ్చిన పరమహంస యాకారముననే తమ రూపము సాక్షాత్కరించుచున్నది.'

'నారాయణ, పరమానందము !'

'కటాక్షింపబడితిని. రాత్రి యంతయు నన్నయ భట్టారకులు చెప్పిన చివరి పద్యము నన్నావేశించినది. ఆవల హంసలు కూయగా విని క్రౌంచములు ఉబలాటముచే కూయగడంగునట్లే, నేనును శరదృతు వర్ణన పద్యములు చెప్ప సాగితిని.'

'మాకు గడచిన రాత్రి చివరి యామమున పూజ చేయుచుండగా, నీకు మహాభారత కోసము పంపినచో సత్కథాకాలక్షేప మగునని స్ఫురించినది. విద్యార్థి లేచి వచ్చి నంతనే నీకది పంపున ట్లేర్పాటు చేసితిని. మాపును జూడ నిందులో పరమశివుని యాదేశ మున్నట్లే తోచుచున్నది.'

'తమ బోటి శ్రీ గురువుల యనుగ్రహము ప్రసరించినచో సమస్త దేవతలు ననుగ్రహించి నట్లే !'

'నీవు చెప్పిన దానిని బట్టి చూడగా అరణ్య పర్వశేష మాంత్రమున బూరింప నీవే నిర్దిష్టుడ వైతివని తోచుచున్నది.'

'మహాప్రసాదము, స్వామీ! తమ యాదేశము శిరసా వహించుచున్నాను, మహాభారతము ఉపక్రమించు ధ్యాన మంత్రాదికము ననుగ్రహింపుడు !'

'సరిగా నడిగితివి. స్వప్నములో నుపదిష్టమైన మంత్రము మరల శ్రీ గురువులచే సక్రమముగా నుపదేశింపబడినది. అనుష్ఠేయములు కావు గదా ! - చెప్పుము !'

ఎర్రయ యాచమిం ప్రాణాయామాదిక మొనర్చి శ్రీ శంకరగురువుల పాదము లంటి జయమంత్ర ముపదేశింప నర్థించెను. స్వామి ఎర్రయ దేహమున దృఙ్మాత్రమున వ్యాసాదిక మొనర్చి, మంత్ర నాయికాద్యావాహనమున అమృత మయమైన తన దక్షిణ హస్తములను ఎర్రయ శిరస్సున నుంచి శ్రీమహాగణాధిపతి స్మరణ చేయించెను.

"నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్."

ముమ్మారు శంకర స్వామి ఎర్రయ దక్షిణ కర్ణమున నుపదేశింప నాతడు ముమ్మా రుచ్చరించెను. అట్లు ఉపదేశ మొనరించుచున్నంత సేపును అపరిమిత వాత్సల్యముతో శంకరస్వామి కటాక్షేక్షణము ఎర్రయపై ప్రసరించు చుండెను. ఆ కటాక్ష ప్రసారముతో తన సర్వాంగములు అమృత ప్లావితము లగుచున్నట్లు చల్లగా ఎర్రయకు తోచుచుండెను. శివశక్తులు తన హృదయములో క్రీడించుచున్నట్లుకూడ విచిత్ర భావ మాతని కుదయించెను. కటాక్ష దీక్ష యన నిట్టిదే కాబోలు ! ఎర్రయను ఇప్పుడు జయకావ్య మావేశించినట్లైనది.

దీక్షాంతమున ఎర్రయ శ్రీ స్వాములను విశేషరహస్యము లేమైన నున్న ముపదేశింపుడని యర్థించెను. శ్రీ శంకర గురుదేవులు చిరునవ్వుతో వికసించిన ముఖముతో నిట్లనిరి.

'ఎర్రయా, నీకు కోశ పూజాదికము తెలిసియే యుండును. ఏ ఘట్ట ములో నైన సందేహములు ఉదయించినచో మమ్మడిగి తీర్చుకొనవచ్చును. అవసరము లేదు కాని ఎందుకైనను మంచిది ఒకపని చేయుము. ఈ గ్రంథ శేషము నన్నయ భట్టారకుని పేరనే రాజరాజ నరేంద్రుని కంకితముగానే పూరింపుము :'

ఎర్రయకు సర్వసంశయములు నివృత్తి చెందినవి. నన్నయకు విఘ్నము కూర్చినది. సోమయాజులు వదలిరి. తాను తన కుటుంబమునకు దూరమై యున్నాడు. రచనోత్సాహములో గూడ నీ భావము లాతనికి రాకపోలేదు. ఇప్పుడు శ్రీ గురువుల యాదేశముచే అంతరము నిర్మల మైనది. శ్రీ స్వాముల కడ వందన పూర్వకముగా ననుజ్ఞాతుడై. ఎర్రయ తన స్థానమునకు వెడలి మహా భారతాంధ్రీ కరణమున నిమగ్నుడయ్యెను.

ఆతడు వేదవ్యాసకృత మహాభారతములో కొంత భాగము ముందు పఠించును. ఆ పిమ్మట నది మనస్సులో మనన మొనర్చు ధ్యానమగ్నుడగును. అనంతరమున దానిని గద్యపద్య రూపమున నావిష్కరించును.

ఆ సాయంకాలమునకు ముప్పది పద్య గద్యములు పూర్తియైనవి.

21

చెంచు లందలమునై తీసికొని పోవుచున్నప్పుడు మహాలక్ష్మి భయ ముతో తనువు మరచినది. ఒడలు తెలిసినవేళ చెంచుల నామెకు నృసింహ బిలముకడ దింపిరి. నృసింహస్వామికి ఆమె నమస్కరించి నప్పుడు చెంచుల కేకలు విని తలయెత్తి చుట్టును పరికించి భయంకరు లని తాను తలంచిన చెంచులు తనవైపు భయభక్తులతో చూచుచు వినమ్రులై యుండుట గాంచినది. వారు కులదేవతను కొలుచునట్లే తన్ను కొలుచుచుండిరి. ఆమె యింత కదలిన జాలును, 'ఏమి కావలె తల్లీ?' అని వినయముతో చేతులు కట్టుకొని చెంచు రాజొకడు ఎదుట నిలుచుండును. ఆమె దృష్టి యింత సారించిన జాలును, మరొక చెంచురాజు చేతులు జోడించి శిరస్సువంచి వందన మొనర్చును.

మహాలక్ష్మి యెన్నడు దాసదాసీ జనములచేత ఊడిగములు చేయించు కొన్నది కాదు. ఇతరుల కూడిగములు చేయుట యంతకన్న ఎరుగదు. ఆమె

భర్తకు అత్తమామలకు పెద్దలకు భక్తి శ్రద్ధలతో ఉపచరించును గాని దాస భావములో కాదు. ఇరుగు పొరుగువారికి తన కోపికయున్న సాయ మొనర్చుటయు, వారి సాయ మందుటయు ఆమె ఎరుగును. కాని ఇట్లితరులచే సేవలందుట క్రొత్త.

అమె పుట్టింట చెదలువాడలోను, అత్తవారింట గ్రుడ్లూరులోను పొలములలో పనిచేయు పాలేరులు కలరు. వారికి సేవాసూచక మగు మాసభృతి కాని దినవెచ్చముకాని ఇచ్చు నభ్యాసము లేదు. వార్షికముగనో, మధ్య నవసరము పట్టినప్పుడో, ధనధాన్య రూపమున బహుమతి ముట్టజెప్పుదురు. వారు సేవచేయు భృత్యులుకారు, ఇంటిలోనివారే. ఈపని చేయు మని ఒత్తిడిగాని, చేసినపనికి వంకలుగాని వా రెరుగరు. మాయిల్లు, మాపొలము, మాయెడ్లు, మాయావులు, అనియే వారు వ్యవహరింతురు,

కావున ఈ క్రొత్తసేవ యామెకు ముం దర్థము కాలేదు. రెండు గడియలలో నామె తన్ను చెంచులందరు చెంచులక్ష్మిగా పూజచేయు చున్నా రని తెలిసికొన్నది. తాను చెంచులక్ష్మియే కాకున్న తనకు మానప్రాణములు దక్కవు.

తనకు దేవతాభావ మారోపించుకొనుట ఆమెకు క్రొత్తకాదు. నోములు చేసికొను సువాసినులు తన్ను ముత్తైదువగా పిలిచి పూజించుట యెరుగును. తనతల్లి పోలమ్మ సోమిదేనికూడ తన్నట్లు పలుమారు పూజించి యుండెను.

అట్టి సమయములలో తాను 'నేనే గౌరీపార్వతిని' అనును. ఆవలి సువాసిని, 'కోరితి వరము' అని యర్థింపగా, 'ఇస్తిని వరము' అనుచు తాను వరమిచ్చును. ఇట్లెన్నో మారులు తాను గౌరీపార్వతి యై సువాసినులకు వరదాయని యైనది. తన పుట్టింటివారి యిలువేల్పగు కామేశ్వరి యిప్పుడు దారి చూపినది. చెంచుల ననుగ్రహించుటకై ఇప్పు డామె చెంచులక్ష్మియై, భక్తులగు చెంచురాజులచే పనులుగొనుచు, వారిని తన యాజ్ఞానువర్తుల జేసికొనుట యలపరచు కొన్నది.

ఆమె కన్నుల యెదుట కృష్ణవేణీనది కనిపించినది. ఆమె స్నానము చేయు నుద్దేశముతో లేచినది. చెంచుదొరలు ప్రక్కకు తొలగిరి. చెంచుదొరసానులు పచ్చి పసుపు కుంకుమ తెచ్చి పాతాళగంగా తీర్థమునకు దారి తీసిరి.

ఆమె మోమునను మంగల సూత్రమునకును పసుపు పూసికొని స్నాన మాడి కుంకుమ ధరించి తల యార్చుకొని, చెంచుదొరసానులు దారి తీయుచుండ మరల నృసింహబిలము చేరినది. అక్కడ పాలు తేనె సిద్ధముగా నున్నవి, మహాలక్ష్మి యవి భర్తకు మనసా నివేదించి యారగించి విశ్రాంతి తీసికొన్నది.

ఆ సాయంకాలమున చెంచులు మృణ్మయపాత్రలును, వెదురు బియ్యమును, అడవి కూరలు కాయలు పండ్లు, తెచ్చి యిచ్చి అవి వండుకుని సేవింపు మని యామెనెంతే ప్రార్థించిరి. ఐనను ఆరాత్రి కామె తేనె పాలు పండ్లు మాత్రమే సేవించెను.

మరునాడు చెంచు లామెను బియ్యము పచనము చేసికొమ్మని మరిమరి వేడుకొనిరి. ఆమెకు ఆకలి దుర్భరముగా నున్నది. కొంతవడికి వారిని అనుగ్రహించుటకో యన్నట్లు అంగీకరించి, స్నానమునకు బయలు దేరినది. చెంచు దొరసాను లీనాడు కోటిలింగాల రేవుకు దారితీసిరి. మహాలక్ష్మి యక్కడ కృష్ణలో మిలమిల లాడుచున్న కోటి స్వయంభూలింగమూర్తులకు మ్రొక్కులిడుచు స్నానమాచరించి, నృసింహ బిలమునకు వచ్చి వంట ప్రారంభించినది.

వంట పూర్తి యైనది. పత్రములో నన్నము వడ్డించు కొన్నది. భర్తయు నత్తమామలు గాఢముగా తలపుకు వచ్చిరి. వారెక్కడ నున్నారో, వారికేమైన తినుటకు లభించినదో లేదో గదా! మొదలు క్షేమముగా నున్నారా? తనకొరకు వా రెంతదిగులు పడుచుందురో! అహోబిలనరసింహస్వామికి మ్రొక్కుకొన్నది. కామేశ్వరికి మ్రొక్కుకొన్నది. ఆ యన్నము మనసా భర్తకు నివేదించుకొని ప్రసాదబుద్ధితో భుజించి యాకలి తీర్చుకొన్నది. తాను తినగా మిగిలిన యన్నము ఆవలకు తీసికొని పోయినది.

అక్కడ కూడియున్న గుంపు చూడ నామె కాశ్చర్యమైనది. వా రెంత సేపటినుండి యక్కడ నట్లు కాచుకొని యుండిరో! అందరు చెంచులక్ష్మి ప్రసాదము గ్రహింప వేచియున్నవారే. పెద్ద పోరాటమే జరుగునట్లు తోచెను. పెద్ద చెంచుదొర భీమరాజు ముందుకు వచ్చి మహాలక్ష్మి యొద్దనుండి ప్రసాదము గ్రహించి యందరకు నందునట్లు ప్రసాదము పంచిపెట్టుటచే నలజడి శాంతించినది. వారా ప్రసాదము కన్నుల కద్దుకొని భక్తితో భక్షించిరి.

పిమ్మట రెండుమూడు రోజులకు చెంచు లొక చిన్నవానిని ఆమెయొద్దకు తెచ్చిరి. ఆ పిల్లవాడు ఆ సమీపారణ్యములో నక్కి యుండగా చెంచులు పట్టు కొని వచ్చి తమదేవత కర్పించిరి. ఆతనితో తలమీద గాయపు మచ్చ యున్న మొద్దుకుక్క యొకటున్నది. సూర్యకవి గోమాతయు కోడిదూడయు నతడు వెంట తెచ్చెను. ఆతడు పంటరెడ్డి తమ్ముడు చిన్నయ్య. తనకు పరిచర్యలు చేయుటకై ఆ కుర్రవాని నుంచుడని మహాలక్ష్మి చెంచులకు చెప్పగా వారంతయు నానందించి యియ్యకొనిరి. గోమాత కుపచారములు చేయుటతోడను, చిన్నయ్య సాహచర్యము తోడను మహాలక్ష్మికి ప్రొద్దుపోవుచున్నది. చిన్నయ్యయు చెంచు వేషము ధరించి తన కుక్కను వెంట తీసికొని అడవిలో వేటకు పోవ్చను. ఆ కుక్కయు మోటుగా కనిపించినను పసికట్టుటలో నేర్పు కలది. ఆతడు చెంచు లక్ష్మియందు భయభక్తులతో మెలగుచుండెను.

రోజులు గడచిపోవు చున్నవి. చెంచులు చిత్రమైన మనుష్యులు. వారు శరీరము లెరిగిన వారే గాని మనస్సులలో పసివారు. వారియెడ మహాలక్ష్మికి పుత్ర వాత్సల్యము వంటి భావము ఉదయించినది. ఇప్పటి కామెకు మాతృత్వ భాగ్యము కలుగలేదు. లోపల నడగియున్న మాతృత్వ కాంక్ష యుబికి చెంచు లపై వాత్సల్యముగా ప్రసరించు చున్నది. అది యవ్యక్తముగా చెంచుల నావే శించి, వారి నామెయందు వినయ గౌరవములు ద్విగుణీకృత మొనర్చుచున్నది.

ఒకనాడు చెంచుగూడెము సందడిగా నున్నది. అది దండయాత్రకు జను సేనల స్కందావారము వలెనే కనిపించుచున్నది. చుట్టుపట్టుల గూడెముల నాయకులు పెద్దదొర భీమరాజును పలుమారు చూడవచ్చి మాటాడి పోవు చున్నారు.

రాత్రి జాముప్రొద్దు పోయినది. చెంచుల గుంపు భీమరాజు గూడెము నొద్ద చేరినది. దివిటీలు వెలిగించినారు. ఆ దివిటీలకు గుడ్డలు నూనెలు అక్కర లేదు ఆ యరణ్యములో దొరకు నొక జాతి కర్ర వెలిగించినచో, అందులో పచ్చి యున్నంతవరకు ఆరకుండ మండుచు వెలు గిచ్చును. ఆ దివిటీల వెలుగు చూడ నావనములో కార్చిచ్చుపుట్టినదా యనిపించుచు భయంకరముగా నుండెను. అంతలో దారుణనాదము మిన్ను ముట్టినది. చెంచులు నానాయుధములు ధరించి యుండిరి. రకరకముల కత్తులు కఠారులు, బల్లెములు, గొడ్డళ్ళు పట్టినారు. అందరి బుజములను ఎక్కుపెట్టిన ధనుస్సులును, వీపుల నంబుల పొదులును

వ్రేలాడుచున్నవి, వారలను వెంట బెట్టుకొని అగ్రేసరుడై భీమరాజు చెంచులక్ష్మి యొద్దకు వచ్చి సాష్టాంగ దండప్రణామ మాచరించి లేచి నిలుచుండెను.

'ఏమి నాయనా, ఈ యట్టహాసము ?'

'మమ్మ దీవింపవలె నమ్మా !'

'మీ ప్రయత్నములో ఈనాడు మీకు జయమగు గాత! నాయాశీర్వచనము మిమ్ముల వెన్నంటియే యుండును. అయితే, మీరెప్పుడు మంచి పనులే చేయ వలె !'

'తురకలతో రాయబారమునకు వెళ్ళుచున్నాము. సెలవా, తల్లీ ?'

మహాలక్ష్మి తెల్లవోయి మాటాడలేదు. ఆమె మౌన మంగీకారముగా గ్రహించి, పెద్దచెంచు దండము పెట్టెను. చెంచు లందరు భక్తిపరవశులై దండములు పెట్టి బయలుదేరిరి. వారి యుత్సాహము వర్ణనాతీతముగా నున్నది.

సంకేతస్థలము చేరుటకు కొంత ముందుగనే నాలుగు దివ్వెలుంచి మిగిలిన వన్నియు వా రార్పివేసిరి. ఆ నాలుగుదివ్వెల గ్రుడ్డివెలుగులో అరణ్యములో నిశ్శబ్దముగ పోయి పోయి వారందరు సంకేతికస్థలము చుట్టు సన్నద్ధ యుధులై దాగి యుండిరి. యవననాయకుని గలసికొనుటకై పెద్దదొర నలువురు చెంచు నాయకులతోడను ఇద్దరు దివిటీలవారి తోడను కలసి సంకేతస్థానము చేరి కొనెను. ఆ ప్రదేశమునకు వెనుకవైపున పర్వతశిల యొకటి నున్నగా పైకిలేచి పెట్టని గోడవలె నున్నది.

22

కాలిపై మల్లారెడ్డిచే గాయపడిన తురుష్క-వీరుడు యవనస్కంధావార ములో పటకుటీరమున చికిత్స నొందుచున్నాడు. అతని కైన గాయములలో కాలిపైనున్న గాయమే పెద్దది. ఎర్రయతో పోరినప్పు డాతని దేహమంతట గాయము లైనవి. రక్తమెంతో స్రవించినది. అయినను దృఢకాయు డగు నాతని యొంటిలో నింక చాల రక్త ముండుటచే గాయము లన్నియు శీఘ్రముగా నయ మగుచున్నవి. ఆతని మనస్సు సంధించినవాని దట్లు ఆవేదన పడు చుండెను.

ఆతని ముఖ్యముగా బాధించుచున్నది గాయములు కావు. అవమానము! మల్లారెడ్డి తన్ను భటులతో పారదోలినందుకు ఆతడు వగచుట లేదు. అడవి దారిలో జరిగిన క్షుద్రమైన పోరే యాతని హృదయమును కలచుచున్నది.

తా నంతమంది భటులతో వెళ్ళి, రెండు కర్రలు ధరించి వచ్చిన యిద్దరు యువకులచే నడ్డగింప బడుటయా? వారిద్దరి మొండి సాహసమే తమ ప్రయత్నమును తలక్రిందులు చేయుటా! అంతకంటె నవమాన మేముండును?

'నా యనుచరులు వట్టి పిరికిపందలు, దోపిడిగాండ్రు!'

యవన నాయకుని వాక్కులలో సత్య మున్నది, యవన వాహినులలో ప్రధాన బలము వారి నాయకులది. వారు మంచి యుపాయశాలురు, యుద్ధానుభవము కలవారు, ధైర్యసాహసము లున్నవారు. ఆయుధ కౌశలమును వారికున్నది. అయితే, వారి సామాన్యభటులు అలగా మూకలు. వారు క్రమశిక్షణ మెరుగరు, తమకు వచ్చు జీతమునకు కంటె, శత్రువులపై బడినప్పుడు లభించు దోపిడి ద్రవ్యమున కాశపడి సేనలో చేరినవారు. ఎదిరి గట్టిగా నిలువకున్నచో వారెంత సాహసమైన జూపుదురు. వారి కటికి తన మింతయని వర్ణింపలేము. కొంచెము ధైర్యముతో ఎదుటివారు ప్రతిఘటించినచో, ఆ భటుల ధైర్యము ఎక్కువ సే పాగదు, అప్పుడు వారిని కదనభూమిలో నిలుపుట నాయకుల శక్తికి మించినపని. ప్రతాపరుద్ర దేవుని సేన లోడిన దాది యవన భటులకు ధైర్య సాహసము లెక్కువైనను, అడవిదారిలో జరిగిన క్షుద్రయుద్ధము మధ్యాంధ్ర దేశములోని యవనసేనల స్థితిగతులను మచ్చుగా నున్నది. యవననాయకుని మనస్సు మాటిమాటి కా పోరి పైననే ప్రసరించుచున్నది.

పాపని కంత సాహసమా? బ్రాహ్మణులు గొర్రెల వంటివారే. ఆ ఎర్రని విప్రుని ముఖములో అంత రౌద్రరూపము వ్యక్తమైన దేమి? అతనికి తన కున్నంత రణకుశలత లేదు. ఆతని నెదురించుచుండ నేలనో తన మనస్సు పరధ్యానములో పడసాగినది. పోరుచుండ తనకు పరాకు వచ్చు టేమి? లేకున్న తనతో నా విప్రుడు అంతసేపు ప్రతిఘటించి పోరాడగలడా?

చిన్నకునుకు పట్టిన ట్లున్నది. కలలో కూడ ఆ పోరాటమే జరుగుచున్నట్లు తోచినది, కలవరించినాడు.

'పాపము, బ్రాహ్మణరక్తము నేలపై ఒలికించినాను!'

ఆ కలవరింతలో అతడు వులికిపడి లేచెను. తనదెంత బలహీనమైన మనస్సు! కలలోమాత్రము ఎందుకిట్టి పందయూహ రావలె! అతడు పుట్టిన కుటుంబములో తరతరములనుండి గాఢ మగు బ్రాహ్మణభక్తి యున్నది, ఇప్పు డాతనికి అందర పైకంటె బ్రాహ్మణులపై ద్వేష మెక్కువ.

బ్రాహ్మణు లెవ్వరు నతనికి ఏ చెరుపును ఎన్నడును ప్రత్యక్షముగా చేయలేదు. ఆనాడు తప్ప ముందెన్నడు ఏ బ్రాహ్మణుడు తన్నెదిరింపలేదు. అయిన నేమి? ఈ దేశములో నున్న యబద్ధపు విశ్వాసముల కన్నిటికి బ్రాహ్మ ణులే మూలకారకులు.

ఆతడు పెరుగుచున్న తన గడ్డము ఎడమ చేతితో నిమురుకొనెను. అది ఆరునెలల గడ్డము. అంతకుముందు బహుకాల మాతడు ముసల్మానుల ఖైదీ.

ఆ ఖైదీగా నుండిన కొంతకాలమునకు మౌల్వీ లాతనికి ఇతర ఖైదీల తో పాటు ఇస్లాము మతబోధ చేయసాగిరి. మొదట వారి మాట లాతడు పట్టిం చుకొనలేదు. నెమ్మదిగా మౌల్వీల యాత్మవిశ్వాస మతని నాకర్షింప సాగినది. వారికి తాము చెప్పనది సత్యమని యచంచలమగు నమ్మక మున్నది. ఆ నమ్మ కము వారాడు ప్రతి పలుకు లోను, చూచు ప్రతి చూపు లోను, చేయు ప్రతి చర్య లోను వ్యక్త మగును. అదిగాక మూఢ విశ్వాసములతో నాశన మగు చున్నవారి నెట్లయిన ఉద్ధరింపవలెనను ఆతురత వారి కున్నది. తెలివిమాలిన వారికి స్వయంపోషకత్వము వహించి రక్షింపజూచు కరుణామయుల పద్ధతి యది ఆత్మహత్య చేసికోనబోవు వారి నుద్ధరింప సమకట్టు దయామయుల పద్ధతి యది.

ఆ మౌల్వీలు ఎన్నో మారులు త న్నీ క్రింది మాటలు ఉచ్చరింపుమని బలవంత పెట్టిరి.

'లాయి లాహో ఇల్లల్లాహు మహమ్మదు రసూ లిల్లాహు!'

ఆ మాట లేమో అతని కర్థము కాలేదు. ఒక్కమారు ఈ మాటలను అని వారు తన్ను, బలవంత పెట్టుచుండిరి. ఆ మాట లుచ్చరించిన ఖైదీలు చెర నుండి త్వరలో విడివడుచుండిరి. అంతమాత్రమున కాతడు లొంగువాడు కాడు. ఆ మాటలలో ఏదో తురక మర్మ ముండును. లేకున్నచో ఆ మాటలపై వారి కంత యభిమాన మెందుకు? పలుమారు విన్నందున నతని మనస్సులో నా మాటలు నాటుకొన్నవి.

ఒక నా డుదయమున నిద్ర లేచినప్పటి నుండియు అప్రయత్నముగా ఆ మాట లాతని మనస్సులో నావృత్తముకాజొచ్చినవి. ఏదో పద్యపాద మొకొ్కక్కనాడు నాల్క్పై నాడుచుండునట్లే. ఆ మాటల యర్థ మేమో ? మౌల్వీ ఈ మాడు వచ్చినప్పుడు అడిగి తెలుసికొందును గాక ! ఇట్లనుకొనుచు ఆ మాటలు తన చెవికి వినబడునట్లు ఉచ్చరించుచు గుణించుకొన సాగెను. ఒకమాడు, రెండుమారులు, మూడు మార్లు - !

అంతలో మౌల్వీ సాలరు ఉల్వీ అక్కడకు రాగా నాతని నా మాటల యర్థ మేమని యడిగెను.

తా నా మాటలు ఉచ్చరించి నందులకే మౌల్వీ పరమానంద భరితు డయ్యెను. పసిపిల్లవాడు మొదటిసారి 'అత్త' అని పలికినపుడు పొంగిపోవు తల్లి వలెనే మౌల్వీ కనబడెను. ప్రేమాతిశయముతో నతడు తన్ను కౌగిలించు కొని, నొసటిపై ముద్దు పెట్టుకొన్నాడు. సగము నెరయుచున్న యాతని నిండు గడ్డము తన ముఖము నాదరముతో రాచుకొని గిలిగింత పెట్టినది. దబ్బపండు వంటి యాతని శరీరము ఆనందముతో మరింత తేజరిల్లుచుండ మౌల్వీ యాకా శమునంక భక్తి పరవశుడై చూచుచు ఆ మాటల యర్థ మిట్లని వివరించెను.

'అల్లా కంటె భగవంతుడు లేడు ! మహమ్మదు ఒక్కడే అల్లా పంపిన ప్రవక్త !'

ఆ మాటలు తన కాశ్చర్యము కలిగించినవి. క్రూరులైన తురకలను భగ వంతునిపై ఇంత గాఢ విశ్వాసమూ, భగవంతుని నమ్మువారిపై నింత ప్రేమయా ? వారి మత సిద్ధాంతము లింకను తెలిసికొనవలె నని కుతూహలము మదయించి మౌల్వీ నడిగి తెలిసికొన నారంభించెను.

తా నడిగిన దెల్ల మౌల్వీ ఆప్యాయముగా చెప్పుచుండెను. అందులో గుట్టుమట్టు లేదు. దాపరికము లేదు. ఇది క్రొత్తగా నున్నది. తా నెరిగిన బ్రాహ్మణ గురువుల పద్ధతి కిది విరుద్ధముగా నున్నది. ఇస్లాము మత మాతని నాకరింప సాగినది.

దానితోపాటు తన స్థితిగతులలో మార్పుగూడ వచ్చినది. అతని నిప్పుడు ఖైదీగా చూచుటలేదు. ఎక్కడికి పోయినను తన పై వాత్సల్యము చూపు వారే. మందలోనుండి తప్పిపోయి మరల దొరకిన గొర్రెను చూచినట్లే, ప్రతివారు

నాదరము చూపుచుండిరి. తుద కొకనాడు మౌల్వీసాలరు ఉల్వీ నాయఱు దర్శనము చేయించెను.

ఆ నాయబు పేరు మెలిక్‌నబీ, అతనికి పూర్తిగా పెరుగతున్న గడ్డము అతడు ఇస్లాముమతము పుచ్చుకొని ఎక్కువ కాలము కాలేదని సూచించుచున్నది. నాయబు తన్ను కూర్చుండ మని యాసనము చూపి గౌరవించెను, తా నది నమ్మలేక కూర్చుండుటకే సంశయించెను.

ఆ నాయబు పూర్వము ప్రతాపరుద్ర మహారాజుల ప్రసిద్ధ దండనాయకులలో నొకడు. కట్టూనాయకు డను పద్మనాయక వెలమవీరుడు. తానురెడ్డి. ఆ రెండు కులముల వారికి ప్రతాపరుద్రుల యాస్థానములో కక్షలు పెరిగియుండెను. మాది పవిత్రకుల మన, మాదియే పవిత్రతరకుల మని ఉభయులకు అహమహమిక. కాకతీయ ప్రభువులకు మే మెక్కువ సేవచేసితి మన, మేమే ఎక్కువ సేవచేసితి మనియు స్పర్ధలుండెను. కట్టునాయకుడు పూర్వము శ్రీవైష్ణవశిష్యుడై చక్రాంకనములు వేయించుకొనెను, తాను శివకేశవులకు అభేదము పాటించు స్మార్తుల శిష్యుడు ఆ నాయబు పూర్వమే బిరుదరాహుత్తగు దణ్ణాయకుడు. తాను సేనలో చిన్న పడవాలు. అట్టి నాయబు తన్నిపుడిట్లు కూర్చుండు మని యాదరించుట చూడ నాశ్చర్యమైనది. దీనికి కారణము మౌల్వీలు చెప్పిన ఆరబ్బీ భాషలోని మంత్రములు చెప్పుటయే, వారు చెప్పినట్లు రోజు కైదుమారులు నమాజు చేయుటయే. సందేహము లేదు. పేరు మార్పే గాని నమాజు లో మాత్ర మేమున్నది? ఎవరైనను భగవద్ధ్యానము చేయునపుడు దేహము శుద్ధిచేసికొని వినీతులమై యుండవలె గదా! బ్రాహ్మణులు ఆచమనము చేయునట్లు తురకలు ఉజూ చేయుదురు. ఆ ప్రార్థన అర్థ మెంత మంచిది! అందులో నిత్యము స్మరించు ఫాతిహా అను ప్రారంభాధ్యాయము ఎంత గొప్పది! 'బిస్మల్లా హిర్మహ్మా నిర్రహీమ్ !'

* 1. 'కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లాః నామ స్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

2. 'మా సమస్త స్తుతులును సర్వలోక పరిపోషకుడగు అల్లాఃకే!

3 'అతడు వరదుడు; దయామయుడు;

---

* మొహమ్మద్ ఖా సింఖాన్ (ఎం, ఏ) గారి అనువాదము.

4. అవసానదినమున (మేమొనర్చు పుణ్యపాపములను విచారించి తత్ఫలమును నిర్ణయించు) 'న్యాయాధిపతి.

5. '(ఈశ్వరా, నిన్నుతప్ప) మరెవ్వరిని మే మారాధింపము: నీ సహాయము నే మే మపేక్షింతుము. (మరెవ్వరి సహాయము మా కక్కరలేదు.)

6. 'ప్రభూ! (మోక్షము లభించు) తిన్నని మార్గమును మాకు చూపుము.

7. నీ అనుగ్రహమునకు పాత్రులైన వారి మార్గమునే మాకు చూపుము; నీ ఆగ్రహమునకు గురి యైనవారి త్రోవనుండి మమ్ము తప్పింపుము.'

ఇట్టి భాష నరమాత్రు లెంత గొప్పవారైనను పలుకగలరా? ఈ పవిత్ర గంభీరవాక్కులు దైవప్రేరితములే యని మౌల్వీలు చెప్పునది సత్యమే. ఇది మొదలైనదానితో భగవంతుని నిత్యము అయిదుసారులు ప్రార్థించుటతో తప్పేమి? తాను నమాజుచేయుచు కారాగృహమునుండి విముక్తికై ప్రార్థించెను; తెలుగుమాటలతోడనే ప్రార్థించెను. ఆ మాటలు భగవంతుడు ఆలకించెను. విన్నందుననే తన కీనాడు బంధవిముక్తియే కాక గౌరవముకూడ లభించినది. ఇస్లాములో తెలుగుమాటకు సహితము మంత్రమునకు వలె ఎంత పటుత్వ మబ్బినది!

తన పురోహితుడు మాత్రము కోరికలు తీర్చ దేవతలకు పూజలు చేయించలేదా? కాని పురోహితుని సాయము లేనిది తా నా పూజ స్వయముగా చేయలేడు. గీర్వాణభాష లో ప్రార్థించిననే గాని ఆ దేవుడాలకింపడు. ఈ అల్లా ఏ భాషలో వేడినను, ఎట్టి తెలివిమాలిన భాష వాడినను, అర్థము చేసికొని కరుణించును. ఎంతటి సర్వశక్తి, ఎంతటి దయామయుడు! 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్ రహీమ్' ఇట్లని కదా సర్వకార్యములు నుపక్రమించునది!

-ఈ విధముగా ఎన్నియో ఆలోచన లాతని మనస్సులో రేగి భక్తిచే ఆనంద బాష్పము లేకధారగా కారుచుండెను.

అయితే నాయబుకు ఆ కన్నీరు వేరుగా తోచినది. ముసల్మానులమధ్య అస్వతంత్రుడుగా నున్నందుకు తాను దుఃఖించుచున్నా నని నాయబు తలంచెను. ఆతని కన్నులలో కోపరేఖ స్ఫురించినది. మౌల్వీలు లంచము తీసికొని ఈతని తప్పించుటకు అబద్ధ మాడిరని యాతడు సందేహించెను. అట్టిది

ఎన్ని మారు లో పూర్వము జరిగినది మౌల్వీల మాటలు విని బంధితుల విడిపించి గౌరవపదీముల నిలుపగా, నట్టివారు కొలది దినములకే సుల్తాను కొలువు చాలించుకొని పాఱిపోయిరి. ఈ పడవలు కూడ నట్టివాడే. ఇతని సోదరులు బంధువులు ఆచుట్టు పట్టుల దేశములో సుల్తాను సేనలకు అలజడి కలిగించు చుండిరి. వారి నడచుట కీతని సాధనముగా చేయ నెంచియే విడిపించి గౌరవించినది. ఈతని వాలకము చూడ నీయుపాయమున తప్పించుకొని పోయి సోదరులను జేర జూచుచున్నట్లున్నాడు. ఇట్లనుమానించి యాతడు ప్రక్కగదిలో వేచియుండిన మౌల్వీ సాలరు ఉల్వీని పిలిపించెను.

సామాన్యముగ భయ మెరుగని యా మౌల్వీ నాయబు ముఖము చూచి వడకి పోయెను. నాయబు దృష్టి నవలంబించి అతడా రెడ్డివంక చూచెను. రెడ్డి యింకను ఆనందభాష్పములు కార్చుచు నోట మాట రాకుండెను. మౌల్వీకి వెంటనే సర్వము నవగత మైనది. ఆతనికి ధైర్యము వచ్చినది. చిరునవ్వుతో ముఖమంతయు విరియుచుండ నాత డిట్లనెను.

'ఈతని దేహము స్థూలకర్కశమైనను, మనస్సు వెన్నవలె మొత్తనిది, నాయబుజీ! బంధమోక్షణహేతువైన అల్లా సర్వశక్తి తలంచుకొని ఆనందభాష్పములు కార్చుచున్నాడు. ఈతని కన్నీళ్లే మన యందర కంటె సులభముగా నల్లా సమీపమునకు చేర్చగలవు!'

నాయబు కామాటలు కనువిప్పుగా నుండెను. వెంటనే యాతడు తన్ను నూరుమంది పదాతుల కధిపతి నొనర్చి ఆహూకరించి పంపివేసెను.

యవనస్కంధావారములో నత డట్లుండగా నొక నాడాకస్మికముగా నింటిపై బుద్ధి మళ్ళినది. తన యన్న వేమన్న మహావీరుడైమధ్యాంధ్రదేశమును యవననిర్ముక్తము చేయ బద్ధకంకణు డైనట్లాతడు వినెను. తన సోదరులందరు నట్టి ప్రయత్నమునసే యున్నట్లు తెలిసినది. అది విని యాతడు నిర్భ్రాంతపోయెను.

అంతలో తల్లి యన్నమ్మ జ్ఞప్తికి వచ్చినది. ఆ వీరమాతను చూడవలె ననుకాంక్ష జనించినది. కాని ఎట్లు? ఈ యవన గౌరవ మిప్పుడు నూతన బంధనమైనది. తన కుటుంబమునకు, నిజ ధర్మమునకు, తన మాతృదేవతకే, తా నప్పుడు ప్రతిపక్షము లో నున్నట్లు తెలిసి వచ్చినది,

ఆతని మనస్సులో గొప్ప తుపాను రేగ సాగినది. రాత్రుల నిద్దుర పట్టదు. పగ లంతయు తన భటులతో పాటు పోయి ఉద్యోగ విధులు నిర్వహించును. ఎక్కువ పోరులు తగులుట లేదు. రాత్రులం దేకాంతముగా నుండ నన్నదమ్ములు స్మృతిపథమున బారుచుందురు. సర్వకాల సర్వావస్థలయందును, తల్లి యన్నమ్మ పవిత్రమూర్తి మనోవీధిలో కోప విషాద రేఖలతో ఎదుట నిలిచి నట్లుండును. 'అమ్మా, అమ్మా!' అని పలుమా రాతడు పలువరించును. చిన్నతనములో తాను తప్పుచేసిన తరి మందలించిన తల్లి స్వరూపమే సాక్షాత్కరించును.

23

ఒకనాడు తానున్న ముసల్మానుల స్కంధావారములోనికి గొప్పవృషభ మొకటి దారి తప్పి వచ్చినది. అచ్చువేసి విడిచిన పెద్ద యాబోతు; నిరాటంకముగా అందరి క్షేత్రములలో మేయుట కలవాటుపడుటచే, అభ్యాస వశమున ఆ మహోక్షము నిర్భయముగా యవన స్కంధావారము లో గూడ జారబడి పెద్ద యలజడి కావించెను. అతి ప్రయత్నమున యవనభటులు దానిని చుట్టు ముట్టి బాణప్రయోగము చేసి చంపివేసిరి. తుదకు బాణము వదలిన ముసల్మాను వీరుడు బిగ్గరగా, 'బిస్మిల్లాహీ అల్లా హు అక్బర్!'అనుచు పెద్దబొబ్బ పెట్టెను. దానితో నది ప్రాణములు వదలుటచే 'జుభా' చేయబడినది.

ఆ రాత్రి యావృషభ మాంస మా స్కంధావారమున వండి పోపులుపెట్టి ఘుమఘుమ లాడునట్లు చేసిరి. అది యాతనికి వడ్డింపగా చూచినంతనే చెప్పరాని యసహ్యము వేసినది. అయినను సంఘశక్తికి కట్టువడి అతికష్టము మీద నెట్లో యది నోటిలోపెట్టుకొనెను. ఆయిన నేమి? అది గొంతు దిగలేదు. మరుక్షణమున నాతనికి వాంతి యైనది దేహమంతయు ముచ్చమటలతో దోగిపోయినది. అంగలి యంతట నేదో మహాపాపము వదలక యంటుకొన్నట్లు తోచినది. నీరు పుక్కిలించి ఎన్నియో మారు లుమియుచు నోరు పరిశుభ్ర మొనర్చుకొనయత్నించెను. ఆది యెంతకు పోలేదు. మాటిమాటి కడే తలపునకు వచ్చుచు నాతనికి బొడ్డువద్దనుండి తెమల్చుకొని రా మొదలుపెట్టినది. కన్నులు తిరుగజొచ్చినవి. కన్నులు మూసికొన్నంతనే చివరి వ్రేటుకు అంభారవముతో పడిపోయిన ఆ వృషభరాజు దీనాకారము ఆతని కన్నుల యెదుట సాక్షాత్కరించును.

ఆతడు రెడ్డి బిడ్డ. పేరు దొడ్డారెడ్డి. ప్రోలయకుమారుడు. ఆబోతులను ప్రత్యక్షదైవములుగా పూజించుటకు చిన్ననాటినుండి యలవాటు పడినాడు. తర తరములనుండి యట్టి భావము జీర్ణించినవారి కులములో నాతడు పుట్టెను. తలచు కొన్నకొలది వికార మెక్కువ కాజొచ్చినది. కన్నులు చూడలేకున్నవి. శరీరము కంపించుచున్నది. ఏదో జబ్బుచేసిన దని అనుచరు లాతని శయ్యపై జేర్చిరి.

ఆ రాత్రి యాతడు యమయాతన ననుభవించెను. ఇన్నాళ్ళ కాతడు మొదటి మారు నమాజు చేయలేక పోయెను. మరునాడును ఐదుమారులలో ఒక్కమారైన నమాజు చేయలేకపోయెను. అల్లా సర్వశక్తి నాతడు స్మరణకు తెచ్చుకొన యత్నించెను. ఎంత యత్నించినను అది మనస్సున లగ్న మగుట లేదు. అల్లా సర్వదయాళుతను స్మరింప జొచ్చెను. అదియు నిలుచుట లేదు. ఏమి చేయుట! తన ప్రార్థనములు విని బంధవిముక్తి గావించి గౌరవ పదవి అనుగ్రహించిన అల్లా యిప్పుడు పలుకడేమి? ఇస్లాము మతముపై సంశయ మాగంభమైనది.

రాత్రి యగునప్పటి కాతనికి పిచ్చి యెత్తినట్లైనది. కన్ను మూయ యత్నింపగనే తన కన్నతల్లి అన్నమ్మ యాకారము దీనముగా కనిపించినది. ఆమె మూర్తి బాణహతమైన యా వృషభ రాజు మూర్తి లో లీనమగుచున్నట్లు తోచినది. త్రుళ్ళిపడి లేచినాడు. ఆపై నిక నాతడు కన్నులు మూయుటకు భయపడి మేలుకొని యుండ ప్రయత్నించెను. కాని యది సాధ్య మగుటలేదు. మత్తుఱె ముంచుకుని వచ్చి మరల మరల నట్టి స్వప్నదృశ్యమే కన్నుల కట్ట సాగినది. ఇక నాత డట నిలువలేక పోయెను. ఆకస్మికముగా నా యర్ధరాత్ర మున లేచి యాతడు యవనస్కంధా వారము వడలి తన్నెవరో బలాత్కారముగా ముందుకు లాగుచున్నట్లు తూలిపడుచు అడవి దారిన పరువెత్తెను.

మూడు రాత్రులు మూడు పవళ్లు విరామము లేకుండ నాత డట్లు పోయి పోయి పెద్దన్న యగు మాచారెడ్డిని కలసికొనెను. అన్నను చూచినంతనే అత డాకస్మికముగా అన్నా యని కేకవేసి బడలికతో తూలి పడిపోయెను. మాచారెడ్డి వాత్సల్యముతో నాతని లేవదీయ బోవుచుండెను. అప్పుడు దొడ్డారెడ్డికి తాను మహాపాతకము చేసితి నను నిశ్చయభావ ముదయించెను. 'అయ్యో, శత్రువుల చెరనుండి తప్పించుకొనుటకు ధర్మభ్రష్టుడ నై అపవిత్రుడ నైతినే!-ఇట్లను

కొనుచు తన్ను లేవదీసి ప్రేమమీర కౌగిలించుకొన బోవుచున్న యన్నతో నిట్లనెను.

'అన్నా, నే నపవిత్రుడను. అయ్యో, నన్ను తాకవద్దు!'

మాచారెడ్డి ఇన్నాళ్ళకు కనిపించిన తమ్మునిపై గల ప్రేమాతిశయముతో నామాటలు వినిపించుకొనక గాఢముగా కౌగిలించుకొని కన్నీరు వదలుచుండెను.

'అయ్యో! అన్నా, నీవు పరమపవిత్రుడవు. నన్ను తాకి మైలపడవద్దు!' అని బిగ్గరగా నాపేశము తో ననుచు, అన్నగారి కౌగిటినుండి బలవంతముగా తప్పుకొని దూరముగా నిలుచుండెను.

మాచారెడ్డి కొంత యాశ్చర్యముతో నాగి 'దొడ్డా, నీవు తురకల బంది ఖానాలో ఉన్నంతనే అపవిత్రుడవైతివా? బలాత్కారమున విధి లేక తిన్న కూటికి దోషము లేదు. దోషమేమాత్ర మైన నున్నచో పెద్దలు నిర్వృత్తి చూపుదురులే తమ్ముడా!' ఇట్లనుచు నాతడు తమ్ముని మరల సమీపింప బోయెను.

దొడ్డారెడ్డి మరల తొలగుచు నిట్లనెను: నేను చేసిన పాప మింకా యున్నది.

'బ్రాహ్మణ హత్య చేసితివా?'

'అంతవరకు రాలేదు.'

'దేవద్రవ్యము హరించితివా?'

'లేదు లే!'

'గో మాంసము తింటివా?'

'తినలేదు కాని,—నోటిలో పెట్టు కొంటిని—'

ఈ మారు మాచారెడ్డియే ఒక యడుగు వెనుకకు వేయుచు. ఇంతలో సందేహము కలిగి ప్రశ్నించెను.

'బలవంతముగానా?'

'కాదు.'

'అయ్యో భ్రష్టుడా, గోమాంసమే!' - ఇట్లనుచు మాచారెడ్డి మరి రెండడుగులు వెనుకకు వేసెను. దొడ్డారెడ్డి ఏకధారగా కన్నీరు కార్చుచు నిట్లనెను:

'అంతే కాదు. అంతకంటె నపవిత్ర మైతిని!'

'ఏమిరా, తురకలలో కలసితివా యే మిరా!'

'ఔను'

'ఓరి పనికిమాలిన చండాలుడా! సిగ్గు లేక ఇక్కడికేల వచ్చితివిరా. వారితోనే చావక! ఛీ!'

దొడ్డారెడ్డికి నోట మాట రాలేదు. ఇంతవరకు తానే యపవిత్రుడ నని చాటుకొనెను. ఇప్పుడు తన యన్న ఇట్లు కరుణమాలి నిందించుటతో నతని మనస్సులో చిత్రమగు కోపరేఖ యంకురించినది. కాని యాతనికి మాత్ర దర్శనము చేయవలె నని యున్నది. ఆ పవిత్ర మూర్తిని దరిసి, ఆమె పాదములు తన కన్నీటితో కడిగినచో పాపపంక మంతయు క్షాళిత మగునని యాతని కాశ యున్నది. అందుచే కోపాంకురము త్రుంచివేసి గద్గద కంఠముతో దొడ్డారెడ్డి ప్రార్థించెను,

'నాకేదో గతి కల్పింపరాదా?'

ఆమాటలకు మాచారెడ్డి హృదయము ద్రవించెను.

'అయ్యో మన వంశమునకే అప్రతిష్ఠ తెచ్చితివి కదరా! ఏమిటి దారి? అయినా, అమ్మ నడిగి వత్తును.'

'అమ్మను చూచుటకే వచ్చితిని. ఆమె దర్శనము చేసి, ఆమె పాదములు శిరస్సుతో తాకినచో నా పాపము కొంత శాంతించు నని నా యాశ!'

మాచారెడ్డి వెళ్ళి తల్లికి చెప్పియుండును. ఆమెయే కాఠిన్యము వహించెనో? అంత సాధుస్వభావము కలది యైనచో ఆమెకు కోపము వచ్చుట తానెరుగును. ఆ కోపము నిశ్చలముగా నుండు మహోగ్ని వలెనే ఉండును. కాక బంధువు లామెను తనయొద్దకు రానీయలేదో, దొడ్డారెడ్డికి తెలియదు. ఆతని కామె దర్శనము కాలేదు. తన కన్నతల్లి ఇంతకాలమునకు తిరిగి వచ్చిన తన్ను జూడ నిరాకరించి యుండునని యాతడు విశ్వసింప లే కున్నాడు. మాచారెడ్డి కులపెద్దలను కూర్చెనట. తర్జన భర్జన లైనవట. పెద్దలైన విద్వాంసులను గూడ నడిగి యుందురు. రామా ప్రైగ్గడను గూడ పిలిపించిరి. పది రోజుల వరకు నేమియు తేలలేదు.

ఈ పదిరోజులును అతనికి దూరముగా ఒక పశువుల చావడిలో పరుండుటకు చాప యిచ్చి అక్కడనే అన్నపానాదు లేర్పాటు చేసిరి. అన్నము వడ్డించువారు ఆకులో దూరమున నుండి పెట్టుదురు. ఆతడు దాహము త్రాగిన పాత్ర కూడ వారు ముట్టరు. ఆతని కాహారము తినవలె ననియే లేదు. రుచ్యమైన వస్తువులే యైనను ఆతని కవి రుచించుట లేదు.

ఇన్నాళ్ళును చుట్టుప్రక్కల గ్రామములు జనములు గుంపులుగా కూడి, పట్టువడిన యడవి మృగమును చూచుటకు వచ్చినట్లే దూరమున నిల్చి యతనిని చూచి పోవుచుండిరి. ఎరిగిన వారు కూడ ఒక్కరు నాతని బలుక రింపరు, ఒక్కరును దయార్ద్ర దృష్టి ప్రసరింప జేయరు. చూడ వచ్చినవారి చూపులలో అతని పై చెప్పరాని యసహ్యమే వ్యక్త మగును. వా రనుకొను మాటలు మధ్యమధ్య విన వచ్చును.

'అబ్బా, వీడు గో మాంసము తినెనటరా !'

'పచ్చి తురక అయినాడు !'

'వీనిని నిలువున కోసినా పాపము లేదు.'

'దేవాయతనములు అపవిత్రము చేసినా డట !'

'దేవతాప్రతిమలు పగలగొట్టి ముక్క, చెవులు, స్తనములు చెక్కివేసినాడట!'

ఏట్టా కూర్చున్నాడో చూచారా, సిగ్గులేక!'

'నూరుమంది బ్రాహ్మణులను చంపినాడట, ఒక్కరోజులో ఈపాపిష్ఠి!'

ఈ విధముగా నాతని గూర్చిన కట్టు కథ లెన్నియో జనసమూహమున ప్రాకిపోయినవి వానికి చిలువలు పలవలు చేర్చి ఒకొక్కరు రొకొక్కరు విధముగా వర్ణింప సాగిరి. తురుష్కులు చేసినట్లు తాము విన్నవి ఊహించినవి. అన్ని ఘాతుక కృత్యములును వినీతుడై శరణాగతు డైన యాతని కంటగట్టు చుండిరి.

'ఛీ!' యని యొకడు సంబోధించి నేలపై నుమిసెను.

'పాడుముఖము!' అనుచు నొకడు దుమ్మెత్తి పోసెను.

'నీ చేతులు పడ! ఇంత దుర్మార్గ మెట్లా చేసినావురా!' అనుచు పెద్దవ్వ యొకతె చేతు లెత్తి యతనిపై మెటికలు విరిచిపోయినది.

'నీ నోరు పడ!'

'నీ తలపండు పగల!'

మధ్య మధ్య పిల్లలే కాక పెద్దలుకూడా నాతని పైరాళ్లు వేయసాగిరి.

అట్లాతడు పదిరోజు లక్కడ దుర్భరయాతన లనుభవించెను. అతడు మాటాడడు; తల వంచుకొని ఏకధారగా కన్నీరు కార్చును. కూడిన జనసంఘ మునకు వాని కన్నీరు చూచుట కూడ భరింపరాకున్నది.

'దొంగ యేడుపు కూడ నటరా, భడవా?'

'ముక్కలు ముక్కలుగా కోసి వీని మాంసము కాకులకు గద్దలకు వేయండిరా!' - ఇట్లు ఉత్సాహశాలి యొకడు పలుకగానే దొడ్డారెడ్డిపై భయం కరముగా రాళ్ళ వాన కురియును

పది రోజు లట్లా యమయాతన ఆత డోర్చుకొనెను. ఇన్నాళ్లును తల్లి దర్శన మీయలేదు, మాచారెడ్డి యైన మరల కనబడలేదు. సరిగదా, వార్త కూడ పంపలేదు. దొడ్డారెడ్డి విసివిపోయెను. తాను పడుచున్న యవమాన మింక భరింపజాలడయ్యెను. రోషముగల రెడ్డి బిడ్డ. తన వారు తమలో కలుపుకొందు రను నాశ యస్తమించినది. ఒకవేళ తన సోదరుల బలవంతమున కలుపు కొన్నను తనకు వెనుకటి వలె నలువురలో తల యెత్తుకొని తిరుగు నవకాశ ముండదు. ఇంత నీచపు బ్రతుకు ఇక్కడ బ్రదుకనేల?

అర్ధరాత్ర మైనది. ఆవల తన విషయమే తర్జన భర్జనలు జరుగుచున్న వని అత డెరుగడు. బంధువు లందరు నొప్పుకొనిరి. తల్లి అన్నమ్మయే ఒప్పు కొనకున్నది. ఆమె సోదరు లగు పోతయ, చిట్టయ, నారయ చెప్పి చూచిరి. లాభము లేకపోయినది. తమ తల్లి ఒప్పుకున్న తమకును సమ్మతమే యని మాచారెడ్డి, వేమారెడ్డి చెప్పిరి. వేమారెడ్డి మంత్రులు రామాప్రెగ్గడ, మల్లినా థుడు అన్నమ్మకు ఎన్నోవిధముల చెప్పి చూచిరి, లాభము లేకపోయినది. వృద్ధుడైన దొడ్డయ యామె తండ్రి. తన తండ్రి పేరే ఈ పనికిమాలిన వానికి పెట్టించు కొనగా, పుణ్యాత్ముడైన తన తండ్రిపేరు వీడు పాడుచేసినా డని ఆమె పట్టుదల. ఆ రాత్రియే దూరగ్రామము నుండి అన్నమ్మ తండ్రి దొడ్డయ్యను పిలి పించి ఆతనిచే అన్నమ్మకు చెప్పించిరి, ఆతడు వార్ధక్యమున నీరు (పట్టి) బాధ పడుచుండెను. అన్నమ్మ నాతడు పసిపిల్లను వలె ఒడిలో చేర్చుకొని గడ్డము

పట్టుకొని, వీపు దువ్వుచు, శిరస్సు మూర్కొనుచు, వడకుచున్న కంఠముతో నాయాస పడుచు ఆమెకు చెప్పెను. తుద కామె మెత్తపడినది. ఆవల మరు నాడు తెల్లవారిన తర్వాత తన కుమారుని దొడ్డను చూచి. వాని నెట్లు పలుక రించుటా యని ఆమె నిద్దుర పట్టక ఆరాట పడుచున్నది. ఈ సంగతి దొడ్డారెడ్డి ఏమి ఎరుగును ?

సరిగా నా సమయమునసే పశువుల సావడిలో దొడ్డారెడ్డికి ఆరాట మెక్కు వైనది. విధివిహిత మెవ్వరు తప్పింప లేరని ఇట్టి సంఘటనల వల్లనే అనిపిం చును. దొడ్డారెడ్డికి ఆవేశము వచ్చినది.

'నేను చేసిన తప్పేమి ? వీ రెవరైన నా వలె ఆ తురుష్కుల చెరసా లలో కాలుసేతులకు సంకెళ్ళతో అంతకాలము దుర్భర యాతన పడినారా ? - వీ రందరును పవిత్రులును, నే నొక్కడను అపవిత్రు డనా ? వీరు పెద్ద ధర్మ పరులును, నేను పాపిష్ఠినా ? ఇస్లాం మతము పాపము చేయు మనునా ? ఛీ ! భగవంతుడు నన్ను మస్లిముల మతము ననే ఏ కారణముననో పడవేసెను. ఆ సర్వశక్తి యూహలు అచింత్యములు. ఆ పరమ దయామయుడు అల్లా ! - 'బిస్మిల్లా హిర్ రహమా నిర్ర హీమ్ !'- ఇట్లనుచు ఆ యర్ధరాత్రివేళ నత డెవ రికి చెప్పకుండ ఆ నరక కూపమువంటి చావడినుండి కదలి మరల యవన స్కంధావారము చేరికొనెను.

ఆత డక్కడ నడుగిడగానే అక్కడివా రందరు నాతని నధికారముతో స్వీకరించిరి. ఆతడు పారిపోయెనని ముందు భావించినను, శత్రువులు ఒంటరి పాటున నుండ పట్టుకొనిపోయి రను సందేహము కూడ వారిని బాధించు చుండెను ఇప్పుడాతడు వెన్నుంటి తరుముచున్న శత్రువులబారినుండి తప్పించు కొని వచ్చువానివలె పరుగెత్తుకుని వచ్చుచుండుట, వారి రెండవ యూహను ధ్రువపరచినది. తన్ను శత్రువులు బలవంతముగా పట్టుకొని బంధింపగా తప్పించుకొని వచ్చితి నని బొంకు కథ కల్పించి చెప్పుట ఆతని కొక కష్టము కాకపోయినది. నమ్ముటకు సిద్ధముగా నున్నవారిని నమ్మించు టది యెంతపని? తనపై రువ్విన రాళ్ళచే కలిగిన గాయము లిందులో నాతనికెంతో ఉపకరిం చెను. దీనితో నాతని ధైర్యసాహసములనుగూర్చిన కట్టుకథలెన్నియో అతి శయోక్తులతో యవనవీరులలో ప్రచారమైనవి. ఆతనిపై గౌరవాదరములును అతిశయించినవి.

ఇట్లు తిరిగి వచ్చిన తర్వాత దొడ్డారెడ్డిలో విపరీతమైన మార్పు వచ్చినది. మునుపు ఇస్లాముపై అభిమానమే గాని భారత ధర్మముపై ద్వేషము లేదు. ఇప్పుడు భారతీయ ధర్మ మన్ననే అతనికి వర్ణింపరానంత ద్వేషము. ఈ భారత ధర్మమునకు మూలకారణులు బ్రాహ్మణులు. తన యన్నలచేతను బంధువులచేతను, తుదకు తనతల్లిచేత కూడ, తన్ను వదలి వేయించిన వారు తప్పక బ్రాహ్మణులే యైయుందు రని యత డూహించెను. తనతో మాట్లాడకున్నను తాను దూరమునుండి రామాప్రైగ్గడను, మల్లినాథుని ఆ రోజులలో చూచి యుండెను. వారు తనపై చిరునవ్వైన ప్రసరింపజేయక ముఖము వింతపొడుగు చేసికొని తన్ను చూడని వారి వలెనే నటించిరి. కొంగజపములు చేయు వారిద్దరే తప్పక అన్నమ్మ తల్లికి తనపై విరోధి దుర్బోధలు చేసి యుందురు.

'బ్రాహ్మణు లెక్కడ కనబడిన అక్కడ నరికిపార వేయవలెను, ఇకపై ముసల్మానులే నావారు, ఆప్తులు!'

అంతవరకు నతడు తన పూర్వపు పేరు మార్చుకొనలేదు. దొడ్డా సాహబ్ అనియే యందరు పిలుచు చుండిరి ఇప్పు డాతడు బడేసాహబ్ అయినాడు.

పేరులో నేమున్న దందురు. కాని పేరులో నెంతోయున్నది. అందులో గూడ మార్చుకొన్న పేరులో పటుత్వమెక్కువ. బడేసాహబు కిప్పుడు పేరు మార్పుతోపాటు కర్కశత్వములో పెద్దరికము వచ్చినది. తొడిభారతీయులు ఆతని కాత్మీయులు నాతనికి రాక్షసత్వ మారోపించినారు. అదే ఆతనిలో స్థిరపడినది.

యవనస్కంధావారమునకు తిరిగి వచ్చిననాటి రాత్రియే అతడు గోమాంసము ప్రీతితో నారగించెను. మరునాడే యాతడు కురానులోని బఖరా, గోవు అను రెండవ యధ్యాయము పారాయణము మౌల్వీల సాయముతో నారంభించెను. అందులో ఎనిమిదవ ఖండము తుది భాగములో గోయజ్ఞమును గురించిన ఆభ్యాసమున్నది. భారతీయులవలెనే ఇస్రాయీలీయులును గోవును చిరకాలమునుండి పూజించుచుండి రట. గోవునట్లు సైవముగా నారాధించుట పాపమని వారికి మూసాప్రవక్త యెంత బోధించినను, వారికి విశ్వాసము కుదురలేదట. అందు చే చిరకాలాగత మైన గోభక్తి వారి హృదయములనుండి పెల్లగించుటకై వారిచే తనే మూసాప్రవక్త గోయజ్ఞము చేయింపగా, దానితో ఇస్రాయీలీయులకు గోవుపై పూర్వముండిన మూఢభక్తి కదలిపోయినదట. ఇది మౌల్వీలు ఉపదేశించు మాట!

* "ఒక ఆవును యజ్ఞ మొనర్పవలె నని మిమ్మును భగవంతుడాజ్ఞాపించు చున్నాడు. అని మూసా తన ప్రజలతో చెప్పెను.

* * * *

"మూసా ఇట్లనియె: 'అతి వృద్ధ కాని మిక్కిలి లేతదికాని కాకూడదు. మధ్యవయసులో నుండవలెను. మీ యజ్ఞము ననుసరించి చేయుడు'

* * * *

"మూసా ఇట్లనియె : 'అది పసుపుపచ్చ వర్ణము కలదిగా నుండవలెను. చూపరులకు నయనా నందకరముగా నుండు దట్టమైన పచ్చని రంగు కలది.'

* * * *

"మూసా ఇట్లనియె: 'నేల దున్నుటకుగాని, నీరు తోడుటకు గాని, మోట లాగుటకు గాని,మచ్చిక పరుపబిడ నిదియు, ఆరోగ్యవంతమును, నిర్మలమును, స్వచ్ఛమును అగు గోవు కావలెను.'

అది విని ప్రజ లిట్లనిరి: 'ఇప్పుడు మాకు సత్యము నుపదేశించితివి.'

"(వారు భగవంతుని యాజ్ఞను శిరసా వహించిరి.) మనఃపూర్తిగా కాక పోయినను గోయజ్ఞ మొనర్చిరి."

—ఈ విధముగా నతడు 'బఖరా' అధ్యాయమును పారాయణము చేసి చేసి గోయజ్ఞ మాచరచుకొనెను. దానితో నాతడు భగవంతుని యాజ్ఞను శిరసా వహించితి ననుకొని తృప్తి వహించెను, గోమాంసము నమలు చున్నప్పు డాతనికి తన్ను పరాభవించిన ధర్మమును కసకస నమలుచున్నా ననుసంతుష్టి కలుగును.

మునుపు దేవతామూర్తులను జూచిన చూరము తొలగు చుండువాడు. ఇప్పు డవి తన్ను జూచి వెక్కిరించుచు న్నట్లుగా నతనికిదోచును అట్లే బ్రాహ్మణుల జూచినను ఇప్పు డాతనికి అరకాలి మంట నెత్తి కెక్కును.

---

* మొహమ్మద్ ఖాసింఖాన్ (ఎం. ఎ) గారి అనువాదము చుక్కలు పెట్టిన చోటుల ప్రజల ప్రశ్నలు వదలిపెట్టబడినవి.

ఆ రాత్రి జరిగిన పోరిలో తా నొక బాపనికి ఓడిపోయెనే ! ఆ బాప డెక్కువ బలశాలి కాడు: ఎక్కువ ఖడ్గ సాధన చేసినట్లును తోపదు. అయినను తా నోడిపోయెను. ఇద్దరు తుచ్ఛులు తన యనుచరుల ఓటమికి కారణ భూతు లైరే !

తుట్ట తుదకు తా మోడిపోయినది తన తమ్ముని చేతిలో, తాను పెద్దగా గాయపడినదియు తన చిన్నితమ్ముడు మల్లని ముద్దుచేతి లోనే. అందు కాతనికి చింతలేదు. విచిత్రమైన మురిపమే కలుగుచు దేహమంతట చక్కిలిగింత వలె ప్రాకుచున్నది.

అది తలచుకొన్న కొలది అతనికి కన్నీళ్ళు వచ్చు చున్నవి. తాను పరా భవము నొందినందుకు రోషమా ? కాక తమ్ముని వీరావతారము చూచిన యానందమా ?

'ఏమి యా మల్లని ధీమా! మమ్ము నలువుర నొక్కడే తగడు తాపు తాచెనే! అతని పేరు విన్నంతనే యా యనుచరులు పలాయన మైరి. వాని యనుచరులు వన మెంత క్రమభంగిలో చుట్టుముట్టిరి !'

ఒకమారు మాచారెడ్డి యింట తనకు జరిగిన పరాభవము జ్ఞప్తికి రాగా, రోషమూర్తి యగును. మల్లారెడ్డి భీమాకారము స్మృతితో బారగా గగుర్పాటు కలుగును; దైన్య మావహించును; దేహము నిస్సార మగును.

24

బడేసాహబును ముందు విడిపించి ఉద్యోగ మిచ్చిన నాయబు మలిక్‌నబీ దేశీయుల పై విపరీతమైన కాఠిన్యము చూపుచుండుట బడేసా హె బుకు పూర్వ మాశ్చర్యము కలిగించెడిది. ఆతని యాప్తులుగూడ తన్ను వలెనే తిరస్కరించియుందురని యిప్పుడర్థ మైనది. బుద్ధిశాలియగు ఆ నాయబు బడే సాహబులో వచ్చిన మార్పు సూక్ష్మదృష్టిచే గమనించి సంతోషించెను. ఆ పై నందుచే నాతడు బడేసాహ బుకు సుల్తానుకొలువులో పెద్దపెద్ద యుద్యో గము లీయసాగెను. సుల్తాను పక్షమున నల్లమల చెంచులతో రాయబారము జరుపు భారము నిప్పుడు సమర్థు డని తనకు విశ్వాసము కుదిరిన బడేసాహబు పై

నాతడు పెట్టెను. ఎన్నైన నల్లమల చెంచులను సుల్తానువారికి అనుచరుల గావింపుమని ఆతడు బడే సాహబుకు ఆదేశించెను. దండనీతి రీత్యా అది సాధించుట సుల్తానుకు అతి ముఖ్య మైనది.

కొంత కాలమునుండి ఆంధ్రభూమిలో అంతటను చెలరేగుచున్న తిరుగు బాట్లు మలిక్‌నబీ గమనించెను. ప్రధానముగా నవి కృష్ణవేణికి దక్షిణమున తీర భూమిలో చెలరేగుచున్నవి. ఆవల పశ్చిమమున తుంగభద్రా తీరమున గూడ నలజడిగానే యున్నది. గోదావరి తీరభూములను అట్టి కదలికలే కాన నగు చున్నవి. కాకతీయ రాజధాని యగు నేకశిలానగరమున మాత్రమే యవన ప్రభుత్వము స్థిరముగా పాదుకున్నది. ఆ పట్టణమునకు పాతపేరు పోయి సుల్తానుపూరు అని క్రొత్తపేరు వచ్చినది. ఆ పట్టణమును క్రొత్తపేరుతో వ్యవ హరింపని వారిని దండించుచున్నారు.

కృష్ణవేణికి దక్షిణమున నున్న తీరప్రాంతము వారికిని, పశ్చిమ ప్రాంత ము వారికిని రాకపోకలు సలుపు రాజమార్గమునకు సరిగా మధ్యభాగములో నల్ల మల కొండలు, అరణ్యములు నున్నవి. అందువలన ప్రాక్పశ్చిమభూముల కవి కీలకస్థానములు. అవి సుల్తాను హస్తములలో నున్నచో సుల్తానుపూరు (ఏకశిల) ప్రాంతమునకు గూడ మిక్కిలి క్షేమము. ఆ కీలకప్రాంతముల గుట్టు పూర్తిగా తెలిసిన వారు చెంచు లగుటచే, వారి సద్భావము శ్రేయస్కరము. చంచల స్వభావము కల చెంచులు కూడ అలజడి సాగించినచో, సుల్తాను సేనల చలనములకు ఆటంకములు కలుగగలవు. అది యంతయు నాలోచిం చియే చెంచులతో మంచిచేసికొన నిశ్చయించి ఆ భారము మలిక్‌నబీ తనకు విశ్వాసపాత్రుడగు బడేసాహబు పై నుంచెను. బడేసాహబు తన కాలి గాయము నయము కాగానే చెంచులతో రాయబారమునకు దేశకాలములు నిర్ణయించెను.

పెద్ద దొర భీమరాజు తనవెంట నలువు రను చరులను, ఇద్దరు కాగడాల వారిని మాత్రము తోడు తీసికొని నియమిత ప్రకారముగా సంకేతస్థానమునకు వచ్చెను. బడేసాహబు కూడ నట్లే నలుగు రనుచరులు ఇరువురు సేవకులతో సంకేతస్థలమునకు వచ్చి చెంచునాయకుల కలసికొనెను. నియమమునకు విరుద్ధ ముగా చెంచుల వలెనే ఆతడును బలమగు సేనల నావల గాపు పెట్టి కొనియెను.

భీమరాజు ఉత్సాహముగా నుండెను. చెంచులక్ష్మి యవతరించినది. తమ కిక భయములేదు, యవనులతో చెలిమి చేయవలసిన పనిలేదు. అయినను బల

వంతులతో స్నేహసంపద జయహేతువు. యవనులకు ఆశ్వికబలము, ఆయుధ బలము, ధనబలము నెక్కువ. ప్రతాపరుద్రదేవునంత వాని నీ యవనులు జయించిరి. ప్రస్తుతము వారిదే పైచేయిగ నున్నది బలవంతులగు నీయవను లతో చెలిమి శ్రేయస్కరము తమ భాగ్యవశముననే ఈ యవకాశము లభించి నది. మొత్తముమీద పెద్దదొర ఈ విధముగా భావించెను.

యవనులకు చెంచులకు ఒకరితో నొకరి కవసర మున్నప్పుడు వారి రాయబారములు సఫలమగుట ఏమంత కష్టము?

బడేసాహబు చెంచులను ఆదరముతో కౌగిలించుకొని ఆ సంకేతస్థలమున నతని సేవకు లప్పటికే యమర్చియుంచిన మెత్తలపై కూర్చుండ జేసి, తానును అనుచరులతో నుపవిష్టు డయ్యెను. అంతట చెంచులకు స్వాదుఫలాహారములు పెట్టించి, వారు తెచ్చిన పచ్చి తేనె తన యనుచరులతో నత డాప్యాయముగా మెక్కుచు దాని రుచిని పరిపరి విధముల శ్లాఘించెను. ముందు సంశయముచే ముట్టకుండిన పండ్లు చెంచు లిప్పుడు కడుపార నారగించిరి. ఆత డిప్పించిన షర్బత్తులును వారు క్రోలిరి. ముసల్మానులకు మద్యపానము నిషిద్ధ మగుటచే తాము ద్రాక్షాసవము త్రావ వీలులేదని సాహబు వివరించి చెంచులను తనివి దీర నాసవము సేవింప జేసెను.

ఈ మర్యాదలైన పిమ్మట సాహబు సంప్రదింపు లారంభించెను.

'ఢిల్లీ బాదుశహా వారిని మీ రెరుగుదురు గదా! వా రీ లోక మంతటికి ప్రభువులు. వారి ఐశ్వర్యము, విలాసము, ఇంతింతని వర్ణింపలేము. వారు కోపించినచో భూమండల మంతయు వడ వడ వడకును—'

అది తమ కెరుకయే యన్నట్లు చెంచులు తల లూపుచుండ చూచి తృప్తుడై సాహబు మరల సాగించెను.

'సుల్తానువారికి మీమీద దయ కలిగినది. మీ రీ యడవులలో పడుచున్న పాట్లు వారు విన్నారు. ప్రతాపరుద్రుని వెంకలు మీ యరణ్యరాజ్యము మీకు కాకుండ జేసినది విని వారిగుండె జాలితో కరగినది. మీకొండలు మీయడవులు మీకే పూర్తిగా వదలివేయ దలచినారు. ఇక్కడ మీ ప్రభుత్వమునకు ఎవరును ఎట్టి యాటంకము చేయకుండ శాసించి నారు'—

ఇంత యాకస్మికముగా తమ కింత యదృష్టము పట్టుట చెంచులు నమ్మ లేకుండిరి. అంతయు చెంచులక్ష్మి యనుగ్రహమై యుండును. వా రాశ్చర్య ముతో నోళ్లు తెరచి, చెవులు రిక్కించి నిలువు చూపులతో నాలకింప సాగిరి.

'నా మాటలు మీరు నమ్మలేకున్నారా? అవును డిల్లీ బాదుశహావారి అపార కృపా కటాక్షము నిజముగా నమ్ముటకు వీలులేనిదే. వారు దయా సము ద్రులు. మీ రాజ్యము మీకు వడలివేయుటే కాదు. మీ కికపై సంవత్సరమునకు నాలుగు వేల టంకములు బహుమానముగా ప్రసాదింప దలచినారు.'

ఆతడు వారి ముఖలక్షణములు గమనించుచుండెను. చెంచులకు సంతోష షముతో మాట పచ్చుటలేదు.

'ఇదిగో వారు మీ కీ సంవత్సరము బహుమతిగా పంపిన నాలుగు వేల టంకములు! -' ఇట్లనుచు సంచులలో చిల్లులలోనుండ పచ్చగా మెరయుచున్న సొన్నారి టంకములు వారికి చూపెను.

'అవిగో అవి యన్నియు మీకే! మరియు ఈ రత్నము లన్నియు మీ యాడు వా రలంకరించు కొనుటకు! -' ఇట్లనుచు ఒక పెట్టెలో మెరమెర మెరయుచున్న గాజు పూసల కుప్పను వారికి చూపించెను. చెంచుల దృష్టిలో నా గాజు పూసలును మహారత్నములే. పెద్ద దొర సంతోషము పట్టలేక ఆపెట్టె యొద్దకు పోయి దోసిళ్ళతో నా పూస లెత్తిపోయుచు తన యానందము వ్యక్త పరుచుచుండెను.

'దీని కంతటికి బాదుశహా వారికి ప్రతిఫలముగా మీరు చేయవలసిన సాయ మొక్కటియే. వారి సైనికులు ఈ కొండలలో గుట్టలలో అడవులలో వెళ్ళునప్పుడు వెంట ననుగమించుచు, దారి చూపించుచు, నీరు ఆహారము విశ్రాంతి దొరకుచోట్లు చూపవలెను. ఇక్కడ నీటి పట్లు శుభ్రముగా నుంచుచు కాపాడవలెను. వారి శత్రువు లిటు వచ్చినచో, వెంటనే వారి జాడలు బాదుశహా వారి సేవకులకు తెలుపుచుండవలెను. వారి సేనలు ఇక్కడ ఎన్నాళ్లున్నను వాని కే యలజడియు కలిగింపక సదుపాయములు చేయుచుండ వలె!'

చెంచులు ఒప్పుకొనిరి. 'ఇంతే కాదు. మీకును మీ బాదుశహా వారికిని దాసాను దాసులమై సేవ చేయగలము. మాకు కావలసినవి మూడే కోరిక లున్నవి.'

'ఏమి టవి ?'

'మా రాజ్యములో ఈ దారుల గుండ రాకపోకలు చేయువారి నందరను, మా కీయవలసిన పన్ను ఈయనిచో, దోచుకొను హక్కు అనాదిగా కలదు. ఈ హక్కు మీ సైనికులు కూడ పాటింపవలె !'

బడే సాహబున కది యిష్టము లేదు. 'మా బాదుశహా వారికి మీ కోరిక తెలియజేసి అనుమతి కొరకై నా శక్తి కొలది ప్రయత్నింతును. మరి రెండవది ?'

'మాకు ఆహార ధాన్యములు నెలకు నూరు పుట్లు దయ చేయించవలె. జొన్నలు, సజ్జలు రాగులు ?

'సంతోషముగా నిప్పింతును, తప్పక దాని విలువ మేమిచ్చు నాలుగు వేల టంకముల బహుమానములో మినహాయించుకొందుము.'

'మాకు పది మాంజినీకులు కావలెను!'

ఈ మూడవకోరిక విని సాహబు చకితు డ య్యెను.

'మాంజినీకులే? - మా కెక్కడివి''

'దొరా; అట్లు తప్పించుకొనెద రేమి? మాంజనీకుల సాయమునసే గదా, బాదుశహా వారు ఓరుగంటి కోట పట్టుకున్నది!'

సాహబుకు మరింత యాశ్చర్య మైనది. కాని యాతడు రాయబారములు సామరస్యముగా కొనసాగింప నాజ్ఞప్తు డై యుండుటచే నిట్లనెను:

'బాదుశహా వారికి నివేదించి యనుజ్ఞ తెప్పింతును:'

ఇట్లు చెంచులు కోరిన మూడువరములలో రెండింటికి బాదుశహా వారి యనుజ్ఞపై భారము పెట్టి ఒప్పుకున్నట్లే కనబరచి మధ్యపరుపవలె నని యాతని యెత్తు. తర్వాత బాదుశహా వారు సమ్మతింపవల దని యవసరమైనచో తప్పు కొనవచ్చు నని యాత డూహించెను. చెంచుల వినయావ నత్యాసములు కాంచి వారు సమ్మతించినా రనియే భావించి యత డిట్లనెను:

'మీ రీ సంధికి ఒప్పుకొన్నట్లు మీరు ప్రమాణములు చేయున దెప్పుడు చెంచుదొరా?'

దానికి తొందర యేమున్నది ప్రభూ?'

వెంటనే వా రా నందముతో ప్రమాణము చేయుదురని యాతడు ముందు తలంచెను. ఆ యాటవికుల బుద్ధికుశలత యాతని కర్థము కాలేదు. వారి మాట లాతని కందుచే నాశ్చర్యము కలిగించెను.

'మీ కెందు కీ సందేహము?'

'మీ బాదుశహా వారి యనుమతి రానిండు! ఆ పిమ్మటనే ఉభయులము ప్రమాణములు చేసికొందము.'

బడేసాహబు లోపల పుట్టిన కోపము లోపలనే అడచుకొనెను. కోపము కార్యసాధన కనుకూలము కాదు.

'బాదుశహావారి యనుమతి రాదని మీకు భయమా? అది నా భారము! -'

'అట్లయినచో మీరు మిగిలిన వాకి వలెనే వీనికి మాత్రము ఒప్పుకొన రాదా?'

'అదేమిటి? మీ రడిగినవి క్రొత్తకోరికలు. బాదుశహావారి అనుజ్ఞ లేనిది వారి సేవకుడ వగు నేను ఒప్పుకొనుట మర్యాదయా?'

నిజమే. ఈ కానుకలు మా చెంచులక్ష్మి యెదుటబెట్టి వారి యనుజ్ఞ మేము కూడ పొంది వచ్చెదము. ఇంతలో మీరు బాదుశహా వారి యనుజ్ఞ తెప్పింపుడు. సెలవు!-'

ఇట్లనుచు చెంచుదొర తన యనుచరుల వంక చూచెను. ఇంతసేపును వారి దృష్టి టంకముల సంచులమీదను, గాజుపూసల పెట్టె మీదను నిలిచి యుండెను. వారిలో నిద్దరు చెరి రెండు సంచులును, ఒకడు పూసలపెట్టెయు శిరస్సున నుంచుకొని బయలుదేరిరి. బడేసాహబుకు ఏమియు తోచక, 'ఇదేమిటి?' అని గద్దించి పలికెను.

'ఈ సంధికి సంచకరువు క్రింద మా కిందాకనే తమరివి దయ చేసితిరి గదా? ఇట్లభ్యంతరము చెప్పదురేమి? ఇంతలోనే మాట తభావతా? - అది కాక మా రాజ్యములోనికి వచ్చిన మీ రింకను మా పన్ను చెల్లింపలేదు, మా కున్న అనాది హక్కులు ముందే కోరుకొంటిమి గదా! -' ఇట్లు భీమరాజు తొణకకుండ బదులు పలికెను. సాహబు కోపపు కేకలు వినిపించు కొనకయే చెంచులు బయలుదేరిరి,

బడే సాహబు కనుసంజ్ఞ గొని యాతని వెంట వచ్చిన యనుచరులు సలువురు ఖడ్గములు దూసి ధన మెత్తుకొని పోవుచున్న చెంచులపై కవిసిరి. భీమరాజు మెరపు మెరసినట్లు ధనస్సునుండి వదలిన యర్ధచంద్రబాణములతో యవనుల ఖడ్గహస్తములు ఖండింపబడినవి.

మరియొక అర్ధచంద్ర బాణము వింట దొడిగి, చెంచుదొర వినయముతో బడే సాహబువంకకు వంగి, 'మీరు పెద్దలు ప్రభూ! వారు దుష్టులై కత్తులు దూసిరి కనుక వారి కాగతి పట్టినది. మీరు సుఖముగా వెళ్ళండి, ప్రభూ!' అనెను,

తాను ఖడ్గ మెత్తినచో తనకుగూడ తన యనుచరులకు పట్టిన గతియే పట్టునని యర్థము చేసికొని, సాహబు అటి సాహసాలోచన వదలి ఆవల దాగియున్న తన పరివారమును కలసికొన బోయెను. వారిని బంపి వెంటనే యా ధన మెత్తుకొనిపోయెడి చెంచుల బట్టింపవలె నని యాతని యూహ. అప్పటికే దాగియున్న చెంచుసేనలు ఆ పరివారముపై అంపవాన కురిపించుచు కనబడకుండుటచే ఏమి చేయను దోపక అలజడి పడుచుండెను. ఆ భటులను కూడగట్టుకొనుటే బడే సాహబుకు కష్ట మయ్యెను. అంతలో తమకు దొరికిన ధనముతో భీమరాజును అనుచరులును తప్పించుకొని దూరము పోయిరి.

బడేసాహబు రౌద్రోదగ్రుడై స్కంధావారము చేరునప్పటికి సూర్యోదయ మగుచుండెను. ఆతని సేవకులు ఆ తెల్లవారు జామున ఒక పిచ్చివాడును బ్రాహ్మణ దంపతులును వృద్ధురాలొకతెయు పట్టుకడి రని వార్త చెప్పిరి. అది విన్న వెంటనే సరకివేయవలసిన దని ఆజ్ఞాపించెను. అతనికి చెంచులపై పుట్టిన కసి యంతయు నావృద్ధులపై ప్రసరించెను.

25

అలావదీను బొల్లనకు బదులు చెప్పక తన గుడారములోని కేగి, ఏకాంతమున తన యనుచరుని బిలిచి, ఆ పిచ్చి బ్రాహ్మణు డేమి చేసినను గణింపక, ఎట్టి బాధయు పెట్టక, దృఢముగా నిర్బంధముకో మాత్ర ముంచుయని కఠినముగా నాజ్ఞాపించెను ఆ యనుచరుడు భటులతో గలిసి వచ్చి బొల్లనకు వినయముతో వంగి సలామ చేసి తనతో రమ్మని వేడుకొనెను.

బొల్లన యాతని నాపాదమస్తకము విలోకించెను. ఆతని కేమి చేయను కొంతవడి తోపలేదు. తానెదిరించినచో ఆతురక లందరు తనపైబడి బలవంత ముగా తీసికొనిపోవున ట్లున్నారు. వారు తాకినంతనే తాను మైలవడి పోవుచున్నా నని విపరీతముగా నాతనికి బాధ కలుగుచుండెను. అది తప్పించుకొనుటకై వారితో తనంత తాను మర్యాదగా పోవుటయే క్షేమతర మను నిశ్చయ మొన ర్చెను.

'నీ పేరేమి ?'

'షేర్ ఖాను, బాబూ !'

'మీ నాయకుని పేరు ?'

'అలావదీను సాహబు !'

'వానిది చెదలువాడ కాదా ?'

'నాకు తెలియదు, బాబూ!'

'వానిపేరు బసవన్న కాదా ?'

'ఏమో, వారి వెనుకటిపేరు నాకు తెలియదండీ!'

'వాడు మీలో కలసి యెంతకాల మైనది ?'

'అబ్బో, ఇప్పుడా? చాలా కాలమైనది—బాబూ బయలుదేరండి, వెళ్ళు దాము !'

బొల్లన బయలుదేరెను. ఆతడు కదలి వెళ్లుచుండగా నెన్నడు లేనిది కన్నులనీరు గ్రిర్రున తిరుగసాగినది. అతడు తన మనోదౌర్బల్యమును నిందించు కొనుచు నిగ్రహించుకొన ప్రయత్నించినకొలది కన్నీటి యూట ప్రబలము కాజొచ్చినది. వెంటనే యాతడు తన యంగవస్త్రముతో కన్నులతడి యద్దు కొనుచు, తనకులదైవ మగు అహోబిలనృసింహదేవుని ధ్యానించుచు కదలెను.

'ఉధ్వా కశైర్యమథటా బహు భర్భయంతి
కర్షంతి యత్ర పథి పాశశతై ర్యదా మామ్
ఏకాకినం పరవశం చకితం దయాళో
లక్ష్మీనృసింహ, మమ దేహి కరావలంబమ్!'

అత డట్లు ధ్యానించుచుండగనే అంతవరకు తన్ను తురకలు తమ యిచ్చవచ్చి నట్లు తాకినందున మైలవడిపోయితి ననుచింత యతిశయించినది. ప్రాతస్సంధ్యావందనమునకు కాల మెంతో దాటిపోయినది. 'వీ రిప్పుడు నన్ను స్నానము చేయనిత్తురా. సంధ్యావందనము చేయనిత్తురా ?' అను సందేహము లుదయించినవి. ఖాను తన్ను గౌరవముతో చూచుచున్నది కనిపెట్టెను. భటు లును తనచుట్టు నుండి రేకాని. బంధించుట గాని. పట్టుకొనుట గాని, ఉదయమున వలె భాధించుటగాని లేదు.

'నన్ను స్నానము చేయనిత్తురా ?'

ఖాను 'చిత్త'మని సమీపమున నున్న యొకనూతికి దారి చూపెను. ఆ నూతిలోనుండి తురకభటులు గూడ నీరు తోడుకొనుచుండుట చూడగా నక్కడ స్నానముచేయ బొల్లనకు మనస్కరింపలేదు.

'ఇక్కడ కాదు. గోదావరిలో స్నానము చేసెదను'

మరల 'చిత్త' మనుచు షేరుఖాను గోదావరికి దారి తీపెను. వసిష్ఠ గోదావరీనది క్రొత్తగా వచ్చిన వరదనీటితో పొంగులు వారుచుండెను. ఎర్రగా నున్నదాని జలము అనాదుల రక్తముతో నిండియనదా యనిపించుచుండెను, బొల్లన స్నానార్థము నదిలో దిగెను. యవనభటులు ఆతడు దిగిన తావునకు ఇరు ప్రక్కల దూరముగా నిలిచి కాపుండిరి. షేరుఖాను ఆతడు దిగినచేవున కెదురుగా ధనుర్బాణములతో నిలిచియుండెను.

బొల్లన స్నానముచేయ నారంభించెను ఆఘమర్షణ మంత్రములు పఠించుచు అత డొక్కమారు స్నానము పూర్తికావించెను. కాని మున్నొన్నడు భూద్ర స్పర్శయే చేసి యెరుగని బొల్లనకు ఆనాడు తనపైబడి యవనులు పట్టి కట్టి లాగినందున కలిగిన స్పర్శదోషము తనదేహ మంతట మసి వలె నావరించి వదలకున్నట్లు తోచెను.

మరల నతడు ఆఘమర్షణస్నాన మాచరించెను. కాని యేమి లాభము! తన్ను తాకినది వట్టి యవనులు కాదే! ఎన్నో పాపిష్ఠకార్యములు చేసిన యవనులు మైలవడితి ననుభావ మాతని వదలలేదు.

మరల మరల నాతడు అఘమర్షణ సూక్తములు జపించుచు స్నానము చేయసాగెను. నెమ్మది నెమ్మదిగా అఖండ గోదావరీ నదీజల మాతని పూతుని

గాలి చుచున్నట్లు పొడకట్ట సాగినది. ఒక మారు, ఇంకొకమారు, అనుకొనుచు నతడు స్నానములు కావించుచుండెను.

కాపు కాయుచున్న భటులకు ఎంతటికిని స్నానము తెమలకుండుటచే విసు గని పించినది. షేరుఖానును ఓర్పు తగ్గుచున్నది. ఆతని హృదయకుహ రాంతరమున సంశయవేశ ముదయించినది. 'ఈత డీ సందు చూచుకొని గోదా వరి యీది ఆవలి యొడ్డుకు పారిపోడుగదా!' మరల నతనికి ఇంతలో ధైర్యము వచ్చినది 'పొంగుచున్న ఈ గోదావరిని మనుష్యమాత్రుడు దాటలేడు. నాచేత నీ ధనుర్బాణము లున్నంతవరకు ప్రాణములతో బాణపాతము గిరి దాటిపోలేడు' ఇట్లనుకొనుచు బొల్లన నాతడు తొందరగా కాని మ్మని హెచ్చరించెను.

శుచి నైతి నని భావించుచున్న బొల్లనకు ఆమ్లేచ్ఛుని మాటలు విన్నంతనే దేహ మంతయు గ్రుచ్చుకొన్నట్లయి అశుచిభావ మావహించెను. మరల నాతడు గోదావరిలో మునుక లాడుచు ఆచమించుచు తానమాడుచుండెను.

ఖాను కీ మాటు విసుగుతోబాటు సందేహ మతిశయించెను.

'బాపనయ్యా! ఎంతసేపటికి స్నానము పూర్తి చేయకున్నావు. గోదా వరిలో ఈదుకొని పారిపోవ జూచుచున్నావేమో! ఇవిగో. నా ధనుర్బాణములు. ఇవి నిన్ను పదిభారలు దాటిపోనీయవు. గోదావరి నిన్ను బ్రదుక నిచ్చినను ప్రక్కనున్న పడవలలో నిన్ను వెంటాడి యీ భటులు బంధింతురు. మర్యా దగా చూచుచున్నా నని అలుసు తీసికొని వెర్రివేషములు వేయకుసుమా!'

ఈ హెచ్చరింపు విన్నంతనే బొల్లనకు మెరపు మెరసినట్లు మోక్ష పాయము భాసించినది ఆతడు మునుక వేసినవాడు వేసినట్లే గోదావరీ జలము లలో మాయమయ్యెను. ఖాను నివ్వెరపోయి ధనుస్సున బాణము సంధించి ఆకర్ణాంతము లాగి బొల్లన జలోపరితలమున కనపడినంతనే గురి చూచి వేయు టకు సిద్ధము గా నుండెను.

బొల్లన శిరస్సు దూరమున అలలలో తేలుచు పై కగపడెను. ఆతడు యవను లేమి చేయుచుండిరో చూచుటకు తల వెనుకకు త్రిప్పి చూచుచుండెను. వెంటనే ఖాను ఆతని ముఖమును గురిచూచి బాణము వదలెను. ఆ బాణము బొల్లన ముఖమునకు సూటిగా రెక్కలతో పరువెత్తుచుండెను. కాని గోదావరీ మాత తనవేగముతో బొల్లనను లాగి తప్పించినది. మరల ఖాను బాణము వద

లెను. ఈమా రాతడు నదీవేగము గూడ లెక్క కట్టి. ఆకాశమున నెగురుచున్న పక్షిని గొట్టునప్పుడుపలె గురి చూచి బాణము వదలెను. బొల్లన శిరస్సుతోపాటు సమానముగా బాణమును పరువెత్తుచుండెను. బాణము తగిలియే మునిగె నో, తగులకయే మునిగెనోగాని బొల్లన శిరస్సు మరల ఖానుకు కన్పింపలేదు. ఖాను మరికొంతవడి తీరమున వెంబడించుమ. బొల్లన శిరస్సు నీటిపైకి వచ్చునేమో యని కనిపెట్టి చూచెను. లేదు. మరి కనబడలేదు. ప్రక్క నున్న నాలుగు పడవలలో తనభటుల నెక్కించి బొల్లన దేహమును గాలించుటకై తుద కాతని శిరస్సు కన్పడిన దిక్కుగా నలువైపులకు పంపి వెదకించెను. కాని బొల్లన జాడ యేమాత్రము కానరాలేదు. ఆతడావలి యొడ్డు చేరికొనినేమో యని వారికి సందేహము కలిగినది. కాని గోదావరి యావలితీరము నెట్టి సందర్భములందును చేరవల దని వారికి నాయకుల కఠినాజ్ఞ లుండుటచే అవతలి యొడ్డుకు పోవవారు సాహసింప లేదు. అన్నపానములు లేకుండ సాయంకాలమువరకు వారు గోదావరి గాలించి చూచిరి. బొల్లన జాడ.నే లేదు

చీకటి పడువరకు గూడ వారు వెదకి వెదకి వేసారి విఫల ప్రయత్నులై అలావదీనుకు జరిగినది విన్నవించుటకు గజగజలాడుచు వెళ్ళిరి.

అలావదీను చండశాసనుడు. ఆతని చూచినంతనే షేరుఖాను గజగజలాడుచు నోట మాట రాక నిస్తబ్ధుడై నిలిచెను. 'ఆ బ్రాహ్మణు డేడి?' అని క్షణక్షణ ప్రవృద్ధమాన మగుచున్న కోపముతో అలావదీను ప్రశ్నించిన కొలది ఖానుకు మాట స్తంభించిపోయెను. ఆతడు మాటాడ యత్నించి యత్నించి, తుదకు నోట మాటరాక మూర్ఛిల్లి పడిపోయెను. ఆతని వెంట నున్న భటుల వలన నెమ్మదిగా అలావదీను జరిగినసంగతి తెలిసికొనెను.

26

ఆరాత్రి అలావదీనుకు భోజనము చేయ బుద్ధిపుట్టలేదు. ఆతనికి మనస్సులో కలిగిన కలత అతనికే అర్థముకాలేదు బొల్లన తన పెద్దమేనమామ, తన చెల్లెలికి పెద్దమామగారు బొల్లన యన్న బంధుగణమం దంతటను విశేషమగు భయభక్తి లుండెను. ఆతనిమాట కెదురాడ సాహసించువా రొక్కరును లేరు. ఎదురాడుటే కాదు, ఆతడున్నయెడ చిన్నవారు ఎవరును మాటాడుటకే

సాహసించువారు కారు. అంతమాత్రమున బొల్లన కఠినుడనికాని, క్రూరు కాని భావింప వీలులేదు. అంతటి కరుణార్ద్రహృదయుడు అంత బంధుప్రీతి కలవాడు 'ఉండుట అరుదు. అఖండపండితుడైన తన చిన్న మేనమామ సూర నయే, అన్నగా రగు బొల్లనయందు వర్ణింపరాని భయభక్తులతో మెలగుచుం డెను. సోమపీథి యై సాంగవేదవిదుడగు తనతండ్రియే బొల్లనయందు విశేష భక్తిశ్రద్ధలు చూపుచుండెను, మరి బొల్లన పెద్ద వేదవిద్వాంసుడా, కాదు. వేదా ధ్యయనమైన సాంగముగా చేసి యుండలేదు. అయినను బొల్లన జన్మవిశేష మట్టిది. ఆతని కున్న ధర్మనిష్ఠయో, కాక పూర్వజన్మకృతతపోవిశేషమో, ఏదో గాని అందరికి నాతని యెడ గౌరవభావము కలిగించును. ఆతనికి జన్మతః గురపదము సిద్ధమైనది,

తా నెప్పుడును ఎవ్వరికిని భయపడిన వాడు కాడు. తన పెంకెతనము చూచి బాల్యములో నందరు పెద్దమేనమామ బొల్లన పోలిక యని యనుచుండు వారు. రూపములోగూడ తన కాతని పోలికయే. తాను ఎదుగుచు స్వేచ్ఛాచార మున వర్తించుచుండుట చూచి తండ్రి తన్ను కూకలు వేయగా తండ్రి మాటలు లక్ష్యము చేయక ధిక్కరించెడివాడు. కాని ఎన్నడైనను బొల్లన తన గ్రామము వచ్చుట తటస్థించినచో, ఏలనోగాని ఆతడున్నన్నాళ్లు, తా నెట్టి యుద్వృత్తికి దిగక స్నానసంధ్యాదులు నిత్య మాచరించు వాని వలె బుద్ధిమంతుడై పిల్లివలె సంచరించెడివాడు!

తరువాత నిప్పుడు తనలో నింతమార్పు వచ్చినను, తాను మతాంతరు డైనను, తాను చెప్పరాని ఘాతుక కృత్యములు చేసినను, ఈ నాడు ఉదయ మున బొల్లనను జూడగనే వెనుకటి భయభక్తు లాకస్మికముగా నుద్బుద్ధము లైనవి. అందువల్లనే బొల్లన తన్నేమన్నను తాను మాటాడలేకపోయెను. బొల్లన ప్రాణ ములు తన చేతిలో నున్నను అతని కెట్టి బాధయు కలిగింప నతని మనస్సొప్పు లేదు. అయినను బొల్లనను విడనాడుటకును అతనికి మనస్కరింపలేదు. అందు వల్లనే షేరీఖానుకు బొల్లన విషయ మట్టి విచిత్రమగు నుత్తరువు లిచ్చి యుండెను.

ఇప్పుడు బొల్లన యదృశ్య డయ్యె నని తెలిసినంతనే, అతని హృదయ ములో విచిత్ర మగు శూన్యభావ మావేశించినది. తా నెప్పుడో విడనాడి మరచి పోయిన తన పుణ్యకాయమే బొల్లన రూపమున తన కీనాడు సాక్షాత్కరించిన

దని యతనికి చిత్రమైన యూహ జనించెను. అయ్యో! ఇప్పు డది తన్ను విసర్జించినదా ?

అంతలో నాతనికి భటులు చెప్పిన దంతయు స్మృతికి వచ్చినది. ఖాను బాణములు గురితప్పవు. అతని బాణములు తన పెద్దమామను చంపి యుండునా? కాక గోదావరీమాతయే ఆతని తన పొట్టను బెట్టుకొని యుండునా ? ఒక సారి తన శిరస్సున ఖాను బాణము గ్రుచ్చుకొనిన ట్ల య్యెను. ఒకమారు తాను గోదావరీ జలములలో మునిగి కడప్రాణములలో నున్న ట్ల నిపించెను.

ఆ రాత్రి యాతనికి జ్వర మావేశించినది. అది తీవ్రమైన కొలది అతనికి తన పూర్వకథ యంతయు కన్నుల యెదుట కట్టినట్లు, తెరపై బొమ్మలాటలో వలె, భాయగా భాసింపసాగినది.

* * * *

తాను స్వచ్ఛమైన బ్రాహ్మణ కుటుంబములో జన్మించినాడు. తండ్రి వేద వేదాంగవిదుడు. చెదలువాడ అగ్రహారమునకు అగ్రణి. సోమయాగ మాతడు మహావైభవముగా జేసి సోమయాజి యయ్యెను. తా నట్టి యుత్తమ సోమపీఠికి జన్మించిన జ్యేష్ఠ పుత్రుడు. తండ్రి తనకు వైభవముగా ఉపనయన మొనర్చెను. అయినను తనకు సంధ్యావందనము చేయుటే విసుగుగా నుండెడిది. బ్రాహ్మణ కర్మ యయినదాదిగా, తండ్రియే తనకు వేదాధ్యాపన ముపక్రమించెను. కాని తండ్రి ఇతరచ్ఛాత్రులతో పాఠము ప్రారంభింప బోవు వేళకు తా నేదో వంక చెప్పి తప్పించుకొని పారిపోయెడివాడు. తప్పి చెడి చెప్పికొన్న పాఠములైనను సరిగా సంతలు చెప్పికొనువాడు కాడు. అయినను వంశపారంపర్యముగా సంక్రమించిన మేధవల్లను, అనవరతము ఇంటను గ్రామములోనను వినబడుచున్న వేద ఘోష వలనను మొత్తముమీద కృష్ణయజుర్వేద సంహిత బ్రాహ్మణ గ్రంథముతో గూడ తనకు వచోవిధేయమైనది.

తన తండ్రికడ వేదాధ్యయనమునకై దూరగ్రామములనుండి వచ్చిన బ్రహ్మచారులను తాను బాధించుచు వారు తెచ్చుకొన్న స్వల్పద్రవ్యమును సంగ్రహించెడు వాడు. తండ్రి యెప్పుడైన కోపించి తీవ్రముగా దండించుచుండినచో తల్లి పోలమ అడ్డము వచ్చుచుండెడిది. తాను వయస్సు ముదురుచున్న కొలది నెక్కువగా తండ్రి కెదురు తిరుగ సాహసించుచుండెను.

ఆతని తమ్ము లిద్దరు ఉపనయనములై చక్కగా వేదాధ్యయనము చేయు చుండిరి వారి కంఠములు కడుశ్రావ్య మైనవి. పాలు గారుచున్న ముఖములతో వారు పససలు చెప్పుచుండగా విన్నవారు సాక్షాత్తుగా సుబ్రహ్మణ్యమూర్తులు ఈ పుణ్యగౌహములో నవతరించినా రని శ్లాఘించెడివారు. ఆ గ్రామములో ప్రతిష్ఠితు లైన రామలక్ష్మణుల నామములే వారికి తండ్రి పెట్టెను. ఆ రామలక్ష్మ ణులే ఈ రామలక్ష్మణులుగా పుట్టిరని కొందరు అనుచు, పైగా వారితో తన స్థితి పోల్చి తన్ను ఏవగించుకొనెడివారు. అంతకంతకు తనకు తమ్ములపై ద్వేష మతిశయించుచుండెను,

తన పలెనే విద్యాభ్యాసము గిట్టని అగ్రహారిక బాలురు కొంద రితరులు కూడ తనకు సోమరితనమున తోడైరి. వారి కా యగ్రహారములోని వేడుకలు చాలుటలేదు. సంత జరుగుచోట్ల నెల్ల వారి జట్టుముందే ప్రత్యక్ష మగుచుండెను. ఉత్సవములు జరిగెడిపట్ల వారుత్సాహముతో చేరుచుండిరి. అల్లరి యెచ్చట జరిగి నను వారందరు విధిగా నచ్చట నుందురు. మల్లు లెవరైన వచ్చినచో మల్ల రంగములకు వారు వెళ్ళవలసినదే, దేశదిమ్మరులు వచ్చినంతనే వారిని వెంట నంటవలసినదే, తోలబొమ్మ లాడించువారు, నటులు, భాగవతులు ఆచుట్టు పట్టులె నెక్కడ నున్నను తన జట్టువా రక్కడ నుండవలసినదే దొమ్మరులు, కత్తిసాము కర్రసాము ప్రదర్శించెడివారు వచ్చినచో తాను తన జట్టు తో వారి కెదురేగి వారి ప్రదర్శనములు శ్రద్ధతో తిలకించుచు బహుగ్రామములు వారి వెంటనంటి సాగనంపి రావలసినదే వారి ననుకరించి తానును కర్రసాము కత్తిసాములలో ప్రవీణు డయ్యెను. యోగసిద్ధులైన వారి వంశములో జన్మించి నందుననో యేమోగాని, ఆతనికి శరీరము తన వశమై యుండినది. కీళ్ళు ఎముకలు లేని దేహమువలెనే, ఆతని దేహము చురుకుగా ఎటుత్రిప్పిన నటు వశ్యమై తిరుగుచుండెడిది. ఆతనికి అలసటకూడ లేదు. ఆ యగ్రహారములోని సోమరిపోతులకే కాక. చుట్టుప్రక్కల నున్న ఎన్నియో యితర గ్రామముల బాలురకు గూడ నతడే నాయకుడు!

అతనికి జెట్టీలతో కుస్తీలు పట్టుట వచ్చినది. తోడివారిలో నతనితో సమానుడు లేడు. ప్రక్కయూళ్ళ వారలతో పోయి కుస్తీలు పట్టి జయింప సాగెను. పై యూళ్ళనుండి వచ్చిన ప్రసిద్ధ మల్లులతో గూడ ఆతడు తలపడు చుండెను. ఆ మల్లయుద్ధములలో మధ్య మధ్య పెద్ద తగాదాలు వచ్చుచుండెను.

కొంద రిటు కొంద రటు న్యాయమని వాదించెడివారు. పూర్వకాలమునుండి అనుచానముగా వచ్చుచుండిన మల్లయుద్ధ ధర్మము లా రోజులలో మారుచుం డెను. తురకల నెదిరించుటలో క్రొత్తపద్ధతులు దేశములో ప్రాకుచున్నవి. అవి యింకను నియతములు కాలేదు. అవ్యవస్థితముగా నున్న యా స్థితిలో న్యాయ బుద్ధి కలవారికే అభిప్రాయభేదములు వచ్చుచుండును. ఆ పోట్లాట లన్నిటిలో గ్రామనాయకు డాతడే.

తండ్రి యాతని మధ్య మధ్య దండించుచుండెను. తల్లి జాలిపడి ఆతని రహస్యముగా నోదార్చి కోపించి, బుజ్జగించి అన్న మారగింపజేసెడిది. తమ్ము లిద్దరు నాతని నేమియు ననువారు కాకున్నను, వారు శ్రద్ధగా వేదాధ్యయనము చేయుచు మంచివారనిపించుకొనుట చూచిననే తన కరికాలిమంట నెత్తి కెక్కు చుండెను.పాఠములు తప్పక అప్పగించువారి కంఠములు నులిమివేయవలె ననుకసి కడుపులో నుండి అప్పుడప్పుడాతనికి తెగల్చుకొని వచ్చుచుండెడిది. వారి మెత్తని మాటలు చెవుల బడినంతనే వారిని తన కాలిచెప్పుతో మోదవలె ననుతామస ముదయించెడిది.

ఒకమా రాతడు వారము రోజులపాటు ఇల్లు పట్టక దేశము తిరిగి వచ్చును. ఇంటికి చేరునప్పటి కాతనికి యజ్ఞోపవీతము పోయినది. తండ్రి అది చూచి మండిపడినాడు. తల్లి తెల్లవోయినది. తమ్ములు మౌనము వహించిరి.

అప్పు డాతని చెల్లెలు మహాలక్ష్మి పుట్టినింటికి వచ్చి యున్నది. అది యొక్కతెయే ఇంటి ఆడు బడుచు. అందరిలో చిన్నది. ఇంటిలో నందరి మీద కంటె చెల్లెలిమీద తన కెక్కువ మక్కువ. అది యత్తవారింటికి వెళ్ళిన తర్వా తనే తాను తన యింటిలోని వారి కందరకు దూరుడు కాజొచ్చినది. అందుచే చెల్లెలిమీద నాతనికి పూర్వానురాగ మతిశయించినది. ఆ చెల్లెలు అప్పుడు తన వంక జాలిగా దీనముగా చూచినది, ఒక్కసారిగా తన హృదయము కరిగిపోయి నది. ఆ చెల్లెలి చూపు తన కుటుంబజీవిత మంతటిలో నొక దివ్యజ్యోతిగా మెరసినది. ఆ చెల్లెలు తన వంక చూచుచుండగనే దాని కన్నులలో నీరు తిరిగి నది. అప్పు డాతనికి బాల్య జ్ఞాపకము వచ్చినాడు. ఆతడు తన కంటె చిన్నవాడు. ఆతడు తన వద్ద ఖడ్గ పరిశ్రమచేసి యవలీలగా నేర్చెను అతడు తేజోమూర్తి. తన చెల్లెలి మామ, తన పిన్న మేనమామ జ్ఞప్తికి వచ్చినాడు. అతడు ప్రజ్ఞాప విత్ర మూర్తి, దూరస్థుడై యున్న తన చెల్లెలి గుణములు బావగుణములు మామ

గుణము లు నాతని నాకర్షించినవి. కాని తనకు సమీపస్థులై అట్టి గుణములే కల తన తమ్ము లన్న నాతని కసహ్యము! తండ్రిపై గూడ విరోధభావ ముదయించి నది. తా నేమిచేసినను సహించి ప్రేమించుచున్న తల్లిపై నెంతయత్నించినను ఆతనికి కోపము రాకుండెను.

తండ్రి యానాడు తన్ను ఇంటిలో నడుగుపెట్టవద్దని కఠినముగా నిషేధించెను. నీవే లేచి పొమ్మని అనవలెనని తనకు బుద్ధి పుట్టినది గాని నోట మాట రాలేదు. ధూమకేతువు వలె ధుమధుమ లాడుచు తాను బయటకు పోయెను. తనగతియే పట్టిన మరికొందరు స్నేహితులును వీధిలో గలసిరి. వా రందరు కూడ బలుకు కొనిరి. యుద్ధము చేయు నిచ్చ గల వారిని కాలరులు సేనలో చేర్చుకొని యెక్కువ యాదరించుచున్నా రని వారికి తెలియ వచ్చినది. ఓరుగల్లుకు వారు ప్రయాణము కట్టిరి

అప్పుడు సరిగా ముసల్మానులు ఓరుగల్లు ముట్టడించి యుండిరి. వారికి సేనలో చేరవలె ననుకోరికయే గాని ఎవరి సేనలో చేరవలె ననునాలోచన యంతవరకు లేదు. ఓరుగల్లు సమీపించుచున్న కొలది తురుష్కసేనలో చేరుచున్నవారే పలువురు కనబడిరి. వా రందరు తురుష్కసేన లోనే చేరిరి. ఆ సేనలో చేరిన వారికి ఇస్లాము మతము పుచ్చుకొనవలెనను నిర్బంధ మేమాత్రము లేదు.

బ్రాహ్మణేతరులు చూచుచుండగా భుజించు నలవాటు లేని వారు కారు. వా రిప్పుడు వేరుగా వంటచేసికొని తినుటకు ఎల్లప్పుడు నవకాశము చిక్కుట లేదు. వారెన్ని యోమారు లుపవాసములు చేయవలసి వచ్చినది. ఉపవాసశ్రమ పడలేక నెమ్మదిగా, వారు యాత్రామధ్యముగదా యని సరిపెట్టుకొని, దృష్టిదోష బాధ లేకుండ భుజించుట కలవాటు వడిరి. పిమ్మట కొన్నాళ్ళకు ఎవరు తాకినను కష్టము లేకుండ భుజించుట అలవాటైనది. పూర్వము కుంభకారులు వండిన భోజనము సర్వవర్ణములవారు జంకులేకుండ హవ్యకవ్యముల కుపయోగించు కొనెడి వారని వారిలో నొక పండితమాని ఒక నాడనెను. అంతట వారు తమ వెంట వచ్చిన కుమ్మరికి వంట పని యప్పగించి వడ్డన మాత్రము తాము చేసి కొన సాగించిరి.

మరికొంత కాలమునకు వారి కా భేదముకూడ పోయినది. కులభేదము పూర్వాచారములు పాటించుట అజ్ఞానకృతము లను నిశ్చయము వారిలో

బలసినది. దేవతామూర్తుల దొడ భక్తిచూపుట మౌఢ్యసంజాత మని నమ్మకము కుదిరినది.

సరిగా నప్పుడు వారికి మౌల్వీలు ప్రత్యక్షమైరి వారు సర్వసామరస్యము గల శాంతి మతమును బోధించిన కొలది తమకు ఇస్లాముపై వ్యామోహ మెక్కువ కాజొచ్చినది. తమ పూర్వమతము మీది యసహ్యమే తమ తల్లి తండ్రులు చేసిన యవమానమే, ఈ నూతన మతమం దభిమానముగా పరిణ మించినది. తన జట్టు కంతటికి నాయకు డగు తానే మిగిలినవారికి దారి చూపుచు, ముందుగా ఇస్లాము మతము స్వీకరించినాడు. తనచేత ఇస్లాము మూల సూత్రము లనిపించిన మౌల్వీకి తన కుటుంబము సంగతి ఎట్లో తెలిసినది. అతడు మతము మార్చుకొనుట అల్లాజయముగా మౌల్వీకి భాసించినది. అందుచే నాతనికి మౌల్వీ అల్లావదీను అను నూతన నామకరణము చేసెను. బసవన్న అల్లావదీనుగా మారెను. ఒక్కసారిగా నతనికి స్వేచ్ఛ వచ్చినట్లు అనిపించినది.

అంతకు ముందే ఆతని శ్రద్ధాభక్తులు యుద్ధనైపుణ్యము నాయకుల నాకర్షించి యుండెను, ఆతడప్పుడు మలిక్‌నబీ అను నాయబునకు ఆంతరంగిక సహచరు డయ్యెను. అది యెంతో పలుకుబడి కల ఉద్యోగము. ఆతనితోపాటు అతని మిత్రులందరు ముసల్మానులైరి. వారి కందరకు గౌరవపదములు లభించినవి.

ఓరుగల్లు ముట్టడిలో వారి కెన్నియో అనుభవములు గలిగినవి. ముట్టడించిన సుల్తానుసేనలు పలుకష్టముల పాలైనవి. కోటలోనుండి యాకస్మికముగా అప్పుడప్పుడు వచ్చి పడుచున్న ప్రతాపరుద్రసేనల తాకిడికి, ముట్టడించిన సుల్తానుసేనలు పలుమారు మిగుల నష్టపడినవి. అప్పుడు డిల్లీ యువరాజగు ఉలుఘ్ ఖాను సుల్తాను సేనలకు సర్వసైన్యాధిపతి. ఆతని ప్రధాన సేనానులలో మలిక్‌నబీ పూర్వము ప్రతాపరుద్రుని సేనానులలో కట్టూనాయకు డను వాడు అతడు ఓరుగల్లు రహస్యములు తెలిసినవా డగుటచే, యువరాజు అతనినే తరుచుగా సలహా లడుగుచుండెను. తాను నబీనాయకునకు తనకు తోచిన సలహా లిచ్చి యుండెను. అవి యాతని కెన్నో నచ్చినవి.

ఆ ముట్టడిలో డిల్లీసేనల విషయము లెన్నో తెలిసినవి. వారి బలాబలము లవగతమైనవి. పూర్వము తాను డిల్లీసుల్తాను అజేయు డని తలంచిన తలంపు

లిప్పుడు మారినవి. అతని బలాతిశయముకూడ నెరుకవడినది. సుల్తానుపక్ష మవలంబించుటే క్షేమతరము.

ఉలుఘ్‌ఖాను మహావిద్వాంసు డైనను అతనికెన్నో వింతచేష్ట లున్నవి. అంత వివేకము కలవాడు కూడ మధ్య మధ్య అవ్యక్తుని వలె వ్యవహరించును. యువరాజెక్కడో దూరమున ఢిల్లీలో నుండక సమీపమున నుండుటచే అతని యాంతరింగిక విషయములు ఎన్నియో తెలిసికొనుటకు తన కవకాశము కలిగినది. అందుచే నాతని గొప్పదనముతో పాటు సామాన్యగత కూడ స్పష్ట మయినది.

మొదట ముసల్మానుగా మారినప్పుడు తనకు స్వేచ్ఛ వచ్చి నట్లు భావించెను, కాని నెమ్మది నెమ్మదిగా తాను నూతన బంధములలో తగుల్కొనె నని తెలిసికొనెను. వెనుక ముమ్మారు సంధ్యావందనము చేయుట కష్టముగా నుండెడిది, ఇప్పుడు ఐదుమారులు నమాజు చేయవలె. వెనుక ఆచమించుట యన్న విసుగు. ఇప్పుడు ఉజూచేయక తప్పదు. తన తండ్రి ఎల్లప్పుడు 'అహం కాశీం గమిష్యామి!' అనుచుండువాడు. తన తోడి ముసల్మాను లందరు తమ జీవిత కాలములో ఒక్కసారి యైనను మక్కాకు పోవలెనని ప్రయత్నములు చేయుచుండిరి. కార్తికమాసములో తనయింట పెద్దలందరు ఏకభుక్తము చేసి రుద్రాభిషేక మాచరించెడివారు. ఇప్పుడు రమజాన్ మాసములో పగలు నీరైన ముట్టుక ఉపవశింపవలెను. తన యింటికి అతిథులు వేళగాని వేళ వచ్చినను, తన తల్లి, పాపము, వంటచేసి ఆప్యాయముగా కుడువబెట్టు చుండెడిది. ఇప్పుడు విధిగా తన యాదాయములో నింతభాగమని పేదలకు దానము చేయవలె స్వేచ్ఛ యే మున్నది? పాత నియమములు పోయి క్రొత్త బంధములు వచ్చినవి.

ముసల్మానులలో మహావిద్వాంసు లనువారి సంగతియు తెలిసినది. వారి విద్వత్తు ఏమిటి? అరబ్బీ ఫారసీ భాషలలో జ్ఞానమే. గణితములో జ్ఞానమునకు ఇంతింతన రాని గౌరవము. పూర్వము సంస్కృత ప్రాకృతములలో జ్ఞానమే పాండిత్యమా యని తనకు సంశయ ముండెడిది. వేదసూక్తములు అప్పగించుటే భగవంతునికి ప్రీతియా యనుకొనెడి వాడు. ముసల్మాను లందరు కొరాను భాగములు చెప్పించుకొనుచుండిరి. తానును చెప్పుకొని వల్లించెను. తన కెంత త్వరగా పట్టువడుచున్నను కొరాను విద్వాంసులతో తాను తులదూగలేకున్నాడు.

సుల్తాను సేనలకు ఆహారాదికములు సంపాదించుటకు వెళ్లుచున్న భటులతో చుట్టుపట్టుల గ్రామములకు వెళ్ళునప్పుడు తానును పలుమారు వెళ్ళియుండెను. అప్పుడు గ్రామములలో నున్న ఆహారము, పశుగ్రాసము గ్రామస్థులను భయపెట్టి తాము తరలించుకొని పోవుచుండిరి. అది, చూరగొనుట యను పేరు లేకున్నను, నిజముగా చూరయే. ఆ గ్రామములలో కాపురములు చేయువారు హిందువు లగుటచే వారు తన్ను పరమ శత్రువుగా భావింప సాగిరి. తనకును హిందువులన్న ద్వేష మతిశయింప సాగినది.

తుద కొకనాడు ప్రతాపరుద్రుని వెంకలలో నొకడు ధనాశచే చేసిన ద్రోహము వలన ఆ రాజు పట్టువడినాడు. అతని తప్పించుట కతని సేనానులు చేసిన ప్రయత్నము లన్నియు విఫలము లైనవి. కోటలోని సేనలు పారిపోజొచ్చినవి.

సుల్తాను సేనాపారావారమునకు చెలియలికట్ట తెగిన ట్లయినది. సైనికుల కాసంద ముద్వేల మైనది. అంతకు పూర్వము కోట పట్టుకొన లేమని నిరాశ చెందిన వారు ఇప్పుడు తమ ప్రతాపాతిశయము వలననే కోట స్వాధీన మైన దని భావింపసాగిరి. వా రిప్పుడు ఏకశిలానగర మంతయు దోచుకొనిరి. అక్కడి కృపణులను అసహాయులను, నిర్దాక్షిణ్యముగా తాము బాధించుచుండ, వారు ఎదురు తిరుగకుండ బాధలు పడుట చూచి, అక్కడి పౌరులు పిరికి పంద లని తలంపసాగిరి. అప్పుడు తమ్మక్కడ ఎదిరించిన వారే లేరు. దానితో తాము మహావీరుల మను అతిశయభావము ప్రబలినది. ఆ ఊపుతో సుల్తాను సేనలు నిరాఘాటముగా ఆంధ్రదేశ మెల్లెడల విజయయాత్రలు సాగించుచు ముందుకు పోసాగినవి.

ఆ యాత్రలలో మరల తాను తన స్వదేశము వైపునకు ఐదువందల మంది సైనికులతో దండువచ్చుట తటస్థించినది. ముందాతడేదో అనిర్వాచ్యమగు నాకర్షణప్రభావముచే తన చెల్లెలి యత్తవారి గ్రామము గ్రుడ్లూరువైపుకు తరలెను. తాను దారిలో నెన్నియో ఘాతుక కృత్యము లు జేసెను. అట్టివే ఇతర ముసల్మాను సేనానులు తన చెల్లెలికిని బావకును మామకును చేయకుండా ఏదో విధముగా కాపాడవలె ననుద్దేశముతోడనే తా నటు ప్రయాణమయ్యెను.

ఎంతయో ఉత్కంఠతో అతడు గ్రుడ్లూరు చేరెను. గ్రామప్రవేశము చేయుచుండ నెందువల్లనో అతని కాళ్ళు వణకసాగినవి. తన బావమరది యింటి

పైపు వెళ్లుచుండెను. ఎప్పుడును కవిత్వపు గొడవతో ఇంకొక లోకములో నుండునట్లుండు తన బావ ఎర్రయను తానెట్లు ద్వేషింపగలడు? ఎర్రయతండ్రి. పాపము, అతనికంటెను వెర్రివాడు: కవిత్వములో. ఇది మంచిది అది మంచిది. అను విచారణ తప్ప అతనికి లోకములో వేరు ఆలోచనయే లేదు. ఇంటిలో నవసరమైన వస్తువులు సేకరించి పెట్టుటకైనా నోపిక లేనివాడు.

అట్టి యమాయకుల యింటి పైపునకే తాను పోవుట కేల జంకెను? అక్కడ నేమి చేసినను తన్ను కాదనువారు లేరు. తాను ఇస్లాములో చేరి దానిపై నభిమానము పెంచుకొనుచున్నను, తాను పుట్టి పెరిగిన వైదిక మతము నందును తన్నిష్ఠ కలవారి యందును, తన హృదయాంతరాళములో నే మారు మూలనో అనిర్వచనీయమగు నొకానొక గౌరవము, అభిమానము పూర్తిగా నింకను పోక అడగియే యున్నది. తన తురకవేషము చూచినచో తన ముద్దుల చెల్లెలు ఎంత అసహ్యపడునో అనియు, తన బావ యెంత యేవగించుకొనునో అనియు, తన మేనమామ ఎంత యారాట పడునో అనియు, అప్రయత్నముగా నతని మనస్సులో చొరకుండ నెట్లుండును: స్వచ్ఛమైన ఆ బ్రాహ్మణ కుటుంబమునకును, తన తురక సైనిక వేషమునకును ఎంతదూరము: అయినను ఇంతదూరము వచ్చి తన చెల్లెలిని చూచి యాదరించి అడిగిన చీరె లిచ్చి కోరిన నగలు చేయించిపెట్టి పోకుండ నెట్లుండగలడు: బావను మామను క్షేమ సమాచార మడుగకుండ నెట్లు పోగలడు:

వారుండు వీథిలోనికి సరాసరి పోవుటకు తాను సందేహించి, ముందుగా వీధి చివర నిలిచి, తన యనుచరు డగు షేరు ఖానుకు వారి యిల్లు చూపి, 'అందులో నెవరున్నారో కనుగొని ర'మ్మని వానిని పంపెను. ఆతడు తిరిగి వచ్చు వరకు తా నావేగము పట్టలేకుండెను. ఖాను తిరిగి వచ్చి ఆ యింటిలో నెవ్వరు లేక శూన్యమై పాడువడి యున్న దని నివేదించెను.

తన కప్పుడు పట్టరాని యావేగము కలిగి పడివడి పోయి స్వయముగా తానే చూచెను. తన చెల్లెలికి తాను పూర్వము తెచ్చి యిచ్చిన వస్తువు లెన్నో అక్కడ చెల్లాచెదరై కనిపించెను. చెదలువాడలో సీతారాములు కల్యాణోత్సవ మప్పుడు అక్కడికి వచ్చిన కావడి పెట్టెలు రెండు కొని, అవి తానే స్వయముగా కావడి పైవేసి మోసికొని వచ్చి చెల్లెలి కిచ్చి యుండెను. వానికి మూలలనే గాక

అంచులం దంతట మెరమెర మెరయుచున్న గట్టి యిత్తడి బందులు తాపడము చేసియుండెను ఆ కావడిపెట్టెల ముక్కలు ఇప్పుడిక్కడ చిందరవందరగా పడి యున్నవి. ఆ యింటి యావరణలో వాని యిత్తడి బందులు, పూలు కలసి పడియుండి స్పష్టముగా గుర్తింప వీలుగా నున్నవి. ఆ పెట్టెలనిండ ఎన్నియో సామానులు గూడ తాను కొని తెచ్చి యుండెను. దంతపు దువ్వెనలు, నగిషీలు చేసిన చక్కని యద్దము, బొమ్మలు చెక్కిన దంతపు బరణి, వక్కలాకుల పొందాను. అడకత్తి—మరి తాను తెచ్చిన రకరకముల చీరలు, సూరవరములు, కామవరములు, చందనకావులు, చిలుకలచాళ్లు, హంసావళులు, బొమ్మంచులు, చెంగావులు, లక్ష్మీ విలాసంబులు, వసంతవిలాసంబులు మొదలగు రంగురంగుల చీరలు దొరకినప్పుడెల్ల కొనితెచ్చి తనచెల్లెలి కాతడు పంపియుండెను. అవి యన్నియు నిప్పు డేమైనవో? ఈ పెట్టెలగతియే వానికిని పట్టియుండునా?

అతనికి కన్నీళ్లు రాసాగినవి. అతని యనుచరులది యొక నటన యనుకొని కేరింతలు కొట్టుచు ఆ ముక్కలు చేతి కందినవి తీసికొని ఆకాశములోని కెగురవేయు చుండిరి. కాని యతని కన్నీరెంతటికి నాగకుండుటయు, తామాపనికిమాలిన ముక్కలను తాకినప్పుడెల్ల, ఆతని కొకవంక రోషములు, మరియొకవంక దుఃఖమును ప్రబలుచుండుటయు గమనించి ఆశ్చర్యముతో నిర్విణ్ణులగుచుండిరి. ఆ భటులకు తమ నాయకుని కా యింటితో నున్న యనుబంధమేమి తెలియును!

అంతట తన చెల్లెలి కుటుంబమేమైనదో యని యత డాయింటి యిరుగు పొరుగున విచారింపబోయెను. చెప్పువా రేరీ? ఆ యిళ్లను శూన్యముగానే యుండెను. తన బావ కాప్తుడైన పంటరెడ్డి యింటికి వెళ్ళి చూచెను. అదియు శూన్యముగానే యున్నది.

గ్రామస్థు లందరి వలెనే వారును తురకలు వచ్చుచుండి రను వార్త విన్నంతనే గ్రామము విడిచి పారిపోయిరి. తన చెల్లెలి కుటుంబముకూడ నట్లే పారిపోయి యుండును. తన సోదరికిని ఆ కుటుంబమునకును ఈ యాపత్కాలములో రాదగిన యిక్కట్లు తలచుకొనుచు నాతడు కుప్పకూలిపోయెను. అప్పటికి కొన్నాళ్ళనుండి దారి పొడుగున తన చెల్లెలి ముగ్ధమనోజ్ఞ పవిత్రమూర్తిని

తన కన్నులయెదుట చిత్రించుకొని, ఎప్పుడు దానిని చూచి కృతార్థుడ నగుదునా, ఏవిధముగా తన ప్రేమాతిశయము ప్రదర్శించిన తనివి తీరునా అని కలలుకనుచు నచ్చటికి వచ్చియుండెను. అతని కీ లోకములో నెవ్వరిమీదను లేని యనురాగ బంధము, ఎందువల్లనో, చెల్లెలిపై నేకమఖమై గాఢముగా హత్తుకొనియున్నది.

అట్టి చెల్లెలు కనబడకుండుటచే కలిగిన మహావ్యధ వెంటనే ఏదో అవ్యక్తమగు నాగ్రహావేశముగా మారినది. ఎవరిమీద నా యాగ్రహము? అతనికే తెలియలేదు. తన కోపమునకు గురిచేసి శిక్షించుటకు గ్రామములో మనిషిరుగే కనిపింపలేదు. వెంటవచ్చిన భటులు కొందరు విడిదికై వసతులు చూచుకొనుచుండిరి. కొందరు తమ యశ్వములకు గ్రాసములు వెదుకుచుండిరి. మరికొందరు తమ భోజనములు వండుకొనుట కేర్పాట్లు చూచుకొనుచుండిరి. మరికొందరు ఆ రాత్రికి భోజనానంతరము వదలి సుఖముగా శయనించి నిద్రించుటకు అనుగు ప్రదేశములు చూచుకొనుచుండిరి. కొందరు తామా రాత్రి భోగించుట కెవరు దొరుకుదురా యని (దిక్కులన్నియు) మూల మూలల గాలించుచుండిరి. కొందరు త్రాటిచెట్లు ఈతచెట్లు నెక్కి కల్లు దింపుటకు ప్రయత్నములో నుండిరి. ఇతరులు తాము దోచుకొనుటకు గ్రామీణు లేమి వదలిరా యని వెదకుచుండిరి.

ఆకస్మికముగా భటులకు అలాఉదీను ఆజ్ఞ ప్రకటింపబడెను. రెండు గడియలలో ప్రయాణమున కందరు సిద్ధముగా నుండవలె!

అందరికి నాశ్చర్యమైనది, ఇంత విడ్డూరమైన యాజ్ఞలు వచ్చుటకు వారలవాటుపడి యుండిరి. ఇప్పుడు డిల్లీసుల్తాను ఐన మహమ్మదుబీను తుగ్లకు వెనుక యువరాజుగా నుండగా ఎన్ని విచిత్రములగు ఆజ్ఞలు చేసి యుండలేదు? ఇపుడు మహాపండితుడని సమ్మానించి సలాములు చేసి వేలుగా సువర్ణములు కురిపించి, ఆ మరునాడే అతనినే ఉరితీయించుట ఎన్నిమారులు జరిగినది అట్టివాని సరదారులు మాత్రము ఎంత విచిత్రమైన యాజ్ఞలైన నీయగలవారు కారా? ఆ యాజ్ఞలు ధిక్కరించినవారు మరల సూర్యోదయము చూడ నోచుకొనినవారు!

రెండు గడియలలో వారు చేయుచున్న పనులన్నియు కట్టిపెట్టి యందరు ప్రయాణమునకు సిద్ధమై యాశ్వము లెక్కిరి. కటికి చీకటి!

'తానే దారి తీసెను. అశ్వముల గెట్టల చప్పుడు, వాని ఘోషలే కాని వేరు శబ్దము లేక సేన నడచుచున్నది. వారు వెళ్లునది యీ చీకటిలో నెక్కడికి? - కాఫరులు పోవు భయంకర నరకద్వారమునకా?

అతడు తన స్వగ్రామ మగు చెదలువాడకు సేనను నడిపించుచుండెను. ఆ సేనకు స్వగ్రామ మేమిటి? అది యంతయు భటులకు ఎడారి వలెను, అరణ్యమువలెను అగమ్యగోచరమ గా నున్నది. కాని తనకో? అక్కడి ప్రతి గుట్టయు, ప్రతి నీటిపట్టును గుర్తే. స్వగ్రామము సమీపించుచున్నకొలది ప్రతి చెట్టును ప్రతి పుట్టయుగూడ నతనికి గుర్తుకు వచ్చుచున్నవి.

'ఇక్కడ ఫలానాపని చేసి యుంటిని, ఇక్కడ ఫలానా ఆట ఆడి యుంటిని. అక్కడ ఫలానా వారితో పోరాడితిని. ఇక్కడ ఫలానా వారిని అల్లరి చేసితిని. ఇక్కడ ఫలానా పడుచుదాని నాడించితిని. ఇక్కడ నిట్టిగోల చేసితిని. ఇక్కడ నిట్లు కామతృష్ణ తీర్చుకొంటిని. ఇది ఫలానా కామినితో చేసికొన్న సంకేతస్థలము. కోడి పందెములు వేసిన దిక్కడనే. ఇక్కడ పొట్టేళ్ళపోరు జరిపితిని. ఇక్కడ మల్లయుద్ధము చేసితిని. ఇక్కడ దెబ్బలు తింటిని'—ఆ దెబ్బలబాధ స్మరణలో నిప్పుడు వింతసుఖము కూర్చుచున్నది.

ఇట్లు పూర్వస్మృతులతో నాత్మ నిండి పొంగులు వారుచుండ నాతడు గుండ్లకమ్మ చేరికొనెను. అదృష్టవశమున గుండ్లకమ్మలో నీళ్లెక్కువ లేవు. ఆ గుండ్లకమ్మ దాటుచుండగా, తన యశ్వము జూలు విదలింపుల పలనను, తోక విదలింపుల వలనను తనకు చన్నీటి బిందులతో స్నానమాడిన ట్లయినది గుండ్లకమ్మ దాటి స్వగ్రామము చేరు సప్పటికి సరిగా నర్ధరాత్ర మైనది!

అబ్బా! ఆపైన ఆ నా డక్కడ జరిగినది తలచు కొనుటకే యిప్పుడు కష్టముగా నున్నది. కడుపులోని ప్రేవు లన్నియు బండపలుగులతో పెకలించి వైచుచున్నట్లు విపరీత మగుబాధ యిప్పు డాకస్మికముగా వచ్చుచున్నది. ఆ రాత్రి తాను చేసినది తలచుకొనుటకే ఇపు డింత కష్టముగా నున్నదే! మరి తా నపుడెట్లు ఆ ఘోరకార్యములు చేయగలిగెను ? అప్పుడు తన్ను ఏమి యావేశించినది? ఎట్టి క్రూర రాక్షసు లైన తాను చేసిన పనులు చేయగలరా? ఎటువంటి భయంకర పిశాచము లైన నట్లు ప్రవర్తింపగలవా ?

తురుష్కులు వచ్చుచున్నా రని ఊరు అట్టుడికినట్లు ఉడికిపోయెను. పారి పోగలవా రందరు పారిపోయిరి. మ్లేచ్ఛసేనలు ఊరు ముట్టడించినవి. తప్పించుకొన్నవారు బహుస్వల్పము.

దురుసుగా తాను తనయింటికి బోయెను. తండ్రి తాపమునొందు చున్న ముఖముతో వాకిట నెదురు పడెను. తురక యాశ్వికుని వేషములోనున్న తన్ను తన తండ్రి ముందు గుర్తింపలేదు.

'నాన్నా, వెళ్ళి పొమ్మంటివే మరల వచ్చినాను—ఇప్పుడు వెళ్ళిపొమ్మనగలవా:—'

ఆ మాట లనుటతో తనకసి తీరినది. అంతకంటె తాను తండ్రి నెట్టి బాధయు పెట్ట నుద్దేశింపలేదు.

కుమారుని కంఠము స్పష్టముగా గుర్తించి నంతనే. తండ్రికి ముందు కలిగిన భయ మంతయు పోయినది.

'నీవురా, వెధవా, తురకవేషముతో వచ్చినది! ఛీ! నా కళ్ళ యెదుట పడ బోకురా భడవా! నీకు సిగ్గయినా లేదురా ?'

పెద్ద గొంతుతో తండ్రి తన్నట్లు తిట్టుచుండగా తన వెంట వచ్చిన తన భటులు కూడ వినిరి. తన కభిమానము పుట్టుకొని వచ్చినది ఆవేశము ప్రబలు చున్నది. తండ్రి యింకను తన్ను తిట్టుచుండెను. కోప మాపుకొనలేక తన చేతిలో నున్న శూలముతో తండ్రిని పొడిచివేసినాడు. తన శూలఘాతమునకు పడి పోవుచు తండ్రి యింకను తిట్టుచుండ మరల పొడుచుటకు తాను శూలమెత్తెను.

అప్పుడు తన తమ్ములిద్దరు బావురుమని యేడ్చుచు తండ్రిని రక్షింపుమని దీనముగా ప్రార్థించుచు తన కాళ్ళపై నడ్డముగా పడిరి. వారల మెత్తని కంఠములు, అనవరత వేదశ్రుతి కలవాటుపడి శ్రావ్యము లగువారి కంఠములు తన కెక్కడలేని శివ మెత్తించినవి. తన రెండు చేతులతో చెరియొకరి కంఠము నులిమి వారిని తాను విదలించి దూరముగా పడవైచెను.

అంతలో నింటిలోనుండి తల్లి వచ్చినది. ఆమె తన్ను చూచిన వెంటనే గుర్తించినది. పోనీ, ఆమె తన్ను బ్రతిమాలగూడదు? పూర్వ మట్లు బుజ్జగి చరాదు?

ఈ నా డామెచేష్ట విపరీతముగా నున్నది. తండ్రి కోపించినపుడు చాటు నుండి రహస్యముగా ఓడార్చు తల్లికా దిప్పుడు। ఆమె తన మీదికి పిశాచము వంటి ముఖముతో భయంకరముగా వచ్చినది,

'ఓరీ, వెధవా। తండ్రిని (నాన్నను) తమ్ములను చంపిన పాపిష్ఠి వెధవా పామును పాలుపోసి పెంచినట్లు నిన్ను పెంచినారురా। ఆ కత్తితో నన్ను కూడ చంపివేయరా।' అనుచు మెడ చాపి తన కత్తి ఒరలోనుండి లాగ సాగినది. ఆమె పైకి తన కత్తి పోలేదు. తన చేతులాడలేదు. ఆమె తన్ను పరిపరి విధ ముల తిట్టుచు, 'చవటవెధవా। వేసిన వీరవేషమునకైనా తగినట్లు ఉండవద్దురా।' అనుచు తనకత్తె ఒరలోనుండి లాగివేసినది. విసుగుతో ఆమెను విదలించి తాను కత్తి లాగుకొన్నాడు. ఆ కత్తి ఆమె కంఠమునకు తగిలి నెత్తురుతో దోగిన చీరతో నిస్సారముగా నామె భర్త పాదములముందు పడిపోయినది.

తా నా రాత్రి యేమి చేసెను। ఆగ్రామములోని వారు ఆపై నిక నెవ్వరు తన్ను చూచుట కిష్టపడలేదు. అందరు నెరిగినవారు. కొందరు మిత్రులు, కొందరాప్తులు, కొందరు బంధువులు

ఆ వచ్చిన తురకల నాయకుడు తమ యూరి బసవన్నయే యని తెలిసి సంతసే ధైర్యము చేసి ఎందరో తమ్ము రక్షింపు మని వేడుటకు వచ్చిరి. కొందరు తల్లులు పిల్లలను తెచ్చి తన కాళ్ళపై పడవేసిరి. కాని వారిముఖములు తానెట్లు చూడగలడు। తాను శీఘ్రముగా నశ్వ మెక్కి ఊరి బయటికి వచ్చి యా గ్రామమునకు నిప్పు ముట్టింప భటుల కాజ్ఞాపించి తన గుర్రపు ఫాజుతో, ఎవరో వెంట తరుముచున్నట్లు ఆ ప్రాంతమునుండి దూరము పడివడి వచ్చి వేసెను.

ఎట్లైననేమి? తన తల్లిదండ్రులకు సోదరులకు తాను చేయవలసిన దహనసంస్కారము ఈ విధముగా చేసినాడు. అది తలపున బారినప్పుడెల్ల తన దేహము కోటిశూలములతో పొడుచుచున్నట్లు, కోటి ఖడ్గములతో నరకుచున్నట్లు కోటి పర్యాయములు కాలి పోవుచున్నట్లు వ్యధ కలుగుచున్నది.

తా నారాత్రి కావించిన రాక్షసచర్యలు పై యధికారులకు తెలియ వచ్చి నవి. మలిక్‌నబీ వెంటనే తన్ను శ్లాఘించుచు పత్రము పంపి కొలదికాలమునకే మోటుపల్లి దుర్గములో ఉన్నతపదవి యిచ్చి గౌరవించెను. ఆ పదవితో తాను

కృష్ణానది కిరుప్రక్కల నున్న దేశము కొల్లగొట్టి ధనము మోటుపల్లికి చేరు చుండెను. గోదావరి లంకలపై దండయాత్రలు చేయుట అవసర మని తోచి మలిక్‌నబీ అందు కవసర మైన విషయములు సేకరింపు మని యాజ్ఞ లంపి యున్నందున కొంతకాలమునుండి తన భటులతో నిటువైపు సంచరించుచు నిప్పుడీ దొడ్డిపట్లకు వచ్చి యుండెను.

ఈ నా డిట్లాకస్మికముగా తన పెద్దమేనమామ కనబడుట తటస్థించినది. ఆతని చూచినంతనే చిత్రమగు పరితాపము గాఢతరముగా తన్నావేశించెను. ఇస్లాము మతము స్వీకరించి నందుకు ఎదో సిగ్గు వంటి భావము కూడ తన్ను వహించెను. బొల్లన తన్ను నిర్లక్ష్యముగా తిట్టినది విన్నప్పుడు తనకు కోపము రాలేదు. వింతగా గౌరవ మతిశయించెను. సరిగా నతడు తిట్టినతిట్లు తనతండ్రి తిట్టిన తిట్లే, తన తల్లి తిట్టిన తిట్లే! ఆ తిట్లీనాడు విన్నంతనే తన తల్లిదండ్రులే ప్రత్యక్షమైనట్లు తోచి, వారిపై అనిర్వాచ్యమగు ప్రేమభావ మావేశించినది. వారే తన్నట్లు తిట్టుచున్నట్లనిపించినది. తన తల్లిదండ్రులపై గల ప్రేమకూడ ఇప్పుడు బొల్లనపై ప్రసరించినది. అందుచే నతని దృష్టిలో నిప్పుడు బొల్లన తన పెద్ద మేనమామ మాత్రమే కాదు. ఆతడు చూచినవా రందరకు గౌరవ మావహింపజేయు అగ్రహారాగ్రణి యగు బొల్లన మాత్రమే కాడు. ఆతడే యిప్పుడు తన ముద్దుల చెల్లెలు. తన బావ, తన తల్లి, తనతండ్రి. పాపము. తన తమ్ములు! చెదలువాడలో దగ్ధ మొనరించిన తన యూరివారు. తన సర్వస్వము బొల్లనగా మూర్తీభవించి ఆతని కప్పుడు భాసించినది. బొల్లన యన్న మాటల కందుచే తన కేమాత్రము కోపము రాలేదు. ఆతని కెట్టి యాపదయు రాకుండ కాపాడవలె నని తనకు దృఢనిశ్చయము కలిగినది. ఐనను తన కట్లు అదృష్ట వశమున ప్రాప్తించిన బొల్లనను పోగొట్టు కొనుటకును అతని కెంతమాత్రము మనస్కరింపలేదు. అందుచ్చల్లనే ఖానుకు తానట్టి యాజ్ఞ లిచ్చెను.

'అయ్యో! నే నింత యార్ద్రహృదయముతో ప్రవర్తించినను ఇట్లైనదేమి పాపము. పడవ ఎక్కించి గోదావరి దాటించినను బొల్లన్నమామ బ్రతికి యుండెడివాడే! చేతులార ఈయన ప్రాణములుకూడ తీసివేసితినా? నా ద్వేష భావములకు ప్రేమ భావములకు ఒకేవిధముగా క్రూర పరిణామము కలుగు చున్నదేమీ? ఏమి యీ కర్మము! ఛీ! మా ఇస్లాముమతము ఈ కర్మసిద్ధాంతము నంగీకరింపదు. నా మనస్సు ఇంత దుర్బలమైనదేమి?'

జ్వరార్తుడైన యాతని కిట్టి యాలోచనలతో ఆ రాత్రి యంతయు నిద్దుర పట్టలేదు. తెల్లవారుచున్నది. పక్షులు కలకల లాడుచున్నవి. తూర్పున అరుణో దయమై ఉషారేఖలు ప్రసరించుచున్నవి.

మలిక్‌నబీ యొద్దనుండి వేగరి యశ్వ మెక్కివచ్చి అవసర మగు నాజ్ఞలు తెచ్చినాడు: తా నిప్పుడు ఇతర కార్యము లన్నియు వదలి, మోటుపల్లి పోయి దుర్గాధ్యక్షపదవి స్వీకరించి దుర్గము బలిష్ఠము చేయవలెను:

27

ఎర్రయ మహాభారతరచన మహావేగముతో సాగిపోవుచున్నది. అది యొక యావేశము. ఆత డట్టిది మున్నెరుగడు. రచనలో తన్మయుడైన కాల మెంతయో అతనికి ఎరుక యుంకుటలేదు. రాత్రింబవళ్లు జయకావ్య మాతని నావేశించి యుండుటయు గలదు. నిద్ర తక్కువైనది. స్వప్నావస్థలో గూడ రచన సాగుచునే యున్నది. తరచుగా నిద్దురపట్టకముందు ఆలోచించుచున్న భాగ ములు స్వప్నదశలో స్వచ్ఛాకారము నొంది పద్యరూపమున నిర్గమించు చున్నవి. అవి నిద్దురలేవగనే ఆకుపై గంటముతో నాతడు లిఖించును. ఆతని చేతికికూడ వేగ మెక్కువైనది. అక్కడి గాలిలో, ఆ గురుప్రసాదములో, ఆకాలములో నేదో అవ్యక్తమగు నూతనశక్తి యుండి, ఎర్రయ సూక్ష్మశరీరము నావహించి యోగిని గావించి అదియే నడిపించుచున్నట్లున్నది.

మల్లారెడ్డి ఎర్రయను చూడనిది ఒక్క రోజు కూడ నుండలేకుండెను. వా రిద్దరు సమవయస్కులు. ఒకరి కొకరియందు నరనారాయణులకును (కృష్ణా ర్జునులకును) వలె వారి కనురాగ మేర్పడినది. ఎర్రయను చూచినంతనే మల్లా రెడ్డి దేహమువికసించును. ఎర్రయ కంఠధ్వని విన్నంతనే మల్లారెడ్డి హృదయ వీణాతంత్రులు వాయుస్పర్శన మందినట్లు స్పందించును. ఎన్ని పూర్వజన్మము లలో వా రిరువురకు సంబంధ ముండెనో అది యిప్పు డుద్భవమైనది.

ఏ నాడైన పని తొందరలో నుండి మల్లారెడ్డి రాకున్న. ఆ నాడు ఎర్రయకు భారతరచనము గూడ సరిగా సాగదు. మాటిమాటికీ ఎవరి కొరకో నిరీక్షించుచున్నట్లు తల యెత్తుచునే యుండును. తా నాంధ్రీకరింప దలచిన

శ్లోకములు చదువుట కారంభించును. వాని యర్థమతనికి స్ఫురింపదు. మల్లా రెడ్డి మీద లగ్నమై యున్న మనస్సుకు శ్లోకార్థ మెట్లు భాసింపగలదు? రెండు మూడు శ్లోకములు చదువుట పూర్తికాకముందే, అప్రయత్నముగా నాతని తల పైకిలేచును. కన్నులు దిక్కులు చూచును. ఎంత యత్నించినను అతని దృష్టి కోశముపై నిలువదు. మనస్సు ఏకాగ్రము కాదు. చేతిలోని గంటము విశ్రాంతి తీసికొనును.

అంతలో మల్లారెడ్డి వచ్చినచో ఎర్రయ నేత్రములు విప్పారును. చిరు నవ్వు ముఖమున తాండవమాడును. చిరకాలమునకు కలసికొన్న మిత్రులవలె నాప్యాయముగా వారు పలుకరించుకొందురు. ఇద్దరి హృదయములు పొంగులు వారును. తానా నాడు రచించిన భారతభాగము ఎర్రయ వినిపించును. ఎర్రయ కంఠమును ఆతని యార్ద్రహృదయమువంటిదే. దాడిమీపుష్పమువలె, జపా కుసుమమట్లు, కుంకుమ పువ్వురీతి, అరుణకాల బాలభానుని కరణి అది మనోజ్ఞ రాజకిరణములు దశదిశలు పూరించుచున్నట్లుండును. మల్లారెడ్డి యానందపర వశుడై యాలకించును. ఎర్రయపేరే కాదు, కవిత్వమే కాదు, అతని కంఠము కూడ, వాక్కుకూడ, రాగముకూడ, రాగమయ మైనది. వానిలో దేనికి తాను ముగ్ధుడగునో మల్లారెడ్డికే తెలియదు.

తన కవిత్వ మంత యాప్యాయముగా శ్రవణము చేయు శ్రోత పై నే కవికి ప్రేమాతిశయ ముండదు? ఎర్రయకు తన కవితలో లోపములు చూపు చుండిన తండ్రిపై గౌరవ ముండెడిది; ఇతర వయస్యులపై ప్రేమ యుండె డిది. ఇంత పూర్తిగా పొగడుచున్న మల్లారెడ్డిని చూడ నాతని కాశ్చర్య మగు చున్నది. ఇతడు రసజ్ఞత లేనివాడా? కాదే! ఇతరుల కావ్యములలో దోషము లాత డట్టె పట్టి చూపుచుండ తానెన్నియో మారులు వినియుండెను. తన మీది యనురాగముచే దోషములు కనబడవా, దోషములు కూడ గుణములుగా భాసించు చున్నవా?

కాక తానే యిప్పు డంత నిర్దుష్టముగా కవిత చెప్పుచున్నదా? ఏదీ? - ఇట్లనుచు తా నా నాడు వ్రాసిన భారత భాగము మరల మరల బిగ్గరగా చదువు కొనుచు లోపములకై వెదకును. లోపములు కనబడవు. పైపెచ్చు అద్భుత ముగా నున్న దనిపించును. ఒక్కొక్క పద్యమే చదువును.

'ఇది నేను వ్రాసినదేనా ?' - ఇట్లనుచు తరువాతిది చదువును.

'ఇది నేను వ్రాసినదేనా ?' - అట్లే మరియొకటి, ఇంకొకటి, వేరొకటి- 'ఇది నేనే వ్రాసితినా ? - ఇదియు నేను వ్రాసితినా ? - ఇది వ్రాసినదియు నేనా ? -' ఇట్లు తన పద్యములు ప్రతిదియు చదువుకొనుచు మురిసిపోవు చుండును.

'ఆ రాత్రి నన్నయభట్ట కుంజరము నన్నావేశించినది. తిక్కన సోమ యాజి ప్రోత్సహించుచున్నాడు. వ్యాసభట్టారకుడే శంకరస్వామి రూపమున నన్నాశీర్వదించు చున్నాడు. నాకు పెద్దరికము వచ్చినది. నేను నిమిత్త మాత్రు డను, ఇది యంతయు నన్నయ భట్టారకుడే నన్ను పూని నాచే చెప్పించు చున్నాడు !'

ఒక నాడిట్లనుకొనుచు ఎర్రయ యా నాడు మల్లారెడ్డి ఇంకను రాలేదే మని తహతహ లాడుచుండెను. మల్లారెడ్డి కొంచె మాలస్యముగా వచ్చినాడు. అతడు రాగానే ఎర్రయ తా నా నాడు వ్రాసిన ఘట్టము వినిపించినాడు. అది సైంధవుని భీమసేనుడు శిక్షించిన పట్టు. అది విని మల్లారెడ్డి విభ్రాంతుడయ్యెను.

'ఎర్రయ్యా, నీవది కళ్ళార చూచినట్లున్నావే ?'

'చూచి నాను, సందేహము లేదు !'

ద్విగుణీకృతాశ్చర్యముతో 'ఎప్పుడు ?' అని మల్లారెడ్డి ప్రశ్నించెను.

'ఆ నాటి రాత్రి నిన్ను మొదటిసారి చూడక ముందు !'

మల్లారెడ్డి తెల్లవోయి తిలకించుచుండ, ఎర్రయ నవ్వుచు కొంచె మావల నిలిచి సంభాషించుకొనుచున్న దేసటరెడ్డిని పంటరెడ్డిని పిలిచెను.

'పంటా ! ఆ రాత్రి ఈ దేసట రెడ్డి యవనుని ఏమి చేసినాడో గుర్తున్నదా ?'

పంట నవ్వుచు నిట్లనెను. 'గుర్తు లేకేమి ? కళ్ళకు కట్టినట్లున్నది. దేసట తూల మందుకొని యా యవనుని పొడిచెను. పిమ్మట తల యొడిసిపట్టి పడవేసెను. వాడు కొంచెము కలబడగా, వాని మెడపై కాలుపెట్టి తొక్కి గట్టిగా ముష్టితో పొడిచెను. ఆ యవనుని నోటివెంట ముక్కువెంట చెవుల వెంట నెత్తురు ప్రవహించినది. మరల నెత్తి వానిని భూమిమీద వేసి పిప్పి యగునట్లు బాదినాడు - దేసటరెడ్డీ జ్ఞాపక మున్నదా ?'

దేసటిరెడ్డి చిరునవ్వుతో తానప్పుడేమిచేసినదియు ఒడలు తెలియ కున్నందున గుర్తు లే దనెను. మరల నప్పుడు ఆ పద్యములు వినిపింపుమని మల్లారెడ్డి యడుగగా ఎర్రయ చదివెను,

'ఒడిసి తల వట్టి నేలం
బడఁ దిగిచిన వాఁడు పెనఁగఁబడుటయుఁ జిక్కన్
మెడఁ ద్రొక్కి గాఢముష్టిన్
బొడిచె మొగం బలియ రక్తపూరము దొరుఁగన్.
'ఒడ లెల్లఁ బిండి కూడుగఁ
బొడిచి యెగయ నెత్తి త్రిప్పి భూస్థలి మరియున్
బడవైచి యురము మొగమును
నడిచెను వడముడి తలప్రహారకుశలుఁడై'

'మల్లారెడ్డీ, ఇది నేను చూచి వ్రాసినానా? ఊహించి వ్రాసి నానా?'
మల్లారెడ్డి 'మూలములో నెట్లున్నది!'

ఎర్రయ విని పించెను. ఎర్రయ యిక్కడ మూలములో లేని చిన్న చేర్పు లెన్నో చేసి నది గమనించి తృప్తిపడెను. 'ఎర్రయ్యా, నీ కెంత కసి ఉన్న దయ్యా?'

ఎర్రయ: 'అధర్మపరులను చూచినచో నీవు ముద్దుపెట్టుకొందువు కాబోలు!'

మల్లారెడ్డి: 'కాదు కాని భీమసేనుని వలె ప్రవర్తింప నా చేతులు రావు. శత్రువులను జయించుటవరకే పడి పోయిన వాని పై కాఠిన్యము చూపలేను. ధర్మరాజు చేసినది చదువు!'

ఎర్రయ యా భాగము చదవసాగెను:

'ఎట్టి కష్టు డైన నిట్టి పాపముసేయ
నెత్తి కొనునె ధరణి నీవు దక్క
నరుగు మింక నేమి యందుము నిన్ను నిం
ద్రియ విలోలు నల్పు ధృతివిహీను.

'ఇంక నౌ దానికి నిట్టి కొఱగాములు సేయక బుద్ధిమంతుడవై యుండు మనిన నతండు....'

మల్లారెడ్డి: 'అది నా పద్ధతి'
'ఇది మాత్రము నేను వ్రాసినది కాదా?'

ఇంతసేపును దేసటిరెడ్డి యవను లారాత్రి తన సతీమణికి చేసిన పరాభవము స్మృతిలో బారుచుండగా, క్రోధదుర్నిరీక్ష్యు డగుచుండుట గమనించి శాంతింపజేయ నెంచి పంట యిట్లనెను:

'దేసటీ, అది జరిగిపోయి నెల దాటిపోయినది. ఆ యవను డీపాటికి యమలోకము చేరి, నీవు పెట్టిన యాతనకంటె అక్కడి యాతన సుఖముగా నున్న దనుకొని నిట్టూర్పు పుచ్చుచుండును!'

ఎర్రయ నవ్వెను. 'యమభటులు కూడ మనదేసటియొద్ద నేర్చుకొన దగిన దున్న దందువా, పంటా?'

'అవును. బాబా!'

ఎర్రయ : 'పంటా, ఆ యవనుడు సైంధవుని వలెనే అప్పుడు ప్రాణములు వదలలే దనుకొందును. అర్జునునికి వలె నీకే మాట దక్కనేమో, ఎప్పటి కైనను.'

మల్లారెడ్డి సంజ్ఞ చేయగా పంట దేసటు లిరువురు మరల నావలకు బోయిరి. అప్పుడు మల్లారెడ్డి ఎర్రయకు మరింత సమీపముగా వచ్చి కూర్చుండెను. అతడేమి చెప్పునో యని ఎర్రయ యుత్కంఠతో నిరీక్షించు చుండెను.

'ఎర్రయ్యా, -'

'మల్లయ్యా, -'

వారు ఒండొరుల నట్లు పేరుపెట్టి పిలుచుకొనుటయే ఎంతో యాప్యాయముగా నుండెడిది. అంతేకాక ఆ సంబోధనలలో విశేషార్థమును ఉండును.

మల్లయ్యా, అని పిలుచు తీరు లో ధైర్య మున్నది. 'నా తల్లిదండ్రుల సంగతియు భార్య సంగతియు ఏమియు తెలియలేదా?' అను ప్రశ్న అడుగకుండగనే మల్లారెడ్డికి స్ఫురించును. అతడు ఎర్రయ్యా, యనుటలో, 'ఏమి చేయగలను? వారి వార్తలు తెలియలేదు.' అను నుత్తరము స్పష్టముగా స్ఫురించును. కాని వాచ్యముగా వా రా మాటలు చెప్పికొనరు. ఎర్రయ కడుగుటకు జంకు, మల్లయకు తన ప్రయత్నములు విఫలము లైనవని చెప్పుటకు సిగ్గు.

ఈ నా డట్లు కాదు. మల్లయయే ముందుగా ఎర్రయను సంబోధించెను. తెలియ లే దని కాదు. తెలిసినది కాని వారేదో మహాపదలో నున్నట్లు తెలిసిన దని విశేషార్థము. ఏమిటో త్వరగా చెప్పు మని ఎర్రయ యర్థము. మల్లయ్య ప్రారంభించెను,

'ఎర్రయ్యా! నీ తల్లిదండ్రులు సజీవులై యున్నారు. నీ పత్నియు జీవించి యున్నట్లే తోచును -' ఆపైన మల్లారెడ్డి చెప్పలేక యాగెను. ఎర్రయ తదేక దృష్టితో పై మాటలకై యుత్కంఠతో నెదురు చూచుచు నతని వంకకు తలయెత్తి యుండెను. కొంతతడ వాగి మల్లయ్య సాగించెను:

'ఎవరో పుణ్యాత్మురాలు చెంచులగూడెములో చెంచులక్ష్మి యని పూజింపబడు చున్నది. పంటరెడ్డి చెప్పినానిని బట్టి ఆమె వర్ణనలు నీ పత్నికి సరిపోవు చున్నవి - చిన్నయ్య కూడ నక్కడనే ఉన్నట్లు తోచును.'

ఎర్రయ కేమి యనుటకు దోపక మౌనముగా నుండ మల్లారెడ్డి యిట్లనెను :

'ఎర్రయా, మీ తలిదండ్రులు మా తండ్రి యని మేము సందేహించు చున్న పిచ్చివానితో పాటు యవనుల చేతిలో చిక్కినారు. పంట తల్లి కూడ నక్కడనే యున్నది. మహాసేన యున్న, శిబిరమైనందున వారిని తప్పించుటకు త్రోవ తోచుట లేదు!'

ఎర్రయ కుప్ప కూలిన ట్ల య్యెను.

28

బడే సాహబు ఆ విధముగా దొరకిన క్రొత్త బందీలను నరకివేయ నాజ్ఞాసించి తన గుడారమునకు పోయి విశ్రమించి తన కా రాత్రి చెంచులు చేసిన పరాభవమునే తలపోయుచుండెను. సుల్తాను కార్యము భగ్న మొనర్చి ధనము కూడ పోగొట్టి నందుకు మలిక్‌నబీ తన్ను గూర్చి ఏమిగా తలపో యునో? అతడు తనకు మరణ శిక్ష కూడ విధింప వచ్చును. అట్టి మరణమే యీ పరాభవము కంటె మే లనిపించు చున్నది. ఆవల కింకరులు బందీలను వధ్యస్థానమునకు గొంపోవుచుండగా, బందీల యరపులు అతని చెవులలో మరొక లోకములోని శబ్దముల వలె వినవచ్చు చున్నవి.

అందులో చాల గొంతు లున్నవి. వృద్ధ బ్రాహ్మణ స్త్రీ తమకర్మము నకై పెద్ద పెట్టున నేడ్చుచున్నది, భర్త యామె నోదార్చ యత్నించుచు వేదాంతవాక్యములు చెప్పుచున్నను ఆమె చెవి కవి యెక్కుటలేదు.

'ప్రారబ్ధము అను భవింపక తీరదు. వేసిన విత్తనమునకు అనురూప మైన మొలక యంకురించి నప్పుడు చింతించిన ఫల మేమి? ప్రాజ్ఞత యలవర చుకో! వృధా క్షోభపడి యేమి ప్రయోజనము! మన కులదైవము అహోబల నృసింహుని ధ్యానించు!'

వృద్ధురాలు : 'బధ్వా కశై ర్యమ భటా బహు భర్త్సయంతి
కర్షంతి యత్ర పథి పాశశతై ర్యదా మామ్
ఏకాకినం పరవశం చకితం దయాళో
లక్ష్మీ నృసింహ, మమ దేహి కరావలంబమ్!'

వృద్ధుడు : 'లక్ష్మీ పతే కమలనాభ సురేశ విష్ణో
యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్.'

ఆ మాటల మధ్య నుండి మరి యొక వృద్ధురాలి తిట్లు వినబడుచున్నవి. తన్నప్పుడు కట్టి వధ్యస్థానమునకు లాగికొని పోవుచున్న భటుల నామె తిట్టుట లేదు.తన్ను ఏనాడో అరణ్యములో విడిచిపెట్టిపోయిన పెద్దకొడుకు నామె తిట్టు చున్నది.

'ఆ పడి చచ్చినవాడు ఇంత తెచ్చిపెట్టినాడు అయ్యో-' ఆ తిట్లకు హద్దు లేకుండెను. యవనకింకరులు నవ్వుచు ఆమె పెద్దకుమారుని గూర్చి అడుగుచు కవ్వించి తిట్టించుచుండిరి ఆది వినుచున్న బడేసాహబుకు వినోదముగా నున్నది. 'చావుకు సిద్ధమైన వారిలో ఎన్ని చిత్రములు!'

అంతలో నొక కంఠము వినిపించినది. 'మహానుభావా, నా వల్లనే నీకీ యవస్థ తటస్థించినది. ఏ మైనకానీ వీరినందరిని నా ప్రాణ మున్నంత వరకు చంపి గాని నిన్ను చంపనీయను!' ఆమాటలతోపాటు సంకెళ్లు త్రెంపుకొనుటకు గింజు కొను శబ్దము వినసైనది. వెంటనే ఇనుప సంకెళ్ళ గొలుసులు తెగి పోయిన ప్రోతయు వినవచ్చినది. అంతవరకు ఆలకించుచున్న సాహబుకు

ఆ వ్యదుల మాటలు ఈ లోకము లోని వారి మాటలుగా లేనందున జాలి యే మాత్రము కలుగలేదు. కోపమును కలుగలేదు. కాని ఈ చిఱరిమాటలకు అతడు త్రుళ్లిపడెను,

నిజముగా నాత డట్లు త్రుళ్లిపడిన దా మాటలకు కాదు. చావ నున్నవా రారీతిగా డంబములు పలుకుచు కేక లిడుచు వెర్రిగంతులు వేయుట అతడెరిగినదే ఆ మాటలలో విశేషము లేదు. ఆత డులిక్కిపడి నది ఆ మాటలు పలికిన కంఠ ధ్వనికి! ఆ కంఠము తనకు పూర్వ పరిచితమైనది ఆత్మీయ మైనది. మరికొన్ని మాటలట్లే వినబడినవి ఆతనిపై బడుచున్న భటులను అదలించుచున్న మాటలు!

'ఆఁ! మా తండ్రి కోపము వచ్చి మాట్లాడినట్లున్నదే!'

అతని కాళ్లు నిలువలేదు. వెంటనే యాత డా బంధితు లున్న చోటికి వెళ్లెను.

అప్పటికి పిచ్చివా డవలీలగా తన చేతులకు కాళ్ళకు తగిలింపబడియున్న నిగళములు త్రెంపుకొని చేతికి చిక్కిన వాని ముక్కలతో భటులపై కురికి ఇద్దరిని మోదెను. వారు పడిపోయిరి. మిగిలిన వారు నివ్వెరపాటుతో నొక్క క్షణ మాగి, తేరుకొని యాతని నరికివేయుట కుద్యుక్తులై కత్తులు దూసి పైకి కుప్పించుచుండిరి

'ఆగండి!'

అట్లాజ్ఞాపించినది ఆ స్కందావారమునకు అధిపతియగు బడేసాహబు! భటులు మరింత యాశ్చర్యముతో నాగి పోయిరి

భటులపై విజృంభించిన పిచ్చివాడును నిలిచిపోయి వెనుదిరిగి చూచెను. ఆతనికి కూడ ఆ మూడక్షరములు పలికిన కంఠధ్వని విభ్రమము కలిగించెను. అతడు తేరి పార జూచుచు నిట్ల రచెను,

'ఎవడవు రా నీవు?'

'నేనే!'

'ఈ వేష మేమిరా ?'

'నీ కీ వేష మేమిటి?'

'నన్ను పిచ్చివా డనుచున్నారు.'

'నేనును పిచ్చివాడనే. మాతండ్రి పోలికే!'

బడే సాహబు ఇట్లనుచు ఆ భటుల కాతని నే మాత్రము హింసింపక తన పటకుటీరమునకు కొంపోవ నాజ్ఞాపించెను.

'నే నొక్కడనే పోను. ఈ ముగ్గురిని రక్షింపనిది నే నడుగు కదలను!'

ముఖములో భయంకర మగు పిచ్చిరౌద్రము మూర్తీభవింపగా, పిచ్చివాడు గండశిల వలె నిలుచున్న చోటస్థిరముగా నిలువబడెను. వెంటనే బడేసాహబు ఆ పిచ్చివాని మాటలకు లొంగిపోయి తన భటుల కిట్లాజ్ఞాపించెను. 'వీరంద రికి లంకె లూడదీసి జాగరూకతతో నా డేరాకు చేర్చుడు.

ఆ కింకరుల నాయకుడు సందేహించుచు వినీతుడై సలాము చేసి, వారిని నరకివేయుటకు తన కియ్యబడిన ఆజ్ఞా పత్రము సాహబుకు చూపించెను. సాహబు ఆ పత్రము తీసికొని, ముఖము చిట్లించి, అది సరిగా చూడను గూడ చూడకుండ చింపివేసి, తీవ్ర కంఠముతో, 'ఇప్పుడు ఇది నా యాజ్ఞ!' అనెను.

కింకరులు వడకుచు నట్లే చేయ బయలుదేరిరి.

బ్రాహ్మణదంపతులు మౌనముగా బయలుదేరిరి. వారి కేమియు నర్థము కాలేదు. వృద్ధురాలు గొణుగుచు లక్ష్మీ నృసింహ స్తోత్రము చేయుచున్నది.

'మాతా నృసింహశ్చ పితా నృసింహః
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః
విద్యా నృసింహో ద్రవిణం నృసింహః
స్వామీ నృసింహ స్సంకలం నృసింహః

రెడ్డి వృద్ధురాలు ఇది మరియొక యిక్కట్టుకు ప్రారంభమని భావించి తన్ను విడిచిపోయిన పెద్ద కుమారుని యథాప్రకారము దీవింపసాగినది.

'అయ్యయ్యో! ఇన్నిటికీ కారణ మాపడి చచ్చినవాడే! - నాకూ నా పసివానికీ కాకుండా చేసినాడు! -'

పిచ్చివాడు నిశ్చలముగా బయలుదేరెను
బడే సాహబు మాత్రము వారివెంట పోలేదు!

29

కోమటి వేమారెడ్డి అద్దంకి లో నొక మిద్దె యింటి లో నేకాంతమున తన మంత్రి యగు రామాప్రెగ్గడతో మంతనము సలుపుచుండెను. వేమారెడ్డి యున్నతకాయుడు. ఆతనికి తండ్రికిపూర్వ ముండెడి విలాసప్రీతి కలదు కాని యిప్పుడు ధనాభావముతో కూడిన కార్యభారముచే నిరాడంబరముగా నున్నాడు. ఆ రూపములోనే ఆతనిలో నొక రాజఠీవి యున్నది. అయినను వేమారెడ్డియు రామాప్రెగ్గడయు నిప్పుడు నిస్సహాయులై నీకసులుగా నున్నారు. ఇంటిలో వివాహము వంటి శుభకార్యము చేయవలసిన భారము పైబడినను సాధనసంపద లభింపని గృహస్థుల వలె వారు త్రొక్కిసలాడు చున్నారు.

ఆ క్రిందటి సంవత్సరము మిక్కిలి ప్రమాదకర మైనది. డిల్లీ బాదుశహా రాజధాని మార్చి దేవగిరి చేరినా డను వార్తలు వచ్చినవి. అందును గూర్చిన కథ లనేకము ప్రాకుచుండెను. డిల్లీ నిర్మానుష్య మైన దనియు పురజనులు చాలభాగము దారిలో నశించి రనియు అను వా రున్నారు.

అయినను దూరమున నెక్కడనో ఉన్నా డనుకొన్న ఢిల్లీసుల్తాను దక్షిణ దేశమున దాపుననున్న దేవగిరికి వచ్చి యున్నా డన్నవార్త దేశమెల్లెడ నలజడి కలిగించినది. సుల్తాను అశ్వబలము లసంఖ్యాకము లట, ధన మపార మట; అతని సేనలు నేలయీనినట్లు నడచునట, అతని కున్న సాధన సామగ్రి అద్వితీయము. అతని మాంజనీకులు గండ శిలల దూరము దువ్వును, కత్తులు పదునైనవి, శూలములు పొడుగు పాటివి, ధనుస్సులు బలముగలవి, నాయకులు సమర్థులు, సామాన్య భటులలో క్రమశిక్షణము ఇంచుక తక్కువైనను, వారు నిర్దాక్షిణ్యముతో కలసిన కార్యము ప్రదర్శించుట కలవాటు పడినవా రగుటచే, వారి సేనల కొక రాక్షసశక్తి కలదు, కావుననే అవి దేవగిరి సేనల నాశన మొనర్చెను; ప్రతాపరుద్రుని జయించెను; కాళింగుల హతమార్చెను; మధుర నాక్రమించెను; కంపిలి రాయల మీద కవియుచుండెనట. కుమార రాముడే వెనుకాడుచుండెనట. అతడు కుమ్మట దుర్గములో నిస్సహాయుడై యున్నాడని కొన్నివార్తలు వచ్చినవి. కుమ్మట

మెన్నడో కూలిన దవియు కుమారరామాదు లందరు నశించి రనియు కూడ భయంకరవార్తలు వచ్చినవి.

కృష్ణవేణి దక్షిణభాగమున నిన్నాళ్ళును సుల్తాను సేనలు బలముగా లేవు. ఇప్పుడు దేవగిరినుండి నూతన సేనలు ఇటువైపు తరలింపబడుచున్న వనుచున్నారు. కంపిలి పట్టువడినమాట నిజమైనచో అక్కడి సేనలను ఇటు వైపుకు మళ్ళవచ్చును. మోటుపల్లి దుర్గము బలపరచుచున్నా రట మరికొన్ని దుర్గములు కూడ స్వాధీనపరచుకొను ప్రయత్నములలో నున్నారట. ఇట్టి స్థితిలో సుల్తాను సేనలు నెదిరించి నిలుచుట సాధ్యమా?

ఈ మధ్య ఈ భాగమున తానును తన సోదరులును బంధువులును. కొంతవరకు తలలెత్తుచున్నారు. తలలెత్తినవారు ముసల్మానులచేతుల జిక్కినచో వారి తలలేమగునో వా రెరుగుదురు. తామిక పోరక తప్పదు సేనలు పెద్దవి చేసికొనవలెను, వాని కాయుధములు కావలెను. పటకుటీరములు, బండ్లు, ఆహారము . మరియు ఎన్నియో కావలెను. పాత్రలు, బీడువడిన భూములను పంటకు త్రిప్పవలెను. పాడువడిన గ్రామములు బాగుచేయింపవలెను, పంట చెరువుల గండ్లు పూడ్పించి కట్టలు వేయించి, కాలువలు మరమ్మతు చేయింప వలెను. దేశములు పట్టి పోయిన జనములకు ధైర్యము చెప్పి తిరిగి వారి వారి గ్రామములకు రప్పింపవలెను. రాజమార్గములు నిష్కంటకము లొనర్పవలెను. దుర్గములు సుల్తానుసేన లాక్రమింపక ముందే తా మాక్రమించి బలపరచి, నూతనదుర్గములు నిర్మింపవలెను.

నూతనోత్సహ మొకటి దేశ మంతట వ్యక్త మగుచున్నది. అది మొండిధైర్యము. తురకల చేజిక్కినచో ధనప్రాణమానములు వదలక తప్పదని అందరకు స్పష్టపడుచున్నది, అందుచే చేతులార ఒక్కతురకనైన నరకి మరి చనిపోవుట మంచిదని ప్రతివారికి అనిపించుచున్నది. తమ నిత్యకర్మానుష్ఠానము లతో మునిగి తేలుచు, ఇతరుల జోలికి పోనొల్లని బ్రాహ్మణులే యిప్పు డందరకు ధైర్యము చెప్పుచు ప్రోత్సహించుచు స్వయముగా సర్వవిధముల సాయ మొనర్ప సిద్ధపడుచున్నారు. కావున నిదే దేశోద్ధరణమున కనుకూలమైన సమ యము, ఇది చేయి దాటిపో నిచ్చినచో మహాప్రళ యము తప్పదు. రెడ్డి జన ముల రెడ్డరికము ఇప్పుడే సార్థకము కావలెను.

కాని ధనమేది? అవచిదేవయ సెట్టి కొంత యాయుధసామగ్రియు గజాశ్వములును త్వరలో సహాయము చేయును. ఏమైన నవి అప్పేగదా! ఆ యప్పు నెమ్మదిమీద తర్వాత తీర్చవచ్చుగాక! ఆ యాయుధములను ప్రయోగించు మనుష్యులను కూర్చుటకు ధనమేది? గజాశ్వసాధనమునకు శిక్షకులను పోషించు టెట్లు? కదలినచో ధన మవసరము. నిలుచున్న ధన మవసరము. కూర్చున్నను ధన మవసరమే. పని చేసినను నిద్రపోయినను ధన మవసరము. 'ధనమూలమిదం జగత్!'

వా రిద్దరి యాలోచనల సార మిదే! ధనమూలమిదం జగత్!'

ఆ క్రిందటిరాత్రియే మల్లినాథప్రెగ్గడ దేశమెల్లెడ తిరిగి తనయాప్తుల యొద్దనుండి వార్తలు తెచ్చియుండెను.

ఆవల అన్న మాచారెడ్డి ధనాభావముచే తనసైనికులు చెప్పినమాట వినక, దోపిడులు సాగింప నిచ్చగించుచున్నా రని వార్త పంపెను, తామే దోపిడులకు దిగినచో నింకేమి దిక్కు!

ఉదయగిరి ప్రాంతముల నున్న తమ్ముడు అన్నారెడ్డి అక్కడ నాహారము లభించుట లేదనియు, ఉన్నభటులు విచ్చిపోకుండ కూడ గట్టుకొనుటే కష్టముగా నున్నదనియు వార్త పంపెను.

మేనమామలు పోతయ, చిట్టయ, నాగయలు తాము బేరమాడిన యశ్వములకు గోవృషభములకు వెల యవసరముగా చెల్లింపవలసియున్న దని వెంటనే కొంతధన మైన పంపవలె నని కబు రంపిరి.

మల్లారెడ్డి యొక్కడే ధనసుంపు మని కోరనిది. అతడెట్లో సుల్తాను సేనల కొల్లగొట్టి బెట్టుగా నెట్లో కాలక్షేపము చేయగలుగుచున్న ట్లున్నాడు. అతనికడ వనితా జనముచే కూడ రాత్రింబవళ్ళు పని చేయించి సేనలకు కావలసిన గుడారములు, మెత్తలు, దుస్తులు ఇత్యాదికము సిద్ధము చేయించుచున్నాడు. తురక లాభాగము వదలి వేసినచో, నతడును ధనాభావముచే తనకు వార్తలంపవచ్చును.

వేమారెడ్డికి రామాప్రెగ్గడ ఒక్కటే ధైర్యము చెప్పెను: 'మన కిప్పుడు భగవంతుడే దిక్కు. నమ్మినవారి నాతడెప్పుడు చెరుపడు. మనము చేయుచున్నది భగవత్కార్యము!'

'ప్రెగ్గడా, నిజమే. నా కధైర్యము కలుగుచున్నది. ఎట్టి కష్టపు పోరిలో నైన జొరబడి ప్రాణములకు లెక్కచేయక పోరాడగలను. కాని యీ నిస్స హాయ స్థితి మాత్రము దుర్భరముగా నున్నది. పాపము, సామాన్యప్రజలు మన కేమి ఈయగలరు? వారి కున్న స్వల్ప ధనధాన్యములు సుల్తానుభటులు దోచు కొని పోవుచున్నా రాయెను !'

'వేమయ్యా, ధీరత ఇట్టి సమయములందే కనబరచవలె !'

'ఏమి ధీరత్వము? పెద్దవా డైన మాచన్నకూడా నాకే ధనమునకై వార్త పంపుచున్నా డాయెను! మా మేనమామలు నాకే డబ్బుపంపు మని కబురు !.— నే నిక్కడ డబ్బుఏమైనా కుప్పపోసికొని కూర్చున్నానా ?'

'అందరికి నీవే సమర్థుడ వని విశ్వాసము. ముందు అందరిని ప్రోత్స హించి దింపిన వాడవు, నీవేగదా! ఈ మధ్యాంధ్రభూమికి నీవే ప్రభువ వయ్యే దవు !'

వేమారెడ్డికి చిరునవ్వు వచ్చినది. 'ప్రెగ్గడా, నాకు ప్రభుత్వము కూడ కట్టిపెట్టవలె నని నీ యూహటయ్యా! ఇప్పు డీ దారిద్ర్యబాధ తొలగించుకుంటే, ముల్లోకములకు ఆధిపత్యము వచ్చినట్లు!—నాకేమీ ఉపాయము తోచుట లేదు. ఎక్కడినుండి యైన దోచుకొని రావలెను. లంకెల బిందెలకై వెదకింపవలె!. మరచితిని. నిధులు వెలికి తీయించగల నని వచ్చిన యా జంగమును పరీక్షించి నావా ?'

'అతడు, పాప మొకపిచ్చివాడు! దారిద్రముచే బాధ పడి పడి ధనముకై కలవరించి మతి చలించినవాడు. నిధి యిక్కడ నున్నది, అక్కడ నున్నది అని కళ్ళకు కనబడుచున్నట్లే మాటాడును—'

'నిధులు తీయువారికి అవి మరి కనబడవూ ?'

'నిజమే. అతని మాటలు అసందర్భముగా నున్నవి. ఈ నిధి ఈ బలి కోరును, ఆ నిధి ఆ బలికోరును అనుచున్నాడు. ఎట్లో, లాభము లేదు.'

'ప్రెగ్గడా, బలి యీయనిది నిధు లొకరుమాత్ర మెట్లు తీయగలరు? అశ్వమేధమునకు పూర్వము స్వయముగా వ్యాసభట్టారకులే పాండవులచే మహిషబలి యిప్పించి మహానిధి తీయించలేదా ?'

'ఎందుకు? అతనితో నీవే మాట్లాడి చూడు! నీతో మాట్లాడనీయలే దని అతడు నన్నావల దూషించుచున్నాడు. విను, అడుగో!

చిరునవ్వుతో కోమటి వేము డాలింపసాగెను. రామనమంత్రి తన మన స్సులో పుట్టుకొని వచ్చుచున్న చిరాకును కప్పి పుచ్చుటకు బలవంతముగా తెచ్చి పెట్టుకొన్న చిరునవ్వు నవ్వుచుండెను.

నిధులు తీయు జంగము ఆవలి తన్ను పోనీక వారించుచున్న సేవకులను తిట్టుచు ఈ పద్యము చదువు చున్నాడు.

'కోమటి వేమన దానము
భూమి బ్రసిద్ధంబు గంధభూజముచెంతన్
బామున్నపగిదిఁ దురగా
రా ముం డున్నాఁడు చేరరా దెవ్వరికిన్.'

వేమారెడ్డి! 'రామనమంత్రీ, నీకు మంచిబిరుదు ఇచ్చినాడే. ఇతనికి కవి త్వముకూడ వచ్చునే.'

'చక్కగా చదివి విద్యత్తు సంపాదించుకోలేని వారికి ఈ గాలికవిత్వము తేలికగా అబ్బును.' ఇట్లనుచు రామయ యాతని బిలిపించెను.

ఆ జంగమదేవర వేషము చిత్రముగా నున్నది. అతని మీసములు గడ్డ ములు పెరిగియున్నవి. జుట్టు స్త్రీలకువలె తలనిండ పెరిగి యున్నందున చక్కగా దువ్వి వెనుక పెద్దముడి వేసినాడు కురు లన్నియు నల్లగా నున్నవి. ముఖమున పెద్దతిలకము తీర్చినాడు. ఒడలంతట విభూతిరేఖలు. దేహము చామనచాయగా నున్నను, చర్మమునకు కాంతిలేమిజేసి నల్లని వానివలెనే కని పించుచుండెను.

అతడు సంతోషముతో రామనమంత్రిపై జయము సాధించినవానివలె విజయగర్వముతో సరాసరి వేమారెడ్డిని సమీపించెను. వేము డాతని సుఖాసీ నుని జేసి నంత నాతడు కూర్చుండియు ఆసనము కుదరక మధ్య మధ్య లేచుచు సంభాషణ మారంభించెను.

'మహాదేవశంభో! ఎన్నాళ్ళకు నీ దర్శనమైనది వేమయ్య ప్రభూ! మాకు ధనముపై కోరికలేదు. నీకు ధనము చూపి సాహాయ్యము చేయుదమని ఎన్నా ళ్లుగా ప్రయత్నించినా సాధ్యపడినది కాదు. నేటికి నీ కదృష్టము పండినది.'

'మీ దేయూరు జంగమదేవరా?'

'మాకు ఊరేమిటి, దేశద్రిమ్మరులకు? ఎక్కడెక్కడ మాకు నిధులు కనిపించినను, అవి నీబోటి పుణ్యాత్ములకు చూపుచు సంచరించుచుండుటే మావృత్తి.'

'ఇక్కడికి దగ్గరలో నిధి నీకేమైన కనబడినదా?'

జంగమదేవర కన్నులు మూసికొని కొంచెము తడవు మౌనము వహించెను. అంతట కన్నులు తెరువకయే ఆవేశముతో నూగుచున్న వాని వలె ముందువెనుకల కూగుచు పాటవంటి దీర్ఘస్వరములతో మాటాడ సాగెను.

అదుగో వేమయ్యా! నీవు కాలు పెట్టినచోటనే మాణిక్యాలగని— అదిగో, ఒకటి, రెండు-పది-ఇరవై-ముప్పదియైదు, చేరులుగా నున్నవి. మమ్ములను తీసే నాథుడేడీ అని అవి ప్రశ్నించుచున్నట్లున్నవి — రామయ్యగారూ, మీ రవతల కూచోండి; చాటుగా ఉన్నారండీ, మిమ్ములనే రామయ్యపంతులుగారూ! మీ నీడ మాణిక్యాలమీద పడి నల్లపడిపోతున్నవండీ!— అయ్యో రాతా!—అక్కడే ఉండండి—మీకు కుడి ప్రక్కనే ఇంద్రనీలమణి లెంత పెద్దవండీ! తొమ్మి దున్నవి—'

ఎంత సేపటికి ఆ సంభాషణ మాగునట్లులేదు. వేమారెడ్డి అడ్డు తగిలి అడిగెను.

'జంగమయ్యా, ఎక్కడ? ఎంత లోతున?'

'అది మమ్మడుగవద్దు; తవ్విచూడు; నూరు విండ్లలోతు తవ్వి చూడు; అక్కడ మేము చెప్పిన ముప్పదియైదు మాణిక్యాల చేరులు. తొమ్మిది నీలమణులు కనపడకపోతే మమ్మడగండి. తెలిసినదా? అప్పుడు మమ్మడగండి లేకపోతే మాతల యిదిగో కోసి యిస్తాము—అట్లా స్పష్టంగా కళ్ళకు కట్టి అగపడుతూ ఉంటే నమ్మ రేమయ్యా!—అందరూ ధనము కావలె ననేవారే దాని కవసరమైన శ్రమ పడరు. తేరగా రావలె నని వారి ఆశ;

వేమారెడ్డి తెల్లవోయి చూచుచుండ, జంగమయ్య మరల నదే ధోరణిలో నారంభించెను.

'ఈ ప్రదేశములో అంతటా నిధులే. ఏమి బంగారపు కాలయ్యా నీది వేమ ప్రభూ!—అదుగో, ఇక్కడికి పడమరగా కోసెడు దూరములో ఒక

హేమకుంభ మున్నది. అది ఒకమ్లేచ్ఛునిది. ఆనిధి నాశ్రయించిన మ్లేచ్ఛుని దయ్యము వేదవిదుడైన బ్రాహ్మణు నొక్కని బలికోరుచున్నది—'

ఆ మాటలకు వేమారెడ్డి ఉలిక్కిపడి, ఆఁ! ఆఁ! అనెను. జంగమయ్య తన ధోరణి సాగించుచునేయుండెను.

'ఏమీ లేకుండా నిదు లెట్లు వచ్చును? గుండ్ల కమ్మ ఒడ్డున ఆ రాళ్ళగుట్ల క్రింద అదిగో వరహాల మూట! అది ఒక గొడ్రాలు కడుపుకు నసిగా కూడు కూడ తినకుండ కూడబెట్టినది. దాని దయ్య మక్కడనే కాదాడు చున్నది. అది పిల్లల కోసము పలవరించి పలవరించి ఆ వరహాల మూట తన కడుపుకు కట్టు కొని చచ్చినది, ఒక్క పసిపిల్లవానిని తన కిమ్మని దీనముగా యాచించుచు న్నది. పాపము, దానికి పసిబిడ్డల మీద ఎంత మోజో! -'

జంగమయ్య అట్లు మాటాడుచునే యుండ వేమారెడ్డి సంజ్ఞ కొని, భటు డతని నావలకు చేయి పట్టుకుని బలవంతముగా తీసికొని పోయెను. అతడు వెళ్లుచు గూడ మాట్లాడుచునే యుండెను,

'వీరి కెంత ఆశ! అదిగో ఆ నీళ్లలో ధనపు పెట్టె. ప్రియుని కౌగి లించుకొన్నట్లు ఆ కామినీ గ్రహము పెట్టెను ఆలింగనము చేసుకొన్నది, దానికి చిన్నతనమునసే పెనిమిటి మరణించినాడు. పుట్టు పున్నూరాలు - దానికి -'

అప్పటికి జంగమయ్యకు తన్నావలికి తీసికొనిపోవు చున్నట్లు తెలిసి కన్నులు తెరచెను.

'అయ్యో, నన్ను రాముడు పంపించివేయనే వేసినాడూ! ముందే అను కొన్నాను.

'కోమటి వేమన దానము
భూమి ప్రసిద్ధంబు గంధభూజముచెంతన్
పామున్న పగిది తురగా
రాముం డున్నాడు చేరరా దెవ్వరికిన్.'

వేమారెడ్డి యా మాట లాలకించుచు ధీనావను డయ్యెను. 'రామయ మంత్రీ, నీ మాటలు వినక ఆశకొలది ఈ పిచ్చి వానిని రప్పించితిని. ఇతని మాటలచే ఈగది యంతయు అపవిత్ర మైనట్లున్నది. శుద్ధి చేయించనది మన

మిక్కడ నిలువరాదు. శ్రీ ఘోడెయరాయ గంగయ గురుదేవులను దర్శింప బోదమా ?'

వా రిరువురు వెంటనే ఘోడెయరాయ గంగయ గురుదేవుల దర్శింప బోయిరి. గురువులకు రామయ మంత్రి ప్రణామ మొనర్చి అనుజ్ఞాతుడై యుప విష్టు డయ్యెను. వేమారెడ్డి ప్రణామ మాచరింప, 'శీఘ్రమేవ సర్వాభీష్టావా ప్తి రస్తు !' అని గురుదేవు లాతని నాశీర్వదించిరి. మహాప్రసాదమని వేమన వినీ తుడై నిలిచినంతనే, లోపలినుండి శిష్య డొకడు వచ్చి పరమేశ్వర ప్రసాదము తెచ్చి యిచ్చెను, వేమన యది కన్నుల కద్దుకొని గ్రహించి సంభాషణ మారం భించెను.

'గురుదేవా, మేమిరువురము ఈ దినమున అపార చింతలో మునిగి యుండి తమ దర్శనమునకు వచ్చితిమి. 'శీఘ్రమేవ సర్వాభీష్టావా ప్తి రస్తు' అని తమ రాశీర్వదించితిరి. మీ వాక్కు లమోఘము లని ఎరుగుదును -'

గంగయ గురుదేవుల ముఖ మెప్పుడును ఆంతరంగికమైన యానంద ముప్పొంగుచుండ చిరునవ్వు నవ్వుచున్నట్లుండును. ఇప్పు డది బాలభానుని కిరణ స్పర్శ సోకిన కమలము వలెనే వికసించినది. వేమయ్యయే సాగించెను.

'ధర్మకార్యములు సాధించుటకు గూడ ధనమెంత యవసరమో మా కిప్పుడు తెలిసినది. మేము నిస్సహాయులమై యున్నాము. తమ యాశీర్వచన ప్రభావముచే శీఘ్రమే విశేషధనము ముందు లభింపగలదని ధైర్యము కలిగినది. అది యే మార్గమున లభింపగలదో కూడ సెలవీయగలరా?

గురుదేవులు అర్ధనిమీలితలోచనులై అంతర్దృష్టితో పరమేశ్వరధ్యాన మొనర్చి కొంతతడ వుండి, 'పిచ్చివాని వేషమున పూజ్యు డొకడు భాసించి నాడు!' అనిరి. ఇట్లని యా పిమ్మట ధన సంబంధమగు సంభాషణమున కాపై నవకాశ మీయక వారిద్దరితో ఇతరవిషయము లెన్నియో ప్రస్తావించి పంపి వేసిరి. వారు సెలవు తీసికొని తిరిగివచ్చుచు ఒకరిమొగ మొకరు చూచుకొనిరి.

'పిచ్చివాని వేషమున నున్న పూజ్యుడా?'

ఈ పిచ్చివాడు పూజ్యు డగునా? అపవిత్రమైన యూహలతో సదాగతి యగు వాయువునుగూడ మలిన మొనర్చిన జంగమదేవర పూజ్యుడా! గంగయ

గురుదేవుల వాక్యములలోగూడ నసత్యముండునా? ధర్మకార్యములకై ఇంత ప్రయత్నము ప్రారంభించినవారము, అందులకై తుచ్ఛమార్గమున ధన మార్జించుటయా? ఛీ! ఇట్లనుకొనుచు గురుదేవుల వాక్యములలోని రెండుభాగములకు సమన్వయము కుదరక యోచించుండిరి. మనస్సులో పుట్టుచున్న సందేహములు ఒకరితో నొకరు చెప్పుకొనుటకైన వారు సాహసింపలే కుండిరి. ఆలోచించి ఆలోచించి రామాప్రెగ్గడతుద కిట్లనెను;

'ఈ పిచ్చివాడేనా, లోకములో నున్నది?'

'నిజమే. ఎందరు లేరు? ఈ మహాపట్కాలమున ఎందరెందరికి పిచ్చి యెత్తలేదు? ఇదే స్థితిలో మరి రెండు నెలలపాటున్నచో మనయిరువురకే పిచ్చి ఎత్తును!"

30

వేమారెడ్డికి ముళ్ళమీద కూర్చున్న ట్లున్నది. గురుదేవుల సత్యవాక్కులెట్లు ఫలించునో యని యాతడు తక్కంతతో నిరీక్షించుచుండెను. రామయ మంత్రియు నిరంతర చింతతో నిరీక్షించుచుండెను.

తుద కొకనాటి వేకువజామున పిచ్చివా డొకడు తుపానువలెనే వడి వడి వచ్చి వేముని యింటిముందు కేకలు పెట్టసాగెను. వేముడును నిద్రమత్తున కన్నులు నులుముకొనుచు బయటికి వచ్చెను.

ఆ వచ్చిన పిచ్చివాడు త్రుటికాలము సందేహించి ముందుకు వేయుచున్న అడుగు వెనుకకు లాగెను. మరల నంతలో నిలువ ద్రొక్కుకొని ముందుకు వచ్చి, 'నాయనా!' అనుచు వేముని బిగ్గ కౌగిలించుకొనెను. వేమనయు గురు వాక్యములు మనస్సున బారుచుండ పిచ్చివానిని గౌరవముతో 'మా తండ్రీ!' యని కౌగలించుకొనెను. పిచ్చివాని వేషమున నున్న పూజ్యుడు!

'మా నాయనే!' అనుచు ఆదరాతిశయముతో పిచ్చివాడు మరింత గట్టిగా కౌగలించుకొనెను. 'మా తండ్రీ!' అనుచు వేమనయు నాతని మరింత గాఢముగా కౌగలించుకొనెను.

'నీవురా, నీ తండ్రిని ఏ యాకారములో నున్నను గుర్తించిన బుద్ధి మంతుడవు!— నిన్న బంగారముతో నింపివేయ వచ్చి నానురా, వేమయ్య తండ్రీ!—' ఇట్లనుచు పిచ్చివాడు కౌగిలిసడలించెను.

ఆ మాటలు విని వేమన శ్రద్ధగా పిచ్చివాని వంక తిలకించెను అతడు నిజముగా తన కన్నతండ్రి యే యని అంతవరకు వేమనకు తోచియుండలేదు. ఇప్పుడు చూడగా పెరిగియున్న యా పిచ్చివాని మీసములు గడ్డములలోనుండి కోపుగా పొడుచుకొని వచ్చుచున్న ఘోణనాసిక గుర్తుపట్టినాడు వాని మధ్యనుండి తెరచి మాట్లాడుచున్న మహాబిలమునంటి నోరును గుర్తించినాడు. ముఖము మీద వ్రాలుచున్న పిచ్చిజుట్టులోనుండి విశాలమగు ఫాలభాగము కానవచ్చినది. శరీర మంతయు వికృతముగా నున్నను, ఆతని ప్రతియవయవము నందున ద్యోత మాన మగుచున్న పటిష్ఠత స్పష్టముగా జ్ఞాపకము వచ్చినది. ఇతడు తప్పక తన తండ్రియే, ప్రోలయయే, ఆ కంఠధ్వనికూడ నిశ్చయముగా తన తండ్రిదే!

వెంటనే వేమన్న కన్నీరు కార్చుచు తండ్రిపాదములంటి నమస్కరించి ఆతని పాదములు తనరెండు చేతులతో కన్నుల కద్దుకొని గద్గద కంఠముతో నిట్లనెను:

'తండ్రీ, ఎన్నేళ్ళకు నీదర్శన మిచ్చి అనుగ్రహించినావు నీ కుమారుని!. ఈ యానందవార్త పూజ్యురా లగు అమ్మకు వెంటనే తెలియ జేసెదను!'

ప్రోలయకు ఆనంద బాష్పములు ఏకధారగా కారుచుండెను. నోట మాటయే వచ్చుటలేదు. కుమారునిభక్తి కతకు పరవశు డయ్యెను. పితాపుత్రు లిట్లు కొలదిసేపు గడిపినంతలో సూర్యోదయ మగుచుండెను.

అప్పుడు వేమన తండ్రిని లోనికి గొంపోయి సుఖాసీనుని జేసి, మంగలిని పిలిపించి కేశసంస్కారము చేయించి, అభ్యంగనముకూడ చేయింప బంపెను. ప్రోలయ దీక్షముగిసిన వాని వలె నడ్డు చెప్పలేదు. స్నానానంతర మున వేమన్న తండ్రికి విలువగల సరిగంచు వస్త్రములు కట్ట బెట్టి. కస్తూరి కాది సుగంధ ద్రవ్యము లర్పించి పూజించెను.

ఒక్కసారిగా ప్రోలయకు వెనుకటి తన భోగాల సత జ్ఞప్తికి వచ్చినది. ఆ విలాసద్రవ్యము లన్నియు నాతనికి క్రొత్తవిగా కాక చిరకాలాభ్యస్తము లుగా రాణించెను. ఆతని పిచ్చి యాకార మదృశ్య మైనది.

వేమన రామాగ్రెడ్డను పిలిపించి తన తండ్రి యాగమనము వింత విపరించెను. తక్షణకొరకు శీఘ్రగామీలగు దూతల బంపి, సోదరులకు, మాతామహునకు, మేనమామలకు, బావమరదికి వార్త పంపెను. ఆనాడు అద్దంకిలో నున్న బంధుమిత్రుల నందరిని విందుకు పిలిచి యుత్సవ మొనర్చెను.

ప్రోలయకు ఆనంద ముద్వేల మగుచున్నది. వేమారెడ్డి తండ్రి రాకకు ఒకప్రక్క ఆనందించుచున్నను, మరియొక ప్రక్కనుండి ఆతనిని విషాదరేఖ ఆవేశించుచునే యున్నది. అతడు త్వరలో ధనాభావముచే క్రుంగిపోవునట్లు నాడు ఈ పటాటోపము వేషము అతడింక సాగింపలేడు. ఋణ భారముతో క్రుంగిపోవుచున్న వాని యవస్థలో నత డున్నాడు. త్వరలో నీ బాహ్యాడంబర. మంతయు విచ్చిపోక తప్పదు. సరిగా నిట్టి కష్టసమయముననే ఇన్నాళ్ళకు తండ్రి వచ్చి నా డేమి? ఈ కష్టము తన తండ్రి చూడవలసి వచ్చిన దేమి?

కుమారుని విషాదరేఖ తండ్రి గమనించెను. అతనికి స్థితిగతులేమియు తెలియకున్నను, ఆతని ప్రేమాతిశయమే ప్రియపుత్రుని విచారమేదో పీడించు చున్నదని కనుగొన జేసినది. ఆ రాత్రి ఏకాంతమున కుమారునితో ప్రోలయ సంభాషించెను.

'ఏమిరా, వేమా! నిన్నేదో చింత బాధించుచున్న దేమిరా?'

'చింత ఏ మున్నది? నీవు వచ్చినందుకు ఆనందము ఎట్లు ప్రకటింతునా అనియే నా చింత!'

'నావద్దకూడ దాపరికమేనురా? నీ చింత తీర్చుటకు నా చేతనైన సహాయము చేయగూడదా? చెప్పరాదురా?'

'నాయనా, అసమర్థుడ నా నేను? పెద్దవాడవు. బహుకాల మరణ్యవాస క్లేశ మనుభవించి నేడే తిరిగి వచ్చినావు. నా కష్టము లన్నీ చెప్పికొని నిన్ను బాధపెట్టుట భావ్యమా?—ఈ మధ్య ఈ దేశపు స్థితిగతు లెట్లున్నవో నీకేమైన తెలియునా?'

'కొంత కొంత తెలియక పోలేదులే. నీకు సహాయపడవలె ననుకోరిక తోనే ఇటు వచ్చినాను రా!'

'తండ్రీ, నీ బాహువులలో బల మింకను తగ్గలేదు. కాని వాని తేజస్సు మా అన్నదమ్ముల బాహువులలో నిక్షేపించినావు. ప్రస్తుత మవి చాలును. నీవు విశ్రాంతి తీసికొనవచ్చును.'

'నాకు విశ్రాంతి ఏమిటిరా, ఇవటకు వలెఁ మాంద్యము విశ్రాంతియాఁ నాకు సూర్యకవి ఉద్బోధించినాడు. నేను సర్వవిధముల సాయము చేయగలను.'

'నాన్నా, కోపగింపకు! నీవు సాయముచేయగలది కాదు నా చిక్కు! అరణ్యవాసము నుండి ఇప్పుడే వచ్చిన వాడవు, ఇక్కడ మా కష్టము లూహింపలేవు—'

ప్రోలయకు చిత్రముగా కోపరేఖ పొడసూపినది. అతడు మాట్లాడ కూరకుండెను. వేమన్నయది గమనించి చెప్పివేసినాడు.

'ఇది చెప్పలే దని నాపై కోపింపకు! - నిన్ను బాధ పెట్టుట కిష్టము లేకనే సందేహించితిని. అయితే చెప్పుచున్నాను, వినుఁ నాకు ధనము కావలసి యున్నది.'

ప్రోలయ కోప మంతయు ఒక్కపెట్టున నవ్వుగా మారినది. అతడు పకపక నవ్వుచు కుమారుని వీపుమీద చరపు చరచెను. తండ్రికి వెర్రి యావేశించిన దని వేమన్నకు భయమగు చుండెను.

'నీ కెంత ధనము కావలెరా ?'

'ఎంత యని చెప్పేది ? యెంతయైన కావలెను.'

'ఒక పుట్టెడు బంగారము చాలునా ? ఎన్నాళ్ళలో కావలె ?'

తండ్రికి పిచ్చియే యని నిశ్చయించి మర్యాద కోసమై వేమన్న యిట్లు త్తర మొసగెను.

'ఒక్క మణుగు బంగారము వారము రోజులలో దొరకిన చాలును. ప్రస్తుతము ఈ గడ్డు తీరును.'

'ఒరే వేమా: దిగులు పడబోకు! నీకు సహాయము చేయగలను. ఐతే ఒకటి చెప్పు. ఆ హేమము నీవు దేని కుపయోగింతువు ?'

విధిలేక వేమన తండ్రి కుత్తర మిచ్చెను. 'నా కెందుకు ధనము, తండ్రీ ? లోకోద్ధరణకు, వేదల రక్షించుటకు, దీసుల పోషించుటకు, అనాథుల నాధవంతుల జేయుటకు, భూసురుల నగ్రహారములలోను, దేవ ప్రతిమల నాయ తనములలోను ప్రతిష్ఠించుటకు - దుష్టులను శిక్షించుటకు -'

'నిజముగానా, నా తండ్రీ ? అయితే అట్లు ప్రమాణము చేయి! నే నిచ్చే కనకము చిన్నమెత్తు కూడ నీ భోగములకు విలాసములకు వెచ్చింపనని ప్రమాణము చేయి!'

వేమారెడ్డి కంతయు అబ్బురముగా నున్నది. తాను చూచిన జంగమయ్య వలెనే తండ్రి కూడ పిచ్చివాడే యని యతడు మనస్సులో స్థిరపరచు కొనెను. అయినను తండ్రి కోరెడి దానిలో తప్పేమియు లేదు. ఘోర పాతకములు చేయుచున్న జంగమయ్య పద్ధతి కాదిది. ఏ ధర్మదేవతకై తాను దీక్ష పూనెనో, ఏ ప్రతిజ్ఞ తాను గురువుల సన్నిధి నొనర్చెనో, తండ్రియు నదియే కోరుచున్నాడు. వెంటనే యాతడు తండ్రి కోరినట్లు దేవ బ్రాహ్మణ సాక్షిగా, శ్రీ గురు దేవుల శ్రీ పాదసాక్షిగా, పూజ్యులగు తల్లిదండ్రుల సాక్షిగా, ధర్మదేవత సాక్షిగా ప్రమాణ మొనర్చెను అది విని ప్రోలయ సంతోషముతో ఉప్పొంగుచు నిట్లనెను.

'సంతోష మైనదిరా. నేనీ పదునైదేండ్లు అడవులలో గడపిన కాలము వృథచేసితి ననుకొంటివిరా ? నేను దరిద్రుడ ననియేనా నీ యూహ ? నా తపస్సు ఇప్పుడు ఫలించినది. కావలసినచో నీకు మూడు నెలలలో ముప్పది పుట్ల బంగారము చేసి పెట్టగలను. నీ కది దాచుటే కష్టము కాగలదు!'

తండ్రి మతిభ్రమణపు మాటలకు వేమారెడ్డి దిగులుతో చూచుచుండెను.

'నవ్వవురా, నా మాటలు ? పిచ్చికట్టే! అయితే ఒక మూస, కుంపటి, నీకెంత బంగారము కావలెనో అంతరాగి తెప్పించి యిమ్ము! తెల్ల వారేసరికి అంత బంగార మిచ్చెదను. మనుష్యమాత్రు లీ ప్రాంతములో ఉండ కూడదు సుమా! ఈ గదిలో తొంగి చూచిన వారి ప్రాణములు తీసివేసెదను. నీవు కూడ ఉండరాదు, చూడరాదు సుమా! తెలిసినదా ? రేపు సూర్యోదయమైన తర్వాత తలుపులు తీయవచ్చును.'

ఇప్పటికి వేమారెడ్డికి గంగయ గురుదేవుల వాక్యములు స్మరణకి వచ్చి కొంతధైర్యము కలిగినది. కొంతరాగి, అది సులభముగా పట్టెడి మూస, కుంపటి వేరు వేరు ప్రదేశములనుండి ఏదేదో నెపముతో వేరు వేరు మనుష్యుల పంపి తెప్పించి, తండ్రి కవి యప్పగించి, గది తలుపులు బిగించి, వేమారెడ్డి స్వయముగా కాపుగా వాకిటి కెదుట దూరముగా నారాత్రి పరుండెను.

మరు నా డెంత సేపటికిని తండ్రి తలుపులు తీయుమనలేదు. సూర్యోదయ మైనది. లోపలనుండి మాట రాలేదు, ప్రొద్దెక్కుచున్నది. లోపలనుండి మాట వచ్చునని శ్రద్ధగా నాలించుచు నత డచ్చటనే యుండెను. లోపల నిశ్శబ్దముగా నుండెను. జాము ప్రొద్దెక్కినను తలుపులు తీయు మన్నమాట రాలేదు. అప్పటికి వేమనకు ఉత్కంఠ యెక్కువై తండ్రి యనుజ్ఞ స్మృతికి తెచ్చుకొని 'సూర్యోదయమై జాము దాటినది!' అని ముందు బిగ్గరగా చెప్పి, ఉత్తరమునకై క్షణమాగి, నెమ్మదిగా తలుపుతీసి చూచెను.

ప్రోలారెడ్డి లోపల గాఢముగా నిద్రించుచుండెను. అక్కడ కుంపటి లేదు. మూసలేదు. ఏమియులేదు. కుమారుని అడుగుల యలికిడికి ప్రోలయ లేచి కన్నులు నులుముకొనుచు, 'నాయనా, సూర్యోదయ మైనదా?' అని యడిగెను.

'జాము ప్రొద్దెక్కినది'

'అట్లా? రాత్రి నిద్దరలేదు ఇదిగో రా నీ రాగి!'

చిన్నవోయిన మోముతో వేమారెడ్డి తన తండ్రి ఉత్తరీయము చాటు నుండి తీసి యిచ్చిన ముద్ద యందుకొనెను. చేతిలో నది బరువుగా తోచినది. పైన కప్పియున్న పత్రములు తీసి చూడగా నది రాగి కాదు. బంగారపుముద్ద! పచ్చగా మెరయుచున్న బంగారపు ముద్దయే!

వేమారెడ్డి నిర్ఘాంతవోయి తన కన్నులు తాను నమ్మలేక ఆలోచించుచుండెను.

'ఇది బంగారపు పూతకాదుగదా! - రాగి కింత బరువెక్కడిది? బంగారమే!' అని నిశ్చయించి, యా బంగారపుముద్ద కన్నుల కద్దుకొని, తన యుత్తరీయము పరచి యందులో నుంచి, 'తండ్రీ!' యనుచు వేమారెడ్డి తన తండ్రి రెండు పాదములను గాఢముగా కౌగిలించుకొని, భగవంతుని వలె ప్రత్యక్షమై రక్షించినావు! నీకు నేను శరణ్యాగతుడను!' అనెను.

ప్రోలయ కన్నులు చెమ్మగిల్లెను. 'నాయానా, నా ముద్దుల కొడుకుకు కూడ చెప్పరాని పరమ రహస్యమురా, ఇది!'

'నీ రహస్యము నా కక్కరలేదు. నాకు కావలసిన బంగారము నా కిచ్చుచుండుము. మనకు ధర్మదేవత తోడుగా నున్నది. ఈ బంగారము నా పాలిటి

కామధేనువుగా చేసికొని యీ మధ్యాంధ్రదేశము యవన నిర్ముక్త మొన రింతును!'

ప్రోలయ నిలువున పొంగి పోయెను. తాను పాపము చేసితి నని సూర్య కవి నిరూపించిన దాది దానికి నిర్వృతి చేసికొనుటకై యతడు తహతహ లాడుచుండెను. ఈ విధముగా తన కది ప్రాప్తించు నని ధైర్యము కలిగినది.

31

చెంచులలో రెండు చీలిక లుదయించినవి. యవనుల యొద్దనుండి పెద్ద దొరయగు భీమరాజు తెచ్చుకున్న ద్రవ్యములో చిన్న దొరగుంపుకు భాగము పెట్ట లేదు. అది తెచ్చినట్లు గూడ చెప్పలేదు. చిన్నదొర యగు తోకరాజు కది తెలిసి నంతనే అతనికిని అతని యనుయాయులకును భీమరాజుపై ద్వేషము జనించినది.

భీమరాజుకు మత్తు ఎక్కువైనది, చెంచులక్ష్మి యవతారముచే నెక్కడ లేని ధైర్యము వచ్చినది. ఎంత ధైర్యము లేనిది తురకలు చూచుచుండగనే వారి యొద్దనుండి అంత ధనము నిబ్బరముగా పట్టించుకొని రాగలడు!

భీమరాజుపై కసి తీర్చుకొనుటకై తోకరాజు యవనులతో చెలిమి చేయ వలె నని మొదట ఆలోచన పడెను. కాని పెద్దదొర ధనమెత్తుకొని పోయినట్లే ఎత్తుకొని పోవుటకు మరియొకడు వచ్చినాడని తనపై భీమరాజు మీది కసి యంతయు యవనులు తీర్చుకొన వచ్చును. అందుచే వారలతో కలియుటకు చేయు యత్నము ప్రమాదకరము.

తన తమ్ముడు సుగ్రీవు డిప్పుడు మల్లారెడ్డి యధీనములో నున్నాడు. ఆతనిని ద్రావిడసెట్టి మల్లారెడ్డి కప్పగించి పోయెను, తనతో మాటాడి పొమ్మని తమ్ము డెన్నియో వార్త లంపియుండెను. మల్లారెడ్డి మాట తప్పనివా డని ప్రసిద్ధి కలదు. అతనితో మైత్రి సలుపుట శ్రేయస్కరము, ఇట్లాలోచించి కృష్ణా నదీ జలములనుండి తాను సేకరించిన పెద్ద వజ్ర మొకటియు, మంచి పుట్ట తేనెయు కానుకలుగా తీసికొని, నలుగురు చెంచుదొరలు తోడు రాగా, ఒకనాటి రాత్రివేళ మల్లారెడ్డి దర్శనమున కాతడు బయలుదేరెను. ఆ వజ్రము విలువ ఆతనికి తెలియదు. అది పెద్ద పద్మరాగమణి. అట్టి మెరుగు రాళ్ళను బయలుల

కాపుర ముండు సామాన్య మానవులు విలువగల దానిగా భావింతు రని మాత్రమే అత డెరుగును.

ఆనాటి యర్ధరాత్రమునకు వారు మల్లారెడ్డి యుండెడి ప్రాంతములకు పోయి, 'మల్లారెడ్డీ, మల్లారెడ్డీ, శరణా గతులము!' అని ముమ్మారు కేకలు పెట్టిరి.

కొంతవడికి సందేహించుచున్న ప్రతిధ్వని వినిపించినది. 'ఎవరు మీరు?'

'మేము చెంచులము. చిన్నదొర తోకరాజు నిన్ను శరణు చొచ్చుచున్నాడు'

'ఏమి విశేషము?'

'పెద్ద చెంచుదొర భీమరాజు దుండగములు భరింపలేక చిన్న చెంచుదొర నీ స్నేహ మర్థించుచున్నాడు.

మీ విండ్లు, బాణములు కత్తులు దూరముగా నుంచుడు!'

వా రట్లు చేయగా నా యాయుధములు రెండు నిముషములలో మాయమైనవి. అంతట కవచాచ్ఛాదితులై మల్లారెడ్డియు, విస్సనయు కనిపించిరి. వారు ఖడ్గములు శూలములు ధరించియుండిరి. వారేదో కార్యాంతమున కాననసంచార మొనర్చుచు చెంచుల యాక్రోశ మాలించి వచ్చినట్లున్నారు. వారికి చెంచులు వినీతులై ప్రణామ మొనర్చ.పద్మరాగమణిని పుట్టతేనెయు కానుక లర్పింప విస్సన ఆవరముతో వారి కూర్చుండు డనెను. మల్లారెడ్డియు విస్సనయు ఒక కొండ రాతి పలకపై నుపవిష్టులైరి. వారి కెదురుగా తోకరాజు మాత్రము కూర్చుండెను. మిగిలిన చెంచు లాతని వెనుక నిలుచుండిరి. తోకరాజు తన కథ యంతయు నివేదించుకొనెను.

ఆతని మాటల పద్ధతిలో క్రొత్తదన మున్నది. ఆ తీరు ఆ భాష వేరు. కొన్ని యక్షరములకు లేని దీర్ఘములు కలుపుట, కొన్నిటి దీర్ఘములు కోసివేసి హ్రస్వముగా నుచ్చరించుట, మాటి మాటికి మల్లారెడ్డిని విస్సన మంత్రిని సంబోధించుచుండుట, సూటిగా చెప్పదగినది. ఎన్నియో మాటలతో డొంక తిరుగుడుగా చెప్పుట - ఇట్టి వికారము లెన్ని యున్నను, అతని సంభాషణములో విశేష బుద్ధి కుశలత వ్యక్త మయ్యెను.

ఆతనితో వ్యవహార విషయములు మాట్లాడుట విస్సనమంత్రికి కష్ట మనిపించెను. తోకరాజు ఎంతో వినయముగా మాటాడును. తన కిష్టము లేనిది ప్రశ్నార్థకముల తోడనే కాదనకుండ కాదనును. తనకు కావలసినది లభించి నచో నది పట్టుకొని వదలడు, బిగువు వినయము చిన్నదొర వ్యవహార దక్ష తను ప్రదర్శించు చుండెను.

'మీ పాదము లాశ్రయించి మీ యండ సంపాదించుకొన వచ్చాము. తప్పు లుంటే మన్నించండి, దొరలూ దండాలు!'

విస్సన : 'మీవల్ల తప్పు లేవీ లేవు. మీ వల్ల మాకు కావలసిన చిన్న పను లున్నవి.'

'మేము వట్టి దిక్కు లేని పచ్చులము పెబూ! పెబువులకు మీకు మా వల్ల కావలసిన పనులు కూడానా? అయ్యో దొరా, మేము మీకేమి చేయగలము దొరా?'

'మీరు చేయ గలిగి నదే.'

'మీకేమి కొదవ పెబూ?'

'మీ మైత్రి యొక్కటే మే మాశించునది.'

'అయ్యోదొరా! అది వేరుగా అడుగవలెనా, మీ దాసులము!'

'మా కొక జాడ కావలె. మా మిత్రులలో ఒకరి తమ్ముడు ఒకరి భార్య కనుబడుట లేదు. వారి జాడలు తీయవలె.'

'ఈ యరణ్యములో ఈ రోజులలో ఎందరో కనబడకున్నారుగా పెబూ!'

'మీ చెంచు గూడెములలో ఎవరినైనా బంధించినారా?

'లేదు, ప్రభూ, లేదు'

'ఎవరైనా క్రొత్తవా రున్నారా?'

'మా చెంచులక్ష్మి అవతరించినది, ఒక పరిచారకుడు, దొరికి ఆమెను కొలుచు చున్నాడు.'

'చెంచులక్ష్మి ఎన్నేళ్ళది?'

'లక్ష్మీదేవికి వయస్సేమిటి, దొరా? దేవతల కందరికీ పదహారేళ్ళకు తక్కువ కాదా, పెబూ?

'పరి చారకునకో?'

'అంతకంటె చిన్నవాడు.'

'చెంచులక్ష్మి అవతరించిన దెప్పుడు?"

'పున్నమ నాటి రాత్రి!'

'ఎక్కడ?'

'నాగలూటి సెలయేటి (యొద్ద) కాడదొరా?'

ఇప్పుడు చెంచులక్ష్మి యెక్కడ నున్నది?

'ఇది యంతయు ఎందుకు, దొరా? నా ప్రాణముల మీదికి వచ్చును'

'ఏమి?'

'మా పెద్దదొర గూడెము వద్ద ఉన్నది'

'ఎక్కడ?'

'పాతాళగంగ వద్ద నరసింహబిలములో దొరా'

మరి ముసలి బ్రాహ్మణ దంపతులు. ఒక వృద్ధురాలుకూడ ఉండవలెనే. వా రెప్పుడైనా కంటబడిరా?'

'చెంచులక్ష్మి అవతరించిన రోజుననే వారు తప్పించుకొని పోయిరి.'

దీనితో చెంచులక్ష్మి ఎర్రయ పత్ని మహాలక్ష్మియే యై యుండవలెనని విస్పనకు మరింత ద్రువపడినది.

'చెంచులక్ష్మి అవతరించిన అదృష్టము మీకందరకు అక్కరలేదా? మీ గూడెమునకు తీసికొని వెళ్ళరాదా?'

'అమ్మో! ఆ తల్లి యిష్టము ఆమె నెవరు తీసికొని పోగలరు, దొరా?'

'శ్రీ శంకరస్వాములు చెంచులక్ష్మిని చూడవలె నని కాంక్షించుచున్నారు, స్వామివారికి దేవత లందరు స్వాధీనులు.'

'అమ్మ బాబో!'

'చెంచులక్ష్మిని తమ ఆశ్రమము చూచుటకు రమ్మని వారు వ్రాసి పంపిన శ్రీ ముఖపత్ర మిదిగో! ఆమె కిది చూపినచో, నీ యిష్టము వచ్చిన ట్లామె బయలుదేర గలదు. నీ వామెను శ్రీ స్వాములవారి ఆశ్రమమునకు తీసికొని రావలె.'

ఇట్లు నుచు విస్సన తోకరాజు చేతికి ఒక పత్ర మిచ్చెను. చిన్న దొర యా పత్రము తాకుటకే భయపడెను. కొంతసేపటికి దానికి దండము పెట్టి, కన్నుల కద్దుకుని యతడు తీసికొని తన శిఖలో పదిలము చేసికొనెను. ఆ క్షణము నుండి తోకరాజు ప్రవర్తనము మారిపోయెను, అతడు భయముతో మిర్రి మిర్రి చూడదొడగెను;

తోకరాజు : 'చెంచులక్ష్మికి అపాయ మేమియు రాదుకందా, బాబూ? స్వామివారు మాకు మా లక్ష్మిని దయసేతురా?'

విస్సన : చెంచులక్ష్మికి ఏమి సమ్మతమైన అదియే స్వామివారును చేయు చుందురు.'

తోకరాజు పాప మా తల్లి ఎంతో చిక్కిపోయినది. తల దువ్వుకొనదు. అలంకారము లెన్ని అర్పించినను ఒక్కటి కూడ ముట్టదు. ఆమె కేదో దిగులు న్నట్లున్నది, పెభూ!'

విస్సన : 'స్వామివారిని చర్మింపవలె నని ఆమెకు బొత్సాక్య ముండును.,

'కాబోలు, పెభూ!'

'చెంచులక్ష్మి దర్శనమునకు పోయినప్పుడు ఆమె కీ పత్రము ఇచ్చిన జాలును.'

'ఆమె బయలు దేరునా?'

'తప్పక.'

'మా పెద్దదొర తెలిస్తే చంపివేయడూ?'

'రహస్యముగానే అందించు!'

'ఆమె వచ్చేవేళ పెద్ద దొర అడ్డగించిన?'

'చెంచులక్ష్మి అతనిని చీవాట్లు పెట్టును. మరీ మొండితనము చేసినచో పెద్ద దొరను శిక్షించుటకు మల్లారెడ్డి పరివారముతో సిద్ధముగా నుండును.'

చిన్న దొర భయముతో వడకుచుండెను. 'అయ్యో బాబూ! మా చెంచులు నన్ను పాతివేయరూ?'

విస్సన : 'నీకు సాయము కావల నన్ననే దొరా ! లేకున్న, నెవ్వరూ రారు,'

తోకరాజు : 'చిత్తము. దూరాన ఉంచాండి, బాబా! మేము కొమ్ము పట్టినాప్పుడే తోడురాండి!'

మల్లారెడ్డి తల యూపుచు, 'భీమరాజు గూడెములో చెంచు లెంద రున్నారు?' అని ప్రశ్నించెను.

తోకరాజు : 'మాకు లెక్కలు తెలియాపు, దొరా! చాలామంది ఉందురు ఒక పెద్దగుంపు.'

మల్లారెడ్డి : 'నీ కెంతమంది ఉన్నారు?'

తోకరాజు : 'నాకు చిన్న గుంపు.'

మల్లారెడ్డి : 'మరి నాతో ఎందరిని తీసికొని రావలె?'

తోకరాజు ; 'ఎందుకులే, దొరా! ఒక గుంపు తీసికొనిరాండి! దగ్గరకు రాకుండి, నేను కొమ్ము పట్టితేనేగాని పెద్దదొరకు చెంచులక్ష్మిచేత చెప్పించి మా కా ధనములో భాగము పెట్టించ వలె, దొరా!'

విస్సన : 'ఏ ధనము లో?'

తోకరాజు : 'ఇందాక చెప్పితిని కాదా? తురకలవద్ద తెచ్చిన ధనములో.'

విస్సన : 'అదా? చెంచులక్ష్మి వచ్చిన అదృష్టము చూచినావుగదా! దేశ మంతటిని కొల్లగొట్టే తురకల యొద్దనే మీ భీమరాజు పెద్దలాభము కొట్టి నాడు నీవు కూడ ఆపని చేయకపోతివా, చెంచుదొరా?'

తోకరాజు : 'వారింకా మమ్ము నమ్ముదురా? కనబడితే నరికివేయరా, దొరా?,

విస్సన కిప్పుడు చిన్నదొర యనను ల యొద్దకు పోక తమయొద్ద కేల వచ్చెనో స్పష్టముగా నవగత మైనది.

'చిన్నదొరా, నీకు చెంచులలో పెద్దదొరతన మక్కరలేదా'

తోకరాజు : 'పెద్దదొర ఎందుకు వదలును?'

విస్సన : 'అట్లు మేము చేయించినచో!'

తోకరాజు : 'నేనే పెద్దదొర నవుదును. పాతాళగంగవద్ద గూడెము. పెద్దగుంపు నా క్రిందికి వచ్చును.'

మల్లారెడ్డి : 'తోకరాజా, నిన్నిప్పుడే చెంచురాజ్యమున పెద్దదొర పదవికి పట్టము గట్టుచున్నాను.'

అది విని తోకరాజుతో వచ్చిన నలువురు చెంచులు చిత్రముగా నాట్యము చేయ దొడగిరి. సరిగా నా సమయమున ఏదుబంది యొకటి అటువచ్చి, మనుష్యుల అలికిడి విని, పొదచాటున దాగి ముట్టె ముందుకు పెట్టి, భయంకరముగా ముండ్లతోకలు విరియవిప్పి చూచుచుండెను. మల్లారెడ్డి బలముగా దానిపై తన చేతిలోని యీటె విసరెను. ఆది ఏదుబంది ముఖమున గ్రుచ్చుకొనెను. చెంచులు పరగెత్తుకొనిపోయి ఆ పందిని తెచ్చి, ఈటె లాగి దాని రక్తముతో తోకరాజు నభిషేకించిరి.

అప్పుడు తోకరాజు మల్లారెడ్డి నిట్లర్థించెను. 'నాకు సాయము వచ్చే గుంపుతో మా తమ్ముని సుగ్రీవునిగూడ తీసికొని రండి, పెబూ!'

మల్లారెడ్డి యాతని తప్పక తెత్తునని వాగ్దాన మొనర్చెను. ఆ కార్య నిర్వాహణకు కాలనిర్ణయము చేయుటకు సంకేతస్థలాదులు నియమించుకొని చెంచులు సెలవు తీసి కొనిరి.

33

శ్రీ శంకరస్వాముల యాశ్రమ మంతయు సందడిగా నున్నది. అందులకు ముఖ్యకారణము శ్రీ శృంగగిరి శ్రీపీఠాధీశ్వరులును శ్రీ శంకరస్వాములకు జ్యేష్ఠ స తీర్థులును అగు శ్రీ విద్యారణ్య లను ప్రతాపనామము గల శ్రీ విద్యా శంకర భారతీస్వాములు వేంచేసి యుండుట. శ్రీవిద్యారణ్యుల యాగమనముతో పరమశాంతు లగు శంకరస్వాములకే ఆనందము పట్టరాకుండెను. ఇష్టవస్తువు ప్రాప్తించిన అర్భకుని ముఖమున వ్యక్త మగు నవ్యానందమే శంకరస్వాముల ముఖములో నిప్పుడు ద్యోత మగుచున్నది. తా నెనిమిది యావము లందును అర్చించు శంకరుడే అరూపమున సాక్షాత్కరించి నట్లును, తాను నిత్యస్మరణము చేయు నారాయణుడే ఆ యాకారమున నవతరించినట్లును, తాను నిత్యము

పఠించు వేదములు మూర్తికట్టిన చతుర్ముఖుడే ఈ విగ్రహము పూని తన్ను అనుగ్రహింప దయచేసి నట్లును శంకరస్వాములకు అనిపించుచున్నది. శ్రీవిద్యారణ్యుల యర్చనమే సమస్త దైవతపూజలుగా నాస్వామికి తోచుచున్నది. శ్రీవిద్యారణ్యులు ప్రాంశుపయోదనీలమూర్తి, జలదశ్యామాంగుడు నై శ్రీకృష్ణద్వైపాయన వేదవ్యాసు లీవిధముగానే ఉండెడివారేమో యని చూచువారికి స్ఫురించుచున్నది. వారి యాగమనవార్త శ్రీశైలారణ్యభూముల నెల్లెడ నెట్లో ప్రాకిపోవుటచే, ఎక్కడెక్కడినుండియో వేదవేదాంగవిదులగు పండితోత్తములును సోమయాగాది పౌండరీకాంత యజ్వలును శ్రీ శంకరస్వాముల యాశ్రమమునకు వారి దర్శనార్థము సహస్రాధికముగా విచ్చేసిరి. వేదఘోషతో శాస్త్రప్రసంగములతో ఆ యాశ్రమము బ్రహ్మలోకమువలె మారు మ్రోయుచున్నది.

మల్లారెడ్డి యావచ్చిన పెద్ద లందరకు సర్వసౌకర్యములు సమకూర్చ విస్సనమంత్రిని కమలనాభామాత్యుని నియోగించెను. వారలకు కావలసిన యాహార పదార్థాదికము లన్నియు, ఎప్పటికి కావలసిన వప్పుడు, స్త్రీ జనబృంద ముతో వీరమ్మ సమకూర్చుచుండెను. అన్నమ్మకు నిత్యము నందికంత పోత రాజు పూజలతో తీరికలే కున్నది. తనకు పంటరెడ్డియు దేసటరెడ్డియు రత్తగేహియు తోడుపడుచుండ మల్లారెడ్డి తనపరివార మంతటితో నా చుట్టుపట్టుల పర్వతారణ్య ప్రదేశములు రాత్రింబవళ్లు సంచరించుచు, ఆ కూడిన జనములకు యవనులవలన గాని చెంచులవలనగాని ఎట్టి యాపదయు రాకుండ కాపుకాయుచుండెను.

ఎర్రయ మహాభారతములో అరణ్యపర్వము పరిపూర్తి గావించుటచే మల్లారెడ్డికి ఆనంద ముద్వేగ మగుచున్నది. శ్రీ విద్యారణ్యగురువులయు నంత మంది విద్వద్బ్రాహ్మణులయు నాగమనముతో నది యిప్పుడు భరింపరాకున్నది, ఆప్తులతో పంచుకొన్నప్పుడుగదా, సంతోషమునకు ధన్యత! ఆతడు వేమారెడ్డికిని, ఇతర సోదరులకును, మాతులురకును, మాతులపుత్రులకును సమస్త బంధువులకును చూడరావలసిన దని శీఘ్రగాములగు దూతల బంపినాడు. అందరు నిట్లు సమావిష్టులైనచో ముందు తమకార్యక్రమము నిర్ధారణచేసికుని పెద్దల యాశీర్వచనము పొంది కార్యసాధన కుపక్రమింపదగు ననియు నాతని యాలోచనము.

అవచిదేవయ తన్నుజూడ వచ్చిననాడు ఆకస్మికముగా వచ్చి తన్ను ప్రేమమీర కౌగిలించుకొనిన పిచ్చివాడు నిజముగా తనతండ్రి ప్రోలయయే యనియు ఆతడిప్పుడు వేమారెడ్డియొద్ద నున్నాడనియు తెలియవచ్చినది. తండ్రికి క్షమార్పణము చెప్పికొనుచు రమ్మని ప్రత్యేకముగా మల్లారెడ్డి యాహ్వాన మంపెను గాని ప్రోలయ ప్రసన్నుడు కాలేదు. ప్రోలయ కిప్పుడు తన రెండవ కుమారు డగు వేమన్నమీద తప్ప ప్రపంచములో మరియెవరి మీదను అనురాగ మున్నట్లే లేదు.

వేమారెడ్డి పంపినవార్త ననుసరించి అన్నమ్మ అద్దంకి వెళ్ళి భర్తృ పాదములు తన కన్నీళ్ళతో కడిగినది. ప్రోలయ ఒక్కసారిగా మనస్సు కరగి ఆమె నాదరముతో లేవదీసి బిగ్గ కౌగిలించుకొనెను. కాని మరుక్షణమునసే ఆత డాత్మనిగ్రహము తెచ్చుకొని కన్నులు మూసికొని ఆమె నావలకు త్రోసివేసి వేమారెడ్డిని పిలిపించి యిట్లు చెప్పెను: 'వేమా, మీఅమ్మ ఇక్కడ నున్నచో నేను తలపెట్టిన పని సాగదు, నీ కేమియు సాహాయ్యము చేయలేను. మీ అమ్మ పై నాకు కోపము కాదు. ఆమెతో నేను మాట్లాడ వీలు లేదు. ఆమె నా కిక కనబడకుండే ఏర్పాటు చేయి: నేను సన్యాసినే అనుకో!'

అన్నమ్మ యామాటలు విని భర్తకు దూరమునుండియే నమస్కరించి మరి మాటాడక ధీనముగా నావలికి బోయినది. ఆమరునాడే యామె యటనుండి బయలుదేరి మల్లారెడ్డికడకు తిరిగి వచ్చినది. అట్లు తిరిగి వచ్చిన దాది ఆమెకు నందికంతపోతరాజే జీవిత సర్వస్వముగా ఉన్నాడు.

మల్లారెడ్డి యాహ్వానము నందుకుని ప్రోలయ తప్ప యాతని బందుగణ మంతయు వచ్చినది, అన్నలు మాచయ, వేమయ అన్నయ పచ్చిరి వృద్ధు డైన మాతామహుడు దొడ్డయ వచ్చెను. ఆత డిప్పుడు వెనుకటికంటె నారోగ్య ముగా నున్నాడు. మేనమామలగు పోతయ చిట్టయ,నాగయలు, మాతుల పుత్రు డగు నూకయయు వచ్చిరి వేమారెడ్డితో నాతని మంత్రులు రామా పెగడయు మల్లినాధుడును వచ్చిరి. వారితో ఘుడెయరాయ గురుదేవుడును గూడ తోడి తెచ్చిరి.

అట్లక్కడికి వచ్చినది మల్లారెడ్డి బంధువులును (వాళ. మిత్రవర్గమును) లును మాత్రమే కాదు. చిత్రముగా నక్కడికి తండోపతండములుగా జనసమూ

A MEMORIAL V. R. NARLA LIBRARY D. P. R. I. Acc. No. 223

హాములు చేరుచున్నవి. ఒక కులముకాదు. ఒక గోత్రముకాదు. ఒక పేదకాదు. ఒకబిక్కకాదు. అందరు వచ్చిరి. గాయకులు, చిత్రకారులు,స్థపతులు, శిల్పులు కవులు, నటులు - అన్నిరకముల జనులును వచ్చుచుండిరి. అందరు జనులు అక్కడ ఎందుకు కూడిరో కూడ ఆశ్చర్యముగా నున్నది. వారిలో పలువురు శ్రీ విద్యారణ్యులయు శ్రీ శంకరస్వాములయు పేరు లైన ఎన్నడు విన్నవారు కారు. ఐనను వా రందరు నెందులకో పిలువనంపనిదే వచ్చిరి. ఏదో మహా త్కార్యము సాధించుటకై పరదేవతయే ఇందర హృదయములలో నావేశించి ఇట్లిక్కడికి లాగికొని వచ్చిన ట్లున్నది.

ఈ జనసమూహములను ఆదరించుట మల్లారెడ్డికి తనవిధిగా తోచినది, వారి నర్చించుట ఆతనికి పరదేవతాపూజగా నున్నది. ఒకనాటి సాయంకాలము విస్సనయు కమలనాభుడును కోశములో నున్నధనము ఆపై వారము దినములకు కంపె రా దని నివేదించిరి. మల్లారెడ్డి యధైర్యపడ లేదు. ఆత డారాత్రి శ్రీశైల మల్లికార్జునుని భ్రమరాంబికను భక్తి పరవశుడై ధ్యానించుచు తన యను చరులతో నరణ్యసంచార మొనర్చుచుండెను. పంటయు దేసటయు రత్న గేహియు నక్కడికి సమీపములో మనుష్య సంచారము చేసిన జాడలు కనబడిన వని నివేదించిరి. మల్లారెడ్డి బయలుదేరి చూడగా నాతని కొక గుహయు నందులో వెన్నెలలో మిలమిలలాడుచు ననేకము లగు బంగారు పాత్రలును కనిపించినవి. బిందెలు, చెంబులు, పళ్లెములు, చెట్లు, గిన్నెలు—సమస్తము బంగారు మయములే మల్లారెడ్డి తనకన్నులు తాను నమ్మలేక యనుచరులను పిలిపించి యన్నియు చూపెను. వా రందరు నాశ్చర్యపడుచుండ రత్నగేహి యిట్లనెను.

'మల్లప్రభూ! సముద్రసంచారము చేయు మాకు మునిగిన నౌకలు తేలియు, ద్వీపములలో పూర్వమెవరో దాచినట్టియు మహానిధులు లభించుట కద్దు. క్రూరమృగములు సంచరించు నిక్కడ నిట్టి ధనము లభించుట చిత్ర ముగా నున్నది,'

దేసటరెడ్డి యందుకొనెను; 'విస్సనమంత్రి యీ సాయంకాలమే ధనము తరుగుగా నున్నదని నివేదించెను గదా! వేగకు సరిగా నిది ప్రాప్తమైనది'

పంటరెడ్డి మాట్లాడక ఆ బంగారు వస్తువు లన్నియు ప్రోవులు చేయు చుండెను.

మల్లారెడ్డి హుంకరించెను : 'పంటా!'

పంట యదరిపడి చేతిలో నున్న బంగారు గుండిగ జార విడువగా నది యతని ఎడమకాలిపై బడి నొప్పింపగా నతడు కూలబడెను. మిగిలిన వా రాతని నను నయించుచుండిరి.

మల్లారెడ్డి యావేశముతోడనే పలుకుచుండెను.

'మనము దొంగలమా? దొరలమా!' ఎవ్వరు బదులుచెప్ప సాహసింప లేదు.

'మన కిక్కడ బంగారము దొరకినదిగదా యని అవసరములకు ఎత్తు కొని పోయి వాడుకొనుటయేనా? - అది యెవరిదో విచారించి వారిది వారి కప్ప గింపవలదా?'

ఎవ్వరు నేమియు మాటాడలేదు. మల్లారెడ్డి స్వయముగా తా నక్కడ కాపుండి యనుచరుల నందరిని ఆ చుట్టుపట్టుల నరణ్య మంతయు ఆ గుహా నివాసుల కొరకై వెదుక నాజ్ఞాపించెను. వా రందరు గడగడలాడుచు వెదకు చుండిరి. ఎవ్వరు కనబడలేదు.

మల్లారెడ్డి యాగుహలోనే యుండెను ఆతనికి గుహ రాతిగోడ కాను కొని కూర్చుండి యుండగా కునుకుపట్టిన ట్లున్నది. 'ఈ గుహలోని బంగార మంతయు అది చూచినవారిదే!' అని ఏదో మాటలు వినబడినట్లై యాత డులికి పడి లేచెను.

సూర్యోదయ మై చాలసే పైనది. పంటరెడ్డి మొదలగు ననుచరు లందరు నరణ్యము గాలించి వచ్చి ఎవరును కనబడలే దని నివేదింప బోవుచు కునుకు చున్నది చూచి మౌనము వహించి యుండిరి

మల్లారెడ్డి లేచి చూడగానే ఎదురుగా నున్న గోడపై తాను సరిగా విన్న మాటలే మోటుగా చెక్కియున్నవి. ఆ శిలాక్షరములు చెక్కి ఎక్కువకాల మైన ట్లులేదు.

'ఈ గుహలోని బంగార మంతయు అది చూచిన వారిదే!'

మల్లారెడ్డి కన్నులు తుడిచికొని చూచెను. అవేమాటలు పంటకు దేస టికి చూపెను. వారును అట్లే చదివిరి. రత్నగేహికి తెలు గక్షరములు రావు వా రందరు చదివినది విన్నంతనే యిట్లు చెప్పెను.

'మల్లప్రభూ! ఇక దొరతనముగా ఈ బంగారమంతయు నీవు తీసికొన వచ్చును. నీవే గదా ముందు చూచినది. అంతా నీదే. సముద్రముమీద దొరికిన నిధులైనచో మా కందరకు భాగ ముండెడిది!'

మల్లారెడ్డి మనస్సులో భగవదర్పితము చేయుచు ఆ బంగార మంతయు నిప్పుడు పంటచేతనే ప్రోగులు వేయించును ఆమధ్యాహ్నమునకే అదియంతయు మల్లారెడ్డి విస్సనకు అప్పగించెను.

దీనితో ప్రస్తుతమునకు ధనబాధ తీరినది. ఆ మరునాడే కమలనాభుడు ఆహారపదార్థములు పది రోజులుకంటె వచ్చునట్లు లేదని నివేదించెను. మల్లారెడ్డి నందికంత పోతరాజుకు మ్రొక్కుకొనెను. ఆ మరునాడు ఎవరో ధర్మాత్ముడు పంపిన ఆహార పదార్థాదికములు మల్లారెడ్డికి వచ్చి చేరెను. ఇట్లే ఏమి కొదువగా నున్న దనుకొన్న నది సమయమునకు ముందుగనే, అద్భుతముగా సమకూరుచుండెను. మల్లారెడ్డి ఎర్రయ కీయద్భుతము ఎప్పటి కప్పుడు చెప్పుచు, 'నీ జయ కావ్య మహత్త్వమే, ఇది అంతా, ఎర్రయ్యా!' అనుచుండెను. ఎర్రయ ముఖము కోకనదమువలె నామాటలకు విప్పారును.

ఒకనాటి యుదయమున శ్రీ శంకరస్వాములు ప్రాతఃకాల శివార్చనము పూర్తి కావించి శ్రీవిద్యారణ్య యతీంద్రులతో గోష్ఠి సలుపుచుండ, వేదవిదులు శ్రావ్యకంఠములతో స్వస్తివాచనము సలుపుచుండిరి.

శ్రీ శంకరస్వాములు : 'మా కీ నాడు తెల్లవారు జామున స్వప్నములో సమస్తదేవతాస్వరూపిణి యైన పరదేవతామూర్తి సాక్షాత్కరించినది.'

శ్రీ విద్యారణ్యులు : 'మాకును అట్లే మహిషాసుర మర్దని ప్రత్యక్ష మైనది, మహోపద్రవములలో చండీయాగము గావించుట మంగళప్రదము కదా!'

శ్రీ శంకరస్వాములు : 'మాకును శతచండీయాగము కావించుట పరదేవతేచ్ఛగా భాసించినది.'

శ్రీ విద్యారణ్యులు : 'మీ యాశ్రమములో సహస్రచండీ యాగ మొనరించుటకే సాధనసంపత్తి పుష్కలముగా గోచరించుచున్నది.'

శ్రీ శంకరస్వాములు ఉప్పొంగుచు నిట్లు సెల విచ్చిరి. 'మీరు యాగ సమాప్తి యగువరకు ఇక్కడనే ఉండుటకు అంగీకరింపవలె. మీ సన్నిధానము చేతనే సహస్రచండీయాగము జయప్రదము కాగలదు!'

శ్రీ విద్యారణ్యులు అంగీకారసూచకముగా నారాయణస్మరణ మొనర్చి మరియు నిట్లు పలవిచ్చిరి.

'ఈ సహస్ర చండీయాగము సత్రయాగవిధానముగా నాచరించినచో నందరు యజమానులై, ఎవరు చేసిన సహాయము కొలది ఫలభాక్కులు కాగలరు!'

వారిరువుర సంకల్పములు గ్రహించి యక్కడ కూడిన బ్రాహ్మణ బృందము పొంగిపోయెను. వారు వెంటనే సుస్వరముగా పురుషసూక్తము నంతగా పఠింపసాగిరి. ఒక్కపెట్టున నప్పు డా బ్రహ్మసభను విరాట్పురుషుడు ఆవేశించినట్లైయినది.

పూర్వము దేవతలకు మహిషాసురునితో శతసంవత్సర యుద్ధమైనది. అందులో దేవతలు పరాభూతులైరి. మహిషాసురుడు ఇంద్రపదవి నధిష్ఠించెను. పరాజితులైనదేవత లందరు ప్రజాపతిపురస్కృతులై, మహేశగరుడధ్వజులున్నయెడకు జని తమ దుర్గతియు మహిషాసురుని దుశ్చేష్టలును విన్నవించుకొని హరి హరుల శరణు చొచ్చిరి, దేవతల మొర యాలకించి హరి హరులు కోపముతో బాములుడివేసిరి. వెంటనే చక్రిముఖమునుండియు, శంకరుని ముఖమునుండియు మహాతేజస్సు లావిర్భవించినవి. అట్లే బ్రహ్మ ముఖమునుండియు శక్రాది సర్వదేవతల ముఖములు నుండియు తేజస్సు లావిర్భవించినవి. ఆ యన్ని తేజస్సులు ఏకమై జ్వలించుచున్న మహాపర్వతమువలె రాశిగా నయ్యెను. అంతలో ఆతేజస్సంతయు నారీరూపముగా నావృత్తి నొంది తన శోభచేముల్లోకములు నిండించెను. ఆ తల్లి ముఖము శాంభవతేజము తోడను, బాహువులు విష్ణుతేజముతోడను, పాదములు బ్రహ్మతేజము తోడను, ఇతరావయవములన్నియు ఇతరదేవతా తేజస్సులతోడను రూపొందినవి. సమస్త దేవతాతేజోరాశి సముద్భూతయైన ఆ చండికాదేవతకు పినాకపాణి తన శూలమునుండి శూల మిచ్చెను. కృష్ణుడు చక్రమునుండి చక్ర మొసగెను. బ్రహ్మ తనకమండలువునుండి కమండులు లిచ్చెను. వజ్రి తనవజ్రాయుధమునుండి వజ్రమును, అట్లే యితరదేవత లందరు తమతమ యాయుధములనుండి అటి యాయుధములే తీసి సమర్పించిరి. అట్లే వారెల్లరు తమ తమ భూషణములు కూడ నర్పించి యలంకరించిరి. హిమవంతుడు సమర్పించిన సింహము నధిష్ఠించి లోకమాత మహిషాసురుని సేనాయుక్తముగా సంహరించినది. అప్పుడు శక్రాది

దేవతలు అంబను సత్యస్తుతులతో స్తోత్రము చేసిరి. చండికాదేవి సుప్రీతయై వరము కోరికొండనగా, దేవతలు. 'మహేశ్వరీ, మహిషాసుర మర్దనము చేసితివి. అందుచే నిప్పుడు మేము కోరదగినదేమియూలేదు. అయినను వర మీయదలచితివి గన, ఈవిధముగనే పరమాపదలు సంభవించి నపుడెల్ల నిన్ను సంస్మరించిన వారికి ఆపదలు మాయంతువుగాక!' అని యర్థించిరి లోకసంగ్రహార్థమై దేవత లిట్లర్థింప నిట్లే యనుచు భద్రకాళి యంతర్హిత యయ్యెను. తదాదిగా మహాపదలో చండీయాగ మాచరించుట శుభంకర మగుచున్నది. ఆ సభలో నున్న శ్రీ విద్యారణ్యులే నారాయణమూర్తిగాను, శ్రీశంకరస్వామియే శంకరమూర్తిగాను, సభకూడి యున్న విద్వద్బ్రాహ్మణులే బ్రహ్మాదిదేవతలుగను చూచుచున్నవారికి భాసించి, ఈ యాగము జయప్రదమై సమస్తాపన్నివారకము కాగలదను నిశ్చయభావము కలిగినది.

కొలదిపేపటిలోనే సహస్ర చండీయాగమునకు ప్రధానబుత్విగ్గణము నిర్ధారణ మైనది. శుభ ముహూర్తము నిశ్చయింపబడినది. వేమారెడ్డి శ్రీ శంకర యతీంద్రులకు నమస్కరించి వారి పాదసన్నిధిని హోమరాశి పోసి, 'దేవా, ఈ యాగమునకు నెలగు మొత్తమును, బుత్విగ్దక్షిణయు నర్పించుకొనుటకు నా కనుజ్ఞ యి యవేడెదను. ఈ హోమము కాక మరియెంత కావలసినను నేనే సమర్పించ గలను! న న్ననుగ్రహించి ధన్యుని జేయుడు!'

శ్రీశంకర గురుదేవులు శ్రీ విద్యారణ్యులవంక దృష్టి సారించి యిట్లు నెలవిచ్చిరి.

'వేమయ్యా, నీ భక్తికి ఆనందమైనది. మేము హోమము ముట్టముగదా! ఈ చండీయాగమునకు నీ విచ్చు విత్తమంతయు బ్రహ్మగా నిర్ణీతులైనవారు గ్రహించి వినియోగింతురుగాక!'

ఆ యాగమునకు అంతకు మున్నే బ్రహ్మగా నిర్ణీతులైన ఘోడెయరాయ గంగయ గురువులు లేచి వచ్చి పరిషత్తు పక్షమున నా హోమము గ్రహించిరి. వేదవిదులు వేమారెడ్డి నాశీర్వదించిరి.

యాగశాలలు కుండాదులు పంచభక్షము రామలింగ మను స్థపతి తన సోదరు డగు సోమలింగము సాహాయ్యముతో మనోజ్ఞముగను సర్వసంపన్నముగను నిర్మించెను.

నిర్ణీతమైన యాగారంభదినము వచ్చినది. విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచనము, వాస్తు పురుషపూజ నిర్వర్తించి ఘోడెయరాయ గంగయ గురువులు ముందు స్థపతుల నిరువురను వస్త్రములతోడను భూరి దక్షిణతోడను సత్కరించిరి.

శ్రీ విద్యారణ్య శంకరశంయమీంద్రులు ప్రధానసదస్యులుగా, ఘోడెయరాయ గంగయగురువులు బ్రహ్మగా సహస్రచండీయాగ మారంభమైనది. అందులో ప్రధానభాగ మగు సప్తసతీపారాయణములు శతసంఖ్యాక ఋత్విక్కులు నాలుగు దినములలో పూర్తిగావించిరి. వేద పారాయణాదులును ముగిసినవి.

వెంటనే యాగాంగహోమమునకు ఐదవనాటికి సర్వప్రయత్నములు సంపూర్ణమైనవి. శతసంఖ్యాకహోతలు సుఖముగా నుపవిష్టులై హోమము చేయుట కనువుగా మహాకుండమును పంచభిక్షము సోదరులు సిద్ధముచేసిరి. అది వృషభాకారమునసనుండి సర్వకామదోగ్ధ్రియా యనిపించుచున్నది. ఆ కుండమునకు సమీపమునసే శ్రీ విద్యారణ్యులకును శ్రీ శంకర గురుదేవులకును 'ఉన్నతపీఠము లమర్చబడినవి. యాగశాల యున్నతప్రదేశమున నున్నది. దాని చుట్టును మహాయాగము చూడవచ్చిన చాతుర్వర్ణ్య జనములు సుఖముగా నుపవిష్టులై హోమకర్మ దర్శించుటకు అనువుగా మహాశాల సిద్ధము చేయబడినది అందులో జను లందరు భక్తిశ్రద్ధలతో నిరీక్షింప కుతూహలులై నిశ్శబ్దముగా కూర్చుండిరి. శ్రీ శృంగగిరి, పీఠాధిపతుల యనుగ్రహముచే నానాడు తాము పరదేవతావిర్భావము ప్రత్యక్షముగా చూడగల మనియే ఉద్విగ్నులై యుండిరి.

ఋత్విక్కులు హోమకుండము చుట్టు నుపవిష్టులైరి. హోమద్రవ్యము లగు పాయసము, తిలలు, ఆజ్యము, ఫలపుష్పపత్రములు ఎవరి కందుబాటులో వారు ఉంచుకొనిరి. బ్రహ్మయగు ఘోడెయరాయ గంగయ గురువులు శ్రీ విద్యారణ్యులయు శంకరస్వాములయు అనుజ్ఞ నొంది శ్రీ మహాగణాధిపతి పూజాదు లొనర్చి కుండమునం దగ్ని ప్రతిష్ఠాపన మొనర్చి అగ్ని ముఖమొనర్చి శ్రీ మహామాయా శివా చండికా పరదేవత నాహ్వానించెను. హోమ మారంభమైనది. ఆ హోమము చేయుచున్నవారిలో ఎర్రయయు నొకడు.

ఆ నాట హోమము చూడనోచిన ప్రేక్షకులకు మరల జన్మములో నది మరపుకు రాలేదు. అగ్నిహోత్రుడు ప్ర దక్షిణావర్త శిఖలతో నామహాకుండమున ప్రజ్వలించుచు నాహుతు లందుకొనుచుండెను. దుర్గాసప్తసతి మంత్రములతో హోమము జరుగుచున్నది. ఆ కుండములోని అగ్నిశిఖలు ఛాయలవలె నావరించుచున్న ధూమరేఖలతో కలసి జ్యోతిర్మయ మైన మహాయవనికవలె చూపట్టుచుండెను. హోమము చేయుచుండగా ఆయా కథాఘట్టములు ఆ యవనికపై ప్రదర్శింపబడుచున్నట్లు మహాజనము కన్నులకు భాసింపసాగినది.

ముందు చిరకాలజీవియగు మార్కండేయ మహర్షి రూపము కనబడగా శంకర విద్యారణ్యపురస్సరముగా నందరు నాతని కప్రయత్నముగా నమస్కరించిరి. తరువాత సురథు డను రాజు కోలులను శత్రువులతో యుద్ధమొనర్చి పరాజితు డై నిజరాజధానికి వచ్చుటయు, అక్కడ అమాత్యాదులు తనసంపద హరించుటచే ఏకాకిగా హయారూఢుడై సుమేధస్సుని ఆశ్రమమునకు పోయి మునిచే సత్కృతుడై ఆశ్రమమున విహరించుటయు కనుపట్టినవి. ధనవంతుడగు సమాధి యనువైశ్యుడు భార్యాపుత్రులు ధన మపహరించి ఇల్లు వెడల నడచుటచే, దిగులుతో నా యాశ్రమమునకే వచ్చి నడయాడుచుండెను, తన్ను వర్జించిన తన పరివారమును తన పట్టపు గజము కోశము ఏమైనవో యని దిగులు పడుచున్న సురథరాజును, ధన లోభముచే తన్ను వెడలగొట్టిన భార్యా పుత్రు లెట్లున్నారో యనుబెంగతో నన్న సమాధిశ్రేష్ఠియు, తమ యవ్యక్తతకు తామే యాశ్చర్యపడుచు, దానికి కారణము తెలియజాలక, సుమేధస్సును జేరి ప్రణామ మొనర్చి సంశయవిచ్ఛేదన మర్థించిరి. వారి యజ్ఞానమున కంతటికి మహామాయయే కారణ మనియు. దాసి నర్చించిన వారికి భోగస్వర్గాపవర్గములు యథాకాంక్షితముగా అనుగ్రహించు ననియు ఉపదేశించి, చండికాదేవి ముఖ్యముగా ముమ్మా రనతరించిన మూడు చరిత్రములు నాతడు చెప్పసాగెను. చూచుచున్న జన మంతటికి కుండజ్వాలా యవనికపై వాసు కనబడినట్లయినవి. తరువాత పరదేవత చరిత్రము లారంభించినవి.

అందరు చూచుచుండగనే, హోమజ్వాలలు యథాప్రకారము ప్రజ్వలించుచుండగనే, ఆకస్మికముగా కుండమంతయు ఏకార్ణవముగా భాసించినది. అందులో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో మేను మరచియుండెను. విష్ణువు నాభీకమలమున నున్న బ్రహ్మపైకి, యుద్ధార్థుడై మధుకైటభు లను మహా

రాక్షసు లిద్దరు లంఘించుచుండ బ్రహ్మ వడవడ వడకుచు మహామాయాను స్తోత్ర మొనర్చి విష్ణువును నిద్దురలేపెను. అతడు మధుకైటభులతో ఐదువేల సంవత్సరములు భాహాయుద్ధ మొనర్చి తుదకు పరమేశ్వరిని స్మరిం:, వారి శిరువుర తన తొడలపై నుంచి తలలు నరకెను. అట్లు నరకిన మధుకైటభుల మేదస్సు సముద్రమం దంతట తెట్టెలు గట్టి నిండి మేదిని యేర్పడుచు న్నట్లు ప్రేక్షకు లందరు నాకుండయవనికపై కన్నులార జూచిరి. వా రది కాంచిన గడియకాలమే ఐదువేల యేండుగా భాసించినది.

అంతలో దేవతలకును మహిషాసుర సేనలకును జరిగిన శతవార్షిక యుద్ధము గోచరించినది. దేవతలు పరాజితులై బ్రహ్మపురస్సరముగా హరి హరుల శరణుచొచ్చుటయు, హరిహరబ్రహ్మాది సమస్తదేవతా తేజస్సు పర్వతకూటాచమై ప్రజ్వలించుటయు, పొడకట్టినది ప్రధము చరిత్ర హోమ సందర్భమున మహా సముద్రమట్లు కన్పించిన హోమకుండ, మిప్పుడు భూనభోంతరముల ప్రజ్వలించుచున్న తేజోరాశిగా చూపట్టినది, ఆ మహాగ్ని శిఖలలో ముప్పదిమూడుకోట్ల దేవత లున్నట్లైయిరి. ప్రేక్షకు లా తేజస్సు చూడలేక కన్నులు మూసికొనుచుండిరి. శ్రీ విద్యారణ్యులకును శంకరస్వాములకునే కన్నులు మిరుమిట్లు కొనినట్లయి అర్ధనిమీలితలోచను లైరి. ఆ మహాతేజస్సు చూచి హోతలందరు ఆనందతన్మయులై కన్నులు మూసికొనిరి. ఒక్క ముహూర్తకాలముపాటు వారి కంఠముల గద్గదిక యావహించి మంత్రము లుచ్చరింప లేకుండిరి; నిశ్చేష్టులైన వారి చేతులు హోమకర్మ చేయలే కున్నవి. అది గమనించి శ్రీ విద్యారణ్యులును శ్రీ శంకరస్వాములును ప్రకృతి నొంది చేతు లూపిరి. హోమకుండములోని మహాజ్వాల యంతయు మనోహర మగు నారీరూపముగా పొడకట్టినది, ఆ దివ్య మనోజ్ఞరూపము చూచినంతనే అందరి హృదయములు అమృతాప్లావితము లైనవి, హోతలు హోమకర్మ సాగించిరి. సింహారూఢయైన చండిక మహిషాసురుని సేనాసమేతముగా సంహరించి దేవతల పూజలంది వర మిచ్చి యంతర్ధాన మైనది, ఇప్పుడు చూడగా మరల నక్కడ చూపరకు హోమ కుండము, అందులో జ్వలించు చున్న ప్రదక్షిణాగ్నియు. చుట్టును తీరి హోమ మొనర్చుచున్న హోతలును చూడనైరి.

మూడవ చరిత్రము హోమ మారంభించినది. ఈ మారు శచీపతి శుంభ నిశుంభరాక్షసులతో యుద్ధ మొనర్చి విజయు డగుట ప్రత్యక్ష మైనది. దేవత

లందరు హిమవంతమున కరిగి విష్ణుమాయను స్తోత్ర మొనర్చుచుండిరి. అప్పు డక్కడ జహ్నులీనది యందు స్నాన మొనర్ప వచ్చిన పార్వతీదేవి శరీరము నుండి పరదేవత కౌశికీ నామముతో నిస్సరించినది. లోకమోహన మైన కౌశిక రూపమును చండముండు లనెడి శుంభ నిశుంభ భృత్యులు చూచి మెచ్చుకొని ప్రభువుల కడకు పోయి, 'ముల్లోకములలోని సమస్త రత్నములు సేకరించిన మీరు స్త్రీరత్నమైన ఆ యువతిని తెచ్చుకొని వివాహమాడవలె' నని విన్న వించిరి. వా రంగీకరించి తమలో నొకరిని వరించి వివాహమాడు మని ఆమె కడకు దూతనంపిరి. పరమేశ్వరి అంతర్గర్భితస్మితముతో, 'నన్ను యుద్ధమున జయించిన పురుషునే కాని వివాహ మాడ నని ప్రతిజ్ఞ చేసితి'నని ప్రత్యుత్తర మంపిసది, శుంభనిశుంభులు కోపోద్దీపితులై కేశగ్రహణము చేసి యామెను లాగికొని రమ్మని మహాసేనతో ధూమ్రలోచనుని పంపిరి. పరమేశ్వరి హుంకారమునకే అతడు భస్మమైనాడు, ఈ మారుచండముడులను చండికా దేనిపైకి రాక్షసప్రభువు లంపిరి, వారిని చూడగనే చండిక కోపముతో బామ ముడి వేసినది ఆ బామముడి పాటుతోనుండి ఆకలితో నెండిన భయంకరాకార ముతో కాలికాదేవియా విర్భవించి సేనలతోని రథాశ్వములను దొంతరలుగా తన పెద్దనోటిలో వేసికొని దంష్ట్రంలో నమలి మ్రింగుచు చండ ముండుల తలలు తెగవేసి చండిక కర్పించినది. శుంభని శుంభులే సర్వసేనలతో అంబికపై కెత్తివచ్చిరి. అంబికా దేవికి తోడుగా సమస్తదేవతాశక్తులు ఆయా దేవతల రూపములే ధరించి వచ్చి పరివేష్టించినవి. బ్రహ్మణీ, మహేశ్వరి, కౌమారి, వైష్ణని, వారాహి, నారసింహ, ఇంద్ర ఇత్యాదిశక్తు లిట్లు తోడైనవి. ఆశక్తు లన్నియు తమతమ యాయుధములతో రాక్షస గుణముల సంహరించుండగా వారు పలాయన పరులగుట కన్నుల గట్టినట్లు కనిపింపగా సభాసదులు రోమాంచ ధంచుకిత గాత్రు లైరి. అట్లు పారిపోవుచున్న రాక్షసులను కూడగట్టుకొని రక్త బీజుడను రాక్షసేశ్వరుడు శక్తుల నెదిరింపవచ్చెను. వాని దేహమునుండి రక్త బిందువు లెన్ని నేలపైబడునో, అంతమంది అతనితో సమానబలము గల రాక్షసు లుదయింతురు. ఆ రక్తబీజునిపై బడి ఐంద్రి తన వజ్రముతోడను, ఇతరశక్తులు తమ తమ యాయుధములతోను ప్రహరించిరి. అతని దేహము నుండి స్రవించిన రక్తబిందువులతో నుండి శతసహస్రములుగా రక్తబీజు లుపుట్టుకొని వచ్చిరి. రక్తబీజులతో కుండపుతెర నిండిపోవగా సదస్యులు చూచి

వడవడ వడకిపోవుచుండిరి. దేవతలును భయమంది విషణ్ణచిత్తులైరి. అది చూచి చండికాదేవి సత్వరమే వచ్చి. నేను గాయపరిచిన రక్తబీజుని రక్తబిందువులను నీ నోరుతెరచి గ్రహింపు'మని కాలికాశక్తి నాదేశించి శూలముతో రక్తబీజుని పొడిచెను. అతని దేహములోనుండి స్రవించుచున్న రక్తము నంతటిని కాలిక తన యాస్యముతో మ్రింగివేయుండెను. చండిక తన యాయుధములతో రక్తబీజుని ప్రహరించి యాతని నీ రక్తు నొనర్పగా, మాతృగణము హర్షావేశముతో గంతులు పెట్టుచున్నట్లే అగ్నిశిఖలు కాన నయ్యెను. అంతట శుంభ ని శుంభులే పరదేవతతో తలపడిరి, చండిక శుంభుని వారల సైన్యమంతటిని తన శక్తులతో కలసి సంహరించెను. శుంభదైత్యుడేకాకియై, ఇతరుల సహాయముతో గొప్పగా పరాక్రమము చూపుచున్నావని యధిక్షేపింపగా చండిక, దుష్టుడా, నాలోనుండి పుట్టిన శక్తు లన్నియు ఇదిగో నాలోనే లీనమగుచున్నవి చూడరా! అని పలుకునంతలో బ్రహ్మాణి మొదలగు శక్తు లన్నియు చండికాదేవి తనువులో లీనమైనవి. మరల పరదేవత ఏకాకారముతో నిల్చినది. ఆమెతో శుంభుడు తలపడినాడు. చండిక యాతని విరథుని నిరాయుధుని జేయగా, నాతడు ముష్టి సంధించి దేవిపైకి విజృంభించి యామె నెత్తుకొని ఆకాశములోని కెగసెను. చండిక యాతనితో బాహుయుద్ధ మొనర్చి ఎత్తి త్రిప్పి నేలపై బడవైచి, మరల ముష్టి సంధించి వచ్చుచున్న యాతని తన శూలముతో వక్షమున పొడిచి సంహరించెను.

ఇంతవరకు సదస్యు లందరు సంచలించుచున్న హృదయములతో సర్వము తిలకించుచుండి, శుంభవధానంతరము ఒక్కసారిగా నిట్టూర్పులు వదలిరి, అంతలో కుండజ్వాలలలో నుండి దేవత లావర్చుచున్న నారాయణీస్తవము వినినై అందరు ముకుళిత హస్తులై యాలకించుచుండిరి,

'సర్వమంగల మాంగల్యే శివే సర్వార్థసాధికే
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి 'న మోస్తుతే!'

పరమేశ్వరి సంప్రీతియై దేవతలను జగదుప కారక మగు వరము కోరుకొండన్నది, ఇట్లే త్రైలోక్య పాలన మొనర్పవలసిన దని దేవత లర్థించిరి. చండిక తాను ముందు ధరింపబోవు నవతారములు చేయగల దేవకార్యములు వర్ణించుచున్నది.

'నందగోపగృహమున యశోదా గర్భమున బుట్టి వింధ్యవాసినినై రాక్షసుల సంహరించెదను. మరల వైప్రచిత్తులైన దానవులను భక్షించి రక్తదంతికా నామముతో ప్రసిద్ధి నొందగలను. తరువాత శతాక్షీ శాకంభరీ నామములతో నవతరించి మునిలోకమును రక్షించెదను. దుర్గాసురుని జంపి దుర్గాదేవి యను విఖ్యాతి పొందగలను, మరల మునులను బాధించు రాక్షసులను భీమా రూపమున భక్షింతును. అరుణరూపదైత్యుడు త్రైలోక్యమును బాధించుచుండగా భ్రామరీ రూపము దాల్చి యాతని వధ యొనర్తును. ఇట్లే దానవకృతమగు బాధ ఎప్పుడెప్పుడు కలిగినను అప్పు డప్పు డవతరించి శత్రు క్షయ మొనర్చుచుందును. నిస్సంశయముగా నన్ను స్తవ మొనర్చువారి భాధ లన్నియు నాశ మొనర్తును -'

పై యర్థములు గల మంత్రము లుచ్చరించుచు హోతలు హోమ మొనర్చుచుండగా, పరమేశ్వరి యా విధముగా ప్రతిజ్ఞా వాక్యములు పలుకుచున్నట్లుగానే అక్కడ కూడిన చాతుర్వర్ణ్య జనమునకు తోచినది. వారందరు పరమేశ్వరికి చేతు లెత్తి నమస్కరించుచు నేక కంఠముగా నిట్లు ప్రార్థించిరి,

'తల్లీ, మ మ్మీ యవనుల బాధనుండి రక్షింపుము ! రక్షించు తల్లీ !'

33

సరిగా నా సమయమున హోమకుండమునకు దిగువ భాగమున నుండి భూమి పెటిలినట్లు శబ్దము వినబడినది. ఆ శబ్దము హోమాగ్ని శిఖల శబ్దముతో కలసి 'హుంభా !' అనుచున్నట్లు అందరి కొక్కమారుగా వినబడినది. ఎల్లరు అద్భుతా వేశముతో స్తంభీభూతు లైయుండ, నిశ్చలముగా శ్రీ విద్యారణ్యులును శ్రీ శంకర స్వాములును అర్ధనిమీలిత లోచనులై ధ్యానము చేయుచు, 'బసవ శంకరా !' అని పిలిచిరి.

తల్లిదండ్రుల పిలుపు విన్న బిడ్డ వలెనే, ఆ శబ్దమునకు కారణభూతమైన కోడె దూడ ప్రేమతో మరల 'హుంభా !' యన్నది. ఆ హుంభారవము యాగశాల యంతయు నిండి దిక్కుల బర్వినది. కుండములో నుండియే కాక, ఎక్కడికక్కడ నుండియే హుంభారవ మిప్పుడు పుట్టుకొని వినవచ్చు చున్నది.

పలువు రానంద పరవళ్ళై రి, కొందర కాశ్చర్య మైనది. కొందరికి భయ మావహించి నోళ్ళు కట్టువడి చూపులు స్తంభించి యవయవములు నిశ్చేష్టము లయినవి. అందరను విభ్రాంతి యావేశించి హృదయములలో నద్భుత మగు నూత్న చైతన్యము నది విజృంభింప జేసెను. ఆ హంభారవ మొనర్చు గోవ త్సముపై వారల కవ్యక్తమగు వాత్సల్య ముదయించుచున్నది.

ఆ హంభారవ మంతకంతకు ముదురుచున్నది. అది యిప్పుడు తల్లికై గోవత్స మరచు నరపుగా లేదు; అసహాయ మైన వృషభము యజమానికై యరచు నరపును గాదు. ఇప్పుడది జన్మ విడిచిన యాబోతు కుప్పించి యెగసి వేసెడు రంకె!

మహోక్ష మొకటి అ యగ్నికుండ జ్వాలలనుండి ఒక్క గంతున వెలు వడి వారందరకు కన్నుల పండువు చేసెను. దాని దేహ కాంతి పాల సము ద్రపు తరగల వలె నిర్మల స్నిగ్ధములై తలతల లాడుచున్నది. దాని సర్వావయ వములు మాంసలములై యున్నవి. నాలుగు కాళ్లను నాలుగు మహా నాగముల వలె నిలువక యాడుచున్నవి. దాని గంగడోలు ఇటు నటు నూగుచుండ గీతా స్వరము వలె నున్నది. దాని మూపురము అమృత భాండము నిలిపిన ట్లున్నది. దాని నిలువు కొమ్ములు రెండు వజ్రాయుధముల వలెను, కోపులు ఇంద్రధనుస్సు వలెను శత్రు భయంకరముగను ఆశ్రిత రక్షకములుగను చూపట్టు చున్నవి. దాని మెడలో హారముగా నున్న మువ్వల పట్టికయు, కొలికిగా నున్న పెద్దగంటయు దానికి దివ్యాకారము చేకూర్చుచు. హంభారవ మొనర్చి నప్పుడెల్ల కదలియాడుచు ప్రణవపురస్సరమైన వేదఘోష శ్రావ్య గంభీరముగా నుద్ఘోషించు చున్నవి. సర్వ దేవతా స్వరూపమైన చండికా దేవతయే, ఈ ధర్మ వృషభా కారమున నిప్పుడు లోకోద్ధరణమున కా విర్భవించినట్లు స్పష్టముగా స్ఫురించు చున్నది. అది నేలపై కాళ్ళూనక అంతరిక్షమునసే చెంగు లిడుచున్నట్లున్నది. అది వా రెన్నడు మున్నుచూచి యుండిన వృషభా కారము కాదు. సాక్షాత్తుగా మూర్తీభ వించిన నందికేశ్వరుడే, అది హంభారావ మొనర్చుచు కదలుచున్నప్పుడు విన వచ్చుచున్న శ్రావ్య ఘంటారవ మాలకించి కమలనాభాత్యుడు ఆశువుగా చెప్పిన ఈ శ్లోకముతో వందన మాచరించెను.

'శృంగే శూల సుదర్శనే రవి శశినేత్రే, ముఖం ధర్మభూ:,
పాదా వేద చతుష్టయం, వపు రిదంతే విశ్వదేవాత్మకమ్,

శ్రీయాగోత్థ, నమోస్తు శంకరజయస్తంభాయ భద్రాయ, తే!
హంభేయం జయతేతరాం శివకరీ ఘంటారవాభ్రేడితా!'

జను లానంద భాష్పములు విడుచుచు కేకలు వేయసాగిరి.
'హర హర మహాదేవ శంభో!'
'హరి హరి మహాదేవ విష్ణో!'
'హర ఓం, హరి ఓం, హరి హర ఓమ్!'

యాగశాలయందును మహాశాలయందును ఆ వృషభము స్వేచ్ఛావిహార మొనర్చుచున్నది. అది వచ్చి తమ్మ క్రొక్కవేయు నని ఒక్కరును భయపడి ప్రక్కకు తప్పుకొనుటలేదు. దాని పవిత్రమైన గొరిజలు ఎవరికి వారు తమ శిరస్సులపై ధరింపవలె నని ముచ్చటపడుచుండరి.

మహాశాలలో వేమారెడ్డి కన్నులు మూసికొని ఆధ్యమూర్తిని ధ్యానించుచు శిరస్సు వంచి భక్తిపరవశుడై నమస్కరించుచుండెను. ఆ వృషభము తన విశాలనేత్రముల నెవరినో వెదకుచున్నట్లు దిక్కులు బ్రసరింపజేసినది. ఆ దృష్టి వేమారెడ్డిపై బడినది. వెంటనే ఆ వృషభరాజు, అద్భుతపరవశులై యందరు చూచుచుండ, చెంగున దూకి యెవ్వరిని ముట్టక తనరెండు ముందుకాళ్ళను ఆకాశములోని కెత్తి వేమారెడ్డి శిరస్సున నుంచెను. వేమారెడ్డి ధన్యోస్మి యనుచు వృషభ రాజపాదములను తనరెండు బాహువులతో భక్తిమీర నాలింగన మొనర్చుకొని కన్నుల కద్దుకొనెను. శ్రీ విద్యారణ్యులును, శ్రీ శంకరమునీంద్రులును తమ కటాక్షామృత ధారలతో వేమారెడ్డి నభిషేకించిరి. విద్వద్బ్రాహ్మణ బృందము వేమారెడ్డి ధన్యతను ప్రశంసించెను.

'ఈ వృషభము సంచరించు ప్రదేశమున కంతటికి నీవే పాలకుడవు వేమయ్యా! జయవేమ ప్రభూ!' అనుచు నచ్చట కూడిన మహాజన సమూహ మంతయు జయజయ ఘోషలతో వేమారెడ్డి నగ్గించెను. వేద విప్రులు 'తథాస్తు! తథాస్తు! తథాస్తు!' అని యాశీర్వదించిరి.

అంతలో నా వృషభము కదలినది. అది యెగురుటలో ఒకకాలు మాల్లారెడ్డికి తగిలెను; మరియొక పాదము అన్నారెడ్డికి తగిలినది. అది మరల యాగశాల ప్రవేశించి శ్రీ విద్యారణ శంకరస్వాముల కెదురుగా నిలిచినది. దాని గంగడోలు కుండము ముందున్నవారలో ఎర్ర ముఖమున రాచుకొనగా

ఘంటానాదము గణగణ వినవచ్చినది. 'శంభుదాసా! శంభుదాసా! శంభుదాసా!' అని యా ఘంట పలుకగా, శ్రీ శంకరస్వాములు నారాయణస్మరణ మొనర్చిరి.

శ్రీ విద్యారణ్యాలయు శ్రీ శంకరస్వాములయుఅభ్యనుజ్ఞ తీసుకొనుచున్నట్లు ఆ వృషభరాజు ఒకమారు ఒకరివంకకు ఒకమారు ఒకరివంకకు తలయూపి యాగశాలయు మహాశాలయు వదలి పర్వతారణ్యములలో ప్రవేశించి స్వేచ్ఛా విహార మొనర్చినది. దాని రంకె అంతకంతకు దూరదూరమై కొంతవడికి వినరాక గాలిలో లీనమైనది. కాని దాని రూప మందరి హృదయములలో హత్తుకొని ప్రత్యక్షముగా నున్నట్లు తోచుచు నుత్సాహ మొసంగుచుండెను.

ఇంద్రజాలమువలెనే ఇంతవరకు చండికాహోమమును, ధర్మవృషభావిర్భావమును జరిగిపోయినవి. అందరు నద్భుతాశ్చర్యములలో మునిగియుండిరి. హోతలు మరల హోమము సాగించి సురథుడును సమాధిశ్రేష్టియు తపస్సు చేసి చండికాప్రసాదము పొందుట పూర్తికావించిరి. హోమము పూర్తియైనది. పూర్ణాహుతి యైనది. ఋత్విక్కులు తర్పణ మార్జనాదులు పూర్తికావించిరి. బ్రాహ్మణాది చాతుర్వర్ణ్యజనములకు బహువిధపాకములతో సంతర్పణ మైనది.

ఆ సాయంకాలమున శ్రీ విద్యారణ్యుల సమక్షమున, శ్రీ శంకర సంయమీంద్రులు కొలువుతీరిరి. వారిని విద్వద్బ్రాహ్మణ బృందము పరివేష్టించినది. వేమారెడ్డిని గౌవర స్థాన మలంకరింపజేసిరి. వేమారెడ్డి ఋత్విక్కులకు భూరి దక్షిణల నర్పించెను.

అప్పుడు శ్రీ శంకరదేవులు 'శంభుదాసా!' అని ఎర్రయను సంభోధించి రమ్మని యాహ్వానించెను. ఆ తామ్ర మైనదేహము ఆనందముతో గూడిన వినయముతోడను లజ్జతోడను. మరింత ఎర్రనగుచుండ, ఎర్రయ ముందుకు వచ్చి గురువులకు సాష్టాంగ దండ ప్రణామ మొనర్చెను.

'ఇతడు మా ప్రియశిష్యుడు ఎర్రయ. ఆంధ్ర మహాభారతము పూర్తికావించినాడు, అనుచు శ్రీ శంకరులు శ్రీ విద్యారణ్యులకు పరిచయము చేయగా, వారు 'నన్నయ తిక్కనలు వదలిన జయకావ్య భాగము మీ శిష్యుడు పూరించుట విశేషమే. అది తప్పక మీ అనుగ్రహ ఫలమే!' అని తమ యానందము ప్రకటించిరి, ఎర్రయ చిత్తమనుచు మరల శ్రీ విద్యారణ్యులకు నమస్కరింపగా

వారు నారాయణ స్మరణ మొనర్చిరి. 'ఇతని పుణ్యఫలము కూడను' అని శంకర గురువు లిట్లనిరి:

'శ్రీ దుర్గాపరమేశ్వరి ఇప్పుడు సంప్రీత చిత్తయై సావధానముగా కొలువు తీరియున్నది. నీవు పూర్తి కావించిన ఆంధ్ర జయకావ్య మామె సన్నిధిలో వినిపింపుము. యుద్ధములలో జయ మాకాంక్షించు ప్రభువుల కది జయప్రదము!'

ఇట్లనుచు వారు వేమారెడ్డి వంక కటాక్ష ప్రసార మొనర్చిరి. 'ధన్యోస్మి' యని యెర్రయ పలికెను. మల్లారెడ్డి పొంగిపోయి ఆనా డక్కడ తిరుగాడిన వృషభకలా వేశమువలెనే లేచి వెళ్ళి ఆంధ్ర జయకోశము తెచ్చి ఎర్రయ చేతికి భక్తి గౌరవములతో నందిచ్చెను. ఎర్రయ గురువుల యనుమతితో సుఖోపవిష్టుడై కోశపూజ కావించి పఠింప నుపక్రమించెను.

'నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్!'

ఇట్లు ధ్యానించి మధ్యమధ్య నెట్టి వ్యాఖ్యానమును జేయక కావ్యపఠన మారంభించెను. ముందు నన్నయ భట్టారకుని చివరి పద్యము పఠించి యా పిమ్మట తన రచన వినిపించెను.

'స్ఫుర దరుణాం శురాగరుచిఁ బొంపిరి వోయి నిరస్తనీరదా
వరణము లై దలత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతర హంస సారస మధువ్రతని స్వనముల్ చెలంగఁగాఁ
గరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళఁ జూడఁగన్.

'దానాంభః పటలంబునన్ బృథుపయో ధారవలిం దాల్చి గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలన్ఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢా కారతన్ డిగ్గెనా
గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్.

'కల నీల కంఠ కోలా
హలలీలలు సెందె రాజహంస కులములం
దిలకించె సప్త పర్ణా
వలి విగలిత కుసుమ కుట జ వాటికల గెడన్.

'అతిగాంభీర్య విభూతి నేక చులుకాహంకార నిశ్శేష శో
షితపాథోధి పయస్కుఁడైన ముని దోచెం బుణ్య తేజోమయం
కృతి నయ్యామ్య దిగంతవీథిఁ బ్రకడక్రీడా కళాగర్వ గ
ర్జిత మండూక కళింకితాంబు ఋచితాసిద్ధి ప్రదాచార్యుఁడై'

ఆనంద తన్మయు లై యెల్లరు నాలకించుచుండిరి. ఆ పద్యము విని శంకరస్వామి సంతోషము పట్టలేక తనపైనున్నశాటి తీసి యఱ్ఱయకు కప్పి, 'ఏమోయీ ఎఱ్ఱయ్యా, అపరాగస్త్యులగు శ్రీ విద్యారణ్యస్వాముల మహత్త్యమే నీవీ పద్యములో వర్ణించినట్లు భాసించినదోయి, మాకు!' అని యగ్గించెను. ఎఱ్ఱయ విసయ వినమ్ర శిరస్కుఁడై మౌనము వహింప, నదియే సహస్రముఖ ముగా నర్థవంత మైనది. ఎఱ్ఱయ మఱల పఠింపసాగెను.

ఎఱ్ఱయ జయకావ్యము నామహాజన సమూహము నిశ్శబ్దముగా నుండి శ్రద్ధగా నాలకించుచుండెను. ఎంత విన్నను వారికి తృప్తి కలుగుటలేదు. దిక్కులలో నొక క్రొత్తసుగంధి వాయువు ప్రవేశించినట్లయినది. కాలగర్భమున నుదయించిన నూతన శిశువువలె, లతలో పుట్టిన యపూర్వల తాంతమువలె భాసించిన దా కావ్యము. భారమగు ఘోమకర్మ నిర్వర్తించిన ఋత్విక్కులు కూడ తమ శరీరాయాసము గమనింపక కావ్యమాలకించుచుండిరి. ఆ పవిత్ర గంభీర వాణీస్రవణముచే శ్రోతలు తాము ధన్యుల మైతిమని భావించుచుండరి.

కొంతవడి శ్రీ శంకరస్వాములు విని, 'నన్నయభట్టా!' అని యఱ్ఱయను సంభోధించి, 'రేపు మధ్యాహ్నము మఱల సాగింతము!' అని సెలవిచ్చిరి.

ఆప్పటికి గాని వేమారెడ్డికి ఒడలు తెలియలేదు. ఇక మాల్లారెడ్డి దిగ్విజయము చేసిన వాని వలెనే ఉండెను. వారి సోదరులు బంధువులు అందరు ఆనంద తన్మయులై యుండిరి.

హరహర మహాదేవ శబ్దములతో సభ ముగిసెను.

34

ఆ మరునాటి మధ్యాహ్నమున ఎఱ్ఱయ ఆంధ్రజయ కావ్యపఠనము పూర్తి కావించి శ్రోతల ముద్దుల నొనర్చెను.

కన్నడదేశమునుండి వచ్చిన ముగ్గురు జంగములు ఆ రాత్రి అపూర్వ మగు వీరగాధ పాడుదురని విని జనులందరు శ్రీశంకరస్వాముల యాశ్రమము ముంగున్న విశాల ప్రదేశమున సమావిష్టులై రి

కథ చెప్పువారికి వేరుగా వేదిక యమర్ప నవసరము లేకపోయినది. కొంచె మున్నతముగా నున్న శిలాఫలకమే అందు కుపయోగపడెను. ఆ శిలా తలము చుట్టు దివిటీయ పట్టి చాకలులు నిలుచుండిరి. ఆ వేదికాశిలకు వెనుక తెర కట్టియున్నది. ధవళ మగు నా తెరపై హోమకుండములోనుండి దూకుచున్న బసవశంకరుని చిత్రము మనోజ్ఞముగా చిత్రంపబడి యున్నది.

శిలావేదికపైకి ముగ్గురు జంగములు ప్రవేశించిరి. వారిలో మధ్య నున్న వాడు ముఖ్యుడు. అతడు జలతారు ధోవతిపించె పోసి కట్టుకొని నగిషీచేసిన అంగీ తొడుగుకొని. దానిపై పట్టెగా తీర్చిన జలతారు ఉత్తరీయము వేసికొని తలపై ముత్యములు తళ తళ లాడు ఉష్ణీషము ధరించి యుండెను. అతడు ఎడమచేతిలో కంచుతాళములు పూని భుజముపై తంబుర పెట్టుకొని కుడిచేతితో పూని యుండెను. అతని కాళ్ళకు గజ్జె లున్నవి. అతని యనుచరు లిరువురకు జలతారు దోవతలు, ఉత్తరీయములు, తలగుడ్డలు ఉన్నవి కాని అంగీలు లేవు. వారు డక్కీలు కొట్టుచు వంత పాడుచుండిరి. వారు మగ్గురు ముందు కుపక్ర మించి సభకు మ్రొక్కిరి. సభ యంతయు నిశ్శబ్దమైనది. కథ ప్రారంభించిరి.

'జయము జయము శుభచరితుల చరితకు
జయము జయము జయము !
శుభము శుభము రణశూరుల సుద్దులు
శుభము శుభము శుభము !
నారాయణునకు భారతీశునకు
నమస్కారమండీ !
ఆదిశంకరుల పాదాబ్జములకు
మా దండంబులు స్వామీ !
శ్రీ తుంగాతట శ్రీశృంగేరీ
శ్రీ గురువరులకు వినతి :
విద్యారణ్యులు విజయంచేసిరె

వినతి వినతి వినతి !
పరంజ్యోతి యీ ప్రవిమల మూర్తిగ
ప్రభవం బందినది.

శంకరసంయమి సద్గురుదేవుల
చరణమ్ముల కివె నతులు !

కూడిన సద్ద్విజ కోటికి విద్వ
ద్గురు చంద్రులకును దండం !

నెత్తురు మాంసము నింపిన చర్మపు
తిత్తి చెడున దీ తనువు.

కీర్తికాయమో కెడయక పెరుగుచు
స్ఫూర్తిమంతమై నిగుడున్.

కుమ్మతదుర్గము క్రూర రాక్షసులు
కూల్చివేసి రండీ !

కంపిలి కోటలు కాలయిచనుడే
కాల రాచె నండీ !

కంపిలి రాయ ఘనకథ లన్నియు
గంగ కలిసె నండీ !

కుమార రాముని గుణ చారిత్రము
గోతి పాలుగా నయ్యెన్.

కంపిలి దుర్గము కాచే యధిపుడు
కంపిలి రాయుండు,

అనాథరక్షకు డంచే యతడే
అతడే ధర్మప్రభువు.

శరణని వచ్చిన శత్రువు నైనను
సంరక్షించు నతండు

కుమారరాముడు కుమారు డతనికి
కుమారవిక్రము డాజిన్

కుమారరాముడు సు మాస్త్రరూపుడు
సమస్త రామా ప్రియుడున్.

ఢిల్లీ పాచ్చా కూతురు కుమారరాముని కథలు విని వఁచి తన పలపు తండ్రికి చెప్పగా అతడు సంతోషించి కంపిలి రాయలకడకు దూతల బంపెను. వా రిట్లు చెప్పుచున్నారు :

'డిల్లీ పాచ్చా ముల్లో కంబుల
నెల్ల వారలకు నెరుక కదా!

పాచ్చా కూతురు ప్రమదారత్నము
భాస్వరదీపము వంటి దయా!

కుమారరాముని గుణ రూపములకు
సమాన మైనది సరిగా.

పాచ్చా మీతో బంధుత్వంబున
కిచ్చయించి యున్నాడు.

పంపుడు రాముని పాచ్చాకూతును
పరిణయ మాడగ, డిల్లీకి' ?

రాయబారములు రాయలు వినె మది
రంపపు కోతలు గాగన్.

కంపిలి రాయలు ఖండితంబుగా
కబురంపెను దా పాచ్చాకు

మంచిది పాచ్చా మంచి మాటలకు
మహా దానం దంబు !

మా దారిన మము మా కాంతలతో
మననీయండీ బాబూ!

మా శుభాకాంక్షలు మరి మరి చెప్పుడు
మరువక ఢిల్లీ పాచ్చాకు

'దూతలు రాయల మాటలు చెప్పగా డిల్లీ పాచ్చా మండిపడి'

'కంపిలి రాయల కాలరాయగా
కంపిలి కోటల కాల్చి వేయగా
కుమార రాముని కూల్చివేయగా
క్రూర నిశ్చయము సలిపెన్.

డిల్లీ పాచ్చా తన పాపోసుల పల్లకి కంపిలికి పంపెను.

'ఆకస్మికముగ వరుణోదయమున
అది సాగిన దొకనాడు

పాపోసులు గల పాచ్చా పల్లకి
భటసంఘంబులు గొలువ.

సుల్తాను పరివారము ఏ మని ప్రకటించినా రంజే.

పాచ్చా వారల పా పోసులకును
బహుమతి తెండీ. ఓహోం!
బ్రదుక దలచితే పాపోసులకును
బహుమతు లిండీ బీ భీం!

ఇట్లు సుల్తాను పాపోసుల పల్లకి ఊరేగుచుండగా,

ఆ శబ్దము విని యదరి పడుచు జను
లందరు లేచిరి కంపిలిలో.

పడకుచు కొందరు బహుమతు లిచ్చిరి
పాపోసులు గల పల్ల కికిన్

పట్టిరి హారతి పళ్లెము కొందరు
పాపోసులు గల పల్లకికిన్

పట్టు వస్త్రముల పరివేష్టించిరి
పాపోసులు గల పల్లకికిన్

పసిడి వెండియును బహూకరించిరి
పాపోసులు గల పల్లకికి

సాహాబు జనముల సాహం కార నాదము కుమారరాముని చెవుల బడినది.

కుమారరాముడు క్రోధోగ్రుండై
కోల్పులి యట్టుల నార్చెన్.

కుమారరాముడు క్రూర నాగ మటు
ఘోరపు బుసతో లేచెన్.

దక్షాధ్వ రవి ధ్వంసకు డట్టుల
దద దద మనుచుం దరలెన్.

పల్లకి బట్టిన వాహక జనముల
పార దన్నె నొక త్రుటిలో.

పల్లకి బొంగును పట్టి విరిచెనే
ఫెళ్లున రాముం డపుడు.

పల్లకిలో గల పాపోసుల జత
పాడంబులనే రాచెన్

పాపోసులకును పట్టిన కాన్కలు
బాజా రంతయు చిమ్మెన్.

పల్లకితోగల భట సంఘంబుల
పళ్ళు విరుగగా తన్నెన్.

పల్లకితో గల పరిజను లందరు
పారిరి వెను జూడకయే.

జయము జయము శుభచరితుల చరితకు
జయము జయము జయము!

శుభము శుభము రణశూరుల సుద్దులు
శుభము శుభము శుభము!

ఢిల్లీ పాచ్చాకు బహదూరుఖాను అను మేనల్లుడు కలడు. అతడు వీరుడు. అతనిపై నతని శత్రువులు కాలనేమి మొవలైనవారు నేరములు కల్పించి పాచ్చాకు మనస్సు విరిచిరి. అతనిని పట్టుకొని రమ్మని పాచ్చా ఆజ్ఞాపింపగా ఖాను

కంపిలిరాయల శరణు చొచ్చెను. రాయ లాతనికి అభయ మొసగెను. పాచ్చా యతనిని పంపు మని రాయలకు తాఖీదులు పంపెను. రాయలు నిరాకరించెను. దిల్లీ పాచ్చాకు కోపము ఇనుమడించినది.

ఇది జరిగిన నెలయేని గడువకయె
ఎగిరి వచ్చినది దండు;

మహా.మారివలె మంటల సెగలను
మలమల మాడ్చుచు దారి.

కాల యవనుడే కాల కింకరుల
కంపిలి మీదికి నడపెన్.

దడదడ ఢా మ్మని ఢాం ఢాం డా మ్మని
దండు నగారా మ్రోసెన్.

కంపిలి దుర్గము కావాలి వారలు
కాచిరి మూయుచు ద్వారాల్.

కోట గోడలను కొమ్మల వీరులు
కోయని నిల్చిరి కడకన్.

లగ్గల బట్టగ లక్షల కొఁదిగ
లంఘించిరి ఆ తురకల్.

కుమారరాముడు కోటగోడలను
కుదురుకొలిపి రక్షించెన్

కంపిలి కోటలు కదలక నిలిచెను
కడు నాశ్చర్యము గాగన్.

లగ్గల కెక్కుట లాభము లేదని
లజ్జపడుచు సేనాని

కంపిలికిని దిగ్బంధము చేసెను
గడుసుగ రాకలు పోకల్.

కంపిలి కోటను కరవై పోయెను
కడు వడి పాలును పెరుగుల్.

అందున గూర్చిన ఆహారములును
అంతకంతకును తరిగెన్.

కోట లోన గల కొలది జలంబులు
కొంచెము కలకలు వారెన్.

కంపిలి జనముల కంపము మనముల
కాస్త మొదలిడగ సాగెన్.

కంపిలి వీరుల గట్టి గుండియలు
కాస్త కాస్తగా సడలెన్.

కంపిలి కోటలు గడగడ గడమని
కాస్త యదరగా సాగెన్.

కంపిలి రాజ్యములో ప్రధానదుర్గమైన ఆకుమ్మట దుర్గమిక ఎక్కువ కాలము ప్రతిఘటింప జాల దని కుమారరాముడు నిశ్చయించి అక్కడ నున్న బహదూరుఖాన్ కంపిలిరాయలున్న హొసమలె దుర్గమునకు రహస్యముగా చేర్పించెను. పురజనులనుగూడ చేతనైనంత వరకు పంపించి వేసెను. ఇక కుమ్మట దుర్గములో నున్నది కుమారరాయుడును అతని వీరభటులును వారి పత్నులను మాత్రమే. ఆ వేళ జరిగిన దేమంటే.

కుమారరాముడు కుమ్మఠసతులను
కూర్చి యిట్లనుచు బల్కెన్.

'వీరస్వర్గపు ద్వారము లన్నియు
బారున తెరచెద రిపుడే.

వీరపత్నులై చేర దలంచిన
దారి చూపుడీ ముందే.'

ఆ మాటలు విని వేవు లెల్లరును
మోములు వికసిం పంగా;

రాజెడి పువ్వుల రాణను తనువులు
రమణీయము లై విచ్చున్,

రాణీ వాసముల రమణు లందరును
రమణుల కాళ్ళకు మ్రొక్కిరి:

రాజహంసముల రమణను తీవిని
రాజస మొప్పగ కదలి;

పసుపు కుంకుమము పారాణియు తమ
బంగరు మేనుల నలది;

పతుల కిష్టమౌ వస్త్ర భూషలను
బంగరు మేనుల దాల్చి;

పెనుకుండంబున పెల్లుగ నగ్నిని
ప్రీతి మీర రగిలించి;

పెదవుల నాడగ పిన్నని నవ్వులు
ప్రదక్షిణించి రా యగ్నిన్;

ఎదలను కుతుకము కదల్చి పొంగగ
ప్రదక్షిణించి రా యగ్నిన్.

శుచికీలల తమ శుచిదేహంబుల
చొప్పిడ నిక్షేపించి

వీర నాకమును చేరి రెదుర్కొన
వీర భర్తలను ముందే!

ఆ సమయములో కుమ్మతవీరలు చేసిన దేమంచే.

కుమారరాముడు కూర్చి పల్కినిటు
కుమ్మతవీరుల నొకచో

'వీర నాకమును చేర బోయెదము
వెంట వచ్చువా రెవరో?

ప్రాణభీతి గల పంద లందరును
పారి పొండి మము విడిచి!'

ఆ మాటలు విని యనిరా వీరులు
ఆనందంబులు పొంగన్

'కుమార రామా, కుమ్మతవీరులు
కొంకరు దేనికి నెపుడున్;

నీ యాజ్ఞలు మా నెత్తిన దాల్తుము
నిక్కము వత్తుము నీతో.'

ఇట్లు కుమ్మఠవీరు లందరు చెప్పి వారు చేసిన దేమంటే

అభ్యంగనములె ఆచరించిరి—ఆహా!
జిలుగు వస్త్రములె సింగారించిరి—ఓహో;
సరములు మెడలను స్రజములు కూర్చిరి—ఆహా!
గమగమ లాడెడి గంధము లలదిరి—ఓహో!

వీరుల కంతట విందుచేసె కడు
ప్రీతి తోడ రాముండు;

కోటను మిగిలిన కూడంతయు నట
కూర్చిరి రాశిగ నొకచోన్;

పంచ భక్ష్యములు పరమాన్నంబులు
పారణ చేసిరి వారల్:

కస్తూరి కుంకుమ ఘనసారాదుల
కమ్మని విడెములు చేసి,

పెండికి తరలెడి పెండి వారివలె
వీరులు తరలిరి పోరన్.

వదలి కవచములు వదలి మెత్తలును
వదలి డాళ్ళు తలబిళ్ళల్,

కత్తులు మాత్రము కస్సున దూయుచు
కడగిరి పోరికి వారల్.

వైణిక వాంశిక వాద్యంబుల శ్రుతి
పర్వంబులుగా వినరాన్.

సన్నాయిల జత జంట నాదములు
శ్రవణానంద మొనర్పన్,

వీరులు కడగిరి వీరనాకమును
బిరబిర చేరెడు తమతో

బార్లగ దుర్గ ద్వారము లన్నియు
బారు గ తెరచిరి వారల్.

వీర నాట్యమున ధీర గమనమున
వీరులు వెడలిరి వేడ్కన్.

అది చూచి నమ్మలేక ఆశ్చర్యముతో యవనసేనాని
కాలనేమి తన కన్నులు తుడుచుక
కాంచెను వీరుల మూకన్

మరి యును నమ్మక సరదారుల నిది
సరి నిజమా యని యడెగెన్.

నిజమే యని తుది నిశ్చయించి యిటు
నేమి వారి నేమించెన్.

కాలనేమి తన కాల యవనులను
కదలు డె దుర్గ్గాను డనుచున్.

రణ భేరులతో రణ పట హుంబుల
రాక్షస నాదము చెలగెన్.

రణము చూడ బహు రమ్యం బగుచును
రాజిలె నొక్కొ క గడియ.

ప్రాణము వదలగ ప్రతినలు పట్టిన
స్వల్పీయులు వీ రొకవైపు;

ప్రాణము లాచగ ప్రయత్న పరు లే
పలువురు భటు లిం కొకవైపు;

పోరు గడియలో పూర్ణం బయ్యెను
భూరి రమ్య మై చూడన్.

వీరశయనముల వేడుక కుమ్మర
వీరులు పొందిరి శాంతిన్.

కటిక గుండె గల కాల నేమి యే
కట కటపడె నది చూచి.

ఇరువురు వీరులె యేచిన మూర్ఛల
ఇరికిరి యవనుల బందిన్.

వారలు పూర్వము ప్రతాపరుద్రుల
భక్తిం గొలిచిన బంటుల్,

హరిహరదేవుడు మరి బుక్కండను
పరిగల పేరుల వారల్

కుమ్మత దుర్గము కూలి పోయినది
కుమారరాముం డడగెన్,

కుమారరాముని కుణపము ఢిల్లీ
కోట గోడలకు నెక్కెన్

ఢీల్లీ పాచ్ఛా కూతురు దానిని చూచి చూచి ఏమిచేసిన దంటే,

పాచ్ఛాకూతురు పగ దీరంగా
వల వల యేడ్చుచు బిట్టు,

బాకున రొమ్మున భర్రున పొడు చుక
ప్రాణంబులు తా వదలెన్.

కుమారరాముని కుణపపు నెత్తురు
కోమలి నెత్తురు కలసి

రంజిత మొనరించి డహలీ కిల్లా
లాల్ కిల్లాగా మార్చెన్.

జయము జయము శుభచరితుల చరితకు
జయము జయము జయము !
శుభము శుభము రణ శూరుల సుద్దులు
శుభము శుభము శుభము !

కథ పూర్తి యైనది. శ్రోతలందరు కథ విని తన్మయులై నిశ్శబ్దముగా నుండిరి, వారల హృదయములలో శాంతమగు నొక మహావేశము ప్రవేశించి నది. ఒక్కరును మాటాడ లేదు. ఒ క్కరును కదలలేదు.

ఆ మహాజనమును కంపిలి వీరుల వీరావేశ మావహించినది. యవనుల నిర్భయముగా ప్రతిఘటించి నిలువవలె నను దృఢనిశ్చయము ఎవరికి వారికే కలిగినది.

35

స్కంధావారమున నందరు ప్రోలయను పిచ్చివా డనియే తలంచు చుండిరి. ఈ పాగల్ మీద బడేసాహబునకు భయభక్తు లున్నట్లు యవనులు గమనించి అత డెవరో గొప్ప పైగంబరు ఐ యుండు నని భావించుచు గౌరవ ముతో చూడ సాగిరి, అందువలన ప్రోలయ ఆస్కంధావారమునుండి సులభ ముగా తప్పించుకొని పోగలిగెను.

ఆ తడు కనపడ కుండ పోయినదితెలియగనే బడే సాహబు మిక్కిలి సంతాప మందెను. కొన్ని రోజు లాతడు తిరిగి వచ్చునను ఆశతో ఉండెను గాని రోజులు గడచిన కొలది ఆ ఆశ అంతరింప సాగెమ.

అంతట నాతడు 'ప్రోలయ తో పాటు వచ్చిన వారిని 'పిచ్చివాని జాడ చెప్పు'డని నిర్బంధింప సాగెను. తమకే'మియు తెలియద'ని వారెంత చెప్పి నను అతనికి నమ్మకము కుదురలేదు. నారందరి లో సూర్యకవి యెడల ప్రోలయకు గౌరవ మున్నదని ఆత డెరిగి యుండుటచే సూర్యకవినే మరింత యొత్తిడి చేయసాగెను.

ఒక నాడు బడే సాహబు ఏ కాంతముననుండి సూర్యకవిని పిలిపించెను. సూర్యకవి శాంత గంభీరముగా వచ్చు చున్నదే తడవుగా బడే సాహబు ఎదురు పోయి గౌర వాదరములతో తోడి తెచ్చి కూరుచుం డ చేసెను.

'స్వామీ : మీరు అబద్ధ మాడరను నమ్మకముతో మిమ్మొకటి అడగ దలచితిని'.

'మంచిది. అడుగ వచ్చును.'

'మీతో వచ్చిన పిచ్చివానిని ఎక్కడికి పంపితిరి?'

'నేను పంప లేదే!'

'పోనీ, అత నెక్కడి కి పోయెనో చెప్పుడు.'

'నాకు తెలియని దెట్లు చెప్ప గలను?'

'నేను నమ్ముదు ననియేనా మీ యూహ?'

'నమ్మి నను నమ్మకున్నను అంతకంటె నేను చెప్పగలిగినది లేదు.'

"నీవు చెప్పేది. ముమ్మాటికి అబద్ధము!'

"అబద్ధ మాడుట మే మింకను నేర్చుకోవలసిన విద్య"

బడే సాహబు కోపము చూపిన లాభము లేదని కోప మాపుకొని బ్రతిమాల సాగెను.

'బాబూ, మీ కాశ్చర్యముగా నుండవచ్చును. ఆ పిచ్చివాడు మీతో ఉండుటచేతనే మీ రందరు బ్రదికిపోయినారు - ఆయన మా తండ్రి - తెలిసినదా? నన్ను కన్నతండ్రి! నేను నా వా రందరికి దూర మైనాను ఎన్నేళ్ల క్రిందట నో దేశములు పట్టి పోయిన మాతండ్రి వచ్చినాడు గదా యని సంతోషించితిని. నన్ను నా వా రందరు వదలివేసినారు. వా రందరు మా తండ్రిని కూడ వదలినారు. అందుచేత మా తండ్రియైన నాకు దగ్గరగా నుండు ననుకొంటిని. నా తండ్రిని నాకు కాకుండ వేరు చేసినావు. ఇంత పాపము కట్టుకొందువా, బాపనయ్యా?'

'చెప్పినది నమ్మకున్న నేనేమి చేయగలను సాహబ్!'

'పోనీ గాని. మీ కాయన ఎక్కడ కనబడెనో చెప్పండి!'

'మహారణ్యములో.'

'ఏమి చేయుచుండెను.'

'మూలుగుచుండెను.'

'ఎందుకు?'

'కొడుకులమీది కోపముతో.'

'కొడుకుల మీద కోపముతోనా? మీ మాటలు నమ్మ్మ బెట్లు? కొడుకుల కంటబడి ఎన్నేళ్లయినది. కనబడనివారిపై కోప మెట్లుండును?'

'ఒక కొడుకు నా రోజే చూచి పచ్చెను.'

'ఎవరిని?'

'కడగొట్టువానిని. మల్ల డనెను.'

బడే సాహబు తెల్లబోయెను, 'బాపనయ్యా, మీకు మా కుటుంబము సంగతి రహస్య మంతా తెలియును వలె ఉన్నదే!'

'ఏమియు తెలియదు.'

'మా తండ్రి చెప్పలేదూ ?'

'ఆయన చెప్పిన వానిలో ఏమియు నాకు రహస్యములుగా తోచలేదు.'

'ఆయన బంగారము చేయుట నేర్చు కొనుటకై గోసాయిల వెంట వెళ్లె నని మీకు తెలియునా ? - కాని బంగారము చేయగలవా రుందురా ? - ఏమి పిచ్చి !'

సూర్యకవి మౌనము వహించెను.

'మాట్లాడ రేమి? బంగారము చేయవచ్చునని మీరు కూడ నమ్ముచున్నారు. నాకు తెలియును. అది శుద్ధ వెర్రి నమ్మకము. అట్టివారు మా తండ్రి వలెనే పిచ్చివా రై పోదురు !'

అప్పటికిని సూర్యకవి మాటాడ లేదు.

'ఈ మాటల కేమిగాని మా తండ్రిని చూపెట్టనిది మిమ్ము వదలను. మా తండ్రి పిచ్చి నాకుకూడ కొంత ఉన్నది. కోపము వచ్చినచో మనిషిని కాను సుమా !'

'తెలియనిది నే నెట్లు చెప్పగలను సాహబ్ ?'

'నీ మాటలు నేను నమ్మను. ఈ జూటా మాటలు చాలించి నిజము చెప్పు !' అతని కన్నులు చింతనిప్పుల వలె నయ్యెను. కొంచెము యోజించి అత డిట్లనెను. 'బాపడా ! నీవు నీ జంధ్యముపై ప్ర మాణము చేసి మా తండ్రి జాడ ఎరుగనని చెప్పగలవా ?'

వెంటనే సూర్యకవి జన్నిదముపై చేయి పెట్టి పలికెను: 'చెప్పగలను. మీ తండ్రి జాడ ప్రమాణపూ ర్తిగా నే నెరుగను!'

అప్పటికి బడేసాహబు శాంతించెను. కాని ఆతనికి హృదయాంతరాళ ములో నమ్మకము కలుగలేదు

'సరే! మీకు నెలరోజులు గడు విచ్చెదను. మా తండ్రిజాడ అప్పటికి చెప్పనిచో మిమ్ముల నందరను ముక్కలు ముక్కలుగా కోయించి మాంసము కుక్కలకు పెట్టింతును!'

సూర్యకవికి ఆపాదమస్తకము ఒక్కసారి జల్లుమనెను. ఈ దేహమునకు ఇట్టి రాక్షసుని చేతిలో ఏమైన సంభవింపవచ్చును. ఏమి గతి, అహోబల నృసింహా!' సూర్యకవి మౌనము సాహబును మరింత ఉగ్రుని గావించెను.

'ఇంతవరకు మర్యాదగా మాట్లాడు చున్నవాడను, అంత కఠినముగా నుండలే నని తలంతువా?'అని గర్జించుచు నతడడిగెను.

'లేదు. నీ వన్నంతపనియు చేసెద వనియే చింతించుచున్నాను. నా గతి యేమా అని!'

సాహబు ఫక్కున నవ్వెను. 'నీ కేమీ భయము లేదు బాపనయ్యా! మా తండ్రిపోయిన జాడ తెలుపుము!'

మరల సూర్యకవి మౌనము వహించెను ఒకకొంతతడవు సాహబు కూడ మౌనము వహించెను.

'మాట్లాడ వేమి, బాపనయ్యా?'

'మాట్లాడుట కే మున్నది, సాహబ్?'

సాహబు ముఖము చిట్లించెను. అతడు లోలోపల పొంగివచ్చుచున్న కోపము నడచుకొన ప్రయత్నించు చుండెను. అది సాధ్యము కాకున్నది. ఆపు కొన దలచిన కొలదియు దాని బల మతిశయించు చుండెను.

'ఏమి, మాట్లాడవేమి? బాపనయ్యా?' ఆ కంఠము డేరాపటము చీల్చి ఆకాశమునే బ్రద్దలుచేయు పిడుగువలె భయంకరముగా నున్నది.

సూర్యకవికి చిరాకు కలిగెను. ఆయన శాంతప్రకృతి కూడ శాంతముగా నుండలేక పోయినది.

'అబద్ధ మాడుటకు నేను మ్లేచ్ఛులలో కలియలేదు గాదా, సాహబ్?'

బడే సాహబు మండిపడెను. సూర్యకవి నిర్లక్ష్యముగా నిలుచుండెను.

'ఈ దేహమునే కాని నన్ను నీవేమి చేయగలవు? నిజము చెప్పిన నమ్మకున్నావు. నీ కర్మము! నీకు సత్యము తలకెక్కునా? నీ చేతిలో చిక్కినప్పుడే ప్రాణములపై ఆశ వదలు కొంటిని!'

ఇట్లు నిర్లక్ష్యముగా సూర్యకవి ఆడిన మాటలకు సాహబు కోపింపవలసినవాడు, అట్లు గాక చిత్రముగా శాంతించి ఆనాటికి సూర్యకవిని పంపివేసెను.

మరల మరునా డా వేళకే బడే సాహబు సూర్యకవిని పిలిపించెను. ఈనాడు సూర్యకవిని సాహబు బ్రతిమాలుచు క్రిందటి దినము ప్రశ్నలే తండ్రిని గూర్చి అడుగసాగెను సాహబు అంతవరకు కన్నీరు కార్చుచుండె నని సూర్యకవికి తోచినది. చెప్పిన మాటలే మరల మరల చెప్పుటకు విసుగు కలుగు చుండ దాని నడచుకొని శాంతముగా నత డిట్లనెను.

'నాయనా, నామాట నమ్మకపోయినచో, మరి నీకిక ఎవరిమాటల మీదనయ్యా, నమ్మకము ? అసత్యము చెప్పెడి వారినే కాని నమ్మవు కాబోలు ! నిజము నమ్మెడి వాడవే ఐనచో, పండు వంటి కులము పాడు చేసికొని మ్లేచ్ఛులలో కలిసి పోయి యుందువా ?'

ఆ సాహస వచనములు సాహబుకు కోపము కలిగింపక దీర్ఘాలోచనలో ముంచెను. తన వారిని మరల కలుపుకొనుడని ఆర్థించిన దంతయు స్మృతిలో బారినది; తండ్రి దర్శనమైన దాది ఆ విషయమున నుత్కంఠ యెక్కువ కాజొచ్చినది. నా యనువారు ఒక్కరు నాతని కిక్కడ లేరు, ఆతనికి భోగ స్త్రీలపై కామకాంక్ష యైన లేదు. ఎందుకు తా నిట్లాయాస పడుట ; ఎవ రానం దింపను ; నిస్పృహ యుద్రేకించినది.

అతనికి కోపము రాకుండుట సూర్యకవి కాశ్చర్యము కలిగింపలేదు. కవి హృదయాంతరాళములో అణగియున్న కారుణ్యసముద్రము వెల్లివిరియుట చేతనే అతనినోట నామాటలు వెలువడినవి. తన మాట లాతురక అన్యథా భావించు నేమో యను సందేహమే యతనికి రాలేదు.

ఉభయులును చాలసేపు మౌనముగా నుండిరి. కొంతవడికి సాహబు నిట్టూర్పు నిగిడించి సూర్యకవిని పంపివేసెను.

పది పదునైదు రోజులు శాంతముగా గడచిపోయినవి. పోతమ్మకు మనఃస్వాస్థ్య మించుక చేకూరు చున్నది. భర్తను సాహబు ఎప్పుడు పిలిపించినను ఆమె యాతని ప్రాణములపై నాశ వదలుకొను చుండెను. వరుసగా నిన్ని రోజులు పిలిపింపకుండుట చే నామె కించుక ధైర్యము చే కూరినది.

సివ్వక్క బడేసాహబుకు ఆదరముతో పుత్రునకు వలె వంట చేసి పెట్టుచు ఉపచారము లొనర్చుచు ఆతని యాదరమునకు పాత్ర మైనది.

36

ఇంతలో నొక విశేషము జరిగినది. బడే సాహబు దర్శనమునకు నిధుల తీయు జంగమదేవర చను దెంచెను. అత డతికష్టము మీద ఏకాంతమున సాహబును కలసికొన గలిగెను. అక్కడ ఆ జంగమదేవర ఒకటే గొడవ: 'నిధులిక్కడ నున్నవి, అక్కడ నున్నవి. వానిని తీయించువారు లేరు. చూపించినచో రహస్యము తెలిసికొని ఆ నిధి తీసికొని నన్ను రామాప్రెగ్గడ చేసినట్లే గెంటించి వేయుదురు. ఈ మాటు నిధుల రహస్యము చెప్పను. -నీకేమీ నిధులక్కర లేదా, సాహబ్? ధన మక్కరలే దను బుద్ధిహీనులే ఈనాడు వెలసినారేమి! సాహబ్, నీవు బుద్ధిమంతుడవే!'

ఆతని విచిత్రప్రవృత్తి చూడ జూడ బడే సాహబుకు అపూర్వమగు నాకర్షణ కలిగినది. నిధులనుగూర్చి అత డొకేవిధముగా మాటాడు చుండ, హేమవిద్య సాధింప దేశములు పట్టిపోయిన తనతండ్రి అతనికి జ్ఞప్తికి వచ్చుచుండెను. తన కీ మధ్య కనిపించి మాయమైన తండ్రి పిచ్చి యవతారమువలె గాక, ఈ జంగమదేవర యాకారము స్ఫూర్తితో నుండి, ఒకవిధముగా గౌరవము కలిగించు వేషముతో నున్నది. పరిశుభ్రముగా దువ్విన నల్లని గడ్డము మీసములు, నలుసంత దువ్వలేక తల నిండ నున్న నిండుజుట్టు, అప్పుడే స్నానము చేసినట్లు శుభ్రముగా నుండి, నిలువెల్ల విభూతిరేఖలు తీర్చిన దేహము సాహబును ఆకర్షించెను. వినివిని యత డిట్లడి గెను.

'జంగమదేవరా, ఏమి పనిమీద వచ్చినా విక్కడికి?'

'నీకు సహాయము చేత మని! మహాదేవ శంభో!'

'ఏమి సహాయము?'

'శంభో! - ధన సహాయము చేతా మని!'

సాహబు చిరునవ్వు నవ్వెను. ధనము కావలసినవారు ధన మిచ్చు దాతల యొద్దకు యాచనార్థము వెళ్ళుదురు. ధన మిచ్చువారు అది కావలసిన వారి యొద్దకు యాచకులై వెళ్ళుట యతనికి క్రొత్తగా నున్నది.

'మంచిది. నీ ధన మెక్కడ దాచినావు? తెప్పించుటకు భటులను బండ్లను పంపుదునా?'

'మంచివాడవు! ధనము మూట కట్టుకొని వచ్చి నీ కర్పించెద ననుకొన్నావా? బలే సాహబువే!'

'మరి?'

'నా విద్యవలన భూమిలో పాతి యున్న నిధులు కనుగొను శక్తి నా కున్నది. అవి తీయించగలను.'

సాహబు ఇంచుక యాలోచించెను. నిధులు తీయువారీ దేశములో నున్నారని విదేశములనుండి వచ్చిన యవనులకే నమ్మక మున్నది. ఇక ఇక్కడ పుట్టి పెరిగి ఇస్లాము స్వీకరించిన సాహబుకు దానియందు నమ్మక ముండుటలో నాశ్చర్యమేమి? అందులో నతని కిప్పుడు ధన మవసరముగా నున్నది. చెంచులపహరించిన ధనము తా నచ్చవలసి రావచ్చును, ఏ మైనను ఈతడు తనయొద్ద కిట్లు వచ్చుటకు కారణ మాత డూహింపలే కుండెను. అది తెలిసికొనుటకై సంభాషణలోనికి దింపెను.

'మీ దేయూరు, జంగమ దేవరా?'

'జంగముల మైన మాకు ఒక ఊరేమి? ఎక్కడనున్న అక్కడే మాయూరు!'

'మీ బంధు వర్గ మెక్కడ నున్నది?'

జంగములకు బంధువులు ఎవరు? ఎవ రాదరించిన వారే మా బంధువులు. ఎవరు మా విద్యను గ్రహించి పూజించిన, వారే మా యాప్తులు!

'నీవు నిధులు మాకు చూపినచో, ఆ ధనము మే మెట్లు వినియోగింతుమో ఎరుగుదువా? ఈ దేశములోని ప్రజలను చంపుటకు, గుళ్లు గోపురములు పాడువెట్టుటకు, ఊళ్లు తగుల బెట్టుటకు, బాపన బ్రెగ్గడలను నరకిపారవేయుటకు—'

జంగము డా చివరిమాటలకు పొంగిపోయి, సంతోషము పట్టలేక అడ్డువచ్చి యిట్లనెను, 'నా కదే కావలసినది సాహబ్! సరిగా నేను కోరే దదే!- ఈ గదిలో, అదుగో, ఆమూల కొంచెమే ధన మున్నది. అది ఒక్కమణుగు

బంగారపు ముద్ద. పదివిండ్ల లోతుననే యున్నది. అది తీసికొని రామాప్రెగ్గ డను నరికించుదూ, సాహబ్!'

సాహబుకు ఆశ్చర్య మైనది. తన్ను తన వారికి కాకుండ జేసిన వారిలో ఒక రామాప్రెగ్గడ ముఖ్యుడు. ఆ రామాప్రెగ్గడయేనా ఈతడు చెప్పునది? ఇట్లాలోచించి, 'ఏ రామాప్రెగ్గడ?' అని యడిగెను.

'ఏ రామాప్రెగ్గడ ఏమిటి? తురగా రామాప్రెగ్గడే! నేను చెప్పిన పద్యము ఎరుగవా?'

'కోమటి వేముని దానము
భూమి బ్రసిద్ధంబు గంధభూజము చెంతన్
పామున్న పగిది తురగా
రాముం డున్నాడు చేరరా దెవ్వరికిన్.'

బడేసాహబు పరధ్యానములో పడిపోయెను. ఇతడు తన కపకారము చేసిన రామా ప్రెగ్గడనే పేర్కొనుచున్నాడు. తన యన్న వేమన్నను భూషించు చున్నాడు. వేమన్నపై గూడ నతనికి కోప మున్నను ప్రేమయు నున్నది గౌర వము నున్నది. నిజముగా నాతని కోపము ఎక్కువగా ప్రసరించుచున్నది రామా ప్రెగ్గడమీదను, తన మాతులపుత్రు డగు నూకయమీదను. వారే ముఖ్యముగా తన్ను తనవారిలో కలియనీయకుండ అడ్డము కోట్టినవా రని సాహబు నమ్మకము. లేకున్నచో ప్రేమమూర్తి యైన తన తల్లి అన్నమ్మకుమారుని కాదనునా? తన కన్నతల్లియే తన్ను అసహ్యించుకొన్న దని అతనికి ఊహకూడ తట్టలేదు. సాహబు ఆలోచించుకొనుచుండగా అతనికి తన తండ్రి కూడ తన్ను వదలి వేమన్నయొద్దకే చేరి యుండడుగదా, అను సంశయ ముదయించెను.

'జంగమయ్యా, వేమయ్య మాకు శత్రు వని ఎరుగుదువా?'

'ఎరిగియే వచ్చినాను. అతడు డబ్బులేక అల్లాడుచుండగా తెలిసి నిధులు తీయింతు నంటే ఆ తురగారాముడు పడ నిచ్చెనా? పొరపాటున నిధులున్నచోట్లు చూపి తీసే ఉపాయముకూడా చెప్పినాను. నా ప్రమేయము లేకుండా రాము డానిధలు తీసికొని ఆట ఆడుతున్నాడు! దొంగ!'

'సరేకాని అక్కడికి ఎవరైనా ఒక పిచ్చివాడు నీవుండగా వచ్చినాడేమో చూచినావా, జంగమయ్యా?,

'ఒక్క దేమిటి? రోజూ అక్కడికి వచ్చేదే పిచ్చివాళ్లు! వేమయ్యకే పిచ్చి యెత్తినది. దిగంబరు డైన ఒక దేశద్రిమ్మరి ఎవరో అక్కడికి రాగానే అతనిని 'నా తండ్రి' అని ప్రకటనచేసి పెద్దవిందులు ఉత్సవములే చేయించి నాడు. నిధు లక్కరలే దని త్రోసివేసేవారు పిచ్చివారు కాదా, మరి సాహబ్?'

బడేసాహబు హుంకారమే చేసెను. 'తండ్రి అని పిచ్చివానికి ఉత్సవము చేయుచున్నాడా? మా వద్దనుండి తప్పించుకొని పోయిన పిచ్చివానికి!

'ఏమో సాహబ్! కావచ్చు!'

'ఆ పిచ్చివానిని నీవు చూచి నావా?'

'ఆఁ!'

'ఆతని ముక్కు ఎట్లుండును?'

'ఆ గడ్డాలు మీసాలు గొరిగించిన తర్వాత చూచినాను గరుడ ముక్కు! పాములను చీల్చేట్లు ఉన్నది'

'ఆఁ! అయితే మావద్దనుండి తప్పించుకొని పోయినవాడే! ఎట్లు తప్పించుకొని పోయినాడో, అక్కడ ఏమైనా అనుకొనుచున్నారా?'

'బాగా తెలియదుకాని ఇక్కడ చాలామంది బాపనయ్యల సంగతి ఎంతో గౌరవముగా అత డేమేమో చెప్పుచున్నాడు. వారి నందరిని తప్పింపవలె నని అతడు వేమన్నకు పదేపదే చెప్పుచున్నాడు, వారిలో ఎవరో ఒకరు సూర్యకవి యట - అతనినిగూర్చి మరిమరి పొగడుచు పలవరించుచున్నాడు. వాళ్లే అతన్ని తప్పించి ఉంటారు.'

బడేసాహబు పెద బొబ్బ పెట్టెను. జంగమదేవర ఉలిక్కిపడెను. అత డాపాదమస్తకము వడకుచుండెను. సాహబు పెద్దగొంతుతో అరచుచు నిట్లనెను;

'పో! నీ సంగతి తర్వాత ఆలోచింతుము!'

'అయ్యో, వీడికీ పిచ్చే! ఇంత ధనము చూపిస్తానన్నా కావలె ననడే!- ఎవడో ఒక పిచ్చివాడు మరొక పిచ్చివాని వద్దకు చేరినా డని వినగానే, ఈ కేక లేమిటి, ఈ బొబ్బ లేమిటి? - ఆ మూల ఉన్న మణుగు బంగారపు ముద్ద వృథా!- అదుగో, ఆవల పొదలో అడుగున పాదు లో ధగధగ లాడుతున్న

ఆ జాతివజ్రము వృధా!- అయ్యో, నా విద్యయే వృధా!-' జంగమ దేవర యేడ్చు చుండగా భటు లాతని నావలకు బలవంతముగా లాగికొని పోయిరి.

* * *

ఆ పిమ్మట మూడు రాత్రులు మూడు పవళ్ళు బడేసాహబు మనస్సులో మథన పడెను. ఆ మూడురోజులును క్షణక్షణమునకు నతనికి సూర్యకవి పై కోప మతిశయింప సాగినది. తనయాప్త లందరు తన్ను వదలివేయగా, తనకు యదృచ్ఛచే చిక్కిన తండ్రిని వదల లేక దగ్గర నుంచుకొనెను. తన తండ్రి తనతో ఉన్ననాళ్లు తన్ననోటికి వచ్చినట్లు తిట్టుచుండెనే గాని ఒక్కనాడు కూడ ఒక్కమంచిమాట మాటాడలేదు. అందువలన అతనికి రవంతయు బాధ లేకపోవుటే గాక ఆతని కానందమే కలుగుచుండెను. తండ్రి ఆకారము చూచుట, తండ్రి కంఠధ్వని వినుటే అతనికి మహాభాగ్యమనిపించుచుండెను. తన కా భాగ్యము లేకుండ పాడుచేసిన వాడు తప్పక, జంగము చెప్పినట్లుగా, సూర్యకవియే ఐయుండును. సందేహములేదు. మథనపడి పడి మితిమీరుచున్న కోపము పట్టలేక సాహబు సూర్యకవిని పిలిపించెను. సూర్యకవిని చూడగానే అతనిని బడేసాహబు అసభ్యముగా నోటికి వచ్చినట్లల్ల తిట్టసాగెను. ఆ తిట్లు ఉచ్చరింప దగినవికావు, స్మరింపనే తగవు!

'బద్మాష్! నీప్రాణము తీసివేయించ దలచినాను,'

'నీ చేతిలో చిక్కినప్పుడే ప్రాణములపై ఆశ వదలుకొంటిని. వానిపై నా కంతప్రీతి లేదు సాహబ్!'

'జూటాకోర్! నీప్రాణము తీయించి మాంసము కుక్కలకు నక్కలకు వేయింతును!'

'ప్రాణము తీసినపిమ్మట ఈ పాడుకట్టె ఏమైన నేమి?'

'కాదు! ని న్నట్లా కాదు, శిక్షించేది! నీ బోటి బాపలకు ప్రాణము మీద కంటె ఆ జండెముమీదను ఆ జుట్టుమీదను మక్కువ ఎక్కువ! నిన్నేకాదు. నీతోపాటు మా ఖైదులో ఉన్న బాపల కంచరికి కాస్తి చేయింతును; మీ ఆడ వాళ్ళనందరను అరణ్యమధ్యములో విడిచిపెట్టించి పులులకు తోడేళ్ళకు అప్ప గింతును!'

తనకు తెలియకున్నను బడేసాహబుకు బ్రాహ్మణహత్యచేయుటకు, హృదయాంతరాళములో నెక్కడో దాగియున్న జన్మవాసనచే. జంకు విడువ లేదు. అందువల్లనే అత డట్లుచేయ నెంచెను.

సాహబు మాటలకు సూర్యకవి బదులు చెప్పలేదు. అతడు ధ్యానమగ్నుడయ్యెను. అతనికి మహావేదన పుట్టినది; మహాతురత కలిగినది దేహమంతయు మంటలెత్తుచున్నట్లున్నది.

'పవిత్ర మైన యీ జన్మ మెత్తి వృధచేసికొంటిని. కవిత్వముపై వ్యామోహము నన్ను ముగ్ధుని గావించినది. నేను కాకున్న నా కుమారు నైనను మహాకవిని చేయవలె ననుకోరిక యతిశయించినది. అందుకై భార్యతో అనుబంధము. వారికై ధనైషణ!' ఏషణత్రయము వర్జింపవలె! అహోబల నారసింహా! నాకీ తురక రూపమున కర్తవ్యము ఉపదేశించుచున్నావా?—' ఇట్లను కొనుచు ఆ ప్రాజ్ఞప్రస్తుతమూర్తి మనస్సు దిటవు పరచుకొనుచుండెను.

అంతలో బడే సాహబు ఆజ్ఞ గొని భటులు వెడలి బందీలుగా నున్న మరికొందరు బ్రహ్మణులను బలవంతముగా తీసికొని వచ్చి సూర్యకవితో పాటు నిలువబెట్టిరి. వారు రమారమి పాతికమంది కలరు. వారిలో పలువురు వేదవేదాంగ విదులు. అందరును శిష్టా చార పరాయణులే.

ఇంతమంది విప్రోత్తములను తనతోపాటు సాహబు శిక్షింపదలచినాడని సూర్యకవికి తెలిసినది. అయినను అతడు తొణకలేదు. మోక్షసాధనకు ప్రతిబంధకము లైన సమస్తమును త్యజింప మనస్సులో సంకల్పము దృఢము కావించుకొనుచున్న సూర్యకవికి ఇది యొక బాధయా? మాయా వాగురలో నుండి విడివడుటకు బంధముల నన్నిటిని ఛేదించివైచుటకు బుద్ధి ఖడ్గమునకు పదును పెట్టుచున్న ఆతనికి, యుద్ధభూమిలో వీరునికి వలెనే ధీరత చేకూరుచున్నది. సంసారవృక్షమూలములను త్రవ్వివేసి పెకలించు సాహసమునకు నిబ్బరమునకు నై పెనగులాడుచున్న యాతనికి మరొకటి పట్టునా? మోక్షప్రాప్తికి ప్రధాన సాధన మై, సోపానపరంపరల వంటి వైన వేదవిహిత కర్మలనే విసర్జించి, నిరాధారమైన అంతరిక్షము లోనికి గంతు వెట్ట నుంకించుచున్న సూర్యకవికి ఇప్పుడింకొకటి పట్ట లేదు.

ఆ భూసురుల నందరను దిగంబరుల గావించి, శిఖలు కోసివేసి, యజ్ఞోపవీతములు త్రెంపివేయుడని బడేసాహబు తన యనుచరుల కాజ్ఞా పించెను. భటుల కది నూతన క్రీడగా నున్నందున, వారు వికటముగా నవ్వుచు ఎకసక్కెము లాడుచు పెద్దగా కేకలు వేయుచు బ్రాహ్మణుల మీదికిగంతువేయు చుండిరి. అది చూచి యాబ్రాహ్మణులు ఒక్కసారిగ ప్రాణములు పోయినట్లు నిస్సారు లై వ్రేలాడబడిపోయిరి. వారి ఆతురస్థితి చూడగా ఆనంద ముద్వేల మై బడేసాహబు పెద్దపెట్టున నవ్వుచుండెను.

అప్పు డొక మహాద్భుతము జరిగినది. తాను సన్యసించితిని అని ముమ్మారు మూడు ఏషణలను అను సంధించి బిగ్గరగా సూర్యకవి ముల్లోకము లకు వినబడునట్లు పలుకుచు తాను కట్టినపుట్టము తానే తొలగించుకొనెను; తన శిఖ తానే లాగివేసికొనెను; తన యజ్ఞోపవీతము తానే విసర్జించెను శిరస్సునుండి రక్తధారలు స్రవించుచుండ పుష్పించిన కింశుకము వలె చూడనై యాత డూర్ధ్వబాహువై ఉత్తరముఖముగా అత్యాతురభావముతో శీఘ్రగతి సాగి పోయెను.

చిత్రములలో విచిత్రము! మిగిలిన బ్రాహ్మణులలో మువ్వురు తప్ప తక్కినవా రందరు ఉద్బుద్ధులై సూర్యకవి ననుకరించి ఆతడు వట్టిన మార్గ మనుసరించి, వా రందరు దిగంబరులై శిఖాయజ్ఞోపవీతములు విసర్జించి మహా ర్తితో చేతులెత్తుకొని పారిపోవుచుండుట చూడ బడేసాహబుకు అతని యను చరులకు వర్ణింపరాని వేడుక యయ్యెను. వారిని నిరోధింప వారికి బుద్ధి పుట్ట లేదు. మంచిశాస్తి చేసితి మని వా రుప్పొంగిపోవుచుండిరి. వారిలో కొందరు వికటహాసముతో ఆ పారిపోవుచున్న ధరామరో త్తములపై రాళ్ళు రువ్విరి. గురి తప్పక ఆ రాళ్ళును వారిదేహములకు తగిలి ఎర్రనిరక్తము భూమిపై చిందింప నారాతినేల పద్మరాగములు పరచిన కుట్టిమస్థలమువలె భాసించెను. కాని ఆ భూసురు లాశిలాఘాతములు గమనించినట్లే లేదు. వారి కప్పుడు దేవభావ మున్నట్లే లేదు. గృహస్థాశ్రమము వదలిరి. సన్యసించిరి. సన్యాసాశ్రమము నాశ్రయించుట కింకను గురూపదేశాభావముచే అది సిద్ధింపలేదు. శ్రీ గురు పాదుల పాదసరోజ సన్నిధికి వా రాతురులై పరుగువారుచుండిరి. పదిపులులు, నూరు సింహములు, వేయిమంది దస్యులు, పదివేలమంది శత్రువులు వెంట బడుచుండ నార్తులై పరువెత్తువారికి గూడ నంత యాతురత యుండదు.

వా రంతవరకు నె త్తియుండిన శతకోటిజన్మముల కర్మఫల మంతయు వెంటాడుచుండ, దాని బంధముల నుండి విముక్తులై సర్వస్వాతంత్ర్యము సంపాదించు దీక్షతో పరుగె త్తుచుండిరి.

అట్లు పారినవారు పారగా మిగిలిన బ్రాహ్మణులలో నిద్దరు తమ వస్త్రము లును జందెములును శిఖలును తీసివేయ వచ్చిన భటులతో పెనగులాడరి. జందెములు భటులు తాకినంతనే వారు ఉలిక్కి పడిరి, ఆ ఉలుకు చూడ వేడుకై త్రెంపక వదలి, మరల మరల ఒక డొకడే వారి జందెములు ముట్టుకొను చుండిరి. వాచిన వ్రణాపదేశమును తాకినట్లువలె వా రిరువురు ఉలిక్కి పడుచు ఎగిరి పడుచుండుటచే చాలసేపు వారి నట్లు బాధించుచు పొట్టలు పగులునట్లు భటులు విరుగబడి నవ్వుచుండిరి, కొంత వడి వారట్లు వినోదించి విసివి ఒక్క పెట్టున వారిద్దర పై కవిసి జందెములు త్రెంపివేసి కాళ్లక్రింద మట్టగించిరి

ఆ పై వారి శిఖలకు శిక్ష చేయ నిచ్చ గలిగినది. అంతకు ముం దైనచో తమ కత్తులతో నవి కోసివేసియుండెడివారే, కాని యా పారిపోయిన బ్రాహ్మ ణులు తమ శిఖలు పీకివై చికొనుట వా రిప్పుడే చూచి యుంరి. అందుచే నా యిద్దర శిఖలను ఒకొక్కక్క భటుడే వచ్చి వికటాట్టహాసముతో కొంచెము కొంచెమే పీకుచు చిత్రహింస గావించుచుండెను. తుదకు వారల వివస్త్రుల జేసి యిటు నటు నడిపించిరి. ఆ తరువాత గోమాంసము సురలో ముంచి వారి కుత్తు కలలోనికి బలవంతముగా క్రుక్కిరి. ఆ పెనగులాటలో ఆ దౌర్భాగ్యుల ప్రాణములు పోయినవి. అంతట వారి కంకాళములను కంకములు, గృధ్రములు, కాకులు, కుక్కలు. నక్కలు తినునట్లు ఆవల దూరముగా పారవై చిరి.

మిగిలిన ఒక్క బ్రాహ్మణుడు మాత్రము భటులు తనమీదికి వచ్చుచుండ గనే కన్నీరు కార్చుచు వారికి వంగి తస్లీము చేసి, 'మీమతము స్వీకరింతును' అనెను. వెంటనే దగ్గరనున్న మౌల్వీ యొక డాతనిచే, 'లాయి లాహా ఇల్లల్లాహు మహమ్మదు రసూలల్లా' అనుమాట లనిపించెను. వేదస్వరమునకు అలవాటు పడిన యా బ్రాహ్మణుడు, అరబ్బీస్వరము తప్పకుండగ ఆ వాక్యములు శ్రావ్య మగు కంఠముతో నుచ్చరించెను. స్కంధావారములో నున్న తురక పెద్దలు పిన్నలు ఆ పూర్వ బ్రాహ్మణుని ప్రేమతో కౌగిలించుకొనిరి. కొందరు ముద్దాడిరి.

పెడదారికి పోయి తిరిగి యింటికి వచ్చిన పిల్లవానిని తల్లిదండ్రు లాదరించు నట్లే ఆదరించిరి. అతని నందరు రసూలు అని పిలవసాగిరి.

పూర్వ బ్రాహ్మణు డగు రసూలు కదియేమియు అర్థము కాక ఆశ్చర్య ముతో కన్ను లప్పగించి చూచుచుండెను.

37

చండీయాగము పూర్తి యైన కొలది దినములకే ఘోడెయ రాయ గంగయ గురువుల ప్రార్థన మంగీకరించి శ్రీ శృంగేరీ పీఠాధిపతులును జగద్గురు వులు నగు శ్రీ విద్యారణ్య శ్రీపాదులు శుభముహూర్తమున వేమారెడ్డిని మధ్యాంధ్రభూమికి ప్రభువుగా నభిషేకించిరి. ఆ యభిషేకము మహావైభవముగా జరిగినది. ఆ యభిషేకకార్యమునకు నాందిగా నా సభ లో ముందు బసవ శంకరప్రతిష్ఠాపూజనములు జరుగుటచే బసవశంకరుడు రెడ్డి ప్రభువులకు ఇష్ట దైవ మయ్యెను. ఆ శుభసమయమున వేమారెడ్డికి బసవశంకరధ్వజమును బసవశంకర ముద్రయు విద్యారణ్య గురుదేవుల యానతిని గంగయ గురుదేవు లర్పించిరి. జయ జయ; బసవశంకరా!' అను జయఘోష జన మధ్యమునుండి మిన్ను ముట్టెను, చండీయాగకుండమునుండి యావిర్భవించిన దివ్యాకారమునసే బసవశంకరరూపము చిత్రింపబడినది.

అప్పుడు అన్న వేమన ప్రభువు నాజ్ఞగొని మల్లారెడ్డి యా సభలో విట్లు ప్రకటించెను.

'మీ రందరు బసవశంకరుని రంకె విన్నారు గదా, ఆది ధర్మవృషభము రంకె! జయ భారత ఘోషకూడ శంభుదాసుని ముఖమున విన్నారు, జయ బసవశంకరా!'

ఇట్లనునప్పటికి జన సమూహములో 'జయ, జయ, బసవశంకరా!'అను ఘోష భూన భోంతరములు వ్యాపించెను. ఆ జయ నినాదములు శాంతించిన తర్వాత మల్లారెడ్డి సాగించెను. ఆతని కానందబాష్పములు కారుచుండెను.

'ఇప్పుడు నిలువ నీడలేక పర్వతారణ్యముల లో అల్లాడుచున్న మీ కందరకు ఇక శీఘ్రమే ఎవరిగృహములలో వారు సుఖనిద్ర లనుభవించు

శుభసమయము రా నున్నది. ఇప్పుడు కడుపు నిండ తిన నోచని మీ రందరు పది మందికీ విందుచేసి భుజించు పుణ్యవేళ సమీపించినది. మరి కొంచెము కాలము కష్టముల కోర్చుకొనుటకు మీరు సిద్ధ పడవలెను. ఇదే మీ రించుక నిబ్బరము వహించవలసిన సమయము. భార్యాపుత్రుల వియోగము లోక కొంత సహింపవలెను. శ్రీ వేమప్రభువులు మీకిట్లు విన్నవింప నన్నాదేశించిరి.

'నన్ను ప్రభువునుగా పెద్దలు నిర్ణయించిరి. నా యీ ప్రభుత్వము వారి కరుణా విశేషము, ఆశీర్వాదముల ఫలమే. నేను, నా సోదరులు, బంధువులు, మా మిత్రులు—మే మందరము ధర్మవృషభమునకు బానిసలము, ఈ యల్లాడు చున్న జనములకు సేవకులము. మాకు మీ్ల ఎవరికి చేతనైన సాహాయ్యము వారు చేసి ఈ ధర్మకార్యముతో మాకు తోడ్పడవలసినది. మేము ప్రవర్తింప జేయునవి ఆజ్ఞలు కావు, ప్రార్థనలు! అట్లే మీరవి మన్నించి నిర్వర్తింపవలె! జయ బసవశంకర!'

మల్లారెడ్డి ముఖమున మహాసభా సమక్షమున ప్రకటించిన వేమ ప్రభుని ప్రథమ సందేశము వినినంతనే జనులందరు సాధువాదము లొనర్చిరి. పుల కాంకురములును, ఆనందబాష్పములును కారుచుండ ఒక్కొక్కరే సభనుండి వివిధ నియోగముల నాయకులు ముందుకు వచ్చి తమ తమ ముఠాలతో వేమ ప్రభువును సేవించుచు ఆజ్ఞలు పాలింతు మని ప్రమాణము లొనర్చిరి. స్థానా పతులు, కవిలె సంప్రతులు, రాయసమువారు, కరణాలు, నైయోగికులు నందులో గలరు. స్థపతులు, శిల్పులు, ఖనకులు తక్షకులు కూడ నున్నారు. కత్తులవారు, కఠారులవారు, సింగాణీలవారు, రౌతులు, మావటీలు, బంట్లు నందుండిరి. జ్యోతిష్కులు, శాకునికులు, వైద్యులు, వారిలో ముఖ్యముగా పర హితవైద్యులు వారిలో నుండిరి. వారిలో కొందరు ముదుసలులు, కొందరులో బాలురు, పలువురు పడుచువారు ఎవరికి వారు తమ తమ శక్తులకొలది ధర్మో ద్ధరణమునకు సాయపడుదుమని ప్రతినలు చేసిరి. వా రెవ్వరికి జీవితముల ఆశయే లేదు,

మల్లినాథుడు కవిలెసంప్రతులపై నధికారిగను, రామాప్రెగ్గడ రాయస ముల ప్రధానిగను నియుక్తుడయ్యెను పంటరెడ్డికి దుర్గనిర్మాణకార్యక్రమమును, దేసటరెడ్డికి సైనికులను సేకరించు కాలరులపై నధికారమును అప్పగింపబడెను,

పంచభిక్షము రామలింగమును, అతని తమ్ముడు సోమలింగమును ప్రధానస్థపతి, ప్రధాన శిల్పిగా నియోగింపబడిరి. కాపులు - బారికాపులు, తలారులు, అచ్చు కావలులు, వెలికావలులు - అందరకు ముఖ్యులు నియమింపబడిరి. ఈ కావలి వారలలో ముతరాజు లెక్కువ. గోరక్ష, కృషి, వాణిజ్యము, గనులు - మొద లగునవి చక్కగా రాజ్యములో నడపుటకు ఉద్యోగులు నియమింపబడిరి.

అంతట వేమారెడ్డి మహాజనమువంకను, క్రొత్తగా నియుక్తులైన ప్రధానోద్యోగుల వంకను జూచి యిట్లనెను:

'మన సేనలు నడుపుటకు రథినీపతి ఒకరు ముఖ్యముగా నవసరము అందుకు అర్హు డైనవా రెవరో ఈ సభవారే నిర్ణయింతురు గాక!'

ఈ మాటలు విన్నంతనే సభయంతయు నిశ్శబ్దమయ్యెను. అందరి దృష్టులు మల్లారెడ్డి వంకను, అన్నారెడ్డివంకను, మాచారెడ్డివంకను, నూకారెడ్డి వంకను ప్రసరించి ప్రసరించి తుదకు కదలక మల్లారెడ్డిపై నిలిచినవి. సభలో ఏకకంఠముగా మల్లారెడ్డి! మల్లారెడ్డి! మల్లరథినీ నాథుడు!' అనివాక్కులు వినవచ్చినవి.

వేమారెడ్డి మల్లారెడ్డిని రమ్మని పిలిచెను. మల్లారెడ్డి కార్యభారముతోడి ధీరతతో నడచి వచ్చి శ్రీ విద్యారణ్య శంకరగురుదేవులకును, గంగయ గురువు లకును, బసవశంకరునకును, వేమప్రభువుకును, మహాసభకును, నమస్కరించి వేమారెడ్డి ఎదుట వినతుడై నిలిచెను. సముచితపీఠముపై నాతని గూర్చుండజేసి గంగయ గురుదేవులు మహాసభవారి యనుమతితో మల్లారెడ్డిని రథినీపతిత్వ మున కభిషిక్తుని గావించెను. మహాజన మంతయు జయ జయఘోషలు కావించెను.

సభావసానమున వేమారెడ్డికి జనమంతయు కానుక లర్పించిరి. బ్రాహ్మ ణులు తమ వనితలు ధరించు కనకభూష లన్నియు బసవశంకరసేవ కర్పించిరి. వైశ్య శ్రేష్ఠులు తాము కూర్చిన ధనములో ఆరవపాలు ఇచ్చిరి. మిక్కిలి పేద వారుకూడ ఎవరి శక్తికొలది వారు కానుక లర్పించిరి. రాయసమువారు శ్రీరామ పెట్టి లెక్కలు వ్రాయుట ప్రారంభించిరి.

అప్పనము లన్నియు స్వీకరించి వేమారెడ్డి కవిలెసం ప్రతి మల్లినాథుని బిలిచి యాతనిచే నా మహాసదస్సుకు సన్మాన మొనర్చెను. విద్వద్బ్రాహ్మణు

కడనుండి పేదభటుని వరకు నందరు వేమారెడ్డి పంచిపెట్టిన హిరణ్యదానము నకు పాత్రు లైరి. ఆ నాడు వేమారెడ్డి యాసభలో కనకవర్షమే కురిపించెను. తా మర్పించిన కానుకలకు ఇబ్బడిగా ముబ్బడిగా వేమప్రభువు తమకు బంగారు బహూకరించుట యందర కాశ్చర్యమయ్యెను. కోమటివేముని దానము ఆనాటితో భూమిని ప్రసిద్ధ మయ్యెను.

ఈ మహోత్సవము చూచిన మరునాడే శ్రీ విద్యారణ యతీంద్రులు కతిపయ పండితబృందముతో కలసి శ్రీ శంకర సంయమీంద్రుల యాశ్రమము నుండి స్వస్థానమునకు ప్రయాణ మైరి.

38

ధర్మవృషభము గంగదోలుతో తన్ను రాచి ఘంటానాదముతో 'శంభు దాసుడు శంభుదాసుడు' అని తన్ను పలికినది తలచుకున్నకొలది ఎర్రయ హృద యములో చల్లని భావములు జాలువారుచున్నవి. పరిషత్సమక్షమున జయకావ్య శ్రవణానంతరమున శ్రీ శంకర స్వాములవారు 'నన్నయభట్టారకా!'అని తన్ను చేసినసంబోధనము ఆనందము కలిగించుచున్నది. జయకావ్యపఠనము గావించిన రెండు దినముల రాత్రులును ఆ సంతషభావములే అతనికి మరల మరల తల పుకు వచ్చుచు సంతోష మతిశయింప జేయుచుండెను.

మహాకావ్య సమాప్తి కావించిన తృప్తితోపాటు పూజ్యులైన విద్వాంసు లగ్గించిన తృప్తికలసి ఎర్రయ సంతోష మినుమడించెను. ఆ వెంటనే వేమా రెడ్డి యభిషేకము, మల్లారెడ్డి రథినీపతిత్వము నాతనికి మరి వేన్నాళ్ళవరకు నుత్సాహము నిలిపి యుంచెను.

ఆ పిమ్మట మూడు నాలుగు రోజులైన గడచినవో, లేవో ఒకనాటి సాయంకాలమున నాతనికి విచిత్రమగు నావేశమువంటిది ప్రారంభించెను. అది ముందు హృదయములో దడవలె నారంభించి సర్వావయవములకు రక్తప్రవాహ ముతో ప్రాకుచు రక్తపుపోటువలె ప్రసరించుచున్నది. మరి కొంతసేపటికి నీర సస్థితి వచ్చినది. అతడు నిస్సారముగా శయ్యపై మేను వాల్చెను.

ఉదాత్త కావ్యరచనము సాగుచున్నంత కాలము రచనానందముతో కవి ఇతరము సర్వము మరచియుండును. కావ్యరచన పూర్తియైన తర్వాత కొంత

కాలమువరకు నాతుప్టియుండును. పిమ్మట కొంతకాలమునకు బడలిక సర్వాత్మను ఆవేశించును. జ్వరవేగ ముపశమించిన పిమ్మట రోగికి బడలిక వచ్చునట్లే, కావ్యరచనావేశము శాంతించిన పిమ్మట కవికిని నీరసస్థితి వచ్చును. ఎర్రయ నిప్పు డావేశించినది అట్టి నీరసావస్థమాత్రమే కాదు.

ఆ పత్సముద్రములో ముంగియున్న ఎర్రయ అరణ్యపర్వశేషము పూరించెను. అదియొక ఆదేశము, గుర్వాజ్ఞ, ధర్మపురుషావేశము; అది ఇప్పుడు పోయినది. ఇప్పు డాతడు కవి ఎర్రయ్య కాదు, కేవలము పట్టి ఎర్రయ్య. తన తల్లిదండ్రులను ప్రియపత్నినిని గోమాతను వత్సమును అరణ్యమధ్యమున నిసహాయులుగా వదలిపెట్టి వచ్చిన నిర్భాగ్యుడు, ఐనను ఇప్పుడాతని స్మృతిలో దృఢముగా పారుచున్నది పూజ్య లగు తల్లిదండ్రులును గాదు; గోమహా లక్ష్మియు వత్సమును గాదు. ఇప్పు డాతని హృదయ మంతటను నిండినది. అతని యర్ధాంగి. అది చిన్నపిల్ల. ముగ్ధ. కాపురమునకు వచ్చినపిమ్మట ఎక్కువ కాల మది సుఖ మనుభవించినట్లేలేదు. రెండుమూడేళ్లు శాంతముగా సంసారము చేసినదేమో! ఆ పిమ్మట ఈ రెండేళ్లనుండి నిరంతరము మ్లేచ్ఛభయముతోనే తాము కాలము గడుపుచుండిరి. తుదకు ఇల్లువాకిలి సర్వము వదలివేసి రావలసి వచ్చినది. అరణ్యవాసము చేయుటే కాదు, పలుమారు లుపవాసములే చేయ వలసి వచ్చినది, చక్కని పైఠాని చీరలు విలాసముగా ధరించి యుండెడియాడులో దుప్పటిరేకులవంటి ముతకచీరలు. కట్టవలసి వచ్చినది. ఏమి కట్ట నిచ్చినను, పాపము, దానికి సంతోష లోపములేదు. అట్టి యనుకూలవతి తనకు పత్నిగా ప్రాప్తించుట తన భాగ్య విశేషము. అట్టి పసిదానిని ఒంటరిగా వదలివేసి తాను వచ్చినాడే! అది యిప్పుడు ఎక్కడ నున్నదోగదా! ఈ మహారణ్యమున నది ఏ మయ్యెనోగదా! అడవి మృగముల వాతబడినదో? కిరాతులకే చిక్కినదో? చెంచులలో నున్నదని సందేహముగా నున్నదని మల్లారెడ్డి చెప్పి యుండెను. అది నిజమై యుండునా? కీరాతులకంటె క్రూరులగు యవనులకే చిక్కినదేమో! మా తల్లిదండ్రులే యవనుల స్కంధావారములో నున్నారన్నాడు. దానినిగూడ యవనులే బంధించిరేమో! అది అవసరమైనచో మానరక్షణార్థము విషగుటికలు వెంటతెచ్చుకున్నది. దాని కవి సేవింపవలసిన అవసరము పట్టి యుండదుగదా! అహోబల నరసింహా! కాక ఆహారము లేక నవసి నవసి

దేహము వదలినదా? దాహముతో తనువు చాలించినదా? ఏ మైనది? నాకై ఏమని ఎంతగా విలపించినదో గదా!

ఈ విధముగా నా సాయంవేళ ఎర్రయ వసస్సంతయు నొక్కసారిగా పత్నివంకకు మళ్లెను. పాదులలోనుండి ఒక్కపెట్టున నీళ్లబికి కన్నులనుండి ఏకధారగా ప్రవహింప సాగినవి.

సంధ్యావందన సమయ మతిక్రమించుచున్నది. అయినను అతడు సంధ్యా వందనమునకు లేవలేదు. భోజన సమయమునకు బ్రహ్మచారివచ్చి రమ్మని పిలిచి నను అతడు వినిపించుకొనలేదు. రెండు మూడు మారులు చెప్పినను ఎర్రయ తన ఏంక తలయెత్తియైన జూడకపోవుటచే బ్రహ్మచారి యిటు నటు తారట లాడుచుండెను. ఎర్రయ రానిది తాను భుజించుటెట్లు?

ఈ మధ్య మల్లారెడ్డి కార్యభారములో నిమగ్నుడై యుండి ఎర్రయను తరచుగా చూడవచ్చుట లేదు. ఈనా డాతడు ఎర్రయ కడకు వచ్చెను, ఇంకను ఎర్రయ సాయంసంధ్యాకృత్యమునకో భోజనమునకో నిమగ్నుడై యుండుటచే, వెంటనే తన కాతనితో సంభాషించు నవకాశముండదేమో యను వ్యగ్రతతో నతడు వచ్చెను. కాని చిత్రము! ఎర్రయ నిత్యానుష్ఠానములకే శయ్యనుండి లేచినట్లు లేదు. అస్తమించిన సూర్యభగవానుడు ఆతనికి కాలగతి తెలిపినట్లు లేదు. నక్షత్రము లొక్కటొక్కటే వచ్చి ఆకాశ మంతయు నిండిపోయినవి. అయినను కాలగమనము ఎర్రయ్యకు తెలిసినట్లులేదు.

'ఈ బ్రాహ్మణు డింకను సంధ్యావందనము చేయలేదు, అయ్యో!' అని మింట తారలు గుసగుస లాడుచున్నవి. వారి గుసగుస లాతనికి వినబడలేదు. ఆ చుక్కలు కన్నులు వాల్చుచు తెరచుచు మిరుకు మిరుకు మనుచున్నవి.

'ఇంకా సంధ్యావందనమునకు లేవలేదా? -' మినుక్కు!

'ఇంకా లేవలేదా?' మరి యొకసారి మినుక్కు మనెను మింట నగస్త్య నక్షత్రము!

'ఇంకా? — ఇంకా? - ఇంకా?' అని యాశ్చర్యపడుచు అగస్త్య నక్షత్రము మినుకు మినుకు మనుచు రంగులు మారు చున్నది.

అటువంటి సమయమున మల్లారెడ్డి యచ్చటికి వచ్చి దూరమున నుండి ఎర్రయ కనబడినంతనే, ఆనందాతిశయముతో చేరవచ్చెను. అతనిని ఎర్రయ చూడిలేదు. రెడ్డి కాశ్చర్యమైనది.

ఏమిది ? -' సవీపించి చూచునుగదా, ఎర్రయ వెక్కి-వెక్కి ఏడ్చుచున్నాడు. వల్లారెడ్డి నివ్వెరవోయెను. క్షణకాల మాతడు నిస్తబ్ధుడయ్యెను. ఉత్తర క్షణమున మల్లారెడ్డి హృదయము కరిగిపోయెను.

'ఎర్రయ్యా, ఏమిటయ్యా నీకీ వెర్రి ?' అనుచు గద్గద కంఠముతో నడుగుచు నతడు శయ్యాపైననున్న ఎర్రయను గాఢముగా కౌగిలించుకొనెను. ఎర్రయ్య నాతని కౌగిలించుకొని బావురుమని ఏడ్వసాగెను.

వా రిరువురు నొండొరుల నట్లు కౌగలించుకొని అరగడియసేపు ఏడ్చుచుండిరి. ఆ ఏడ్పుతో వారికి పరస్పరేంగితములు అవగాహన మైనవి. ఎర్రయ దుఃఖకారణము నోరు విప్పి చెప్పకున్నను మల్లారెడ్డికి విస్పష్టముగా తెలిసిపోయెను.

'ఎర్రయ్యా, నీ ధర్మపత్ని జాడ స్పష్టముగా తెలిసినట్లే, చెంచులామెను చెంచులక్ష్మి యని పూజలు చేయుచున్నారు. చెంచులు చంచలచిత్తు లగుటచే వారిపై బలప్రయోగము చేసినచో నామె కేమి ప్రమాదము సంభవించునో యను భయముచే, ఆమెను రప్పించుటకు మాయోపాయ మొకటి పన్నినాము. అది సఫలమైనచో నిప్పటికి రెండుమూడు దినముల క్రిందటనే ఇక్కడికి వచ్చి యుండవలసినది. రాలేదు. వార్త తెలియకుండుటచే ఏమయ్యెనో యని ఆరాటముగా నున్నది. నీకుకూడ ముందుగా వివరింప కుండుటచే కొంత దోషిని -'

ఆ మాటలు వినుచున్న ఎర్రయకు కడుషలోనుండి కెలికివేసినట్లయ్యెను. అతడు చటాలున దూరముగా పోయి నిలిచి, 'ఏమిటా మాయోపాయము ? — ఏమిటి ? అని బిగ్గరగా ననుచు ఆపైన ఆవేశముతో మాట రాక ఆగిపోయెను. సామాన్యముగా కోపము రాని ఎర్రయ కిప్పుడు కోపము వచ్చినది. అతని కన్ను లెర్రవారినవి. ఓడలంతయు వడక సాగినది. చెంచులపై పుట్టిన కోపమంతయు ఎదుటనున్న మల్లారెడ్డిపై ప్రసరించినది.

'వల్లారెడ్డీ! దూరముగా ఉండు! నీకు తెలిసియు అసమర్థతచే దానిని తప్పింపలేక - పైపెచ్చు ఇన్నాళ్లు నాకుకూడ సరిగా చెప్పక దాచిపెట్టి, ఏమో చెప్పవచ్చు చున్నావా ? చాలు, చాలు ! నిన్ను నమ్ముకొనకున్నచో నే నేడారి యో చూచుకొని యుండనా ? నాకు చేత కాకున్నచో సమర్థుడగు మరియొకని నాశ్రయించి కాళ్ళు గడ్డములు పట్టుకొని ప్రాధేయ పడియుందునే ! -'

ఎర్రయ మాటలకు మల్లారెడ్డికి కోపము రాలేదు. మిత్రుని మాటలలో పొరపాటు లేదు. తాను తన విధి నిర్వర్తింపలేదు. తన్ను ఆశ్రయించిన ప్రాణ మిత్రుని పత్నిని అపాయ స్థితినుండి ఇంతకాలము తప్పింపలేకపోయిన తన పౌరుష మెందుకు ?

'ఎర్రయ్యా ! క్షంతవ్యుడను, ఇప్పుడే ప్రతిక్రియకు తీవ్రయత్న మారం భింతును, నీ పాదము లాన !'

ఇ ట్లనుచు మల్లారెడ్డి చివ్వున వంగి ఎర్రయ పాదము లంటి వెనుదిరిగి చూడక వెడలిపోయెను.

అప్పటికి ఎర్రయ్యకు తానిప్పు డన్నివిధముల నేకాకి నైతినని తోచినది. ఇన్నాళ్లు తనకు తోడుగా నుండిన మహాభారత సాహచర్యము తొలగినది. తల్లి దండ్రులు వేరైరి. ధర్మపత్ని చంచలులగు చెంచుల వశమున నున్నది. తన తొందరపాటు మాటలకు కోపించి ఆప్తమిత్రుడగు మల్లారెడ్డి కూడ నేడు విస ర్జించి వెళ్ళెను, నన్నయ భట్టారకునికి విఘ్నముచేసి తిక్కన సోమయాజులకు జంకు కలిగించిన ఆరణ్య పర్వరచనము తన్ను ఊరక వదలునా ? - ఎర్రయ సర్వవిధముల నేకాకి నైతి ననుకొనెను.

39

ఎర్రయ కడనుండి బయలుదేరి మల్లారెడ్డి సరాసరి తన తల్లి అన్నమ్మ యొద్దకుపోయి నమస్కరించెను, చిన్నవోయి యున్న యాతనిముఖమైఖరి మాతృ దేవత వెంటనే గమనించినది. ఆ సమయమున నట్లాత డామెను దర్శింప వచ్చుటయు నరుదే.

' ఏమిరా, మల్లన్నా? '

'అమ్మా!'

'ఏమి నాయనా?,

'నేను చేయవలసిన విధి చేయలేదే అమ్మా!'

'ఎందువల్ల, తండ్రీ?'

'వీలులేక నమ్మా!'

'వీలులేకనా, చేతకాకనా, అశ్రద్ధ చేతనా?'

'వీలు లేకుండుటచేత చేతకాకపోయినది అశ్రద్ధ కాదు.'

'అయితే నీ తప్పే మున్నది?'

'మరి నా మిత్రునికి కోపము వచ్చినదే.'

'పిచ్చి నాయనా మన ఎర్రయ్యకా? - అతని భార్యను వెదకిపెట్టి అతనికి అప్పగించలేక పోతే, మనకీ ఆర్భాటమంతా ఎందుకు నాయనా! ఏదో ఉపాయ మాలోచింపక పోయినావా?'

'నాకేమీ స్ఫురించలే దమ్మా!'

'మన నందికంత పోతరాజుకు దండము పెట్టి అడగరా! వాడే చెబుతాడు!'

'నీవుకూడ వెంట రావమ్మా!'

తల్లివెంట మల్లారెడ్డి నందికంత పోతరాజుకు నొద్దకు వెళ్ళి దండము పెట్టినాడు.

'పోతరాజా, మా మల్లయ్య నిన్నేదో అడగడానికి వచ్చాడు, పలక వయ్యా!'

ఇట్లు అన్నమ్మ వేడుచుండగా మల్లయ్య పోతరాజు సమీపమున నున్న అగ్నికుండములో. ఆ దగ్గిరనే ఉన్న ధూపద్రవ్యము వేసి, మరల పోతరాజుకు దండము పెట్టినాడు. ఆ గుగ్గిల ధూపము మేఘమాలికల వలె సుళ్ళుగా తిరిగి పోతరాజును ఆవరించినది. గది యంతయు ఆ సుగంధముతో పరిమళించినది.

పోతరాజు పలుక లేదు.

మరల మరల దండము పెట్టుచు మల్లారెడ్డి ధూపము వేసెను. ఐనను పోతరాజు పలుకలేదు. అన్నమ్మ మొదట ఆశ్చర్య పడినది. ఆమె ఆలోచించి ఆలోచించి తుద కిట్లన్నది.

'ప్రత్యక్ష దైవమైన ఆ బాపనయ్యకు కోపము వచ్చిన సందర్భములో మన కులదేవతలు పలుకుతారా, నాయనా? ఎర్రయ్య బాబునే అడిగిరా మల్లా!'

'అమ్మా, ఏమైనాసరే, ఎర్రయ్య భార్యను అతనితో కూర్చనిది, నాయంత నేను నాముఖ మాతనికి చూపదలచలేదు!'

'అయితే, నాయనా, నీకు దేవత లందరూ సాయము చేయుదురు. సందేహము లేదు. పోతరాజు మౌనమునకు అర్థమదే! నేను చెప్పినాను గదా, పోయిరా, తండ్రీ!'

తల్లి మాటలు విని పరమానందముతో ఆమె పాదముల కెరగి నమస్కరించి, పోతరాజుకు మరల ధూపమువేసి భక్తి నిమీలితలోచనుడై సాష్టాంగ దండప్రణామ మాచరించి మల్లారెడ్డి యటనుండి బయలు వెడలెను. అతడు వెంటనే విస్సన మంత్రిని కలసికొని జరిగిన దంతయు వివరించెను. పాతాళ గంగయొద్ద నున్న పెద్ద చెంచుగూడెము మీదను మరికొన్ని చెంచుగూడెముల మీదను పడవలెనని మల్లారెడ్డి యోచన. విస్సన యతని మాటలు విని దీర్ఘముగా నాలోచించి ఇట్లనెను.

'మల్లన్నా, ఇన్నాళ్లు ఓర్చియుండి, ఒక్కసారిగా ఈ తొందర ఎందుకు? తోకరాజుతో మంతనములు చేసితిమిగదా! అత డిప్పటికి రెండుమూడు దినముల క్రిందటనే రావలసినది. ఎందువల్లనో రాలేదు పెద్దఎత్తున గూడెములపై దండు చేయుటకు మనము సిద్ధముగా నున్నచో. ఇప్పుడే అతనికి తుది కబురంపుదము!'

'సిద్ధముగా లేకేమి? మూన్నాళ్ళనుండియు పంటరెడ్డి దేసటరెడ్డి అందుకు సిద్ధముగా నున్నారు. ఇప్పుడే పంటరెడ్డిని పిలిపించి ఈ రాత్రియే చెంచుల గూడెము లన్నియు ముట్టడింప నాజ్ఞాపింతును!'

'ఆలోచింతము. ముందు పంటను పిలిపింతము!'

అనుచరు నొకని బంపగా అరగడియలో నతడు పంటరెడ్డిని వెంటగొని వచ్చెను. పంట యుద్ధమునకు సర్వసన్నద్ధ గాత్రుడై యున్నాడు. విస్సన ఇట్లు ప్రశ్నించెను.

'పంటా, తెల్లవారు సరికి చెంచుల గూడెములను పాతికింటిని ముట్టడించుటకు ఏర్పాట్లు చేయగలవా?'

'మీ యాజ్ఞ యెనచో అదెంతపని బాబా!'

విస్సన: 'అట్లయినచో ఇక్కడినుండి పాతాళగంగ వరకు గల చెంచు గూడెములలో నుండి ఒక్క పురుగును గూడ కదలనీయకుండ నిరోధింపవలె. కదలినచో చిచ్చు ముట్టించమని గట్టిగా కట్టడి చేయుము. వారితో వ్యవహార

ములో ఎంతమాత్రము మెతకదనము చూపినను మనవారి ప్రాణములు దక్కవని ఎరుగుదువు గదా! ఏ గూడెముపై నే దళము పోవలెనో ఏర్పాట్లుచేసి సిద్ధముగా ఉండుము నాలుగు గడియలలో కదలుటకు సంజ్ఞలు చేయుము!'

పంట సెలవు తీసికుని వెళ్లెను. అంతట విస్సన వెంటనే రమ్మని తోక రాజుకు కబురంపి, మల్లారెడ్డిని విశ్రాంతి తీసికొమ్మని తుంగచాప చూపగా నాతడు కుడి బాహువు తలగడగా నా చాపపై పవళించి కునుకు తీయ సాగెను. విస్సనయు మేనువాల్చి యాలోచించు చుండెను. చెంచు గూడెములను ముట్టడించుటకు ప్రత్యక్ష కారణము దొరకలేదు.

కొలదిసేపటికే దూరమున నరణ్యమధ్యమున నుండి బెబ్బులి బొబ్బను అనుకరించు మనుష్యధ్వని వినవచ్చెను. అది విన్నదే తడవుగా విస్సన చివాలునలేచి కూర్చుండెను. చిన్నదొర వచ్చుచున్న సాంకేత మది. అతనికొరకై వెళ్లిన వార్తాహరుడు పిలిచికొని వచ్చు వ్యవధానములేదు. మల్లారెడ్డి నిద్రకు భంగము లేకుండుటకై విస్సన తోకరాజుతో మాటాడు నిమిత్తము కుటీరము నుండి బయటికి వచ్చెను.

చిన్నదొర విస్సనకు వంకరదండము పెట్టెను. చాకలి పట్టియున్న దివిటీ వెలుగులో చిన్నదొర పెట్టిన దండము వంకర కనిపెట్టి విశేషమేదో ఉన్నదని గ్రహించి ముఖము చిట్లించుకొనెను

'తోకరాజా, విశేషమేదో ఉన్నట్లున్నదే?'

'విశేషమె కాదు, మా కొంప మునిగినది!'

'ఏ మది, చిన్నదొరా?'

'మా లక్ష్మి పోయినది. మా చెంచులలక్ష్మి మాయమైనది,'

'ఏ మది? నేను నీమాటలు నమ్ముదు నని యేనా? పెద్దదొరతో రాజీపడి ఈ దొంగవేషము వేయుచున్నావా? నిన్నుమాత్రము ఇక్కడనుండి పోనీయము!—మల్లరథినీశ్వరా!'

వెంటనే మల్లారెడ్డి లోపలినుండి వచ్చెను. ఆతని రోషాకారము చూడగనే తోకరాజు నిలువున గడగడ వణకిపోసాగెను.

'విన్నావా, ఈ చిన్నదొర చెప్పేమాట. చెంచులక్ష్మిని మన కప్పగించుటకు ఇతడు పూచీ పడినాడుకదూ? - ఇప్పుడు లక్ష్మి పోయిన దనుచున్నాడు. ఈ దొంగ నేమిచేయవలె!'

'ముందు నాలుక కోసివేయవలె। ఆ పిమ్మట శిక్ష సంగతి ఆలోచింతము!' – మల్లారెడ్డికి కోపము రాగా కాలాంతరుద్రునివలె చూపట్టెను. అతని వాలకము చూడ విస్సన మంత్రికేభయమైనది.

వెంటనే యిద్దరు అనుచరులు తోకరాజును పట్టుకొని దృఢముగా బంధించిరి. దొర బిగ్గరగా నేడ్చుచు మరిమరి వంగి దండములు పెట్టసాగెను. మల్లారెడ్డి మాత్ర బిగించుకొనియే యుండెను కాని విస్సన కేదో సందేహావేశ ముదయించినది. మల్లారెడ్డి యాజ్ఞా ప్రకారము చిన్నదొర నాలుక కోసివేయుటకు అనుచరులు కత్తులు నూరుచుండిరి. విస్సనకు వారింపవలెనను నుద్దేశము కలిగినది కాని మల్లారెడ్డి రౌద్రాకారము చూచి, ఏమన్నను తనపై విరుచుకొని పడునేమో యని జంకుచు నుపాయ మాలోచించుచుండెను. ఇంతలో మల్లారెడ్డి యిట్లనెను.

'ఒక్క క్షణ మాగండి! - ఈ పాపితో మాట్లాడి తెలిసికోవలసిన విషయము లేమైన ఉన్నవా, విస్సన మంత్రీ? ఎక్కువ వ్యవధి లేదు!'

ఇంతవరకు ఉపాయము స్ఫురింపని విస్సన కిప్పుడది స్ఫురించినది. 'మాటలు మాటాడవలసినవి చాలా ఉన్నవి. ఆ పిమ్మట ఇతని నాలుక ఖండ ఖండములుగా అబద్ధమున కొకముక్క చొప్పున కోసివేయింతము!' ఇట్లని యాతడు మల్లారెడ్డికి మనవి చేసెను. రెడ్డి సంజ్ఞగొని యనుచరులు నూరినకత్తులావలపెట్టి నిలుచుండిరి. విస్సన తోకరాజుతో సంభాషణ మారంభించెను.

'మరి చెంచులక్ష్మి ఎమైన దందువు చిన్నదొరా?'

'తెలియదు స్వామీ!'

'ఎప్పటినుండి కనబడుట లేదు?'

'మూడు రాత్రులు మూడు పవళ్ళనుండి.'

'అసలు జీవముతో నున్నదా?'

'తెలియదు, ఏమీ తెలియదు.'

'దొంగ!' యని మల్లారెడ్డి యందుకొనెను. ఆమాట మేఘగర్జనము వలె అడవి మార్మ్రోగెను, విస్సన సాగించెను,

'పెద్దదొర ఎక్కడనైన దాచియుంచునా?'

'అట్లనుకోను స్వామీ! నామాట నమ్మరేమో కాని వాడుకూడ పెద్దగా ఏడ్చుచున్నాడు. గూడెములు గూడెము లన్నియు ఏడ్చుచున్నవి - మా చెంచుల

లక్ష్మియే మాయమైనది. మాకిక మంచిరోజులు ఎట్లా రాగలవు? - ఇట్లనుచు తోకరాజు ఏడువసాగెను.

'దొంగ ఏడుపు!' అని మల్లారెడ్డి మరల మరల నందుకొనెను విస్సన ప్రశ్నలు సాగించెను.

'చెంచులక్ష్మియే ఎక్కడికైన వెళ్లినదేమో! - ఎవరైన ఆమె బంధువులు వచ్చిరా?'

'ఆ పరామేశ్వరికి బంధువు లెవరు? ఆమెకు ఎక్కడికి పోవలెనని కోరిక యున్న అక్కడ కామె వెళ్ళుట కాటంక మే మున్నది? మే మాపగలమా? పుమ్మ దిక్కులేని పశువులను జేసి వెళ్లిపోయినది!'

'యవను లేమైన మీ గూడెములకు వచ్చిరా?

'లేదు.'

'నీవు గాని మీ పెద్దదొర భీమరాజు కాని ఈమధ్య మరల తురకలతో రాయబారము లేమైనా సాగించినారా?'

'మా పెద్దదొరను తురక లిక నమ్మరు, నేను మిమ్మును నమ్ముకొన్నాను.

'నీవే తురకలకు చెంచులక్ష్మిను అమ్మియుందువు?.

'లేదు బాబూ, లేదు! నా తల్లి తోడు, తండ్రి తోడు, నా పెట్టతోడు! మీతోడు! చెంచులక్ష్మితోడు! — ఏమీ ఎరుగను బాబూ! లక్ష్మిని తురకల కప్ప జెప్పి నే నొక్కక్షణము బ్రదుకగలనా?'

' మా కప్పజెప్పుటకు నీ వొప్పుకోలేదా, దొరా?'

'మీ సంగతివేరు. శ్రీశైల వల్లేశ్వరులను శంకరస్వాములను చూచుటకే గదా అనుకొన్నాను. ఇది వేరుసామీ, నా మాట నమ్మండి!'

'నేను నీ కిచ్చిన శంకరదేవుల శ్రీముఖ పత్రిక మీ చెంచులక్ష్మికి అంద జేసినావా ?'

'అవకాశము చిక్కలేదు, ఆ పత్రమే చిత్రముగా మాయమైనది. నా కర్మము! మరి నే చెప్పవచ్చిన పెద్ద రహస్యమే వినిపించుకోరా, సామీ?'

మల్లారెడ్డి ఆగ్రహావేశముతో అందుకొనెను. 'ఈ దొంగ చెప్పేవి రహస్యాలు కూడాను - చెప్పు విందాము! నీవు చెప్పేదంతా విన్న తర్వాతనే నీ

నాలుక కోయించేది. వింటున్నావుగదా, విస్సన్నా? ఇతని అబద్ధాలు లెక్క-పెట్టుచున్నావా?'

విస్సన్న తల యూచెను. చిన్నదొర చెప్పబోవుచు భయపడుచు దిక్కులు చూచి, బయ లాల కించెను. చెప్పబోవు మాట ఆపుకొనెను.

విస్సన్న : 'ఏమిటది, తోకరాజా?'
తోకరాజు : 'నాగొంతు పోయే రహస్యము!'
విస్సన్న : 'నీ గొంతు ఎట్లైనా పోవనున్నది. భయము లేదులే, చెప్పు!'

తోకరాజు : 'ఈ అడవిలో చెట్లకు కూడా చెవులున్నవి. పెద్దదొరకు పోయి చెప్పును లోపలికి పోదాము!'

అత డొంటరి పాటున తమ్ము విదలించుకొని తప్పించుకొని పారిపోవుటకు ఎత్తువేయు చున్నాడని సందేహించి, ఇంటిచుట్టును భటులను కాపుంచి విస్సన తనతో మల్లారెడ్డినిమాత్ర ముంచుకొని తోకరాజును లోనికి తీసికొని వెళ్ళెను. లోపలగూడ భయము తీరక తోకరాజు మిర్రిమిర్రి చూచుచుండెను.

'మా పెద్దదొర పెద్దగుంపుతో నేటి రాత్రియో. రేపు రాత్రియో, ఇటు వైపు దోపిడికి రానున్నాడు, దొరా!'

మల్లారెడ్డి యాశ్చర్యపడెను. 'విస్సన్నా, మన మితని విషయము తొందరపడినట్లున్నామే!'

విస్సన్న: 'తొందరవద్దు, ఇతడు చెప్పునది నిజమైనచో సరే! కాని తప్పించుకొనుట కిది ఒక ఉపాయము కాకూడదా?'

తోకరాజు వారలకు నమస్కరించి యిట్లు వేడుకొనెను 'ప్రభువుల్లారా! నన్నానాడు చెంచుల పెద్దదొరను చేసెదమని మాట ఇస్తిరే! ఈ రహస్యము చెప్పి మీ రిచ్చినమాట నిలబెట్టుకొమ్మని వేడుకొనుటకే వచ్చినాను. మీరు నన్నిట్లు నిర్బంధించితిరి!'

విస్సన: 'మరి చెంచులక్ష్మి సంగతి ఏమిటి?,

తోకరాజు : 'కనబడుటలేదు, బాబూ! ఇక్కడికి మీరే తెచ్చియుందురను అనుమానముతోనే మా పెద్దదొర దండుచేయ దలచినది!—నాకుకూడ ఆమె ఇక్కడ నున్నదని యాశ!'

ఆ మాటఁతో విస్సన్నకు విశ్వాసము కలిగినది. 'మల్లయ్యా, నామాట విని ఇతనిని బంధవిముక్తుని గావింపుము—మన మొక్కింత ఏకాంతముగా మాట్లాడు కొందము!'

మల్లారెడ్డి తోకరాజు బంధములు తొలగించి యచ్చట వదలివేసెను. ప్రక్కనున్న మరియొక గదిలోనికి విస్సనయు మల్లారెడ్డియు వెళ్ళిరి. తోక రాజుపై కాపున్నట్లేలేదు.

విస్సన యట్లు వెళ్ళుచు చెంచుదొరను ఓరకంట పరీక్షించుచునే యుండెను. రెండవ గదిలోనికి వచ్చిన తర్వాతగూడ సోరణ గండ్లనుండి యాతడు తోకరాజు కదలికలు పరీక్షించుచునే యుండెను. చెంచుదొర బెదరు చూపులు చూచుచుండెనే గాని పారిపోవ యత్నింపలేదు.

'మన మితని విషయములో తొందరపడినట్లే ఉన్నాము. మరి చెంచు లక్ష్మి ఏమైనట్లు?'

'చెంచులనుండి తప్పించుకొనబోయి పాప మేచిక్కున బడినదో? ఈ రహస్యము విడదీయుట ప్రస్తుతము సాధ్యముకాదు. శంకర స్వాముల శ్రీముఖ పత్రిక ఏమైనట్లు? - ఏది ఎట్లున్నను పెద్దదొరను వెంటనే శిక్షింపవలె! తప్పదు.'

'పంటరెడ్డిని చెంచు గూడెములు నిరోధించుటకు వెంటనే పంపుదునా?'

విస్సన : 'మల్లయ్యా, పెద్దదొర నేడో రేపో దండెత్తి రానున్నాడట గదా! మన మాతని కఠినముగా శిక్షింపనిచో మన కందరకు ముప్పు రాగలదు. నేటిరాత్రే మన మీ కార్యము నిర్వహింపవలె! -ఇది పంటరెడ్డి ఐదు వందల మంది భటులతో చక్కబెట్టునది కాదు. మన కింకను పఱువుర సాహాయ్యము కావలె. వేమప్రభువులకు నివేదింతము!'

వా రిరువురు తోకరాజును సుగ్రీవుని రత్నగేహిని తోడు తీసికొని వేమ ప్రభువు కడకు బయలు వెడలిరి.

40

అంత యాకస్మికముగా మల్లారెడ్డి తనకు నమస్కరించి తిరిగిచూడక వెడలిపోయినంతనే ఎర్రయకు తన ప్రాణమే లేచిపోయినట్లనిసించినది. చిన్న తమ్ముని పై కోపించి కసిరికొట్టగా, నాతడు చిన్నపుచ్చుకొని వెళ్ళినప్పుడు ప్రేమ గల యన్నకు కలుగునను తాపమేయాతని నావేశించెను.

పైపెచ్చు చంచలు లగు చెంచులచేతిలో జిక్కియున్నది తన ధర్మపత్ని మూడురోజుల క్రిందట రావలసిన ధాని వార్తాకూడ తెలియకున్నదట! దాని కెట్టి దురవస్థ పట్టినది! ఏమి చేయుదు నయ్యో!

ఆరగడియసేపాతడు కదలలేక పోయెను. ఆ పిమ్మట నొక్కపెట్టున మల్లారెడ్డి వెంట పరుగెత్తి అతనిని పట్టుకొని వెనుకకు లాగికొని రావలెనని ఆతనికి బుద్ధి పుట్టినది. సమయము దాటిపోయినది. చాల వ్యవది ఐనది.

దూరమున శంకరస్వామి పూజాఘంటా నినాదములు వినవచ్చుచున్నను, అవి యాతని చెవుల జొచ్చుటలేదు జొచ్చినను మనస్సు కెక్కుటలేదు. అనంత మైన యీ విశ్వములో తన ప్రియపత్ని కంఠస్వర మాలకించుటకై యాతని యాత్మ తహతహపడుచున్నది.

అలనాడు రావణాసురుడు బలాత్కారముగా సీతామహాలక్ష్మిని ఎత్తుకొని పోవుచుండగా నామె చేసిన యాక్రందనము నే డాతనికి వినవచ్చు చున్నట్లైనది. ఆ మహారణ్యభూమిలో, ఆ మహాపర్వతభూమిలో ఏ శబ్దము పుట్టినను, అది మహాలక్ష్మి ఆక్రందనముగనే ఆతనికి భాసించుచున్నది.

దూరమున మెక మేదో జంతువును వేసి లాగికొని పోవుచుండెను. వేసిన వేయుట తోడనే గొంతు పట్టుకొనినది. అయినను ఆ జంతువు గొంతు మూసికొని పోకముందు అది వేసిన కేక, బిగిసికొని పోకున్న ఒకానొక కంఠ నాళము రంధ్రమునుండి చాలసేపు వినచ్చినది. రాక్షసు డెవరో తన ప్రియు

రాలిని బలవంతమున నెత్తుకొని పోవుచుండగా అది ఏడ్చుచున్నట్లే, ఎర్రయకా శబ్దము తోచినది. ఆతని కన్నుల నేకదారగా నీరు స్రవింప నారంభించెను. 'క్రోశంతీం కురరీ మివ' అనునాదికవి రామాయణములోని వాక్యములు మరి మరి అతని స్మృతికి రాసాగినవి.

చెంచుల చేతులలో నుండి అది మ్లేచ్ఛుల చేతులలో చిక్కెనేమో! అత డది ఊహలో కూడ నంగీకరింప జంకుచుండెను. అది తలపరాని తలంపు. మ్లేచ్ఛుల చేతిలో నవమానము పొందుటకు పు ర్వమే అది ప్రాణములు వదలును. అందుకు అది సాధనసామాగ్రి చేరువనుంచుకొన్నది ఆది యట్లు బలవన్మర ణము పాలైనచో తా నొక్క క్షణకాలము జీవింపలేదు.

తన పాణిగ్రహణమునకు పూర్వమునుండియు నంతవరకు తనకు పత్ని యెడ ప్రవృద్ధ మగుచు వచ్చిన ప్రేమ నంతయు నాత డొకమారు తలచుకొనెను. అది తన మేనత్త పోలమ్మ కూతురు, అది ముగ్గురన్నల తర్వాత పుట్టిన కడ సారి ముద్దుల ఆడుబడుచు. వివాహము కాక ముందటినుండియే పరస్పరము వారికి విచిత్రమగు నొక యనురాగము కలిగినది. అది ఎన్ని జన్మాంతరముల సాహచర్యఫలమో? అది పుట్టినప్పటినుండియు ఎర్రయ భార్య యవు నని ఉభయపక్షముల పెద్దలు తలంచుచుండిరి. తనకు గ్రాహ్యత వచ్చినప్పటి నుండియు అది తన భార్యయగుననియే తన విశ్వాసము. అదికూడ వివాహము కాకముందటి నుండికూడ, కాబోవుభర్తతో వ్యవహరించునట్లేఅది తనతో సిగ్గుతో ప్రవర్తించెడిది. పసితనము నాటిమౌగ్ధ్యము కొంచెము కొంచెము పెరిగినకొలది పెరుగుచున్న దాని మౌగ్ధ్యము, వివాహమునాటి మౌగ్ధ్యము, ఈడేరిననాటి మౌగ్ధ్యము, కాపురమునకు వచ్చినప్పటినుండి చూపుతున్న మౌగ్ధ్యము—అన్ని మౌగ్ధ్యములు ముద్దయై పరిణతి పొంది పొంది ముగ్ధాతిముగ్ధ మనోహరముగా దాని రూపము భాసించినది. దానిచూపు దాని హస్తస్పర్శ, దాని దేహస్పర్శ, అతనికి తెలియకుండగానే అతని ప్రాణముగా రూపొందినవి. అది తన అర్ధాంగి తన ప్రాణము, తన సర్వస్వము!

అది యవనులకు చిక్కినదెమో, అను తలుపు మనస్సున బారినంతననే గుండెలలో నతనికెవరో నూరుశూలములతో పొడిచి కెలుకు చున్నట్లయినది. రివ్వున నాతడు లేచెను. నీరింకిపోయి అతని కన్ను లెర్రవారి జ్యోతులవలె నున్నవి అతడు తోచక పంటరెడ్డి నివాసమునకు పోయెను.

పంట తన పరివారముతో చెంచుల గూడెములు ముట్టడించు సన్నాహ మున నుండెను. ఎర్రయ రాక యప్పు డాతని పని కాటంకముగా తోచినది. ఎర్రయ నాతడు గౌరవముగా సంభావించి కూర్చుండ జేసి తన పనిలో వ్యగ్రు డయ్యెను.

వెనుకటి పంటరెడ్డికి నేటి పంటరెడ్డికి ఎంత వ్యత్యాసము! ఇప్పు డాతని దేహ మంతయు మెత్తలతో నాచ్ఛాదిత మైనది. అతనివంటి చురుకుదనము గల వీరులు లోహకవచము శీఘ్రగమనమున కాటంకమని యెల్లక తరచుగా మెత్తలే ధరించుచుండిరి. నే డాతడు మెత్తలే ధరించి యుండెను. ఇప్పు డాతడు గొప్ప ధానుష్కుడు, ఖడ్గవిదగ్రణి. రణసాధనలే కాదు, రణక్రమములే అతనికి కరతలామలకములుగా నున్నవి. కాని అనుభవమే తక్కువ. తన నేర్పు ప్రద ర్శించుటకు పరీక్షించుకొనుటకు పెద్దయవకాశ మింతవరకు లభింపలేదు. ఈనాడు కలుగ నున్న యవకాశమున, తన సామర్థ్యము ప్రకటించు కుతూహలముతో నున్నాడు.

అంతలో దేసటిరెడ్డి కూడ నక్కడి కరుదెంచెను. అతడుకూడ ఎర్ర యకు గౌరవ సూచకముగా నమస్కరించి, వెంటనే పంటరెడ్డితో నేకాంతమున నేదో మంతన మారంభించెను. తా నక్కడ నిక ఉండుట యనుచితమని ఎర్ర యకు తోచినది.

ఎర్రయ కిది చిత్రముగా నున్నది. తనకుగూడ చెప్పరాని పని యేమో! ఏమైన తన కెందుకు? తన కాప్తుడగు పంటతో తన దుఃఖము వెళ్ళబోసికొను టకే అత డక్కడికి వచ్చియుండెను. ఈ పంట పూర్వము ఆర్తనాదము విని తనవెంట కర్ర తీసికొని వచ్చిన పంట కాదు. అత డిప్పుడు దళవాయి. తన గోడు ఆలకించుట కతని కిప్పుడు తీరుబాటు లేదు.

మరి యీ దేసటి రెడ్డియో? అతడును మహాపత్తునుండి తనచే తప్పింప బడిన చేసటి కాదు. అతడును ఇప్పుడొక దళవాయి.

పంటకును దేసటికిని ముఖములలోనను తీరులందును ఎంతో మార్పు వచ్చినది. వెనుకటి మోటుదనము, ఎడ్డెతనము, కొంచెము తనము పోయినవి. వారి ముఖములలో తెలివి ప్రకాశించుచున్నది. తీరులలో ఒక ఠీవి వచ్చినది. ఇతరుల కాజ్ఞ లిచ్చి పనిగొనుట వారి కభ్యస్త మైనది. వారి వాక్కులకు గాంభీర్య మలవడినది.

వారిద్దరు కొంతవడి సంప్రదించుకొని బయలుదేరిరి. అట్లు వెడలుచు పంటరెడ్డి, 'ఎర్రయ్య బాబూ, నీ వేదో మాట్లాడవలెనని వచ్చినట్లున్నావు. మే మొక పెద్దపనిమీద వెళ్లుచున్నాము. మమ్ము దీవించి పంపు! బ్రదికి బాగుంటే రేపు నీ దర్శనము చేసికొందుము. సెలవు!' అనెను.

'మీరు నిరామయముగా జయము పొంది తిరిగిరండు!' అని ఎర్రయ దీవింప, వారు బయలుదేరిరి. ఎర్రయకు ఏమిచేయను తోపలేదు.

ఆ రెడ్డిద్దరును బయలుదేరి వెళ్ళిన వెంటనే కందిరీగ సంచరించుచుండ పుట్టు నోంకార ధ్వనివలెనే శబ్దమొకటి ప్రారంభించినది. అది యొక్కతరి తుమ్మెద చేయు ఝంకారము ననుకరించుచుండెను. మరియొక సమయమున నది గ్రీష్మకాలమున మధ్యాహ్నవేళ తేనె పెరనుండి తేనెటీగలు లేచి చుట్టు నెగురు లాడుచుండ పుట్టు జుంజుం నాదమువలె నుండెను. ఏ నాదమైన నేమి? అది ఎర్రయ హృదయమునకు శాంతిని చేకూర్చినది. ఆ నాద శ్రుతిలో అతని హృదయ వీణా తంత్రులు లయమైనవి. అతని బాహ్యేంద్రియ జ్ఞానమంతయు మనస్సునందును, మనస్సు బుద్ధియందును, బుద్ధి యహంకార మందును, అహంకార మాత్మయందును లయ మయ్యెను. దీనికి నిమిత్తకారణమైన యా శబ్దము నెమ్మదిగా తగ్గితగ్గి వినరాకుండ పోయినది. ఒకవేళ నది చెవుల బడు చున్నను ఎర్రయ యది గ్రహింపగల స్థితిలో లేడు. అతని సర్వేంద్రియములు నిప్పుడు ఆత్మలో లయమైనవి. అతని యాత్మ యిప్పుడు ఆత్మపత్ని దర్శన స్పర్శన శ్రవణములకై మూడు లోకములు నిండి యున్నది. ఇతర దృశ్యములు ఇతర శబ్దములు నతని కిప్పు డగ్రాహ్యములు.

అంతలో నార్తధ్వని యొకటి యతనికి వినసైనది. అది యెన్ని యోజన ముల దూరముననుండి వినవచ్చుచున్నదో తెలియలేదు గాని నిశ్చయముగా నది యార్తధ్వనియే. భ్రాంతికాదు. అది తన్నే దీనముగా రహస్యముగా నిట్టూర్చుచు భయవిహ్వలమై సహాయము వచ్చి రక్షింపుమని వేడుచున్న శబ్దము. దానితో పాటు కన్నీరు జార్చుచున్న జలజలమను చిరుశబ్దముకూడ వినసైనది. ఆత్మ కది స్పష్టముగా తన ధర్మపత్ని కుయ్యిగానే భాసించినది. భాసించుటే ఏమి? తెలిసియే పోయినది.

కొంత తడ వాత డది దీనానను డగుచు నాలకించెను. ఆ యాలాపనలో నొక చిత్రమైన సంతోషము కూడ మిళితమైయుండెను. మన యాప్త లెక్క

డనో ఆపదలో నున్నారని ఎరిగి, వారున్న తావు వెదకుచుండగా వారు కనిపించినచో, ఆపదలో నున్నను వారు కనిపించినందుకు కలుగు తృప్తివంటి తృప్తి ఎర్రయ కిప్పుడు కలిగినది.

సందేహములేదు. అసహాయయై దీనముగా తన్ను తన యర్ధాంగి రమ్మని పిలుచుచున్న పిలుపే యది; యోగీశ్వరులకే గాని ఆట్టి దూరశ్రవణానుభవము సాధ్యముకాదు. ఆ పిలుపులోని యార్తము ఆతని నుద్బుద్ధుని గావించెను. అట్టిది ఎంతకాలమునుండి పిలుచుచున్నదో కాని ఇప్పటి కాతని చెవుల బడినది. ఇప్పుడాతని కాశబ్ద మేదిక్కునుండి వచ్చుచున్నదో కూడ స్పష్టముగా తెలియుచున్నది. ఆపదలో నుండి, 'అయ్యో, నాధా, రమ్మ, రక్షింపుము!'అని తన్ను కేకవేయుచున్నది. ఇతరము సమస్తము మరచి, మరియొక యాలోచన లేకుండ ఎర్రయ యా శబ్దము వినవచ్చుచున్నవైపుకు బయలుదేరెను.

ఆరాత్రి వెన్నెల ఆతడు గమనింపలేదు. ఆతడు పోవుచున్న కంటక శిలామయమార్గము లాతని యానమున కడ్డు రాలేదు. ఆతని ప్రక్కనుండియే పులులు, ఎలుగులు, వేగోలములు, తోడేళ్లు కొన్ని పోయినవి. వనగజరాజ మొకటి పాదఘట్టనముతో భూమి దద్దరిల్ల జేయుచు అతని సమీపముననే ఒక పార్శ్వమునుండి ఇంకొక పార్శ్వమునకు దాటినది. నిర్భయముగా నిశ్శంకముగా తదేకధ్యానముతో నడచిపోవుచున్న ఎర్రయను ఆ క్రూరమృగము లేవియు చెనక రాలేదు. నడచుచున్న యొకానొక వృక్షమువలెనే వాని కాతడు తోచి యుండును.

ఆ చలికాలపు రాత్రి యాతనికి చలితో వడకు పుట్టింపలేదు. రాత్రి గడచినది. సూర్యభగవాను డుదయించినాడు. మధ్యాహ్నమైనది. చురుకైన యాయెండవేడియు చురుకు చూపలేదు. సాయంతనమైనది, చల్లవడుచున్నది, అతనికి చలి వేయుటలేదు. అతడెక్కడ నాగక పోవుచునే యుండెను. మధ్యమధ్య ఎటుపోవుటో తెలియక సందేహముగా నున్నప్పుడు, అతనికి ప్రియురాలి యార్తనాదమే మరల మరల వినవచ్చుచు దారి చూపుచు తనవైపున కాకర్షించుచు లాగికొని పోవుచున్నది.

ఆ రాత్రియు గడచినది, హింస్రమృగము లెన్నియో మరల దాటిపోయినవి. చలిగాలి యీదురు ఆతని వడికింపలేదు. చంద్రుడు చలువ కలిగింపలేదు.

మరల సూర్యుడు వచ్చినాడు. వేడి యనిపింపలేదు. మూడు రాత్రులు రెండు పవళ్లు కడచినవి. అ శబ్దమును గురిచేసికొని ధనుర్ముక్తమైన బాణమువలెనే ఎర్రయ పయనించుచున్నాడు. ఇన్నినాళ్ళు ఆహారము లేదు. స్నానము లేదు. సంధ్యలేదు. నిద్రలేదు. ఆకలిలేదు. దప్పికూడలేదు. యోగసమాధివంటి యవస్థ యాతని ముందుకు నడిపించుచున్నది.

నాల్గవనాటి మధ్యాహ్నమునకు అతని దారి కడ్డముగా మహాపర్వత మొకటి నిలిచి బలవంతముగా నాతని గమనము నిరోధించినది. ప్రక్కనుండి పోద మన్న దుర్గమారణ్య మొకటి యడ్డు తగిలినది. దూరమున ప్రియపత్ని పిలుపు వినవచ్చుచునే యున్నది. ఎంత ప్రయత్నించినను ఆతని దేహము ముందుకు పోలేకున్నది. దేహమే జయించుచున్నది. ప్రియపత్ని పిలుపుకూడ క్షణక్షణము అస్పష్టమై వినరాక పోయినది. అయ్యో! పాపము!

అంతలో గాఢనిద్రలో నున్నవానిని పిడుగుపడిన శబ్దము ఆకస్మికముగా లేపునట్లే భయంకరశబ్ద మొకటి యోగసమాధిలోనుండి యాతని లేపినది. అది నికటభూమి నుండియే వచ్చుచున్న ప్రాకృత శబ్దము! నిస్సహాయులై పలువురు స్త్రీలు విలపించుచున్న శబ్దమది! అన్నికంఠముల మధ్యనుండి ప్రత్యేక మొక కంఠధ్వని యాతని నాపాదమస్తకము అదలించి వేసినది.

'ఎర్రయ్య తండ్రీ! ఎక్కడున్నావు, నాయనా? నీవైనా క్షేమముగా ఉన్నావా, మా తండ్రీ?'

అది సాక్షాత్తుగా తన తల్లి కంఠమే! తన మాతృదేవత కంఠధ్వని విని ఎన్నాళ్లైనది!

నిజముగా నది పోతమ్మ కంఠధ్వనియే. ఆ ముండ్ల పొదలలో చెట్లలో నుండి రివ్వున దారి క్రోసికొని బలవంతముగా నాతడు అటువైపుకు పరు వెత్తెను.

41

ఆరాత్రి తన యాప్తులతో కలసి పెళ్ళి మల్లారెడ్డి కొలది మాటలతో విషయ మంతయు వేమప్రభువుకు నివేదించెను.

"ఈరాత్రి చెంచులు చెలరేగి ఈ చుట్టుపట్టుల గ్రామములు కొల్లగొట్ట నున్నారని వార్తలు వచ్చినవి. చెంచుగూడెములు నిరోధించుటకు పంటరెడ్డిని పంపుచున్నాను. ఎవరు ముందగుదురో తెలియదు. నేనును బయలుదేరుచున్నాను. మీ రీ రాత్రి మనవారి నందరను కూడగట్టుకొని ఈ చుట్టుపట్టుల చేరిన జనము లను రక్షింపవలసి యున్నది!"

మల్లారెడ్డి తనపై పెట్టుకొన్న భారమును ఆతని భుజములపైనుండి చెప్పకుండ తొలగించి, వేమారెడ్డి కార్యరంగమునకు స్వయముగా సిద్ధపడెను. రామనమంత్రితో గలసి శీఘ్రముగా విషయావగాహన మొనర్చుకొని యిట్లనెను:

'నా వెంట వచ్చిన వీరులలో ఐదువందలమందిని నీకు తోడిచ్చెదను. ఈప్రాంతభూమి మాకు బాగుగా తెలిసినది కాదు. దాని నవగాహనచేయుటకై విస్సనమంత్రి నిక్కడ మాతో ఉంచుము!—నీ మనస్సు మెత్తనిది మల్లా! చూరకు వచ్చుచున్నవారి గ్రామములను నిష్కరుణముగా చూరగొన్ననేగాని వారి దోపిడు లాగిపోవు. ఈ చెంచుమలను మనభటులు ఈరాత్రి చూరగొను నట్లు కఠినముగా నాజ్ఞాపించుచున్నాను. నా యాజ్ఞ యందరికి తెలిపి మరి బయలుదేరుము!'

కార్యభారము అన్న పై వేసికొన్నందుకు ఎక్కువ సంతుష్టుడై మల్లా రెడ్డి వేమారెడ్డికి నమస్కరించి దీవనవడసి, వేమారెడ్డి ఇత్తునన్న భటులను కూర్చుకొని తనతో కలసికొనుటకు సంకేతస్థలము నిర్ణయించి రత్తగేహి నా పనికి నియోగించి, చెంచుదొర లిద్దరితోడను కలిసి పంటరెడ్డికి తుదియాజ్ఞ లిచ్చుటకు శీఘ్రముగా బయలుదేరెను. కాని తానిప్పుడేమి యాజ్ఞాపింపవలె?

అన్నగారి యాజ్ఞ యెంత కఠినముగా నున్నది! బుద్ధిహీను లగువారి గూడెములు చూరగొనుటా? దయాదాక్షిణ్యము లెరుగని చెంచులపై జాలిచూపు టేమినీతి! వేమన్న ఆజ్ఞ ప్రభువుల యాజ్ఞ! అది నిర్వర్తింపక తప్పదు! 'నా యనుమానములతో శంకింప బనిలేదు. వేమన్న యాజ్ఞ ధర్మదేవత యాజ్ఞ! జయ బసవశంకర!'

ఇట్లనుకొనుచు పంటరెడ్డిని కలసికొని, అతనికిని అతనితోనున్న దేసట రెడ్డికిని చెంచుగూడెములన్నియు నిరోధింపవలసిన దనియు, చెంచుదొర లప్పటికే గూడెములు వదలి దోపిడికి తరలిపోయి యుండినచో వారినెవ్వరిని

మరల గూడెములలోనికి చేరకుండ నడ్డగింపవలసినదనియు, తాను శంఖనాదము చేసినంతనే ఒక్కపెట్టున గూడెము లన్నియు నిర్దాక్షిణ్యమున కొల్లగొట్టవలసిన దనియు, బాలస్త్రీ వృద్ధుల నందరిని బంధింపవలసిన దనియు - అవసరమని తోచినచో గూడెములు తగులబెట్టుటకును జంకవల దనియు - ఉత్తరువులిచ్చి పంపివేసెను. వారికి తోకరాజును గూడ తోడిచ్చి సుగ్రీవుని తనతో నుంచుకొనెను.

కొద్దిసేపటికే వేగరులు చెంచు లందరు గూడుకొని శంకరస్వాముల యాశ్రమము ముఖముగా వచ్చుచున్నారని వార్త తెచ్చిరి. వెంటనే మల్లారెడ్డి సుగ్రీవుని తోడు తీసికొని భటులతో కదలి వేమారెడ్డి భటులను కూర్చుకుని వచ్చుచున్న రత్తగేహిని సంకేత స్థలమున గలసి, చెంచులు రాదగిన యడవి మార్గమునకు ఈవల నిలిపెను.

భీమరాజు నాయకత్వమున అడవి మార్గములనుండి చెంచులు అసంఖ్యా కముగా బారులు తీరి వచ్చుచుండిరి. వారి నెదురించుటకు మల్లారెడ్డి సేనలు కూర్చియున్నాడని వా రెరుగరు. అడవి మార్గము లన్నియు విశాలమగు నొక లోయలోనికి వచ్చి కలియుచుండెను. ఆ లోయకు రెండువైపుల మల్లారెడ్డియు రత్తగేహియు తమ భటులతో కాచియుండిరి. చెంచులు అందరు అడవిదారుల నుండి నిర్గమించిన తరువాతగాని వారినేమియు జేయవద్దని మల్లారెడ్డి శాసించి యుండెను. వారిని మార్గద్వారములకడ నిరోధించినచో వారు మరియొక మార్గ మున వెనుదిరిగి పోయి పల్లెలపై బడి కొల్లగొట్ట వచ్చును:

తమకు ప్రతిఘటన రానున్నదని చెంచు లేమాత్రము నూహింపకుండు టచే నిర్లక్ష్యముగా నా ప్రదేశమునకు వచ్చిరి. అక్కడినుండి వివిధ నాయకుల క్రింద గుంపులు గుంపులుగా చీలి పల్లెలమీద పడియుండెడివారు. వారి నందరిని లోయలోనికి రానిచ్చి మల్లారెడ్డి తన భటులచే హెచ్చరిక చేయించెను.

'ఎవరా వచ్చేది? ఆయుధములు వదలి చేతులు కట్టుకొని నిలుచోండి! లేకున్న ప్రాణములు దక్కవు!'

వెంటనే నిర్భయమగు చెంచుల ప్రత్యుత్తరము వచ్చినది: 'చెంచుల పెద్దదొర భీమరాజును కాదనగలవా రెవరు? ప్రాణములమీద ఆశ ఉన్నవారేనా?'

'మల్లారెడ్డి!'

ఆపేరు విన్నంతనే చెంచుల అలజడి కొంచెము మాటు మణగినది. వారిలో నించుక జంకు వ్యక్తమైనది. ఇంతలో దృఢనిశ్చయము చేసి చెంచులు జవాబిచ్చిరి:

'మా చెంచులక్ష్మిని దొంగిలించుకొని పోయిన మల్లారెడ్డీ, నీకిది తగదు. మా లక్ష్మిని మా కప్పగించు! లేనిచో మీ పల్లెలలో ఒక్క పురుగుకు బ్రదుకు పై ఆశ ఉండదు, ఈ రాత్రి!'

మల్లారెడ్డి యాజ్ఞకొని అనుచరుడుత్తర మిచ్చెను: 'లక్ష్మిని మీ చెంచు గూడెములలో దాచినందుకు మిమ్ము శిక్షించు నిమిత్తమే మల్లారెడ్డి ఈరాత్రి బయలుదేరినాడు. దొంగతనము మల్లారెడ్డికి చేతగాని పని!'

భీమరాజు వెర్రికేక వేసెను. ఆ శబ్దముతోడనే చెంచులు కురిసిన బాణ వర్షము మల్లారెడ్డి భటులపై బడినది.

మల్లారెడ్డి శంఖారావము దిక్కుల పిక్కటిల్ల జేసెను.

ఆ పైని మల్లారెడ్డి భటులకును చెంచులకును వెన్నెలలో భయంకర యుద్ధము ఆరంభమైనది. చెంచుల సంఖ్య లెక్కింప సాధ్యము కాకున్నది. వారికి ప్రియములైన వెదురుచువ్వలవలెనే వారి దేహములు దీర్ఘములై జవ జవ లాడుచున్నవి. వారి బాణములకు గురి తప్పు నభ్యాసము లేదు. పెద్దదొరకు మెత్తలున్నవి. తక్కినవారికి మెత్తలు కవచములు శిరస్త్రాణములు—ఏవియు లేవు. వారి నడకలును సుశిక్షితములు కావు. ఒకచోట పలుచగా నుందురు మరియొకచో గుంపుగా కూడి పైకొనుటలో ఆయుధము లాడింపలేరు. ఆడించి నను తమవారికే దెబ్బలు తగులుచున్నవి.

మల్లారెడ్డి భటుల సంఖ్య చెంచుల సంఖ్యలో ఆరవవంతే. అయినను వారు మొత్తముమీద శిక్షితులు. కొలదిమందికి కవచములు పలువురికి మెత్తలును ఉన్నవి. రొమ్ములపై డాళ్లు శిరస్సులకు త్రాణములు కలవు. వారు తమ ఖడ్గ ములతో శూలములతో పరశువులతో చెంచులను తాకిరి. ప్రారంభములో తప్ప చెంచులు తమ ప్రధానాయుధములగు ధనుస్సుల ప్రయోగించుట సాధ్యపడలేదు. విండ్లగొనయములలో బాణసంధానము చేసి లాగుచున్నంతలోననే శూలపాణులు

వారి రొమ్ములలో పొడిచివేయుటో, ఖడ్గపరశు హస్తులు చేతుల నరికివేయుటో జరుగుచుండెను.

అదిగాక చెంచులు ప్రకృతి సిద్ధముగా పిరికివారు. వారు తీవ్రముగా నిర్ద్దాక్షిణ్యముగా పైబడుదురు. ప్రతిఘటన వచ్చి గట్టిగా ఎదురుదెబ్బ తగిలినచో నిలువలేక శీఘ్రముగా విరిగిపోవుదురు.

సరిగా నట్లే ఈ రాత్రి యుద్ధము జరిగినది. తెల్లవారుసరికి ఐదువందల మంది చెంచులు హతులైరి. అదిచూచి మిగిలినవారు పారిపోవుటకు ప్రయత్నించిరి. అప్పటికే మల్లారెడ్డి యనుచరులు అరణ్య మార్గము లన్నియు కంపలు వేసియు శిలలు వేర్చియు నిరోధించుటచే వారికి త్రోవ కనపడలేదు.

రోషావేశముతో నున్న చెంచుల పెద్దదొర మూరమున మల్లారెడ్డిని ఉపలక్షించెను. మల్లారెడ్డి తనవారికి అవసరమగు ఆజ్ఞ లిచ్చుచు వ్యగ్రుడైయుండెను. చెంచుదొర చెంచుబాణమువలెనే సూటిగా కోపాటోపముతో వచ్చి మల్లారెడ్డిపై బడెను. రెడ్డి ఆతనిని ముందు ఉపలక్షింపలేదు. మీద పడుచున్నప్పుడు గమనించెను. కాని అప్పటికే ఆలస్యమైనది. అవచిదేవయ బహూకరించిన తేలిక ఖడ్గమును ఒరలోనుండి లాగుచు మల్లారెడ్డి రెండడుగులు వెనుకకు వేసెను. చెంచుదొర నాలుగంగలు ముందుకు వచ్చెను. మరి రెండడుగులు వెనుకకు వేసి మల్లారెడ్డి పోరుకు సిద్ధపడెను. పెద్దదొర నాలుగంగలు ముందుకువేసి యాతనిపై కవిసెను.

భీమరాజు దురుసుగా బలమైన తనకత్తి మల్లారెడ్డిపై ప్రయోగించెను. అది బరువైన కత్తి. దాని దెబ్బకు చేవగల చెట్లే తెగిపడును. మల్లారెడ్డి చురుకుగా తన డాలు అడ్డముపెట్టి ఆదెబ్బ దానిపై పడనిచ్చి అవచిదేవయ యిచ్చిన కత్తితో ఆ చెంచు తల తెగవేసెను.

చెంచుదొర మడ్డుకత్తియు వృధ కాలేదు. అది మల్లారెడ్డి డాలును రెండుగా పగుల వేసి, అతని రొమ్ము ప్రక్క భాగమున పడ్డది. దానితో వట వృక్షమువలె మల్లారెడ్డి పడిపోయెను.

చెంచులు మొండి చరచి ఒక్క పెట్టున పడిపోయిన మల్లారెడ్డిని ముక్కలుగా ఖండించుట కతనిపైకి వచ్చుచుండిరి. వెంటనే యది నిర్లక్షించి రత్తగేహి కుప్పించి దూకి చేతిలో నిడుపైన మహాశూలము ధరించి తన మహా

కాయముతో కుంభకర్ణునివలె నడ్డునిలిచి ఒక్క చెంచునుగూడ ఆవైపు చేరనీ యక భీకరముగా ప్రతిఘటించెను.

తమ నాయకుని పాటుచూచి మల్లారెడ్డి యనుచరులు కోపావేశముతో చెంచులను ఖండింపసాగిరి. చెంచులు నిలువలేక త త్తరముతో నాయుధములు పారవైచి చేతులెత్తి నమస్కరించుచుండిరి. అయినను మల్లారెడ్డి భటులు నిర్దా క్షిణ్యముగా వారిని నరకుచునే యుండిరి. మల్లారెడ్డి పడిపోగానే సుగ్రీవుడు ప్రక్కనున్న యడవిలోనికి పోయి వటివడి ఆ కొకటి తెచ్చి, దాని పసరుతో మల్లారెడ్డి గాయమునకు చికిత్స చేయుచుండెను. అత డీ హత్యాకాండ చూచి నిరాయుధులను చంపకూడదని జ్ఞాపకము చేయునంతవరకు మల్లారెడ్డి భటులట్లు చెంచుల నరకుచునే యుండిరి. అప్పుడు వారు తమ బీభత్సకాండ చాలించి చెంచుల బంధింపసాగిరి. ఆ విధముగా నప్పుడు బంధిత లైనవారు వేయిమంది!

సుగ్రీవుడు తాను తెచ్చిన పసరు మల్లారెడ్డి గాయమునకు పట్టించి, నోటిలో క్రుక్కి ఆకులతో గట్టిగా కట్టుకట్టి ర క్తస్రావము నిరోధించి చికిత్స కొరకు విస్సన యొద్దకు పంపెను.

*　　*　　*　　*

ఇక్కడ నీ పోరు జరుగుచుండగా నావల చెంచు గూడెముల యొద్ద భయంకరమగు బీభత్సకాండ జరిగిపోయినది. పంటరెడ్డియు దేసటరెడ్డియు తమ తమ దళములను విభాగములు చేసి, ముందు పాతిక చెంచుగూడెములను ముట్ట డించిరి. వానిలో పడుచు చెంచుదొరలు గూడెమునకు ఒకరిద్దరకంటె నెక్కువ మంది లేరు. తక్కినవారు స్త్రీలు, వృద్ధులు, పిల్లలు. అది కనిపెట్టి భటుల నింకను పంపి మరి పాతిక గూడెముల గూడ వారు ముట్టడించిరి.

ముందుగా తోకరాజు గూడెము లన్నిటికిని పరువు పరువున బోయి, లోనివారిని బయటికి రాకుండ గదలకుండుడని యాజ్ఞాపించుచు, గూడెములలో నుండి బయటికి గదలినచో నట్టివారికి ప్రాణములపై నాశ యుండదని ప్రకటన చేయుచు వెళ్లెను.

సామాన్యముగా చెంచు లందరు చిన్నదొర యాజ్ఞలు పాటించెడినారే. కాని యీనా డాతని వైఖరి సందేహాస్పదముగా నున్నది. పెద్దదొర గ్రామము లపై వేటకొరకై పోయియుండెను. ఇత డిక్కడ నున్నాడేమి? చెంచులక్ష్మి

మాయమైనదని యందరు నుద్విగ్నులై యుండగా ఇత డిట్లు రెడ్డివీరులతో తిరుగుచు విపరీతాజ్ఞలు చేయుచున్నాడేమి ? ఏదో మోసమున్నదని వారి కనిపించినది. ఆనాటి యావేశములో గూడెముల లోని వారు తోకరాజు నాజ్ఞలు పాటింపలేదు. నిజముగానే చెంచులక్ష్మితోపాటు చెంచుమలలోని చెంచుల యదృష్టము కూడ వారిని వదలిపోయినట్లున్నది.

పంటరెడ్డికిని దేసటరెడ్డికిని కఠినమైన యాజ్ఞలున్నవి. ఆరాత్రి చెంచు గూడెములలో చిత్రవధ సాగెను. గూడెమునకు ఒకరిద్దరు చొప్పున కాపున్న పడుచుచెంచులు ఎదిరింప గడగినంతనే, రెడ్డివీరుల చేతులలోవారు నిహతులైరి. చెంచువృద్ధులు స్త్రీలు కొందరు సెలగోలలతో బయటికి రాగా వారును నిర్దాక్షిణ్యముగా చంపి వేయబడిరి. ప్రతిఘటించిన గూడెములలో మిగిలిన చెంచులను - పిన్నలు పెద్దలు, స్త్రీలు పురుషులు, అను విచక్షణ చేయక - అందరను భటులు బంధించిరి, ఎవ రేమాత్రము ఎదురుతిరుగ సాహసించినను అట్టివారు ప్రాణముల గోల్పోయిరి.

పిమ్మట భటులు గూడెములలో జొరబడి చెంచులు నిలువ చేసిన ధనమంతయు సంగ్రహించిరి. వారు తరతరములుగా బాటసారులను దోచి కొల్లగొట్టిన ధనము లందులో నున్నవి. అంతేకాదు. శ్రీశైల పర్వతమున సిద్ధనాగార్జునునకు పూర్వము నుండియు బంగారు చేయగల సిద్ధులుండిరని ప్రతీతి. అట్టి సిద్ధులెందరో కూర్చిన బంగారముకూడ చెంచులగూడెములు చేరినది. అదియుగాక కృష్ణాతీరమం దక్కడక్కడ వజ్రాల గనులు గలవు. లింగాల గట్టులో లింగాకారముగా కనిపించు శిలలలో ఎన్నో అమూల్యవజ్రము లున్నవి వాని విలువ చెంచులకు తెలియకున్నను, అవి విలువగలవిగా నితరులు భావింతురని వారెరుగుదురు. ఏమైనను పిల్లల కాటవస్తువులుగా నుండు మెరుగురాళ్ళని వారెన్నియో వజ్రములు కూడబెట్టి యుండిరి.

ఆ నగలు, ఆ బంగారము, ఆ వజ్రములు రెడ్డిభటులిప్పుడు చూరగొనిరి. అవి యన్నియు రాసులైనవి. అవిచూడగా భటులకు కన్నులు మిరుమిట్లు కొలిపినవి. ఎవరి కందినవి వారు ఎత్తుకొని పోవలెనని పలువుర కాశపుట్టినది. ఒకవంక పంటయు ఇంకొకవంక దేసటయు సహస్రాక్షులవలె కనిపెట్టియుండి, విశ్వాసపాత్రులగు బంట్లచే సమస్తము వేమారెడ్డి భండారమునకు చేర్చుటకు జాగ్రత్త పరపించిరి.

పెద్దచెంచు గూడెమును దేసటరెడ్డి ముట్టడించెను. అక్కడ వారికొక బాలు డెదురు వచ్చి దండము పెట్టెను. ఆ బాలుడు చెంచువేషముతో నున్నను చెంచుగా తోచుట లేదు. ఆతని మాటలో తీరులో భేదమున్నది. ఏమి చేయను తోపక దేసటి యాతని సమీపమున గల పంటకడకు పంపెను.

ఆ బాలుడును పంటయు ఒకరి నొకరు చూచుకొనినదే తడవుగా గాఢముగా కౌగిలించుకొని బావురుమని యేడ్వసాగిరి.

పంటరెడ్డి యట్లొక చెంచును కౌగిలించుకొని ఏడ్చుచుండుట చూడ నాతని యనుచరుల కాశ్చర్యమైనది. పంట సాధారణముగా భావావేగము పైకి కనబరచు స్వభావము లేనివాడు. ఈ సమయములో చెంచుకుర్రవానిని చూచి ఇది ఏమి ? పంటకు మతి చలింపలేదు గదా! ఈ కుర్రవాడుకూడ నట్లు వింత విశ్వాసముతో ప్రవర్తించుచున్నా డేమి! వీరు అప్పుడై యుందురు. బహుకాలము క్రిందట దూరమై మరల కలసిన ట్లున్నారు.

అంతలో నెక్కడినుండియో చిక్క శల్యమైయున్న కుక్క, కాటతోక యాడించుచు, వా రిరువుర చుట్టును ప్రేమాతిశయముతో ప్రదక్షిణము చేయుచు మూర్కొనుచు నాక మొదలు పెట్టినది. వారిద్దరి అన్యోన్య ప్రేమకంటె దానికి వారిపైప్రేమ యధికముగను, వారి యానందముకంటె దాని యానందమెక్కువ గను కనిపించుచున్నది. ఆ కుర్రవాడు దానిని చేతుల నెత్తుకొని 'కాటా'యనుచు రొమ్ముకు హత్తుకొనెను.

పంటరెడ్డి యప్పుడు దానిని గుర్తించి చేతుల నందుకొని రొమ్మునకు దాని శిరస్సు హత్తుకొనెను. పంట కన్నులలో నీరు గిర్రున తిరిగినది. తండ్రికి తురకలచే ప్రాప్తించిన దుర్మరణ మాతని స్మృతిలో బారినది. 'కాట' ఆస్మృతికి చిహ్నము. కాట నెత్తిపై నప్పుడు పడినగాయము నయమైనను అక్కడ పడిన సొట్టయు, ముడికట్టిన మచ్చయు, దాని విశ్వాసము ముద్రవేసినట్లు నేటికి స్పష్టముగా కానవచ్చుచున్నది. తమ తండ్రిపైకి చంపుటకు మ్లేచ్ఛుడు లంఘింపగా, కాట యడ్డు తగిలి యాతనిపై నొక్కటిట్టున కలిసినది. మ్లేచ్ఛుని ఖడ్గము కాట నెత్తిపై పడినది. రక్తము చింది దేహము తడియుచున్నను, అది పై కెగరుచు తండ్రిని తాకకుండ నా మ్లేచ్ఛుని నడ్డగించినది. రక్తస్రావ మధికమై కాటకు స్మృతి పోయిన పిమ్మటగాని మ్లేచ్ఛుడు తమ

తండ్రిని సంహరింపలేక పోయెను. తలతెగి పడియున్న తండ్రి శవము ప్రక్కనే కాటయు నెత్తుట దోగిపడి యుండెను. ఆ గాయపు మచ్చను ఆదర ముతో నివురుచు పంట పరధ్యానములో పడెను.

ఆ శ్వానముకూడ పెద్ద యజమాని స్మృతిలోనికి రాగానే దూరాలోచ నలో పడిపోయినట్లున్నది. దాని కన్నులు నిశ్చలమైనవి. చెవులు రిక్కించినది. కన్నుల నీరు కార్చుచున్నది. అది నెమ్మదిగా తలఎత్తి కొంతసేపు పంట వంకను కొంతసేపు ఆ కుర్రవాని వంకను చూడసాగినది. వారిద్దరు అన్నదమ్ము లని దాని కెరుకయే. అది ముందే గుర్తించినది. తన పెద్ద యజమాని యగు వారల తండ్రి గుణములు స్వరూపము వీరిద్దరిలో ఎవరియందు ద్యోతమగుచు న్నవో నిశ్చయించుటకు యత్నించుచున్నట్లున్నది. తల ఇతనివైపు అతనివైపు త్రిప్పిత్రిప్పి తుదకు నిశ్చయించుకొన్న ట్లున్నది. దానికి పంట నచ్చినట్లులేదు. అది ఒక్కదూకున చిన్నయ మీదికి దూకి తోక యాడించుచు ప్రేమతో నొడల నెల్ల నాకసాగినది.

ఈ సమయముననే హఠాత్తుగా పెద్దదొర భీమరాజు గూడెములోనుండి ప్రతిఘటన వచ్చినది. అందులోనుండి వృద్ధులు, యౌవనము వచ్చుచున్న బాలురు, కొందరు స్త్రీలు చేతికి దొరకిన యాయుధములు పట్టి రెడ్డివీరులపై బడిరి. దేసటిరెడ్డి భటులు చెంచుల నెల్లర హతమార్చిరి. పెద్ద చెంచుదొరసా నులు ఏడుమంది బంధింపబడిరి.

ఆవల యుద్ధకాండ జరుగుచుండగా పంటరెడ్డి తమ్మునితో నిట్లు సంభా షించెను.

'ఇన్నాళ్ళు నెక్కడ నుంటివి?'

'ఆరాత్రి నీకోసము అందరము కలసి వచ్చుచుండగా చెంచు లడ్డగించి మహాలక్ష్మమ్మను చెంచులక్ష్మి అని ఈ గూడెమునకు చేర్చి పూజింప సాగిరి. నేను గోమహాలక్ష్మిని దూడతో తోలుకొని కాట చూపిన దారినిబట్టి రెండు మూడు రోజులకు ఇక్కడికి చేరికొంటిని. ఆరాత్రి భయముతో అందరము చెల్లా చెదరైతిమి. అమ్మ, సూరయ్యగారు, పోతమ్మ, ఎటుపోయినారో తెలియదు.'

'మహాలక్ష్మమ్మ ఏమైనది?'

'ఏమో! చిత్రముగా మూడురోజుల నుండి మాయమైనది. ఆమె యిన్నాళ్ళు ఉన్న నృసింహ బిలములో శంకరస్వాముల ముద్రికయున్న పత్ర

మున్నదని చెంచులుచెప్పి, నన్ను ఈ మూడురోజులనుండి, ఆమె ఏమైనదో తెలుపుమని పరిపరివిధముల బాధ పెట్టినారు. నన్ను చెంచులు బ్రదుకు నిచ్చెడి వారు కారు. ఈమూడు రోజులనుండి కాటకూడ మాయమై ఇప్పుడే ఇటు వచ్చినది !'

'సరే! ఈ సందడి తగ్గిన తర్వాత కాటని వదలి చూతము !-'

దేసటిరెడ్డి పని ముగించుకొని పంటరెడ్డికి సమస్తము వర్ణించెను. వా రంతట చెంచుగూడెములపై నపసరమగు కాపుపెట్టి, ఆ రాత్రి బంధితులైన చెంచులను, చూరగొనిన రత్నకనకాదులను తరలించుకొని పూర్వనిర్ణిత విధాన మున వేమారెడ్డి స్కంధావారమునకు తీసికొని పోయి అప్పగించిరి.

ఆ రాత్రి యంతయు వేమారెడ్డి విస్మనతో మంతనములు సలుపుచుండెను. వారు నిద్రపోలేదు. ఆ రాత్రి సంభాషణమతో శ్రీశైలప్రాంత మంతయు వేమా రెడ్డికి అవగత మైనది. పాతాళగంగ వరకు శ్రీశైలమల్లికార్జునుని దేవళము నుండి మెట్లు కట్టించినచో, రాకపోకలు సుఖములై చెంచులబాధ తొలగిపోవు నని యాతనికి స్ఫురించినది.

తెల్లవారుటకు ఐదుగడియ లున్నది. పుణ్యమగు బ్రాహ్మీ ముహూర్తము వచ్చినది. లోకము మేలుకొనుచున్నది. వేమారెడ్డి కరపదశౌచము చేసికొని నందికంత పోతరాజు ఉన్నమందిరము కడకు బోయెను. అప్పటికే తల్లి అన్నమ్మ శుచియై పోతరాజున్న మందిరము గోమయముతో నలుకుచున్నది. వేమారెడ్డిని చూడగానే ఆమె, 'నాయనా, ఏమి పనిమీద వచ్చినావు, వేమా ?' అని అడిగినది.

'దేవరసమక్షములో మ్రొక్కుకొనుటకు వచ్చినానమ్మా!'

తల్లి యనుమతింపగా, వేమారెడ్డి నందికంత పోతరాజుకు ధూపమువేసి నమస్కరించెను.

'నందికంత పోతరాజు తండ్రీ! నీకూ సిరిగిరి మల్లయ్యకూ భేదము లేదుగా, నాయనా! నేను అనుకొన్నట్లు గుండ్లకమ్మకు కృష్ణకు మధ్యనున్న ఈ భూమి యవనుల బాధనుండి నిర్ముక్తము చేయుటకు నా బాహువులకు శక్తి దయచేయించండి! మల్లయ్య గుడినుండి పాతాళగంగకు మెట్లు కట్టించెను!'-ఇట్లు

నుచు వేమారెడ్డి తన వెంటతెచ్చిన బంగారపు కణిక యొకటి ముడుపుకట్టి తల్లి కప్పగించెను. అన్నమ్మ ఆనంద బాష్పములతో దీవించినది.

పోతరాజుకును తల్లికిని నమస్కరించి సెలవు తీసికొని వేమారెడ్డి తన స్కంధావారమునకు వచ్చి యప్పటికే అక్కడికి తమ చూరతెచ్చి అప్పగించి యున్న పంటరెడ్డిని దేసటరెడ్డిని చూచి వారల నగ్గించెను. ఇక శంకర మతము నకు భయము లేదని నిశ్చయించి తన కడ నున్న భటులను మరికొందరను మల్లారెడ్డికి సాయ మంపి పంటరెడ్డి దేసటిరెడ్డి సాయముతో సాధించిన విజ యము ఆలకించుచుండెను. రామా ప్రైగ్గడ చూరగొన్న యమూల్యరత్నాదుల పట్టి వినిపించుచుండెను.

సూర్యోదయ మైనది. చుట్టుపట్టుల జనములందరు గుంపులుగా కూడిరి. ఆ చూరవస్తువులు చూడ చూడవారికి కన్నులు మిరుమిట్లు కొన్నవి. వారంద రొక్కపెట్టున వేమారెడ్డిని, చెంచుమల చూరకార! చెంచుమల చూరకార! చెంచుమల చూరకార!' అని అగ్గింపసాగిరి.

కాని వేమారెడ్డి కేలనో సంతోషముగా లేదు. మల్లారెడ్డి యుద్ధవార్తలు తెలియలేదు. భయంకర యుద్ధము జరుగుచున్నదనియే గాని విజయవార్త రాలేదు.

భీమరాజు నిహతుడయ్యెననియు, చెంచులందరు హతశేషులు బంధిత లైరనియు, వేమారెడ్డి యనుచరులు వార్త తెచ్చిరి. వారు మల్లారెడ్డి పేరెత్తక పోవుటచే వేమారెడ్డి వ్యగ్రతతో నాతని క్షేమవార్త యడిగెను. అతడు తీవ్ర ముగాగాయపడెననియు ఆతని స్కంధావారము చేర్చుచున్నారని వారు దీనవాక్య ములతో నివేదించిరి. వెంటనే తమ్ముని జూచుటకు వేమారెడ్డి విస్సనమంత్రితో బయలుదేరెను.

వేమారెడ్డి తమ్ముని ప్రధానస్కంధావారమునకు చేరునప్పుడే. అక్కడికి రక్తరంజితమైన మల్లారెడ్డిని మంచముపై చేర్చిరి. మల్లారెడ్డి మూర్ఛనుండి తేరికొననందున, అతడు జీవించి యుండెనోలేదోకూడ అన్న యూహింపలేక పోయెను. అ తెచ్చినవారును నిస్సారమైన దేహములతో మౌనముగా వచ్చి మల్లారెడ్డి దేహమును అక్కడ నొక బల్లపై పరుండ బెట్టిరి.

హృదయములో నిండిన యారాటము నడచుకొని విస్సన మల్లారెడ్డి దేహమును పరీక్షించెను. ముందు నాడిజూచి జీవ మున్నదని నిశ్చయించి వైద్య

సించిన మోముతో దేహమంతయు పరీక్షించి రొమ్ముప్రక్క నొక్కటే గాయ మున్నదని తెలిసికొనెను. గాయమునకు చెంచు వేసిన పసరులో నుండి నెత్తు రింకను ఉబుకుకొని వచ్చుచుండుట గమనించి, ఆ పసరేదో తెలిసికొనుటకై దానివాసన చూచెను. తాను వేయదలచిన పసరేయది యని తెలిసికొని తృప్తి పడెను. తన కడగల పసరుతో మరికొన్ని యోషధులు కలిపి ఆ గాయపు పట్టుపై దట్టముగా పట్టించి గట్టిగా నతడు కట్టుకట్టెను నెత్తురు పూర్తిగా కట్టు వడినది. కాని మల్లారెడ్డికి స్పృహ రాలేదు.

విస్సన్న ఇట్లు చికిత్స చేయుచుండగా వేమారెడ్డి హృదయములో పొంగి వచ్చుచున్న ఆవేగము వశీకరించుకొని శ్రద్ధగా గమనించుచుండెను. కట్టు కట్టు చున్నందుననే తమ్ముడు జీవించియుండెనని ధ్రువపరచుకొని నిట్టూర్పు విడిచెను. కట్టు పూర్తియైన తర్వాత ఆతడు విస్సన్నను పలుకరించెను.

'విస్సనమంత్రీ' ప్రమాదము లేదుగదా?'

'చెప్పలేము రక్తము చాలా కారినది.'

'విస్సనమంత్రీ, రామనమంత్రితోకూడ సంప్రదింతునా?'

'ఏ విషయము?'

'మల్లారెడ్డి చికిత్స విషయము!'

'అదా? యుద్ధవిషయమేమో యనుకొంటిని వైద్యవిషయము మా వంశమువారు ఇంకొకరితో సంప్రదించు నాచారములేదు.'

వేమారెడ్డి చిన్నపుచ్చుకొన్న ముఖముతో తన స్కంధావారమునకు బయలుదేరెను. విస్సన మల్లారెడ్డి వస్త్రము మార్పించి, ఆతని దేహమున చారలుకట్టిన రక్తము తుడిపించి, యాతని సుఖశయ్యకు చేర్పించెను.

42

ఎర్రయ మాతృకంఠము గుర్తించి పొదలలోనుండి పరువెత్తి ఒక్క త్రుటికాలములో సమీపముననే యున్న యొకబాట చేరికొనెను. ఆ బాట మనుష్య సంచారముచేనైన బాటకాదు. అది కాలిబాటయే. ఆటవికమృగములు ఆహార పానీయములకై రాకపోకలు చేయుటచే నేర్పడిన బాట. ఆ బాటను

సమీపించుచున్నకొలది ఆర్తలగు పలువురు స్త్రీల కంఠధ్వనులు గగ్గోలుగా అంతకంతకు స్పష్టతరమై వినవచ్చుచున్నవి. అతడొక్క పరుగున బోయి చూడగా నది వరహాములు చేసిన గాట. అందులో పెద్ద ముత్తైదువుల గుంపొ కటి కన్పించెను. ఆ ముత్తైదువలందరు పరిపరి విధముల పరివేదనము వొనర్చు చుండిరి. వారిలో నతనితల్లి పోతమ్మకూడ నున్నది.

ఎర్రయను చూచినంతనే పోతమ్మకు సగము ప్రాణము లేచివచ్చినట్లై నది. అంత యార్తిలోగూడ ఇన్నాళ్ళకు తన ఏకపుత్రుడు కనిపించి నంతనే ఆమె విచార వీచికలో చిత్రమగు నానంద వీచిక ప్రసరించినది. ఆవేగముతో ఒక్కపెట్టున 'నాయనా!' అని కేకపెట్టి ఆమె ఎర్రయను కౌగిలించుకొని మూర్చిల్లినది. అది కాంచి తక్కిన ముత్తైదువులకు అర్థముకాక, 'అయ్యో! ఎవరు నాయనా నీవు?' అని బహువిధముల నతనిని ప్రశ్నించుచు చుట్టును మూగిరి. ఎర్రయ వారి కందరకు నమస్కరించుచు' 'ఇది మాఅమ్మ! మాతల్లి, మాదేవత! - మీరందరు నిక్కడికి ఎట్లు వచ్చితిరమ్మా?' అని ప్రశ్నించుచునే తల్లి నా దారిలో సమతలమున నెమ్మదిగా పరుండబెట్టి తన యుత్తరీయముతో విసరుచు పాదము లొత్తుచు నుపచరించుచుండెను. సమీపమున నున్న పడియలో అందులో నొక పెద్ద ముత్తైదువు తన పైటచెరగు ముంచి ఆతడి కొంగుతో పోతమ్మ ముఖమును మెడయు తుడువసాగినది. అదిచూచి మరికొందరు ముత్తైదువులును అట్లే చేసిరి.

పోతమ్మకు తెలివివచ్చు లోపలనే, ఆ ముత్తైదువులు తమలో తాము సంభాషించుకొనుచున్న వాక్యములను బట్టియు తన్ను ప్రశ్నించు ప్రశ్నలను బట్టియు, తా నడిగినవానికి వారిచ్చుచున్న యుత్తరములను బట్టియు, వారి కథ కొంత యస్పష్టముగా ఎర్రయ కవగత మైనది.

యవనస్కంధావారములో వారు వారి భర్తలతో కొంతకాలము బంధి తులై యుండిరి. వారి మగవారిని శిక్షించుటకై యవనభటు లొకనాడు కొంపో యిరి. వారేమైరో స్పష్టముగా తెలియలేదు. కొందరు పారిపోయి రనియు, కొంద రవమానముతో ప్రాణములు వదలిరనియు చూచాయగా వారికి తెలియ వచ్చినది. యవన భటులు ఆ ముత్తైదువుల నందరను తీసికొనివచ్చి దూరమున నరణ్యములో వదలి వెళ్ళిరి. రెండురాత్రులు రెండు పవళ్లు వారు దారి తెన్ను గానక నిద్రాహారాలు లేక ఇప్పటికి చేరికొన్నారు:

పోతమ్మకు తెలివి వచ్చినది. ఎర్రయను మరల ప్రాణములతో చూడ గలిగినందుల కానందపరవశమై ఆతనిగూర్చి ఎన్నెన్నోప్రశ్నలు వేసినది. అత డామెకు ప్రత్యుత్తరము లిచ్చుచునే ఆ స్త్రీ సంఘములోతన భార్య కూడ నున్నదేమో అను నాశతో పరికించుచుండెను. ఉన్నచో నెప్పుడో ఎదుటబడి యుండెడిది అయినను ఆశ వదలక చూచుచుండెను.

తల్లి యాతని యింగితమెరిగినది. ఆమెకు దుఃఖము ముంచుకొని వచ్చి నది. ఆమె యేడ్చుచు నతడు తమ్ము అరణ్యమధ్యములో వదలివెళ్లిన నాటిరాత్రి అతనికై వెదకుచు తామందరు బయలుదేరినదియు, చెంచులు దారి నడ్డగింపగా నందరు చెల్లాచెదరైనదియు, అప్పుడు మహాలక్ష్మియు చిన్నయ్యయు తప్పి పోయినదియు, తాముగూడ నరణ్యములో దారి తప్పి దైవవశమున బంగారు పిచ్చివాడు దారి చూపగా అరణ్యమునుండి బయటపడి యవనుల చేజిక్కినదియు, అక్కడ యవనసేనాని తమ్మందరను శిరశ్ఛేదము చేయింప నాజ్ఞాపించినదియు, అంతలో నా పిచ్చివాడు తనతండ్రి యని గుర్తించి ఆతని కోరికపై యవన నాయకుడు తమ్ము మరణదండన నుండి తప్పించినదియు, పిమ్మట పిచ్చివాడు చెప్పకుండ పారి పోగా అందుకు కారణభూతు డని యనుమానించి సూర్యకవిని పరి పరి విధముల బాధించి తుద కాతని శిక్షించుచు బంధితులైయున్న తక్కిన బ్రాహ్మణులను గూడ శిక్షించుటకై పిలిపించినదియు వివరించినది. సూర్యకవిని తక్కిన బ్రాహ్మణులను ఎట్లు శిక్షించినదియు నామె చెప్పలేకపోయినది. కాని సూర్యకవి ఆతురసన్యాసముతో ప్రాణములతో పారిపోయినట్లు చూచాయగా తెలియుచున్నదని యామె చెప్పినది. తర్వాత యవనభటులు బ్రాహ్మణ స్త్రీల నందరను అరణ్యములో వదలిపోగా తామిట్లు వచ్చుచుంటి మని వివరించి చేతనైనచో ఈ స్త్రీల నందరిని కాపాడుమని యాదేశించెను. సివ్వక్క యవన నాయకున కుపచరించుచు నచ్చటనే ఉండిపోయిన దనియు నతడు తెలిసి కొనెను.

ఎర్రయ మూడహోరాత్రములు నిద్రాహారములు లేక మిగుల కృశించి యుండెను. ఆ స్త్రీలందరు నట్లే రెండుదినము లాహారనిద్రలు లేక కృశించి కదలలేక కదలుచున్న యవస్థ నాతడు గమనించెను.

ఎర్రయ కన్నులు మూసికొని కులదైవ మగు వహోబల నృసింహ స్వామిని భక్తితత్పరుడై ధ్యానించెను. వెంటనే యూహ యొకటి ఆతనికి

స్ఫురించినది. నృసింహదేవుడు క్రొత్తబల మాతనికిచ్చెను. తా నప్పుడు అడ్డము పడి వచ్చిన యరణ్యమధ్యములో విరియబండిన జామచెట్లు సీతాఫలములు చూచినది స్ఫురణకు వచ్చినది. వారి నందర నక్కడనే ఉండుడని చెప్పి యత డా చెట్లకడ కేగి తన యుత్తరీయపు చెరగులో పట్టి నన్ని జామపండ్లు సీతా ఫలములు వారికి తెచ్చిపెట్టి యారగింపుడనెను. తురకలు ముట్టిన యా వస్త్రము లతో వా రా పండ్లారగింప నిచ్చగింపలేదు. సమీపమున నున్న నీటిపడియలో స్నానము లాచరించిరి. ఇంతలో ఎర్రయ మరల మరల పోయి ఫలములు తెచ్చి ప్రోవులు పోసి తానును స్నానముచేసి సంధ్యావందన మాచరించెను.

'నాయనా! నీవు శీఘ్రమే నీ గృహిణిని ప్రాప్తింతువు గాక!' అని యా సువాసిను లందరు నాతని దీవించి, ముందాతని కడుపునిండ ఫలము లార గింప బెట్టి పిమ్మట తా మారగించిరి. ఆ ఫలములు తిని దాహము తీర్చుకొని నంతనే దేహములవశములై వా రందరు విశ్రమించిరి. ఎర్రయయు రెండు గడియలు నిద్రించిలేచి, 'ఈ ముత్తైదువుల నందరను సురక్షిత స్థానమునకు కొంపోవు పెట్లా?' అని యాందోళన పడసాగెను. ఆతడు వచ్చిన దారి ఎరుగడు.

మూడు జాములైనది. ప్రొద్దెక్కువ లేదు. వరాహములు పోయెడి ఆ బాట బహు ప్రమాదకరమైనది. వరాహ నృసింహస్వామిని ఆహోబల నృసింహస్వామిని తా ననుష్ఠించిన మంత్రధ్యాన యుక్తముగా ధ్యానించుచు శరణుచొచ్చెను. దూరమున వరాహతండము వచ్చుచున్న సందడి వినిపించెను. వెంటనే ఎర్రయ యావనిత లందరను ప్రబోధించి, వరాహములు వచ్చుచున్న వని తెలిపి, ప్రక్కల చెట్లమాటునకు వడిగాపంపి, వారి ముందు తా నొకచెట్టు చాటున నాది వరాహస్వామిని ధ్యానించుచు నిల్చెను.

'గౌరి జలత్రోక్కునం బ్రదిలి కుండలి భర్త యెదుంగనూర్ప్వం
దెరలి మహార్ణలోదకము త్రిప్పుకొనం బటురోషతాడనన్
జరిగి యజాండకర్పరము చిల్లులువోవఁగ యజ్ఞపోత్రివై
ధర పదిలంబుగా నిడిన తావకలీలఁ దలంతు మవ్యయా!'

పది వరాహములు తమ పిల్లలతో ఆదారిన వచ్చినవి. వారు కదలి వచ్చిన ప్రదేశమున నవి యాగి సందేహించుచు మూర్కొనుచు ఇటు నటు పారజూచి నవి. వానికి వనితలును ఎర్రయయు దాగికొన్నది కనిపించినది. వెంటనే యవి

భయంకరముగా ఘుర్ఘురధ్వని చేయుచు క్రూరదృష్టులతో వారిపైకి పరుగిడ బోవుచున్నవి.

'ఆది వరాహా! ఈ పెద్దముత్తైదువుల నందరను రక్షించి నన్ను బలి తీసికొమ్ము!' అనుచు ఎర్రయ ముందుకు వచ్చి ఆ వరాహతండమున కెదురై నిలిచెను. ఆతని హృదయములో వరాహమంత్ర మావృత్త మయ్యెను.

అట్లు నీతుడై నిర్భయముగా నిలిచియున్న ఎర్రయను చూచినంతనే దుముకబోవుచున్న వరాహములన్నియు దుముకబోవుచున్నట్లే యుండి స్తంభించిపోయినవి. ఆ వరాహతండమునకు అగ్రేసరమై యున్న వరహారాజము ముందు తీక్ష్ణముగా ఎర్రయ వెనుకనున్న సువాసినీ జనము వంక చూచినది. ఆ చూపులో నొక రాచఠీవి యున్నది. ఎర్రయ కద్భుతమైనది. తాను ధ్యానించిన వరాహమూర్తి ఈ విధముగా తన్ను అనుగ్రహింప నావిర్భవించినాడా? ప్రత్యక్షముగా నున్న ఆ వరాహరాజప్రతీకలో అదివరాహశక్తిని అధ్యస్తము కావించి యాతడు భక్తిపూర్వకముగా ప్రణమిల్లెను.

అహింసాప్రతిష్ఠ కలవారి యెదుట సర్వవైరములు వదలిపోవు నని పతంజలి యోగసూత్రములలో అనుశాసించి యున్నాడు. పరమేశ్వర భావన చేసినచో వరాహమువంటి క్రూరజంతువుకు మాత్రము తాత్కాలికముగా ఈశ్వరావేశము వచ్చుటలో ఆశ్చర్యమేమున్నది? ఏమోగాని, ఆవరాహరాజము ఉత్తరక్షణమున పరమకారుణిక స్వరూపమైనది. అది తన్ననుసరించుచున్న వరాహయూదమువంక తిలకించినది. చిత్రముగా నా వరాహము లన్నియు సాధుస్వరూపములు తాల్చినని ప్రభువుకు నమస్కరించి సెలవు తీసికొను పరిచారకుల వలెనే, అవి యన్నియు ఆ వరాహరాజము కడ సెలవు తీసికొన్నట్లు కనబడి పెడలిపోయినవి.

వరాహరాజ మొక్కటియే ఎర్రయ ఎదుట నిలిచియున్నది. దాని దేహమంతయు తెల్లగానుండి ధగధగ లాడుచున్నది. ముఖమున మాత్రము మధ్య తెల్లని రేఖగల పట్టెవంటి నల్లని మచ్చ యుండి శ్రీమహావిష్ణువు పాదచిహ్నమట్లు ఎర్రయ కది భాసించినది. ఆ శ్వేత వరాహము సమున్నతమును మాంసలము స్థూలతరము నై వెల్ల యేనుగు గున్నను తలపించుచుండెను. దాని రెండు కోరలును శరదాకాశమున దోచు విదియ చంద్రరేఖ శృంగములవలె ప్రకాశించు

చుండెను. ఎర్రయ దేహము పులకించినది. అతడు తన్మయత్వమంది ఆనంద బాష్పములు కార్చుచు నమస్కరించుటలో పంగినవాడు సంగినట్లే నిలిచి పోయెను. ఆ వరాహరాజమును శరీర మంతయు నిక్కపొడిచిన రోమములతో నొప్పుచు మంథరగమనముతో ఎర్రయను సమీపించినది. ఎర్రయ కదలలేదు. పోతమ్మకును భయము కలుగలేదు. తక్కిన సువాసినీ జనులు నద్భుతాశ్చర్య ములతో నోటమాట రాక తిలకించుచుండిరి.

ఆ వరాహరాజము తన ముట్టెను వంగియున్న ఎర్రయ యుదరము క్రిందికి నెమ్మదిగా బోనిచ్చినది. పైకి తిరిగియున్న తనకోర లాతని దేహము నకు బాధ కలుగకుండునట్లు ఆ ముట్టె దూర్చినది ఇప్పుడు దాని రెండుకోర లొకవైపునను రెండుచెవు లొకవైపునను అతనిని పడిపోకుండ పట్టి యుంచగా నది నెమ్మదిగా బయలుదేరినది. భయోద్వేగములతో పోతమ్మయు నట్లు ఎర్ర యను కొంపోవుచున్న వరహారాజమువెంట సాగినది. తక్కిన సువాసినీజన మామె వెంట సాగినది. ఆ భూసురస్త్రీలకు ఎర్రయ నట్లు పదిలముగా గొంపోవు చున్న వరాహమును చూడజూడ, పూర్వము సముద్ర గర్భమునుండి భూమి నుద్ధరించిన శ్వేతవరాహరూపమే స్ఫురించుచుండ వారలకు రోమహర్షము జనించినది.

ఆశ్వేతవరహామూర్తి ధీరగమనముతో నా యరణ్యమధ్యముగుండ దారి చేసికొని పోవుచుండగా, నచ్చటి వన్యమృగము లన్నియు భయభక్తులతో దూరము తొలగి దారి యిచ్చుచుండెను. ఆ వరహారాజమట్లు పోయిపోయి, అర్ధరాత్రివేళకు ఎర్రయను శంకర సంయమీంద్రుల యాశ్రమప్రాంతభూమికి చేర్చి అక్కడ నాగినది. ఎర్రయ యా ప్రదేశమును బాగుగా నెరిగియున్నం దున వెంటనే గుర్తించి నెమ్మదిగా నా వరాహము ముట్టిపైనుండి యవతీర్ణుడై నిలిచి దాని రెండుపాదములను పట్టుకొని నమస్కరించెను అదియు వాత్సల్యాతి శయముతో నాతని శిరస్సు మూర్కొని తన దేహమును ఎర్రయ దేహమంతట నొరయు నట్లు రాచి శాంతముగా నరణ్యము లోని కదృశ్య మైనది.

ఎర్రయకు గాని పోతమ్మకు గాని సువాసినులకు గాని నోట మాటరాలేదు. మౌనముగా ఎర్రయ వారలను శంకరసంయమీంద్రుల యాశ్రమములోనికి దీసికొనిపోయెను. అప్పుడు సరిగా శంకరస్వాములు ఏడవయామమున శివా

ర్చన మొనర్చుచు శతరుద్రీయ మంత్రమును ఘంటానాద పురస్సరముగా శ్రావ్యకంఠముతో పఠించుచు నభిషేక మొనర్చుచుండిరి.

తా మప్పుడు కైలాసమున నుంటిమో వైకుంఠమున నుంటిమో మరి యేలోకమున నుంటిమో కూడ పోతమ్మయు సువాసినులును నిశ్చయింప లేకుండిరి.

మల్లారెడ్డికి భీమరాజు మడ్డు కత్తివలన గలిగిన గాయమేలనోగాని మాను పట్టలేదు. ఆ కత్తిలో నేదో విషముండి యుండవలెనని విస్సనకు సం దేహ మారంభించెను. ఎంత పరీక్షించినను ఆ కత్తిలో విషము కనబడలేదు.

చూడగా మల్లారెడ్డి గాయమంత పెద్దదిగా లేదు. ఏదో రక్తనాళము తెగియుండుటచే విశేషముగా రక్తము స్రవించియుండెను. కాని ఆతని దేహ ములో వలసినంతకంటె నధికముగానే రక్తమున్నది. రక్తస్రావముచే నాత డీస్థితిలోనికి రావలసిన యవసరము లేదు. ఆతనికి జ్వరమును పైకి తీవ్రముగా కనబడదు. కాని అంతరంగములో తీవ్రమగు జ్వరబాధ యున్నట్లున్నది.

మల్లారెడ్డి మైకముగా నుండెను. కాని యాతని ముఖమంతయు మాటి మాటికి ఏదో చెప్పలేని బాధ పడుచున్నట్లు ముడుచుకొనుచుండును. మధ్య మధ్య రెండు చేతులును కలిపి అతడెవరికో దండము పెట్టుచున్నట్లు శిరస్సును చేర్చుచుండును. ఏవోమాటలు కూడ గొణుగుచున్నట్లు తోచును. ఆ మాట లేవో గ్రహించుటకు విస్సన విశ్వప్రయత్నము చేసినను అతనికిది సాధ్యపడ లేదు.

తాను వైద్యము చేయుచున్న రోగిని ఇతర వైద్యు లెవ్వరు చూచుట కనుమతింపనని ఖండితముగా వేమప్రభువుకు చెప్పిన విస్సనయే, రెండవనాటికి రామాప్రెగ్గడను పిలిచి మల్లారెడ్డిని చూచిపోవ నర్థించెను.

రామాప్రెగ్గడ వచ్చి మల్లారెడ్డిని పరీక్షించి అతనికేదో మనస్తాప ముండ వలెనని నిర్ణయించెను. తీవ్రముగా బాహ్యజ్వరము లేకున్నను సంధించిన లక్ష ణము లుండుటచే రోగిని మనస్తాప మేదో బాధించుచున్న దని ఊహించుట కవ

కాశ మున్నమాట నిజమే, కాని కేవల మనస్తాపమువలన నప్పుడున్న దుర్లక్ష ణము లుండుట అసాధారణము మనస్తాపమైనచో ఈ మైకమేమి? మైకమే కాక దేహమట్లు విఁర్ణ మగుచున్నదేమి? ఈ విషయములు విస్సన ప్రస్తావిం పగా, రామాప్రెగ్గడయు ఒప్పుకొని, ఆ గాయముచేసిన కత్తిలో విషమేదైన ఉండి యుండవలె ననెను.

వెంటనే విస్సన తానప్పటికే తెప్పించి పదిలపరచియున్న భీమరాజు మడ్డుక త్తిని రామాప్రెగ్గడకు చూపించెను. రామాప్రెగ్గడ బహువిధముల పసరులు వేసియు దానిని శ్వానాదులపై ప్రయోగించి చూచియు పరీక్షించెను. ఎంత చూచినను దానిలో విషచిహ్నాఁ లు కనిపింపలేదు.

విస్సనయు రామాప్రెగ్గడయు అన్ని విషయములలో నొకే విధముగా నాలోచించిరి. ఒకరి సందేహము లొకరు అనువదించు చుండిరి. వారుభయులు ఏకముఖముగా సంప్రదించి సర్వవిషహరమ లగు నౌషధములు వాడిరి అయి నను లాభము లేకపోయినది.

ఎర్రయ తిరిగి శంకరమఠమునకు చేరుకొన్ననాటి రాత్రి మల్లారెడ్డి ప్రమాదావస్థలో నుండెను. అన్నమ్మ శ్రీశైల మల్లికార్జునుని ధ్యానించుచు నందికంత పోతరాజుకు దణ్ణములు పెట్టుచు మల్లారెడ్డికి ఉపచరించు చుండెను.

ఎర్రయ ఆశ్రమమునకు చేరినఁతనే మల్లారెడ్డి ప్రమాదస్థితిలో నున్నా డని అతనికి తెలిసినది. ఆతని కొక్కమారుగా ప్రాణములు పైన పోయిన ట్లయ్యెను. "అయ్యోఁ నే నాతని ఎంత కఠినముగా మాటాడితిని. అయ్యోఁ నా వాక్కూములు ఆతని నెంత నొప్పించి యుండును-" ఇట్లని పరితపించుచు వడివడి తన మాతృచేవతకును తక్కిన సువాసినులకును తగు వసతి కల్పింప బ్రహ్మచారికి అప్పజెప్పి మల్లారెడ్డి చికిత్స నొందుచున్న ప్రదేశమునకు ఆవెన్నె లలో పరువు పరువునబోయెను.

మల్లారెడ్డి యున్న ప్రదేశము అక్కడికి క్రోశము దూరమున నున్నది. దారిలో 'భీమునికొలను' అను నొక పెద్ద కొఁడవాగు దాటిపోవలెను. పెద్ద వర్షము కురిసినప్పుడు గాని అందులో ప్రవాహముండదు. కాని గ్రీష్మకాల ములోగూడ అందులో జలము ఊరుచు మధ్యమధ్య నీటివడియ లేర్పడును. ఆశ్రమమునుండి చాల లోతుకు దిగి మరల నెంతో మెట్ట యెక్కిగాని మల్లా

రెడ్డి స్థానము చేరికొన వీలులేదు. ఆ ప్రదేశమున వ్యాఘ్రాది హింస్రములు బహుళముగా ప్రచలించుచుండునవి. ఒంటరిగా రాత్రులందు చెంచులుగూడ నటు పోవ వెనుకాడుదురు.

ఎర్రయ కిది యంతయు విదితమే! అయినను ఆతని కెట్టిజంకును కలుగలేదు. ధనుర్ముక్తబాణమువలెనే ఆతడు సరాసరి భీముని కొలను దాటి మల్లారెడ్డి స్కంధావారము చేరుకొనెను.

అన్నమ్మ ఆతని శయ్యాసమీపమున ఎత్తుపీటపై కూర్చుండి తనఅమృత హస్తములతో కుమారుని మేను నిమురుచుండెను. మల్లారెడ్డి ఏదో గొణుగు చుండెను. విస్సనమంత్రియు రామనమంత్రియు రెండు వైపులనుండి మాటి మాటికి వచ్చి నాడి పరీక్షించుచుండిరి. వారి ముఖములలో కలవరము అచ్చు గ్రుద్దినట్లున్నది. కొంచె మావల వేమారెడ్డి ఆందోళనముతో ఏమియు తోచక మంత్రుల వంక చూచుచు ఇటు నటు తిరుగాడుచుండెను. చుట్టుపట్టులను ద్వార సీమను భటుల నిశ్శబ్దముగా ప్రహరలు తిరుగుచుండిరి.

ఎర్రయ సరాసరి మల్లారెడ్డి యొద్దకు పోయెను. అత డందరకు సుపరి చితు డైనందున ఎవ్వరు నెట్టి యాటంకము కలిగింప లేదు.

వాకిట నాతని చూచినంతనే అన్నమ్మ "నాయనా! ఎర్రయతండ్రీ, వచ్చి నావా!' అనుచు లేచి యెదురు వచ్చినది.

ఆ నామము మల్లారెడ్డి చెవులకే వినిపించినదో కాక బాహ్యప్రపంచము మరచియున్న ఆతని యాత్మకే స్ఫురించినదో, మల్లారెడ్డి మైకము వదలి కనులు తెరచెను. అతడు గొణుగుచు మా "ఎర్రయ్యా! ఆదివరాహమూర్తి వలె వచ్చినావా!" అనుచు మహానాగముల వంటి తన రెండు బాహువులు చాచెను. ఎర్రయ అన్నమ్మ లేచిన పీటపై కూలబడి మల్లారెడ్డి శిరస్సు కౌగిలించుచు ఆతని కౌగిటిలో ఇమిడిపోయెను ఎర్రయముఖము మల్లారెడ్డి శిరోభాగమున ప్రసరించెను.

ఈ యావేగములో మల్లారెడ్డికి వ్యాధి విషమించునేమో ఆని విస్సనయు రామయమంత్రియు భయపడుచుండిరి గాని ఎర్రయను వారించుట కెంతమాత్ర మును వారు సాహసింపలేదు. ఎర్రయయు మల్లారెడ్డియు పరస్పరాలింగనముతో ఒక్క పావుగడియ గడిపిరి. ఎర్రయ లేచెను. మల్లారెడ్డి ఎర్రయను ఆపాద

మస్తకము తన కన్నులతో త్రాగుచున్నవానివలె తేరిపార జూచుచుండెను. ఎర్రయ తన చూపులతో మల్లారెడ్డి సర్వావయవములను అమృతాప్లావితము చేయుచుండెను. ఒక గడియగడిచినది.

విస్సన ఆతురముతో సమీపించి మల్లారెడ్డి నాడి పరీక్షించెను. అనందాతిశయముతో ఆతడు కూలబడెను. అది చూచి ఆందోళనముతో రామయమంత్రి నాడి పరీక్షించెను, ఆతనికి నాడి అంత సమముగా నాడుచుండుట చూడ ఆశ్చర్యమైనది ఆతడు వెంటనే అన్నమ్మను వేమారెడ్డిని సంబోధించి, 'ఇక భయము లేదు. వ్యాధి తిరిగినది' అని పలికి దీర్ఘనిశ్వాస మొకటి పుచ్చెను. అన్నమ్మ మల్లారెడ్డి మంచముపై కూర్చుండి ఎర్రయను తన పుత్రునివలెనే వీపుపై చేయివేసి నిమురుచు 'నాయనా! నీకు కోపము వచ్చినదని మల్లయ్య ఎంత పరితపించినాడు! మల్లయ్యపై నీ కెందు కంత కోపము!' అన్నది.

ఎర్రయ కన్నుల నీరు గిర్రున తిరిగెను మల్లయ్యకు సిగ్గయ్యెను.

"అమ్మా! నామాట మరల తప్పినాను. ఇది రెండవమారు, ఎర్రయ్యను ధర్మపత్నితో సముపేతుని చేయకుండగా ఆతనికి ముఖము చూప నంటిని, కాని చూపుచున్నాను. సిగ్గు పడవలసినది నేను!' అని గద్గదస్వరముతో పలికెను.

మల్లారెడ్డీ! నీవు చూపలేదు. నేనే నిన్ను చూచితిని నీ సత్యవాక్కుకు భంగము రాలేదు." అని ఎర్రయ పలుకగా మల్లారెడ్డి ముఖమున గ్రుడ్డివెన్నెల వలె చిరునవ్వు ప్రసరించెను.

"ఇన్నాళ్ళు కనబడ లేదు. ఎక్కడ నుంటివి ఎర్రయ తండ్రీ?" అని అన్నమ్మ అడిగినది.

ఎర్రయ అమ్మా! ఏదో ఆర్తనాదము నన్ను పిలుచుచున్నట్లు భాసింపగా ఇన్నాళ్ళును రాత్రింబవళ్ళు నిద్రాహారములు లేక ఒకేవిధముగా పోతిని తుదకొకమహాపర్వత మడ్డురాగా నిలిచిపోయి దిక్కులు చూచుచుండగా సమీపములో పలువురు స్త్రీజనుల దీనారవము వినవచ్చినది. అటు పోయి చూడగా మాతల్లిగారును పలువురు సువాసినులు ప్రత్యక్షమైరి, వారిని ఆ దుర్గమారణ్యము నుండి ఎట్లు తప్పించుటా యని నేను పాలుపోక విచారించుచుండగా మహావరహ మొకటి నన్ను తన ముట్టెపై మోసికొని వచ్చి మమ్మొద్దరించి శంకర

ఋత మిప్పుడే చేర్చినది. మల్లయ్య ప్రమాదస్థితిలో నున్నాడని తెలిసి యిటు పరువెత్తుకొని వచ్చితిని" అని ఎర్రయ చెప్పెను.

వెంటనే మల్లారెడ్డి ఆశ్చర్యముతో, నీవు రాక ముందు చాలా సేపటి నుండి నా హృదయములో వరాహమూర్తి ఏదో గబగబ అడుగులు వేయుచు కలత పెట్టుచున్నది ఆవేశముతో గుండెలు దడదడలాడినవి. నా దేహము నాకు వశముకాక ఎగురుచు పడుచు నున్నట్లైనది. ఎంత ప్రయత్నించినను నోట మాట పెకలదు. అనిమల్లారెడ్డి వర్ణించెను.

విస్సనయు రామనయు ఒకరి ముఖము లొకరు చూచుకొనుచు తాము గమనించిన నాడీ వైపరీత్యమును గూర్చి చర్చించుకొన సాగిరి.

వేమారెడ్డి కది యేమియు పట్టలేదు. అతని కీ సూక్ష్మము లన్నియు మనస్సున పట్టించుకొనుటకు వ్యవధానము లేదు. ఆతనికి కావలసినది మల్లారెడ్డి వ్యాధి తిరుగుముఖమైన దని తెలియుట యొక్కటే! అది యిప్పుడు తెలిసినది. ఒక నిట్టూర్పు విడిచినాడు. మల్లయను పలుకరించినాడు. అన్నమ్మకు దణ్ణము పెట్టినాడు 'రామయ మంత్రీ! నేను వెళ్ళుచున్నాను. నీపని ఇక్కడ నెప్పుడు తీరిన అప్పుడు వెంటనేవచ్చి నన్ను కలిసికొమ్ము' అని బయలుదేరి పోయెను.

44

వేంగ్యాంధ్రదేశము లోని పరిస్థితులు ఆకస్మికముగా మార జొచ్చినవి. ఆ మధ్య యవనుల విజృంభణము కొంత తగ్గియుండెను. మహమ్మద్ తుగ్లక్ సుల్తాను తన రాజధానిని ఢిల్లీనుండి దేవగిరికి మార్చుట లోనను, కంపిలిని జయించుటలోనను, నిమగ్నుడై యుండెను. అందుచే నాతని దృష్టి ప్రాచీన సముద్రతీరముపై ఎక్కువగా ప్రసరించు నవకాశము లేకపోయినది. అక్కడ యవనులను తీవ్రముగా నెదిరించు బలవంతులు పూర్వము లేకుండిరి. కాని యిప్పుడు ఆప్రదేశమున తిరుగుబాటు లెక్కువగుచున్నవి. ఒకవైపున మోటుపల్లి నుండిత్రిపురాంతకము మీదుగా కళ్యాణ కటకమువరకును, ఇటు పొందుగల్లు వాడపల్లుల మీదుగా ఓరుగల్లు వరకును నిరాటంకముగా వచ్చుచుండెడి

ద్రవ్యముల రాకపోకలు కట్టువడినవి. ముందు సుల్తాను భోజనమునకు కావల సిన సుగంధద్రవ్యముల రాక తగ్గిపోసాగినది.దానితో నాతడు దినదినము అనుచ రులపై కినియ నారంభించెను. అంతలో నతనికి పారసీకమునుండియు అరబ్బీ దేశమునుండియు వచ్చు చుండిన అశ్వముల రాక కూడ కట్టునడినది. పశ్చిమ తీరమున నున్న పెద్దరేవు లేవియు నాతని స్వాధీనములో లేవు. ఆ యశ్వములు ప్రధానముగా మోటుపల్లి రేవునుండి యే వచ్చుచుండెడివి. వాని రాక కట్టువడుటచే సుల్తాను క్రోధోగ్రు డయ్యెను. వెంటనే ఆతడు తన వజీరుగా నున్న మోటుపల్లి దుర్గనాయకుని తొలగించి, సమర్థుడగు నిం కొకని నియమింపఁదలసిన దని నాయబ్ మెలిక్‌నబీకి ఫర్మానా పంపియుండెను. అందువల్లనే ఆస్థానములో నాతడు అల్లా వదీనును నియమించి యుండెను.

అల్లావదీను దుర్గాధిపత్య పదవి స్వీకరించిన వెంటనే అక్కడి అసహాయ స్థితి వివరముగా నివేదించుకొని సుల్తాను సాయ మర్థించెను.

"దేశము దరిద్ర మైపోయినది. పంటలు పండించు కర్షకులు లేరు. ధన మిచ్చినను భటులు వచ్చి సేనలో చేరుటలేదు. ఏలనో కాని సముద్రముపై నుండి నిరంతరము రాకపోకలు చేయునౌకలు కట్టు వడినవి. సముద్రముపై నేదో ఉపద్రవము వచ్చియుండ వలెను. మహాసేనను ఆయుధములను, ఆహార పదార్థములను, విస్తారముగా పంపిననే గాని ఈ దుర్గములో నిలుచుట సాధ్యము కాదు. పశ్చిమమున పర్వతారణ్యములలో కొన్ని మూకలు మాపై నెత్తివచ్చు టకు సాహసించుచున్నవని మాకు వార్తలు వచ్చుచున్నవి. ఇక్కడ నున్న సామగ్రితో దుర్గమును సంరక్షించుట కష్టతరము. సుల్తాను వారు సాయము పంపనిచో వారి యధీనమునుండి దుర్గము తప్పిపోకుండ మా ప్రాణము లున్నంత వరకు పోరాడగలము."

ఈ సారాంశము గల మోటుపల్లి దుర్గాదీశుని లేఖ చదివి సుల్తాను మండి పడెను. మూడుదినముల పాటు ఆతడు విలాసము లన్నియు త్యజించెను. ఆ మూడుదినములు నాతడు తీవ్రముగా నాలోచింప సాగెను. మహాసేనలు కృష్ణా నదికి దక్షిణమున గలభూములకు తరలించి మోటుపల్లివరకు గల ప్రజల నందర నొక్కసారి భయభ్రాంతుల నొనర్ప నాతడు నిశ్చయించెను. అక్కడ నెవరైన మెత్తని మనస్సులు గలవారు తన సరదారుల లో గలరేమో అని విచారణ మొన ర్చెను. మోటుపల్లి దుర్గ మూతన దుర్గాధిపతి యగు ఆలావదీన్ కఠినుడనియు

ఎట్టి క్రూరకార్యములకును జంక డనియు నాతనికి తెలియవచ్చినది. అట్లే త్రిపురాంతక ప్రాంతములో నున్న బడేసాహెబ్ కూడ నట్టివాడే అని తెలిసినది. అతనిని మోటుపల్లికి అలావదీనునకు ప్రధానసహాయుడుగా నుండునట్లు పంపు మని మెలిక్‌నబీకి ఉత్తరువులు ప్రవర్తింప జేసెను. తన సేనానాయకులలో నెల్ల కఠోరస్వభావుడును, అప్పుడు ఓరుగల్లు రాజ్యమును తన మల్లికుగా పాలించు చున్నవాడగు మెలిక్‌నబీయే తాను తలపెట్టిన కృష్ణా దక్షిణతీరయాత్రకు తగినవా డని నిశ్చయించెను. అతనిని వెంటనే ఓరుగల్లు నుండి వాడపల్లి, పొందుగల్లుల మీదుగా మోటుపల్లిసరకు మహాసేనతో దేశ మంతయు కొల్లగొట్టుచు దండ యాత్ర సాగింపవలసిన దనియు, మోటుపల్లికి పుష్కలముగా నాహారపదార్థ ములు చేర్చవలసిన దనియు ఆజ్ఞాపించెను.

మెలిక్‌నబీ పేరు మార్చుకున్నను ఆతని వెనుకటి కట్టు నామమే వాడుకలో నండెను. కట్టు స్వయముగా క్రూరుడు. అతనికి సుల్తాను క్రూర తర మగు ఆజ్ఞ లిచ్చి పంపియుండెను అతడు గొప్ప సేనతో మహామారి వలెనే దండు కుపక్రమించెను.

అతడు పూర్వము ప్రతాపరుద్రదేవుని సేనానులలో నొకడై యుండుటచే గొప్పకార్య మేది తలపెట్టినను, ముందు విఘ్నేశ్వరపూజ చేయుట అవసర మని తెలిసియుండెను. ఇప్పు డాతడు ఇస్లాము మతము స్వీకరించి యుండుటచే విఘ్నేశ్వరపూజ చేయుట గిట్టదు. కాని అప్రయత్నముగా ఆ సంప్రదాయమును మరియొక విధముగా నిర్వర్తింపవలె నని మనస్సుకు స్ఫురించి. 'ఈ యాత్ర దేనితో ప్రారంభించుట?' అని ఒక రాత్రి యంతయు తీవ్రముగా నాలోచించెను.

తుద కది స్ఫురించినది. తెల్లవారినంతనే నగరములో సందు గొందు లలో దాగియుండిన వేదవిదులగు బ్రాహ్మణులను నూర్వుర నాతడు బలవంత ముగా తెప్పించెను ప్రతాపరుద్ర మహారాజు పట్టువడిన ప్రదేశమునకు వారి నందరను తీసికొనిపోయెను. అక్కడికి సేన లన్నిటిని రావించి అందరి సమ క్షమున ఆ బ్రాహ్మణుల నందర నరకించి వారి మాంసము కాకులకు గ్రద్దలకు వేయించెను. ఈ విధముగా విఘ్నేశ్వరపూజయే కాక తాను పూర్వ మెరిగి యున్న రాణముకుడుపు కూడ జరిగిన దని తృప్తిపడి యుండును.

భయంకర మగు నీ బ్రాహ్మణవధ చూచిన ఆతని సైనికులలో అంత వరకు ఇస్లాము మతము స్వీకరింప కుండినవారు ఇప్పుడు పలువురు మత స్వీకార మొనర్చిరి. మిగిలినవారు నోటమాట రాక నిస్తబ్ధులైరి.

ఈ విధముగా కట్టూనాయకుడు తనయాత్రకు నాంది నిర్వర్తించి బయలు దేరెను. దారి పొడుగునను ఎక్కడ నేమాత్రము చిరాకు కలిగినను సమీపమున గల గ్రామములను భస్మము చేయించుచు ఆబాల గోపాలమును నరకివేయించుచు నాతడు దండు సాగించెను. మహామారి ప్రసరించినట్లే ఆతడు సాగి కృష్ణాతీరమున వాడపల్లి రేవు చేరికొనెను. వాడపల్లియొద్ద కృష్ణానదిలో మూసి నది కలియుచున్నది. అక్కడ నొక కోటయు గలదు. కృష్ణకాఁల దక్షిణ తీరమున పొందుగల్లు అను గ్రామము కలదు.

వాడపల్లి చేరి నంతనే అతడు అక్కడికి ఇరువైపుల యోజనము మేరలో నున్న తరుల నన్నిటిని తన సేనాతరణమునకై బలవంతముగా సేకరింప తనభటుల కాజ్ఞాపించెను. తమ తమ నావలపై యానముల కేగిన నావికుల నందరిని తిరిగి రప్పించుటకై అక్కడి పల్లెపాలెములలోని పల్లెప్రజల నందరిని రావించి, స్త్రీలను, వృద్ధులను పాపలను గూడ ఆతడు పలు హింసల పాలు చేసెను. కట్టూ పేరు చెప్పిన నందరును భయభ్రాంతులై గడగడ లాడి పోవలె నని ఆతని యుద్దేశ్యము, ఆతని సంకల్పము సిద్ధించినది.

ఈ కఠినప్రవర్తనమువలన యవనవాహినిని కృష్ణానదిని తరింపజేయుటకు అక్కడనున్న నావలు చాలభాగము లభించినవి. అయినను ఆ నావికులకు మును పెన్నడును రాని నూతనభావ మొకటి చిత్రముగా నుప్పతిల్లుచుండెను. వారి నావలు వారికి దేవతాస్వరూపములు, వారి యిలువేల్పులు, వారి సర్వస్వములు ! వారి ఆత్మలే అవి ! వారి కాత్మహత్య చేసికొనవలె నని కోరిక కలిగినది. తమపడవలే మునిగిపోయిన బాగుండు ననుకోరిక వారి కుదయించినది.

అట్లు వారి పడవలపై వారికి విరక్తి గలుగుట కిప్పుడు ప్రత్యేకహేతువున్నది. నావికులకు వారి పడవలు శ్రీ వెంకటేశ్వరస్వరూపములు. శ్రీ వెంకటేశ్వరునకు మ్రొక్కుకొని గాని వారు పడవ లెక్కరు. అపవిత్ర మగు పాదరక్షలతో తమ నావలపై ఎవ రెక్కినను వారు సహింపరు. ఈ యవనులు పాదరక్షలు తొడిగికొనియే పడవ లెక్కుచుండిరి, అట్లు చేయ వద్దని పల్లెకారులెంత చెప్పినను వారు వినిపించుకొనుట లేదు. అందుచే తమ పడవలు మైల పడిపోయిన వని వారికి నిశ్చయభావము గలుగుచున్నది. అందుచే నవి నదీస్నానమో సముద్రస్నానమో తలార చేసిన గాని మరల శుచి కా వని వారికి తోచుచున్నది.

కొన్ని పడవల పై సరకు లావలకు చేర్చుచుండిరి. మరి కొన్నిటి పై భటులను చేర్పించుచుండిరి. కాని వారిలో పెద్ద నౌకలను ప్రత్యేకించి కృష్ణా ప్రవాహము దిగువకు పంపి యెక్కడకో సముద్రయానము కూడ చేయించుట కుంకించుచుండి రని పల్లెకారులు తెలిసికొనిరి.

ఆ పల్లెజనులు సముద్రములో గాని, నదిలో గాని ఎట్టి కష్టము లెదు రొక్కన్నను స్థైర్యముతో నిలిచి ప్రతిఘటింపగల మహా సాహసికులే. అయినను వారు నిరాయుధు లగుటచే, సర్వాయుధ సంపన్నులగు యవన మహాసేనలోని భటులను ఎదిరించుటకు వారికి సాహసము లేకున్నది. అందువలన తమ హృదయములలో మాటిమాటికి పొంగి వచ్చుచున్న కోపమును అడచుకొని దిగ మ్రింగుకొనుచు, సమయమునకై నిరీక్షించుచు యవనభటులతో కడు వినీతులై ప్రవర్తించుచుండిరి. వారి యనువర్తనచే కట్టూ నాయకున కేమాత్రము కోపము వచ్చుటకును అవకాశము లేకుండెను.

45

శ్రీశైలారణ్యము లోని చెంచుల యలజడిని కాఠిన్య మొకవంకను కృప మరియొకవంకను చూపుచు వేమారెడ్డి యడచివేసెను. చెంచులలో ప్రతి ఘటించినవారు నిష్కారణముగా వధింపబడిరి. వినీతులై స్నేహభావము ప్రద ర్శించిన వారల నందరిని ఆదరాతిశయముతో నతడు గౌరవించెను. వెనుకటి చిన్న దొరయగు తోకరాజే ఇప్పుడు చెంచుమల చెంచుల కందరకు పెద్దదొర యాయెను. చెంచుమల ప్రభుత్వముతో పాటు పాతాళగంగ సమీపమున గల చెంచుగూడెము ఆతని నివాసస్థాన మయ్యెను. వెనుకటి పెద్దదొర భార్యలందరు తోకరాజు కిప్పుడు భార్యలై అతని మొదటిభార్యకు చెలికత్తె లైరి. తోకరాజు తమ్ముడు సుగ్రీవు డిప్పుడు చెంచుల చిన్నదొర పదవి నధిష్టించెను. చెంచు లందరు శాంతించి వేమారెడ్డికి ఆశ్రితులైరి.

వేమారెడ్డి యిప్పుడు పెద్దసేనను సమకూర్చుచుండెను. ఎక్కడెక్కడి నుండియో వీరపురుషు లెందరెందరో ఆతని సేనలో చేరుటకు మూగుచుండిరి. దేసటిరెడ్డి వారి కందరకు యుద్ధపరిశ్రమ నేర్పుట కేర్పాట్లు చేయించెను. సాము

గరిడీలు ఎన్నియో వెలసినవి. ఎందరో చేచులు ముఖ్యముగా ధానుష్కులుగా నా సేనలో చేరుచుండిరి.

స్వస్థుడైన పిమ్మట మల్లారెడ్డి యొకనాడు వేమారెడ్డిని దర్శింపబోయెను వారిద్దరు గాక అప్పు డక్కడ అన్నారెడ్డి మాత్రమే యుండెను. అన్నారెడ్డి మల్లారెడ్డికంటె పెద్ద స్వస్థుడైన మల్లారెడ్డిని చూచి సంతోషించి వేమారెడ్డి యిట్లనెను.

'తమ్ముడా, నీవు స్వస్థుడ వగుటచే నాకు సగము భారము తీరినట్లున్నది. దైవవశమున నానాటికి మనపై భారమెక్కువగా పడుచున్నది. మన బాహుబలమునే గాక మన హృదయబలము కూడ పరీక్షించుట దైవసంకల్పమని తోచుచున్నది. ధర్మ మం దాస్థ యున్నంతవరకు మనల పరీక్షించుచున్న దైవమే తప్పక మన కనుకూలించును. మోటుపల్లిని పట్టుకొనుటకు వెంటనే ఒకరు పోవలసియున్నది. మోటుపల్లి పట్టుకొనుటకు భూమిమీదనే కాక సముద్రముమీద కూడ యుద్ధము సాగింపవలసి యుండును. నీ విప్పుడందుకు సిద్ధముగా నున్నావా? లేక మన అన్నయ్యను నియోగింతనా?'

అన్నారెడ్డి వెళ్లిపోయి అన్నవంక జూచుచుండ మల్లారెడ్డి నిశ్చలుడై యన్నకు దండమువెట్టి, 'నే నందులకు నీ యనుజ్ఞగొని బయలుదేరుటకే నీ దర్శనమునకు వచ్చితిని!' అనెను.

వేమారెడ్డి తన చెవులు తాను నమ్మలేకపోయెను.

'నిజమేనా, మల్లా?'

'అన్నా, నే నబద్ధమాడి యెరుగుదునా? అందులో నీయొద్దనా?'

జలానుభవము లేనందున వేమారెడ్డికి దిగులు పుట్టినది. అజ్ఞాత విషయమగుటచే సముద్రయుద్ధ మాపదల మయముగా నతనికి తోచినది. చేతులార తన చిన్నతమ్ముని ఈ రూపముగా సముద్రుని కప్పగించుచున్నానా, యని భయమాతనికి కలిగినది. వేమారెడ్డి జంకు గమనించి మల్లారెడ్డి యిట్లనెను. 'అన్నా, నీవు భయపడకుము. నా ప్రాణము లుండగా కార్యభంగము కానీను!'

వేమారెడ్డి కన్నులు చెమరించినవి. అట్టి దౌర్బల్యము ప్రదర్శించుట కలవాటు లేని యాతడు మల్లారెడ్డిని బిగ్గ కౌగిలించుకొని, 'దీర్ఘాయుష్మంతుడవై కార్యసాధన చేసికొని రావోయి, తమ్ముడా!' అని దీవించుచు దండయాత్రకు

తాను చేసిన ప్రయత్నము లన్నియు వివరించెను. మల్లారెడ్డియు తాను రత్త గేహివలన నభ్యసించిన దంతయు నన్నలకు నివేదించెను. ఆ పిమ్మట నతడు అన్నలకు నమస్కరించి సెలవు తీసికొని తన స్కంధావారమునకు బయలు దేరెను.

అవచిదేవయ వచ్చి వెళ్ళినప్పటినుండియు మహాసముద్రుడు తన హోరుతో తన్ను పిలుచుచున్నట్లు మల్లారెడ్డికి తోచుచుండెను. నందికంత పోత రాజు గుండ్లకమ్మమీదుగా నడిచిపోయి సముద్రముపై సంచారము చేయుచు మధ్యమధ్య కృష్ణవేణి నదిపై ప్రత్యక్ష మగుచున్నాడు.

ఇన్ని నెలలనుండియు కార్యాంతరములలో నిమగ్నులై యుండియు ఆతడును విస్పనయు ప్రధానముగా ఈ సముద్రము విషయములే ఆలోచించు చుండిరి. గోదావరీ ముఖద్వారమునుండి కావేరీ ముఖద్వారము వరకును నున్న సముద్రతీరమును గూర్చిన విశేషములు వారు అవచిదేవయ యొసంగిన పటాదులను బట్టి యవగాహన మొనర్చుకొనుటకు విశ్వప్రయత్నము లొనర్చు చుండిరి. అంతేకాదు. ఆవల దేశములగూర్చియు ద్వీపముల సంగతులును, ఋతుపవన విశేషములును. నౌకలు రాకపోకలు చేయు మార్గములు, వివిధ నౌకల నిర్మాణములు, వాని స్వరూపస్వభావ ప్రయోజనములు బలాబలములు, సముద్రము స్వభావము. దాని కోపకటాక్షములు, ఆటుపోటులు. తుపానులు, సముద్ర యాత్రికులకు వచ్చెడివ్యాధులు, వాని చికిత్స. సముద్రయానములలో తటస్థపడెడి దొంగలు దొరలను గూర్చియు నావికుల శక్తిసామర్థ్యములు, విశ్వాసములు, గుణదోషములు- ఇత్యాది విషయములెన్నో తెలిసికొనుటకు వారు సర్వాత్మనా యత్నించుచుండిరి. బాలురకు క్రొత్త ప్రమాణములవలెనే ఈ సముద్రయానపు చదువు వారికి అనిర్వచనీయ మగు ఉబలాటము కలిగించు చున్నది. యాత్ర యారంభించుట ఎప్పుడెప్పుడా యని వా రువ్విళ్ళూరుచుండిరి.

ఎత్తైన దిండుపై బోర్లపండుకొని కాలుచేతు లాడించుట అభ్యసించి ఈత నేర్వవచ్చును. నీటిలో చేయుకదిలికలే యిప్పు డాకాశములో చేయుదురు. రొమ్ముక్రింద దిండ్లే నీటికి బదులుగా నాధారముగా నుండెను. అట్లయినను దిండ్ల యాధారము వదలి నిజముగా నీటిలో పడినప్పుడు ఎంతోమార్పు కని పించును. చేతులు స్తంభించును, కాళ్లాడవు. ఆకాశములో సుఖముగా అల్లల

నాడిన బాహువులు నీటిలోని యడ్డును ఎదుర్కొన లేవు. శీఘ్రముగా నలుపు వచ్చును.

అట్లే పత్రాదులమీద ఎన్ని విషయములు తెలిసికొన్నను ప్రత్యక్షానుభవము లేనివారికి ఎన్నోచిక్కులు వచ్చునని వా రెరుగుదురు. మధ్యమధ్య వారు రక్తగేహిని కమలనాభుని జ్వరాతురులవలె ఎన్నెన్నియో సందేహము లడిగి తీర్చుకొనుచుండిరి. అయినను వారు ప్రత్యక్షానుభవము సంపాదించుటకొరకై తహ తహ లాడు చుండిరి.

శుభముహూర్తమున మల్లారెడ్డి నందికంత పోతరాజుకు దండముపెట్టి తల్లిదీవన పొంది శంకర యతీంద్రులయు వేదవిప్రులయు నాశీర్వచనము గ్రహించి మోటుపల్లి యాత్రకు సపరివారముగా బయలుదేరెను. వారికొరకై ధరణికోట యొద్ద నౌకలు సిద్ధముగా నుండెను.

46

చెంచులక్ష్మి యే మైనది? మల్లారెడ్డి సందేహించెనే గాని, ఆమెను చెంచులు స్వయముగా మనస్ఫూర్తిగా వదలుకొనుటకు ఎట్టి సందర్భము లందును ఇయ్యకొని యుండరు.

బడేసాహబు తన్ను చెంచులు మోసగించినది మరువ లేదు. ఆతనిపై ఉన్నతాధికారులకు విశ్వాస మున్నది. కనుక సరిపోయెను గాని, లేకున్నఅతడు చేసిన దానికి కఠినశిక్షకు పాత్రుడై యుండెడివాడే! ఇప్పటికైనను పై అధికారులకు తనపై పూర్వపు విశ్వాస మున్నదని యతనికి నమ్మకము లేదు. అది ఆతనిని బాధించుచున్నది. ఎట్లయినను చెంచులపై ప్రతిక్రియ చేయవలె ననుపట్టుదల అతిశయించినది. తన అనుచరులను అట్టి అవకాశమునకై గూడెము లన్నిటి మీదను కాపు కాయించుచుండెను.

చిన్నదొరకు పెద్దదొరకు లాభము పంచుకొనుటలో తగవు వచ్చిన దని అతనికి తెలిసినది. చిన్నదొరను ఎట్లయినను తన వలలో వేసికొనుటకు ఆతడు ప్రయత్నములు సాగించెను. చిన్నదొర మాత్రము నమ్మలేక ఆతని అనుచరులు చేయుచున్న స్నేహప్రయత్నము లన్నియు తన్ను శిక్షించుటకే అని భావించి దూరదూరముగా నుండసాగెను.

అయినను ఆ అనుచరుల ప్రయత్నములు పూర్తిగా నిష్ఫలములు కాలేదు. శంకరస్వాములు చెంచులక్ష్మికి పంపిన శ్రీముఖము చిన్నదొర తన శిరోభూషణములో నెమలి యీకల చాటున పొదివి తీసికొని పోవుచు జాగ్రత్తకొరకు మరల మరల దానిపై చేతులు పెట్టి తడవి చూచుకొనుచు పోవుచుండుట సాహబు అనుచరులు గమనించిరి. అత డేదో రహస్యపత్రమును తీసికొని పోవుచున్నా డని వారు ఊహించి ఆ నాడు ఆతనితో వారు బహువిధముల చెలిమి చేసిరి. ఆతని కడుపునిండ తాము తెచ్చిన మధురపానీయములు త్రావించిరి. ఆతడు ఒడలు తెలియని మైకములో నుండగా ఆ పత్రమును హరించి బడేసాహబుకు అందజేసిరి.

బడేసాహబు ఆ పత్రమును చూచి నంతనే ఆనందపరవశు డయ్యెను. దానితో చెంచులక్ష్మిని అపహరించి చెంచులపై తనకసి తీర్చుకొన వచ్చునని ఆలోచించెను. అయినను ఆ పత్ర మామెకు చేర్చుట అంత సులభసాధ్యము గాదు. చెంచులక్ష్మిని చెంచులు బంధించి యుండలేదు. అయినను వారామెను భక్తితో ఎన్నడు విడుచుట లేదు. ఆ భక్తుల కనుమరగి ఆమెను తెచ్చుటెట్లు? ఆతడు తీవ్రముగా నాలోచించి చెంచుల వేషముల తోడనే తన అనుచరుల నామె వద్దకు ఆ పత్రము తో పంపెను. వారు చెప్పిన ప్రకారము తనకు శంకరగురువుల దర్శనము లభించునను ఆశతో నామె అర్ధరాత్రివేళ వారివెంట బయలు దేరినది. గురువుల ఆశ్రమమునకు గాక యవనులస్కంధావారమునకు వచ్చుట ఆమెకు విభ్రాంతి గలిగించెను.

బడేసాహబులో ఎన్ని లోపము లున్నను ఆతడు ఇంతవరకును కామినీ విముఖుడు. చెంచురాణి తన స్కంధావారమునకు వచ్చిన దని తెలిసినంతనే ఆమె యెట్లుండునో చూడవలె ననుకొరిక ఆతనికి గలిగినది. చెంచురాణి వింత అడవిమనిషి వలె ఉండునని ఆతని ఊహ. ఆ వింత చూచుటకు ఆమె యున్నచోటి కాతడు పోయెను.

చెంచులక్ష్మిని చూచినంతనే ఆతడు వెరగుపడెను. అతని దేహ మొక్కసారిగా విద్యుత్తాడిత మైనట్లయినది. ఆతని వెంటనున్న అనుచరులిద్దరు అది గమనించి సంతోషముతో ఒకరిమొగ మొకరు చూచుకొనుచు నవ్వుకొనజొచ్చిరి. వారిలో నొకడు దేసటిరెడ్డి చేతులలో సైంధవుని పాటు వడినవాడు పేరు

గులాము. అత డిప్పటికి స్వస్థుడై హిందువులపై మరింత ద్వేషము పెంచు కొని యుండెను.

సాహబు తెప్పరిల్లుకొని చెంచురాణి వంక మరియొక మారు చూచెను. ఆతనికి ఒడలు పరవశమయ్యెను. మునుపెన్నడు ఎరుగని మనోవికారమున కాత డిపుడు లొంగిపోయెను. ఆతనికి మహాప్రవాహ మధ్యమున కొట్టుకొని పోవుచున్నట్లయ్యెను. నదీ మధ్యమునకు ప్రవాహవేగము ఆకర్షించునట్లే. మహా వరము సమీపించిన వారిని తన మధ్యభాగమునకు లాగునట్లే, ఇప్పుడాతడు అవశుడై చెంచురాణి వంకకు ఆకృష్టుడగు చుండెను. అది భక్తియో, గౌర వమో, ప్రేమయో, అతనికి అవగతము కాలేదు. ఆతనికి జనానా ఏమియు లేదు. సూర్యకవియు, పోతమ్మయు, స్కంధావారము నుండి విడివడిన దాది పంటరెడ్డి తల్లి సివ్వక్క బడేసాహబుకు తల్లి వలె ఉపచరించుచున్నది.

ఆ సమయమున సివ్వక్క అక్కడికి వచ్చినది. మహాలక్ష్మిని అక్కడ చూడగనే సివ్వక్క నివ్వెఱపడినది. ఉత్తరక్షణమున ఆమె తెప్పరిల్లుకొని "ఇక్కడి కెట్లు వచ్చినావమ్మా! నీవు?" అని ప్రశ్నించినది.

బెదరిపోయిన మృగాంగన వలె నంతవరకు నున్న మహాలక్ష్మి ఆ మాటలు విని గుర్తించి ప్రాణములు లేచివచ్చినట్లై 'అమ్మా' యని ఆమెను కౌగిలించుకొనెను.

సివ్వక్క మహాలక్ష్మిని చిన్నపిల్లను వలె తల నిమురుచు గడ్డము క్రింద చేయివెట్టి, 'తల్లీ! ఇక్కడ నెందుకమ్మా, మగవారి మధ్య? లోపలికి పెళ్లు దము రా!" అని ఆదరముతో లోపలికి తీసికొని పోయెను.

బడేసాహబు మాటలాడ లేకపోయెను. ఆతని అనుచరులును నిర్వాక్కై రి. ఈమధ్య సివ్వక్కకు బడేసాహబుపై తల్లికి కొడుకుపై నుండు ప్రేమతో గూడిన అధికారమువంటి అధికారము కలిగినందున ఆత డేమియు మాటాడక వెడలిపోయెను.

లోపలికి పోగానే సివ్వక్క యెక్కువ మాటాడక మహాలక్ష్మిని స్నానాది కములు చేయుమని భోజనమునకు కావలసిన యేర్పాట్లు చేసి ఆమె వేరుగా వండుకొనుటకు సర్వసిద్ధము చేసెను. మహాలక్ష్మికి వంట చేసికొనుట కెంత

మాత్రము బుద్ధి పుట్ట లేదు. ఆమెకు గుండెలలో నుండి ఒకటే విధముగా దడ పుట్టుకొని రా సాగినది. సివ్వక్క ఆమెను ఆదలలేదు. అత్తగారు కోడలిని అదుపు పెట్టినట్లుగనే మహాలక్ష్మిని స్నానము చేసి వంట చేసికొను నట్లు చేసి నది. కన్నీరు గార్చుచునే ఏదో బలవంతముగా మహాలక్ష్మి భుజించినది.

మహాలక్ష్మి భోజనము చేసి యావలకు వచ్చిన దాది సివ్వక్క నో రూర కొన లేదు. ఆ నాటి రాత్రి అందరును చెదరిపోయిన దాది ఇంతవరకు జరిగిన దంతయు వివరించినది. ఈమధ్యనే ఇక్కడ యవనుల చేతిలో సూర్యకవియు స్రోతమ్మయు ఎట్టి పాటువడి విడివడిరో వివరించినది. గాని, వారేమైరో తెలియ నందుకు వలవలయేడ్చినది.

"అమ్మా! ఎర్రయతండ్రి సంగతి యేమియు తెలియ లేదమ్మా! ఆ పడిచచ్చిన మా పెద్దవాడు అతనిని ఏ గోతిలో దింపినాడో నమ్మా! నా చిన్న కొడుకు సంగతి ఏమియు తెలియలేదమ్మా! అయ్యో!!-" ఇట్లనుచు మరల నింకొక మారు బావురు మని యేడ్చినది.

వెంటనే మహాలక్ష్మి సివ్వక్క నోదార్చి చిన్నవాడు ఇన్నాళ్ళును తన యొద్దనే క్షేమముగా నున్నా డని, తన్ను చెంచులు తీసికొని పోయి చెంచు లక్ష్మిగా పూజించిన కథ యంతయు వివరించెను. "నన్ను చెంచులు తీసికొని వెళ్ళిన మూడవనాడే చిన్నయ్యను కాటనిని కూడ చెంచులే నా యొద్ద కుపచా రములకుతెచ్చి నియమించినారు. వాడు తోడుగా నుండుట చేతనే యిన్నాళ్లు నక్కడనింతమాత్రముగా నైనను ఉండగలిగితిని. చిన్నయ్య మా గోమాతను కోడెను కూడ తెచ్చినాడు" అనెను.

మరల సివ్వక్క ఏడుపు ప్రారంభించినది. "మరి మా చిన్నతండ్రి నీతో రాలే దేమమ్మా? ఆ చెంచు చచ్చినవాళ్ళ చేతుల్లో ఏమైనాడో గదమ్మా! ఇంతకు కారణము మా పెద్దచచ్చినవాడే నమ్మా!- వా డెక్కడ చచ్చాడో కూడా తెలియలేదే!"-

మహాలక్ష్మి తిట్టకమ్మా! అని ఆమె తిట్లు వారింప జొచ్చెను.

"తిట్టకేమిటి?- వాడే గదా నా అవస్థల కన్నిటికిని కారకుడు - తల్లీ! మా చిన్నయ్య ఎట్లా ఉన్నాడమ్మా నీతో?"

"మీ చిన్న వాడు చాల సంతోషముగా నాతో కబురులు చెప్పుచు నెంతో సరదాగా నుండెడివా డమ్మా ! వాడు పాతాళగంగలో ఈదులాడుచు, లింగాల గట్టులో రత్నాల వలె మెరిసే రాళ్ళు ఏరి తెచ్చే వాడు. ఇవి లింగమూర్తులు, ఆడుకోరాదు, మళ్ళీ కృష్ణలో వేసిరా, అని చెప్పినా వినే వాడు కాదు. అడవిలో తాను కూడ ఒక చెంచు వలెనే స్వేచ్ఛగా తిరిగి తిరిగి వేటాడి వచ్చే వాడు. అతని వెంటనే కాటవిడువక నమ్మకముగా ఉండి ఎన్నెన్ని మారులో అతని నపాయములోనుండి కాపాడినది. నేను వాని యందు చూపుచున్న ఆదరము చూచి చెంచులు కూడ అతని నెంతో ఆదరించే వారు. నే నిక్కడికి వచ్చేవరకు వాడు క్షేమము గానే ఉన్నాడు - గుర్రువెట్టి హాయిగా నిద్ర పోవుచుండెను."-

"అయ్యో ! తరువాత వాణ్ణి చెంచులు చంపినా రేమో నమ్మా ! మా నాయనను - అయ్యో ! - అయ్యో ! -" బిగ్గరగా ఏడ్వసాగినది.

ఆ యేడుపు విని బడేసాహబు అక్కడికివచ్చెను మహాలక్ష్మికి ప్రాణము పోయినట్లైనది. సాహబు చూపు ఆమె అంతరాంతరములను కోసివేయు చున్నట్లున్నది. అది గమనించి వెంటనే సివ్వక్క అందుకొన్నది.

"నీ వెందుకయ్యా; ఇక్కడికి వస్తావు? అవతలకు పో!". చిత్రముగా బడేసాహబు ఆమె ఆజ్ఞకు లోబడి తడబడుచు ఆవలకు వెళ్ళిపోయెను.

ఆత డావలికి వెళ్ళిన అరగడియ వరకు మహాలక్ష్మికి నోటమాట రాలేదు. అప్పుడు నిట్టూర్పు విడిచినది.

"సివ్వక్కత్తా! నే నిక్కడ బ్రదుకలేనమ్మా! ఆ చెంచులు ఎటువంటి వారైనా నన్ను దేవతను వలె నెత్తిన పెట్టుకొన్నారు- నా కేదో నుయ్యో గొయ్యో నీవే చూపించవమ్మా!"

సివ్వక్క ఓదార్చినది. "నీవేమీ భయపడవద్దు. వానిని మళ్ళీ నీ వైపుకు రాకుండా చేసే భారం నాది. ధైర్యంగా ఉండు!"—

మహాలక్ష్మి ధైర్యము చిక్కబట్టుకొని చెంచులగూడెములో జరిగిన విష యములు వివరించుచున్నది, "చిన్నయ్య కేమీ భయములేదు. వాడుకూడా ఒక చెంచుగానే ఉన్నాడు. నీవుకూడా గుర్తు పట్టగలవో లేదో! వానివెంట వచ్చిన కుక్క ఎంతో పాతదానివలె వానిని విడువదు."

ఆ కుక్క సంగతి వినగా వినగా సివ్వక్కకు ఏదో స్మరణకు వచ్చి నట్లున్నది. 'ఆ కుక్క యెటుపంటి దమ్మా!' అని అడిగినది.

"నల్లనిది. ఆ నలుపు నిగనిగలాడుచుండును. దాని ముఖమున మాత్రము తెల్లగా వైష్ణవనామము వలె మచ్చఉన్నది. నెత్తిమీద పెద్దగాయపు మచ్చ ఉన్నది.

అది విన్నంతనే సివ్వక్క పెద్దపెట్టున ఏడ్చుచు రాగములు తీయుచు రొమ్ములు బాదుకొనసాగినది. మహాలక్ష్మి తెల్లపోయి యేమి జేమిటని మరిమరి అడుగగా సివ్వక్క యిట్లన్నది. "మా దేవుని కుక్కమ్మా! అది- అది కొన్నాళ్ళు కనబడలేదు- మా దేవుని రక్షించుట కది ప్రాణములకు తెగించి పోట్లాడినది-"

మహాలక్ష్మి ఆమె యేడుపు తుపానును కొంతవడి సాగనిచ్చెను. అదియు కొంతసేపు తుపానువలెనే సాగి ఉపశమించినది. అంతట వారలమధ్య ఇక్కడ జరిగినవియు అక్కడ చెంచుల కడ జరిగినవియు అనుభవములు మరల మరల విశేషములతో ఆవృత్తము లగుచున్నవి. మామగారి పాటునకు అత్తగారి పాటునకును మహాలక్ష్మి విలపించుచు మరల మరల విశేషములు అడుగుచున్నది.

"పాపము! అంతమంది ఆడవాళ్ళతో మీ అత్తను ఎక్కడో అడవిలో వదలి వచ్చినారు. పాపము!! ఆమె ఏ పులి వాత పడ్డదో తెలియదమ్మా!- సూరయ్యబాబు కేమి? ఆయన మహా నిబ్బరముగా వెళ్ళిపోయినారటమ్మా! ఆయనకు ఈ లోకమే లెక్కలేకున్నది. ఆయన కేమీ భయము లేదమ్మా!" ఇట్లు ఓదార్చుచు సివ్వక్క మహాలక్ష్మిని సమీపించి కొంత కలవరపాటుతో ఇట్లన్నది.

"మనము ఉన్నది సింహముల బోనులోనమ్మా! వీడు మల్లారెడ్డికి అన్న అవునని తోస్తున్నది. తురకలలో కలిసినందువలన వచ్చిన మార్పే గాని అసలు మంచివాడే! అంజనా నమ్మదగదు. కొడుకును చూచినట్లే చూచుచు వీని నిప్పుడు వశపరచుకొన్నాను, వీనికి మును పెన్నడు స్త్రీలను చూచినచో వాంఛ కనబడ లేదు. ఈనాడు నిన్ను చూచిన విధమే నా కేదో కలత కలిగించు చున్నది - అయినా భయపడకుము. భగవంతునిమీద భారముంచి ప్రయ త్నింతుము - "

"నాకు ఈ ప్రయాణము ప్రారంభమందే మీ అబ్బాయిగారు విషపు గుళికలు ఇచ్చినారు. మానరక్షణకు నా కదేమందు."

"తొందరపడకమ్మా ! ఈ తురకలకు పోయేకాలము వచ్చినది. వారి గుసగుసలు నేను వింటూనే ఉన్నాను. భగవంతునిమీద భారము వేయి. నీకు సుఖముగా ఎర్రయతండ్రి కనపడగలడు ! !_"

"అహోబల నరసింహస్వామీ, నీవే నాకు దిక్కు ! రక్షించు తండ్రీ!_"
అనుకొన్నది మహాలక్ష్మి.

కొన్నాళ్ళు నడువగా, ఒకనాడు బడేసాహబు అనుచరుడు గులాము వచ్చి, "తెల్లవారుజామున మీ రిద్దరు ప్రయాణమునకు సిద్ధముగా నుండవలెను" అని చెప్పెను.

సివ్వక్క : ఎక్కడికిరా ?

గులాము : అది నీ వడుగరానిది.

సి : ఓరి నీ నోరుపడా ! అట్లా అయితే ప్రయాణమని చెప్పడమెందుకు దూర ప్రయాణమో దగ్గర ప్రయాణమో పోనీ చెప్పవచ్చునా ?

గులాము : 'దూర ప్రయాణమే' అనుచు వెడలిపోయెను.

సివ్వక్కయు మహాలక్ష్మియు దిగులుతో నొకరి మొగము లొకరు చూచుకొనిరి.

47

ఒక్కొక్క సమయమున ఆకస్మికముగా తుపాను రేగునట్లే కల్లోలములుగూడ సాగును. వాడపల్లి వద్ద ఇప్పుడు పెద్ద అలజడి సాగుచున్నది.

కొన్ని దినములనుండి యవనులు తమ సరుకుల నచ్చట కృష్ణదాటించుచున్నారు. ఆ సరుకులు ఎన్నాళ్ళు దాటవేసినను తరుగునట్లు లేవు. ఢిల్లీనగరమే ఈ విధముగా దాటుచున్నదా అని చూచువారి కనిపించుచున్నది.

యవనులు పడవలు నడపు పల్లెకారులచేత ఈ పనులు బలవంతముగా చేయించుచున్నారు. వారు తమ యిచ్చవచ్చినట్లు చెప్పులకాళ్ళతో పల్లెకారులు చేవతలుగా పూజించు పడవలపై వెట్టి వాని నపవిత్రము చేయుచుండిరి. వారల

కన్నములు తినుటకుగాని, నిద్రపోవుటకు గాని వ్యవధినీయక నిరంతరా యముగా రేయింబవళ్ళు వారిచేత వెట్టిచాకిరి చేయించుచున్నారు.

సరిగా వాడపల్లి వద్దనే ముసినది వచ్చి కృష్ణలో కలియుచున్నది. కొండ లమధ్యగా కష్ణానది ప్రవహించుచున్నందున అక్కడ ప్రవాహవేగ మెక్కువ. అందులో.నిప్పుడు ముసినది పొంగి వచ్చుటచే కృష్ణానదికి గూడ వెల్లువ వచ్చినది.

గాలిపాటు లేని వేళలలో పాపము వారు తమ పొడుగుపాటి గడలతో నావలను త్రోయవలయును. ఆ త్రోపిడి గడల తమ రొమ్ములకు బలముగా నానించి పట్టవలెను. వడికి వారు ఎగిరి దూరముగా నీటిలో పడిపోవుటయు కద్దు. గడకు అందనిలోతు ప్రదేశములలో కోలలు వేసి నడుపవలెను. ప్రవాహ వేగమునకు ఎంతో క్రిందికి పడవ కొట్టుకొని పోవును. ఆ కష్టము తెలియని యవనభటులు రేవుకు సూటిగా పోనీయలేదేమని వారిని నానావిధముల తిట్టి కొట్టుచుండిరి. ఎప్పటికి ఈ శని విరగడ అయిపోవునాఅని పడవలవారు వేయి దేవుళ్ళకు మ్రొక్కు కొనుచుండిరి. కాని యెన్నాళ్ళకును తరుగుటలేదు. క్రొత్త సరుకులు వచ్చుచునే ఉండెను

ఇప్పుడు ఎవరోకొందరు క్రొత్తజనములు వారి పల్లెపాలెములలో తిరుగ జొచ్చిరి. పల్లెకారుల పాట్లుచూచి వారును కన్నీరు పెట్టుకొనుచు భగవంతుడు త్వరలో విముక్తి మార్గము చూపించునని ఆశలు పెట్టుచున్నారు. పరదేశులును దిక్కులేని వారివలెనే పల్లెపాలెములలో దాగికొనుచున్నను. వారిలో ధైర్యము కనబడదు. వారు ధనముకై యాచింపరు. వారు యాచించుచున్నది, పల్లెజనుల స్నేహభావమే! వారు పల్లెజనులకు వారి పూర్వోన్నత్యము స్మరింపజేయు చున్నారు.

పల్లెకారులు నదులకు, ప్రభువులు. నదులు దాటించు హక్కు వారిది. బహుళ సైన్యములు గలవారు పూర్వము భరతు డంతటివాడు చతురంగ సేనతో వచ్చుచుండగా శ్రీరామరక్షకై గంగానది దాటకుండ నిరోధింప నెంచిన గుహుడు వారి వాడు. శంతన మహారాజు నల్లునిగా చేసికొనుటకు ఎన్నియో ఆటంకములు పెట్టి తుద కంగీకరించిన దాశరాజు తమ కులము వాడు. వ్యాస మాత తమ కులములో పెరిగిన పుణ్యమూర్తి.

అట్టి వారల కీ ధైర్యమేమి ? తురకలకు భయపడు టేమి ? నది దాటిం చుటలో ఒక్కసారిగా వారి సందరను పుట్టిముంచగల సమర్థత వారి కున్నది.

గదా : ఆరు నాటికి కృష్ణకుకూడ పైనుండి ఎర్రనీరు తగిలినది. ఆ రాత్రి కృష్ణ వేణికి ఎగువను దక్షిణతీరమున గల పల్లెపాలెములో పల్లెపెద్దలు కూడినారు. ఆ రహస్య సభకు వేమారెడ్డి దూతలు వచ్చిరి. అందులో దేసటరెడ్డి అగ్రగణ్యుడు.

ఆ మరునాడు చీకటి యుండగా దాటించు తురకల పడవలను ము.చి వేయ నారంభించుటకు వార లాలోచించినారు. పల్లెవారి కొక సందేహము గలిగి నది. రెండు వై పుల తురక సైనికు లున్నారు. పడవలు ముంచి తాము ఒడ్డు చేరికొన్నచో తురకల చేతులలో తమ ప్రాణములు దక్కునా !

కృష్ణకు దక్షిణమున సరకు లెక్కువగా చేరినవి. అక్కడ సేనలు తక్కువగా నున్నవి. ఉత్తరమున నున్న సరకులు తక్కువ. సేన లెక్కువ. పడవలు ముంచిన వారు దక్షిణతీరము చేరికొనవలెను. వేమారెడ్డి సేనలు దక్షిణమున నున్న సేనలపై బడి యవనుల సరుకులను హరించును, అప్పుడు యుత్తర మున నున్న యవనసేనలు తరులపై వచ్చుటకు ప్రయత్నించును. ఆ పడవలు కూడ చేతనై నన్ని ముంచవలెను.

ఈ యాలోచనము అద్భుతముగానున్నదని అందరు నంగీకరించిరి. కాని వేమారెడ్డి మాటలు నమ్ముఁబెట్లు?

"వేమారెడ్డి మాటలకు తిరుగులేదు. ఇదిగో దానికి పూట! అని పల్లెకారుల కన్నులు నమ్మలేనంత బంగారపు ముద్దలు దేసటరెడ్డివారి కిప్పించెను.

"ఇది వేమారెడ్డి పంపిన సంచకరువు. కార్యసాఫల్యమైన పిమ్మట దీనికి రెండింతలు బహుమానము మీకు లభింపగలదు "

పల్లెకారులు తామిప్పుడొక్కసారిగా దేశరాజుల మైనట్లే భావించిరి. తుర కలపై నసహ్యముతో పాటు ఉత్తమ మిత్రలాభము దానితో విశేష ధనప్రాప్తి యు లభించుటచే వారిని ఒకొనొక ఉదాత్త ప్రకృతియు నావహించినది. వారు సర్వవిధముల వేమారెడ్డికి సహాయ్యము చేయుదమని మాటయిచ్చిరి.

మరునాడు సమస్తమును వారనుకొన్న ప్రకారమే జరిగిపోయినది. మధ్యాంధ్రదేశము నుద్ధరించుటకు వేమారెడ్డి ఆనాడు ప్రధమ మహాప్రయత్న మారంభించినాడు. ఆతడు గురువులగు ఘోడేయరాయగంగయ్య దేవులను ముందు పూజించినాడు, ఆ పిమ్మట మధ్యాంధ్ర దేశమాతయగు కృష్ణవేణీనదిని

పూలతో పండ్లతో శతకుంభముల సురతోడను, స్వాదుమాంస్యాశనముతోడను, తర్పణచేసినాడు. ఆ మాతయు కనువిచ్చినది. ముసిపొంగు వలననే కాక స్వయముగా కృష్ణవేణీనదియు నిండుగా పొంగినది.

ఆ నాటి యుదయసంధ్యావేళకు పూర్వమేవేమారెడ్డి అశ్వసైనికులు కృష్ణవేణికి దక్షిణమున నున్న యవనస్కంధావారముపై అలజడి చేయ నారంభించిరి. అక్కడ నున్న యవనుల పదాతిసేనలు ఆ కొలది యశ్వబలమును ఎదిరించి నిలువద్రొక్కు కొనుచుండెను.

అంతలో మరికొంత రెడ్డిసేన వచ్చి మీదబడినది. ఉత్తరమున నున్న సేనల నెక్కువగా పంపవలసినదని దక్షిణసేనాని కట్టూనాయకునకు వార్త పంపెను. కట్టూసేన పంపుటకు సర్వప్రయత్నములు సాగించుచుండెను.

అశ్వములు వెల్లువగా నున్న ప్రవాహములోనికి దిగుటకు జంకెను. వానిని ఎక్కించుటకు అనువైన పెద్ద నావలు లభ్యము కాలేదు. చెక్కలువేసి దొన్నెలవంటి కొన్ని నావలలోనికి కొన్నిటి నెక్కించిరి. ఆ యశ్వములు ఆ ప్రవాహము చూచి గంగవెర్రులెత్తి పడవలు త్రొక్కివేయసాగినవి. వానిని పట్టియున్న రౌతుల చేతులలో నిలువక వారి నవి తన్నుచున్నవి. కొన్ని వారిని కరచుచున్నవి. మరికొన్ని కళ్ళెమువద్ద పట్టు తప్పించుకొని ప్రవాహములోనికి దూకి వేగమునకు తట్టుకొనలేక సివమెత్తినట్లు ఇచ్చవచ్చిన రీతిగా నీదికొని పోసాగినవి. అవి కొన్ని కనబడనేలేదు. కొన్ని ప్రవాహవేగమునకు బలియయినవి. కొన్నివెనుక యొడ్డు చేరికొన్నవి. మరికొన్ని దక్షిణతీర మెట్లో చేరికొని అలసి సొలసి తట్టుకొనలేక పడిపోవుచున్నవి.

కొన్ని పడవలలో పదాతు లాయుధములతో నెక్కినారు. వారల అలజడి యెక్కువగా నున్నది. ఓరుగాలికి తెరచాప లెగురుచు బలముగా నొరగుచున్నవి. చాపలతో బాటు పడవలును ఒరగి నీరు పోసికొనుచున్నవి. పల్లెకారులు చేతనున్న డమానుత్రాళ్లు వదలుటకు మారు మరింత బిగలాగుచున్నారు. భటు లలజడిచెంది నావికులను తిట్టుచు పడవ ఒరిగినవైపు నుండి యెత్తుగానున్న వైపుకు ఒక్కసారిగా త్రోసుకొనుచుండిరి. దానితో బరువంతయు నావైపుకు పోగా పడవలు తలక్రిందు లవునట్లు ఊగిస లాడుచున్నవి. వారలను అల్లరి చేయవద్దని నావికులు చెప్పిచెప్పి 'అయ్యో! అయ్యో!' అనుచు

ప్రవాహమధ్యములో తాము బిగించిపట్టిన డమానుత్రాళ్ళు ఒక్కసారిగా వదలి వేసి భయపడిన వారివలె ప్రవాహములోనికి దుమికి వేయుచుండిరి. దానితో పడవలు తలక్రిందులగు చున్నవి. ఈత రాని భటులు ఎందరో కృష్ణవేణికి బలి యయిరి. కొంచెముగా నీతవచ్చిన వారికీ మాత్రము ఆ ప్రవాహవేగములో ఈది బ్రదుకుట సాధ్యమా? నావికులు ఈదుచు బోర్లపడి ప్రవాహమున కొట్టుకొని పోవుచున్న తమ నౌకలను ఎట్లో పట్టుకొనుటకు ప్రయత్నించుచు వానిమీద ప్రాణరక్షణ చేసికొనుచున్నారు. నీరుపోసికొని నీటిలో మునిగియున్న పడవలు నీటిమట్టమునకు ఎక్కువ క్రిందికిపోవు, అట్టి పడవలలోనికి వారు చేరి మిగిలి యున్న భటులను రక్షింపయత్నించుచున్న వారివలెనే నెమ్మదిగా పైకి లేవనెత్తి ప్రవాహములోనికి త్రోసివేయుచున్నారు. శతాధికముగా నావలు మునిగిపోయి నవి. ఐదు వేలమంది యవన సైనికులు ఆనాడిట్లు కృష్ణార్పణమైరి.

ఎట్లో ఆవలి యొడ్డుకు చేరిన కొలది మందిని ఒడ్డు చేరుచుండగనే వేమారెడ్డి సైనికులు లొంగినవారిని ఖైదు చేయుచు, ఎదిరించినవారిని నరికి వేయుచున్నారు. జాము ప్రొద్దెక్కునప్పటికే వేమారెడ్డి సేనలు అన్నియు కృష్ణకు దక్షిణతీరమును చేరికొన్నవి. ఇక్కడ నున్నగుట్టల చాటునను కృష్ణలో కలియు నీటిజాలుల మలుపుల లోనను పొదల చాటునను దాగికొని యుండుటచే అచ్చట చేరిన సేన ఎంతయో యవనులకు తెలియకున్నది.

కట్టూ నాయకుడు తన సేనల కష్టము గుర్తించి ఆరు ఏనుగుల ఘట లను కృష్ణలోనికి దింపెను. ఆ అరువది ఏనుగులమీదను ఒక్కొక్కదానిపై పదిమంది యోధులు ధనురాది యుద్ధసాధనములు ధరించి బయలుదేరిరి. వారు కొన్ని నౌకలు మునిగిపోకుండ రక్షించుచు అవలీలగా దక్షిణతీరము చేరికొనిరి. ఆకస్మికముగా అక్కడ పైబడిన వేమారెడ్డి భటుల చేతులలో వారిలో పలువురు మడిసి తక్కినవారు బంధితు లైరి. ఆ అరువది ఏనుగులును వేమారెడ్డి వశ మైనవి.

ఆ యుద్ధ మీ విధముగా సంపూర్ణముగా వేమారెడ్డికి అనుకూలముగా నుండెనని భావింపరాదు. ఆ క్రిందటిరాత్రి సభకు రాలేక తమ పనులలోనుండిన కొందరు నావికులకు వారి కులపెద్దలు చేసిన నిశ్చయములు అందలేదు. కొంద రికి తమ పడవలు తామే ముంచుకొను సాహసము లేకపోయినది. పడవలు నావికులకు ప్రాణాధిక అవయవములు గదా! అందుచే ఆత్మహత్య చేసికొన

నెంచినవారు తుది గడియలలో అందుకు సాహసించినట్లే. వారిలో కొందరు పడవలు ముంచబోవుచును అప్రయత్నముగా మునుగనీక రక్షించిరి. మరికొంద రికి పడవలు ముంచుట చేతకాలేదు.

అట్టి పడవలలో నెందరో యవన సైనికులు దక్షిణపు బొడ్డు చేరుచునే ఉండిరి. ఆ నౌకలలోనివారికిని ఒడ్డున నున్న వేమారెడ్డి సైనికులకును పడవలు దరిచేరకముందే బాగా, శూన, కుంతాది ప్రయోగములతో యుద్ధము జరుగు చుండెను. పడవలలో నున్నవారికి ఆయుధ ప్రయోగమునకు కాలూనుట కష్టము. ఒడ్డున నున్నవారికి ప్రయోగము సుఖతరము. ఈ విధముగా వారలది అసమ మైన యుద్ధమే !.

కాని తురకలకు సాధనసామగ్రి యెక్కువ. బాణముల పొదులుకూడ తురకల కెక్కువ వేమారెడ్డి సైనికులకు తక్కువ. బాణ ప్రయోగములో పడ వలలోని వారికి ఆత్మరక్షణలో ఒక సౌకర్యముకూడ గలదు. వారావలి వారిపై బాణ ప్రయోగముచేసి కూరుచున్నచో పడవ అంచు గోడవలెనే వారికి రక్షణ నిచ్చును. ఒడ్డున నున్నవారికి అట్టి ఆచ్ఛాదనములు లేవు. అదిగాక యవనుల సేనలలో భటు లన్నిరకములవారు నున్నను వారి నాయకులు మాత్రము విశేష యుదానుభవము గలవారు. వారు తమ నౌకలను చక్కగా మోహరింపజేసి నడచుచున్న కోటలవలెనే కూర్చుకొని ముందుకు సాగుచుండిరి.

మధ్యాహ్నమగునప్పటికి పోరు రెండువైపుల ఘోరము కాజొచ్చినది. కృష్ణలో వరదనీరు మడసిన సైనికులరక్తముతో మరింత యెర్రవారి ప్రవహింప సాగినది.

జయము కొంచెమిటువైపు, కొంచెమటువైపుగా నున్నది. కట్టానాయ కుడు స్వయముగా తన మత్తగజముపై నధిరోహించి కృష్ణదాటి తనసేనను నడపుచు వేమారెడ్డిని తాకినాడు. నష్టపడుచున్నను నేలయీనినట్లు వచ్చుచున్న యవనుల తాకిడిచే అప్పటికే వేమారెడ్డి బలములు కృష్ణాతీరమునకు కొంత దూరము తరిమివేయబడిసవి. పడవలలో వచ్చు సైనికులకు రేవులో దిగుటకు అడ్డు తగ్గిపోయినది. వేమారెడ్డి సేనలపై, దక్షణతీరమున నున్న యవనసైనికు లును నదిపైనుండి వచ్చుచున్న సైనికులును, రెండువైపులనుండి విజృంభిం చుచు అడకత్తెరవలె నొక్కివేయుటకు యత్నించుచు సాగుచున్నారు.

వేమారెడ్డివైపున అతనికండగా అతని బంధువులండరు నున్నారు. అతని మాతామహుడు దొడ్డయసైన్యనాథుడు, పూర్వము కట్టానాయకుడు ప్రతాపరుద్రుని దండనాథుడుగా నుండగా, నాతనిక్రింద పడవాలు పనిచేసిన వాడు. అందుచే నాతని లోతుపాతులు అతడెరుగును. కట్టాకు తొందర యెక్కువ, సాహసమెక్కువ. అది కనిపెట్టియుండుమని ఆతడు తనకుమారు లగు పోతయ చిట్టయను నాగయలకును మనుమడగు నూకయకును ఉపదేశించి వృద్ధుడగుటచే దూరమునుండి యుద్ధగతి విలోకించుచున్నాడు. అన్నారెడ్డి అన్న వేమారెడ్డినివదలక అనుసరించుచు అతనిని కంటినిరెప్పవలె అనుక్షణము కాచుచున్నాడు.

రెడ్డి వీరులకు వీరావేశము పెరిగినది. ఇంతకు ముందు వారు పెద్దయుద్ధ ములు చేసినవారు కారు. ఇదియే వారి మొదటి పెద్దయుద్ధము. వారికి ధైర్యో త్సాహములలో కొదువ లేదు. కాని నడిపించుటలో నేర్పు తక్కువ. సేనలు మోహరించుటలో అనుభవము లేదు. ప్రతాపరుద్రుని మహాసేనలలోనుండి చెదరివచ్చిన పడవాళ్ళే ఇందులో నిప్పుడు దండనాధులై పెద్ద వాహినులను నడపుచున్నారు.

ఎంత యుత్సాహమున్న నేమి? ఎంత సేనయున్న నేమి? ఒడ్డున నుండుటచే స్థానబల మున్న నేమి? ఇప్పుడు వేమారెడ్డి సేనలకు యవనుల రెండు సేనా బాహువుల మధ్య నిరికికొని కదలలేని స్థితి యేర్పడునట్లున్నది.

ఇది వేమారెడ్డి గుర్తించినాడు. ఆవల దొడ్డసైన్యనాథుడును గుర్తించి కలవరపడుచున్నాడు. మిగిలినవారి కది తెలియలేదు. తెలిసి యున్నచో వారి ధైర్యసాహసములు సడలి యుండును. అందుచే వారల కది కనపడకుండునట్లే ప్రవర్తింప వేమారెడ్డి నిశ్చయించినాడు. అది కప్పిపుచ్చుటకై పైపెచ్చు నిర పాయ స్థితిలో నున్నట్లు వేమారెడ్డి నటించుచు విశేషసాహసము చూపసాగినాడు.

రెడ్డిసేనల పరిస్థితి క్షణక్షణము గడ్డు కాజొచ్చినది. యవన సైనికులు రెండుపైపులను వ్యాపించుచు మీదికి క్రమ్ముచుండుటచే భటులు కర్తవ్యము నిశ్చయింప లే కున్నారు. వేమారెడ్డికి కలవరపాటు ఎక్కువ యైనది. ఒక్క క్షణము విశ్రాంతికై రణరంగమునసుండి ఈవలకు వచ్చి ఆక్కడ రామాప్రెగ్గ డతో నున్న గంగయ్యగురుదేవులను దర్శించి భక్తితో నమస్కరించెను.

"నాయనా ! యుద్ధభూమిలో పృథుచక్రవర్తిని స్మరించిన వీరులకు జయమగునని హరివంశములో నున్న వాక్యములు జ్ఞప్తి యున్నవిగదా ! " అని గంగయ గురుదేవులు పలికిరి.

"గురుదేవా ! మీ యుపదేశముచే నిప్పుడు స్మరించుచున్నాను. మీ సందర్శనముతో పృథుచక్రవర్తి నా హృదయములో నిండి యున్నాడు" అని వేమారెడ్డి భక్తి వినీతుడై ఉత్తర మిచ్చెను.

అపుడు రామాప్రెగ్గడ ఇట్లనెను : "వేమారెడ్డీ ! గురుదేవుల ఉపదేశము నా కింకొకటి స్ఫురింప జేయుచున్నది. పృథుచక్రవర్తి తన యజగవంబగు ధనుస్సుతో లోక సంగ్రహార్థము బయలుదేరి నాడు. నీవు నీ ధనుస్సు నూరక యుంచినావు.

సరిగా నపుడే కట్టూనాయకుడు తన యేనుగుపైనుండి ఆ సమీపమున నీటియొడ్డున నాగి సేనల నాజ్ఞాపించుచున్నాడు. ఇంకను బలముగా దూరమునకు విస్తరించి రెడ్డిసేనలను నొక్కివేయుటకు ఆతని యాజ్ఞలు ప్రసరించుచున్నవి. కట్టూనాయకుని వేమారెడ్డి చూచినాడు.

వేమారెడ్డి తెలుగుదేశములో సాటిలేని విలుకాడు! భక్తి పూర్వకముగా నాతడు చేతితో విల్లునందుకొన్నాడు. ఆత్మవిశ్వాసముతోకూడిన చిరునవ్వుతో బాణముచేనంది సంధించినాడు. ఆ బాణము వజ్రముఖము గలది. అది తన వజ్రముష్టితో పూన్చినాడు. అది తన వజ్రధనుస్సున ఆకర్ణాంతములాగినాడు. సరిగా కట్టూనాయకుని రొమ్ము గురిచూచి వదలినాడు. వేమారెడ్డి బాణము శ్రీరాముని బాణమువలెనే ఎన్నడును గురి తప్పనదికాదు. అది గురి తప్పలేదు.

కట్టూనాయకునకు సుదృఢమైన కవచమున్నది. వేమారెడ్డి వజ్రబాణము ఆ కవచమును చీల్చి హృదయభాగమును భేదించినది. కట్టూనాయకుడు తన యేనుగు అంబారీపై అట్లే వెనుకకొరిగినాడు. తన చెప్పబోవుచున్న ఆజ్ఞావచన మట్లే ఆగిపోయినది.

మరుక్షణములో సమస్తము తల్లక్రిందులైనది. యవనుల మూకలకు భయమావేశించినది. వారికి తాము మంచిస్థితిలో నున్నామను యోచనకూడ తట్టలేదు.

కట్టూనాయకుడున్న గజముమీది భటులాతని నొక నొకలోనెక్కించి ఆవలి యొడ్డుకు చేర్చిరి.

ఇకపై పడవలసరంగులు యవనుల పట్టుతప్పిరి. ఇప్పుడు వారందరికి తక్కిన నావికుల ప్రయత్నము లవగతములైనవి. వెనుక అమాయికముగా పడవలు నడిపినవారు ఇప్పుడవి ముంచుటకు యత్నింపసాగిరి. కొందరు నౌకలు వదలి ప్రవాహములో పడినట్లుదూకి యీదుకొని యేదోఒక దరిచేరుకొను చుండిరి. సరంగులు లేని నౌకలమ యవనభటులు నడుపలేకుండిరి. వారిలో కొద్ది యనుభవముకలవారు చుక్కానులను పట్టుచుండిరి. తెడ్లు వేయుటయు, ఎక్కడ మెరకయున్నదో కనిపెట్టి గడవేసి త్రోయుటయు వారికి తెలియుట లేదు. గడ నేలపై నిలువదు. నిలిచినను దానిని, క్రొత్తయగుటచే. పూనిపట్ట లేకున్నారు. ఆ మహా ప్రవాహములో అభ్యాసమున్నవారికే అది కష్టతరము.

కొన్ని పడవలు మధ్యలో మెరలుకపట్టినవి. కొన్నిరాళ్ళకు తగిలి బీటలు వారినవి కొన్ని ఏటివాలున కొట్టుకొని పోసాగినవి.

ఉత్తరమునుండి దక్షిణమునకు సేనలు వచ్చుట కష్టమైనది. అంతే కాదు. యుద్ధగతియు ఒక్కమారుగా తారుమారయినది. దక్షిణమున వేమారెడ్డి సేనలతో తలపడుచున్న యవనవీరుల కత్తెరనడక విచ్చి చిన్న భిన్నమైనది. ఇనుపముక్కను కత్తిరింపబోవు మెతక కత్తెరవలెనే అది విరిగినది. ఇప్పుడు యవనులమూకలు పారిపోవుటకే యత్నించుచున్నవి. కాని యెటు పారిపోవుట? ఉత్తరమున కృష్ణవేణీ మహాప్రవాహము తన పొంగుతో దారికడ్డినది. దక్షిణమున వేమారెడ్డి సేనలడ్డగించినవి.

ఆనాటి మహాయుద్ధములో కృష్ణానది దక్షిణ తీరమునకు చేరిన యవన సేన యంతయు హతమార్చబడినది పోను మిగిలిన దంతయు వేమారెడ్డి వశమైనది. వారము రోజులనుండి యవనసేనలు రేయింబవళ్ళు దక్షిణ తీరమునకు చేర్పించిన ఆహారపదార్థములు, ఆయుధ సామగ్రి, యాత్రాహధనములు, అశ్వములు, గజములు అన్నియు వేమారెడ్డి హస్తగత మైనవి.

వేమారెడ్డియు బంధువులను కలసికొనిరి. ముందు వారందరు తమ దృష్టిని తమకు జయము చేకూర్చిన దాశరాజులపై మరల్చిరి. వారి పెద్దలను కూడదీసిరి. చెదరిపోయిన సరంగుల నందరిని సురక్షిత స్థానముల చేర్చి వారికి సుష్ఠుగా భోజనాదులు సమకూర్చిరి. మునిగిన నౌకలను ఒడ్డుచేర్చి నీరు తోడించి యాత్రా సమర్థములుగా నొనర్చుటకు ప్రయత్నములు చేసిరి. పగిలిన వానిని

బాగుచేయించుటకు ఏర్పాటులు చేసిరి. తమపై నింత ఆదరము చూపుచున్నం దుచే ఆగుహాని అపరావతారములకు వేమారెడ్డి సాక్షాత్తుగా శ్రీరాముడుగానే భాసించెను.

ఈనాటి జయము నిరుపమాన మైనది. దీనితో మును పెన్నడు లేని యూహలు వేమారెడ్డికి ఈనా డుద్భవింప సాగినవి. ఏదో యవనుల బారినుండి దేశమును ఉద్ధరింపవలె ననియే యిన్నాళ్ళు నాతడు మధనపడి యుండెను. అయినను అది యెట్లు సమర్థముగా చేయుటయో ఇన్నాళ్ళును ఆతనికి తెలియ లేదు. తండ్రి కావలసినంత బంగార మిచ్చినాడు. శ్రీ శంకరస్వాములు వృషభా కారమున నాశీర్వదించినారు. నేడు గంగయగురుదేవుల యాజ్ఞచే ఆతడు సాధిం చిన మహావిజయము స్పష్టముగా నూత్నాశలు కలిగింప జేసినది. ఈనాడు దొరి కిన ఆహారపదార్థములతో సంవత్సరముపాటు అనేకవేలమంది సైనికులనే కాక మధ్యాంధ్రదేశమునే పోషింపవచ్చునని తోచినది. అప్పుడు దొరికిన గజాశ్వ ములు ఆయుధములు యుద్ధసామగ్రితో తన సైన్యమును నిజముగా ఉత్తమ మైన మహాసేనగా చేయుట స్యాదమగునని తోచినది.

ఆ నాటిరాత్రి వేమారెడ్డి తన బంధువుల తోడను దళాధిపతులతోడను దాశధీవరుల తోడను కర్తవ్యమునుగూర్చి మంతనము లొనర్చెను. మరునాడు నావలను అన్నిటిని కూడదీసికొని కృష్ణానది దాటి ఆవలి యవన సేనలను తాకుటా ? కాక యింతటితో తృప్తిపడి విరమించుకొనుటా ? తర్జన భర్జన లైనవి. కొందరకు ధైర్యము చాలుటలేదు. పలువురకు మొండి సాహసము ; పైపెచ్చు నేటి విజయముతో అట్టివారి కన్నులు పొరలు కప్పినవి. తుదకు రామాప్రెగ్గడ ఉపదేశించిన మంత్రము నందరు నంగీకరించిరి.

"మనసేనలు కొన్ని ఉత్తర తీరమునకు దాటవలెను. అక్కడి బలాబల ములు పరీక్షించి. జయము నిశ్చయముగా నున్న పక్షములో మాత్రమే, అక్కడి బలములను తాకవలెను. అట్టి శక్తి లేదని తోచినచో తాకుచున్నవానివలె బెద రింపనైన బెదరింపవలెను ; అట్లు చేయనిచో ఎన్నటికైన దక్షిణ తీరమున మనకు ప్రమాదము రావచ్చును ; ఈ జయము వృథ యగును."

ఆ ప్రకారముగా మరునాడు వేమారెడ్డి సేనలో కొంతభాగము అన్నా రెడ్డి నాయకత్వమున కృష్ణానది నుత్తరింప ప్రయత్నములు సాగించినది. సేనానాసీరము దాటి చూచునుగదా. అక్కడ యవనసైన్యము లేవియులేవు.

అవియన్నియు అందరాకుండ పలాయితములైనవి. అట్లు పారిపోవుటలో వారి నాయకులు బహుసమర్థత ప్రదర్శించిరి. అక్కడి స్కంధావారములో యుద్ధ సామగ్రిగాని ఆహారాది పదార్థములుగాని, యెక్కువ వదలిపెట్టలేదు. అన్నారెడ్డి యున్న సామగ్రినంతటిని జాగరూకుడై సేకరింపజేసెను. అన్నారెడ్డి తనదళాధిపతులతో మంతనమొనర్చి తనతోవచ్చిన సేనలో సగభాగమును దక్షిణతీరమునకు పంపివేసి తక్కువసేనతో యవనసేనలగతులు కనిపెట్టుటకు తాను నిలిచిపోయెను.

ఈవల రామనమంత్రి తన కరణముల సాహాయ్యమున ఆక్కడ లభ్యమైన యవనుల సాధనసంపత్తి యంతయు పట్టీలు వ్రాయించెను. బంధితుల నందరను క్రమముగా కాపు కాయుటకును ఏర్పాట్లు జరిగెను. ఆ బంధితులలో పలువురు కై జీతగాండ్రు ఎవరు జీతమిచ్చిన వారి పక్షమున బోరాడువారు. వారిప్పుడు వేమారెడ్డి పక్షమున యవనులను ప్రతిఘటించి పోరుటకు సమ్మతించి ఉచితమైన ప్రతిజ్ఞలుచేసి, ఈ సేనలో కలసిపోయిరి. ఈ యుద్ధములో వేమారెడ్డి పక్షమున కూలిపోయిన భటులకంటె ఎక్కువమంది నూతనవీరులు ఈ విధముగా పోగైరి. అయినను వేమారెడ్డి ఈ పోరిలో గతించిన వీరులకై అపరిమితమగు పరితాపముపొందెను. గంగయ గురుదేవులను వేమారెడ్డి వారికి పుణ్యగతులు కల్పించుట కుపాయమేమని ప్రార్థించెను.

గురుదేవులు కొండతడవు ధ్యాననిమీలిత లోచనులై మౌనముగానుండిరి. అంతట కన్నులతెరచి భగవదాదేశమును పలుకుచున్న వానివలె ఈవిధముగా సెలవిచ్చిరి. "నాయనా! ఈ యుద్ధములోనేమి? నీవు ఈ మధ్యాంధ్రభూమిని యవన నిర్మక్తముచేయుటకు మరియు నెన్నియో యుద్ధములు చేయవలసియున్నవి. నీకు అన్నింటను విజయము ప్రాపింపగలదు. ఈభూమిని శ్రీశైల మల్లికార్జునుడు అహోబలనృసింహుడు కరుణాదృష్టితో వీక్షించుచున్నారు. ఇట్లే మరికొందరు వీరులను తమ ప్రాణములర్పింపక తప్పదు. వారందరకు వీరస్వర్గము సిద్ధమైయున్నది. అయినను వారు సుఖముగా కైలాసవైకుంఠము చేరుకొనగలందులకు సోపానములు నిర్మించు నాయనా! ఈ భూమి యవన నిర్మక్తమైన వెంటనే శ్రీ పర్వతమునకు అహోబలమునకు సోపానములు కట్టింతునని మ్రొక్కుకో!"

వెంటనే వేమారెడ్డి భక్తివినమ్రుడై శ్రీ గురువుల సమక్షమునను విద్వద్బ్రాహ్మణ సమక్షమునను మంత్రిసేనాని వీరగణ సమక్షమునను శ్రీ గురువుల ఆదేశప్రకారము మధ్యాంధ్రభూమికి ప్రభువులగు శ్రీశైల మల్లికార్జునునకును అహోబలనరసింహునకును సోపాన శ్రేణి నిర్మింతునని మ్రొక్కుకొని తనపక్షమున వీరశయనములంతరించిన వారిని సుఖముగా కైలాసమునకు వైకుంఠమునకు చేరి హరిహరుల ప్రార్థించిన ఆ మహాసభవారు వేమారెడ్డి ధర్మబుద్ధిని వేనోళ్ళ శ్లాఘించుచు శ్రీకృష్ణభగవానుల గీతా వాక్యములను స్మరించిరి.

'హతో వా ప్రాప్యసే స్వర్గం : జిత్వావాభోక్ష్య సే మహీమ్!' ఇట్టి ధర్మప్రభువు కొలువులో ప్రాణములు వదలుటయు విశేషమే!.

48

మల్లారెడ్డి విస్సన్న కమ్మనాభామాత్యుడు, రత్తగేహి, పటరెడ్డి ఇత్యాదులగు అనుచరులతో కృష్ణా ముఖద్వారము చేరికొనెను, శిరము శిరోన్ముఖమైనది, ఎండ లారంభించినవి. కృష్ణవేణీనది బక్కచిక్కి యున్నను ఆ ప్రదేశము సముద్రము పోటు పాటులతో ఏకముఖముగా నుండదు. రోజునకు రెండు మారులు పాటుతో ప్రవాహము బక్కచిక్కి రెండుమారులు పోటుతో సంపుష్టమై విలసిల్లును. అది గమనించి గమనించి ఒకనాడు మల్లారెడ్డి విస్సనతో నిట్లనెను.

"విస్సన్నా! మహారాజుల సంపదలుకూడ నింతేగదా!"

మల్లారెడ్డి ఈమాటలే పలుమారు పలికియుండుట విస్సన్న విని యుండెను. అందుచే నాతడు బదులు పలుకలేదు.

కొంతకాలము నుండి వారిరువురు రేయింబవళ్ళు అదేపనిగా రత్తగేహితో సంప్రదించుచు కృష్ణాముఖద్వారమున నౌకలో సంచరించుచు ఆ పరిసరములు పరీక్షించుచుండిరి. సముద్రము మీదినుండి వచ్చెడి నౌకలను కృష్ణాప్రవాహములో చొరకుండ ఆటంకపరచుటెట్లు? కృష్ణానదిలో నుత్తరమున నుండి వచ్చెడి నదీనౌకలను ఏయేపాయలలో నెక్కడ అడ్డుకొనుట సాధ్యమగును? ఏపాయలలో పాటులోగూడ నౌకలు యానముచేయుట దుస్సాధ్యము?

వారిప్పు డేటి మొగలో నౌకపైనున్నారు.

మల్లారెడ్డి మనస్సంతయు నదిమీదను సముద్రము మీదను హంసవలె తేలియాడుచు ఆవల మోటుపల్లిరేవు లక్ష్యముగా పెట్టుకొనియున్నది. అవచి దేవయ తనపై ఉంచినభారము దింపుకొనుటకు అతడిప్పుడు తహతహలాడు చున్నాడు. ఆతడు పెట్టుకొన్న ఆరునెలల గడువు సమీపించుచున్నది.

రత్తగేహి ఇపుడు మల్లారెడ్డికెంతయు ఉపకరించున్నాడు మల్లారెడ్డి ఆతనిని మాటిమాటికి ప్రశ్నించును. అతడు విసువులేకుండ సమగ్రముగా వివరించుచుండును. ఈ విధముగా విస్సన్నయు మల్లారెడ్డియు నౌకా భేదములు తత్తద్భాగములు, ఏయేదేశములనుండి ఏయేసరుకులు ఏయేనావలమీద వచ్చు నదియు తెలిసికొన్నారు. అశ్వములు గజములు ఖడ్గాదిసాధనములు ఏయే విదేశములలో ద్వీపములలో లభించును? అవి యెట్టి నౌకలపై దిగుమతి యగును? ఆ నౌకల రూపములెట్టివి? చిహ్నము లేవి? పేరులెట్టివి? ఇట్టివన్నియు వారికి కేవలవాక్కులచే ఎంతవరకు నేర్వవచ్చునో అంతవరకు నవగతమైనవి. అయినను కనులార చూడనిది అనుభవమునకు రావుగదా. కాని మధ్యమధ్య మల్లారెడ్డియు విస్సనయు చేయుచున్న అపూర్వములగు సూచనలు రత్తగేహికే ఆశ్చర్యము కలిగించుచున్నవి.

ఇప్పుడు వారికి దూరమున సముద్రమునీది నుండి నౌకా సమూహ మొకటి వచ్చుచున్నట్లు పొడకట్టినది. ఆ నౌకలు ఎవరివైయుండును? ఆ నౌకలోని వారందరును ఒక్కసారి ఉద్బుద్ధులైరి. ఆ చుట్టుపట్టుల నున్న మల్లారెడ్డి నౌకలన్నియు ఒక్కసారిగా సర్వసంసిద్ధములగు చున్నది. సముద్రముపైనుండి వచ్చుచున్న నౌకలను గూర్చి అభిప్రాయభేదము వచ్చినది.

రత్తగేహి : 'అవి మా నౌకలు!'

విస్సన : 'నాకు చూడగా అవి యెవరివో క్రొత్త వర్తకులవిగా తోచుచున్నవి.'

మల్లారెడ్డి : 'అవి యవనుల నావలు.'

రత్త : 'అవి మా ధ్వజములతో మెరయు చున్నవి.'

మల్లా : "మీ ధ్వజము లేమంటివి?"

రత్త : "వృషభ ధ్వజములు."

మల్లా : "వృషభముల కాళ్లు పైకుండు నా? క్రిందికుండు నా?"

విస్సన్నయు రత్తగేహియు తెల్లపోయిరి. రత్తగేహి కూపస్తంభమును స్వయముగా నెక్కుచుండెను. ఆతని బరువుకు కూపస్తంభము కంపింపగా ఆ నౌక యంతయు దడదడలాడెను. అతడు పైకెక్కి పోతవాహ డుండు ప్రదేశమున నిలిచి దూరమున నున్న నౌకలు పరీక్షించి దిగివచ్చి కొంచె మాలోచనలో పడుచు నిట్లనియెను.

"మల్లప్రభూ! మీరు సెలవిచ్చి నట్లు రెండు నౌకలపై ధ్వజములలో ఆ వృషభముల కాళ్ళు పైకే ఉన్నవి. అవి పొరపాటున తగిలించి యుందురు."

మల్లారెడ్డి శాంతముగా నాతని వైపు తిరిగి, 'అవి యవనుల నావలు; వృషభములను తలక్రిందులుగా వైదిక ధర్మపరు లెవ్వరును నిద్రలో కూడ కట్టరు!' అనెను.

విస్సన్న : 'మల్లయ్యా! నిజమే! అందుచేతనే అవి విదేశీయుల వని ముందే నే నూహించితిని.'

మల్లా ; 'నీవు చెప్పునది నాకు వేదమే. కాని ఇందులో నీ ఊహ సంపూర్ణము కాదు, విస్సన్నా! అవి మ్లేచ్ఛుల నౌకలు! మనల జాడ తెలిసికొని మోసముచే మన నౌకలను నాశము చేయ వచ్చుచున్నవి-ఎవరో విదేశనావికులు వృషభ ధ్వజములు ధరింపరు. అట్లు వారికి మోసగింప వలసిన పనియుండదు. మన మాలసింప రాదు; మన నౌక లన్నిటికి వానిని ప్రతిఘటించుటకు ఆయత్తము కావలెనని వార్తలు పంపవలయును.'

విస్స : రత్తగేహీ; మనకున్న నౌకలు ఆ వచ్చెడివానిని ప్రతిఘటింప గలవా?'

రత్తగేహి ఇంచుక ఆలోచించి యిట్లనెను. "అవి నదీముఖమును క్రమ్మి కొనులోపల మన నౌకలు సముద్రములోనికి చేరగలనచో నిస్సందేహముగా ప్రతిఘటింపగలవు. ఆ వచ్చెడి నావలకు గాలి యెదురుగా నున్నది. ప్రవాహ మును ఎదురే; మన నౌకలు సముద్రముచేరికొనుటకు వ్యవధాన ముండవచ్చును."

మల్లా : 'ఆ నౌకలు మన నావను ఉపలక్షించి నట్లున్నవి. అవి మన వైపునకే వచ్చుచున్నవి.'

రత్తగేహి సరంగులకు ఉత్తరువులిచ్చి వెంటనే ధ్వజమును కూపస్తంభమునుండి దింపించెను. అనుభవశాలియగు ఆ నావికునకు ఏలనో జంకు కలిగెను. ఆతడు కర్తవ్యమాదేశించుటకు మల్లారెడ్డి వంకను విస్సన్న వంకను చూచు చుండెను.

మల్లా ! 'మన నౌక లిక్కడ సమీపములో నున్నట్లు ఆ నావలకు తెలియుట కవకాశమున్నదా?

రత్త : ఏమని చెప్పగలము? మనకెందుకు? మనము అతి రహస్యముగా నిచ్చట నున్నా మనియే తలంతును.'

మల్లా : 'ఆ మ్లేచ్ఛుల నావలు మోసగించు ధ్వజములతో వచ్చుటకు కారణమేమై యుండునో" ఊహించగలవా?'

రత్త : "అదే తోపకున్నది. అవి మ్లేచ్ఛుల వని గుర్తించు టెట్లు?"

విస్స : 'ఇంకను సందేహమా!'

రత్త : 'బాబూ! నావికులను మీరెరుగరు. వారు సురాపానము చేయనిదే పడవ పాటు చేయలేరు. సురాపానము చేసినవారు చేయని పొరపాట్లే ముండును?'

విస్స : 'ఆ నౌకలు వర్తకులవే అనుకొందువా?'

రత్త : 'మాకు యుద్ధపోతములు గూడ నున్నవి.'

విస్స : 'ఆ వచ్చెడి వానిలో వర్తకపు నౌకలేమైన గలవా?'

'ఇప్పుడే విన్నవింతు ననుచు సమీపించుచున్న ఆ నౌకల నాతడు శ్రద్ధగా పరీక్షింపసాగెను. ఆతడు పరీక్షించుచున్న కొలదియు వెలవెలపాటు ఆతనిలో ద్యోతమయ్యెను. చూచి చూచి ఆతడు 'బాబా! బాబా!' అని ఆతురుడై పలికెను.

మల్లా : 'ఆఁ! ఏమది?'

రత్త : 'ప్రమాదము ప్రభూ!' ఇవి భయంకరులైన మూరుల యుద్ధ నావలు.'

మల్లా : 'మూరులనగా?'

రత్త : "విదేశీయులైన మ్లేచ్ఛులు. వీరు దోపిడిగాండ్రు. అంత సాహసులు నావికులలో నుండరు. అతి క్రూరులు. దొరకిన మనుష్యులను పట్టుకొని పోయి విదేశములలో బానిసలుగా అమ్ముదురు.

విస్సన్న యు, మల్లారెడ్డియు మంతనమొనర్చిరి. భయమెరుగని రత్తగేహికి భియ మావేశించుటచే ఆతడు తమకు తగు మంత్ర ముపదేశించు స్థితిలో లేడని తెలిసికొనిరి. విస్సన్న కేమియు తోపలేదు. మల్లారెడ్డి ధీరముగా వలికెను.

"మన నావలన్నియు ఈ నౌకలతో వెంటనే తలపడవలెనని ఇదే ఆజ్ఞాపించున్నాను. విస్సన్నమంత్రీ! నా నిశ్చయమున కనుకూలముగా నీ వాక్కు రానీ!"

విస్సన్న నిస్సంకోచముగా 'శుభంభవతు' అనెను.

మల్లారెడ్డి సంప్రీతుడై మనసా నందికంత పోతరాజుకు నమస్కరించి యిట్లనెను. "రత్తగేహీ! ఇది దీర్ఘాలోచనకు సమయము గాదు. మన నౌక లన్నియు యుద్ధమునకు సిద్ధము కావలె. వానిలో సగము ముందు సముద్రము మీదికి పరువెత్తి ఆ నౌకలతో తలపడ వలె. మిగిలినవి అవసరమైనపుడు మన నౌకలకు సహాయ మొనర్చుటకును శత్రునౌకలకు చిక్కు గలిగించుటకును మోహరించి యుండవలెను. వెంటనే సంజ్ఞలిమ్ము. మనవృషభరాజుపై ధ్వజ మెత్తింపుము. ముందు తలపడ వలసినది మా నౌకయే! నీ నౌకమీదికి నీవు పొమ్ము!"

రత్తగేహి నిదురనుండి లేచినవానివలె ఉద్బుద్ధు డయ్యెను. అత డప్పుడు చూపిన చురుకుదనము వర్ణనాతీతము.

మల్లారెడ్డి ఉన్న నౌక పేరు వృషభరాజు. దాని ముఖమున వృషభాకా రమే తీర్చియున్నది. దాని శిరసున కాంస్య నిర్మితములైన రెండు పోట్ల కొమ్ములు క్రిందికి వంగినట్లు అమర్చబడి యున్నవి. వృషభధ్వజముపై వృషభ చిత్రము తెల్లనితెలుపుగా పాలసంద్రమువలె నున్నది. దాని కొమ్ములు గొరిజలు. ఇంద్రనీలములవలె నీలవర్ణముగానుండి శత్రుభయంకరగా నున్నవి. దాని ముక్కుపై నున్న నలుపు రంగు కాలాంజన సదృశమై శత్రుభయంకరముగా నున్నది. దాని గంగడోలు నాలుగు సువర్ణ రేఖలతో నాలుగు వేదముల శ్రుతి తరంగముల వలె చిత్రింపబడినవి. దాని మూపుర మొక కైలాస శిఖరము వలె దర్శనీయమై యున్నది. దాని తోక యొక మహానాగమును తలపించుచు జవజవ లాడు చున్నట్లు చిత్రింపడినది. దాని మెడలో ఘంటికా పట్టికయు, నడుము వారును, నవరత్నఖచితమై, చిత్రచిత్ర వర్ణములతో చిత్రింపబడినవి. దానిముఖ

పట్టికయు, చికుమోరయు బహూరత్న చిత్రితములైనట్లు భాసిల్లుచు ఆ వృషభ మునకు భీషణ రమణీయాకృతిని సమకూర్చుచున్నవి. అట్టి వృషభ ధ్వజము ధగధగలాడుచు ఇపుడు దురుసుగా లేచి దిక్కులన్నియు తన ప్రభలతో నింపి వేయుచున్నది.

ధ్వజముతోపాటు కూపకస్తంభములపై తెరచాపలు లేచినవి. మోకులు దడదడలాడుచు పడవ నంతటిని ఊపివేయుచున్నవి. సరంగులు కేకలువేయుచు తమతమ పనులలో నిమగ్నులైరి.

ఇతర నౌకలకు ధ్వజములతో ముందుగా సంజ్ఞలు అందింపబడినవి. పిమ్మట పత్రములపై లిఖింపబడిన ఆజ్ఞలుకొని చిన్న దోనెలలో నావికులు బయలుదేరిరి ఆ ఆజ్ఞాపత్రము లిఖించుటలో విస్సన రెండుచేతులు ప్రయోగించెను.

మల్లారెడ్డి వృషభరాజులలోని వీరభటు లందరు యుద్ధమునకు సన్నద్ధులైరి. వా రెట్టి సింహనాదములును చేయలేదు. వారు చూపు తీవియే సింహనాదము చేసినకంటె వారి వీరోత్సాహమును ప్రత్యక్ష మొనర్చుచుండెను.

వృషభరాజు సర్వాయత్తమైనది. అంతవరకు నిద్దురపోవుచున్నట్లున్న కృష్ణామాత ఒక్కసారిగా నిద్దుర లేచినట్లైనది. అంతవరకు చిఱుకెరటముల శబ్దమే కాని ఒండెరుగకకున్న కృష్ణాగర్భము ఇప్పుడు అరిత్రముల దెబ్బలతో దడదడలాడుచున్నది. అంతవరకు ఒదిగి పరువు వారుచున్న కృష్ణప్రవాహము నౌకల కదలికతో ఒక్కసారిగా ఇప్పుడు పైకిఉబికి ఉప్పొంగి దూకుచున్నట్లు కనిపించుచున్నది.

వృషభరాజు ముందు దారితీయగా దానిని మరియారు నౌకలు అనుగమించినవి. అవి అన్నియు ఆవలి శత్రునౌకలను ధిక్కరించుచు పోరికి రమ్మని ఆహ్వానించుచున్న వానివలె సముద్రము మీది కురికినవి.

వానినిచూచి శత్రునౌకలు కొంచె మాశ్చర్యపడినట్లున్నవి. ముందు దురుసుగా వచ్చుచున్నవి ఇంచుక వెనుకాడినవి. అవి ముందు ఇక్కడ నొకనౌకయే కలదనుకొన్నట్లున్నవి. వానికి ఇట్టి ప్రతిఘటనము క్రొత్తగా కనిపించినది. తమ్మ చూచినంతనే భయపడి పారిపోవు నౌకలనే అవి యెరుగును గాని ఇట్లు ధీరముగా ప్రతిఘటింప సాహసించు నౌకల నెరిగినట్లు లేవు. పారిపోవు నౌక

లను వెంబడించి పట్టుకొని కొల్లగొట్టుటే కాని తమంతతామే తమ్ము పోరికి రమ్మని ఆహ్వానించు నౌకలను చూచు నభ్యాసము వానికి పోయినట్లున్నది.

అవి తటపటాయించినవి. ముందు.వాని నడక కొంచెము మందగించినది. పిమ్మట మరింత మందగించినది. ఆ పైన అవి ఆగిపోయినవి.

ఏమి చేయుట?

వానిలోని నాయకులకు బెదరుపుట్టినది. భయముతో పారిపోవలెనని వారికి తొందర కలిగినది.

ఆ.భయము తమశక్తియు ఎదిరిశక్తియు ఆలోచించుటచే కలిగిన భయము కాదు. ఎదిరి ధైర్యము చూచినంతనే పుట్టిన భయమిది. ఎంత బలములేకున్న వీనికింత బింకముండునని తలపు తట్టుటచే కలిగిన భయము. వారు పారిపోవుటకే నిశ్చయించిరి. అందుకును వారికి వీలున్నట్లు లేదు.

తమకు గాలి యెదురు. నదీప్రవాహమెదురు. ఆ ప్రదేశమజ్ఞాతము. ఏ యొడ్డున ఎవరు దాగియున్నారో? నదిలో నింకెన్ని నౌకలున్నవో? ఎక్కడ నే అపాయము వేచియున్నదో? ఏమిచేయుట? వా రాలోచించిరి.

"పారిపోవలె!- పారిపోవలె!

అది మాత్రమెట్లు? శత్రునౌకలు సముద్రము మీదికి చొచ్చుకొనిపోయి తమ్ముచుట్టు ముట్టుచున్నవి. వాని సందులనుండి తప్పించుకొనుటెట్లు? ఈ నదీ ముఖమున నుండి మరియెన్ని నౌకలు రానున్నవో?

ఆ నౌకా నాయకులలో అలజడి యెక్కువై నది. వారు ధైర్యమున్నవారు కారు. సాహసులు మాత్రమే! వారు ప్రధానముగా దస్యులు క్రూరులు. రాక్షసులు. అయిన నేమి? పిరికిపందలు.

ఆ నౌకల సంకోచము సూక్ష్మబుద్ధియగు మల్లారెడ్డి వెంటనే గ్రహించి ఉత్సాహోద్రగ్రుడై వానిని పొదివి క్రమ్మివేయ తన.నౌకల కాజ్ఞ యిచ్చెను. అతని సాహసము మాత్రము అతని యనుచరుల కవగతము కాలేదు. పైపెచ్చు ఆత్మహత్య కాతడు కడంగు చున్నా డనియే వారు భావించిరి. సముద్రముపై యుద్ధములోని కష్టసుఖముల అనుభవ మెరుగకనే అత డట్లు తలపడుచున్నాడని వారు తలంచిరి.

శత్రునౌకలు మిక్కిలి పెద్దవి మనవి అంతకంటె చిన్నవి. శత్రునౌకలు సముద్రయోగ్యముగా బలిష్ఠముగా నిర్మింపబడినవి. మనవి ముఖ్యముగా నదీ యానమునకు కట్టబడి దీర్ఘకాలము సముద్ర తరంగముల తాకిడికి తట్టుకొను శక్తి లేనివి. శత్రునౌకలకు యుద్ధమున కనువైన దృఢనాసిక లున్నవి. అవి కంచుతో చేయబడినవి. అవి ఎదిరి పడవను తాకినంతనే చొచ్చుకొనిపోయి చీల్చివేయగలవు. మనవానికిని ముక్కులున్నవి కాని అవి యంత బలిష్ఠములు గావు. ఒకవేళ మన నౌకల ముక్కులు శత్రునౌకలను ఛేదించినను, ఆ పెద్ద నౌకల ఊపునకు మనవి ఒరిగి తలక్రిందులు కావచ్చును. శత్రునౌకలలో బహు కాలముగా బహుసముద్రములలో బహుయుద్ధములలో బహుముఖానుభవ మున్న నౌకా సేన లున్నవి. మన నౌకలలో యుద్ధమెరుగని నావికులును సముద్ర మెరు గని వీరులును మాత్ర మున్నారు. శత్రునౌకలు పది యున్నవి, మనవి బయటకు వచ్చినవి ఆరునొక్కటి మాత్రమే. నదిలో దాగియున్నవైనను మరి యారే! వానిని సముద్రముపైకి రాకుండ రెండు శత్రునౌకలే నదీముఖమున నిల్చి అడ్డ గింపగలవు. ఆట్టియెడ మన ఏడు నావలు ఎనిమిది శత్రువుల నావలతో పోర వలసివచ్చును. మన నౌకలన్నియు సముద్రము మీదికి వచ్చినను బాగుండెడిది.

ఇట్లాలోచించుచు నావికులు భయపడిరి. అయినను వారికి నోరెత్త వీలు లేకపోయినది. నౌకలపైనున్న వీరనాయకులే వారి నాజ్ఞాపించుచుండిరి. ఆ వీరు లకును నావికులకును, మల్లారెడ్డిఆజ్ఞ సుగ్రీవాజ్ఞ!

పారిపోవుటకు వీలులేని వన్యమృగము లెదిరించునట్లే శత్రునౌక లిప్పుడు ఎదిరింప గడగినవి. అంతకంటె ప్రమాద మేముండును?

కాని మల్లారెడ్డి సాహసము దైవప్రేరితము. మనుష్య యత్నములో విఫలములగు కార్యములుకూడ దైవ మనుకూలించినచో సఫలములు కాగలవు. గుండ్లకమ్మ నీటిపై నాట్యమాడి సముద్రముఖముగా యానమొనర్చినట్లు తనకు ప్రత్యక్షమైన నందికంత పోతరాజును మల్లారెడ్డి భక్తిపురస్సరముగా ధ్యానించి నమస్కరించినాడు. పూజ్యురా లగు తల్లి అన్నమ్మకు భక్తినమ్రుడై అంజలించి నాడు. శ్రీశైల మల్లికార్జునునకు మ్రొక్కుకొని ఆతడు పోటుకు ఉపక్రమించి నాడు. అతని పోటు రంకె ఎక్కడో దూరమున నున్న మధ్యాంధ్రభూమి ప్రభు వగు సిరిగిరి మల్లయ్య చెవిటి చెవులకు వినిపించిన ట్లున్నది. అతడే ఆ వృషభ

రాజును యుద్ధమునకు నడపెను. ఆ పర్వత మల్లే సముద్రమల్లుడై రణము సాగించెను.

శత్రునౌకలలో నెల్ల పెద్దనౌక దురుసుగా వెను దిరిగి మల్లారెడ్డి నౌక ప్రక్కగా విశాల సముద్రముపైకి పారిపోవ సాగుచుండెను. వెంటనే మల్లా రెడ్డి ప్రక్కపోటున దానిపైకి పోవ తన వృషభరాజు నాజ్ఞాపించెను. ఆ రెండు నౌకలును సముద్రపు పోటు తోడను, గాలి తోడను ఊగిస లాడుచున్నవి.

శత్రునౌక ముఖమున గండభేరుండ పక్షి ముఖము చిత్రింపబడినది. దాని దృఢమైన నిడుముక్కు మల్లారెడ్డి వృషభరాజు ముఖమును గాని ప్రక్కలను గాని తాకినచో అది యేమైయుండెడిదో! కాని భయపడి పారిపోవుచున్న ఆ పక్షి అట్లేల చేయును? వృషభరాజమే తన తీక్ష్ణశృంగములతో గండభేరుండము బరిని భయంకరముగా నొకతాపు తాచెను.

రెండు పడవలను గడగడలాడి పోయినవి!

అట్లు రెండుపడవలు తాకినదే వ్యవధానముగా మల్లారెడ్డి ఆ పడవపైకి లంఘించెను. అందులోని వీరులెందరో ఆతనిపైకి కవిసిరి. వారినందర నాత డొక్కడే ఎవరిని తన దరి చేరనీయకుండ శూలముతో పొడిచివేయు చుండెను.

పడవలు వేరైనవి. మరెవ్వరును వృషభరాజుపైనుండి గండభేరుండము పైకి దూకుట కవకాశము లేకుండపోయి ది. సముద్రపు కెరటములు ఆ పడవ లను మరింత దూరము చేయుచున్నవి.

"మల్లారెడ్డీ! మల్లారెడ్డీ! వెనుకకు రా! సముద్రములోనికి దూకిరా!"

వృషభరాజు పైనుండి వచ్చుచున్న ఆ కేకలు సముద్రఘోషలో కలిసి విన వచ్చుచున్నను, మల్లారెడ్డి అవి వినిపించుకొనలేదు.

విధిలేక వృషభరాజు మరల గండభేరుండముపై కలిసినది. అవి కలసి నదే తడవుగా వృషభముపైనుండి పలువురు వీరులు ఉత్సాహోద్రగ్రులై గండ భేరుండము పైకి లంఘించిరి. ఒంటరియై పోరుచు అలసిపోవుచున్న మల్లారెడ్డికి ఒకింత విశ్రాంతియిచ్చి వారందరు శత్రువీరులతో తలపడిరి. మరల పడవలు దూరమైనవి.

విచ్చిపోయిన వృషభరాజు మరి యొకసారి గండభేరుండను ప్రక్కను పొడిచినది. ఈమారు మరికొందరు వీరులు అందులోనికి లఘించిరి.

గండభేరుండము అవస్థ అంతటితో ఆగలేదు. వృషభరాజు పోట్లకు దాని ప్రక్కలో సంధైనది. గండభేరుండము మహావేగమున నీరుత్రావ నారంబించినది,

నీటి బరువుకు గండభేరుండము ఒరుగుచూపినది

గండభేరుండము గతి యిట్లుండ తక్కిన శత్రునౌకలు ఏమి చేయను తోపక తారాడుచుండెను. మూడునౌకలు మాత్రము సముద్రముఖముగా పరు వెత్తుచుండ వానిని పోనీక మల్లారెడ్డి యితర నౌక లడ్డగించినవి. అందుచే ఆ మూడు నౌకలుకూడ మిగిలిన నౌకలతోపాటు నదీద్వారమును చొరవలసిన వచ్చినది. నదీముఖమున నీరెంత లోతున్నదో వానికి తెలియదు. మెరక పట్టునేమో ఆ ప్రాంతము వారికి క్రొత్త.

సరిగా నప్పుడే కృష్ణలో నీరు పాటారుచున్నది. భయపడుచునే ఆనౌకలు నదీముఖము చొరబారినవి. భయపడినట్లుగనే అవి యిసుకమేటలు తగిలి మెరక పట్టినవి. వడివడిగా వచ్చుచున్నవానికి దెబ్బతగిలి అవి ఆగిపోయినవి. నౌకల లోని వారికది విద్యుత్తాడనమువలెనే తాకినది. నిజముగా ఆనౌకా సమూహమునకు అది పిడుగుపాటే అయినది. అవి అన్నియు తలక్రిందులైనవి వానిఆశలు తలక్రిందులైనవి, అందులోని దస్యులయూహలు తలక్రిందులైనవి. వారి ప్రయత్నములే తలక్రిందులైనవి. సుఖముగా తాము దోచుకొనుటకు వీలుగానున్న నౌకలు దొరకినవనుకొన్న సమయములో తమనావలే పట్టువడినవి బలమైన తమ నావలు బలహీనములగు నావలకు చిక్కినవి. తాము ఇతరులయెడ ఎట్టి దయాదాక్షిణ్యములు చూపు నలవాటులేనివారు. చిక్కిన ధనము హరించి స్త్రీ పురుషులను బానిసలుగా చేసి దూరదేశములలో విశేషధనమునకు అమ్ముటకు అలవాటు పడినవారు. అందుచే తాము పట్టువడినప్పుడు తమజేతలు తమపై నెట్టిజాలియు చూపుదురను నాశ వారికిలేదు. అందుచే నీ చివరి క్షణములో వారికి ముందులేని తెగువదనము వచ్చినది. వారిపుడు ప్రాణములకు తెగించినారు. వారి నిపుడు చూచుటకే భయమగుచున్నది. చిత్రముగా వారి నౌకానౌక రాక్షసాకారము ఆవేశించినది.

మెట్టపట్టిన ఆ నౌకలను సమీపించి వానిపైకి లంఘించి అందులోని వారిని అవలీలగా బందీలనొనర్చు సుత్సాహముతో మల్లారెడ్డి నౌకలలోని వారు సమీపించిరి. వారు సమీపించినంతనే, ఏదుబంది ముండ్లకవచము ఒక్కసారి

విచ్చకొనునట్లే, ఆ నౌకలోని వారందరు ఆయుధములు పూని భయంకరముగా ఎదురొక్కనసుండుట చూడ వారికి ఆశ్చర్యమైనది. ఇంతవరకు ప్రతిఘటింప జంకిన వారిలో ఈమార్పు ఆకస్మికముగా వచ్చుటేమి యని నివ్వెరపాటుతో వారందరు ఒక్కక్షణకాలము వెనుదీసిరి.

గండభేరుండముతో యుద్ధము చేయుచున్న మల్లారెడ్డి అది గమనించెను. ఆతడు వెంటనే పంటరెడ్డికిని రత్తగేహికిని ఆజ్ఞాసంజ్ఞలు పంపెను. ఆ సన్న యెరిగి వా రిరువురు వారి రెండు నౌకలనుండి హుమ్మని యార్చుచు నౌకలపైకి దుమికిరి వారివెంట సుశిక్షితులైన వీరు లెందరో దుమికిరి. వారందరు చేతికందిన వారినెల్ల తెగవేయుచు పొడిచివేయుచుండిరి. ఆ మూరులకు పంటరెడ్డియు రత్తగేహియు ఇద్దరు సైతానులవలెనే కనుపట్టిరి. దానితో మూరుల తెగువ తగ్గినది. వా రొక్కుమ్మడి దీనులై తమ పడవలపై మోకరించి అజ్ఞాతమగు భాషలో ఎలుగెత్తి ఆర్తితో 'రక్షింపు' మని ప్రార్థింపసాగిరి.

"రక్షింపుడు రక్షింపుడు."

రత్తగేహి వారిని నరకుచునే ఉండెను. పంటరెడ్డి మూరుల నందరిని ఆయుధములు విసర్జింప నాజ్ఞాపించి, వా రట్లు చేసినంతనే రత్తగేహిని ప్రార్థించి శాంతింప జేసెను. రత్తగేహి తన పెద్దకత్తితో మూరులకంటె భయంకరుడై నరక ద్వారము కాచుచున్న సైతానులలెనే రక్తసిక్తమైన సర్వాంగములతోడను, పరిభ్రమించుచున్న ఆ రక్త విశాల లోచనముల తోడను భాసించెను.

49

ఆవల మల్లారెడ్డికి ప్రతిపక్ష నాయకునితో యుద్ధ మంత తేలికగా లేదు. ఆతడు ప్రతిఘటించినంతసేపు మల్లారెడ్డిని ప్రతిఘటించి ఆకస్మికముగా నౌకా గర్భములోనికి దిగిపోయి పై తలుపు బంధింపజేసెను. అత డంతట తన భటులు బంధించిన ఖైదీలను కొందరిని మరియొక మార్గమున ఆవలి నౌకపైకి పంపి, అచ్చట నిలవబెట్టి వారి చుట్టును విచ్చుకత్తులవారిని నిలిపెను.

"మీ రొక్క అడుగు కదిలినచో వీరి ప్రాణములు ఆఖరు."

ఆ ఖైదీలలో మహాలక్ష్మి కలదు సివ్వక్క యున్నది. మరియు నెందరో స్త్రీ లున్నారు.

వా రెవరో మల్లారెడ్డి యెరుగడు. వారు స్త్రీలని మాత్రమే ఆతని కెరుక. తనవల్ల స్త్రీహత్య జరుగుట మల్లారెడ్డికి ఇష్టము లేదు. ఇపుడు కర్తవ్య మేమి?

అంతలో గండభేరుండము గర్భమునుండి మహాధ్వని వినవచ్చినది. నౌక లోపల దానికి అగ్ని రగుల్ప యత్నించు చున్నారా! మల్లారెడ్డి ఆలకించెను. గొలుసుల చప్పుడైనది. గట్టిగొలుసులు మహాకాయుడు త్రెంపుకొనుచున్నచప్పుడైనది. గొలుసులు పటపటలాడినవి.

ఆ మరుక్షణమునసే సముద్రముపై వీచు తుపాను వలె ఒకమహాకాయుడు, తెగిపోయి యింకను కాళ్ళను చేతులను వ్రేలాడుచున్న సంకెళ్ళ ముక్కలతో, పైకివచ్చినాడు. అత డదోలోకమునుండి పైకి వచ్చుచున్న యమకింకరునివలెనే ఉన్నాడు.

ఆతడువచ్చినదే తడవుగా అక్కడి విచ్చకత్తుల వారిలో ఒకరి చేతిలోని ఖడ్గము నూడబెరికికొని ఆకస్మికముగా వారినందర తుండెములుగా నరకివేసెను. స్త్రీలును వృద్ధులును, విముక్తులైరి. నౌకా గర్భమునుండి మూరు నాయకుడు కొందరు మూరుభటులతో ఆతడు వచ్చినమార్గమున పైకిరాబోవుచుండ అతడు వారిని యమకింకరునినలెనే నరికివేయు చుండెను.

ఇట్లు శత్రునౌక మధ్యమున నుండి మిత్రులు పుట్టుకొని వచ్చుట చూడ మల్లారెడ్డి విభ్రాంతుడై కన్నులప్పగించి చూచు చుండెను.

ఇట్లు విముక్తినొందిన స్త్రీలును అట్లు పోరుచున్న మహాకాయునిచూచి భయముతో వణకి పోసాగిరి. మహాలక్ష్మి మూర్ఛ యే పోయెను.

అంతవరకు ఆ వచ్చిన వీరుడు మల్లారెడ్డిని గాని, అతని వెంటనున్న వీరులనుగాని, చూడనేలేదు.

ఇపు డాతడు చూచినాడు. గుర్తించినాడు! ప్రేమతో ఒక్క అడుగు ముందుకు సాగినది. కాని దాని నాతడు బలవంతముగా నాపుకొన్నాడు.

మల్లారెడ్డి ఆతని గుర్తించినాడు.

అతడే తనచే నరణ్యములో ఖడ్గ హతుడైన బడేసాహబు. అతడే తుర కలలో కలసిన తన అన్న దొడ్డారెడ్డి!

అన్నదమ్ములు ఒకరి నొకరు చూచుకొనిరి. ఇద్దరును అంతరంగములో నుండి పొంగి పొరలి వచ్చుచున్న ప్రేమామృత ప్రవాహమును అదచుకొని, తీవ్రముగా ఒకరి నొకరు చూచుకొనిరి.

ఒక్కరును ముందున కొక అడుగును వేయక నిలచిపోయిరి.

ఎదురైన రెండు కాలసర్పములవలె, రెండు సింహములవలె వా రొకరి నొకరు తీక్ష్ణముగా చూచుకొనిరి.

తారొక్కన్న రెండు పృషభరాజులవలె వా రొకరి నొకరు క్రోధావేశ ముతో చూచుకొను చుండిరి.

మల్లారెడ్డి కదలకుండుట గమనించి, ఆతని అనుచరు లెవ్వరు ముందు కడుగు వేయలేదు

అన్నదమ్ము లిరువురు తీక్ష్ణముగా ఒకరి నొకరు చూచుకొన వారి చూపుల లోని తీక్షత చిత్రముగా తగ్గిపోవసాగినది.

వారివి వెర్రిచూపులైనవి.

వారి యిద్దరి కళ్లను ఆర్ద్రిము లైనవి.

వారికళ్ళలో నీరుగ్రిరున తిరిగినది.

వారిద్దరి హస్తములలో ఖడ్గములు జారిపోయినవి.

ధృఢతరములగు వారిద్దరి మేనులు నిస్సారములైనవి.

తూలుచు ప్రయత్నపూర్వకముగా వారిద్దరు ముందుకు అడుగులువేసిరి.

వారిద్దర దేహములు గాఢాలింగనములో కలిసిపోయినవి.

మల్లారెడ్డి అనుచరులు మూరులచెరనున్న స్త్రీలను తమ నౌకలపైకి సురక్షితముగా చేర్చిరి.

మల్లారెడ్డి గాంఢాలింగనములో నున్న బడేసాహబు మనస్సు వా రావలికి వెళ్లుచున్నప్పుడే పరాయత్తమైనది. మహాలక్ష్మిని కన్నులార చూచుటకే అన్ని శృంఖముల నాతడు తెగగొట్టుకొని వచ్చెను. ఇప్పుడామెను మల్లారెడ్డి అనుచ రులు తన యెదుటినుండి ఆవలకు గొనిపోవుచుండ నాతనికి తనప్రాణమే పోవుచున్నట్లైనది. అప్రయత్నముగా నాతడు తలయెత్తి మహాలక్ష్మి పోవుచున్న వైపుకు దృష్టి ప్రసరింపజేసెను.

చూపులలో భావము లిమిడి యుండును. భావము లొక్కొక్క తరి మాటలు చెప్పిన కంటె స్పష్టతరముగా చూపులలో ప్రసరించును. తన అన్న ప్రసరింప జేయుచున్న ఆ చూపులలో అపవిత్రత మల్లారెడ్డికి స్ఫురించినది. అతనికి కడుపులో నుండి కెలికి వేయుచున్నట్లైనది. పవిత్రురాలగు తన తల్లి అన్నమ్మ కడుపున పుట్టిన వాడు అట్లు ప్రవర్తించుట ఆతనికి చెప్పరాని అసహ్యము కలిగించినది. అప్రయత్నముగా అన్నను కౌగలించుకొన్నట్లే ఇప్పుడ ప్రయత్నముగా ఆతని రొమ్ముపై చేయివేసి త్రోసివేసినాడు. అది పెద్ద త్రోపు గాదు, బలమైనది కాదు. చేయి మాత్రము నెమ్మదిగా నంటి త్రోసినత్రోపు.

అయిన నేమి? అది బడే సాహెబుకు ఆర్థమైనది. అది యాతనికి వజ్రహారము వలెనే అతని హృదయాంతరములోనికి దూసికొని పోయినది. తన తమ్మని పవిత్ర భావము మహాగ్నిహోత్రము వలె ఆతని అంతరాత్మలో ప్రవేశించి తపింప జేసినది. తనకును తన తమ్మునికిని, ఆయ్యో! ఎంతదూరమైనది. తనకు భావ కాలుష్యము ఎంతకాలముగా ఆవేశించినదో అతని కెరుకలేదు. అది పోగొట్టుకొనుటకు అతడింతవరకు ప్రయత్నింపలేదు; ప్రయత్నింపవలె ననుకోరికకూడ ఆతని కింతవరకు కలుగలేదు. తనలోని దుర్బుద్ధి ఆతని కింతవరకు స్ఫురింపనుకూడ లేదు. పాపభావముల మహా ప్రవాహవేగములోపడి కొట్టుకొని పోవుచున్న ఆతని కిప్పుడు మొదటిసారి దాని స్వరూపము స్ఫురించినది. పవిత్ర భావములతో నిండి ముగ్ధ మనోజ్ఞమైన తన తమ్ముని ముఖము చూచుచున్న కొలది తన మాలిన్యము స్పష్టము కాజొచ్చినది.

"ఎంత పాపిష్టినైతిని! ఇది మ్లేచ్ఛులలో కలసిపోయిన పాప ఫలము. అయ్యో! గోమాంసము మెక్కిన ఫలము అయ్యో! మా కుటుంబమువారు పరస్త్రీలను పరదేవతా భావముతో తప్ప కన్నెత్తి చూచి యెరుగరే!"

ఇన్నాళ్లు తాను తిన్న గోమాంస పాపమే తన దేహములోని మాంసముగాను, రక్తముగాను, సర్వశరీరముగాను పరిణమించినట్లు అతనికి తోచినది. అతని కన్నులు తిరిగినవి. ఆతడు నిలువలేకపోయెను. అతడు స్పృహతప్పి పడిపోయెను.

స్పృహతప్పి పడిపోయిన యన్నను జూడ, మల్లారెడ్డికి, అదేమి చిత్రమోగాని, ఏమాత్రము జాలి కలుగలేదు. ఆతని యాజ్ఞగొని అనుచరులు సాహబును పృషభరాజు గర్భమున నొక గదిలో భద్రపరచిరి.

50

శంకర సంయమీంద్రుల యాశ్రమములో నున్న ఎర్రయ కేమాత్రము శాంతిలేకున్నది. తల్లి పోతమ్మ తనకడ సురక్షితముగా నున్నది. గోమాతసు వత్సమును పంటరెడ్డి భీమరాజు చెంచుగూడెమునుండి ఆశ్రమమునకు చేర్చెను. తండ్రి సూర్యకవికి సంభవించిన అవస్థ తల్లిపలన కొంతవరకు గ్రహించినాడు. ఇంతవరకు తండ్రి దర్శనము కాలేదు. అయినను ప్రజ్ఞామూర్తి యగు తస తండ్రికి తాను చేయవలసిన సాయమేమియు లేదు. తనతండ్రి ప్రదర్శించిన ధీరత తలచుకొన్న కొలది అతనికి రోమహర్షము మరల మరల కలుగు చున్నది మధ్యమధ్య తన ప్రియధర్మపత్ని పిలుపు దూర దూరమైనట్లు వినవచ్చు చునే ఉన్నది. మిత్రుడు మల్లారెడ్డి వ్యాధి తిరుగుముఖమైన తర్వాత ఆశ్రమ మునకు వచ్చి కొన్నాళ్ళుండి విధ్యుక్త నిర్వహణకు వెడలిపోయెను. వేమారెడ్డి మహాసేనను కూర్చుకొని ఏదో మహత్కార్యమునకు సాగిపోయెను. తన్ను ఉద్ధరించిన వరాహ నృసింహమూర్తి అనేకరూపముల ఆవిర్భవించి ఈ మధ్యాంధ్రభూమిని సముద్ధరింప నవతరించుచున్నాడని ఆతనికి విశ్వాసము బలీయ మగుచున్నది.

మాటిమాటికి ఆతనికి యవనుల సర్వతోముఖములగు దుశ్చేష్టలు మన స్సున బారుచుండ అపూర్వమగు హృదయవేదన కలుగుచున్నది. పూర్వము హిరణ్యకశిపుడు లోకములనిట్లే వేధించెనని మాటిమాటికి పొడ కట్టుచున్నది. మహాస్తంభమునుండి శిష్ట సంరక్షణార్థము ఆవిర్భవించిన శ్రీ నృసింహమూర్తి తన హృదయములో భీషణ మనోజ్ఞరూపముతో నాట్యము చేయుచున్నట్లు భాసించుచున్నాడు.

ఒకనాడు ఆతడు భగవద్ధ్యానము చేయుచు ధ్యాన నిమీలితలోచనుడై ఏకాంతముగా ఒక సెలయేటియొడ్డున సాంధ్యకృత్యములు తీర్చి ఆసీనుడై ఉండెను. ధ్యానము సమాధిభావమును పొందినది.

'ప్రబంధ పరమేశ్వరః'

ఇట్లు తన్నెవరో పిలిచినట్లు ఎర్రయకుతోచి తలయెత్తి చూచెను. ఎదుట ఆతని తాత ఎరపోతసూరి కరుణావిలోకనములతో ప్రత్యక్షమయ్యెను. వెంనే

ఎర్రయ ఆతనికి అభివందనమాచరించి "తాతా! నన్ను నీవట్లు సంబోధింతు వేమి?' అని ప్రశ్నించెను.

"నీ ఆభ్యుచ్ఛయము పిత్రలోక వాసులమగు మాకు ప్రియముగదోయీ!"

"నేను ధన్యుడను. నీ ఆజ్ఞయేమి, తాతా?"

"నీవు శంభుదాసుడవైనను విష్ణుభక్తి భవ్యుడవు. అహోబలనృసిం హుడు నాయిష్టదైవము. తదంకితముగా నృసింహావతార ప్రకారము పురాణం పుము. నీకభీష్టసిద్ధి యగును."

ఎర్రయ ప్రకృతి భావము నొందునప్పటికి వనమున పక్షులు కలకలా రావములు చేయుచుండెను. 'ధన్యుడనైతి' ననుచు ఆతడు లక్ష్మీ నృసింహా స్మరణ గావించెను.

'శ్రీకి నిరంతరంబు కడుఁ జెన్నెస లారెడు రాగలీల, ను
త్సేకముఁ బొంది యొప్పు తన చిత్తము చూపెడు మాడ్కి నిత్యర
మ్యాకృతియైన కౌస్తుభము నక్కపయిం బచరించు నుత్తమ
శ్లోకుఁ డహోబలేశుఁ డతిలోకుఁడు లోకముఁ గాంచుఁగావుతన్.'

అంతట లక్ష్మీస్తవము బ్రహ్మస్తవమును శివస్తవమును విష్ణ్వీశస్తుతియు చేసి పరమహంస స్వరూపమున నున్న భారతిని స్మరించినాడు వాల్మీకిని వ్యాసుని నన్నయను తిక్కనను పెండియు తొల్లిటి యిప్పటి కవులను తలంచి శంకర సద్గురువుల నాశ్రయించెను

ఆవల మధురముగా హంసకూజితము వినవయ్యెను. అదివిని యెదురుగా నున్న పెలయేటినీరు పడియగా జేరినయెడ మీనములకై పొంచియున్న క్రౌంచ పక్షి యొకటి తానుకూడ కూయ గడంగెను. ఆరెండు కూతలును విన్న యెర్ర యకు ముఖమున చిరునవ్వు మెరసినది.

"మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁగడంగు భంగిఁ బ్రౌ
ఢాంచిత శబ్దసారులు, మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తి సంగసుఖ లీలకు నేనును గాంక్షఁ జేసితిన్."

అని భావించెను. అంతట తండ్రి సూర్యకవి తలపున బారినాడు.

'ప్రాజ్ఞ ప్రస్తుత భవ్యభోగ విభవ స్ఫారాత్మఁ డారాధ్య స

ర్వజ్ఞుం డవ్రతి మార్చుతోభయ కవిత్వ ప్రౌఢి శబ్దార్థయో
గాజ్ఞా సిద్ధి ఘనుండు మజ్జనకుఁ డుద్యత్కీర్తి శ్రీ సూర్యుఁడీ
విజ్ఞా నాత్మక వాఙ్మయమ్మున ముదావేశోజ్జ్వలుం డయ్యెడున్.'

అని నిశ్చయించి బ్రహ్మాండాది పురాణోక్తమైన శ్రీ నరసింహావతార పురాణ కథను సంస్మరించెను.

రాత్రి ఆఎట్టయ నిజ నివాసము చేరికొని ఆశ్రమములో నున్న బ్రహ్మాండ పురాణము విష్ణు పురాణము మహాభాగవతము తెచ్చుకొని వానిలో శ్రీ లక్ష్మీ నృసింహావతార కథ పఠింప నారంభించెను. మరునా డుదయమునసే అప్పటికే సర్వసిద్ధమైయున్న ముదురుతాటి మొవ్వల పత్రములను చక్కగా చీరి రంధ్ర ములు చేసి కాపుచెక్కలతో కూర్చి సూత్రములతో గ్రంథించి వ్రాయుటకు సిద్ధ మొనర్చెను. ఆతడు క్రిందటిరాత్రి చెప్పిన పద్యములు స్మరణకు తెచ్చుకొనుచు ఆకాపు చెక్కలను నునుపుచేసి వానిపై శ్రీ లక్ష్మీనృసింహ యంత్రమును చిత్ర వర్ణములతో లిఖించెను. అంతట హరిద్రాకుంకుమ పుష్పాదులతో శ్రీకోశ పూజ గావించి నివేదన మొనర్చెను.

అత డంతట తన గజ్జెల గంటమును చే నందుకొని, ఆకుమొన తేలు నట్లు నూరి నారికేళోదకముతో నభిషేకించి. గంధముతోడను కుంకుమము తోడను అర్చించి, నారికేళ ఫలనివేదన మొనర్చి, నమస్కరించి, చేతగొని కన్నుల కద్దుకొని, శ్రీకోశమున శ్రీకారముచుట్టి, క్రిందటి రాత్రి చెప్పిన గద్య పద్యములు లిఖించి షష్ఠ్యంతములవరకు సాగించెను. అతడు వ్రాయుచుండ పత్రము చేరెడి ధ్వని శ్రీలక్ష్మీనృసింహుని నఖప్రచారము వలెను, గంటములోని చిరుమువ్వల గలగలలు కిన్నర కింపురుషుల ఆనంద నాట్యములవలెను ద్యోత ములగుచుండెను.

రెండుమూడు దినములు నృసింహావతార కథకు మూల గ్రంథములను పఠించుచు ఆ కథాభాగములను భావనచేసి అనుభూతికి దెచ్చుకొనుచు గ్రంథ రచనకు విఘ్నము లేకుండ కొలది భాగము వ్రాయుచు గడపెను.

ఒకవంక నృసింహావతార రచన సాగుచున్నను మరియొక వంక దూర మునసుండి తన ప్రియపత్ని పిలుపు వినబడుచు హృదయములో శూలమువలె వేధించుచున్నది. తల్లి యతనితో ఎక్కువ మాటాడదు. ఆమెకోడలు ఏయెడ

ఎట్టి యవస్థలో నున్నదో అను చింతతో కుంగిపోవుచున్నది. తన దైవమగు సూర్యకవి దూరమైనను ఆయన కింకొకరి సహాయమవసరము లేదు. తనకు గూడ ఈ యాశ్రమములో నెట్టికొదవయు లేదు. కాని కుమారుని చూచినంతనే అతని ఒంటరిపాటుకు దుఃఖము ముంచుకొని వచ్చును; మాటాడినచో కన్నుల నీరు తిరిగి మాట రాకుండునట్లు ఆగుచుండెను.

ఒకనాడామె బలవంతముగా ఆత్మనిగ్రహ మొనర్చుకొని కుమారుని యొద్దకువచ్చి, "నాయనా! మాతల్లి మహాలక్ష్మి ఎక్కడ నున్నదో విచారింప లేవా! తండ్రీ!" అనెను.

ఎర్రయ కన్నులు మూసికొని 'అమ్మా! నిన్ను విడిచిపోవుటెట్లు?' అని ప్రశ్నించెను.

"నాకిక్కడ భయమేమియు లేదు. నీవు శీఘ్రముగా బయలుదేరి మహా లక్ష్మితో కలిసిరా! నాయనా!" అని బోధించి దీవించెను.

ఎర్రయకు ఎన్నియో దినములుగా ఆత్మలో నట్టి ప్రబోధమే కలుగు చుండెను. ఇప్పుడు తల్లిమాటలచే అది పరదేవత ఆదేశముగనే భాసించెను. ఆతడు వెంటనే శుభముహూర్తము నిశ్చయించి తల్లికి నమస్కరించి దీవన పొంది, గోమాతకు నమస్కరించి, శంకరసంయమీంద్రులకు మ్రొక్కి నారా యణ స్మరణ పూర్వకమగు అనుజ్ఞనుపొంది బయలుదేరెను. ఆతనివెంట శ్రీ లక్ష్మీనృసింహావతారకోశము గంటమును తప్ప మరియొండు తోడుకొని పోలేదు.

ఆతడు బయలుదేరినంతనే పూర్ణకుంభముతో నొక సువాసిని మంద హాసమును చేయుచు నెదురైనది. గో వృషభములు ఒరసికొనుచు సవ్యభాగము నుండి ప్రదక్షిణముగా త్రోవచూపుచు నరిగినవి. అరణ్యమున వామపార్శ్వము నుండి పైడికంటికలు జంటగాకూసిన గలగల శ్రవణపేయ మయ్యెను.

ఎర్రయ 'యశ్శివోనామ రూపాభ్యాం'- ఇత్యాదిగా శివుని మంగళరూప మును ధ్యానించుచు, జనార్ధనుని హృదయస్థునొనర్చుకొని, నరనారాయణు లను స్మరించి, సర్వసంపద్ధాత యగు శ్రీరామునికి నమస్కరించుచు ప్రాచీముఖుడై పయనమయ్యెను.

కొంతదూరము సాగిన పిమ్మటగాని తానెందు బోవలెనో అతడాలోచింప లేదు. ఆతని పాదములు తీసికొనిపోవుచున్న దారిని అతడు ముందుకు సాగు చుండెను.

కొంతవడికి, 'నేనెటు పోవలెను?' అను ప్రశ్న స్ఫురించినది. అతడు కన్నులు మూసికొని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఎటుదారి తీసిన అటు పోవు టకు నిశ్చయించి కాళ్లెటుతీసికొని పోయిన అటులే పోవసాగెను. అతడప్పుడు శ్రీ లక్ష్మీ నృసింహావతారములో శ్వేతద్వీపవర్ణనము రచించుచుండెను. తన పాదమును స్వేచ్ఛావిహారము చేయనిచ్చి మనస్సు శ్వేతద్వీపవర్ణనములో లీన మొనర్చి ఆరూపముగా భగవద్ధ్యానము చేయుచు దారిసాగెను. ఆతడు అలసి నప్పుడు ఏగ్రామమునకు చేరిన అక్కడ నిలుచును. ఆతని ముఖమున భగ వత్కళ ఆవేశించియుండుటచే, కనబడిన ప్రతివారును వినయ వినమితో త్తమాం గులై ఎదురువచ్చి, గౌరవించి తమయిండ్లకు గొంపోయి సాదరముగా నాతిథ్య మిచ్చుచుండిరి. దారిలో మానసికముగా రచించిన గ్రంథభాగము ఆరాత్రి యెల్ల మననమొనర్చి మరునా డుదయమున సంధ్యావందనాది బ్రాహ్మ్యకృత్యముల నిర్వ ర్తించి సదాశివ ధ్యానమైన వెంటనే క్రిందటి దినమున రచించిన గ్రంధభాగ మును తాళపత్రములయందు లిఖించి కన్నులకద్దుకొని, గ్రంథము కట్టి ముందుకు ప్రయాణము సాగించు చుండెను.

ఇట్లు కొంతకాలము వెళ్ళివెళ్ళి యొకనాడు శ్రీ వేదాద్రి నృసింహస్వామి అధిష్ఠించియున్న వేదగిరికి ఎదురుగా కృష్ణానదికి ఈవలియొడ్డున నిలిచెను. ఆత డడక్కడ కృష్ణవేణీ సరిత్స్నానము యథాశాస్త్రీయముగా కావింప వెనుకటికంటె నూతనశక్తి ఆవహించినట్లు చిత్రముగా తోచినది. అతడు సంధ్యావందనమును పూర్తిగావించి బ్రహ్మయజ్ఞ మొనర్చి శివధ్యానము చేయుచుండగా ఆవలి తీరము నుండి శ్రీ లక్ష్మీనృసింహస్వామి తన్ను రమ్మని పిలుచుచున్నట్లు భాసించెను. అక్కడ వేదాద్రి నృసింహుడు వెలసియున్నాడని అతడెరుగడు. కొంచెము తలయెత్తి చూడగా ఎందరో భక్తులు అక్కడ కృష్ణానది తరించి ఆవలి యొడ్డునగల పర్వతమునకు పోవు చున్న ట్లగుపించినది. విచారింపగా ఆనాడు ఏకాదశి యగుటచే వేదాద్రి నృసింహస్వామికి జరుగుచున్న పక్షోత్సవము చూడ భక్తు లరుగుచున్నారని తెలిసినది. వెంటనే ఎర్రయకును శ్రీ స్వామిని దర్శించు నుత్కంఠ అతిశయించినది. కృష్ణవేణిని దాటుట ఎట్లా, ఈదుకొని ఆవలికి

వెళ్ళుదునా, అని వేణీప్రవాహముల వంక ఒక్కమారు తిలకించెను. ఆతని యింగితము పడవలోనివారి కవగతమైన ట్లున్నది. పడవ నడుపువారును, అందాసీనులైన భక్తులును పడవ దిగి వచ్చి ఎర్రయకు నమస్కరించి సగౌరవముగా నావలో కూర్చుండబెట్టి ఆవలకు తీసికొనిపోయిరి. అక్కడ వేదాద్రి నృశింహ స్వామిని ధ్యానము చేయుచు, మూడు దినములు వేదాద్రి మీదనే ఆతడు గడపెను. అప్పుడు తృతీయా శ్వాసములో నున్నాడు. అక్కడనే శ్రీ స్వామి సన్నిధానమున అంగవర్ణన వచనమును రచించి నక్షత్ర మాలా స్తవము కావించెను.

"చదువులు గోలుపోయి యొక జాడయుఁ గానక బిమ్మరించు న
మ్ముదు సలి వేల్పుఁదేర్చి వెస మ్రుచ్చుబడిం బ్రళయాబ్ధి నీట గ్ర
క్కదలఁగ దాడి వెట్టిన నఖర్వ భవత్తిమి రూప మిప్పుడు
న్మద రుచిఁ గ్రోలుచుండు ముని మానస పూరములన్ జగన్నిధీ!"

ఈ పద్యము చెప్పుచుండగా తన పరిభ్రమణమే ఎర్రయకు భాసించెనా? ఆర్తరక్షకుని మరియు ని ట్లతడు స్తుతించెను.

"కమఠ తనూ విలాసమునఁ గవ్వపుఁగొండ ధరించు తేవ నీ
యమృతము దెచ్చి యాశ్రిత జనావలి కిచ్చితి నేఁడు నమ్మహా
కమఠ తనూ విలాసము దగన్ దలఁపన్ గొనియాడఁ గన్నవా
రమృతముఁ గాంచి నిర్మల సుఖాంబుధిఁ దేలుదు ఆర్తరక్షకా!"

ఆర్తి తలంచు కొన్నంతనే ఎర్రయకు రోష మావేశించినది అంతట యజ్ఞ పోత్రి రోషలీల నిట్లు వర్ణించెను.

"గౌరిజల క్రౌక్కునం బ్రిదిలి కుండలి భర్త యొదుంగ నూర్పులం
దెరలి, మహార్ణవోదకము త్రిప్పుకొనం బటు రోష తాడనన్
జిరిఁగి, యజాండ కర్పరము చిల్లులు వోవఁగ యజ్ఞ పోత్రివై
ధర పదిలంబుగా నిడిన తావక లీలఁదలంతు మచ్యుతా!"

ఆ వెంటనే ధర్మార్థరక్షణమునకై భగవంతుని నిట్లు స్తుతించెను.

"ఖేదము లేక యజ్ఞమయ కేసరముల్ గదలంగ విస్ఫుర
న్మేదుర హేషిత ధ్వను లమేయములై ప్రణవస్వరూపతన్
రోదసి నిండఁగా హయశిరోవపు వొప్ప యుగాంతసంహృతిన్
వేదము లుద్ధరించిన పవిత్రయశుండవు నీవు శ్రీనిధీ!"

మరియు నారాయణుని జగన్మంగళరూపము ధ్యానించుచు నాతడు కాతరుల రక్షింపుమని ఇట్లు ధ్యానించెను.

"స్ఫురదా తామ్ర జటా కలాపములతో బూర్ణేందు సౌందర్య సుం
దర వక్త్రంబులతో మహోగ్రఘనకోదండేషు విస్ఫార భా
సుర పూర్వాపరభాగ వైభవముతో సొంపారు నీ రూపముల్
నర నారాయణ నామధేయములు వర్ణ్యంబుల్ జగన్మంగళా!

"భూత భవద్భవిష్యచరు భూతసమృద్ధుల నొప్పు నీ సమ
గ్రతత దివ్యరూపముల నన్నిటి నిట్టి దినానెఱుంగ సం
ప్రీతి నుతింప శక్తుడె విరించియు గే:లభక్తియుక్తులం
గా తరులన్ గృపా గరిమ గావుము మమ్మఖిలాంధ నాయకా!"

మూడవనాటి రాత్రి ఎర్రయ సుఖనిద్ర పోయెను తెల్లవారబోవుచున్నది. బ్రహ్మముహూర్త మట్లున్నవి. అతడు ఎవరో తన్ను దీనముగా పిలుచుచున్నట్లు తోచి ఉలికిపడిలేచెను. ఎవరోకాదు, అది స్పష్టముగా తన ప్రియ పత్ని దీనారవము కృష్ణవేణీ మధ్యముననుండి అది వచ్చుచున్నట్లు స్పష్టముగా తోచినది. వెంటనే యాతడులేచి ఈవలకు వచ్చి చూచెను. ఆ గుట్టపై నుండి చూడగా క్రింద నదీప్రవాహములో దిగుపకు ఆరునౌకలు వెళ్లుచు కనిపించినవి. అవి యన్నియు ఎత్తిన తెరచాపతో సముద్రముఖముగా వడివడి నేగుచున్నవి. అందులో పెద్ద నౌకనుండియే మహాలక్ష్మి పిలుపు వచ్చుచున్నట్లు తోచినది. ఆ నౌక లెవరివి?

ఆ నౌకలు దరియుచున్నంతనే, నది రెండు తీరములనున్న జనులు నిద్రలలోనుండి లేచినవారు కొలదిమందియే యైనను. అందరు నలజడినందుచుండిరి రేవు పడవ నడపువారు ఒదిగియుండిరి. అవి యవనసైనికుల నౌకలుగా ఎర్రయకు స్ఫురించెను. "అయ్యో! ఆతడు వెంటనే శ్రీస్వామికి నమస్కరించి సెలవుగైకొని గుట్టదిగి నదీతీరమ్మును సమీపించెను. ఆవల నౌకలు పోవుచుండగా అందులో తన ప్రాణముకూడ ప్రయాణము చేయుచున్నట్లే ఆతనికి తోచినది. వెర్రివానివలె వారివెంట ఒడ్డువెంబడి పరువెత్తవలెనని ప్రయత్నించెను. కాని అతనికది సాధ్యపడలేదు.

జాము ప్రొద్దెక్కినది. అప్పటికి ఆ పడవలు దూరమగుటచే రేవుపడవ నడపువారు తాము దాగియున్న మలుపులనుండి బయటికి పడవలుతీసి యాడింప

సాగిరి. ఆవలికి పడవ తీసికొనిపోవుచు పల్లెకారులు సమీపమున నున్న ఎర్ర యను చూచి "బాబా! పడవయెక్కెదవా!" అని అడిగిరి. ఎర్రయ పడవయెక్కి ఆ:లితీరమును చేరికొనెను.

ఆవలితీరము వెంబడి నదీప్రవాహము ననుసరించి ఆతడు కొంత దవ్వు రిగెను. వాయుబలముచే నౌకలు చూపుమేర దాటిపోయినవి. ఆ పైపుననుండి ప్రియపత్ని పిలుచుచున్నట్లే ఆతనికి భాసించెను.

ఆ పిమ్మట అవసరము కలిగినప్పుడు కొంచెము చుట్టుమార్గమున పోయి నను, మరల తీరమునే అనుసరించుచు. మిట్టపల్లముల నేలపై నడచుట కను వుగా వంచి చిక్కనిపాలకర్ర బుడిపెలతో మొత్తము మీద నదీతీరమును వద లక ఆతడు ప్రయాణము సాగించెను. నున్నదారిని పూని నడక మొదలుపెట్టి నాడు. అలసినప్పుడు ప్రక్కనున్న గ్రామాలలో విశ్రమించు చుండెను.

అమరావతి వచ్చినది. బహుకాలమునుండి ప్రసిద్ధి వినియున్నను అమ రేశ్వరునికి రుద్రాభిషేక మైనను చేయుటకు ఇచ్ఛలేక నమస్కారమాత్రముతో నెలవు తీసికొని పయన మయ్యెను.

వైకుంఠపురము కొండ వచ్చినది, ఆకొండ యెక్కి శ్రీ వెంకటేశ్వరుని దర్శించుటకు ఆతనికి తీరికలే దనిపించినది. అక్కడ దిగువనున్న వేంకటేశ్వ రుని సేవతో తృప్తిపడెను. ఆ కొండ నంటి ప్రదక్షిణించి ఉత్తర వాహినియైన కృష్ణవేణికి నమస్కరించి దారిసాగెను. అక్కడ మనోజ్ఞమగు ప్రకృతిదృశ్య మైనను ఆతనిని అక్కడ ఎక్కువ తడవు నిలువనీయలేదు.

శ్రీ విశ్వేశ్వర శంభురేశికులకు అగ్రహారముగా నొసగిన మందడ గ్రామములో ఒకరాత్రిమాత్ర మాతడు విశ్రమించి సీతానగరము చేరెను ప్రక్క నున్న ఉండవల్లిలోని రంగనాయక స్వామికి నమస్కరించి, ఎదురుగా ఆవలి యొడ్డున కనకదుర్గయు శ్రీ మల్లికార్జున స్వామియు వెలసిన దుర్గ కొండకు భక్తితో నమస్కరించి నాగిపోయను,

దారిలో ఇంక నెన్నియో గ్రామములు తగిలినవి. ఆ గ్రామములలో మనుష్యులు కొంచెము కొంచెమే చేరుకొను చుండిరి. వారికి గల సామగ్రి కొంచెమే అయినను అతిథిపూజ భారముగా భావించు మనోవైఖరి వారెరుగని దగుటచే దాపొడవునను ఎర్రయకు గౌరవాదరములతో ఆహార విశ్రాంతులకు కొదువ లేకుండెను.

కొల్లూరు నాతడు చేరికొనెను. అది యంతకు పూర్వము పెద్ద యగ్రహా రము. అందలి బ్రాహ్మణ కుటుంబములు తురుష్కుల ఒత్తిడికి చెల్లాచెదరై పో యెను. గ్రామములోని యిండ్లు భస్మీపటలములై యుండెను. అయినను పాడు వడిపోయిన ఆ మహాగ్రహారము నడుమ నడుమ ఇప్పుడు కొన్ని పూరియిండ్లు వెలసినవి. అందుండి వేదనాదము శ్రావ్యముగా వినిపించి ఎర్రయ నెంతయు నాకర్షించినది. ఆవల ప్రియపత్ని పిలుపు వినిపించుచున్నను నిగ్రహించుకొని మూడురాత్రులు మూడుపగళ్లు నాత డాగ్రామములో నిలిచిపోయెను. అక్కడ నుండగా ఆ వెళ్ళిన యవన నౌకల సమాచారమును తెలిసినది. ఆ నౌకలలో తురుష్కబలములు మోటుపల్లి వెళ్ళుచున్నవి ఒక నౌకనుండి పమనారేండ్ల బ్రాహ్మణసువాసిని అంటకట్టిన కేశపాశముతో అశోకవనమందలి సీతామహాదేవి వలెనే కన్పించినదని చూచినవా రొకరు చెప్పిరి. ఎర్రయను ఆతనిని ఎక్కు వగా ప్రశ్నించుటకు ధైర్యముచాలలేదు. ఆమె తన ప్రియపత్నియే అను భావము మరింత ధ్రువపడినది. ఆ విన్నది అక్కడ నాతడున్న మూడవనాటి రాత్రివేళ ఆ మరునాటి వేకువనే ఆతడు ధనుర్ముక్తశరము వలె తీరమువెంబడి నావికులు పడవలు లాగుటచే నేర్పడిన మార్గమున పురోగమించెను.

పాపిష్ఠుల పాపములు క్షాళనముచేసి నీలాంబరములు వెల్లచేసిన వెల్ల టూరు తీరములో నాతడు మునకలిడలేదు శ్రీ రామనరేంద్రునిచే ప్రతిష్ఠతుడైన వ్యాఘ్రేశ్వరస్వామిని పెదపులి వర్రులో నమస్కారమాత్రము ననే అర్చించి కడచి పోయెను.

రుద్రవరములోని రుద్రుని, మునుల తోటలోని ముక్తేశ్వరస్వామిని దర్శించి నమస్కరించి, చోడేశ్వరస్వామికి మ్రొక్కి, రెండు దినములలో ఆతడు కృష్ణవేణీసాగర సంగమమును సమీపించెను. ప్రొద్దు బాగుగా వాట వాలినది.

దూరమున నెన్నియో నౌకలు కానవచ్చెను. అందులో తాను వేదాద్రిలో చూచిన యవననౌకలలో నొకదానిని మాత్రము ఎర్రయ గుర్తించెను.

కొల్లూరునుండి బయలుదేరి నప్పటినుండియు ఎర్రయ ఆంతర శ్రోతము నకు మహాలక్ష్మి తన్నుదీనముగా పిలుచుచున్న పిలుపు వినబడుచుండెను. అది కురరి ఆక్రోశమువలెనే ఒక్కొక్కప్పుడు వినిపించును మరికొన్ని వేళల నది

నిస్సారమై యూర్పువలె నడచుచు వినిపించును. అది కొంతకాలమునుండి దూరిదూరమై అంతకంత కస్పష్టముగా వినిపింప సాగెను.

కాని నిన్నటి యుదయము నుండియు అది సమీపించుచున్నట్లు వినిపింపసాగినది. అది యొకసారి ఎన్నడును లేనంత దీనముగా భయ విహ్వలముగా కెవ్వుమన్నట్లు మూడు జాములవేళ ఎర్రయకు వినిపించినది. ఆతని హృదయము పిడుగు పడినట్లు అడచుకొని పోయినది. గడియపాటు ఆతడు నిశ్చేష్టుడై కాలు సాగక నిలిచిపోయి యుండెను. అంతలో నాతనికి మహాలక్ష్మి సంతుష్టి సూచకముగా తేరుకొని నిట్టూర్చినట్లు తోచి ఆతడు మరల ప్రకృతినంది ప్రయాణము సాగించియుండెను. నిన్నటి అపరాహ్ణమున ఆ నిట్టూర్పు వినిపించినప్పటి నుండియు మహాలక్ష్మి వార్తయే ఆతని శ్రుతి కగోచరముగా నున్నది. అప్పటినుండియు ఇంతవరకు కృష్ణానది జాలు అతనిని ముందుకు తీసికొని పోవుచున్నది. ఇప్పుడు మహాలక్ష్మి గజగజ లాడుచు భయముతో వగర్చుచు నున్నట్లు వినిపించినది. స్పష్టముగా ఆవల యవనుల నౌకగా ఎర్రయ గుర్తించిన నౌకనుండియే తన్ను ధ్యానించుచు నిట్టూర్పుతో పిలుచుచున్నట్లే ఆతనికి వినిపించినది. ఎర్రయకు తత్తరముతోపాటు ప్రియపత్నిని సమీపించుచున్నందులకు ఆనందముతో కూడిన ఆ వేగము కలిగి పరుగు పరుగున ఆ నౌక యున్నవైపు వెళ్ళినాడు. ఆనౌక యొడ్డునకు కట్టివేసి యున్నది. ఆవల మరికొన్ని నౌకలును అట్లే కట్టివేసి యున్నవి.

ఆనౌక నాతడు సమీపించుచుండగా దానిముందు కొంచె మలజడి యగుచున్నట్లు తోచినది. అంతలో నిద్దరు పోరుచున్నట్లు తోచినది. ఇంకను సమీపింపగా ఇద్దరు ఖడ్గయుద్ధము మహారోషముతో చేయుచున్నట్లు కనిపించినది. ఎర్రయ నిర్భయముగా తన పాలకర్ర దిటవుగా బూని అటువైపు పోయినాడు.

అక్కడ బడేసాహబుతో పంటరెడ్డి ఖడ్గయుద్ధము చేయుచున్నాడు. వారి యుద్ధము భయంకరముగా నున్నది.

బడేసాహబు బలశాలి దృఢగాత్రుడు. అతడు ఖడ్గ యుద్ధములో సిద్ధహస్తుడు.

పంటరెడ్డి యిప్పుడు పూర్వపు పంటరెడ్డి కాడు. అతని కిప్పుడు ఖడ్గ విద్య కరతలామలక మైనది. ఆతడు సాహబు కంటె మిక్కిలి పొడుగరి.

ఆతని దేహమును కాలసర్పమువలె జవ జవ లాడుచు ఒడుపు గలది. అతడు కోడె వయస్సువా డగుటచే ఆతని ముందు సాహబు బలము పనికి వచ్చుట లేదు.

ఎన్నియో నెలల క్రిందట కత్తి పట్టుట చేతకాక కొడవలి వలె ఆడించిన యీ యువకుని తాను చూచినసంగతి సాహబుకు గుర్తువచ్చినది. ఈనాడు ఆత డిట్లు చాతుర్యముతో తలపడుట ఆతని కాశ్చర్యము కలిగించినది. తా నాదెబ్బ లకు తట్టు కొన లేకున్నాడు. తన యశక్తత తనకే వింతగా నున్నది. తనకు ఓటమి వచ్చు చున్నకొలదియు నాతనికి క్రోధ మెక్కు వగుచున్నది. క్రోధము హెచ్చినకొలదియు నిబ్బరము తగ్గి తడ బాటు అతిశయించు చున్నది. అత డాక్రాంతుడైనాడు. ఆతని తల తెగవేయుటకును, రొమ్ము పొడిచివేయుటకును యధేచ్ఛగా దేహమున నెచ్చటనైనను గాయపరచుటకును పంటరెడ్డికి మరల మరల నవకాశములు వచ్చినవి. ఏలనోగాని ఆతడా యవకాశములను వదలివేసి నాడు. అది కనిపెట్టి సాహబు ప్రాణమువకు తెగించి మోటుగా పంటను కొట్టు టను కత్తితో బాహు వెత్తినాడు.

అట్టి దానికే పంట యెదురు చూచు చున్నట్లున్నాడు; ఒక్కమ్మడి సాహబు చేతిలోని ఖడ్గము విరిగి తుత్తునియలై దూరమున పడిపోవునట్లు అతడు వ్రేటు వేసినాడు. సాహబు చేతికి గూడా గాయము కాకుండ పంట మెలకువగా ఆ పని నిర్వర్తించినాడు. అయినను ఆతడు చూపిన నిగ్రహమును గ్రహించు స్థితిలో సాహబు లేడు. ఆతడు నిర్లక్ష్యముగా పంట పైకి కుప్పించెను.

చిత్రముగా పంట తనచేతిలోని కత్తి యావల పారవైచి సాహబుతో కలియ బడెను. బాహాయుద్ధములో గూడ పంటకు సాహబు చాలుట లేదు.

గాలివాన వలె సివ్వక్క మాటలు వినిపించినవి; ఆమె పడవలో మహా లక్ష్మిని వదలి పరుగు పరుగున ఒడ్డుకి వచ్చినది.

"ఓరి పడి చచ్చిన వాడా; సాహబు తోనే పోట్లాడు చున్నావటరా, ఇన్నా ళ్ళకు నా కంటబడి!"

చిత్ర మైన ప్రకృతి గల తనతల్లి కంఠము ఇన్నాళ్ళకు మొదటిసారి విన బడగానే పంటరెడ్డి చప్పున వెనుదిరిగి చూచెను. ఆ యొక్క క్షణములో సాహ బుకు మంచి యవకాశము దొరికినది. వెంటనే ఆతడు పంటను వెల్లకిల పడ వైచి మీది కెక్కి ముఖము పొడుచుచు ఇచ్చ వచ్చినట్లు కొట్టుచున్నాడు.

సివ్వక్క సాహబును లాగి వేయుటకు ప్రయత్నించు చుండెను. ఆమె యాతని చీవాట్లుకూడా పెట్టుచున్నది. అతడేమియు లెక్కచేయుటలేదు. సరిగా నప్పుడు ఎర్రయ అక్కడికి చేరినాడు.

సివ్వక్కకు ఎర్రయను చూడగనే, ప్రాణము లేచివచ్చి నట్లై, 'ఆడుగోరా, చచ్చిన వాడా! ఎర్రయబాబు వచ్చినాడురా,!' అన్నది. నచ్చినదే తడవుగా ఎర్రయ తన చేతిలోని పాలకర్రతో సాహబు రెండుచేతుల మీద చాచి కొట్టినాడు. నిర్భ్రాంతితో ఆతడు పంటను వదలి చివ్వున లేచి పంట పారవేసిన ఖడ్గము అందుకొన బోవుచున్నాడు.

"బ్రహ్మ దండముపై ఈ కత్తులు పనిచేయు ననియేనా?"

ఆ యన్నది మల్లారెడ్డి. అతని కాలు దృఢముగా ఆ కత్తిపై నూని యున్నది. అతడు తన యన్న యగు బడేసాహబువంక సూటిగా చూడ నైన చూడకయే ఆమాట లనెను. ఆ పడవలో నున్న మహాలక్ష్మిని మరల హరించుటకే వచ్చుటచే అక్కడ కాపున్న పంటతో పోరు కలిగెనని ఆత డూహించెను. అట్టి పాపిష్ఠి యన్నతో మాట్లాడుటకైనను ఇచ్చలేక యనుచరు లకు కనుసన్న చేసినాడు. వారు బడేసాహబును దృఢముగా బంధించి యావల నింకొక నౌకలోనికి తీసికొని పోయిరి.

ఎర్రయ కట్టివేసియున్న ఆ పడవలోనికే యెక్కుటకు రెండడుగులు ముందుకు వేసినాడు. అప్పటికి శాంతుడైన మల్లారెడ్డి చిరు నవ్వుతో అడ్డము వచ్చి, "ఎర్రయా! నా మీద కోపము పోయినదా? నామాట ఇప్పటికి నిల బెట్టు కొన గల్గినాను. నన్ను క్షమించితి ననుఁ!"

ఎర్రయ అమాంతముగా మల్లారెడ్డిని గాఢముగా కౌగిలించుకొని, ఆతని సర్వాంగములను తన కన్నీటి ధారలతో కడిగి వేసినాడు, మల్లారెడ్డి దేహము రోమాంచముతో జలదరించినది.

51

బొల్లన యే మయ్యెను? ఆతడు వశిష్ఠగోదావరీ మహాప్రవాహములో నదృశ్యు డయ్యెనే? ఆతనికి ప్రమాదము సంభవించినదా?

లేదు. ఎక్కు డనైనను తల్లి యొడిలో తలదూర్చినవానికి ఆపదవచ్చునా? గోదావరి బొల్లన మాత. ఆమె యొడిలోపుట్టి పెరిగి, ఆమె యొడిలో నాతడన్ని యాటల నాడు కొని యుండెను. నిత్యము నాతల్లి పవిత్రవారియందే ఆతడు స్నానమాచరించి నిత్య శుచి యగుచుండెను. ఆ తల్లి జలముతోడనే ఆతని దాహము తీరుచుండెను. ఆతల్లి ప్రసాదించిన మృత్తికలో ఆతల్లి తడిపి పండించిన ధాన్యముచేతనే ఆతని దేహము పరిపుష్టమై నిరవరోధముగా ప్రకాశించుచున్నది అట్టి గోదావరి గర్భమున బొల్లన కేమి భయము? ఆత డవలీలగా ఆవలితీరమునకు ఈదుకొని పోయి యుండెను.

తీరము చేరినవెంటనే ఆతడు కర్తవ్య మాలోచింపసాగెను. మరల ఇల్లు చేరుకొనవలె ననునిచ్ఛ ఛాయామాత్రముగ నైన ఆతని కుదయింపలేదు. వెంటనే ఆవలి యొడ్డునకు పోయి తాను చేయగలిగినదియు కనిపింపలేదు. ఏమి చేయుట? ఆతని కేమియు పాలు పోలేదు. అత డక్కడనే కొంతతడవు నిలిచి యుండెను.

దొడ్డి పట్ల అగ్రహారాగ్రణి అన్నయ్య ఆతని యెదుట నిలిచెను. ఆతడు దూరమున నుండి బొల్లన ఈదుకొని వచ్చుట ఉపలక్షించినాడు. ఆతనిని ప్రాణములతో చూడగలిగినందుకు అద్భుతానందము లాతని నావహించినవి. ఎక్కువ మాటాడక ఆతడు బొల్లనను ఆ సమీపముననే యున్న తన విడిదికి తీసికొని పోయి తనతోపాటు కుడువ బెట్టినాడు.

బొల్లన విశ్రమించి లేచినపిమ్మట ఏదో మాటాడదలచిన వాని వలె అన్నయ్య బొల్లనను సమీపించెను.

"అన్న యార్యా! మనమందరము ఈ యవనుల ఆగడము చూచుచు సహింపవలసినదేనా?"

'అది ప్రస్తావించుటకే వేచియున్నా'నని అన్నయ్య ప్రత్యుత్తర మిచ్చెను.

అన్నయ్య క్రిందటి రాత్రి తన తల్లిని గోదావరి దాటించి తన యత్తవారింటికి చేర్చి, వెంటనే బయలుదేరి పోయి ఆ తీరమునకు యవన భటులను రానీయకుండ తన భటులను కాపుంచిన ప్రోలానీని కలిసికొని దొడ్డిపట్లలో జరిగిన విషయములు వివరించెను. ప్రోలానీడు వెంటనే కదలి మరి కొంత సేనను దొడ్డిపట్లకు ఆవలి తీరమున నిలిపి, తానే అక్కడ స్వయముగా నావలనుండి తురకసేనను రానీయకుండ కనిపెట్టి యుండెను. అన్నయ్య బొల్లనను వెంట బెట్టుకొని, దారిలో బొల్లన యనుభవములు వినుచు, ప్రోలానీని విడిదికి పోయెను. బొల్లన అల్లావదీను నిజనామాదికమును మాత్రము బయటపెట్టుటకు సిగ్గుపడుచు అదిమాత్రము అన్నయకు చెప్పక దాచెను.

వారిద్దరును వచ్చినట్లు తెలిసినంతనే ప్రోలానీడు తానున్న కుటీరము వదలి యెదురు నడిచి నమస్కరించి సగౌరవముగా లోనికి తీసికొని పోయి యుచితాసనమున గూర్చుండ జేసి వారిచే ననుజ్ఞాతుడై పిమ్మట తానును గూర్చుండి మంతనము లారంభించెను.

"బాబులారా! పెద్దయెత్తున వచ్చినచో ఏమో చెప్పలేను గాని తురకల చిల్లర సైన్యములను గోదావరి దాటకుండ తగిన కాపు పెట్టినాను. కాని ఇది చాలదు. గోదావరికి పడమర నున్న భూములను కూడ మనము కాపాడ వలసి యున్నది. అక్కడి అగ్రహారములలోని పెద్దలను కూడగట్టుకొని ధనము సేకరించి ధైర్యము చెప్పుచు యవనులను ప్రతిగ్రామములోను ప్రతిఘటించుటకు ప్రయత్నములు చేయవలసి యున్నది. ఆ పనికి నేను కొలదిమంది భటులను మాత్రమే పంపగలను. అయిదు వందలమందిని కంటె పంపలేను. మీబోంట్లు అక్కడి పెద్ద చిన్నలతో ఆలోచించి ధనసహాయమును మనుష్య సహాయమును సమకూర్చవలెను. నేను పంపెడివారు మిక్కిలి విశ్వాసపాత్రులైయుండగలరు. వారికి నాయకుడుగా మా కాపయయే ఉండును!"

ప్రోలానీని మాటలు వారిద్దరికి ఆనందము కలిగించినవి. ఎవరికి వారు అట్టిదానినే అభిలషించుచుండిరి. ప్రొద్దుపోవువరకు ఆ రాత్రి; ఏయే అగ్రహారములు తమ కనుకూలించునో, ముందు తమ కార్యము ఎక్కడ ప్రారంభింపవలెనో, ఇత్యాది విషయము లన్నియు వారు నిర్ధారించు కొనిరి. అన్నయ్యకు ఆ

భాగమున గల విద్వదగ్రగణ్యులు అందరును తెలిసినవారు. ఆతడు స్వయముగా వేదాధ్యయనము పూర్తిగావించి. శిక్షానిరుక్తములు క్షోద క్షమముగా నధ్యయన మొనర్చి జైమినీయధర్మ మీ మాంసలో నిష్ణాతుడై యుండెను. అతడు ముఖ్యముగా సహాయులుగా నుందురని పరిగణించినవారు అనేక యజ్ఞములొనర్చిన సోమ పీథులు, శ్రౌతస్మార్త విశారదులు, బ్రహ్మణ్యులు నగు పరమశాంత మూర్తులే!

ఆ మరునాటి యుదయమే వారిరువురును నిర్ణీతప్రకారము వశిష్ఠగోదావరి తరించిరి. వారికి దూచూపుచు శ్రీరామచంద్రుడు జనార్దన స్వరూపమున హృదయస్థుడై యుండుటచే ఎట్టిజంకులు కలుగలేదు. ప్రోలానీడు పంపిన భటులు కూడ వేరువేరు రేవుల గోదావరి తరించిరి.

వారి ప్రయత్నము ఏమాత్రము కష్టసాధ్యముగా లేదు. వా రెక్కడికి వెళ్ళినను ఎంతటి సాహసమునకైనను సిద్ధమయినవారే ప్రత్యక్ష మగుచుండిరి. అగ్ర హారాగ్రణులును తమకు మిగిలియున్న సర్వస్వమును వారి కర్పించుచు తమ చుట్టునున్న పూండ్లలోని కాపులను శస్త్ర ధారణకు ప్రోత్సహించుచు తాము కూడ స్వయముగా రణోద్యోగమును సంసిద్ధు లగుచుండిరి. బొల్లనకు అన్న యకు చెప్పరాని ఆనందము కలుగుచున్నది. వరాహనృసింహమూర్తియే తమ్మీ ఆపదుద్ధరణ కార్యమునకు పురికొల్పుచు తమ్మావేశించి యున్నట్లు తోచుచున్నది. యవనులు చేసిన దుశ్చర్యలవలన ఆ భూభాగ మంతయును గగ్గోలు పడి యున్నది. అక్కడి జనులకు ఆ కారణముచే నెన్నడు లేని తెగువ ఆవేశించినది.

ప్రతి గ్రామమునను వీరభట కూటములు నెలయుచున్నవి. వారికి కత్తులు, బరిసెలు, విండ్లు, అంబులు ఏ గ్రామమున కాగ్రామమునందే కమ్మరులు. వడ్రంగులు, మేదరులు సిద్ధము చేయుచున్నారు ఏయూరి కాయూరి యందే నాయకులును స్వతస్సిద్ధముగా నిర్ణీతు లగుచుండిరి. అందులో స్పర్ధలు లేవు. కొన్నిగ్రామములు కలసి మరల సేనాసంఘములుగా వెలయుచున్నవి. ఎక్కడ యవనులు కాలుపెట్టినను వారి నక్కడనే క్షణకాలముకూడ నిలువనీయక నరకి వేయుచున్నారు. ప్రోలానీడు పంపిన యాతని సోదర పుత్రుడగు కాపయ నాయకుడే ఆ సేనాసమూహముల కన్నిటికి నాయకత్వము వహించెను. ఆతనికి బొల్లనయు అన్నయయు మంత్రీశ్వరులు. ఆచార్యులు. అధినేతలు.

ఇట్టి యాపదలు వచ్చినప్పుడు ప్రతిఘటించుటకై రామదండు సాగించుట దేశాచారము. అది భక్తితో కలసిన వీరావేశము. గ్రామములోని వృద్ధులు దీపపు స్తంభము తీసికొని భజన చేయుచు బయలుదేరుదురు. గ్రామములోని పడుచు వారు ఒకచేత కత్తి ఒకచేత చిరుతలు తీసికుని భజనలో కలియుదురు. వారట్లు గ్రామమంతట రామభజన చేయుచు తిరిగి తిరిగి ప్రక్కనున్న యూరికి పోదురు. రామదండు వచ్చినదని ఆ యూరివా రాదరముతో నెదుర్కొని వారి నాదరింతురు. మరునాటి రాత్రికి అక్కడి యుత్సాహపరులు రామదండులో చేరుదురు. వా రందరు కలసి రామదండు దీపస్తంభమును మరియొక యూరికి చేర్తురు.

ఇట్టి రామదండు జట్లు పెద్దపెద్ద గ్రామములలో వెలసి చుట్టుపట్టుల గ్రామములకు నిత్యసంచారము లొనర్చుచున్నవి. రామదండు వచ్చుచున్నదన గానే ఊరివారికి ధైర్యము సాహసము నుప్పొంగును. శ్రీరామరక్ష ప్రాప్తించిన దను విశ్వాసము గ్రామస్థుల కుదయించును. రామదండును చూచిన యవనులు భయముతో పారిపోవు చుండిరి.

ఈ రామదండు జట్లుకూడ కాపానికి తోడుపడుచు, అతని యనుచరుల మంతనముల పాలించుచుండెను. రామసేనలో వలెనే అందరకు ఏకవాక్యతయే కాని భిన్నపదములు లేకుండెను.

మహోల్బణము పొంగినట్లే కృష్ణా గోదావరీ మహానదులు మధ్యప్రదేశ మంతయు వీరోత్సాహముతో వెల్లివిరియుచున్నది. చీలికలై చెల్లాచెదరైయున్న యవనభటు లందరు కూడగట్టుకొని వెనుదిరిగి చూచుటకును సాహసింపక పారిపోయి మోసలపురము చేరికొనుచుండిరి. అట్లు పారిపోయెడి వారిని చిక్కిన చోట్లలెల్ల కాపయనాయకుని భటులు మట్టుపెట్టుచుండిరి. ఆ విషయములో ప్రైగ్గడలగు బొల్లనయు అన్నయయు ఎట్టి దయాదాక్షిణ్యమును ఉపదేశించుట లేదు, వారు మాటిమాటికిని ఉపదేశించునది గీతావాక్యములే!

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

ఇట్టి మహాయుద్ధము ధర్మసంస్థాపనార్థమే సంప్రాప్తమైనది. ఇట్టిది పవిత్రమగు యుద్ధయజ్ఞము ఇందులో పాల్గొనినవీరులు ఏపాటైనను ధన్యులు.

"హతోవా ప్రాప్యసే స్వర్గం, జిత్వావా భోక్ష్యసే మహీమ్"

ఇట్టి వాక్యములతో మాటలతో వర్ణింపరాని తెగువ కాపయభటులకు పుట్టుచున్నది. ఎక్కడనైనను కొలదిమంది పెక్కురను ఎదుర్కొనవలసి వచ్చినను ఆతని భటులు వెనుకంజ వేయరు. కంచు కోటవలె శ్రీరామనామము వారికి ధైర్యమొసగి కాపాడుచు శత్రువిజయము చేకూర్చుచున్నది. పది దినములలో "ఊహింపలేనంత శీఘ్రముగా కృష్ణా గోదావరీ మధ్యప్రదేశము మోసలపుర దుర్గమునప్ప సమస్తము కాపయసేన లాక్రమించినవి కొల్లేటి ద్వీపములలోను, తీరములలోను, సాగరానూపభూములందును, చిట్టడవులందును తలదాచుకొని యున్న గ్రామీణులందరు ఎవరిగ్రామములకు వారు చేరికొని పాడు పడిన తమ యిళ్ళు వాకిళ్ళు బాగుచేసి కొన సాగిరి. ఆహారపదార్థములు మాత్రము మిక్కిలి కొదువగా నున్నవి.

గోదావరీశాఖలపై పడవ లాడించు పల్లెజను లందరు తమ తమ నావ లను దాచియుంచిన రెల్లు పొదలనుండియు, గట్టులనుండియు, బైటకు దీసి ఆడింపసాగిరి, ఉభయ గోదావరీ పరివేష్టిత దేశములనుండి ఆహారపదార్థములు నెమ్మదిగా గ్రామీణులకు అందుచున్నవి. అవి మహాయజ్ఞ కార్యమునకు శ్రీరామ కార్యమునకు వలెనే ఉచితముగా కొనిరాబడుచున్నవి. పల్లెకారులు రేయింబవళ్ళు విరామము లేకుండ పడవ లాడించుచు, అవసర వస్తువు లన్నియు అందించు చుండిరి. బండ్లును అట్లే సాగుచున్నవి.

పర్జన్యుడు కూడ కనికరించినాడు. గ్రామీణులు గ్రామముల లోనికి తిరిగి వచ్చిన కొలది కాలమునకే చల్లని జల్లులు పడినవి. నేల బీజావాపమునకు పదను అయినది. శీఘ్రముగా వచ్చు పంటలు కృషీవలు లెల్లకడల వేయుచుండిరి. వరిగ జొన్న పునాస పైరు బహుళముగను పొలములలో నెదపెట్టుచు, విరళముగా తమిద నాటుచున్నారు. జన సంచారము ఈ మధ్యకాలములో ఎక్కడి కక్కడ తగ్గి పోయినందున పొలములే బీళ్లుగా మారి పచ్చిక పుష్కలముగా పెరిగి యుండుటచే పశుగ్రాసమునకు వెదకికొనవలసిన అవసరము లేకుండెను. పశువు లను కొండలలో అడవులలో ఆనూప భూములలో దాగియున్న, వన్నియు తిరిగి గ్రామములకు చేరుకొనుచున్నవి. జనములకును పసరములకును రాత్రి విడిచి సూర్యోదయ మైనట్లే మైకము వదలి తెలివి వచ్చినట్లై ప్రకాశించుచుండెను.

బొల్లనము అన్నయ్యయు రేయింబవళ్లు ఏ అయిదారు గడియలోకాని నిద్రయే లేక నిరంతరసంచార మొనర్చుచున్నారు. వారు ముప్పూటలను సంధ్యా

వందనముమాత్ర మొనర్తురు. మధ్యాహ్నవేళ క్లృప్త సరిగా బ్రహ్మయజ్ఞము దేవర్షి పితృతర్పణలును చేయుచున్నారు. వారి భోజన మొకపూటయే! ఇట్లు నిద్రతో కలసి నిత్యకర్మలకు అన్నిటికిని పదిగడియలు పోను తక్కిన యేబది గడియలును వారు దేశోద్ధరణకే ధర్మోద్ధరణకే వినియోగించుచున్నారు. వారు రోజునకు ఎన్ని గ్రామములు తిరుగుచున్నారో లెక్కింప సలవిగాదు! ఎన్ని సంకేత ప్రదేశములు చేరుచున్నారో చెప్ప శక్యముగాదు. ఎక్కడ ఎవరికి కర్తవ్య విషయమున సందేహము జనించినను అప్పటికప్పుడే వారిలో నొకరక్కడ ప్రత్యక్షమై సందేహ నివృత్తికి సాహాయ్య మొనర్చుచుండిరి. వారితోపాటు విద్వాంసులును మరి యెందరో అదే విధముగా నిత్యసంచార మొనర్చుచుండిరి.

తమ నిత్య కర్మలలో నిమగ్నులై ఎన్నడో గాని తమ గృహములు వదలిపోక యుండెడి భూసురవర్యులే యిట్లు కార్యవ్యగ్రులై ద్రిమ్మరుచుండ, తక్కిన జనులు వారి ననుకరించుచు వారితోపాటు ఉత్సాహముతో తిరుగాడుచు తోడుపడుచుండిరి. దేశమంతటను దీనార టంకములు వ్యాప్తి చెంది ముసల్మానుల పరిపాలనమునకును, వర్తకమునకును, ఇచ్చి పుచ్చుకొనుటకును, ఉపయోగములోనుండెను. దాని నరికట్టుటకు వైశ్యులు తమవద్దనున్న దీనారముల నన్నిటిని కరిగించియు నిలువచేసియు చలామణీ కాకుండ స్తంభింపజేసిరి. ఒక వంక వ్యవసాయమును, ఇతరవృత్తులు చేయుచునే పడుచువారు కాలరుల వద్దకేగి విరివిగా భటులుగా చేరుచుండిరి.

మోసలపురము స్థల జలదుర్గము. దానికి రెండువైపుల సముద్రమున్నది. రెండువైపుల భూమి యున్నది. అక్కడ సముద్ర మప్పుడు మిక్కిలి లోతుగానుండెను. పెద్దపెద్ద నౌకలుగూడ తీర భూమికి సమీపమున నిల్చి పదార్థములు మోసలపురము కోట చేర్పగల్గుచుండెను. భూమి యున్నవైపున కోట గోడలు మిక్కిలి బలిష్ఠములై సముద్రపు నీరు నిరంతరము పారుచున్న పరిఖతో దుర్భేధ్యముగా నున్నది. అందుచే ఆకోట ఎక్కువ నైపుణ్యమును సాధనసామగ్రియు లేనిదే పట్టుకొనుట అసాధ్యము. అదియు బహుకాలమునకు గానివీలుకాదు.

అట్టి దుస్తర కార్యమును వెంటనే సాధించుటకే బొల్లనయు అన్నయయు నిశ్చయించిరి. కాహనీడు వారితో నేకీభవించి అవసరమైనచో భటుల దేహము

లతో పరిఖ పూడ్చి వేసి గోడలకు దిమ్మెల వలె పేర్పించుటకైనను ఆతడు సిద్ధ పడెను. భటులు ఈ మహాయజ్ఞమునకు యజ్ఞపశువుల వలె ఎవరికి వారు తమ దేహములనే అర్పించుటకు సిద్ధపడుచు మేము మేమని వంతులు పడుచుండిరి. రామదండు జట్లు హుమ్మని అగడ్తలో దూకుటకు ఆర్భాటించుండెను.

ఏకాంతముగా బొల్లనయు అన్నయయు కాపానీనికో సంప్రదించిరి. అట్లు జనసమూహములను బలియిచ్చుట వారి కిష్టములేదు. అయినను అది ప్రకటింపక అట్టి కార్యమునకు భటులు ఉన్ముఖులగునట్లే చేయ నిశ్చయించిరి. ఈ యుపాయముచే తమ సేనలలో ఉత్సాహ మతిశయించును. తురక సేనలలో అధైర్య మావహించును. వా రనుకొన్నట్లే సర్వము జరిగిపోవుచున్నది.

ఒకనాటి అర్ధరాత్రమున గాలి దక్షిణమునుండి ఉత్తరమునకు వీచు చున్నది. కోటకు దక్షిణమున క్రోశము దూరములో ఉప్పుటేరొకటి యున్నది. దానిలోనుండి సముద్రములోనికి అప్పుడెన్నియో పడవలు బయలుదేరినవి. ఆ పడవలలో మనుష్యులున్నవి అల్పసంఖ్యాకములే! పది పదునైదు పడవలు చెత్త చెదారములతో నిండియున్నవి. వానిని గాలికి వదలినచో సరాసరి గాలి పాటున మోసలపురం రేవులోనికి పోవుటకు వీలైన ప్రదేశమునకు వానిన న్నిటిని తీసికొని పోయినారు. వా రనుకొన్న లెక్కప్రకారము పోష్ణనో పోవో చూచుటకు ముందు ఒక పడవలోని చెత్తకు నిప్పు ముట్టించి వదలినారు. అది అనుకొన్న ప్రకారము పోక మండుచు ఒడ్డు చేరినది.

దానిలోపము నావికులు ఆలోచించినారు. దానిచుక్కాని పట్టువాడు లేక పోవుటచే తిరిగి పోయినది. సముద్రతరంగములు తమ తాకిడిచే ఒడ్డుకు దానిని కొట్టివేసినవి.

ఈమారు మోసలపురము రేవునకు కొంచెము తూర్పుగానుండు ప్రదేశమును లక్షించి చుక్కాని ఆ దిక్కుకు బిగించి, అగ్గి ముట్టించి మరియొక పడవను వదలినారు. ఈమా రది వా రనుకొన్న ప్రకారము సాగిపోయినది. సరిగా సున్నదని ధ్రువపరచుకొని అదే విధముగా వారు పది పడవలను వదలినారు. అగ్ని గోళములవలె అవి సముద్రములో శీఘ్రగతి ప్రయాణ మొనర్చి మోసల పురము రేవులో చేరుకొన్నవి. అక్కడ లంగరు వేసియున్న యవన నౌకలను అంటుకొన్నవి. ఇట్టిది జరుగునని యవన నావికులు ఊహించి యుండక పోవు

టచే, తమ మహానౌకలు ఈపనికిమాలిన పాతపడవల అగ్నికి తట్టుకొనుటకు ప్రతి క్రియ చేయలేకపోయిరి. అదిగాక దుర్గములోని భటులు శవముల రాసులతో కోటకు వంతెనలు కట్టనున్నారని ప్రబలిన వార్తలచే భయవిహ్వలులై యుండిరి. ఆరాత్రి అయిదు యవననౌకలు దగ్ధమై నిరుపయోగమైనవి. అందుచే యవన భటులలోను నావికులలోను అధైర్య మావేశించి చెప్పరాని అలజడి పుట్టినది.

కోట బయట కాపయ భటులును రామదండు జట్లును ఏక్షణమున కాక్షణము పరిఖలో దూకి తమదేహములతో పూడ్చి వేయుటకు సిద్ధముగా నున్నట్లు మహోత్సాహము చేయుచుండిరి. మరల సముద్రము వైపునుండి అగ్నియే వచ్చునో మఱియేమి వచ్చునో అను భయము యవనభటుల నావేశించెను. దానికే తగినట్లు కాపయ భటులు మధ్యమధ్య కోటలోనికి అగ్నిబాణములు వదలసాగిరి. అన్నిటికితోడు కోటలోని యవన నాయకులలోతలలు కూడుటలేదు ఎవరికి వారు తమ మాటయే నెగ్గవలెనని పట్టుపట్టుచు తక్కినవారు సమ్మతింప నిచో క్రోధము వహించి ఆజ్ఞలు నిర్వర్తింపకుండిరి. అగ్నినౌకలు రేవులోనికి వచ్చిన మూడు దినములలో యవనభటులు మోసలపుర స్థల జలదుర్గము వదలి, మిగిలి యున్న నౌకలలో ప్రాణరక్షణకై మోటుపల్లికి ప్రయాణ మైరి.

కాపయ తన భటులతో మోసల పురదుర్గము ప్రవేశించెను. అక్కడ నున్నత మైన ధ్వజస్తంభము మీద బొల్లనయు అన్నయయు ధర్మ వృషభ ధ్వజము నెత్తిరి. అది ఉత్సాహముతో గాలి కెగురులాడుచుండ కాపయ భటు లందరు పొంగుచున్న హృదయములతో 'జయ జయ' నినాదము లొనర్చుచు, నమస్కరించిరి. రామదండు జట్లన్నియు దీపస్తంభము ధ్వజస్తంభము చుట్టునూ నిల్చి తాండవ నృత్యముతో రామభజన చేసెను.

52

మోటుపల్లి చేరినప్పటినుండియు అలావదీనుకు తీరికయే లేకున్నది. అక్కడి స్థితిగతు లేమియు సరిగా లేవు. అది చూచిన కొలదియు ఆతనికి పిచ్చులు వెర్రు లెత్తుచున్నవి. అసలే అతడు కోపిష్ఠి. అందులో నిప్పటి పరిస్థితులు వెర్రి కోపమునే తెప్పించుచున్నవి. అసలే అతడు క్రూరుడు. ఇప్పుడు రాక్షసు డైనాడు.

మోటుపల్లి చుట్టుప్రక్కలనున్న ప్రజల నందరను ఆతడు పీడింపసాగెను. అందరకు నాతడు కంటకుడుగా నున్నాడు. ఆతని సరదారులకు ఆతని కాతిన్యము సమ్మతముగా లేదు. వారిలో పలువురు విద్వాంసులు. కొన్ని తరముల క్రిందట ఇస్లామమతము స్వీకరించి ఇన్ని తరములుగా దాని శాంతిసందేశమును అనుష్ఠించు చున్నవారు. వృద్ధులగు అట్టి ముసల్మానులు ఆతని క్రూరకృత్యములను మాన్పింప యత్నించుచుండిరి. అందుచే ఆత డట్టివారిని దగ్గర చేరనీయక కూటికి లేక నూతనముగా మతము పుచ్చుకొన్న హీనులను తన కాంతరంగికులుగా చేసికొన సాగెను. వారితో గలిసి ఆతడు వేడుకగా రాక్షస కార్యములు సాగించెను.

కాని కోశములో ధన మైపోయినది. ప్రజల నెంతబాధించినను వారివద్ద పిడుటకైన తడిలేదు. ధన ధాన్యము లాతడు పన్నుపేర దోపిడియే చేయించుచున్నాడు. ప్రజలు దాచినది దాచి మిగిలినది తీసికొని అద్దంకి దారి పట్టుచున్నారు.

ఆతడు దుర్గాధిపత్యము వహించునప్పటికే భటులకు మూడు మాసముల జీత మీయ వలసియుండెను. అందులో వారము వారము జీతము తీసికొను పై జీతగాండ్రు, ఇన్నాళ్లు జీతము లేనందున, పలువురు పారిపోవుచున్నారు. మిగిలిన వారుండి జీతములకై గోలచేయుచున్నారు. ఢిల్లీ పాదుషాకు సహాయము పంపుమని వ్రాసినచో తనతల పోవునని తెలిసియు ధైర్యముచేసి యిక్కడి స్థితిగతు లున్నవున్నట్లు నివేదించి యుండెను. పాదుషా తనకు విశేషముగా ఆహార సామగ్రియు రణసాధనములును పంపుచున్నా డని తెలియవచ్చినది. వాని ఖరీదు తాను సుల్తానుకు పంపవలసి యుండును. ఆసామగ్రి నేడు వచ్చును రేపు వచ్చునని ఎదురు చూచుచున్నాడు. అది యెన్నాళ్ళకును రాకున్నది. ఈ చుట్టుపట్టుల ఆహారము తరిగిపోయినది.

త్రిపురాంతక ప్రాంతములో యవనులు సరదారుగా నున్న బడేసాహాబును తన ప్రధమ సహాయునిగా నియోగించినట్లును అతడు సపరివారముగా వచ్చుచున్నట్లును అతనికి వార్త వచ్చినది. ఆత డింకను రాలేదు. దారిలో నాతడు శత్రువులచే జిక్కి యుండెనా? ఆతని తప్పించుకున్నచో కట్టూ నాయకునివద్ద తనకు మాట వచ్చును. పాదుషాకు తెలిసినచో బ్రదుకుపై నాశయుండదు. ఆతడు భయపడుచున్నట్లే బడేసాహబు శత్రువశు డయ్యె నున వార్త

రానే వచ్చినది. అదియు తన దుర్గపాలనమున నున్న సహాయమునసే; అదియు తన కతి సమీపమునసే జరిగినదని తెలియ వచ్చినది.

ఏదైన దుర్వార్త విన్నంతనే అతడు కోపము తీర్చుకొనుటకు అమాయికులగు ఖైదీలను తెప్పించి శిక్షించును. ఈదుర్వార్త వినగానే అతడు పదిమంది ఖైదీలను తెప్పించి తన అనుచరులచే చిత్రవధ చేయించెను. వారుపెట్టిన బాధలు చేతితో వ్రాయరానివి. నోటితో ఉచ్చరింపరానివి మనస్సుతోస్మరింప రానివి,

అదిచూచి ఆతని పెద్దమునల్మాను సరదారులు ఏవగించుకొనిరి.

మరికొంతకాలమునకు స్పష్టముగా వార్తరాకున్నను చూచాయగా వాడపల్లి యుద్ధమును గూర్చిన వాడుకలు రాసాగినవి. ఆహార పదార్థములు నాయుధములు రాగలవను ఆశకూడ సన్నగిల్లినది.

ఇట్లు అనేక ముఖముల ప్రమాద మతిశయించినదని అలావదీనుకు తెలిసినంతనే, ఆతని క్రూరత్వము ఒక్కసారిగా కఠోరమగు నిబ్బరముగా మారీనది. ఆతనిలో శౌర్యము ప్రదర్శించు నుత్సాహము ప్రబలినది. ఆతని ముఖములో హుందా వచ్చినవి. పురాణములలో రాక్షసవీరులకు కలదని వర్ణించు పొగచూరిన తేజస్సు వాని నావేశించినది.

ఆతడుత్సాహముతో మోటుపల్లి దుర్గమెక్కిడ పరీక్షించెను. ఆదుర్గమున కంటియున్న వాడరేవు అంతయు సరిచేయించెను. దుర్గములో కల బలాబలములన్నియు ఆతడు శ్రద్ధగా అవగాహన మొనర్చు కొనెను.

అతని కిప్పుడు నిద్దుర వచ్చుచున్నట్లే లేదు. ఆతని పెద్ద సరదారులు, మొదట ఆతనియం దంత గౌరవము లేనివారే, ఇప్పు డాతని కార్యవ్యగ్రత చూచుచున్నకొలది ఆతని గౌరవింప నారంభించిరి.

కొంతకాలము జరిగిన తరువాత ఒకనాడు దూరమున సముద్రముపై అజ్ఞాతములగు నౌక లేవో కనిపించిన వని వార్త వచ్చినది, అవి యెవరివై యుండు నని ఆలోచించునంత లోనే చేపలు పట్టబోయిన డింగీలవాడు ఆచుట్టు పట్టుల అనేక నౌకలు సంచరించుచున్న వని వార్తలు తెచ్చిరి. దినదినము ఈ వార్తలు హెచ్చుచుండెను.

అలాఁదీను మరల వాడదేవుకు పోయి అక్కడి నౌకల శక్తి ఁరీక్షించెను; నౌకలు తీరమున ఆగి సరకు లెక్కించికొని దింపుకొను ప్రదేశములు జాగరూకుడై ఁరిశీలించెను. ఆట్టి తావుల సముద్ర జలములలో మాటుగా ఘనమైన శూలములు పాతించి తమ నౌకలని గుర్తించునట్లు రహస్య సంజ్ఞ లేర్ప రచెను. మరియు నొడ్డున గోడ కట్టించి దాని చాటున నుండి నౌకలలో నుండి దిగుచున్నవారిని దిగుచున్నట్లే బాణములతో గొట్టుట కేర్పాటు చేసి, ఆయుధ సామగ్రి చేర్పించెను. ఆతడు సేనలను గూడ చిత్ర విచిత్రములుగా పరీక్షింప సాగెను. ధానుష్కుల నొకవిధముగా, ఖడ్గహస్తుల దళములను వేరొక విధముగాను పరీక్షించును. సామగ్రి అందించువారిని ఇంకొక విధముగా పరీక్షించును.

ముందు ధానుష్కుల ధనుస్సుల చేవ పరికెంచెను. వారి బాణముల తూకములు సరిచూచెను. తూకము సరికాని బాణములున్న ధానుష్కుని బిలిచి ఆతని నాబాణములు ప్రయోగింపు మనును. అందుచే ధానుష్కునికి లోపము అవగతమగును, ముందు బరువైన బాణము లక్ష్యమునకు క్రిందికి పోవును; వెనుక బరువైన పైకిపోవును. అది ప్రర్శించి ఆలోపములు సరిచేసి కొను నుపాయమును కూడ ఆతడే ఉపదేశించును. చిన్నభటుడును పనివాడును. చేయవలసిన చిన్నపని మొదలు, వాహినులు మహావాహినుల నడపు నాయకత్వము వరకు సమస్త విషయములు తెలిసిన వాడుగా నాతడు చూపట్టెను. అందుచే ఆతని భటుల కందరకు ఆతనిపై భయభక్తులతిశయించెను.

ఒకనా డాతడు ఉమ్రావుల నందరను ఆంతరంగిక సభకు పిలిచెను. వారి కాతడు స్థితిగతులన్నియు వివరించెను. ముందు ఆతని ఉపన్యాసము నిర్ణక్ష్యముగానే ప్రారంభమైనది.

"మనకు పాదుషావారి వద్దనుండి రావలసిన సహాయము రాలేదు. అది వచ్చునను ఆశకూడ పోయినది. అరబ్బీ, పారసీకము, సామర్థండుల నుండి మనకు రావలసిన గుట్టములు ఆయుధసామగ్రి చేరునట్లు లేదు. మన మిప్పుడ సహాయులమై యున్నాము. అసహాయ శూరులమై మనలను మనమే రక్షించుకొనవలయును. మన శత్రువులు గొర్రెల వంటివారు మనము వీరులము. వారు పిరికిపందలు. మనము ధైర్యశాలురము. వారు కాఫరులు. మనము ముసల్మానులము. మనపక్షమున ఉన్నది. అల్లాహో అగ్బర్!"

సమావిష్టుడైన ఉమ్రావు లందరు ఆవేశముతో ఏకకంఠముగా 'అల్లాహూ అగ్బర్!' అని నినాద మొనర్చిరి. ఇప్పటికి వారు అలావదీను గొప్పదనము పూర్తిగా గుర్తించిరి. వారిలో నొక ఆవేశ ముప్పతిల్లెను. అధైర్యము పోయినది. వీరోత్సాహము వారి బాహువులలో పొంగు వారినది.

వెంటనే అలావదీను వారికి ధైర్యవాక్యములు కూడ చెప్పెను.

"మనకు ఎక్కువ ప్రమాదము వచ్చినచో ఆత్మరక్షణకు రాజమహేంద్ర వరము చేరికొనుట నేర్పాట్లు చేసినాను. కాని అట్టి అవసరము పట్టదు. * తిమ్మ భూపాల పట్టణములోనను మోసలపట్టణ మందును మన ఆప్తులు మన శత్రువుల జాడలు కనిపెట్టుచు అరికట్టుచుండగలరు."

ఆ ఆంతరంగిక సభ సమాప్త మగుచుండెను. సరిగా నప్పుడు వేగరి యొకడు వచ్చి తిమ్మభూపాల పట్టణము మల్లారెడ్డి వశమొనర్చుకొనె నన్నవార్త చెప్పెను. దానినిగూర్చి తర్జన భర్జనలు జరుగుచుండగనే మోసల పురము వదలి నౌకలలో యవన సేనలు పారి పోయిన ఏను వార్తకూడ వచ్చినది.

ఆ సమయములో ఆ సభలోని వారిని చూడవలసినదే! అలావదీను ఉస్సురనెను. సాలర్‌జల్వీ తాను రాజమహేంద్రవరములో వేణుగోపాలస్వామి ఆలయము కొట్టివేసి దానిపై మసీదు కట్టించిన పుణ్యకార్యము అల్లాకు నివేదించుకొని రక్షింపు మని వేడుకొనెను. ఉమ్రావు లందరు నిర్వాక్కులైరి. మరల అలావదీనే నిలువరొక్కుకొనెను.

"అది అల్లా ఆజ్ఞ! మన ధైర్యస్థైర్యములు పరీక్షించుటే అల్లా యోచన. మనమందరము అల్లాసేనలో అప్రమత్తులముగా నుండవలెను."

ఎట్టి కష్టములు వచ్చినను వానిని ధైర్యముతో ఎదుర్కొని మోటుపల్లి దుర్గమును వదలకుండ శత్రువులను ప్రతిఘటించుటకే ఆసభ నిర్ణయించినది.

* * * *

ఆనాడు మూడు జాములకు అల్లావదీను తన నివాసమున నుండగా దుర్గము వెలుపల ప్రవేశమునకై బడేసాహబు కొంత పరివారముతో వేచి యున్నాడని వార్త వచ్చినది. వెంటనే అనుజ్ఞయిచ్చి సరాసరి ఆతని తన యొద్దకే పంపుడని ఆజ్ఞాపించెను.

---

* ప్రస్తుతము నిజాంపట్టణమునకు పూర్వపు పేరు.

బడేసాహబు కనిపించినంతనే ఆతని అల్లావదీను గాఢముగా కౌగిలించు కొనెను. బడేసాహబు కీర్తి మసల్మాను లోకములో నలుదిశల ప్రాకినది. ఆతడు వీరుడు మాత్రమే కాదు, మరణభక్తుడని కూడ మౌల్వీసాలర్ ఉల్వీ వివరించి యుండెను ఆతడు మంచి కుటుంబములో పుట్టిన వాడట. మనస్సులో ఎంతయొ పరిణతి ఉండుటచే ఆతనికి దైవభావనలోని సూక్ష్మము లట్టె తెలిసి పోవును. ఆతని దేహమెంత కర్కశమైనదో, హృదయమంత మృదువు; అంతస్వచ్ఛము. అంత యార్ద్రమునట ఆతడు ఎట్టి విలాసములు లేనివాడు. కామ వాంఛగాని మరి యెట్టి భోగవాంఛగాని ఆతనికి మనస్సులో పుట్టను కూడ పుట్టదట. అరబ్బీ, పారసీ, భాషలలో విశేష పాండిత్యము కల మౌల్వీసాలర్ ఉల్వీయే బడేసాహబునుగూర్చి ప్రస్తావించునపుడు విశేష గౌరవ ప్రపత్తులు చూపుచుండును.

బడేసాహబు ప్రవర్తనముకూడ మిక్కిలి యుదాత్తముగా నుండెను. తనకంటె నుద్యోగ ధర్మమున నున్నతు డగు అలావదీనుతో సమానునితో ప్రవర్తించునట్లే ప్రవర్తించుచు నాతని నాదరించెను.

ముందుగా అలావదీను బడేసాహబును ఆతడు శత్రువుల కెట్లు చేజి క్కినో ఎట్లు తప్పించు కొనెనో తెలుప వేడెను.

"మా యోడలు కృష్ణా ముఖద్వారము దాటి సముద్రములో ప్రవేశించు చుండగనే మాపై ఆకస్మికముగా మహా నౌకాసమూహ మొ టి పడినది. నా నౌక ముందున్నది. నేనవి యెవరివో అని నావికులతో ఆలోచించు చుండగనే సముద్ర దస్యులగు మూరులవని వారు తేల్చిచెప్పిరి. మా వెనుకనున్న నౌకలను కృష్ణాప్రవాహము లోనికి వెనుకకు పొమ్మని ఆజ్ఞాపించి, నే నును నా నావికుల కట్లే ఆజ్ఞాపించితిని, కొంచెము వెనుకనున్న మన తక్కిన నౌకలు కృష్ణానది లోనికి పోగలిగినవి. సముద్రములో కొంత దూరము సాగిన నా నౌక ఎంత ప్రయత్నించినను తప్పించుకొనుట కష్టతర మయ్యెను. తొందరలో కృష్ణవేణీ ముఖ మెట్లో చేరితిని. దురదృష్ట వశమున మానౌక అక్కడ మెట్ట పట్టినది. మూరుల నౌకలు పైన బడినవి నే నిక పారిపోవుట సాధ్యము గాదని ధైర్య ముతో నా నౌకలోనున్న భటులతో మూరుల నెదిరింప నిశ్చయించితిని.

"ఏమి లాభము? మూరులు మాకు పది పదునైదు రెట్లున్నారు. నా పడవ వారికి పట్టు వడినది. నాతోనున్న భటులు యుద్ధములో మృతి నొందిన

వారుపోగా తక్కినవారు ముప్పదినుంది పట్టువడిరి. నలువురు బలవంతముగా నాపై బడి. నన్ను నిరాయుధుని జేసి ఇనుప గొలుసులతో బంధించిరి. మా పడవలో భటులతోపాటు ఒక వృద్ధురాలును, ఒక బ్రాహ్మణ యువతియు కూడ నున్నారు. వారిని బానిసలుగా నమ్మిన విశేష ధనము వచ్చునని మూరులు తలచినట్లున్నారు. అందుచే వారిని మాత్రము ఎక్కువ బాధింపక కాపులో పెట్టినారు. ఆపిల్ల నైనను ఎట్లైన కాపాడవలెనని ఆలోచించితిని. నాకు సాధ్యపడలేదు. నన్ను చీకటి కొట్టులో పడవ లోపలి భాగమున పడ వేసిరి.

"రెండు మూడురోజులై యుండును. పడవలో సందడిని బట్టి నౌకా యుద్ధ మేదో జరుగుచున్నట్లు తోచినది. మూరులు చిక్కులోనున్నట్లు గమనింతిని. నాకావేశము పెరిగినది. అంతవరకు త్రెంపు కొన యత్నింపని నాసంకెలలపై నాకాళ్ళబలము భుజబలము బాహు బలము హస్త బలము ప్రయోగించితిని ఒక్కసారిగా నవి విచ్చు కొనుచున్నట్లు తోచినది. అని సడలినవి; సాగినవి; ముక్కలు ముక్కలైనవి. నా కొడలు తెలియలేదు. నేనున్న గదితలుపు తన్ని బ్రద్దలు కొట్టి బయటికి వచ్చితిని మూరులు కొందరా యువతియొద్దను వృద్ధురాలి యొద్దను తలలు నరకుటకు కత్తులెత్తి సిద్ధముగా నుండిరి. ఒకమూక చేయి ఒడిసి పట్టి ఖడ్గము లాగికొని అతనిని చుట్టుముట్టిన యితర మూరులను పరపరనరకి వేసితిని.

"మూరులను చుట్టుముట్టిన శత్రువులకు దీనితో తెరపి చిక్కినది. వారు ఆ యువతులను రక్షించి మిగిలి యున్న మూరులను బంధించి వారి నౌకలు పట్టుకొనిరి. నన్ను వారొక అడవి మృగమును వలె చూచుచు బంధించియు బంధింపక యుండిరి. ఆ తెరపి చూచుకొని నేను తప్పించు కొంటిని. నాకై ఆ సమీప భూములలో నా పరిజనులు కొందరు కాచి యున్నవారు నన్ను దారిలో కలిసికొనిరి. నావెంట వచ్చిన నౌకలు తప్పించుకొని ఇటు వచ్చినట్లు నాపరిజనులు చెప్పిరి. క్షేమముగా చేరినవా? ఇంతగా అల్లా దయ యున్నది. "అల్లా హూ అక్బర్!"

ఈ వృత్తాంతము వినిన మీదట అలావదీనుకు ఆతని యెడ గౌరవ మినుమడించినది. ఈమా రాతడు తన కొగిటిలో సాహబును నులిమివేసెను. బడే

సాహబు ఆతని ప్రేమావేశము శాంతించువరకు చిరునవ్వుతో ఆతనివంక తిలకించు చుండెను.

ఇట్లు కొంత వడి యోగక్షేమాదిక సంభాషణముతో గడపి అలావదీను తనకును బడేసాహబుకును అశ్వములు రెండు తెప్పించినాడు. ఇప్పుడు తన ప్రధాన సేనానియగు బడేసాహబును ఆతడు వెంటతీసుకొని వెళ్ళి మోటుపల్లి దుర్గమును ఓడరేవును సమస్తము చూపించి, అందులో తా నొనర్చిన ప్రయత్నములన్నియు వివరించి మధ్యమధ్య ఆతని సలహాలడుగ సాగెను. బడేసాహబు తరచుగా నాతని ప్రయత్నముల నగ్గించుచు మధ్య మధ్య లోపములుగా తనకు తోచినవి చూపసాగెను. అట్టి యెడల వారిరువురు పూర్వోత్తరములు మధనచేసి యేదోయొక నిశ్చయమునకు వచ్చు చుండిరి. మిక్కిలి మోటువాడని తాను విన్న అలావదీను ఇంత సౌమ్యుడా యని బడేసాహబుకు ఆశ్చర్యమైనది. యుద్ధానుభవము లేనివా డని తాను తలచిన ఈ బడేసాహబు సర్వజ్ఞుడుగా నున్నాడే అని అలావదీనుకు ఆనందమై 'ఇతనిని నాకు అల్లాయే తోడు పంపినాడు.' అను నిశ్చయభావ ముదయించెను. వారి కన్యోన్యప్రేమ చిత్రముగా ఆ స్వల్పకాలములోనే ఉదయించి ఉద్వేలముగా పెరిగినది. రాత్రి ప్రొద్దుపోవు వరకు వా రట్లాప్యాయముగా ప్రసంగించుకొనిరి. అవి వీర ప్రసంగములు.

తుదకు అలావదీను చక్కని బానిసపిల్ల నొకదానిని తెప్పించి బడేసహబుకు అర్పించి, 'దీని నీరాత్రి తోడుగా తీసికొనుము' అనెను. ఆపిల్ల 'జీ' యన్న ఆయొక్క అక్షరముమాత్రమే దాని కంఠములోనుండి శ్రావ్యముగా వేణుస్వరమువలె ఆగదిలో నిండినది.

ఆ సన్నని గొంతు బడేసాహబు హృదయములో చురకత్తివలె చొచ్చుకొని కోయుచున్న ట్లైనది. అతడు నిలువున తెల్లవోయెను. ఆతడు స్త్రీసంపర్కమెరుగడు. ఒక ఫకీరుగానే ఆతడు జీవితము గడుప నిశ్చయించి యుండెను.

"భాయీ, నాకిట్టి మర్యాద లక్కర లేదు. నే నొంటరిగా నిద్రింతును."

"ఈ ప్యారీ బాగుండ లేదా, సాహబ్?" అనుచు అలావదీను తన సేవకునివంక చూడగా ఆతడు అనేక విధముల ఆకారములుగల వనితలను తెచ్చెను. వారి కవగుంఠనములు లేవు. కొందరు పచ్చనివారు. కొందరు ఎఱ్ఱనివారు. కొందరు నల్లనివారు. కొందరు పుష్టిగలవారు. కొందరు సన్ననివారు, అందరును సంపూర్ణయౌవనలు.

అట్లు వా రొక్కరొక్కరే 'జీ' అనుచు ఎదుట నిలువబడుచుండ వారి కంఠములతో గది ప్రతిధ్వనించుచుండెను. అచ్చటి దీపకాంతిలో వారి దేహములు నగలతో మిలమిలలాడుచుండెను. వారిలో ఒక్కరివంకకూడ బడే తల యెత్తి చూడనైన లేదు. వారు అచ్చట నిలిచినంతసేపు బడేసాహబు మౌనము వహించి కన్నులు మూసికొని యుండెను. ఆతని భావము చాలవడికి గాని అలావదీనుకు అర్థము కాలేదు. అతడది గ్రహించినంతనే సాహబు నిష్క్రమతకు ఆశ్చర్యముతోపాటు భయభక్తు లతిశయించినవి.

"ఈ పకీరు వీరునికి సలాముచేసి పొండి!"

వెంటనే ఆ యువతు లందరు వంగివంగి వారిద్దరికి సలాములు చేసి సెలవుతీసికొని పోయిరి. ఆవల వారిలో కొందరు కిలకిల నవ్వుట వినబడినది. కొందరు నిట్టూర్చుచు కన్నీరు తుడిచికొనుచున్నట్లును తోచినది. అది గమనించుచున్న సాహబుకు హృదయములో కలవరపాటు గలిగినది.

*　　*　　*　　*

అలావదీను వెడలినంతనే బడేసాహబు గులాము తన కమర్చియుంచిన మందిరమునకు శాంతముగా విశ్రమింప బోయెను. అందులో మనోజ్ఞములగు మెత్తని పరుపులు దిండ్లుగల పందిరి మంచమున్నది, ప్రక్క నెన్నియో సోఫాలున్నవి. పైన చాందినీలు, గోడలకు మనోహరములగు విలాసవస్తువులు అనేకము లున్నవి. ఆతడు పరిశ్రమచే మిక్కిలి అలసియుండెను. దేహము నిద్ర వాంచించుచున్నది.

కాని ఆతనికి నిద్ర రాలేదు. తనకు పుంస్త్వమే లేదన్నట్లు సూచించిన ఆ మదవతుల నవ్వులు ఆతని చెవులలో మారుమ్రోగు చున్నవి. 'నాకు పుంస్త్వ మున్నదా? – స్త్రీలతో సంపర్క మెట్టిదో యెరుగను. ఇన్నియేండ్లు వచ్చినవి. ఇతరులు ఇంతకాలము బ్రహ్మచర్యముతో గడపినవారు అరుదు. మాఅమ్మ నాకు పెండ్లి చేయలేదు.

వెంటనే అన్నమ్మ ఆతని నావేశించినది. వెంటనే ప్రోలన్న ఆతని నావేశించినాడు. 'మాతండ్రిని వదలుకొంటిని. అయ్యో, అయ్యో! చేతులార వదలుకొంటిని.'

ఆతని కేకధారగా కన్నీరు కారసాగినది. తండ్రి స్మృతి కొంతవడి సాగి ఆతని మనస్సు మాతృస్మృతిలో లగ్నమై నిలిచినది. ఆవెంటనే చెంచులక్ష్మి ఆతని స్మృతిలో పొడసినది. చెంచులక్ష్మిని చూచిన దాది ఆమెని తన మనస్సులో అన్నమ్మ స్థానమున బలవంతమున నిలుపుకొన దలచెను. ఆమె యందు బలవత్తరముగా ఒకానొక ఆకర్షణ తనయందు కలిగినది. అది యిత రులు వేరుగా భ్రమించినారు. సివ్వక్కయే భ్రమపడినది, చెంచులక్ష్మియే భ్రమించినది. మల్లారెడ్డి భ్రమపడగా తానును భ్రమపాలైనాడు. ఆమెకు తన్ను చూచిన చెప్పరాని భయ ముండెడిది. కుమారుని చూచిన తల్లికి భయమేల? మా అమ్మకు; మా అన్నమ్మకు. నన్ను చూచిన జంకు కలుగునా?

ఒక్కక్షణ మాతని మనస్సు ఈ ఆలోచనతో నిలిచిపోయినది. ఒక్క స్ఫురణ ఆతనికి కలిగినది.

'నా ముఖమెట్లున్నది? నాయాకార మెట్లున్నది?' వెంటనే ప్రక్కనున్న నిలువుటద్దములో దివ్వె వెలుగున తనప్రతిబింబము చూచుకొనెను.

'ఈవేషము చూచిన మాఅన్నమ్మకు భయము కలుగదా' అసహ్యము వేయదా? ఈ పచ్చి తురకవేషము వారికి భయము కలిగింపదా? మాకన్నతండ్రి చూచి అసహ్యించుకొన్న యీవేషము, మా తల్లికి అసహ్యముగా నుండదా? ఆమె కనుల ఈవేషముతో పడియుండకుండుట నాఅదృష్టము! చెంచులక్ష్మికి అసహ్యము కలిగింపదా?—'

బడేసాహబుకు కన్నులవెంట నేకధారగా కన్నీరు గారుచున్నది. అతడు వెక్కి వెక్కి యేడ్చుచున్నాడు. ఊపిరి సలుపుట లేదు. తనయన్న వేమారెడ్డి ఆవల వాడపల్లి యొద్ద మహాసేనాని యగు కట్టానాయకునే జయించెనట, ఆ మహాయుద్ధములో తన పెద్దతమ్ముడు అన్నారెడ్డి అన్నకు సాయపడెనట ఇప్పుడిక్కడ తన చిన్నతమ్ముడు— తన ముద్దుల తమ్ముడు—మల్లారెడ్డి, మోటుపల్లిపై నెత్తిరా నున్నాడు. మల్లారెడ్డిని చిన్నప్పుడు ఎన్నియో పర్యాయములు తానెత్తి ముద్దాడి యుండెను, అత డ్డై దేళ్ళవా డైయుండగా తన్ను మాటిమాటికి కుస్తీకి రమ్మని పిలిచెడివాడు. ఆతనిమీదగల ప్రేమచే తా నిష్టపూర్తిగా క్రింద పడుచుండువాడు, తన చిన్నతమ్ముడు మాత్రము తానే నిజముగా గెలిచితినని విజయ గర్వముతో, క్రిందపడ్డ తనపై బడి క్రుమ్ముచుండెడివాడు. ఆ చిన్నతమ్ముడు

ఇప్పుడీ మోటుపల్లిపై దండెత్తి రానున్నాడు. తనకు మోటుపల్లి బలాబలములు సర్వము తెలియును. తన తమ్మునికి దీని రహస్య మంతయు నందజేసిన ? –

ఛీ ! మిత్రద్రోహము తలపెట్టుటా ? నన్ను ఆలావదీను ఎంత ఆదరించుచున్నాడు! ఈ మౌల్వీసాలర్ ఉల్వీ ఎంత గౌరవించుచున్నాడు! – వారందరు నన్ను శత్రువునుగా చూచుచున్నారు. పీరో, ఆప్తునిగా చూచుచున్నారు. ఏమి చిత్రము నా యాప్తులకు నేను శత్రువును. వారి శత్రువులకు నేను మిత్రుడను. నా యాప్తులకు నేను సాయము చేసినచో – నా ముద్దుల తమ్ముడు మల్లారెడ్డికి సాయము చేసినచో – నేను మిత్రద్రోహి నగుదును, స్వామిద్రోహి నగుదును! వీరిని నన్ను మిత్రునిగా చూడుడని నేనర్థించితినా ?

బడేసాహబు మనస్సు ఉయ్యాల లూగుచుండెను. అది సుకుమారమైన మనస్సు. ఆమధ్య తండ్రి కనబడి మాయమైన పిమ్మట కొంత మొద్దువారినది. గాని మరల మహాలక్ష్మిని చూచిన దాది యథాస్థితికి వచ్చినది. మహాలక్ష్మిని చూచినపుడెల్ల ఆతనికి తన తల్లియు మాతామహుడు దొడ్డారెడ్డియు, తన ఆప్తులును, బంధువులును, పూజలుచేయు దేవతలు. తలపున బారజొచ్చిరి. ప్రకృతి సిద్ధమగు ఆతని మార్దవము ఈమారు ద్విగుణీ కృతమై బలముతో పొంగుచున్నది. ఇప్పుడు తన కర్తవ్య మేమి ?

ఒకమారొక విధముగా గట్టిగా నిశ్చయించును. వెంటనే దానికి వ్యతిరేకముగా ఆలోచన మొదలుపెట్టును. మొదటి నిశ్చయముకంటె నిది బలవత్తరమగును. అంతలో మరల నావలిపైపునకు మనస్సు మళ్ళుట ఆరంభించును. మరల మరల నంతే !

ఆతని ఆలోచనలు మనస్సులో ఆగుటలేదు. అప్రయత్నముగా నవి గొణుగుడువలె ఆత డుచ్చరింపసాగెను. అదృష్టవశమున అవి స్పష్టముగా లేవు. పరిచారకులుగూడ నెవ్వరు సమీపముల లేరు. వారే దగ్గర నున్నచో మధ్యమధ్య నాతని మాటలు వినియుందురు. వారి కనుమానము కలిగియుండును. అతనికా ధ్యాసయే లేదు. తనమనస్సు వాగ్రూపముగా సముద్గత మగుచున్న దనియే ఆత డెరుగడు. అది సంధించిన జ్వరార్తునివలె ఆందోళన చెందుచున్నది.

"నావిధి యిప్పుడేమి ? నాతండ్రి, నాతల్లి, నాతోడు, నాతాత, నామామలు, నా మరదులు, నావారందరికి విరోధి నగుట నా విధియా ? నా శత్రువులు -

నన్ను మోసగించి సర్వవిధముల భ్రష్టుని జేసిన శత్రువులు - నన్నీనా డాదర ముతో చూచినంత మాత్రముననే నేను బుద్ధిహీనుడనై, వారికి వశుడనై, సేవ కుడనై, గులామునై, నా ఆత్మీయుల కందరికి శత్రువునై ఆ ఆత్మద్రోహినికావ లెనా? – ఇదియా ధర్మము? ఇదియా విధి?"

ఎంత ఆలోచించినను బడేసాహబుకు ఆలోచన తెగుటలేదు. ఒకప్రక్క నుండి మల్లారెడ్డికి దుర్గవిన్యాసము, సైనికస్థాపనము ఇత్యాది రహస్యములు తెలుపు మార్గమేదియా యని ఆలోచన అంతర్వాహినిగా ఆతని మనస్సులో ప్రాకులాడుచున్నది, అది అందజేయుటకు విశ్వాసపాత్రులైనవా రెవరు? తనకు నరకమే ప్రాప్తించుగాక! తనకు జన్మచే సిద్ధమైన భారతీయధర్మము సత్యమే యైనచో, మ్లేచ్ఛులలో గలసిన తనకు నరకము తప్పదు. తాను కలసిన తురకల మతమే సత్యమైనచో ద్రోహియై వారి విరోధులకు సాయము చేయనున్న తన కట్లయినను నరకము తప్పదు.

కాని ఆతడు వీరుడు భయ మెరుగని రెడ్డిబిడ్డ. ఈ దేహము ఏమైనను లెక్కచేయని ధైర్యశాలి. దేహమునకే లెక్కచేయనివాని కాత్మ యొక లెక్కయా? ఏమైన నేమి? నామల్లారెడ్డికి సాయము చేసి తీరవలెను! ఆతనిని రక్షింపవలెను. అతడు మహావీరుడు. అత డాత్మీయుడు. తలచుకొన్నకొలది ఆతనికి మల్లారెడ్డిపై ప్రేమ పొంగి వచ్చుచుండెను. అతని యాకారము తలచు కొని ప్రేమమీర మనస్సులో కౌగలించుకొనుచు శిరము మూర్కొనుచుండెను.

బడేసాహబు చివ్వున తన ప్రక్కపైలేచి కూర్చుండెను. దుర్గరహస్యము లన్నియు ఆతడు పత్రముపై వ్రాయసాగెను. ముత్యాలకోవవంటి ఆతని యక్షర ములు తాళపత్రములపై సరసర సాగిపోవుచుండెను. గంటము పత్రమును కోసి వేయుచు ముందుకు పరువెత్తుచున్నది. ఆతనికి గంటము గలగల నాదములో వేరేమియు స్ఫురించుట లేదు. వే రేమియు వినబడుటలేదు.

తెల్లవారుచున్నది, ఆతడు వ్రాయుచునే యుండెను.

53

ఆవల దుర్గము వెలుపల సందడిగా నున్నది. అలావదీను తలంచినట్లు గనే మోటుపల్లిని మల్లారెడ్డి సేనలు దరిసినవి. ఆసేన లింకను విడియుచునే యున్నవి. అవి విడియుచున్న తీరుచూడ అలావదీను కాశ్చర్యమైనది. అవి అక్కడక్కడ విడియుచున్నట్లే ఉండి అద్భుత విధముగా మార్గము లన్నియు నిరికట్టుచు, మోటుపల్లిని ముట్టడించుచున్నవి. ఇట్టి సమర్థమైన విధానము ప్రతాపరుద్రుడు పట్టువడిన ఈ ఐదేండ్లుగా భారతీయ సేనలు చూపుట ఆత డెరుగడు. ఒకవంక ఆసేనలపై గౌరవభావముతో పాటు మరియొకవంక అపూర్వమగు భయముకూడ అంకురించెను.

ఆతడు వెంటనే తన యనుచరులను బిలిపించెను. షేర్‌ఖాన్, మౌల్వీ ఉల్వీ, ఇత్యాదులెందరో వచ్చిరి. వారందరకు శత్రుసేనా విన్యాసములు చూపి వివరించుచుండెను. ఆతని వివరణము వినుచున్న కొలది వారికి భయ మావేశింప సాగెను. వారినందరును స్వేచ్ఛగా తమతమ భయముల నాతడు చెప్పనిచ్చెను. విని విని ఆతడు ఫక్కున నవ్వెను.

"ఏమి ధైర్యస్థులు మీరు? వారిని చూచినకంటె మిమ్మలను చూచిన నాకు భయము కలుగుచున్నది. మన పక్షమున అల్లా ఉన్నాడు. వారి పక్షమున సైతాను ఉన్నాడు. మనకు అల్లాదూతగా బడేసాహబ్ వచ్చినాడు!-ఇంకా మీకు భయమేనా? అల్లాపై విశ్వాసములేదా? అల్లాపైన విశ్వాసము లేనివారికంటె పిరికిపంద లింకెవరు?-"

ఇట్లనుచు నాత డించుక ఆగి. బడేసాహబ్ ఏమిచేయుచున్నా' డని సేవకునడిగెను. సేవకుడు వెళ్ళి చూచివచ్చి 'ఏదో వ్రాసికొనుచున్నా'డని నివేదించెను.

"నేనొక్కసారి ఇటు దయచేయుమన్నానని చెప్పిరా!"

సేవకుడు వెళ్ళి నెమ్మదిగా పిలిచినంతనే సాహబు ఉలికిపడెను. నెమ్మదిగా నట్లు పిలిచినది ఎవరో తన్ను పాతాళ కుహరమునుండి పిలుచుచున్న పిలుపువలె వినిపించినది.

నేరము చేసినవాడు నేరము చేయుచుండ పట్టువడినప్పుడు పడుభావము ఆతనికి కలిగినది. అర్ధము లేని చూపుతో ఆతడు సేవకునివంక చూచెను. సేవకుడు భయభక్తులతో ఇట్లు విన్నవించెను.

"బడేసాహబ్‌జీ! అలావదీన్‌సాహబ్ మిమ్ము దయచేయు డను చున్నారు."

బడేసాహబుకు ఆమాటలు సరిగా వినిపింపలేదో అరము కాలేదో? ఆత నికి కోపముపచ్చి, 'పో!' అనెను.

సేవకున కేమి చేయును తోపక కదలక అక్కడనే నిలుచుండెను. సాహబ్‌కు చిరా కెక్కువై 'పో!' అని ఈమారు మరింత గట్టిగా పలికెను.

సేపకుడు కదలక వడకుచు వినీతుడై, 'సాహబ్‌జీ! అలావదీన్ సాహబ్ మిమ్ము పిలిచికొని రమ్మని పంపినారు' అనెను.

భటుని వినీతవచనములు స్వరవై ఖరి ఈమారు ఆతని కించుక స్వరూ పావబోధమును కలిగించెను. 'ఏమిటి?' అని ఆతడు కాంతముగా ఇప్పుడు ప్రశ్నించెను. ఈమారు భయముడిగి భటుడు తనవచ్చిన పని విన్నవించెను.

బడేసాహబు చిరునవ్వు తనలో తాను నవ్వుకొని 'ఇదుగో, వచ్చుచున్నా నని వారికి విన్నవింపు' మనెను.

ఆతడంతట లేచి తాను వ్రాయుచున్న పత్రములు పదిలపరచి సేవకుని వెంట బయలుదేరెను.

అతడు రాగానే దుర్గనాయకుడు క్లుప్తముగా ఆ దండెత్తి వచ్చిన వారిని చూపి సేనావిన్యాసములు సూక్ష్మములతో వివరించెను. ఇంకను ఎంతో సేన రావలసినట్లున్నది.

బడేసాహబ్ సమస్తము శ్రద్ధతో పరీక్షించెను. ఆతని కంతరంగములో ఆనంద ముబ్బుచుండెను. తనతమ్ముని రణదక్షత ముచ్చట గొలుపుచున్నది. 'ఇతడు ద్వంద్వయుద్ధములోనే కాదు. రణనీతిలోగూడ విశారదు డైనాడు - మా కుటుంబములో ఇట్టి సమర్థత ఎక్కడనుండి వచ్చినది!"

అతనికి తన చిన్ననాటి అనుభవములు చప్పున గురుతునకు వచ్చినవి. తండ్రి జ్ఞాపకము వచ్చినాడు తాతముత్తాతలు జ్ఞాపకము వచ్చినారు. తన తాత ముత్తాతలు వంశపారంపర్యముగా తెవల హారికులు!

తనతండ్రి చిన్న పడవాలుగా కొంతకాలము ప్రతాపరుద్రుని సేనలలో నుండి దక్షిణదేశ యాత్రలలో పాల్గొనె నట. ఆతడు భయ మెరుగడు. అయి నను ఆతని కభిమాన పాత్రమైనది భూమి దున్నుట, విత్తుట, పంట కోసి మహాస్యాలు చేయుట. ఆపనులు చేయునప్పుడు, చేయించుచున్నపుడు ఆతని ముఖము విప్పారి వింత తేజస్సుతో నొప్పారునుండెడిది. ఆతనికి తన సంతా నము నొక్కసారిగా ధనముతో నింపివేయవలె నని కోరిక ఆవేశించియుండెడిది. పడవాలుగా నున్నపుడు దక్షిణదేశ రాజులయు, వారి ప్రధాన పరివారములయు ఐశ్వర్యము లాతడు చూచియుండెను. అట్టి యైశ్వర్యము తనకు కాకున్నను తన సంతానమునకైనను ప్రాప్తింపవలెనని ఆతడు నిరంతరము కోరుచుండెడి వాడు. ఇట్లు భూమి నెన్నాళ్ళు పండించిన అంత ఐశ్వర్యము పట్టును! కాని అధర్మకార్యము లొనర్చి ధనసంపాదన చేయు ఊహ యైన తండ్రి కెన్నడు నుదయింపలేదు - అయ్యో! అట్టి పుణ్యపురుషునకు నేను కుమారుడనై జన్మించి దూష్యులైన వీరిలో కలిసి ఈ లోకసౌఖ్యము లాసించినానే! ఈలోక గౌరవ పదవుల కాసించినానే! - నాతండ్రి ఎంత ధర్మనిష్ఠుడు! ఆయనకు ధనసంపా దనపై మక్కువ తీరలేదు ! మమ్మందర బంగారముతో ముంచివేయవలె ననుకోరిక తీరలేదు. కనబడిన గోసాయి నెల్ల ఆయన దర్శింపసాగెను. ఉన్నట్లే ఉండి అకస్మాత్తుగా నాయన ఒకనాడు మాయమయ్యెను. మరల పదునై దేండ్లకు శ్రీశైలము చివర త్రిపురాంతకమువద్ద నుండగా తండ్రిని చూచుట తట స్థపడినది. ఏమి ఆ పిచ్చిరూపము! మాపై ప్రేమచేత మాకు బంగారు కట్టబెట్ట వలె ననుఉత్కంఠతో ఎంత పిచ్చివా డైనాడు!-నిజముగా బంగారము సాధిం చినాడా ?

'నిధులు సాధించెద ననివచ్చి నా పరివారముతో తిరుగుచున్న జంగ మయ్య నిజముగా పిచ్చివాడు. మాతండ్రి పిచ్చి సామాన్యపు పిచ్చి గాదు. అది జ్ఞానుల పిచ్చి! - ప్రోలన్న తండ్రీ నన్నుచూచి ఎంత అసహ్యించుకొన్నావే! - ఛీ వీరందరు నా శత్రువులు ! -'

పరధ్యానముగా నున్నాడని అలావదీమ గ్రహించెను.

'బడేసాహబ్ జీ!'

అతడట్లు బిగ్గరగా పిలిచి పెద్దనవ్వు నవ్వెను. బడేసాహబు ఉలిక్కి పడెను. దుర్గనాధుడు ఆతనివీపు చరచుచు క్షమింపు మనెను. బడేసాహబు

ముఖము వికృత మయ్యేను. ఆతనికి అలావదీను ఆదరము అసహ్య మనిపించినది. ఆవేశ మాగలేదు.

"అలావదీన్ సాహబ్ జీ!'

'జీ?'

'ఆ దండెత్తి వచ్చినవా రెవరో తెలియునా?'

"మల్లారెడ్డిట! ఆతనికి ఈ మధ్య తన అన్నకు ప్రాప్తించిన విజయావేశముతో మదమెక్కి గర్వముతో ఇటు వచ్చినాడు."

'అలావదీన్ సాహబ్‌జీ! నీకు తమ్ములుండేవారేనా?'

'పూర్వము!'

'ఇప్పు డేమైనారు?'

ఒక విధమైన కోపరేఖ అలావదీను ముఖములో వ్యక్తమైనది. అది పిశాచములకే సాధ్యమగు కోపరేఖ. అది చూడ అందర కాశ్చర్యమైనది. బడే సాహబుకు అసహ్యమైనది. అలావదీను ఉమ్మివేయుచున్న వానివలె బదులు చెప్పెను.

'ఆ కాపరులందరు వారు పోవలసినచోటికి పోయినారు. జిన్‌లలో కలిసి చీకటి కోణములలో నరకయాతనలు ఈ పాటికి పడుచుండవలె!'

ఆమాటలు వినుచున్న తక్కిన ముసల్మాను సరదారుల కందరకు అసహ్యమనిపించినది. ఇక బడేసాహబుకు ఆపాదమస్తకము ఝుల్లుమని జలదరించెను. ఆతనికి మనస్సు ఆగలేదు.

'ఆలావదీన్ సాహబ్‌జీ! - ఆవచ్చినది నా తమ్ముడు',

'నీతమ్ముడైనచో నేను చేసినట్లే అతనికి త్వరగా నరకమునకు దారి చూపించ వలె'

బడేసాహబు నిలువెల్ల కంపించెను.

'నాతమ్ముని కాలికొన గోటికి దెబ్బ కలిగించినను అట్టివాని తల నరికివేసెదను!' - ఆత డావేశములో అనివేసెను.

మరుక్షణమున ఆ సమావేశము అల్లకల్లోలమయ్యెను.ఆవేశము ఎక్కువ బడేసాహబు పక్షముననే ఉండెను.

'నీవు రాక్షసుడవు: ఛీ! నీ ముఖము చూపకు!'

బడేసాహబు ఆ వేశమునకు అలావదీను తెల్లవోయెను. ఆతడొక్క-సారిగా బడేసాహబుపై బడి చంపివేయునని అందరు తలంచిరి.

కాని అతడట్లు చేయలేదు. అప్పుడొక విచిత్రమే జరిగినది. అందరిలో అలావదీను ఏడువసాగినాడు. బావురు మనియే యేడువసాగెను. వందలమంది ఏడ్చుచుండగా చూచి చలింపని అలావదీను — పైపెచ్చు ఆనందించెడి అలావదీను - ఇప్పుడు వెక్కి-వెక్కి యేడువ సాగినాడు. ఏమది? ఈ బడేసాహబు మంత్రించినాడా? ఇతనికి పిచ్చియెత్తినదా? అల్లా లీలలు ఎవరికీ అవగతము లగును! అవి ఒక్కొక్క-ప్పుడు తారు మారుగా కనిపించును.

లోకములో పుట్టిన ప్రతి మానవునకును సాటి మానవులమీద దయా దాక్షిణ్యము లుండుట సహజము. ఎవరైనను ఒకరు దానికి విరుద్ధముగా కన బడినచో అది సత్యము గాదు. అందులో మిథ్య ఉండును!

అలావదీనుకు తన సోదరులపై పట్టరానంత ప్రేమ ఉన్నది. సాటిమానవులపై దయ యున్నది, కాని అతడు ఇస్లాము మతము స్వీకరింపగనే తన ప్రాత మతస్థులపై కాఠిన్యమను నొకగట్టి అడ్డకట్ట నిర్మించుకొనెను. తన క్రొత్త మతముపై విశ్వాసము తగ్గుచున్న కొలది ఈ యడ్డుకట్ట నాతడు మరింత గట్టి చేయసాగెను.

ఆ యానకట్ట ఇప్పుడొక్క-సారిగా సాటివా డగు బడేసాహబు మాటలతో తెగిపోయినది. తునాతునక లైనది. ఒక్క-సారిగా నాతని సోదర ప్రేమ, సాటి మానవులపై దయాదాక్షిణ్యములు, హృదయములోనుండి స్రవించి ప్రవహించి వరదలై పారసాగినవి. ఆతనికిని ఆవేశము పెరిగినది.

'బడే సాహబ్! నీ వెన్ని యైన తిట్టుము. నేను చేసిన పాపము లన్నియు చెప్పివేసెదను. మా నాన్నను పొడిచివేసినాను. మా ఆమ్మను నరికినాను, మా తమ్ముల గొంతులు నులిమివేసిననాను. మా గ్రామములోనున్న మా బంధువులను మిత్రులను ఊరిలోనివారిని పిల్లలను, వృద్ధులను, స్త్రీలను పురుషులను అందరిని తగుల పెట్టించినాను!— ఏమి షేర్ఖాన్, నిజమా; కాదా?—ఈతడు ఆ రాత్రి నావెంటనే ఉన్నాడు!'

షేర్ ఖాను బదులు చెప్పెను. 'జీ! తమరు చేసిన మహావీర కార్యములు సామాన్య మానవులకు చేత నవునా? మీరు చెప్పిన వన్నియు మీరు చేసితిరి. అంతేకాదు. మీ మాటకెదురు చెప్పినవారి నాలుకలు కోయించినారు. రహస్యములు విన్నవారి చెవులలో సీసము పోయించినారు. ఆజ్ఞలు పాలింపని వారి చర్మము లొలిపించినారు, తమరు చూపిన కాఠిన్యము సామాన్యుల ఊహకు కూడ తట్టదు. ఆహ్హా! హ్హా!. మనుష్యులను చక్రములమీద పండుకొన బెట్టి సాగ తీయించితిరి. ఒక్కొక్క వేలే నెమ్మదిగా చితుక కొట్టించి, తరువాత చేయి, కాలు—ఇట్లు ప్రాణము పోకుండ రోజులకు రోజులు నిలిపి తమరెంతమందిని శిక్షించితిరి! ఆ పాపులు బాధపడుచుండగా— 'ఇస్లాములో చేరని కాఫరులు ఇట్లే శాశ్వతముగా జహన్నాలో బాధలు పడెద'రని చెప్పినారుగదా. ప్రభూ:— మీకు జహన్నాలో పెద్ద ఉద్యోగము భగవంతుడు ఇచ్చును తప్పక!'

బడేసాహబ్ ఆమాటలు కలలో వినుచున్నట్లు వినుచుండెను. ముందు వచ్చిన ఆగ్రహావేశము ఇప్పుడు లేదు. మరియొక లోకములో ఆకస్మికముగా పడిన వానికివలె ఆతనికి సమస్తము క్రొత్తగా ఉండి అర్థము కాకున్నది. తానెన్నో క్రూరకృత్యములు చేసెను. అయినను తనకివి ఊహకుకూడ అందకాకున్నవి. తన తండ్రి కనిపింపక పోయిన పిమ్మట తండ్రితో వచ్చిన ఆబాపని పెట్టిన బాధలు. అతనితోపాటు తాను బాధించిన ఇతర బ్రాహ్మణులు జ్ఞప్తికి వచ్చినారు. అప్పుడు తానేమి చేసెను? జందెములు శిఖలు తరిగించెను. ఎంత తేలిక శిక్ష! కాని వారికో? అది ప్రాణము తీసినకంటె ఎక్కువ బాధ కలిగించినది — ఈ మౌల్వీఉల్వీకి గడ్డము లాగివేసిన నెట్లుండును? ఆ లాగిన హస్తమాతడు నరికివేయడా!

ఇంతలో నాతనికి ఇస్లాము మతము స్వీకరించిన బ్రాహ్మణుడు జ్ఞాపకమువచ్చెను, ఆ రసూలు ఏమైనాడు? తానాతని మోటుపల్లి పంపియుండెను. ఆతని సంగతి అలావదీను నడుగవలెనని ఉత్కంఠ కలిగెను. కాని ఇది సమయము కాదు.

బడేసాహబు ఆలోచనలో పడెను. అలావదీను ఆలోచనలో పడెను. వారిద్దరును కోటగోడలోనుండి ఆవల చూచుచుండిరి. ఒక్కసారిగా ఆ యిద్దరి చూపులును నిలిచిపోయినవి. దుర్గద్వారమువైపుకు కాంతముగా ఒక యెర్రని బ్రాహ్మణుడు ఒక వృద్ధబ్రాహ్మణునితో నడచి వచ్చుచుండెను. వారివెంట మరి

కొందరు బ్రాహ్మణులు ఉన్నారు. వారందరిలో అలావడీను దృష్టియు బడే సాహబు దృష్టియు నొకరిమీదనే నిలచినవి, ఆ ఎర్రని బాపని మీదనే నిలచినది.

తన పరమశత్రువు ఇట్లు నిస్సహాయుడై కోటను సమీపించుచున్నాడని బడేసాహబు సంతోషించెను. తన కాతనిచే రెండుమారులు కలిగిని పరాభవము నిర్వృతి చేసికొను సమయము వచ్చినదని ఆత డువ్విళ్ళూరుచు, లోనికి వచ్చునా? కొంతవరకు వచ్చి పారిపోవునా?' ఆని శంకించుచుండెను.

మరి అలావడీనో? కఠిను డగు అలావడీనో? రాక్షసుడగు అలావడీనో? క్రూరాతిక్రూరు డగు అలావడీనో?

తాను పూర్వ జన్మములలో చేసిన పుణ్యపుంజమునో, ఈ జన్మములో నున్న ప్రేమసర్వస్వమునో, నూతన మతములో నొక దేవదూతనో, చూచు నట్లు ఆనంద తన్మయతతో, యోగి చూపు వంటి చూపుతో, అతడు ఆతని చూచు చుండెను. హృదయము దడదడ లాడుచున్నది. నోటికి మాటలు వచ్చుటలేదు. కన్నుల నీరు క్రమ్ముచున్నది. వారి నందరను అలజడి చేయక తన యెదుట నుంచమని ఆజ్ఞాపన మెట్లో ద్వారపాలకులకు అందజేసెను. వారు వచ్చుచున్న ఆ కొద్ది వ్యవదానమును కూడ ఆతడు భరింపలేకున్నాడు.

'ఏమి భాగ్యము! ఎన్నాళ్ళ కీ భాగ్యము!'

అటు బడేసాహబును, ఇటు అలావడీనును అప్రయత్నముగా ఆవచ్చు చున్న వారిని సమీపించుటకు ద్వారమువంకకు అడుగులు వేసిరి. ఆ బ్రాహ్మ ణులు ద్వారము దాటి వారిని సమీపించిరి. ఆ వచ్చినది ఎర్రయ, కమల నాభ మాత్యుడు, వారి తోడివారు.

ముందుకు నిర్భయముగా వచ్చుచున్న ఎర్రయ బడే సాహబును గుర్తించి క్షణకాల మాగెను. అంతలో నాతడు అలావడీను సౌమ్యాకారము చూచి మరల ధైర్యముతో ముందుకు కదలెను. క్రూరాతిక్రూరుడని పేరు పొందిన అలావడీను ఇతడేనా, అని ఆతని కాశ్చర్యమై, 'అలావడీను ప్రభువు ఎవరో మాకు చెప్పెదరా?' ఆని ప్రశ్నించెను.

'ఇదుగో!' అని అలావడీను తన్ను నిర్దేశించెను.

'ఎవరిదా గొంతు? ఎక్కడనో విన్నట్లున్నది ఎక్కడ? తన మేనత్త యింట. అది తన పెద్ద బావమరది గొంతు! ఆగడ్డముతో, శిఖా విహీనమైన

శిరస్సుతో, నమాజు చేయుటతో బొబ్బికట్టిన ముఖముతో, ఇస్లాము మతముచే వచ్చిన అపూర్వశోభతో నాతనిని ఎర్రయ ముందు గుర్తింపలేదు. స్నాతక వ్రతమునాడు ఇతడే తన చెల్లెలిని తనకిత్తునని చెప్పి తన్ను కాశీయాత్రకు పోవలదని కోరియుండెను, ఆప్పు డితనికి తాను పంచెలచాపు కప్పియుండెను. ఇతనికి తనభార్యయం దెంత వాత్సల్యము! కంసునికి వలెనా? కాదు, కాదు. ఆతడు చెల్లెలిపై ప్రేమ చూపనిది ఎప్పుడును లేదు.

అలావదీన్ అలావదీన్ అని తాను విన్నవాడు వీడా? వీనిమీద తాను కోపించుట యెట్లు? ఇంత క్రూరుడని ప్రసిద్ధి కల యీతడు తనవంక ఆర్ధమైన ద్రుక్కులు పరపుచున్నాడు. ఇట్టివానిపై కోపించుటెట్లు? ఇట్టివానిపై కాఠిన్యము వహించుటెట్లు?

ఇతడు బ్రాహ్మణుడై పుట్టి వేదము విసర్జించినాడు. యజ్ఞోపవీతము తీసివేసినాడు. శిఖ తొలగించినాడు. ఈ తురకవేషము వేసినాడు ఎన్నో ఘాతుక కృత్యము లొనర్చె నని ప్రతీతి. సోదరులకు తల్లిదండ్రులకు అతని గ్రామీణులకు అతడు చేసిన కాస్తి ఎర్రయ కింకను తెలియదు. అయినను తనకు ఇతనిపై ఉబికి వచ్చుచున్న ప్రేమకు ఏదో అడ్డు తగులుచున్నది. ముందుకు నడువబోగా కాళ్లు సాగుటలేదు. కౌగిలింప దలచియు చేతులు చాచ లేకున్నాడు. ఆదర వాక్కులాడబోగా నోరు కట్టువడుచున్నది. — 'ఏమిది, నరసింహా! అహోబిలన్నసింహా!'

ఇది కమలనాభామాత్యుడు సూక్ష్మముగా గమనించి, ఎర్రయను చూపులతో నుద్బోధించెను. ఆత డుద్బుద్ధుడయ్యెను.

'మీ రేపనిమీద వచ్చినారు?' - అలావదీను మాటలలోని సౌమ్యతకు ఆతని అనుచరు లాశ్చర్యపడుచుండ కమలనాభామాత్యుడు ప్రత్యుత్తరమిచ్చెను.

'మా పాండిత్యము ప్రభువులకు ప్రదర్శించి సన్మానము పొంద సంచారము చేయుచు ఇటు వచ్చినాము'

'మీ కెందులో పాండిత్యము కలదు?'

'సమస్త శాస్త్రములు అధ్యయనము చేసినాము. మమ్ము మీరు పరీక్ష చేయింపవచ్చును. వీ రైదుగురు ఆయుర్వేద వైద్యులు; అనుచు వెంట వచ్చిన బ్రాహ్మణులను నిర్దేశించెను.

అలావదీను నవ్వెను.

'మీ శాస్త్రములు పరీక్ష చేయు పండితుల నందరిని ఉద్యోగములనుండి తీసివేసినాము - మీ మాటకు తిరుగు ఉండదు!'

'అట్లయినచో మమ్మును మీయొద్ద పరీక్షాధికారులగా నియమించు కొనుడు!'

మరల అలావదీను ఫక్కున నవ్వెను.

'మావద్ద పూర్వమున్న పండితులకు ఏమిగౌరపము చేసినామో ఎరుగు దురా? - మీరుకూడా అది కోరుదురా?'

'సెల వీయండి, ప్రభూ!

అలావదీను అది వారికి చెప్పుము 'షేర్ ఖాన్'ను ఆజ్ఞాపింపగా ఆత డిట్లు పలికెను.

'ఒకనాటి అర్ధరాత్రివేళ ప్రభువు వారికి వారిపై కోపము వచ్చి, వారి నందరిని అకస్మాత్తుగా పిలిపించి, పేరోడ ఎక్కించి సముద్ర మధ్య మునకుతీసికొనిపోయి, ఆక్కడనందరిని ఒక్కొక్కరినొక్కొక్క చిన్నదోనెలో ఎక్కించి, సముద్రములో దించి రమ్మనిరి- వారి కొక్కొక్కరికి వారమురోజు లకు సరిపడు ఆహారము నీరుకూడ ఒక్కొక్క దోనెలో దయతో నుంచిరి.

'మా పండితులకు చేసిన మర్యాద వింటిరిగదా! - మీకా మర్యాద చేయ ములే! -' ఇట్లనుచు అలావదీను వికృతముగా నవ్వెను. ఆతని చేష్ట లన్నియు ఎర్రయకు చెప్పరాని వెగటు కలిగించుచుండెను. అలావదీను ఎర్రయతో నేకాంతముగా మాటాడవలెనని ఉత్కంఠతో నున్నాడు. ఆతడు వెంటనే ముఖము చిట్లించి ఎర్రయను నిర్దేశించుచు, 'ఈ ముడి మోముబాపని నామంది రము నంటియున్న చెరసాలలోనుంచి మిగిలిన వీరికి కావలసిన విడుదులు చూపింపుడు. ఈ వైద్యులకు మన రోగులను చూపుడు!' అని భటుల కాజ్ఞా పించెను.

అంతవరకు మాటాడక మోము ముడుచుకొని యున్న బడేసాహబు ఎర్రయను చెరసాలలో నుంచిన పిమ్మట తృప్తినొందెను.

గుండ్లకమ్మ ఒడ్డుననే అద్దంకి యున్నది. వేమారెడ్డికి వృషభరాజు ప్రసన్నత కలిగిన దాని నూత్న తేజస్సు ఆవహించినది. ఆతడు వాడపల్లి యొద్ద తురుష్క సైన్యముపై సాధించిన మహావిజయముతో ఆత్మవిశ్వాస మతిశయించినది. అన్నిటికి తోడుగ తండ్రి ప్రోలారెడ్డి కొంచెము కొంచెముగా కనకము సిద్ధము చేసి యొసంగుచున్నాడు. ఆతడు పుష్కలముగా కూపలసిన దంతయు సిద్ధము చేయడు. ఎంత అవసరమని వేమారెడ్డి చెప్పుకొన్న అంతకు కొంచెము తక్కువగా చేసి యిచ్చును. ఆ చేయునది మాత్రము శీఘ్రముగానే చేయును. తానిచ్చిన సువర్ణము కుమారుడేపిధముగా వ్యయము చేయుచున్నదియు ప్రోలయ పరీక్షించుచుండును. వేమారెడ్డి అబద్ధమాడ డని విశ్వాస మున్నను ప్రోలయకు సంపూర్ణ విశ్వాసములేదు, కనకము పాపిష్ఠిది. తన రెండవ కుమారుడు పుత్రవంతుడు. ఈ పాపిష్ఠి కనకములను తన ప్రియకుమారునకు ఇచ్చుట కాతడు వెనుదీయుటకు ఒక్కటేకారణము. ఆతడు దానిని దుర్వినియోగము చేసినచో ఇహమునకు పరమునకు కాకుండ చెడిపోవు నని ఆతని భయము. పసివాని చేతికి పదనుగల కత్తిని ఏ తండ్రియైన నిచ్చునా? వేమారెడ్డికి నలుబది యేండ్లున్నను తండ్రి దృష్టిలో నాత డింకను పసివాడే! అచంచలమగు ధర్మనిష్ఠ ఆతని కున్నను ఏక్షణమున నే విధముగా మారునో, అందుచే నాతని కేయాపద మూడునో అని తండ్రికి జంకుగా నుండెను.

ఆతడిచ్చిన బంగారము రామాప్రెగ్గడ లెక్క పుస్తకములలో ఎక్కించును. అది యెప్పుడు ఏయే విధముగా వెచ్చించినదియు లెక్కవ్రాయును. అందులో ఒక్క చిన్నమెత్తుకూడ లెక్కలేకుండ నుండుటకు వీలులేదు. ఆలెక్కలన్నియు ఎప్పటి కప్పుడు ప్రోలయ స్వయముగా వరీక్షించును, మొదట చండీయాగమునకు వేమారెడ్డి తీసికొనిపోయిన కనకమంతయు అక్కడ వెచ్చించి వట్టి చేతులతో ఇంటికి వచ్చి హేమము కావలెనని వేమారెడ్డి అర్థించిన మాటలు విన్నంతనే ప్రోలయ మండిపడెను. వేమన్న వీనీతుడై నమస్కరించి లెక్కలు

వ్రాయించితి నని విన్నవించి వ్రైగ్గడను పిలిచి తండ్రికి చూపించెను. కోపావేశము తగ్గక యే వ్రోలయ ఆ లెక్కలు పరీక్షింప సాగెను. పరీక్షించిన కొలది కోపము తగ్గనది' లెక్కలు పూర్తిగా చూచు నప్పటికి ఆతని కానంద ముద్వేలమై రామా వ్రైగ్గడకు నమస్కరించి వేమన్నను బిగియార కౌగిలించుకొని శిరము మూర్కొని. 'నేను సాధించిన విద్యను మీరు సార్థకము చేయుచున్నారు నాయనా!'అని అగ్గించెను.

కాని వెంటనే అమాంతముగా వ్రోలయకు సందేహము వచ్చినది. 'ఈ లెక్కలు కల్పితములైనచో?' వెంటనే రామా వ్రైగ్గడను గ్రుచ్చిగ్రుచ్చి ఆలెక్కలను గూర్చి ఎన్నియో వ్రశ్నలు వేసెను. వ్రైగ్గడ తొణకకుండ వ్రత్యుత్తరము లిచ్చుచుండ ఆతడిచ్చు నుత్తరములనే గాక ఆతని ముఖభంగి కంఠముతీరు నిశితముగా పరీక్షించి వ్రోలయ తుదకు తృప్తిపడెను.

అత డిచ్చుచున్న ద్రవ్యమంతయు వ్రధానముగా ధర్మయుద్ధమున కవసరమైన కర్చులకే వినియోగపడుచున్నది. భటులకు కావలసిన ఆయుధములకు వస్త్రాహారములకు జీతములకును, రక్షణ కవసరమగు దుర్గాది నిర్మాణములకును,—ఇట్టి ధర్మ కార్యములనే ఆ కనకము లెచ్చింపబడుచున్నట్లు వ్రోలయ చూచుకొని తృప్తి పడుచుండెను.

శ్రీశైల వ్రాంతమునుండి మల్లారెడ్డియు వేమారెడ్డియు వెడలిపోయిన పిమ్మట అన్నమ్మకు ఆక్కడ నివాసము రుచింపలేదు. ఆక్కడ వ్రారంభించిన కార్యభార మంతయు వీరమ్మకప్పగించినది. వీరమ్మ సమర్థతతో సర్వసన్నాహములు చేయుచున్నది. చూచితృప్తి పడినది. ధర్మవృషభము వేమారెడ్డిని అనుగ్రహించిన దాది పోతరాజు వేమారెడ్డి నివాసస్థలముననె ఉండుట భావ్యమని ఆమెకు తోచినది. స్వప్నములో ఆమెకు పోతరాజు బాలకృష్ణుని వేషముతో వ్రత్యక్షమై తన చేయిపట్టి వ్రాచీముఖముగా లాగుకొని పోవుచున్నట్లు ఒకనాటి రాత్రి కనబడినాడు. దానితో ఆమె అద్దంకి వెళ్ళుటకు నిశ్చయించినది. ఆమెకు తనభర్త దేశములోనికి వచ్చినతరువాత అతనికింతదూరమున నుండుటయు ఇష్టము లేకున్నది.

ఆమె శంకరస్వాములను దర్శించి వారికి తనకోరికనివేదించినది. స్వామి నారాయణస్మరణ మొనర్చి ఆనుజ్ఞ నిచ్చుచు పోతరాజు శ్రీశైల మల్లికార్జునుడే,

యనియు అహోబల నృసింహుడే యనియు భావించి పూజింపు మనియు ఆతడు ఆమె ఉభయవంశములకు తారకుడుగా నుండు ననియు, సెలవిచ్చిరి.

అన్నమ్మ కతి పయపరివారముతో అద్దంకికి ప్రయాణమైనది. ఆమె తన ముందు పోతరాజును అందలము ఎక్కించి ప్రయాణముచేయించుచున్నది. ఆమె గుండ్లకమ్మ సాగిన మార్గముననే తన ప్రయాణమును సాగించుచున్నది. పోతరాజుకు ఆగినచోట నెల్లను గుండ్లకమ్మలో స్నానము చేయించుచున్నది. ఆ ప్రయాణము పోతరాజుకు చేయుచున్న ఉత్సవముగానే సాగుచున్నది. ఆతల్లి పోతరాజును తనబిడ్డవలె, తనసోదరునివలె, తనతండ్రినివలె, తనతల్లినివలె - తన ప్రత్యక్షదైవమగు ప్రోలయనువలె ఆదరించుచు ఉపచరించుచు గౌరవించుచు, పూజించుచున్నది.

ఆతనితో ప్రయాణము చేయుచు పోవుచుండగా పంచభూతములు నూత్న వికాసముతో నొప్పారుచున్నట్లు భాసించినవి. ఆకాశమునుండి వేదశ్రుతివలె ఆప్తవాక్యములు వినవచ్చుచున్నవి, రూపరహితు డయిన వాయువు శరీరములకు స్పృశించి ప్రాణముల నపూర్వముగా నుజ్జీవింపజేయుచున్నాడు. సూర్యతేజస్సు చంద్రకాంతి నక్షత్రజ్యోతి. ఈ తేజస్సులేకాక అన్ని తేజస్సులకు మూలభూతమగు ఒక అలౌకిక తేజస్సు ఉద్దీప్తమై ప్రకాశించుచున్నది. అంతరిక్షమునుండి అమృతకల్పములై శీతల వర్షధారలు సమస్తతాపము లుపశమింపజేయుచు నిర్గళితము లగుచున్నవి. పృథివి దివ్యగంధముతో పరివ్యాప్తమై గంధవతియను లక్షణమును లక్ష్య సమన్వితము చేయుచున్నది.

పోతరాజుతో అన్నమ్మ అడుగిడిన చోటనెల్ల భూదేవి పులకరించుచున్నట్లున్నది, భూమిలోనుండి గరికయు, దర్భలును మొలకలెత్తుచున్నవి. పైరు లెక్కడ వేసిన నక్కడ వృద్ధియగుటకు పదనయి సిద్ధముగా నున్నట్లు ఉర్వర చూపట్టుచున్నది. ఆతడు స్నానము చేసిన రేవులు పుణ్యతీర్థము లగుచున్నవి. ఆతని అందలము దిక్కుల దివ్యతేజస్సులు వెదజల్లుచున్నవి. ఆతనితోపాటు చల్లగా మెల్లని గాలి సుగంధముతో గూడి ప్రసరించుచున్నది. దిక్కు లన్నియు క్రొత్తతెలివి నందుచున్నవి.

పోతరాజుతోగూడ ఋతురాజు ముందుకు సాగుచున్నట్లున్నాడు. చెట్లు చిగుర్చుచున్నవి. పక్షు లెక్కడెక్కడ నుండియో చేరుకొనుచున్నవి. నిర్మానుష్య

ముగా నున్న పల్లెలకు జనులు నెమ్మది నెమ్మదిగా చేరుకొనుచున్నారు. ఇన్నాళ్లు వా రేమైనారు? దిక్కులేని పక్షులవలెనే వారును ఎక్కడెక్కడికో పారిపోయి నారు; నీడలేక అల్లాడినారు. పూర్వవాసన బలవత్తరమై లాగగా వారిప్పుడు తమతమ గ్రామములకు చేరుచున్నారు. పాడువడి బీడువేసిన మడులు అక్కడ నొకటి ఇక్కడ నొకటి దుబ్బుకొట్టి దున్ని పైరులు వేయుచున్నారు. వారికి వెనుక లేనిధైర్యము ఇప్పుడు కలుగుచున్నది. వారు పడ్డకష్టములచే వారు మొండిచరచినారు. మునుపు తురక లేమి చేయుదురో అని వారిపేరు విన్నంతనే పారిపోవుచుండెడివారు. వారేమి చేయుదురో అప్పుడు వారికి తెలియదు. అందు వలననే భయ మెక్కువ. ఇపుడు వారేమి చేయుదురో తెలిసిపోయినది. ఎది రించినచో చేతనైన చంపుదురు. ఇంతేకదా, తాము తిండిలేక విశ్రాంతిలేక నిలువ నీడలేక పడిన పాట్లకంటె చావు భయంకరమైనది కాదు. అందుచే చావన్న భయము వారికి పోయినది. చలి తీరినది.

అంతేకాదు. తురకల నెదిరించినచో చంపునది తురకలు మాత్రమేకాదు. తామును తురకలను చంపగలరు. భయ మున్నది తమకే గాదు. తురకలకును భయ మున్నది. తమకంటె వారికే పదింతల భయమున్నది. పారిపోవునది తామేకాదు. తురకలును పారిపోవుదురు. తాము ప్రాణములకు తెగించినచో తమకే తురకలు భయపడి పారిపోవుచుండిరి తురకలు చూపినంత భయము తమ కెన్నడులేదు. తురకలు పారిపోయినంత త్వరగా తామెన్నడు పారిపోలేదు. ఇట్టి భావములు వారికి తెలిసియో తెలియకయో హృదయములలో నాటుకొన్నవి. అందుచే జనపదములలో జనులు ప్రవేశించుచున్నారు, పొలములలో పైరులు వెలయుచున్నవి, అడవులలో దిక్కులేక తిరుగాడిన పశువులు పోతరించి మందలు మందలుగా ఊళ్లు పట్టుచున్నవి. ఎండిపోయిన గోవులు అమృతధారలు చిలుకుచున్నవి.

ఏయూరి కాయూరు చిన్న కోటవలె రూపొందుచున్నది. పెద్దగ్రామముల చుట్టు అగడ్తలు త్రవ్వి గోడలవలె తీర్చి వానిపైన రేగు, పుల్లరేగు, తుమ్మ, మొదలగు కంపలతో కంచెలు వేయుచున్నారు. చిన్న యూళ్ళకు కాపుగా కం చెలే వేయుచున్నారు. ప్రతి గ్రామమునను, గ్రామాంతర్భాగము రక్షించుటకు తలవరులును బాహ్యరక్షణకు బారికాపులును ఏర్పాటు అగుచున్నారు. గ్రామీణు లకు వెనుకటికంటె దేహదార్ఢ్యము పెరుగలేదు. బలము హెచ్చలేదు. కాని

వారి హృదయములు బిరు సెక్కినవి. నందికంత పోతరాజు వారి హృదయము లలో చల్లగా ప్రవేశించి దృఢముగా తిష్టవేసె నేమో? వారిలో వీరము శృంగా రము రేకెత్తుచున్నవి.

ఇట్లు మారిపోయిన జనపదములవెంట పోతరాజు అందలముపై సాగి పోవుచుండగా ఉత్సవము మహావైభవముగా నేల సాగకుండును!

ఈ విధముగా పోతరాజు గుండ్లకమ్మ వెంట సాగిపోవుచుండగా ఆతని దేహము కూడ సాగుచున్నట్లే యున్నది. ఒకనాడు చూడగా అన్నమ్మకే ఆశ్చర్య మైనది. పసివానివలె నామె నందిటిలో నిరికియుండు పోతరాజు ఆమె నందిటిలో నిమిడక జేనెడు పెరిగియుండెను, మరి కొన్ని రోజులకు మూరెడు పెరిగెను. అన్నమ్మ అద్దంకి చేరుకొను నప్పటికి పోతరాజు రెండు విండ్లన్నర ప్రమాణముగల పెద్ద కఠారిగా మారి నాడు.

వేమారెడ్డి యెదురువచ్చి తల్లికి వందన మాచరించి నందికంత పోతరా జును పూజా పురస్సరముగా తెచ్చి మహోత్సవముతో ప్రత్యేక దేవాయతనములో ప్రతిష్టించినాడు.

పూజ్యురాలగు అన్నమ్మ భర్తను మఱల నొక్కసారి సందర్శించుటకు హృదయావేగముతో బయలుదేరినది. అరువదియేండ్లు నిండిన అన్నమ్మ ముఖ ము.ప రక్తము చిమ్మి ఇరువదేండ్ల వయస్సు తగ్గిన దానివలె కనిపించుచున్నది. ఎక్కడనుండియో కొంచెము సిగ్గుకూడ ఆమెకు వచ్చినది. దానితో ముఖము బాలతాపము సోకిన పద్మమువలె చూపట్టు చున్నది.

ఇన్నాళ్ళనుండియు ప్రోలయ ఎక్కువకాలము ఏకాంతముననే గడపు చుండెను. అతనికి జనులతో మాటాడవలెనను ఇచ్ఛ అంతగా లేదు. అడవిలో జీవితమునకు అలవాటు పడినవానికి మనుష్యులతో ప్రసంగము రుచించునా? సత్థిములై యుండు చెట్లు గుట్టలు తీవెలు పొదలు ఏమన్నను ఊరకుండును. కోపపడవు. కోపము కలిగింపవు. మరి మనుష్యులో? అట్లు కాదే! కోపింతురు; కోపము గలిగింతురు. ఎవరైనను కొంచెము మాటాడించినంతనే ప్రోలయకు విసువు చికాకు కోపము వచ్చును. అట్లు కష్టను కలిగింపకుండా అతనితో మాటాడ నేర్చినది వేమారెడ్డియు రామాంబగడయు మాత్రమే!

వేమారెడ్డి వచ్చి ప్రోలయకు తనతల్లి అన్నమ్మ దర్శనార్థము వచ్చినదని నివేదించెను.

ఏమది? ప్రోలయ ఆపాదమస్తకము కంపించు చున్నాడు. భయమా? కోపమా? ప్రేమాతిశయమా? ఏమో! కంపించుటయే కాదు; ఆతని దేహమంతయు నెర్రవారినది, తీవ్రముగా తొందరగా నేమో మాటాడబోయినాడు. నాలుక నోటి కడ్డము పడినది. మాట రాకున్నది, నాలుక పెకలించుటకు ఆతడు విశ్వ ప్రయత్నము చేయుచున్నాడు.

ఇంతలో అన్నమ్మ ఆతని పాదములపై బడి పాదములు కన్నీటితో కడిగినది. ఆమెకును నోట మాట వచ్చుట లేదు. ఆమె నోటి కడ్డ మేమియు లేదు. కాని ఆమె హృదయమే నోటివరకు నిండిపోయినది.

ఆమె స్పృశించిన కాళ్ళను ప్రోలయ చెప్పరాని అసహ్యముతో వెనుకకు లాగుకొన్నాడు. మొద్దువారి అడ్డుపడిన నాలుకను త్రోసికొని, 'ఛీ! ఛీ!-పో! పో!' అను ధ్వనులు వెడలినవి, ఆతడు గటిగా కన్నులు మూసికొని మఱి మూవలకు త్రిప్పుకొనెను.

దెబ్బతిన్న మేకపిల్లవలె అన్నమ్మ జంకుచు క్షణకాలము అచ్చటనే నిలిచి ఈవలకు వచ్చివేసినది. ఆమె విడిచిపోవువరకు ప్రోలయ ఆవలకు త్రిప్పిన మోము ఈవలకు త్రిప్పలేదు. మూసిన కన్నులు తెరువలేదు. అన్నమ్మ వెళ్ళి పోయినట్లు అడుగుల చప్పుళ్ళచే స్పష్టపడిన పిమ్మటకూడ కొంతసేపటివరకు నాత డట్లే యుండి ఆపై సందేహించుచు, మొగ మీవలకు త్రిప్పెను.

ప్రోలయచే నిరాకరింపబడిన అన్నమ్మ చిన్నవోయెను. అట్టి పరాభవము ఆమె యెవ్వరివలనను ఎన్నడును జన్మలో పొందియుండ లేదు, అందులో నామె భర్తవల్ల ఎన్నడు ఇంతమాట అనిపించుకొని యెరుగదు, చిన్నతనములో తల్లి తండ్రులు ఆమెను గారాబము చేసెడివారు! సోదరులు ఆదరించెడివారు. చెలికత్తెలు స్నేహము చూపెడువారు. భర్త ప్రేమించెడివాడు. ఆమెను నెత్తిన పెట్టుకొనెడివారు, పిల్ల లందరు ఆమెను దేవతగానే పూజించెడివారు. ఆమె బంధు సంపద గలది. బంధువు లంద రామెను ఆప్తురాలిగా భావించి తమ కిష్టసుఖము లను చెప్పికొను చుండెడివారు. ఆమె కెన్నడు ముఖము చిన్నపుచ్చుకొను అవసరము పట్టలేదు.

నే డామె ముఖము చిన్నపుచ్చుకొని వెడలిపోవుచండ చూచిన వేమారెడ్డి ముఖము వర్ణింపరానంత చిన్నపోయెను. ఆతడు గద్గద కంఠముతో 'అమ్మా' యనుచు ఆమెవెంట బయటికి వచ్చెను.

'ఏమి నాయనా?' - అన్నమ్మ ఆదరముతో ప్రశ్నించెను.

'నిన్ను పొమ్మనగా విన్న నాకు కోపము వచ్చిన దమ్మా!'

'ఎంత తప్పు నాయనా! వెంటనే వారి కాళ్ళపైబడి క్షమాపణము కోరుకో! మహానుభావులు!'

'అమ్మా?'

'ఏమి నాయనా?'

'నా కర్థము కాలేదమ్మా!'

'నాయనా!' అడవులలో ఇన్నేళ్ళు తిరిగి తిరిగి వచ్చినారు. గోసాయిలకు ఏమేమి నియమము లుండునో, మన కేమి తెలియును తండ్రీ!'

వేమారెడ్డి ముఖములో వింతవెలుగు భాసించినది. వెంటనే ఆతడు తండ్రివద్దకు పోయి పాదములు పట్టుకొని 'క్షమింపు'మని ప్రార్థించెను ఆతని కిని తల్లికిని జరిగిన సంభాషణము వినియున్న ప్రోలయ కరుణార్ద్ర మగు ఆ దృష్టితో తని విలోకించెను.

'వేమన్నా! మీ అమ్మను నాకెన్నడు కంటపడనీయవద్దని చెప్పితిని గదా! ఆమె కికమీదట పోతరాజే ప్రత్యక్షదైవ మని చెప్పు!'

* * * *

మరల నెన్నడును అన్నమ్మ భర్తృసందర్శనము చేయుటకు కాంక్షింప లేదు. ఆమె ఎల్లప్పుడును పోతరాజు దేవాయతనమునందే వసించుచు పూజారిణియై పోతరాజుకు సేవలు చేయుచుండెను. నిత్యము పోతరాజును గుండ్లకమ్మ నీటితో స్నానము చేయించి అలంకరించెడిది. ఆ దేవాయతనము మధ్యలో ఆమె యాతని నిలువున నిలువబెట్టి ధూపదీప నైవేద్యములతో అర్చించును.

వేమారెడ్డి నిత్యమును స్నానము చేసిన పెంటనే పోతరాజు గుడికిపోయి పోతరాజుకును తల్లికిని నమస్కరించి వచ్చిగాని ఏ కార్యమునకును ఉపక్రమింపడు. ఆతని బంధువులును పరిజనులును పోతరాజుకు మ్రొక్కుకొనియే సర్వ కార్యములు నుపక్రమించుచున్నారు.

55

చెరసాలలో ఎర్రయకు స్నానసంధ్యాదికములకు ఆటంకము కలుగలేదు. ఆతడు అవి పూర్తి చేసికొని ఈవల గదిలోనికి వచ్చి కూర్చున్నట్లు తెలియగనే అలావదీను అక్కడికి వచ్చెను. అట్లువచ్చిన ఆతని రూపము ఎర్రయకు తన జీవితకాలములో మరపునకు వచ్చునట్లు లేదు. ఒక్క యీ జీవిత కాలములోనే కాదు. మరి యెన్నిజన్మ లాత డెత్తవలసినను మరచునట్లు లేదు.

అలావదీను నోటమాట వచ్చుటలేదు. ఆతని కేకధారగా కన్నీరు కారుచున్నది. ఆతడు ప్రేమమీర బిగియార ఎర్రయను కౌగిలించుకొన బోవును. మరల తననుతానే వారించుకొనును. సంబోధింపబోవును. మరల తనను తానే వారించుకొనును. సంబోధింపబోవును. ఏమని: - 'బావా! -' అని.

అతి ప్రయత్నమున ఆమాట నోటికి వచ్చినది. ఎర్రయయు కన్నీరు కార్చుచుండెను. అలావదీనుకు మరింత ధైర్యము పచ్చినది. 'బావా! బావా!' అనుచు ఆత డేడువసాగెను. ఏడ్చివేడ్చి ఆతడు ఎర్రయను గాఢముగా ఆలింగనము చేసికొనెను.

ఎర్రయ శరీరమునకు అసహ్యమే గగుర్పాటు వచ్చుచున్నది; అంత రంగములో పొంగివచ్చుచున్న ప్రేమతో ఆదర మతిశయించుచున్నది. నరక కూపములో ఉన్న తమ్ములను భార్యను చూచి వారి దీనాలాపము లాలించిన ధర్మజునకు వలెనే ఎర్రయ కాతని నక్కడజూడ ఆదరము కలుగుచుండెను.

'నీవీస్థితికి ఎందుకు వచ్చితివి, బావా?'

'మీకు పూర్వజన్మ కర్మములందు నమ్మక మున్నదిగదా! - మా కట్టిది లేదు. అదృష్టమువే అల్లా తన కృపవలన నాకు మొదటినుండియు మీవేదములందు శాస్త్రములందు ఆచారములందు శ్రద్ధలేకుండ చేసినాడు. కాని ముందు మీలో నన్ను పుట్టించికూడ తనయొద్దకు అల్లా మరల లాగికొని నామీద తన అపారకారుణ్యము చూపించినాడు. అయినను ప్రాత సంబంధములు పూర్తిగా

వదల కున్నవి. ఇస్లామును నిందించు నీబోటి వారిపై నాకు ప్రేమవదలకున్నది. నాకు మీశాస్త్రము లంటకపోయినను కొంతతెలియును. పూర్వజన్మలో చేసిన దుష్కర్మవల్ల నా కీ మతాంతరప్రాప్తి కలిగిన దని మీరందురు. పూర్వవాసనను వదలక మీపై ప్రేమ వదలలేదని మీరందురు కాని అది నిజము కాదు. మీయం దరను సర్వదయామయు డైన అల్లాకరుణకు పాత్రులనుగా చేయవలె నని నా కోరిక. అదియే నా ప్రేమకు కారణము లేకున్న దయ తెలియని నాకు నీపై ఈ వ్యామోహ మేమి? -

ఇది కొంత స్వగతముగా కొంత మాటలుగా ఆతడు పలికెను.

ఎర్రయ అడిగెను: 'ఎవ రామాటా డేది?- నీవు బావవా? - మాబావ పిశాచమవా?—'

ఆమాటలకు అలావదీనులోని పిశాచత్వమే ముఖములో వ్యక్తమయ్యెను. తననూతనమతమును నిందించుట అత డేమాత్రమును సహించునది కాదు. అతడు కోపముతో క్రిందిదౌడ వంకరగా కుడిప్రక్కకు పండ్లు కొరుకుచున్న వానివలె త్రిప్పెను. శత్రువులకు భయంకరమైన ఆ అలావదీను రూపముచూచిన ఎర్రయయే కొంచెము జంకెను. పుట్టిన మతముమీద లేని అభిమానము క్రొత్త మతముపై నీతని కెంత కలిగినది?

ఎర్రయ జంకు నిర్లక్షించినంతనే అలావదీనుకు జాలి కలిగినది. కోప ముపశ మించినది, ప్రేమ ముబికినది.

'నాచెల్లెలు ఎక్కడ నున్నది?'

'ఎప్పుడు?'

'ఇన్నాళ్ళను ఇప్పుడును'

'అడవులలో మారుపడి కొన్నాళ్లు చెంచులలో చెంచులక్ష్మిగా ఉండెనట!'

ఆమాటలు వినగానే అలావదీనుకు తన చెల్లెలిని చిన్నప్పుడు చెంచులక్ష్మి యని గారాబముతో నెత్తిన పెట్టుకొని ఆడించు ముద్దాడినది స్మృతికి వచ్చినది. పుట్టక పుట్టక ఆడుబడుచు ఇంట జన్మించుటచే ఆమెతల్లి పోలమ్మ అది దీర్ఘా యువుగా మనగలందులకు, బిచ్చమెత్తుకొనుచు చెంచులు రాగా వారిలో ఒక వృద్ధునిచేతికి మహాలక్ష్మి నిచ్చి ఆతనికి పంచెలచాపు భోజనమునకు మోయనును ఇచ్చి ఆతనివలననుండి మరల గ్రహించినది. అందుచే మహాలక్ష్మిని తాను

ముఖ్యముగా చెంచులక్ష్మి యని ముద్దుపేరుతో పిలిచెడివాడు. అది నిజముగా చెంచులక్ష్మి అయినదని విన్నంతనే ఆతని కాశ్చర్యమైనది. చెంచుల బారినుండి ఎట్లు తప్పించుకొనినదో తెలిసికొనవలెనని ఆతనికి కుతూహలము గలిగినది.

'చెంచుల వలననుండి ఎట్లు తప్పించుకొన్నది?'

'ఆది యేమో నాకు తెలియదు. తరువాత కొంత కాలము ఒకతురక బండెలో నున్నది.'

అలావదీను ముఖము వెలవెలపోయెను. తాను మానభంగము గావించిన మానవతు లందరును గుర్తునకు వచ్చిరి. ఎందరు స్త్రీ లుండిరో అన్నికత్తులతో దేహమంతయు కోసివేయుచున్నటుల ఇప్పు డాతనికి వ్యధ కలిగించుచున్నది. తాను ప్రేమించుచున్న తనచెల్లెలికి కలిగిన ఆపద తలంచుకొనగా ఆతనికి తాను పురుషుడుగా నెందుకు జన్మించితి నని అసహ్యము కలిగినది. అందరు స్త్రీల కును తనవలె బాధపడు సోదరులును తల్లిదండ్రులును ఉందు రని ఇప్పు డాత నికి స్ఫురించినది. కోపముతో మండిపడుచు అత డడిగెను.

'ఆబచ్చా యెవరో యెరుగుదువా ?'

ఎర్రయకును కోపముతో మాట రాకున్నది. అతిప్రయత్నముమీద అతడు జవాబు చెప్పెను.

'అతనిని నీప్రక్కనే ఇందాక చూచితిని పైగా వాడు మల్లారెడ్డి సోదరుడట!'

వెంటనే అలావదీనుకు అతడెవరో అవగత మైనది. స్త్రీముఖ మెరుగ డని పెద్ద ప్రతీతిగల బడేసాహబే తనచెల్లెలిని చెర పెట్టిన దుర్మార్గుడు? అతనికి మనస్సాగలేదు. వెంటనే బడేసాహబును ఆత డక్కడికి పిలిపించెను. బడే సాహబువచ్చి దుర్గాధిపతికి వంగి సలాముచేసి 'ఏమి సెలవ'న్నట్లు నిలిచెను అలావదీను వెనుకటి ఆదర మెంతమాత్రము చూపక ప్రశ్నించెను.

'చెంచులక్ష్మి అని చెంచులు పూజించిన యువతిని నీవు ఎప్పుడైనను బండెలో నుంచితివా ?'

'ఉంచితిని. ఆ విధముగా చెంచులు చేసిన మోసమునకు వారిపై కసి తీర్చికొంటిని.'

'ఆమె ఏమైనది ?

'ఆమెనే మూరులు బానిసగా అమ్ముటకు నా వద్దనుండి యెత్తుకొని పోయినది. ఆమెను రక్షించుటకే నా నంకెళ్లు త్రెంపుకొంటిని. మీకది మొదటనే చెప్పితిని గదా !'

'ఆమె యే మైనది ?'

'నాకు తెలియదు. నన్ను పట్టుకొన్న శత్రువులు ఆమెను మూరులనుండి వదలించినారు. మరల వారినుండి ఆమెను తప్పించుటకు నేనెంత ప్రయత్నించి నను నాకు సాధ్యపడలేదు'.

'ఆమె యెట్లుండెడిది ?'

'వాల్మీకి వర్ణించిన అశోక వనములోని సీతామహాదేవివలె ఉండెడిది ?'

'ఆమెను నీ వెట్లు చూచితివి ?'

'మాతల్లి అన్నమ్మను కంటె భక్తిభావముతో పూజించెడివాడను.'

'ఆమె నిన్నెట్లు చూచెడిది?'

'సీతామహాదేవి రావణాసురుని చూచినట్లే చూచెడిది. అయినను ఇది యంతయు మీకెందుకు సాహబ్‌జీ ?'

అలావదీను మరి మాటాడలేదు. ఆతడు బడేసాహబుకు అనుజ్ఞయిచ్చి అక్కడనుండి పంపివేసి తానును మరి మాటాడక తన నివాసము చేరెను. అత డేకాంతముగా మధనపడ సాగెను.

బడేసాహబు తన చెల్లెలిని సీతామహాదేవి యని వర్ణించినది విన్న మీదట అతనికి చిన్ననాటి స్మృతులెన్నియో ఉద్బుద్ధము లైనవి. దానిని తాను మహాలక్ష్మి సీతామహాలక్ష్మియని చెంచులక్ష్మియని చెంచులరాణి యని ఎన్నెన్ని ముద్దు పేర్ల తోనో పిల్చుచుండెడివాడు. రామాయణములో వాల్మీకి వర్ణించిన సీతామహా దేవి యెట్లుండెడిదో కాని తన చెల్లెలు మాత్రము ప్రత్యక్ష సీత. అతని ప్రేమయో మరేమో కాని తనచెల్లెలి అందము అతనికి లోకములో ఎక్కడను కనబడలేదు. అది వెన్నెలవలె చూచువారికి చల్లదనము కూర్చును. దానిని చూచినంతనే పర దేవతాబుద్ధితో మ్రొక్కవలె కననిపించును. అత్తవారింటి కది పోవుచు తల్లిదండ్రు లకు మ్రొక్కి తనకును మ్రొక్కవచ్చినది. ఆ చిన్నది తనకు మ్రొక్కుచుం డగా తానే దానికి మ్రొక్కవలె ననిపించినది.

బావ తనకంటె నించుక చిన్నయైనను తన యీడువాడు. ఆతని చూచినను ఆతని దేహపుష్టి చూచినను సమవిభక్తమగు నాతని యవయవసౌష్ఠవము చూచినను శ్రీరాముడు ప్రత్యక్ష మైనట్లే తోచుచుండెడిది.

"సమస్సమ విభక్తాంగస్ స్నిగ్ధవర్ణస్ ప్రతాపవాన్"-

వాల్మీకి తన బావనే వర్ణించెనా?

ఇట్లు ఆతని మనస్సు ఆలోచించుచు ఎక్కడికో పోయినది. పోగాపోగా తాను పుచ్చుకొన్న ఇస్లాముమతము ప్రత్యక్షమైనది. మహాప్రవాహమునకు పర్వత మడ్డుతగిలినట్లు అది నిలిచినది. ఊహాప్రవాహ మొకక్షణ మాగినది. అంతలో అది రెండు చీలికలైనది.

క్రొత్త నీరు వచ్చి ప్రాతనీటిని కొట్టివేసిన దందురు. ప్రాతనీరు క్రొత్త నీటితో కొట్టుకొనిపోవు నందురు. అది ఆభాసమాత్రమే! పైకి కనిపించుచే! మురికి యైన క్రొత్తనీరు ప్రాతనీటిని ఆచ్ఛాదించును. ప్రాతనీటిని కనబడకుండ చేయును! కాని ఆ ప్రాతనీరు ఎక్కడికి పోయినది? నదీ గర్భములోనికి పోయినది. సముద్రగర్భము చేరినది. పూర్వము బాహ్యమున నున్నది యిపు డాంతరములోనికి పోయినది. ఇపు డంతరాత్మ యైనది.

అంతే కాదు.అది పైన తన్నాచ్ఛాదించిన నీటిలోని మురికిని క్షోభనమొనర్చి దానినికూడ తేటపరచుటకు పరిశ్రమించును. అట్లే అయినది అలావదీనులోని పూర్వసంస్కారము! అతని హృదయములో నున్న స్వచ్ఛమగు పూర్వసంప్రదాయము ఎర్రయను చూచిన క్షణమునుండి ఉద్బుద్ధ మగుచున్నది.

తాను క్రొత్తగా తీసికొన్న యిస్లాముమతము ఇది యంతయు తప్పని చెప్పుచున్నది. అది శాంతిమతము. శాంతిస్థాపనకు తాముచేసిన పను లెట్టివి? సుల్తాన్ సేనలు చేసిన పను లెట్టివి? ఈ దేశమును నిర్మానుష్యము గావించినది; తాము పాలించుటకు ప్రజలు లేకుండ చేసినదది. అంతే కాదు. తమసేనల కత్తులు శూలములు గండ్రగొడ్డళ్లు త్రుప్పుపట్టకుండ ఉండుటకై నరకుటకు మనుష్యులనే మిగలకుండ నాశన మొనర్చినది. ఊళ్లు పాడువడినవి. చేలలో పైరులులేవు. పట్టణములు తగులబడి పోయినవి. పూర్వము రావణాసురుడు రోజుకు వేయిమంది బ్రాహ్మణులను కాళికాదేవికి బలి యిచ్చుచుండెడి వాడని ఈ దేశములో కథగా చెప్పుచుందురు. అది నిజమో కాదో గాని తమ ప్రభు

వుల యాజ్ఞచే నంతకంటె ఎక్కువమంది బ్రాహ్మణులే దిన దినము నరకబడి నారు. తన బ్రాహ్మణులు, తనవారు - ఆఁ! తాను బ్రాహ్మణుడా!

తాను బ్రాహ్మణుడై పుట్టెను. పండువంటి బ్రాహ్మణ వంశములో పుట్టెను, తనతండ్రి సమస్తవిధముల పవిత్రుడై సోమయాగముతో పవిత్ర తరుడై నారు. తనతల్లి అరుంధతివంటి ముత్తైదువ. తనతమ్ములు స్వచ్ఛమైన సుబ్రహ్మణ్యులు, తనచెల్లెలు సాక్షాత్తుగా సీతామహాదేవి.

అట్టి కుటుంబములో తానెట్లు జన్మించినాడు? -

'గహనా కర్మణో గతిః! - గహనా కర్మణో గతిః!' -

ఒక్కసారి తనతల్లి పాతివ్రత్యమును శంకించు మూహ ఆతనికి కలిగినది. వెంటనే అత డాపాదమస్తకము కంపించిపోయెను. ఆమె లోపము లేకున్న ఇట్టి పాపిష్టడగు తాన ఆమె కెట్లు జన్మించియుండును? వేదవ్రతులయింట బుట్టిన తనకు చిన్ననాటినుండియు వేదమన్న నిష్టములేదు. శౌచమన్న అసహ్యము. దయాదాక్షిణ్యములు దూరములు. పెద్దలన్న నిర్లక్ష్యము తన కీ గుణము లెట్లబ్బినవి?

కాని తనకోసము అనసూయా రుంధతులవంటి తనతల్లి శీలము కూడా శంకించి యింకొక పాపముకూడ కట్టుకొనుటేల?

తనకు ఉపనయనము కాక ముందు తనయూరికి ఒక ఫకీరు వచ్చెను. ఆతడు మల్లయుద్ధములో ప్రవీణుడని అందరు చెప్పుటచే తా నాతనివెంట శిష్యప్రాయుడై వారమునములు సంచరించెను. అత డప్పుడు బలవృద్ధికని కొన్ని మందు లిచ్చియుండెను. దాని ఫలమా, తన చరిత్ర యిట్లు మారుటకు?

చీకటి పడినది. ఆతనిమనస్సు మరల ఎర్రయవై పు ప్రసరించెను, మరల నాతడు ఎర్రయను కలసికొనెను.

'బావా!—'

ఎర్రయ పలుకలేదు. ఆతని ముఖములో చెప్పరాని బాధ దీపము వెలుగున వ్యక్తమైనది. ఈ తురక తన బావయా?

'బావా!—'

మరల జావాబు లేదు!

'ఎర్రయా!—'

'ఏమికావలె, అలావదీన్‌సాహబ్?'

'నేను చేసిన పాపములు వినవలె!'

ఎర్రయ వేడుకతో చెవు లొగ్గెను.

'ఎర్రయా! నీమీద నాకెంత ప్రేమ యున్నదో తెలియునా? - కాని నేను చేసిన పాపములు నీవు వినజాలవు. తమ్ములను, తండ్రిని, తల్లిని, చేతులార చంపిన పాపిని ఎన్నడైన చూచితివా?'

'తురకలలో గలసిన బ్రాహ్మణుడుగాని ఆపని చేయడు! వేదనింద చేయు బ్రాహ్మణుడు తమ్ములను, తండ్రిని, తల్లిని చంపుటలో నాశ్చర్య మేమున్నది?- అతడు తననే చంపుకొనెను -'

"ఎర్రయా! నేను సరిగా నట్టివాడనే! - మరి నాకీ పాపమునకు నిర్వృతి ఏమైన ఉన్నదా?" ఈ మాటలు అలావదీను మిక్కిలి ఆతురుడై పలికెను.

'నీవు నాదృష్టిలో బ్రదికియుండలేదు - ఆ దేహమును మల్లారెడ్డిని ధైర్యముతో ఎదిరించి యుద్ధములో వధలిన -"

ఎర్రయ్యా! - నీకు కృతజ్ఞుడను. నా పాపములు తలచికొన్నకొలది నిస్పృహ కలుగసాగినది. జీవింపవలె ననుకోరికయే పోయినది. నిన్ను చూడగానే ఈ దుర్గము రక్షింపవలె ననునుత్సాహముకూడ లేకున్నది, కాని నీయుపదేశము బాగున్నది. ముందు నిన్ను నాకత్తి కెరజేసి పిమ్మట మల్లారెడ్డిని వధింతును." ఇట్లనుచు నాతడు వికటాట్టహాసము చేసెను.

ఎర్రయ చలింపక ప్రత్యుత్తర మిచ్చెను. "అలావదీన్! - ఈ దేహము ఈప్రాణములు పట్టుకొని శాశ్వతముగా నుండవలె ననుకోరిక యున్నచో ఈ కోటలోనికి వచ్చి యుండను."

'నిన్ను కండలుగా కోసి కాకులకు గ్రద్దలకు వేయింతును!'

'ప్రాణ మున్నప్పుడే లేని దేహాభిమానము ప్రాణము పోయిన తరువాత మాబోంట్ల కుండునా?—అది మీ తురకలకు?'

'ఏమీ?—' అలావదీను హుంకరించెను.

'ఔను! మీకెంత దేహాత్మభావము లేనిదే మీశవముల నంత శ్రద్ధగా మనోజ్ఞమైన గోరీలలో నిలువచేసి ధూపాదులతో వాసింప జేయుదురు!—'

'ఎర్రయ్యా! నీకు నాచేతిలో చావు మూడినది.'

'ఇందాకనే చెప్పితివి గదా!'

'మరి నీ వేపనిమీద వచ్చినా వీకోటలోనికి?'

'ప్రొద్దున నాతోవచ్చిన పండితుండు చెప్పియుండెను గదా!కాని యిప్పుడు ఆలోచింపగా ఈ దుర్గాధిపతికి మృత్యువు రాకుండ పుణ్యశేష మేదైన మిగిలి యున్నచో దాని నెత్తుకొనిపోవుటకు వచ్చినట్లు తోచుచున్నది.'

అలావదీను వెర్రినవ్వు నవ్వెను. 'మల్లారెడ్డిని చంపి మాచెల్లెలిని తెచ్చి అది చూచుచుండగా నీ ప్రాణములు తీసివేసెదను.'

'నన్నింత భయపెట్ట చూతు వెందుకు? మాయింట భయము లేదు. మాపెదతండ్రి బొల్లన, మోసలపురము పట్టించెను. నేను మోటుపల్లి పట్టించెదను!'

అలావదీను పొంగి వచ్చుచున్న కోపము నాపుకొనలేకపోయెను. ఎన్ని మాట లనుచున్నను ఎర్రయను చెనకుటకు ఎంతమాత్ర మాతనికి చేతులు కాళ్ళాడలేదు. గొణుగుకొనుచు నాతడు తన మందిరమునకు పోయెను.

56

బడేసాహబుతో నిధులుతీయు జంగమదేవర వచ్చియుండెను. ఆతని పేరు ప్రసిద్ధి మోటుపల్లి దుర్గమంతట ప్రాకిపోయినది. నిధు లెక్కడ నున్న దియు నాతనికి కనిపించునట! ఎంత ధన మున్నదియు, ఎంత లోతున నున్న దియు నాతడు చెప్పగలడట! ఆతని సామర్థ్యమునుగూర్చి కథ లెన్నియో ప్రచార మగుచున్నవి. ఉత్తరదేశములో ఎందరో మహారాజులు ఆతనిచే ధనము తీయించి భాగ్యవంతు లైరి. దక్షిణమున పాండ్యకేరళ రాజుల భాగ్యమున కంత టికి నతడే కారకుడు. వైశ్యశ్రేష్ఠులలో నెల్ల ధనవంతుడను ప్రతీతిగల అవచి దేవయశ్రేష్ఠి ఆతని సహాయముననే అంత ధనవంతు డాయెనట! ఇప్పు డావల వేమారెడ్డి ఆతడు చూపిన నిధులు దొంగతనముగా తీసికొనిపోయి సైన్యసంపద కూర్చుకొనుచున్నాడు.

అన్నిటికంటె విశేష మొకటి గలదు. జంగమదేవరకు ధనాశ ఈషణ్మా త్రమును లేదు. ఇందర కీంతధన మిప్పించినను ఆ ధనములో భాగ మాతని

కక్కరలేదు. ఇచ్చినను తీసికొనడు. అందుచే నాతడు దరిద్రుడుగనే ఉండి పోయెనట?

ఈ జంగమదేవరతో ఒక్క చిక్కుమాత్ర మున్నది, పుణ్యాత్ములకుతప్ప ఆతడు నిధులుచేసి పెట్టడు. అందులో ఆతనికి మోమోటము లేదు. సూటిగా ముఖము నెదుటనే వారొనర్చిన పాపములు చెప్పి కడిగివేయును.

డబ్బుమీద ఆశ లేని దెవరికి? అయినను పాపము చేయని పుణ్యాత్మల మని తమకు తాము చెప్పుకొను ధైర్య మున్నవా రెవరు? పాపము చేసితి మను భయమతో, పుణ్యమే యెక్కువ చేసితి మను ధైర్యమున్నవారు పలువు రుందురు. అట్టివా రేమి చేయవలెను.

ఎట్లైయిన నేమి? పలువురు జంగమదేవర నాశ్రయించి ఆతని తమ యిండ్లకు రహస్యముగా తీసికొనిపోయిరి. కొందరకాతడు సరిగా నింటి పెద్ద గోడ పాదులో లోతున ధన మున్నదని చెప్పెను. అది యిట్ల పడగొట్టిన గాని లభింపదు. ఆ క్రింద నున్న ధనముతో నిటువంటి యిళ్లు నూరు కట్టుకొనవచ్చు నని జంగమదేవర ధైర్యము చెప్పును. 'నామాట తప్పినచో నాతల యిచ్చెదను' అని నిశ్చయముగా ఆతడు చెప్పును. ఆమాటలతో ఆయింటి యజమానికి ధైర్య మావహించును. కాని తీరా యిల్లు పడగొట్టింప నిశ్చయించునంతలో ఆతని భార్యయో తల్లియో పుత్రుడో వారించును. 'నిక్షేపమువంటి యిల్లు పడగొట్టు కొన్న తర్వాత ఈ జంగమదేవర తల తీసికొని యేమిచేసి కొందుము!'

కొందరి కాతడు అసహ్యమైన పదార్థములతో పూజ చేయింపవలె ననెను. దానికి వారు సిద్ధపడిరి. అయితే ఆద్రవ్యములలో ఒకటి రెండు అసాధ్యము లగుపదార్థములు కూడా నున్నవి. దేవాంగుపిల్లి ఎముక కావలెను.''తెల్లటి రంగు గల గద్ద నేత్రములు కావలెను.' 'గురువారమునాడు ప్రాణము వదలిన కంకము కాలు సంపాదింపవలెను.' ఇట్టివే బహుకష్టసాధ్య మగుద్రవ్యములు సంపాదింపవలసి యుండును. వానికై వెదకుచు 'తా మెప్పుడు భాగ్యవంతుల మగుదుమా!' అని యట్టివారు ఉవ్విళ్ళూరుచుండిరి.

కొందరి కాతడు భయంకర మైనవస్తువులు కావలె ననెను. ఒకపిల్లవారి వ్రేలు, ఒక పిల్లదానిముక్కు,. ఒక ముసలివాని చెవి, - ఇట్టివే హోమార్థము కావలె ననును. కొందరు అది విని భయపడుదురు. కొందరు అవి యెట్లు సం

పాదించుటా యను ప్రయత్నములో నుండి అనవరతము పాపచింతలు మన స్సును వేధించుచుండ యాతన లనుభవించుచుందురు.

కొందరికి నిధి మిక్కిలి లోతున ఉన్న దనెను, అంతలోతు ద్రవ్వు టెట్లు? మధ్య నీటిజల పడును. దానిని తప్పించి అంతలోతుకు పోవు టెట్లా. అని శిల్పులను స్థపతులను విచారించుచుందురు.

ఈ విధముగా చాలభాగ మాజంగమీదేవర వాక్కులు పరీక్షించుట కవకా శమే లేకపోవుచుండెను. కాని కొంద రాతని మాటలు పాటించి జరిపినవారు లేకపో లేదు. అట్టివారు ఆతడు చెప్పినట్లు చేయుటచే తమకు నిధులు లభించిన వని ఒప్పుకొను చుండిరి. అట్టివారు కొలదిమందియే! వారికి దొరికిన నిధులు కూడ కొద్దిపాటివే! అయిన నేమి! జంగమదేవర చెప్పినట్లు చేసినందున వారికి నిధులు లభించినవి. కావున ఎవరికైనను ఆతడు చెప్పినట్లు చేసినచో ఏల లభింపవు!.

కొంద రాతడు చెప్పినట్లు అన్నిటిని చేయుటకు సిద్ధపడిరి. కాని వారికి మనస్సులో జంకు. పాపిష్ఠు లైనవారికి నిధులు లభింప వనిగదా, ఆ జంగమ దేవర చెప్పినది! వా రాతని తీసికొని పోవుటకు నిశ్చయించుకొందురు. కావల సిన ద్రవ్యములు సిద్ధము చేసికొందురు. అప్పుడు వారికి తాము పూర్వము చేసిన పాపము లేవేవో జ్ఞప్తికి వచ్చును. అవి పెద్దవి కావచ్చును, చిన్నవి కావచ్చును! పాపములకు కొలబద్ద యెక్కడిది? ఒకరికి చిన్న పాపముగా కనబడినది ఇంకొ కరికి పెద్దదిగా కనబడును. పాపిష్ఠి యనగా పాపము చేసినవాడేగదా! పాపము చేయని మానవు డెవరా, అను ప్రశ్న అట్టివారికి తోపదు. వారికి తాము చేసిన పాపములే భాసించును. అవియే పెద్దవిగా కనుపట్టును. అగ్నికుండము వలె వారి హృదయములో అవి మండుచున్నట్లు తోచును. ఇట్టి పాపిష్ఠులకు నిధులు లభిం చునా, అని వారు అధైర్య పడుదురు. జంగమదేవర కొరకై బయలుదేరినవా రాగి పోవుదురు.

మరికొంద రట్లు కాదు. వారు ధైర్యశాలురు. వారికి తాము చేసిన పాప ములు భాసింపవు. ఇతరులు పాపము అనుకొన్నవే వారికి ఘనకార్యము అనిపిం చును, అట్టివారి జంగమును దినదినము పలువురు నమీపించుచుండిరి. ఈనాడు అట్టివారు ఆతని నివాసమున ఎందరో ఉండిరి.

ఒకడు నిధిసంగతి ప్రస్తావింపగనే జంగమదేవర 'ఛీ! నీబోటి పాపిష్ఠులకుకూడ నిధులా?' అని కోపించెను, 'నే నేమి పాపము చేసితి నని ఆతడు ప్రశ్నింపగనే స్వయముగా చూచినవాడువలె ఆతడు చేసిన పాపములు బయట పెట్టెను.

'ఛీ! నీవు వెనుక పదునేడేండ్ల క్రిందట ఒక చామనచాయగల పరకాంతతో వ్యభిచరించ లేదా? పాపము చేయలే దని యేమొగముతో నాముందు చెప్ప వచ్చినావు?, అని కసరెను. అతడు 'నిజము ఆపని చేసితినా!' అని జ్ఞాపకము తెచ్చుకొనుటకు ప్రయత్నించుచుండెను. ఆతని ముఖపు కవళికలను బట్టి అక్కడివారు జంగమదేవర చెప్పినది నిజమని నిశ్చయించిరి. ఆతనికి ఉత్తర మిచ్చుటకు ధైర్యము రాలేదు. ఇద్దరు ముగ్గురు ఇట్లు పరిభవింపబడుటచే పాపము చేయలేదని అంతవరకు చెప్పుచున్నవారు ఒక్కొక్కరే నెమ్మదిగా జారుకొనసాగిరి.

'ఏమండీ! మీరు మహాపుణ్యాత్ములవలె ధైర్యముగా కూరుచున్నారు. జ్ఞాపక మున్నదా' ఇప్పటికి సంవత్సరము క్రిందట మీరు మీజ్ఞాతులను మోసము చేసి ధన మపహరించినారుకదూ! అది ఇంకా మీయింట్లోనే ఉన్నట్లున్నదే!'-

ఆ కూరుచున్నవాడు ఆమాటలు విని కొరడా దెబ్బ తిన్నట్లు ఉలికిపడి వెనుదిరిగి చూడకుండ వెడలిపోయెను.

జంగమదేవరకు వెకిలినవ్వు వచ్చినది. అక్కడ ఇక వృద్ధబ్రాహ్మణుడొక్కడే మిగిలిపోయెను.

జంగమయ్య : 'ఏమండీ! బాపనయ్యగారూ?'

బ్రాహ్మణుడు : ఏం జంగమదేవరా?

జంగమ : మీ రేమీ పాపముచేయ లేదని ధైర్యమేనా?

బ్రాహ్మ : మనస్సుతోనూ వాక్కుతోనూ తప్ప ఈ కాయముతో చేసిన గుర్తులేదు.

జంగ : నేను గుర్తు చేస్తాను ఉండండి! ఒకసారి మీ సహపాఠిని కొట్టినారు జ్ఞాపక మున్నదా?

బ్రాహ్మ : ఉండ కేమి? ఒక్క-సారి కాదు, రోజు కొక్క-సారియైనా కొట్టియే యుండును. అదంతయు పదునాలుగేండ్ల లోపుగా జరిగినది. మాండవ్య మహర్షి దయవల్ల అది పాపము గాదు.

జంగ : ఓహో! అయితే ఉండండి, మీ రొక సారి అబద్ధ మాడినారు. జ్ఞాపకము చేసుకోండి !

బ్రాహ్మ : ఒక్క-సారేమి? చాలాసార్లు అబద్ధ మాడినాను, అయినా శుక్రాచార్యులవారి అభ్యన్నుజ్ఞ చాటి ఆడలేదు. అట్టిది పాప మెట్లగును ?

జంగ : పోనీ! ఒకసారి మోసముచేసి డబ్బు తీసికొన్నావుగదూ !

బ్రాహ్మ : ఎబ్బే! ఎన్నడూ చేయలేదు. నీకేదో తప్పుడుమాట వచ్చినది.

జంగ : ఏమయ్యో! బాపనయ్యా! మాటలు సరిగా రానీ నావి తప్పుడు మాట లంటున్నావు. సాహబ్‌జీతో చెప్పమందువా !

బ్రాహ్మ : ఆహా! చెప్పుకో! సాహబ్‌జీ కోరిక మీరనే ఇక్కడ కూర్చున్నాను.

వెంటనే ఆ జంగమదేవర ఆ బ్రాహ్మణుని రెండు కాళ్ళను పట్టుకొని 'రక్షింపు'మని యెంత వేడికొన్నను ఆ వృద్ధునికి ఎంతమాత్రము దయ కలుగ లేదు.

జంగమదేవర ఇక లాభము లేదని గ్రహించి వికటముగా నవ్వుచు లేచెను.

'బాపనయ్యా! నేను నిజముగా భయపడితి ననుకొంటివా! నీవు నిజముగా పుణ్యాత్ముడవే! ఇంతవరకు నిన్ను పరీక్షచేసినాను. నిధులు తీసే మంత్రము ఉపదేశించెదను. మరి దానికి వచ్చే అమావాస్య ఉత్తమ మైనరోజు. కొద్ది రోజులేగా!'

ఆ బ్రాహ్మణుడు తృప్తిపడినట్లే వెడలిపోయెను.

జంగమదేవర తీవ్రముగా ఆలోచించినాడు. ఆ వెంటనే ఆత డలాపదీను వద్దకు పోయి మాటాడినాడు.

'ఖుదావన్‌ద్! మీరు డబ్బుకు చాలా చిక్క-లో ఉన్నారు. ఎందు కీ అవస్థ? మీకు వారము రోజుల్లో ఎంత తీసినా తరగని నిధి తీసిపెట్టెదను' అలా వదీను ముఖము వికసించినది. దాని కేమి కావలె నని అడిగెను.

జంగ : ప్రభూ! ఏమున్నది! ఏమీ పాపము చేయని ఒక బ్రాహ్మణుని గుండెలోని నెత్తురు ఒక కుండలో పట్టి ఈరాత్రి తెప్పించి పెట్టవలె. దానికి వారము రోజులు సంస్కారములు చేయవలసి యుండును.

అలావదీను : పాపము చేయని మనిషి ఉండునా ?

జంగ : నేను చూపింతును. ఆతని నెత్తురు తెప్పించండి !

అలావదీనుని షేర్ఖానుని పిలిచి ఆ జంగము చూపిన మనిషి గుండెలో నెత్తురు కుండలో పట్టి ఆరాత్రికి తెప్పించి జంగమ దేవర విడిదికి చేర్పుమని ఆజ్ఞచేసెను. జంగమదేవర సెలవు తీసికొని షేర్ఖానుకు తనతో అంతవరకు మాటాడిన వృద్ధబ్రాహ్మణుని చూపెను. ఆ బ్రాహ్మణుడు కమలనాభామాత్య చూడామణి జంగమయ్య నిజముగా నిధులు తీయగలడేమో పరీక్షించి తనకు తెలుపుమని అలావదీనే ఆతని నియోగించియుండెను. జంగమదేవర షేర్ఖా నుకు ఆతడు వెనుదిరిగి యుండగా దూరమునుండి చూపించియుండెను. కాని ఆ అమాత్య చూడామణికి వీపునగూడ కన్ను లున్నవని అత డే మెరుగును?

జంగమదేవర వెళ్ళిన కొద్దిసేపటికి అలావదీనువద్దకు వార్తాహరుడు పడివడిగా వచ్చి దూరమున నౌకలేవో కనపడిన వని నివేదించెను.

మరికొంతసేపటికి మరియొక వేగరి వచ్చి సంతోషము చిందులాడుచున్న ముఖముతో ఆ నౌకలపై అర్ధచంద్ర ధ్వజములు అల్లలాడు చున్నవని చెప్పగా విని అల్లా హూ! అక్బర్! అని ఆతడు సింహనాద మొనర్చెను. అతనికి ప్రాణ ములు లేచివచ్చిన ట్లైనది. ఎన్నాళ్ళకు పాదుషావారి అనుగ్రహముతోపాటు అల్లా అనుగ్రహమును వచ్చినది! సంతోషముతో అతడు అశ్వమెక్కి వెంటనే కోట గోడ లన్నియు పరీక్షించెను. కాపున్న భటు లందరు జాగరూకులై ఉండిరి. ఆవల మల్లారెడ్డి సైనికులు కోట ముట్టడి పూర్తిచేయలేదు. ఎన్నియో ప్రదేశ ములు వారాక్రమింపకయే వదలిరి. అందుచే తనభటులకు కావలసిన వస్తువు లన్నియు బైటనుండి స్వేచ్ఛగా తెచ్చుకొనుటకు అవకాశము గలుగుచున్నది. అది చూడ అలావదీనుకు మల్లారెడ్డిపై న్యూనభావము గలిగినది. వ్యవసాయము

చేసికొనువారు సేనలు నడపగలరా, కోటలు ముట్టడింప గలరా? ఏమాత్రము కన్నులున్నను ఇట్లు చేయుదురా?

ఇట్లు తలచుచుండగా ఆతనికి ఆకస్మికముగా ఊహ ఒకటి తట్టినది. 'ఇందులో మోసం వేరే ఉండవచ్చును. ఎంత బుద్ధిహీనుడైనను కోటముట్టడిలో ఇంత సందుబు వదలునా? కాక ముట్టడి పూర్తిచేయుటకు తగినంత సేన లేక పోవలయును. అయినను నమ్మరాదు.' ఇట్లనుకొనుచు ఆతడు తన సేనానులను పిలిపించి వారి కాసందులు చూపి, ఆ ప్రదేశములు జాగరూకులై కనిపెట్టుచుం డవలసిన దనియు, అటువైపు రాకపోకలు జరుపవద్దనియు ఆజ్ఞాపించెను.

దుర్గ మిట్లు పరీక్షించి ఆతరువాత ఆతడు ఓడరేవుకు వచ్చి అక్కడి రక్షణలు కట్టుదిట్టముగా నున్నట్లు ధ్రువపరచుకొనెను. రేవులో పదునైదు యుద్ధ నౌకలు ఏక్షణమునందైనను యుద్ధమునకు సిద్ధముగా నున్నవి. ఆ నౌకల కధిపతియగు ఆలీఖాన్ అలావదీనును చూచినంతనే తస్లీముచేసి సగౌరవముగా తన నౌకలోనికి తీసికొనిపోయి కూర్చుండజేసి షర్బత్తు లిచ్చి గౌరవించెను.

అప్పుడు రేవుకు ఆవల నున్న నౌకల యొద్దనుండి వార్తాహరులు చిన్న దోనెలలో వచ్చి ప్రభువుల దర్శనార్థము అనుజ్ఞ వేడుచున్నారని వార్తాహరుడు నివేదించెను. వారు వచ్చుటకు వెంటనే అనుమతి యైనది.

వార్తాహరులు వచ్చి వంగి సలాములుచేసి తాము తెచ్చిన కానుకలు మిక్కిలి విలువగలవి ఎన్నో అలావదీనుకు సమర్పించి తాము సుల్తానువారి నౌకల అధిపతి పంపిన వార్తాహరుల మని నివేదించుకొనిరి. వెంటనే ఆతడు వారిని సుల్తానువారు పంపిన అధికారపత్రములు చూడుడని క్లుప్తముగా నడిగెను. వారు తమ అంగీలను వెంటతెచ్చిన దస్త్రములను వెదకి ఆశ్చర్యపడుచు తెల్ల బోయిరి. వారి అధికారపత్రములు కనబడలేదు. వారు అమాయకముగా చూచు చున్నను వారి చూపులు దుర్గాధిపతి నమ్మలేదు. ఆతడు కడుతీక్ష్ణముగా వారివంక చూచినను వా రేమాత్రము జంకలేదు.

అలావదీను క్షణకాల మాలోచనలో పడెను. అది కనిపెట్టి వార్తాహరులు తమస్థితి యిట్లు విన్నవించుకొనిరి.

'ఖుదావన్‌డ్! ఎంత పొరపాటైనది! ఏవో నౌకలు మమ్ములను ఉదయమునుండి వెంటాడి తరుముకొనుచు వచ్చుచుండగా నెట్టెట్లో ఓడలలోని

తెల్ల వారి నందరినీ తొందరచేసి హింసించి మనరేవు సమీపింప గలిగి నాము. రేవు సమీపించిన కొలది మమ్ము వెంటాడుచున్న నావలు వెనుకాడ సాగినవి. అదృష్టవశమున చీకటిపడుచుండుటచే రేవు సమీపింప గలిగితిమి. రేవులో శీఘ్రముగా చేరవలె నను తొందరలో మానౌకాధిపతులు అధికారపత్రములు దస్త్రములలో కట్టించుట మరచిన ట్లున్నారు. ఈరాత్రి వెంటనే రేవులో చేరి తల దాచుకొన్ననే గాని, తెల్లవారినచో మమ్ము వెంటాడిన శత్రునౌకల చేతులలో మా నౌకలు దెబ్బతినక తప్పదు. రేవులోనికి వచ్చుటకు సుల్తానువారి నౌకలకు అనుమతి అనుగ్రహించు, ప్రభూ!'

ఈ మాటలు వినుచు అలావదీను మరింత సందేహముతో వారివంక తీక్ష్ణముగా చూచెను, ఈమారును వార్తాహరులు జంకలేదు. అలావదీను ఒక్కక్షణ మాలోచించి ఆ వార్తాహరులను బంధింప ఆలీఖానుకు ఆజ్ఞాపించెను. ఆ పిమ్మట నాతడు ఆ వచ్చిన నౌకల విషయము ఏమి నిర్ధారణ చేయవలెనా: అని యేకాంతమున ఆలీతో సంప్రదించెను.

ఈ దూతల మాటలు నమ్మదగినవిగా లేవు. నిజమే! ఎవరైనను అధికారపత్రములు మరచి వత్తురా? అయినను తొందరలో ఎట్టి పొరపాటైనను చేయుటకు అవకాశ మున్నది. నిజముగా ఆ వచ్చినవి సుల్తానువారు పంపిన నౌకలే ఐ యుండి అవి శత్రువులవల్ల ఆపదలో నున్నమాట నిజమే అయిన చో మనము అనుమతి నిరాకరించిన యెడ ఎంత ప్రమాదము సంభవించును? - ఈ విధముగా వా రాలోచించిరి.

అందుచే వారు ఆవచ్చిన నౌకలను పరీక్షించుటకై తమవారిని స్వాగతమునకువలె పంప నిశ్చయించిరి. ఆపని చేయుటకు తగినవా రెవరు? పెద్ద నౌకాదళముతో వచ్చిన నౌకాధిపతిని సగౌరవముగా తెచ్చుటకు తగినవాడుగా నుండవలెను, వారు శత్రువు లైనచో పరీక్షింప సమర్థులై ఆత డుండవలెను. తాను వెళ్లుటకు వీలులేదు. ఆలీఖాను అంతకంటెను వీలులేదు. వారికి ఇక్కడ దుర్గములోను ఓడరేవులోను పెత్తనము చేయవలసిన భార మున్నది. అలావదీను మనస్సు తనక్రింద ప్రథమాధికారి యగు బడేసాహబుపై ప్రసరించెను. ఆతడు మల్లారెడ్డిపై చూపిన అభిమానము లెక్కచేయ దగినదికాదు. అది ఆవేశముతో ఆత డన్నమాట తనకుమాత్ర మావేశము రాలేదా? అతడు బహుసమర్థుడు. ఇ

ట్లాలోచించుకొని ఆతని పేరు సూచింపగా ఆలీఖాను వెంటనే మనస్ఫూర్తిగా అంగీకరించెను:

అలావదీన్ వెంటనే బడేసాహబును పిలిపించి ఆదరముతో నిట్లు పలికెను;

సాహబ్‌జీ: ఇప్పుడొక చిక్కు వచ్చినది. అర్ధచంద్ర ధ్వజము లెత్తిన నౌకలు కొన్ని రేవులోనికి ప్రవేశానుమతి కోరుచు ఆవల నిలిచియున్నవి. అవి సుల్తానువారు పంపిన నౌక లనుచు వార్తాహరులు వచ్చినారు. వారివెంట అధికార పత్రములు లేకుండుటచే ఇది శత్రునౌకల మోసమేమోయని మాకు సందేహము కలిగినది. భూమిపైపున ఒకవంక కోట ముట్టడి సాగుచుండగా ఇటు రేవులోనికి తెలియని నౌకలను రానిచ్చుట ప్రమాదకరము కాదా: అవి నిజముగా సుల్తానువారి నౌకలే అయినచో రానీయకుండుటయు ప్రమాదకరమే: కావున ఆ నౌకలను పరీక్షించి సముచితవిధముగా వ్యవహరించుటకు వారియొద్దకు సమర్థులు విశ్వాసపాత్రులు అగు మిమ్ము పంపవలసి వచ్చినది. ఈ కార్యము చక్కబెట్టుడు !'

బడేసాహబుకు ఏలనో గుండెలలో చిత్రమైన దడ ప్రారంభించినది. గుండెలు ఒక్కసారిగా పైకి లేచిపోవుచున్నట్లు అనిపించినది. గుండెలే ఏమి. ఆతని దేహమే లేచి పోవుచున్న ట్లనిపించెను. సిద్ధమైన దోనె ఎక్కి పరివారముతో నాతడు బయలుదేరినాడు.

ఆ వచ్చిన నౌకలలో నెల్ల చిన్ననౌకలో ఆ నౌకల అధిపతి యున్నాడు. ఆతని సన్నిధికి బడేసాహబును సపరివారముగా ప్రవేశపెట్టినారు.

ఆ నౌకలో అందరును ముసల్మానులవలెనే ఉన్నారు కాని చిత్రము: ఆ నౌకానాయకుడు సరిగా బడేసాహబ్ అద్దములో చూచుకొన్న తన ప్రతిబింబము వలెనే ఉన్నాడు. 'ఎవ రిది ?' అని ఒక్కక్షణ మాలోచించినాడు. అలావదీను చెప్పిన మాటలు వివరించిన విషయములు జ్ఞాపకము చేసికొన్నాడు. సందేహము లేదు. ఈ వచ్చినది తనతమ్ముడు మల్లారెడ్డియే: ఇది వేసికొన్న వేషమా? లేక తనకు వలెనే బలవంతముగా దాపురించినదా ? ఒక్కక్షణము సందేహించుచు నిలువబడినాడు. ముసల్మాను వేషము ధరించిన మల్లారెడ్డికికూడ అట్లు బడేసాహబు వచ్చుట ఆశ్చర్యమైనది. తాను పంపిన దూతలను అలావదీను

బంధింపవచ్చు ననియే అత డూహించియుండెను. ఎవరినో పరీక్షార్థము తన కడకు పంపు నని కూడ ఊహించి అందుకు సిద్ధముగా నుండెను. అని తన్నే వేషములో నున్నను చూచినంతనే గుర్తింపగల బడేసాహబే యిట్లు వచ్చునని అత డూహించి యుండలేదు. అతడును త్రుటికాల మాలోచించుచు నాగెను. అయినను ఇది యాలోచించుట కదను కాదు.

ఆతడు లేచి ఎదురుఏగి బడేసాహబును కౌగిలించుకొనెను. సమాను లగు ముసల్మానులు ఒకరి నొకరట్లే సోదరభావముతో సమాదరింతురు. వారిలో నొకడు ముసల్మాన్ వేషధారి. ఇంకొకడు ముసల్మాన్ మతము పుచ్చుకొనుటచే ఆవేషము వేసినవాడు. ఏమైనను ఇద్దరు సోదరులే! చూచుచున్న సాహబు పరివారమునకు అది ముసల్మానుల స్వాగతమువలెనే ఉన్నది బడేసాహబుకు మల్లారెడ్డి కౌగిలింపులో ఒక్కసారిగా స్వర్గసుఖము భాసించినది. ఆతనికి తల్లిని తండ్రిని సోదరులను ఒక్కసారిగా చూచినట్లున్నది. ఆకౌగిలి యుగాంతము వరకు వదల లేనట్లున్నారు. ముందు సందేహించిన మల్లారెడ్డి తన అన్న వాత్సల్యము గ్రహించినాడు! నెమ్మదిగా ఆకౌగిలి వదలించుకొని బడేసాహబును అతని పరివారమును యథార్థముగా గౌరవించి కూర్చుండజేసినాడు.

'సాహబ్‌జీ! మా వార్తాహరులద్వారా అధికారపత్రములు పంపుట తొందరలో మరచినాను. డిల్లీసుల్తానువారి ఆజ్ఞాపత్రము లివిగో!' - ఇట్లనుచు నాతడు కొన్ని పత్రములు బడేసాహబుకు అందించెను. అవి చూచినదే తడవుగా బడేసాహబు అవి కల్పితములని గ్రహించెను. కాని యవి నిజమైనవానివలెనే గౌరవించి కన్నుల కద్దుకొని వానిపై నున్న ముద్రక్రింద సగౌరవముగా ముద్దుపెట్టుకొనెను. వెంటనే ఆతడు తనతో వచ్చిన పరివారములో ఒక్కనిమాత్రము తనతో నుంచుకొని మిగిలినవారిని, 'ఇవి సుల్తానువారి నౌకలే. వెంటనే అనుమతియీయవలసినది' అని అలాఉదీనుకు చెప్పుటకు పంపివేసెను. వారిని పంపిన కొద్దిసేపటికే ముందుగా సంకేతించుకొన్న విధముగా, ఆ నౌక వద్ద పెద్ద తెల్లని కాంతిపుచ్చు మతాబు తన పరిచారకుని చేత వెలిగింపజేసెను. వెంటనే రేవులో మతాబాలు వెలిగినవి నౌకలు రేవులోనికి వచ్చుటకు అనుమతియైనది.

నౌకలు బయలుదేరినవి కాని సామాన్యముగా రేవులోనికి పోవువాని వలె అవి ఒకదానివెంట నొకటి పోవుట లేదు. అవి అర్ధచంద్ర వ్యూహా కారమున రేవు పట్టుకొనబోవు చున్నట్లుగనే కదలుచున్నవి.

బడేసాహబు తన పరిచారకుని విశ్రమించుటకు పంపివేసి మల్లారెడ్డితో ఆతని గదిలోనికి పోయెను. ఇద్దరును లోనికి చేరి తలుపు గడియ వేసికొన్నారు.

బడేసాహబు : మల్లా! ఎన్నాళ్ళకు నీకు తోడుపడే అవకాశము దొరికి నదిరా!

మల్లారెడ్డి : అన్నా! నీకాలు తెగవేసినందుకు నాపై కోపము రాలేదా?

బడే : నా ఒళ్ళంతా ముక్కలు చేసినా నాకు నీపైన కోపము వచ్చు నటరా?

మల్లా : నీతో తీరికగా నౌకలో మాట్లాడుకొనవలె నని అనుకొనుచు డగా అవకాశ మీయక పారిపోయి వచ్చి నావేమి?

బడే : మనస్సు కలతనొంది మౌనము వహించెను. అది కనిపెట్టి మల్లారెడ్డి సంభాషణము ఆ విషయమునుండి మరలించెను. ఆతడు మాటాడు చుండ గద్గ దిక పడి కన్నుల నీరు నిండెను.

'అన్నా! నీవు మొదట తిరిగి వచ్చినపుడు మన బంధువులును, బ్రాహ్మణ వృద్ధులును అందరును నిన్ను మరల కలుపుకొనుటకు సమ్మతించిరి. అమ్మ ఒక్కతెయే ఒప్పుకొన లేదు. రామాప్రెగ్గడ యెంత చెప్పినను ఆమె వినలేదు. తుదకు దొడ్డయ్య తాతను పిలిపించి చెప్పించగా ఎట్లో ఆమె సరే నన్నది. ఆ రాత్రియే నీవు పారిపోయినావు.'

అది విని బడేసాహబు నిర్ఘాంతపోయెను. తనవారిలో కలుపుకొనుటకు అడ్డు చెప్పినవారు వృద్ధబ్రాహ్మణు లని తాను తలచి యుండెను. తన్ను అంత ప్రేమించెడి తల్లియే ఒప్పుకొనలే దని విని నమ్మలేక పోయెను. వారి కుటుంబ ములో అబద్ధమాడు నలవాటు లేదు. మల్లారెడ్డి అసత్య మాడడు. అప్పటికి తాను చేసిన పనులనే అన్నమ్మ తల్లి క్షమింపకుండినచో తరువాత చేసినవానికి ఇప్పుడు తన్నామె క్షమించునా ? తాను చేసిన పనులు తనతల్లి విన్నచో ఆమె కెంత బాధ కలుగునో ఆని తలచుకొనగా హృదయములో శూలముపెట్టి పొడిచి కలయబెట్టుచున్నట్లు బాధ కలుగసాగినది.

అయ్యో! తాను గోమాంసము తినెను. అబ్బా! కసకస నమలెను! - వృషభ మాంసముకూడ తిన్నాడు! - అబ్బబ్బా! కనపడిన బ్రాహ్మణుల నందరిని

హింస చేసినాడు - తన తండ్రిని కాపాడిన బ్రాహ్మణుని మరి యిరువది య్దెదు గురితో సహా తా నెంత హింసపెట్టినాడు! ఇద్దరు బ్రాహ్మణు లానాడు ప్రాణములు కోల్పోయిరి. ఒకడు బలవంతముగా ముసల్మాను అయ్యెను - పాపము! సీతా దేవి వంటి ఆ బ్రాహ్మణ యువతిని పోనిక ఎంతకాలము చెరలో ఉంచినాడు! -

ఇట్లే ఎన్నెన్నో ఊహలు వచ్చి శల్యములై బాధించుచుండ ఆత డేడ్వ సాగినాడు. ఆనాడు తన్ను కలుపుకొనుటకు నిశ్చయించినది తెలసి యున్న చో ఇంత జరిగి యుండదు. తన చరిత్ర వేరుగా నుండి యుండును. తన బాహు బలము నేర్పు అంతయు తనవారికే తోడు పడియుండును. కొంచెములో తొం దర పడినాడు.

బడే : లాభము లేదని విసివి, తెలియక పెళ్ళిపోయినాను. మల్లా:

మల్లా : మేమును అదే అనుకొంటిమి.

బడే : మల్లా! నీ వీనాడు చూపిన పత్రములు నమ్మితి ననుకొంటివా? నేను కాక ఇంకొకరు వచ్చినచో నీ పని యేమయ్యెడిది?

మల్లా : అన్నా! నీ కౌగిలితోడనే నీ వేమి చూపినను నమ్ముదు వని తెలిసిపోయినది. ఇంకొక రైనచో, మా పడవలను రేవులోనికి వచ్చుటకు అనుజ్ఞా సంజ్ఞ ఇచ్చిన పిమ్మటనే ఆ కౌగిలిలోనుండి విముక్తి కలిగెడిది.

అన్నదమ్ములిద్దరును కలవరించుచున్నవారివలె చిరునవ్వులు నవ్వుకొనిరి.

బడే సా : వీలైనప్పుడు నీకందించుటకై దుర్గ రహస్యము లన్నియు వ్రాసి యుంచిన పత్రములు నావెంట తెచ్చితిని. వచ్చుచు దారిలో నన్ను నమ్మి పంపినవారికి ద్రోహము చేయకూడ దని నిశ్చయించితిని. మరల నిన్ను చూచి నంతనే ఆ నిశ్చయము కరగిపోయినది. ఇవిగో! - ఇట్లనుచు తాను వ్రాసి యుంచిన మోటుపల్లి దుర్గరహస్యములు మల్లారెడ్డి చేతి కిచ్చెను.

మల్లారెడ్డి ఆవి యందుకొని కన్నుల కద్దుకొని పదిలపరచి. 'అన్నా! విశ్రమింపుము! నా కిప్పుడు చాల తొందర పని యున్నది. అనుచు సెలవు తీసి కొని బయలుదేరెను.

బడేసాహబు మోసగింప డని మల్లారెడ్డికి నమ్మకమే కాని అతని చిత్త చాంచల్యము విశ్వసింపరాని దని ఆతనిగది బందించియే బయలుదేరెను.

* * * *

మల్లారెడ్డి కారాత్రి క్షణముకూడ నిద్దుర లేదు. తన పదునైదు నౌకలను ఆతడు సంకేతసంజ్ఞలతో రేవులోనికి నడిపించెను. రేవులోనికి పోయిన తరువాత తమ్మెన్నెన్నియో పరీక్షలు చేయుదు రని ఆత డెరుగును. అవి యెట్లో కొంతవరకు తప్పించుకొన-చ్చును గాని తెల్ల వారుసరికి తమ బండారము బైట పడి తీరును. కావున తెల్లవారక ముందే తమనౌకలు రేవులోని నౌకలతో తల పడవలెను; తనతో వచ్చిన సైనికులు రేవుమార్గమునుండి కోటలో ప్రవేశించి అక్కడి సేనలతో యుద్ధము సేయుటకు సిద్ధముగా నుండవలెను.

58

ఆవల అలావదీను కూడ అశ్రద్ధగా లేడు, ఎందువల్లనో గాని ఆతనికి బడేసాహబు సంజ్ఞ అందినను, ఆతడు పంపిన వార్తాహరులు వచ్చినను నమ్మకము కుదరలేదు. ఒకవేళ రేవు శత్రువుల స్వాధీన మైనను రేవులోనుండి కోటలోనికి వచ్చు ద్వారములగుండ ఎవరును రాకుండునట్లు ఆ ద్వారములు బంధింప నాత డాజ్ఞాపించెను. అట్లు రేవుప్రక్కను కట్టుదిట్టములు చేసి తన దృష్టి తక్కిన దుర్గమువంక ప్రసరింపచేసెను.

ఆత డశ్వ మెక్కి దుర్గము పశ్చిమద్వారమునకు పోయి అక్కడ ముట్టడించిన సేనలను చీకటిలో కనపడినంతవరకు పరీక్షించెను. ఆవలి సేనలో విచిత్రమైన కదలికలు ఆతడు గమనించి దుర్గరక్షకుల నందరిని జాగరూకులుగా నుండుడని యాజ్ఞాపించి అవసరమైన ఆజ్ఞ లెన్నియో ప్రవర్తింపచేసెను. ముఖ్యముగా ముట్టడి చేయక కదలిన భాగములనుండియే దుర్గముపై ఒత్తిడి రావచ్చునని అతనికి మాటిమాటికి స్ఫురింపసాగెను. దళపతులకు ఆమాట నచ్చునట్లు బోధించి మెలకువగా నుండ నియోగించెను. ఇట్లు దుర్గమంతయు చూచుకొని తన నివాసమునకు వచ్చి కమలనాభామాత్యుని పిలిచికొని రమ్మని షేర్ ఖానును నియోగించెను:

షేర్‌ఖాన్ : ఖుదావన్‌ద్?—

అలావదీన్ : తొందరగా పో; ఎందుకు సందేహించుచున్నావు ?

షేర్ : ఇందాక గుండెలో నెత్తురు తీయమన్న బాపనయ్య - నేనా?

అలావ : ఛీ! నీకు మతిపోయినదా? నీ కెప్పుడు చెప్పితిని? తీసినావా ?

షేర్ : ఇంకా లేదు, సాహబ్‌జీ! జంగమదేవర ఆ బాపనయ్యనే చూపెను.

అలావ : ఆఁ! జంగమదేవర మాటలు లెక్కచేయక ఆతనిని బంది ఖానాలో కట్టి పడవేయుము. ముందు ఆ బాపనయ్యను తీసుకొనిరా!

షేర్‌ఖాన్ వెళ్ళి చూడగా ఆతని విడిదిలో కమలనాభామాత్యుడు లేడు, ఆతనితో నున్న బ్రాహ్మణులను ఎంత బాధించినను ఆతని సంగతి ఏమాత్రము తెలియలేదు. షేర్‌ఖాను నిరాశా దృక్కులతో అలావదీను మందిరమునకు వచ్చునప్పటికి సరిగా నప్పుడే కమలనాభామాత్యుడు అలావదీను వద్దకు చేరి యుండెను,

అలావ : తాతగారూ! మీకు జ్యోతిషము వచ్చునంటిరిగదా! మోమోటము లేకుండ నాకు కొన్ని ప్రశ్నలు చెప్పగలరా ?

కమలనా : అబ్బాయీ! నే నందుకేగదా వచ్చితి నంటిని!

ఆతని కంఠములోని ఆదరము చిన్నప్పుడు తనతాత కంఠము వలెనే స్ఫురించి గుండెలలో గ్రుచ్చుకొనెను, వచ్చుచున్న కన్నీ రాపుకొనుచు ఆతడు ప్రశ్నించెను,

అలావ : నా భవిష్యత్తు ఏమి కా నున్నదో చెలవీయగలరా :

కమలనాభామాత్యుడు లెక్కలు కట్టెను,

'నీకు శీఘ్రముగా శుభాతిశయము పట్ట నున్నది. గోచార రీత్యా నా కది తోచినది, నీ జన్మపత్రిక ఉన్నదా ?'

అలావదీను దంతపు బరణిలో పదిలము చేసియున్న తన జన్మపత్రిక తీసి కమలనాభామాత్యున కందిచ్చెను. దానిపై జ్యోతిష్కుడు పెట్టిన పసుపు కుంకుమ గుర్తులు వన్నె తరిగినను మాసిపోలేదు. కమలనాభామాత్యుడు అది చేతుల నందికొని చత్వారమువలన కలిగిన దృష్టిలోపముచే కంటికి దూరముగా దివ్వెకడ పెట్టి నెమ్మదిగా చదువసాగెను. అందులో ఆతనికి ఇరువదియేండ్లు నిండువరకు మాత్రమే దశాంతర్దశలు వేసి ఫలములు వ్రాయబడినవి. మరల కొంతసేపు లెక్కలు గుణించి ప్రశ్నాదృష్టితో తలయెత్తెను,

అలావదీను గద్గదికతో ప్రశ్నించెను. 'మీరు గోచారరీత్యా చెప్పినది జాతక రీత్యా సరిపోవు చున్నదా ?'

కమల : 'అక్షరాలా!'

అలావ : 'తాతగారూ ! నా అంత పాపము చేసిన వానికి శుభమెట్లు గలు గును? నా తమ్ములను తండ్రిని తల్లిని కూడ చేతులార చంపితిని?'

కమల : ఎబ్బే! ఈ జాతకుని తల్లిదండ్రులు తమ్ములు జీవించియే యున్నారు, ఒక చెల్లెలు కూడ ఉన్నది;'

అలావదీను ఆ మాటలకు సంతోషింపవలెనో అబద్ధము చెప్పుచున్న ఈ జ్యోతిష్కుని కఠినముగా దండింపవలెనో కోచక సందేహించుచు ఇట్లనెను:

'తాతగారూ! నేను చేతులార చేసినది కన్నులార చూచినది కాదందురా వారందరు పడిపోవుట ఈ పాపిష్ఠి కళ్ళతో చూచితిని వారందరు వేదవ్రతులు.'

కమలనాభామాత్యుడు ఏమాత్రము తొణకక ప్రత్యుత్తర మిచ్చెను. 'నాయనా! మా బోంట్లకు ప్రత్యక్ష ప్రమాణముకంటె శాస్త్రప్రమాణము బలవత్తరము కన్నులు బైరులు కమ్మి ఎన్నెన్ని భ్రాంతులైన కలిగించును. అదిగాక వేదవ్రతులైనవారికి ఖలవన్మరణము ప్రాప్తించు ననుకొంటివా? నీ తల్లిదండ్రులు సోదరులు జీవించియే యున్నారు. నీ తలిదండ్రులకు నీ చేతుల తోడనే కర్మ చేయు యోగము నీకే కొన్నాళ్ళకు రానున్నది.'

అలావదీనుకు తనవారితో కలసి యుండగా వైదికకర్మ లన్న అసహ్యము. ఇప్పుడు అట్టివానికి దూరుడైన పిమ్మట అట్టి కర్మ తాను చేయగలడని విన్నంతనే చిత్రమైన వ్యామోహ ముదయించినది. దానికి అధికారము సంపాదింప వలెనని కోరిక ఏ లేశమాత్రమో బీజప్రాయముగా నంకురించినది. తన కట్టి యోగ్యత ప్రాప్తించు నని నమ్మకము లేకున్నను ఆ వృద్ధబ్రాహ్మణుని మాటలు తిరస్కరించు బుద్ధి మందగించినది,

'తాతగారూ! ఎంత కాలములో నాకు వారి దర్శనము ప్రాప్తించును?'

'శీఘ్రమే !'

'నాకు శుభము ప్రాప్తించు నంటిరి! నావంటి పాపకర్మునకు శుభము ప్రాప్తించు టెట్లు ?'

'నాయనా! రెండు మార్గములలో ఎట్లైనను ప్రాప్తింప వచ్చును. నీవు రణరంగము లోని కురుకుచున్నావు. నీ వెంతమాత్రము భయము లేనివాడవు! హిరణ్యకశిపుడు, రావణుడు, శశిపాలుడు వీరికంటె పాపకర్ము లున్నారా ? వారికి

కూడ ఉత్తమగతి ప్రా ప్తింప లేదా? నీవును నిర్భయముగా యుద్ధములో నిలచి ప్రాణత్యాగము చేసినను, శస్త్రాహతికి తప్పి బ్రదికినను పూతుడవు కాగలవు. నీవు చేసిన పాపములకు పశ్చాత్తాపము నొందుచు శస్త్రపాతము నెదుర్కొనుము.

అలావదీను మనస్సు తీవ్రాలోచనలో పడెను. కొంతసే పాతడు మౌనము వహించి ప్రకృత విషయమునకు మరలి ప్రశ్నించెను,

'జోషీజీ! నే నీ దుర్గమును రక్షింప గలుగుదునా?'

కమలనాభామాత్యుడు మూతి విరిచెను.

'భయపడక నిజము'చెప్పుడు.'

'అది నీశ క్తికి మించిన పని. ఇప్పటికే శత్రువులు కొంతభాగము వశ మొనర్చుకొన్నారు.

అలావదీను ఆమాటలు వినుచు త్రుళ్ళిపడి కమలనాభామాత్యుని పంపి వేసి బయటికి వచ్చెను. అప్పుడే చంద్రోదయ మగుచున్నది. వెంటనే ఆతడు అశ్వ మెక్కి ఓడరేవుకు వచ్చి చూచెను. అక్కడ చూడగా సమ స్తము నిద్ద రలో మునిగి యున్నట్లు తోచినది. ఆతనికి ఆశ్చర్యమైనది. సుల్తాన్‌వారు పంపిన నౌకలును రేవులోని నౌకలును అన్నియు మొ త్తము ముప్పది నౌకలును నక్షత్రకాంతిలోను, అప్పుడే ఉదయించిన చంద్రకాంతిలోను, నీడలవలె కని పించినవి. అవి ఒకదాని కొకటి పదునేను, ఇరువది విండ్ల దూరమున నిలచి యుండవలసినవి, ఆట్లుగాక, రెండుగను మూడుగను ఒకదాని నొకటి కౌగిలించు కొని, యున్నట్లు కుప్పలు కుప్పలుగా కనిపించినవి. నౌకలకు యుద్ధ మేమైన జరిగి యుండెనా? సందడియే లేదే! తూర్పుద్వారము నొద్దను సమీపమున నున్న బురుజులమీదను పెద్దమతాబాలు వెలిగింప అత డాజ్ఞాపించెను. ఆ వెలుగులో రేవులోని పడవల నతడు పరీక్షించెను.

రేపులోని తన నౌకలన్నియు సుల్తాన్‌వారి పడవల ఉక్కు ముక్కలకు చిక్కుకొని యున్నవి. యుద్ధనౌకలకు ముందు భాగమున పెద్ద మొద్దు కత్తులను ప్రక్కలను కొడవళ్ళవంటి ముక్కులను అమర్చబడి యుండును. కత్తులతో శత్రునౌకలను పొడిచి కొడవళ్ళతో కొంకులు పట్టివేయును. రేవులోని తన నౌకలన్నియు సుల్తాను వారివని తలచిన నౌకల కొడళ్ళ పట్టులో చిక్కుకొని యున్నవి.

'బడేసాహబ్ సుల్తాన్‌వారి నౌకలని సంజ్ఞ చేసెనే! ఆతడు పంపిన పరివారముకూడ అట్లే చెప్పెనే! అతడుకూడ మోసపోయెనా కాక అతడే శత్రువులలో చేరిపోయెనా? అతడు మల్లారెడ్డిపై నెంతో అభిమానము చూపెను, వారు సోదరులట! ఛీ! అతడు స్వామిద్రోహము చేయడు. ఏమైన నేమి? రేవు భాగము మన స్వాధీనము తప్పిపోయినది. తెల్లవారు నప్పటికి అటువైపుననుండి శత్రువుల తాకిడి తప్పక వచ్చి తీరును, గత జలసేతు బంధనము వదలి దాని నెదుర్కొనుటకు సిద్ధపడవలె!

ఆతడు వెంటనే తానున్న చోట రణ తప్పెటలు మ్రోయింప నాజ్ఞాపించెను. అది విని రెండు ప్రక్కల నున్న బురుజులపై తప్పెటలు మొరగినవి. ఒకదాని మ్రోత అందుకొని ప్రక్క బురుజుపై తప్పెటలు మొరగినవి. ఈ విధముగా నంసు కోట గోడల మీదను బురుజులపైనను ఎల్లెడల తప్పెటల భయంకర నినాదము వినవచ్చినది. అది ప్రమాదము సూచించు సంజ్ఞ.

కోటలోనను కోట గోడలపైనను బురుజుల పైనను దళములు దళపతులు అందరు జాగరూకులై యుండిరి. కాని రేవులోని నౌకలను స్వాధీన మొనర్చుకొన్న నౌకలమీదను ఆవల కోట ముట్టడించుచున్న సేనాసమూహమందును చలనమే కనిపింపలేదు.

తెల్లవారులు తప్పెటలు మ్రోగుచునే ఉండెను. పహరా, హుషార్! కేకలు సాగుచునే ఉండెను. మధ్యమధ్య శత్రువులు కోటలో ప్రవేశించు చున్నారని ఆమూల నొకసారి, ఈమూల నొకసారి అలజడి జరుగుచుండెను. కాని అది త్వరలోనే శాంతించుచుండెను

తెలతెల వారుచున్నది. తూర్పు సముద్రమునుండి మందానానిలు హాయిగా ప్రసరించున్నాడు. దుర్గరక్షకులు రాత్రి యంతయు మేలుకొని యుండుటచే మిక్కిలి అలసి యున్నారు. వారి దేహములు అవశము లగుచున్నవి. చేతులనుండి ఆయుధములు జారుచున్నవి. అప్రయత్నముగా వారు నిద్దురల కొరగుచున్నారు. జాగరూకులై తిరుగుచున్న దళపతులు వారిని కొరడాలతో కొట్టి లేపుచున్నారు. రాత్రిపని లేక విశ్రాంతి తీసికొన్నవారికికూడ ఆయలజడిలో నిద్దురపట్టలేదు.

సముద్రము మీదినుండి ఎర్రనికాంతి ఒకటి చిత్రచిత్ర వర్ణములతో శబ్దలితమై ఆకాశము మీదికి ఎగబ్రాకుచున్నది. అరుణోదయ మగుచున్నదా?

అప్పుడు రేవు నాక్రమించిన నౌకలలో నెల్ల చిన్నదానియందు పెద్ద వెలు గొక్కసారిగా కానవచ్చినది. ఆ నౌక మండిపోవుచున్నట్లుగా తోచినది. వెంటనే తక్కిన నౌకలయందును అట్టి కాంతియే కానవచ్చి అన్నియు నొక్క పెట్టున మండుచున్నట్లే కనబడుచు చూపరకు ఆశ్చర్యము కలిగించుచుండెను. వెంటనే దుర్గములోని దళపతులు ఈ విషయము అలావదీనుకు నివేదించి కొందరు సైనికులను రేవు వైపునకు కోటగోడ దాటించి పంపుట ఉచితమని సూచించిరి. అలావదీను ఆమాటలు పెడచెవిని బెట్టెను.

చివరి జాములో కాపు కాయుచున్న రక్షకులు తమకాపు వదలి వేకువ జామువారికి రక్షణబాధ్యత అప్పగించుచుండిరి. దిక్కులలో చీకటి ఇంకను వదల లేదు. గ్రుడ్డి వెన్నెల రేవు నానుకొని ఉన్న తాటి తోపులో మరింత జీబుగా నున్నది. దానికి సమీపములో నున్న కోట బురుజుమీది సైనికులు నిస్త్రాణగా జరుగుచున్న దేమో అర్ధముకాక చూచుచునే ఉండిరి. ఆ బురుజు వారి వశము తప్పిపోయినది. తమ భటుల వేషములవంటి వేషములనే వేసికొన్న భటులు అక్కడి రక్షకభటులను తమశూలములతో పొడిచివేసి బురుజు స్వాధీన మొనర్చుకొనిరి. ఆ క్రొత్త భటులకు అగ్రేసరుడై మల్లారెడ్డి స్వయముగా నడగొండవలె సాగుచున్నాడు. ఆతనికి కుడిప్రక్క నున్న మరియొక బురుజును పంటరెడ్డియు ఎడమప్రక్క నున్నదానిని దేసటరెడ్డియు తమ భటులతో నక్లై స్వాధీన మొనర్చుకొనిరి. ఈ మూడు బురుజులకు మధ్యనున్న గోడ యంతయు గవసులతో గూడ అరగడియ కాలములో వారి భటులు స్వాధీనము చేసికొనిరి. ఆ వెంటనే తాటితోపులోనుండి నేల యీనినట్లు సైనికు లెందరో ఆ గోడల పైకి వచ్చి కోటలో ప్రవేశింపసాగిరి.

కోటకు వచ్చిన యపాయము అలావదీనుకు తెలిసి ప్రతిక్రియ ప్రారంభించు నప్పటికి సూర్యోదయ మైనది. ఆ మూడు బురుజుల పైపునకును శత్రువులను ప్రతిఘటించుటకు తన మూలబలము కదలుటకు ఆజ్ఞాపించి ముందుగా తన మాంజినీకులను తాటితోపుపైకిని ఆ మూడు బురుజులపైకిని రేవులోని నౌకలమీదను ప్రయోగింప నియోగించెను.

ఆ మాంజినీకులు పెద్దపెద్ద శిలలను విసరుచున్నవి. ఆశిలలు పడినచోట జరుగుచున్న జననష్టముకంటె అలజడి ఎక్కువగా నున్నది. ఆ యలజడి ముఖ్యముగా నౌకలలో వ్యక్తమైనది.

ఆరు మాంజినీకులు పనిచేయు చున్నవి. ఒక్కొక్కటి గడియకొక గండశిల చొప్పున విసరుచున్నది. మాంజినీకు లనగా పెద్దయెత్తున చేసిన వడి సెల లని చెప్పవచ్చును. అవి కొయ్యలతో నిర్మించిన దిమ్మెలపై ఏతమునకు ఉపయోగించెడు దూలమువంటి దాని నమర్చి దాని తొట్టిలో గండశిల పెట్టి దానిని ఆయంత్రముతో ప్రయోగింతురు. అది ప్రయోగించుట కెంతో నేర్పు కావలెను. ఎంత నేర్పుతో ప్రయోగించినను అవి గురి తప్పకుండుట సాధ్యము కాదు. మొత్తముమీద అవి వాటితోపుమీదికిని నౌకలమీదికిని సరిగనే పోవుచుండెను.

ఒక శిల సరిగా పోయి మల్లారెడ్డి వచ్చిన చిన్ననౌకపై బడినది. ఆదెబ్బ కందులో అది పడిన భాగము చితికిపోయినది. అయినను ఆనౌక కప్పలి విధముగా కట్టబడి యుండుటచే నౌక యంతయు ధ్వంసము కాలేదు. ఆబాగమే దెబ్బతిన్నది. కాని మిగిలిన భాగములలోనికి నీ రెక్కలేదు.

అయితే ఆ యొక్క గండశిలయే నౌకలలో కలిగించిన కలవర మింతంత గాదు. అంతవరకు నిబ్బరముగా నున్న పడవ లన్నిటిలోగూడ అలజడి సాగినది. వాని గర్భములలో దాగియున్న భటులు వందలకొలది పైకి వచ్చి ఏమి చేయను తోపక గందరగోళ పడుచుండిరి. సరంగులు కొందరు లంగరు తాళ్లు కోసివేసి తమ పడవలు దూరముగా తీసికొని పోవుటకు ఆలోచించుచుండిరి. కొందరు లంగరు త్రాళ్లు ముడిచి లంగరు వెత్తుచుండిరి. కొందరు తెరచాపలు పై కెత్తుటకు చాచి సరి చేయుచుండిరి. నౌకాధిపతులు ఒకమా రొకటి చేయుమనియు, ఇంకొకమా రింకొకటి చేయు మనియు విరుద్ధాజ్ఞ లిచ్చుచుండిరి. సరంగులు తమ అధిపతులు ఆజ్ఞలు వినిపించుకొనుటే లేదు. మాంజినీకులు విసరు వారికి ఉత్సాహ మతిశయించినది.

ఈ విధముగా నౌకలయొద్ద గగ్గోలు పుట్టి యున్న సమయమున సముద్రములో దూరమున పెద్ద కప్పలి యొకటి కనిపించినది. అది నెమ్మదిగా రేవును సమీపించుచున్నది. ఆ కప్పలిని చూచినంతనే రేవులో నున్న నౌకలు శాంతింప సాగినవి. పడవలపైకి వచ్చిన జనము లోపలికి దిగిపోసాగిరి. పూర్వ నిర్ణీత విధమున నౌకాధిపతులు తమ యాజ్ఞలు ప్రవర్తింపజేయ సాగిరి. ఇప్పుడు నౌకలు ఒకదాని నొకటి సమీపమున నుండక దూరము జరుగుచున్నవి. అం

దుచే మాంజినీకుల గురి తప్పుచున్నది. వానిలో కొన్ని నౌకలు తీరమున నున్న సరకులు దింపు ప్రదేశమును సమీపించినవి. అక్కడికి మాంజినీకుల శిలలు రావు.

ఇట్లుండ ఒక గండశిల దేసటిరెడ్డి పట్టుకొన్న బురుజుపై పడినది. ఇంకొకటి మల్లారెడ్డి పట్టుకొన్న బురుజుపై పడినది. అప్పటికే దేసటిరెడ్డియు మల్లారెడ్డియు బురుజుల మీదినుండి లోపలికి దూకి సైనికులను పోటుకు సమకూర్చుచుండిరి.

సరిగా నీ సమయమున అలావదీను పంపిన మూలబలము అటు వచ్చి ప్రతిఘటింపసాగినది. పంటరెడ్డి పట్టుకొన్న బురుజుపై నున్న విస్సనమంత్రి పంటరెడ్డితో కలసి మూలబలమును ప్రతిఘటించుచు మల్లారెడ్డిని దేసటరెడ్డిని కోట విడిచి వెనుకకు తమ సేనలతో పోవలసిన దని అర్థించిరి. మల్లారెడ్డికి ముందుకు పోవలెనను ఉత్సాహ మున్నను విస్సన వాక్యములపై గల ప్రమాణ బుద్ధిచే తన భటులతో కోట దాటి వెనుకకు వచ్చెను. దేసటరెడ్డి యాతని ననుగమించెను. మిగిలియున్న సైనికు లందరు కోట దాటువరకు పంటరెడ్డియు విస్సనయు మూలబలము నెదిరించి వారును తమ భటులతో కోట దాటి బయటికి వచ్చిరి. వెనుకకు వచ్చిన సేన లన్నియు తాటితోపును మరల ప్రవేశించినవి. ఇప్పుడు మాంజినీకులు తమలక్ష్యమును ప్రధానముగా తాటితోపుపై పెట్టెను. కాని ఆ చెట్ల మాటున నుండి మల్లారెడ్డి సైనికులందరు తోపుదాటి దూరమున నున్న తమ నౌకలలోనికి చేరికొనిరి. వారిని వెంబడించుటకు దుర్గములోని సైనికులు సాహసింపలేదు.

రేవులోని నౌకలు కొన్ని మాంజినీకుల శిలాపాతావధి దాటిపోయినవి. కోరుగోడలను సమీపించి యున్న నౌకలు మాత్రమే మిగిలియున్నవి. వానిపై నిప్పుడు కోట గోడలమీదినుండి సైనికులు బాణప్రయోగము చేయుచు అగ్ని వర్షము కురిపించు చున్నారు. అక్కడ నిలిచినచో ప్రమాదముగా నున్నది. మాంజినీకులకు లక్ష్యము చేయక ఆ నౌక లొక్కొక్కటే ఆవలికి పోసాగినవి. అట్లు పోవుటలో ఒక్కదానికి తప్ప మాంజినీకుల బండరాయి తగులలేదు.

ఇప్పుడు రేవులో ఒక్క నౌకయులేదు. అన్ని నౌకలను మల్లారెడ్డి నౌకలు వశ మొనర్చుకొన్నవి. నౌకాయుద్ధములో ఆ రాత్రి మల్లారెడ్డి విజయము సాధించెను. దుర్గముమీది యుద్ధములో అలావదీను జయము సాధించెను.

59

కోట ప్రమాదము తప్పిపోవు నప్పటికి మధ్యాహ్నమైనది. అప్పుడు ఆలావదీను వడివడి భోజన మొనర్చి నాలుగైదు గడియలు నిద్రించి విశ్రాంతుడై కమలనాభామాత్యుని పిలిపించెను. ముందాతడు ప్రశ్నించినది జంగమదేవర విషయము.

'మిమ్మును జంగమదేవరను పరీక్షింపు డంటిని గదా: చేసితిరా'?.

'నిన్న ఉదయమే కొంత పరీక్షించితిని ఆతడు పిచ్చివాడో, దొంగయో అయి యుండవలె: నిధులు తీయుట ఏమాత్రము నేర్చినవాడు కాదు. నాకు నిధి మంత్రము చెప్పుటకు అమావాస్యకు లగ్నము పెట్టెను.

ఆలావదీను ఆశ్చర్యపడెను. అతనికి కమలనాభామాత్యునిమీద గౌరవము కలుగుచున్నది. జంగము నిధి తీయుటకు పాపము చేయనివాని గుండెలోని నెత్తురు కావలెనని నిన్నటి దినమున నర్థించియుండెను. అట్టివా డుండునా యని తాను సందేహింపగా ఆతడు తానే చూపుదు నని యుండెను. షేర్‌ఖానుకు ఈ కమలనాభామాత్యునే ఆతడు చూపియుండెను. ఈతడుచేసిన పరీక్షఫలితమే అ ట్లాతనిచే చేయించియుండును. లేకున్న అమావాస్యకు లగ్నము పెట్టి ఈ లోపుగా నీతని చంపించుటకు ఉపాయమేల పన్నియుండును: జంగమదేవర ఆశపెట్టిన నిధిపై ఇక ఆశ వదలుకొనవలెను. ఇదియంతయు నతడు తన మనస్సులో రెండు మూడు ఘడియల కాలములో నిశ్చయించుకొని కమలనాభామాత్యుని మరియు నిట్లు ప్రశ్నించెను.

'నే నీయాతన ఎన్నాళ్లు పడవలెను: జంగమదేవర ఆశపెట్టిన నిధికై ఎనురు చూచుచు భటులకు ఎట్లో జీతము లీయగల నని తలచుచుంటిని. జీతము లేని భటులతో ఈ దుర్గ మెన్నాళ్లు కాపాడగలను:'

'జీతములు ఇబ్బడిగా నిచ్చినను దుర్గము కాపాడలేవు:' తన భావమునే కమలనాభామాత్యుని మాటలు అనువదించుచుండెను.

'మీరు చెప్పినట్లు కోట సగము శత్రువుల వశమైనట్లే: గోడల లోపలికి వచ్చిన వారిని మాత్రము ఈనాటికి పారద్రోలి వచ్చినాను.—మీతో వచ్చిన పర

హిత వైద్యులను పరీక్షించు నవకాశము చిక్కినది. ఈనాటి యుద్ధములో గాయపడినవారికి వారు చికిత్స చేయవలె:'

కమలనాభామాత్యుడు 'అవశ్యము: గాయపడినవారి నొకచో చేర్పించి మా విడిదికి వార్త పంపుడు వారట్లే చికిత్స చేయగలరు.' అనుచు విడిదికి పోయి తనతో వచ్చిన పరహిత వైద్యులను సిద్ధముచేసెను. వారు చికిత్సాలయము చేరి ఒడలు దాచుకొనక చికిత్సలు ప్రారంభించిరి

వారు పరహితవైద్యులు. వారి సంప్రదాయములో వ్యాధిపీడితులకు, క్షత గాత్రులకు, చికిత్స చేయుటే విధి. మండూకమును మ్రింగిన సర్పమునకు కంఠములో మండూకశల్యము గ్రుచ్చుకొని బాధపడుచుండగా దాని బాధ చూడలేక చికిత్స చేసిన కరుణామయుడు వారి వంశకర్త. అట్టి వంశములో పుట్టిన ఆ పరహితవైద్యులకు చికిత్స చేయుటలో వీరు వారని భేదము లేదు. వారి చికిత్సచే అసాధ్యమైన గాయములు కూడ నయ మగుచున్నని. వారిపై దుర్గములోని భటులకు నాయకులకు వర్ణింపరాని గౌరవభావము కలుగుచున్నది.

* * *

ఎర్రయను అలావదీను, కొన్నాళ్ళపాటు చూడ నిచ్చగింపలేదు. అతడు చెరసాలలో సుఖముగా స్నానసంధ్యాదులు నిర్వర్తించుకొనుచు లక్ష్మీనృసింహావతార రచనము శాంతముగా సాగించుచున్నాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని పెట్టుచున్న బాధలను అత డని శాంతముగా నెట్లు వహించు చున్నది వర్ణించుచున్నాడు.

* * *

ఆవల పెద్దక పులి యోడలో వచ్చినది అవచిదేవయశ్రేష్టి. ఆతనితో రత్తగేహియు వచ్చెను. వారితో మరికొన్ని నౌకలను వచ్చినవి.

ఆనాటి యుద్ధమైనపిమ్మట కొంచెము విశ్రాంతి తీసికొని మల్లారెడ్డి దేసటి పంటరెడ్లను విస్సనను మరికొందరు దండనాయకులను వెంట తీసికొని అవచిదేవయశ్రేష్టి నౌకలోనికి పోయెను.

శ్రేష్టి నౌక చూచి నంతనే మల్లారెడ్డి విభ్రాంతు డయ్యెను. అది నౌకయా మహారాజసౌధమా? శ్రేష్టి రౌవారికుడు వారు వచ్చినది నివేదించి శ్రేష్టి అనుమతితో సభామండపమున ప్రవేశపెట్టెను. శ్రేష్టికి చామరగ్రాహిణిలు వింజామరలు వీచుచుండిరి. వంది మాగధులు కైవారము లొనర్చిరి. నర్తకి మంగళారార్తికము

పట్టినది. ఆతని మంత్రులు దళపతులు శ్రేష్టిని పరివేష్టించి యున్నారు. ఆతడు పట్టుపరుపులపై నాసీనుడై యుండెను. చీనాంబరముల మేలికట్లు ఉపరితలమున చిత్ర చిత్ర వర్ణములతో చిత్రితములై ఇంద్రసభను స్మరింపజేయు చున్నది.

మల్లారెడ్డి రాగానే శ్రేష్టి ఆసనమునుండి ఇంచుక లేచి వారందరకు సముచితాసనములు చూపి యథార్హముగా గౌరవించెను. కుశలప్రశ్నాదికములు అయిన వెంటనే వారు కార్యాలోచనమున కుపక్రమించిరి. అక్కడనే పలుచని చీనాంశుకముతో అనేక ముఖములుగా చేసిన గాలిబుడ్లు వ్రేలుచుండెను. సంభాషణము ప్రారంభించుటకు ముందు శ్రేష్ఠి ఆబుడ్లు గాలికి సముద్రము వైపునకు ఎగురుచుండుట గమనించి ఉపక్రమించెను. నీటిపై చేయు సంభాషణము గాలి వాలున నీటి సాహాయ్యముతో కొన్ని క్రోశముల దూరమువరకు వినిపింపవచ్చు నని ఆతని కనుభవముచే ఎరుకయే!

ముందు క్రిందటి రాత్రినుండి జరిగిన యుద్ధక్రమ మంతయు శ్రేష్ఠికి విన్నన నివేదించెను. శ్రేష్ఠి సముద్రయుద్ధమునకు క్రొత్తవాడైన మల్లారెడ్డి అంత యద్భుతముగా నౌకాయుద్ధము నెరవేర్చినందుకు అతి మాత్రముగా ప్రీతుడై మరల మరల నాతని నగ్గించెను. మోటుపల్లి రేవు మన వశమైనందున దుర్గము ప్రాణములో సగము మన వశమైనట్లే యని ముందు నిర్ధారణచేసెను. ఆ పిమ్మట సంప్రదింపులు సాగినవి.

ఆయుదయమున రేవు ప్రక్కనున్న బురుజులపై పోటు సాగించినది. సాహసకార్యము! రేవుమార్గము ఇటు నిరోధించి ఆవల భూమార్గముకూడ నిరోధించినచో జననష్టమెక్కువ లేకుండ విజయము సాధించుట సులభము. నిరపాయమైన ఉపాయము లన్నియు ప్రయత్నించి గాని సాహసకార్యములు తలపెట్టుట నీతికాదు. ఆనాటినుండియు ఒకనాడు భూమార్గమునను ఒకనాడు రేవుమార్గమునను దుర్గమును డీకొనుచు దుర్గములోని వారికి విశ్రాంతి జేసి తాము ఒక్కొక్క రొక్కొక్కరోజు విశ్రాంతి తీసికొనవలెను.

అవచి దేవయ తన నౌకలను సప్తసముద్రములలో త్రిప్పుచుండెడివాడు. అందుచే నాతనికి బహుదేశములలో దుర్గసాధన కుపయోగించు మార్గములు తెలిసియుండెను. వాని నన్నిటి నాతడు వారికి వివరించెను. ఆ సాధనములను నిర్మించుటకు నేర్పరులగు కారువులు శిలాశిల్పులు స్థపతులు కావలియుండిరి. అట్టివారు కొందరు దేవయశ్రేష్టి నౌకలలో నున్నారు. కాని వారు చాలరు.

పరిఖ పూడిపోవునట్లు చేయవలెను. దానిలోనికి సముద్రజలమే ఒక వైపున నుండి మరియొక వైపునకు ప్రవహించుచున్నది. అందులో ఇసుక మేటలు వేయునట్లు చేసినచో సులభసాధ్యముగా అది పూడిపోగలదు. తన సముద్ర శిల్పులతో అత డుపాయ మాలోచించెను. కోటకు దక్షిణభాగమునుండి సముద్రజలము పరిఖలోనికి ప్రవహించి ఉత్తరభాగమున మరల సముద్రములో కలియుచున్నది. సముద్రములోనుండి వచ్చెడి యిసుక ఆప్రవాహముతో సముద్రములోనికే కొట్టుకొని పోవుచున్నది. పరి సముద్రములో కలియు నుత్తర ముఖమున అడ్డువేసినచో పరిఖమేటవేయును. కాని యది యెట్లు? తాము పట్టుకొన్న పడవలలో దెబ్బలు తిన్నవానిని అక్కడ ముంచి వేయుటకు వారు నిర్ధారణ మొనర్చుకొనిరి. మల్లారెడ్డితో వచ్చిన తోకరాజు మన సైన్యములో శ్రీశైల ప్రాంతమునుండి వచ్చిన దారుశిలాశిల్పు లున్నారని నివేదింపగా వారిలో ముఖ్యుల వెంటనే రప్పించిరి పంచభిక్షము రామలింగము నాతని సోదరుడు సోమలింగము వచ్చిరి.

ఆ సోదరు లిరువురు వినీతులై పెద్దలందరకు నమస్కరించిరి. అందులో రామలింగము పడవ ఎక్కుచుండగా ఆతని నాకర్షించినది నౌకానిర్మాణ విధానము ఇప్పు డాతనిని ఆకర్షించు చున్నది. ఆసభా మండప నిర్మాణమే గాని అక్కడ నున్న పెద్దలు కాదు. అతని చిత్రమైన చూపు పరధ్యానముగా నుండుట గమనించి చిరునవ్వుతో అవచిదేవయ, 'నీవేదో పని తొందరలో నుండగా పిలిపించితిమా?' అని ప్రశ్నించెను.

రామలింగము కలనుండి మేల్కొన్న వానివలె ఉలికిపడుచు నిట్లుత్తరమిచ్చెను.

'ప్రభూ! ఈ యుదయమున దూరమున నుండి ఆశిలలు విసరు యంత్రములు పనిచేయుటచూచితిని, అప్పటినుండి అట్టి వెట్టు నిర్మించుటా; అని పరి పరి విధముల ఆలోచించు చున్నాను. ఒక తీరుగా పెట్టిన ఒక లోపము మరియొక తీరుగా పెట్టిన ఇంకొక లోపము వచ్చుచున్నది. అసమస్య విడదీయుటకు మనస్సు బాధపడుచున్నది.

అవచిదేవయ ఆనందము పట్టలేక పోయెను. సరిగా నీవంటి వాడే మాకిప్పుడు కావలసి యున్నాడు. అదియొక కష్టపు పనికాదు. దాని నిర్మాణచిత్రములు మాయొద్ద నున్నవి. అంతకంటె గురిగా వేయుటకు వీలు కలదు.'—

ఇట్లనుచు రత్తగేహివంక చూడగా నాతడు మాంజినీకులలో అనేకవిధము లగు వాని నిర్మాణ పటములు రామలింగమునకు చూపించెను. అవి చూచినంతనే అతనికి హృదయభారము తీరిన ట్లైనది. సోమలింగము అన్నవంక గౌరవ ముతో తిలకించుచుండెను.

'అయ్యో! రాత! ఈ కొత్త కిటుకు తట్టక పోయినదే!' అని నిట్టూర్చుచు, రామలింగము వానికి మెరుగు పెట్టు నుపాయము ఆలోచింపసాగెను.

ఆనాడును మరునాడును అనేకవిధము లగు పనివారితో ఇట్లే ఆలోచనలు సాగినవి. ఖనకులు, కమ్మరులు. కుమ్మరులు — మరియు నెంద రెందరో రప్పింపబడిరి. వారికి అనేకవిధము లగు పను లప్పగింప బడినవి.

అవచిదేవయ స్వయముగా వచ్చినందున సముద్రముపైపునుండి కోటపై విజృంభించు భారము ఆతని కప్పగించి మల్లారెడ్డి తన అనుచరులతో భూమి పైపు సేనను నడపుటకు పూనుకొనెను. రెండవనాడు భూమార్గమున నుండి కోటపైకి లంఘించు యత్నము సాగినది. కాని అది తీవ్రముగా లేదు. ఆనాడు దుర్గములోనివారిదే పైచేయిగా నుండెను.

మూడవనాటి యుద్ధము సముద్రముపై పు నుండి ప్రధానముగా సాగినది. ఆ నాడును దుర్గరక్షకుల కెట్టి తీవ్రప్రమాదమును రాలేదు.

వారము పదిరోజు లిట్లే గడచిపోయినవి. దుర్గములోని మాంజినీకుల అవధి తప్పించుకొనియే యుద్ధము సాగించుచున్నారు కోట గోడలపై చెదరు వాటుగా కనబడినవారిని చెంచుట వదలక తమ బాణములు కెరచేయు చున్నారు. అంతకంటె ఎక్కువ ప్రమాదము దుర్గములోనివారికి సంభవించుట లేదు. వారికే జయము కలుగుచున్నట్లు కనబడుచున్నది.

కాని ఆ జయముతో అలావదీను సంతోషించుట లేదు. ఇది యంతయు ఆవలె నేదో పెద్ద ప్రయత్నమునకు తీసికొనుచున్న వ్యవధి ఫలితమే యనియూహించెను. తనచారులచే వారి ప్రయత్నములు తెలిసికొనుట కనేక విధముల ప్రయత్నించెను. కాని యతని యనుచరులు భయముచేతనే తప్ప భక్తితో కాని అనురాగముతో గాని మాట వినకున్నారు. జీతములు ముట్టని పరిచారకులు ఏమి పని చేయుదురు? వారి కాహార మందించుటయే కష్టముగా నున్నది.

పదునొకండవనాటి అర్ధరాత్రమున కోట గోడలక్రింద పందికొక్కులు త్రవ్వుచున్నట్లు ధ్వని యగుచున్న దని పలువురు చారులు వచ్చి నివేదించిరి. అట్టివి రెండు ప్రదేశములు కలవు. ఆ తావులకు పోయి ఆలావదీను కారణ మేమై యుండునా అని ఎన్నోవిధముల పరిశీలించి చూచెను. ఏమియు కనుపింప లేదు. శిల్పులను స్థపతులను ఖనకులను పిలిపించి వారితో సంప్రదించెను. అందరును ఇది ఎలుకలు పందికొక్కులు గరటకొక్కులు చేయు ధ్వనికాదని నిర్ధారించిరే కాని, ఏదో ఇదమిత్థ మని కెవ్వరును నిర్ణయించి చెప్పలే కుండిరి.

"ఆవలినుండి సొరంగ మేమైన త్రవ్వుచున్నారా!"— అని అలావదీను ప్రశ్నించెను.

ఏకగ్రీవముగా వారందరు ఉత్తర మిచ్చిరి - 'ఖుదావన్‌ద్, ఇంత అగర్త నాటి సొరంగము లెట్లు వచ్చును?'

ఏమైనను మంచి దని ఆ ప్రదేశములలో రేయింబవళ్లు కాపుండుటకు ప్రత్యేకముగా అలావదీను భటులను నియోగించెను

అజ్ఞాతమూలము లగు నీ యాంతరధ్వనుల ఉనికిని గూర్చి కోటలో నంతటను చిత్రవిచిత్ర వార్తలు వ్యాపించినవి. కోటలలో అపజయము కలుగు టకు ముందు ఇట్టి శబ్దములే తరచుగా వినబడునని యుద్ధకోవిదు లందు రని వృద్దులు చెప్పుచుండిరి. కోట శక్తికి సరిగా పూజలు చేయకుండుటచే ఆశక్తి పరివారము అధోలోకము నుండి కోపముతో పైకి వచ్చుచుండుటచే ఆధ్వనులు కలుగుచున్న వని సామాన్య సైనికులలో కథ ప్రాకిపోయినది.

దుర్గములోని సైనికులలో ఎన్నడో ఇస్లాముమతము స్వీకరించినవారు అల్పసంఖ్యాకులు. క్రొత్తగా మతము పుచ్చుకొన్నవారే ఎక్కువమంది. అందర కంటెను అధికసంఖ్యాకులు కైజీతము పుచ్చుకొను హిందువులు. ఈ మూడు విధముల వారికిని నానావిధములగు మూఢవిశ్వాసము లున్నవి. ఎవరి విశ్వాసము కొలది వారు దీని కర్థము చెప్పసాగిరి

మరునాడు తెల్లవారి చూచునప్పటికి పరిఖ ఉత్తరభాగమున కెదురుగా మూడు మోటుపల్లి నావలు మునిగి యున్నవని చారులు నివేదించిరి, ఇన్ని దిన ములును ఆవల సముద్రములో అనేక నౌకలు సంచారము లొనర్చు చున్నవని

గూఢచారులు చెప్పుచునే యుండిరి. తమ్ము ముట్టడించిన నౌకలను పైనుండి ఈమారు నిజముగా సుల్తానువారి నౌకలే వచ్చి పడుటవలననే ఁఁనౌకలు ముసిగి యుండునా? అను ఆశ' దుర్గాధిపతి కంకురించెను. ఆయాశ దురాశయని అతని యంతరాత్మ చెప్పుచున్నది. ఇవి మునుగుటలో ఏవో కీటుకు ఉండును. కాని ఎంత ఆలోచించినను అది ఏదో తెలియలేదు

మధ్యాహ్న మగుసరికి పరిఖలో నీరు పెరుగుచున్నదని వార్త వచ్చెను. చూడ నపరాహ్ణవేళకు నీరు తరిగిపోవుచున్న ట్లనిపించినది. సాయంత్ర మగు నప్పటికి పరిఖలో నక్కడక్కడ ఇసుకమేటలు తేలెను. అలా దీనును భయ మావేశించినది. పడవలు ముంచుటకు గలహేతువు కొంత సూచనగా ఇప్పు డాతని కవగత మైనది. తమ్ము ముట్టడించినవారి బుద్ధి కుశలత యపారమైనది, అది తలచుకొన్నకొలది నిస్పృహ యుదయించుచున్నది. ఇప్పుడు పరిఖ రక్ష ణము పోయినందున కోటగోడలను మరింత జాగరూకులై రక్షింపవలసిన దని ఆత డాజ్ఞాపించెను. లగ్గయి పట్టుటకు ప్రయత్నించువారిని ప్రతిఘటించుటకు బహువిధ సాధనముల నాయత్తపరచి ఏక్కుమంది భటులను సిద్ధముగా నుంచెను.

అర్ధరాత్ర మైనది. కోట గోడలక్రింద నేల ఉరిమినట్లు భయంకరధ్వని ప్రారంభించెను. పాతాళలోకము సమీపించుచున్నట్లే తోచినది. ధమ్మని పెద్ద ప్రేలుడు వినిపించినది. మరికొలది సేపటికే అట్టి ధ్వనియే మరల నింకొక చోట విన నైనది, ఆ రెండు ధ్వనులతో కోటగోడ లన్నియు దడదడలాడినవి బురుజులు కంపించినవి. చూచుకొనగా వెనుకటిరాత్రి నేల త్రవ్వుచున్న శబ్దము వినవచ్చిన రెండు చోటులను కోటగోడలు క్రుంగిపోయినవి. మిగిలిన గోడయు పలుచోట్ల బీటలు వారినది. ఇది తెలిసిన వెంటనే అలావదీను ఆభాగములు బాగు చేయించుటకు పనివారిని నియోగించెను.

అప్పటికి కొంతకాలమునుండి ఖనకులు అగడ్తకావల నున్న యొక పొదచాటున నుండి భూమార్గమున సొరంగములు రెండు కోటగోడ క్రిందివరకు త్రవ్వుచుండిరి ఆక్కడ పంచభిక్షము రామలింగము పెద్దతనాబీలను చెత్త పేర్పించి నిప్పంటింప జేసెను. అవచిదేవయ ఎక్కడనో విదేశములలో ఇట్టివి కలవని సూచించెను. కాని దానివిధానము నాతడు వివరింపలేక పోయెను. రామలింగము విని ఒకరాత్రియు ఒకపవలును నిద్రాహారములు లేక శ్రీశైల మల్లికార్జునుని

తదేకనిష్ఠతో పూజించి ధ్యానించి యాప్రయోగ మూహించి సాధించెను. అది సఫలమైన వెంటనే మల్లారెడ్డియు విస్సనయు అవచిదేవయయు నాతని పరిపరి విధముల శ్లాఘించి ఆతడు పరికల్పించిన యితర నూతన యుద్ధసాధనములును ఇట్లే విజయవంతములు కాగలవని అగ్గించిరి.

* * *

ఇన్నాళ్ళను సముద్రముపై అవచిదేవయము భూమిపై మల్లారెడ్డియు ఊరకుండలేదు. వారు దూరములుండియే ఎన్నియో ప్రయత్నములు సాగించుచున్నారు. ఒకరితో నొకరు చారముఖమునను స్వయముగాను సంప్రదించుచున్నారు. ఇప్పటికి వారి శిల్పులు చేయవలసిన యంత్రములు సిద్ధమైనవి. పంచభిక్షము రామలింగము కేవలము విశ్వకర్మయో మయబ్రహ్మయో అవతరించినట్లే కనబడుచున్నాడు. ఆతని పనితనములో బలము శక్తి ప్రయోజనములతోపాటు అందము ఉన్నది. ఆతడు నాలుగు మాంజినీకులను నాలుగు నిడుదూలములను మూడు గోపురములను దారువులతో సిద్ధమొనర్చెను. గోపురములకు నిడుదూలములకు అడుగుభాగమున నడుపుట కనువుగా చక్రము లున్నవి.

అవచిదేవయ పడవలు ముంచి చేసిన ప్రయోగము ఫలవంతమైనదని అందరు నిశ్చయించిరి. ఇక నెక్కువ కాలము దుర్గరక్షకులకు అవకాశ మీయరాదు. అందుచేతనే ఆ రాత్రియే సౌరంగములో అగ్ని ప్రజ్వలింపజేసి గోడ కూల్చిరి. అదియు ఫలవంతమైనందున వారికి ధైర్య మెక్కువైనది ఆ మరునాడే ఒక్కుమ్మడిగా రేవు వైపుననుండియు భూమార్గమునుండియు లగ్గలు పట్టుటకు తీవ్రప్రయత్నము సాగింపవలె నని నాయకులు నిశ్చయించిరి.

సూర్యోదయమునకు పూర్వమే మల్లారెడ్డి లేచి స్నానముచేసి శుచియై చీనాంబరములు ధరించి దీపారాధన మొనర్చి అవచిదేవయ తనకు బహూకరించిన రెండవ ఖడ్గమును నందికంత పోతరాజు పీఠముపై నిలిపి ధ్యానించి నమస్కరించి గంధ పుష్ప ధూప దీప నైవేద్యాదులతో భక్తిపూర్వకముగా అర్చించి మ్రొక్కుకొనెను. బ్రాహ్మణులకు భూరిదక్షిణ లిచ్చి పోతరాజుకు తాను తిరిగి వచ్చువరకు ధూపము నిరంతరముగా వేయుటకు ఏర్పాటుచేసి సెలవు తీసికొని వీరావేశముతో కవచాచ్ఛాదితగాత్రుడై సర్వాయుధ సన్నద్ధుడై బయటకు వచ్చెను. అప్పటికే ఆతని దళపతు లందరు ఆతని రాకకై వేచియుండిరి.

మల్లారెడ్డి వారందరతో ఈ కొలదిమాటలు పలికెను.

"వీరులారా! నేడు మన ధైర్యసాహసములు నేర్పు ప్రదర్శించుటకు సమయము వచ్చినది. మనము ధర్మోద్ధరణమునకు పోరుచున్నాము. మనకు జయము నిశ్చయము. ఈ దేహములతో ఆ విజయము చూడగలవారును, దానికై యీదేహము లర్పించి యశఃకాయు లగువారును, ఒకరికంటె నొకరు ధన్యులు. నిర్భయముగా పోరాడేవారికి జయము శీఘ్రతరముగా ప్రాప్తించును. మీమీ సేనాభాగముల నాయకులకు, వీరోత్సాహము కల్పించి గడియలో కోటను పట్టుటకు కోటమీదికి నడచుటకు సేన లన్నింటిని సిద్ధముచేయుడు. జయ, బసవశంకరా! జయ, నందికంత పోతరాజా!"

జయజయ నాదములతో అందరు లేచిరి. గడియ అగునప్పటికి రణభేరి ముమ్మారు మ్రోగినది. మల్లారెడ్డి సేనలు బయలుదేరినవి.

ఆవల సముద్రముపై తన మహానౌకలో ఆవచిదేవయశ్రేష్ఠి పురోహితులు ఏకామ్రనాథునికిని వరదరాజులకును యథావిధిగా పూజలు నిర్వర్తించి ఆతనికి తీర్థప్రసాదము లిచ్చిరి. ఆతడు గురుదేవులగు రామనాథస్వామికి మనసార ప్రణమిల్లి తన నౌకాధిపతుల కుత్సాహవచనములు పలికి మరల నిట్లనెను,

'ఈనాడు మనముఅపూర్వమైన యుద్ధవిధానము అవలంబింప నున్నాము. మా నౌకయే ముందు నడువగలదు. రత్తగేహి నౌక మాకు కుడిప్రక్కన నడువ గలదు. గడియలో నౌక లన్నియు బయలుదేరవలెను. 'జయ, ఏకామ్రేశ్వరా! జయ, శ్రీవరదరాజా!'

జయజయ నినాదములతో నౌకాధిపతులు సెలవు తీసికొనిరి. గడియ సేపటికి సరిగా ఆవల మల్లారెడ్డి రణభేరి మ్రోగిన వేళకే అవచిదేవయ నౌకపై రణభేరి మ్రోసెను. నౌకలు లంగరు లెత్తికొని బయలుదేరినవి.

* * * *

ఆపల మల్లారెడ్డి సేన కదలుచున్న సమయమున సరిగా రామలింగము తాను స్వయముగా నిర్మించిన పెద్ద మాంజినీకును పసపుకుంకుమములతో పూజించి దానికి పెంకాయలు కొట్టెను. అట్లే మిగిలిన మాంజినీకులయొద్ద సోమలింగము మొదలగు తక్కిన శిల్పులు పూజలుచేసి పెంకాయలు కొట్టిరి.

మాంజినీకులు ప్రయోగించుటకు ఆచుట్టుపట్టుల గండశిలలు లేవని రామ లింగము ముందే గమనించెను. అది కేవలము ఇసుకనేల శిలలు దూరమునుండి తెప్పించుటకు బహుకాలము పట్టును. అందుకు వ్యవధానము లేకుండ అతడు ముందే యోచించి ఆ చుట్టుపట్టుల పుష్కలముగా నున్న త్రాటిచెట్లు కొట్టించి బరువైన త్రాటిబొండ్లను నరకించి శిలలకు బదులుగా మాంజినీకులలో ఉపయో గించుటకు గుట్టలుగా పేర్పించెను. వానికి శిలలకంటె కాఠిన్యము కలుగుటకు పదునుగల లోహపుముక్కలు దిగ గొట్టించెను.

రామలింగము పదిమంది భటుల సహాయముతో తన మాంజినీకు ఉట్టి లోనికి పెద్ద త్రాటిబొండును పెట్టించి దానిని ప్రయోగింపజేసెను. అది రివ్వున కోటగోడ దాటి కోటలో పడెను. జయజయ నినాదములు రేగినవి. మిగిలిన మూడు మాంజినీకులును అట్లే విసరినవి. అన్నియు కోటలో పడినవి.

రెండవ మారు రామలింగము తనయంత్రము లక్ష్యశుద్ధి పరీక్షింప దలచి గురిచూచి ఒక బురుజుపైకి విసరించెను. సరిగా నది ఆతడు అనుకొన్న బురుజు మధ్య పడినది. దానితో తృప్తిపడి ఆయంత్రముల ప్రయోగము ఇతరుల కప్ప గించి తాను నిర్మించిన రెండవ రణసాధనమును పరీక్షింప బోయెను.

అది నిడుపైన పెద్దదూలము. దానిచివర గట్టి లోహపుతల మొనతేల్చి అమర్చబడినది. ఆ నిడుదూలము చక్రములు గల బల్లకూర్పుపై నిలుపబడినది. ఏబదిమంది భటు లొకవైపునను మరి యేబదిమంది ఆవలివైపునను దానిని చక్రములపై నడిపించి కోటగోడను తాపులు తాపింతురు. అట్టి నిడుదూలములు నాలుగు సిద్ధమైనవి. తాను స్వయముగా చేయించిన దానికి రామలింగము పసుపు కుంకుమలతో పూజలుచేసి పెంకాయలు కొట్టి నివేదనచేసి 'హరహర మహా దేవ శంభో!' అనుచు కోటగోడను తాపు తాపించెను. కోటగోడ దడదడ లాడినది. మిగిలిన నిడుదూలముల తాపుకు కోటగోడ లదరినవి. అవియును సరిగా పనిచేయు చున్నవని తృప్తిపడి వాని ప్రయోగము సోమలింగాదుల కప్ప గించెను. ఇప్పుడాతడు తాను నిర్మించిన ప్రధాన రణసాధనములవంక దృష్టి మరల్చెను.

ఆ రణసాధనములు మూడే. అవి మూడును దాడువులతో నిర్మించిన మూడు గోపురములు. వాని కొక్కక్కదానికి తొమ్మి దంతస్థులున్నవి. ఆ

మూడును నడుపుటకు చక్రము లున్నవి. అవి కోటగోడవరకు నడుచుటకు అగడ్తలో సరియైన మార్గము లున్నవో లేవో అని రామలింగ మాక్రిందటి రాత్రియే పరీక్షించి యుండెను. పరిఖ ఎక్కువ భాగము ఇసుకమేట వేసినను ఆత డుద్దేశించినచోటుల గోపురములు చేరుటకు తిన్నగా దారులు లేవు. ఆరాత్రి యే ఆతడు చెత్త చెదారములతో దారులు వేయించెను.

ఆతడు ప్రయోగింపబోవు గోపురములు చూచుకొని ఆత డెంతయు మురిసిపోయెను. రామలింగము ఆ మూడు గోపురములకును శ్రీశైలమల్లికార్జు నునకువలె పూజలు స్వయముగా నిర్వర్తించెను; టెంకాయలు కొట్టెను. కూశ్మాండబలు లిచ్చెను. కుంభములు పోసి నివేదించి, వార బోయించెను. అందులో మధ్యదానిలో మల్లారెడ్డియు విస్సన మంత్రియు తమ సేనలతో అధి రోహింప బోవుచుండిరి. విస్సన దారి చూపగా అందులోనికి చేరుచున్న ప్రతివా రును తలకొక టెంకాయ కొట్టి గోపురమునకు నమస్కరించి అందులో కుడి పాదము పెట్టి యెక్కుచుండిరి.

కుడిప్రక్క నున్న గోపురములో అట్లే పంటరెడ్డి తన సేనతో ప్రవేశిం చెను. ఎడమప్రక్క గోపురములో దేసటరెడ్డియు నట్లే సేనతో ప్రవేశించెను.

గోపురమును నడచుటకు పూర్వము సరిగా వానిగమ్యస్థానము లగు కోటగోడ భాగములమీదికి మాంజినీకులు దారుపాతము కురిపించెను. అక్కడి భటులు దారుపాతము భరింపలేక ప్రక్కలకు తప్పుకొనుచుండిరి. సరిగా నాసమ యమున 'హర! హర! మహాదేవ! శంభో!' అనుచు వీరులు సింహనాదములు చేయుచుండ వీర ఘంటలు ఘణఘణ మ్రోయుచుండ భటులు వెనుక నుండి త్రోయగా పెద్ద రథములవలె గోపురములు ముందునకు సాగినవి.

గోపురములు కోటగోడను సమీపించినవి. వానిపై నంతవరకు నాచ్ఛాద నముగా నున్న బల్లలు కోట గోడమీదికి విసరబడినవి. ఆ చెక్కల మీదనుండి సైనికులు గోపురములలో నుండి పైకి ఒక్కపెట్టున ఉరికి వచ్చుచు 'వీరావేశ ముతో కోట గోడపైకి దుముకుచుండిరి.

గోపురములలో నెక్కిన భటులు గోడపైకి లంఘించి నంతనే అవి వెను కకు కదలినవి. మరల సేనల నాపు కొని గోడలమీది కెక్కించినవి. మరల మరల నట్లే జరుగుచున్నది.

ఆవల రేవువైపున గూడ అవచిదేవయ కొన్ని నౌకలపై గోపురము లెత్తించి వానిలోనుండి కోట గోడమీదికి సైనికులను దింపుచుండెను.

ఇట్లు భూమార్గము నుండియు సముద్రమార్గము నుండియు కోటపైకి సేనలు లంఘించుచున్నవి. అట్లు లంఘించునది గోపురములున్న ప్రదేశము లందే కాదు; కోట గోడపొడవునను అన్ని దిక్కులను ఎవరికి వీలు చిక్కిన చోట అక్కడనుండి భటులు గోడల కెగబ్రాకుచుండిరి వారట్లు ఎక్కుటకు ముందు వీరో ప్రయోగించి కోటలోనివారికి కనబడకుండా కాలమేఘము వంటి పొగ కమ్ముచున్నది కోటలోని వారికది అర్థమగుటలేదు, ముట్టడించివారు అసంఖ్యాకముగా త్రాటి నిచ్చెనలు కొయ్య నిచ్చెనలు కొంకులు త్రాళ్లు ఉడుపత్రాళ్ళు మొదలగు అనేక సాధనములు ఉపయోగించుచున్నారు. నేల క్రుంగుటచే గోడ బీటలు వారిన రెండు ప్రదేశములును చేరుటకు మిక్కిలి అనువుగా నున్నవి. సింహనాదము లొనర్చుచు సేనలు ఇట్లు కోట కన్నివైపుల లగ్గల కెక్కుచున్నవి.

దుర్గముపై నిట్లు పోరు సాగుచుండగా లోనివారు ఊరకొన లేదు. పరి పరి విధముల వారు ప్రతిక్రియ లొనర్చిరి. గోడల నెవ్వరిని దరిజేరనీయకుండ గోడల బయటి యంచున గల పిట్టగోడల సందులనుండి బాణప్రయోగము చేయుచు, పిట్టగోడల చాటునకు తప్పుకొనుచుండిరి. మిక్కిలి సమీపించిన వారిపై సలసల కాచిన నీరు నూనె పోయుచుండిరి, పై కెక్కబోవుచున్నవారిని పొడుగుపాటి శూలములతో పొడిచివేయుచుండిరి. గోడకు వేసిన కొయ్యనిచ్చెనలు పలుగులతో నెట్టి వెనుకకు పడవేయుచుండిరి. త్రాటినిచ్చెనలు కొంకి త్రాళ్లు ఉడుపత్రాళ్లు కొడవళ్లువంటి పెద్దకత్తులతోకోసివేయుచుండిరి.ఇవి అన్నియు తప్పించుకొని గోడమీదికి ఎక్కుచున్నవారిని వెనుకకు త్రోసివేయుచుండిరి. గోడపై కెక్కినవారితో బహువిధాయుధములతోడను బాహాబాహియు ముష్టాముష్టి కచాకచి తొడరి పెనగుచుండిరి. ఈవిధముగ యుద్ధము భయంకరముగా సాగుచున్నది.

దుర్గములోని ఆరు మాంజినీకులను పనిచేయు చున్నవి. వానిని ప్రయోగించుటకై గండశిలలు ప్రోవులు పోసియుండిరి. నాలుగు మాంజినీకులు సముద్రమువైపున నౌకల మీదను రెండు భూసేన మీదను శిలావర్షము కురిపించుచున్నవి.

అలావదీను తన అనుచరుల నందరిని తూర్పువైపున దుర్గ రక్షణకు నియోగించి తాను తనదృష్టి ప్రధానముగా భూసేన వైపునకే మరలించెను.

యుద్ధము భయంకరముగా జాములేపు సాగినది. అప్పటికి మల్లారెడ్డియు పంటరెడ్డియు దేసటిరెడ్డియు చెరియొక బురుజును స్వాధీన పరచుకొనిరి. ఆ మూడు బురుజులమధ్య నున్న ఈడ్యభాగము కూడ వారికి సులభముగా స్వాధీన మయ్యెను. వారి సైనికులు ఆమూడు బురుజుల మధ్యనుండియే ఎక్కువగా గోడపై కెక్కుచుండిరి. వారు ఇట్లు నిరాటంక గతిలో గోడపై విస్తరించి ఒక్కొక్క బురుజే పట్టుకొను చున్నారు. ఈ విధముగా కోట పడమటివైపున గోడ యంతయు వారి స్వాధీన మైనది.

అప్పటి ఆవల తూర్పుగోడ యంతయు అవచిదేవయ భటులు స్వాధీన పరచుకొనిరి. ఇప్పు డింకను ఉత్తర దక్షిణముల గల కోటగోడలును లోపలి పట్టణమును స్వాధీన మొనర్చుకొనవలసి యున్నది. ఆ రెండవ పని అంత సులభము గాదు.

పూర్వమే నిర్ణయించుకొన్న ప్రకారము ఒకే పర్యాయము తూరుపు బురుజులనుండియు పడమటి బురుజులనుండియు ప్రకటనలు వినవచ్చినవి:

"కోటలో యుద్ధముచేసెడి వీరులారా! వినండి, ఓహో! మల్లారెడ్డి ప్రభువులవారి అభయవాక్యములు వినండోహో! అవచిదేవయ శ్రేష్ఠి అభయం వినం డోహో! మీ రింకా ఎదిరించుట వృథా! మీ ఆయుధాలు పారవేసి చేతులు కట్టుకొని నిలుచోం డోహో! అట్టి వారికి ప్రాణభయం లేదు!"

అంతవరకు జరిగిన యుద్ధమువలనకంటె ఈ ప్రకటన వలన దుర్గరక్షకు లలో అలజడి యెక్కువైనది. ఎవరిని వారు తమప్రాణరక్షణ చేసికొనుటకు ఆరాటపడుచుండిరి.

శత్రువుల నూతన యుద్ధసాధనములకు ప్రతిక్రియ లాలోచించుచు తన యేకాంతమందిరములో ఉన్న అలావదీనుకు ఈ ప్రకటన వినబడినది. ఆ ప్రకటనచే తనభటు లెక్కువభాగము లొంగిపోదు రని అత డెరుగును. లొంగి పోవుటకు సిద్ధపడు చున్నవారిని నిర్దాక్షిణ్యముగా నరికివేయవలసిన దని అత డాజ్ఞాపింప నిశ్చయించెను. ఆ యావేశముతో నాతడు బయటికి వచ్చుచుండగా కమలనాభామాత్య డెదురుపడెను. అప్రయత్నముగా అలావదీను ఆతనికి

నమస్కరించి 'నాకు శుభాతిశయము శీఘ్రముగా పట్ట నున్న దంటిరే ! ఎప్పుడు ?" అని ప్రశ్నించెను.

'ఇప్పుడే నీకు పరమ మంగళ మగు అంతర్దశ ప్రారంభము గానున్నది' అని కమలనాభుడు ప్రత్యుత్తర మిచ్చెను.

ఆ మాటలు వినగానే అలావదీనుకు ఆలోచన రేగినది, 'ఇక ఈకోట రక్షించుట సాధ్యము గాదు. ఆయుధములు వదలి ప్రాణరక్షణ చేసికొన దలచుకొన్న కృపణుల ప్రాణముల నే నేల తీయవలెను ? అట్టివారికి ప్రాణదాన మొనర్చి కొంత పుణ్యమైన కట్టుకొందునుగాక ! - ఇప్పుడు నేను కర్ణునివలె విజృంభించి ప్రాణము లాచికొనక యుద్ధము చేసెదను. రావణునివలె విజృంభించెదను. - ఆఁ ! ఎవరితో పోల్చి కొంటిని !' అతడిట్లనుకొనుచు కమలనాభుని వద్ద సెలవు తీసికొని యుద్ధరంగమునకు పోవుటకు అశ్వ మెక్కబోవు చుండెను.

అప్పు డాతనికి, మరల జీవములతో తిరిగి వత్తునో, రానో, అను సంది యముదయించినది. ఒక్కసారి తన బావమరది ఎర్రయను చూడవలె ననిపించి నది. ఆవల తన చెరసాల మందిరములో ఎర్రయ శాంతముగా గ్రంధరచన కావించు చుండెను. అప్పుడే స్తంభోద్భవ వచనము పూర్తిచేసి తరువాత పద్యము కంఠమెత్తి అనుచు వ్రాయుచుండెను.

'అక్కజ మైన యానరమ్యగా కృతితేజము లోక మంతటన్
చిక్కటిలంగఁ దీవ్రుగతిఁ చేర్చి తలిర్చినఁ దేరి చూడవే
కెక్కడ యుం జనంగఁ దెలియింపు నెఱుంగక దైత్యుఁ డెంతయున్
జొక్కు మనంబునన్ దిగులు చొచ్చెను జేష్టలు దక్కి నత్తఱిన్ -'

అంత తొందరలో నున్నను అలావదీను శాంతముగా నట్లు పద్యరచన చేయుచున్న ఎర్రయకు రచనాభంగము చేయుట కిష్టము లేక ఆలకించుచు నిలువబడెను.

అల్లే బిగ్గరగా చదువుచు ఎర్రయ రచన కావించుచుండెను.

'కురిసె నందన మందార కుసుమ వృష్టి
మొరసె గంధర్వ కరహత మురజ రవము
బెరసె నారద ముఖముని బృందనుతులు

బలసె నింద్రాది నిర్జర పరికరంబు

'ఇట్లు విజృంభించిన దేవదేవుని దివ్యావతారం బాలోచించి' —

అంతవరకు వ్రాసి ఎర్రయ తలయెత్తి చూడగా అలావదీను కని పించెను.

నృసింహమూర్తి ఆవిర్భవించిన ఘట్టము రచించిన ఆనందముతో ఎర్రయ, 'బావా! నృసింహమూర్తి అవతరించిన ఘట్టమున సరిగా నీవు వచ్చినావు. నీకు తప్పక పరమశుభము రానున్నది' అనెను. అలావదీను హృదయ మంతయు చల్లబడి ఆర్ద్రభావముతో దేహము పులకించెను.

'దుర్గము పట్టు తప్పుచున్నది. మరల నిన్ను చూచుటకు ప్రాణములతో నుందునో ఉండనో అని కడసారి నిన్నైన చూచి పోవుద మని వచ్చితిని. నా చెల్లిలిని చూడ గలిగినచో నాప్రాణములు సుఖముగా వదలగలను.'

'ఏమైనను నీకు తప్పక పరమశుభము రానున్నది. యుద్ధములో వెను కాడని వారికి శుభమే కలుగును. పోయి రా!'

వెనుక లేని ఉత్సాహముతో అలావదీను ఇప్పుడు యుద్ధభూమికి కద లెను. అప్పుటి కప్పుడే కోటలోని సైనికులలో పలువురు ఆయుధములు విసర్జించి లొంగిపోయిరి. ఆతని ముఖ్యసేనానులు కొలదిపరివారముతో వెనుకకు తగ్గి ఆతని కలసికొని, 'ఖుదావన్‌ద్! ఇపుడు కర్తవ్యమేమి?' అని ప్రశ్నించిరి. అలావదీను వెంటనే ప్రత్యుత్తర మిచ్చెను.

'మీరును ఆయుధములు వదలి లొంగిపోయి ప్రాణములు రక్షించుకొన దలచినచో నా కెట్టి యభ్యంతరము లేదు. నేను మాత్రము తెలివి యున్నంత వరకు పోరాడ నిశ్చయించితిని.'

వారందరును ఆతని తోడనే ఉండి తుదివరకు పోరాడ సమ్మతించి బయలు దేరిరి.

మల్లారెడ్డి విస్సన్నతో కలసి కోటమధ్యనున్న ధ్వజము పట్టుకొనుటకు ఉత్సహించుచు పోవుచుండెను. సరిగా ఆధ్వజమును రక్షించుటకే అలావదీను తన ముఖ్యానుచరు లందరితో అంతకుముందే అక్కడికి చేరి కాచుకొని యుండెను.

మల్లారెడ్డి వెంట నప్పుడు ఏబదిమంది భటులే ఉండిరి. ధ్వజముపద్ద అలావదీనువెంట నూరుమంది ఉన్నారు. మల్లారెడ్డి తనబలము ఎదిరి బలము చప్పున లెక్క చూచుకొనెను. వెంటనే పోరుకు సాహసించుట నీతి కాదని క్షణకాలము సందేహించుచు నతడు ప్రక్కనున్న విస్సనవంక చూచెను. విస్సన తనశూలముతో ముందడగు వేసెను. మల్లారెడ్డి విస్సన సూచన గ్రహించి వెంటనే భీషణముగా ముందుకు లంఘించెను.

ఆ వచ్చెడి మల్లారెడ్డి ధీమాచూచి అలావదీను ఆశ్చర్యపడెను. పూర్వము వాయుపుత్రుడు ఈవిధముగానే లంకపై విజృంభించెను కాబోలు ననిపించెను. అట్టి ఊహ తనమనస్సుకు తట్టినందుకు మరుక్షణమునసే అతని కాశ్చర్యము వేసినది. ఆంతలో మరల, ధర్మమున కీంత ధైర్య ముండును కాబోలు నను కొన్నాడు. మరల వెంటనే ఇదేమిటిఁ ఇట్లు వికటమైన ఆలోచనలు తోచుచు చున్నవి అనుకొనెను.

ఇప్పు డిక ఆలోచనలకు వ్యవధానము లేదు. మల్లారెడ్డి సమీపించి నాడు. తనభటులను పురికొల్పుచు పొట్టేలును పొట్టేలు డీకొనునట్లు అలావదీను మల్లారెడ్డితో తలపడినాడు. ఇటు విస్సన్నయు మిగిలిన భటులను షేర్ఖాను మొదలగు తురక సరదారులతో తలపడిరి కత్తులు బల్లెములు గండ్రగొడ్డళ్ళు గదలు - ఇంకను అనేక విధముల ఆయుధములు ఉభయ పక్షముల వారు ప్రయోగించు చుండిరి. రెండువైపుల కేడెములు కత్తులు ఎగిరిపోవు చున్నవి; తలలు తెగుచున్నవి; చేతులు కాళ్ళు నరుకబడుచున్నవి. రక్తము ప్రవాహములు కట్టుచున్నది; ఉభయ పక్షములవారుతెగువతో పోరాడుచుండిరి.

మల్లారెడ్డిని స్వయముగా అలావదీను తన పొడుగుపాటి శూలముతో బలముగా పొడిచినాడు. మెరసినట్లు మల్లారెడ్డి డాలు అడ్డము పెట్టి ఆదెబ్బ కాచుకొన్నాడు. బలముకొలది శూలము పొడిచిన ఊపునకు ఆగలేక అలావదీను కొంచెము తూలుచు మల్లారెడ్డికి అందుబాటులోనికి వచ్చినాడు. వెంటనే మల్లారెడ్డి తనకు అవచిదేవయ బహూకరించిన బరువైన కత్తితో ఫెఢీమని అతని తలమీద కొట్టినాడు. ఆ ఖడ్గాహతి భారమునకు సామాన్య డింకొక డైనచో పాతాళమునకు క్రుంగిపోయెడి వాడేఁ కాని అలావదీను మహాబలాఢ్యుడు, చురుకైన దేహము కలవాడు. తల పగిలిపోకుండ శిరస్త్రాణము రక్షించినది. ఆ దెబ్బకు

శిరస్త్రాణము తలమీదినుండి ఊడి దూరముగా యెగిరి పడిపోయినది. దానితో పాటు దెబ్బకూడ జారిపోయినది.

ఇప్పుడు అలావదీను శిరస్సు అనాచ్ఛాదితముగా నున్నది. ముఖము స్పష్టముగా కనబడుచున్నది. మల్లారెడ్డికి కత్తితో నాతని ముఖము పొడుచుటకు వీలు చిక్కినది అలావదీనుకు శిఖాబంధము లేదు. గడ్డము పెరిగియున్నది. ఆ ముసల్మాను వేషములోకూడ తెరచాటునుండి కనబడు దీపమువలె మేఘము మరుగుననుండి కనుపించు చంద్రబింబమువలె, ఆతని ముఖములో బ్రాహ్మణ వర్చస్సు మసక మసకగా కనిపించినది. బ్రహ్మహత్యకు మల్లారెడ్డి ఒక్కక్షణము వెనుకాడినాడు.

అది ప్రక్కనున్న విస్సన కనిపెట్టినాడు 'ఏమి మల్లయ్యా! యుద్ధ యజ్ఞములో కులవిచక్షణ లేదు.!'

ఒక్క పెట్టున మల్లారెడ్డికి మెలకువ వచ్చిన ట్లయినది. ఆతడు వెంటనే విద్యుద్వేగముతో అలావదీనుపైకి లంఘించెను, అలావదీను అతనికంటె ఎక్కువ చురుకుదనము గలవాడు. కనుక చప్పున ప్రక్కకు తప్పుకొని క్రింద పడిపోయిన శిరస్త్రాణము తీసి తలకు తగిలించుకొని తనఖడ్గము మల్లారెడ్డి వామబాహువుమీదికి బలముగా విసరినాడు. అదృష్టవశమున అక్కడ బాహు కవచ మడ్డుకొన్నది. కాకున్న ఆబాహువు తెగిపోవలసినదే!

అంతట మల్లారెడ్డికి అలావదీనుకు భయంకరముగా ద్వంద్వయుద్ధము ప్రవర్తిల్లినది. రెడ్డికి బల మెక్కువ. అలావదీనుకు చురుకుదన మెక్కువ. అలావదీను సందిచ్చుట లేదు. సందులో సందు చేసికొని అతడే మధ్యమధ్య మల్లారెడ్డికి ఒకసారి ఈచేతిమీద ఒకసారి ఆచేతిమీద, ఈ కాలిమీద నొకసారి ఆ కాలిమీద నింకొకసారి, ఈప్రక్క నొకమారు ఆప్రక్క నొకమారు, చిన్నచిన్న దెబ్బలు తగిలించుచున్నాడు. మల్లారెడ్డి మొద్దుదెబ్బలా ఎప్పటి కప్పుడు దేనికది అలావదీనును నేలమీద పడగొట్టునట్లే కనబడుచున్నవి గాని ఆతడు నేర్పుగా తొలగి తప్పుకొనుచున్నాడు. అంతంత దెబ్బలును ఎక్కువభాగము నేలకే తగులుచున్నవి. తప్పుచున్నకొలదిని, మల్లారెడ్డికి కోప మతిశయించుచున్నది. అలావదీనుకు జయము చేతిలో నున్న ట్లున్నది. మల్లారెడ్డి దెబ్బ తినున ట్లున్నాడు.

సరిగా ఆసమయమున అలావదీనుకు కొంచెము కొంచెమే అలుపు వచ్చు చున్నది. ఆత డిన్నాళ్ళను రేయింబవళ్లు సరిగా నిద్రాహారములు లేక దుర్గర క్షణ ప్రయత్నములు చేయుచుండుటచే డస్సి యున్నాడు. అదియు గాక కమల నాభుని మాటలచే ఆతని కాత్మవిశ్వాసము తగ్గినది.

మల్లారెడ్డికి అలుపులేదు. ఆతనికి భయముగాని జంకుగాని కొంకుగాని లేవు. అవి యతనికి ఉపయోగపడినవి.

అలావదీనుకు మొదట గలిగిన పైచేయి తగ్గ నారంభించినది. కొద్దిసేప టిలో ఇద్దరు సములైరి. మరికొంత సేపటికి అలావదీనుది క్రిందిచేయి అయినది.

ఇపు డలావదీను దెబ్బలు మల్లారెడ్డికి చిన్న గాయముకూడ చేయలే కున్నవి. మల్లారెడ్డి భయంకరమైన తన కత్తితో 'ఖణేల్ ఖణేల్'మని కొట్టు చున్నాడు. అది ఒకసారి అలావదీను శిరస్త్రాణమునకు తగులుచున్నది: ఒక సారి డాలుకు తగులుచున్నది, మధ్యమధ్య అది అతని కత్తికే తగుచున్నది.

అలావదీను పట్టినది చురుకైన సన్ననికత్తి. అది నేర్పుగల పనివాడు డమాస్కసులో చేసినది. తెల్లత్రాచువలె జవజవ లాడుచు అతని చేతిలో నది మెరమెర లాడుచున్నది. పలుచగా నుండి గట్టిదనము లేనిదిగా కనిపించు చున్నను, అది మంచి చేవ గలది. అపచిదేవయ బహూకరించిన మల్లా రెడ్డి బరువైన కత్తి దెబ్బలకు ఎప్పటి కప్పు డది విరిగిపోవు చున్నట్లే కనిపించు చున్నది. కాని దెబ్బ తగిలినప్పు డెల్ల దెబ్బతో పాటు పంగిపోవుచు దెబ్బను జారదీసికొను చున్నది. వెంటనే అది మరల చక్రున లేచుచున్నది.

మల్లారెడ్డి ఇక నా కత్తిని కొట్టిన లాభము లేదని గ్రహించినాడు. శిర స్త్రాణము గాని డాలుగాని దెబ్బలకు లొంగవలసినదే గాని ఆ కత్తిమీద ప్రయో గించుట నిష్ప్రయోజన మని కనిపెట్టినాడు. మొండితనముగా నాతడు పంచ ప్రాణములు బిగబట్టి మంచి ఊపు తీసికొని 'జయ నందికంత పోతరాజా!' అనుచు పిడుగువంటి దెబ్బ డాలుమీద కొట్టినాడు. ఆ దెబ్బకు అలావదీను డాలు ముక్కలై పోయినది, ఆకత్తి ఊపు అంతటితో ఆగలేదు. అది అలావదీను రొమ్ముపై బడినది. గాయము కాకుండ కవచము రక్షించినను ఆ దెబ్బకు అలా వదీను స్మృతి తప్పి పడిపోయినాడు.

ఆతడు పడిపోవగనే తురుష్క వీరులు ఊరకొనలేదు. వారు చాలమంది మల్లారెడ్డిని విస్సన్నను చుట్టుముట్టిరి. వారి తాకిడికి వారిద్దరు నిలువలే కున్నారు. ఏ క్షణములో నైనను వారు తురుష్క వాహినిలో మునిగిపోవునట్లున్నారు.

అక్కడికి కొంతదూరమున తురుష్కుల మాంజినీకులలో ఒకటి పంట రెడ్డి స్వాధీన పరచుకొని యుండెను. ఆతడు పంటరెడ్డి మల్లారెడ్డుల అపాయ స్థితి చూచెను. తన భటులతో అక్కడికి చేరుకొను వ్యవధానము లేదు. ఆతని కేమి చేయవలనో తోచలేదు. ఆతడు పట్టుకొన్న మాంజినీకులలో అప్పటికే శిల అమర్చియున్నది. దానిని విసరిన ఎవరికి తగులునో! అయినను అంతకంటె మరియొక యుపాయము కనిపింపలేదు. భక్తితో నాతడు బసవశంకరుని ధ్యానించి వడిసెల రాయి విసరినట్లే మాంజినీకు శిల తురుష్కులపైన విసరి నాడు. ఎక్కడ పడునో చూచుటకు ధైర్యము లేక ఆతడు కన్నులు మూసి కొనెను.

అతని వడిసెలరాయి ఎప్పుడును గురి తప్పునది కాదు. వడిసెల త్రాళ్లు ఆతని చేతిలో స్వాధీనములై యుండును. మాంజినీకు త్రాళ్ళు అట్లు కాదే! కన్నులు తెరచి చూచిన నేమి చూడవలసి వచ్చునో యని మరింత గట్టిగా కన్నులు మూసికొని ఆతడు తన యనుచరులను మల్లారెడ్డిపైపు పరుగెత్త నాజ్ఞా పించి తానును కన్నులు మూసికొనియే వారి ఆడుగుజాడల పరువెత్తు చుండెను.

పంటరెడ్డి గుండెలు దడదడ కొట్టుకొను చున్నవి. ఆవల శిల పడిన చప్పుడును, హాహాకారములును, వినవచ్చినవి. ప్రాణములు బిగబట్టి పంటరెడ్డి కన్నులు విప్పి చూచెను. మల్లారెడ్డియు విస్సనయు నిలిచి తూలుచు పోరాడు చునే యుండిరి.

ఆ పెద్దబండ మాంజినీకులినుండి ఎగిరిపోయినది. మల్లారెడ్డి యుద్ధము చేయుచున్న వైపునకే ఎగిరిపోయి గుంపులో పడినది. అది పడువరకు మల్లా రెడ్డిగాని విస్సనగాని దాని వంకనే చూడలేదు. దాని ఉసివల్ల పుట్టిన గాలి వారిద్ద రకు తగిలి ఊపివేసినది ఏమా అని చూచునప్పటికి బహు సమీపమున ఆ శిల పడి దొరలి పోవుచున్నది.

ఆ బండ రాక తురకలు ముందే గమనించిరి. దానివలన ఒక్క లాభము గలిగినది. తురుష్కులు గబగబ తప్పుకొనిరి. మల్లారెడ్డికి విస్సనకు వ్యవధి

చిక్కినది. తమవెంట పరివారము పదిమంది కంటె లేరని వారు గమనించిరి. ఆవల తురుష్కులు ఏబదిమంది యున్నారు.

తురుష్కసేనానులు మిక్కిలి సమర్థులు, శౌర్య సాహసోపేతులు శిల పడినందున వెనుకకు తగ్గిన తమ భటులను కూడగట్టుకొని మీదికి దూకించి నారు. వారు మల్లారెడ్డిని గుర్తించిరి. తమ శత్రువుల సర్వసైన్యాధిపతి యగు మల్లారెడ్డి నెట్లయిన ఇప్పుడు మడియించినచో తమకు జయము ప్రాప్తింప వచ్చును. భయంకరముగా సంకులసమరము జరుగుచున్నది.

మహావీరులగు తురుష్కసేనానులు మల్లారెడ్డినే తాకుచున్నారు. అంద రిలో ముందున్న షేర్ఖాను ముందుగనే మల్లారెడ్డి కత్తికి ఎర యయ్యెను ప్రక్కనుండి సాలర్ ఉల్వీ మల్లారెడ్డి కత్తిపోటుకు కుడిచేయి తెగి తొలగినాడు. మరియొక ప్రక్కనుండి వచ్చిన మూడవసేనాని ఆలీఖాను ఏడమచేయి గాయమై తప్పుకొనెను. నాలుగవవాడు ఉద్రేకముతో మల్లారెడ్డిపై దూకుచుండెను.

మల్లారెడ్డి చేతు లలసినవి. ఆతని చేతులు వణకు చున్నవి. ఎడమ చేతిలో డాలును కుడిచేతిలో కత్తియు పట్టుటే కష్టముగా నున్నది. అయినను అతనికి వెనుకచూపు లేదు. ఉత్సాహము తగ్గలేదు. అతడు తన్నెదిరించుచున్న తురుష్క సేనానిమీద అమాంతముగా దుమికినాడు. ఆ దూకుడులో ముందుకు తూలినాడు? ఆతని బరువైన దేహము తురుష్క సేనానిమీద పడినది, ఆతని డాలు ఆవల తురుష్క సేనాని ఖడ్గము ధరించిన దక్షిణ బాహు వును నేలకు అదిమి పట్టినది. ఎడమ బాహువును పలకతో సహా మల్లారెడ్డి దక్షిణబాహువు నేలకు త్రొక్కిపట్టినది. మల్లారెడ్డి చేతిలోని కత్తి పట్టు జారి తురుష్క సేనాని డాలుపై బడి ఖంగున మ్రోయుచు నేలకు దొరలిపోయినది. ముందుకు తూలి పడుటచే కవచముచే అనాచ్ఛాదిత మగు మల్లారెడ్డి వీపంతయు ఇప్పుడు తురుష్క సేనాను ల కత్తులకు తేలిక యైన గురిగా నున్నది. తురుష్క లాతనిపై మూగినారు. సరిగా నా సమయమున పంటరెడ్డి తన ప్రాణములు సరకుగొనక భటులతో నడ్డు పడినాడు. మరియొక క్షణములో దేసటిరెడ్డియు తన సైనికులతో కలిసికొనినాడు.

తురుష్కసేనాను లందరు ఆక్రమింపబడిరి.

సుల్తాను అర్ధచంద్ర ధ్వజమును పంటరెడ్డియు దేసటరెడ్డియు ఇపుడు దింపివేయ వచ్చును. కాని ఆ గౌరవము తన నాయకు డగు మల్లప్రభువునకే దక్కింప దలచి వారు ఇంచుక ఆగియుండిరి.

ఈ వ్యవధానములో మల్లారెడ్డి విస్సన చేసిన ఉపచారములచే తెప్పరిల్లి లేచినాడు. ఆతడు కనులు తెరచి చూచినంతనే. ధ్వజస్తంభముపై ఇంకను సుల్తాను ధ్వజము నిలిచి యుండుటచే ముందు కనబడినది. వెంటనే ఆతడు తన కత్తి నందుకొని విసరున పోయి స్తంభముపై కట్టియున్న సుల్తాన్ ధ్వజము తాడు కోసి లాగివేసెను. అత డంతట తన ఆనుచరుడు తెచ్చిన బసవశంకర ధ్వజము స్తంభముపై నెక్కించి దానికి తలయొగ్గి నమస్కరించెను. జయ జయ నినాదములతో విస్సనయు పంటరెడ్డియు దేసటరెడ్డియు వారి యనుచరులతో సైనికు లందరును ధ్వజమునకు నమస్కరించిరి.

ఆవలి వైపుననుండి అవచిదేవయయు రత్తగేహయు కోట నాక్రమించు కొనుచు ఇప్పుడు ధ్వజమును సమీపించిరి. వారిద్దరును తమ భటు లందరితో ధ్వజమునకు నమస్కరించిరి.

మల్లారెడ్డి మోటుపల్లిని పట్టుకొన్న విజయధ్వానములు కోట కొమ్మలను అంతర్భాగమునను బహిర్భాగమునను భూనభోంతరముల చెలరేగినవి.

పరహితపండితులను వెంటగొని కమలనాభామాత్యుడు చేరవచ్చి మల్లారెడ్డి నగ్గించుచు ఇట్లు ఆశీర్వదించెను.

'మల్లప్రభో, బసవశంకర ధర్మకేతుః
సంస్థాపితో దిశతు తే శుభమంగలాని
ద్వీపాంతరేషు విశదం పటుమోటుపల్లీ
సమ్మోచనం ప్రకటయన్ నిజదీప్తి జాలైఃఃః

ఇన్నాళ్ళు ఆగబట్టుకొని యున్న తహతహ ఇప్పు డొక్కసారిగా పట్ట రాకుండ ఉబికినది. అతడు అన్నయ్యవద్ద సెలవు తీసికొని కాపానీనికి చెప్పి చెదలువాడకు ప్రయాణమయ్యెను. వా రిరువురును ఆ ప్రాంతమంతయు అల్ల కల్లోలముగా నుండుటచే కొంతసేనను వెంట తీసికొని పోవుట మంచిదని చెప్పిరి. కాని ఆత డందు కంగీకరింప లేదు.

'మా చెల్లెలిని మా తమ్ముని చూచి క్షేమము విచారించి వచ్చుటకు సైన్య మెందుకు?' అనుచు వా రెంత చెప్పినను వినక ఒంటరిగానే బయలుదేరెను

ఆత డెట్టి విశేష సంఘటనలు లేకుండ కృష్ణానది దాటి నాలుగు రోజు లలో చెదలువాడ చేరుకొనెను.

గ్రామ మంతయు పాడుకొట్లాడచున్నది. ఇంత బీభత్సముగా పాడు డిన గ్రామము ఆతడు దారిలో నెక్కడను చూడలేదు. ఆతడు చెల్లెలి ఇంటికి పోవుటకు ముందు తన అలవాటుచొప్పున ఆ గ్రామములో నున్న రామలక్ష్మ ణుల ఆలయమునకు పోయెను. అ ఊరికంచెను ఆదేవాలయము ప్రాకారము ఊడిపోయిన రాళ్ళతోడను పడిపోయిన గోడలతోడను ఎక్కువ పాడు కొట్లాడు చుండెను. అందులో ప్రతిష్ఠిత లైన రామలక్ష్మణు లేమై రను జంకుతో ఆత డాలయములో ప్రవేశించెను. ద్వారము దాటగనే గర్భాలయములోనుండి అఖండ దీపము మనోజ్ఞకాంతితో వెలుగుచుండ కానవచ్చినది. ఆ జ్యోతి వెలుగున సీతారామ ల విగ్రహములును లక్ష్మణస్వామి విగ్రహమును దివ్యకాంతి తో తేజ రిల్లుచు కానవచ్చినవి. అత డా జ్యోతికిని శ్రీ సీతారామలక్ష్మణులకును భక్తి వినమ్రుడై నమస్కరించి సెలవు తీసికొని చెల్లెలి యింటికి బయలుదేరెను.

ఆ యిల్లును బైటి వైపున ఆవరణపుగోడ పడిపోయి సింహద్వారము లేకుండి గురించుటే కష్టముగా నున్నను లోపలిభాగమునుండి శ్రావ్యకంఠ ముతో వేదపాఠము సంత చెప్పుచున్న తనమేనల్లుళ్ళగు రామలక్ష్మణుల కంఠ స్వరములు విని గుర్తించి బొల్లన సంతోషాతిశయముతో ఇంటిలో ప్రవేశించెను.

సంత చెప్పువారికి భంగము కలిగించుట కిష్టములేక వారిని పలుకరింప కయే ఆతడు సవాసరి లోనికి పోయెను. చెల్లెలు పోలమ్మ ఆదరముతో పాద ప్రక్షాళనమునకు ఉదక మిచ్చి కరాపర్తిలో అందరి క్షేమము లడిగెను. అందరు క్షేమముగా నున్నారని అత డుత్తర మిచ్చి ముందు గ్రుడ్లూరులో తన తమ్ముడు

సూరన్న కుటుంబము క్షేమమేనా, అని ప్రశ్నించెను. ప్రోలమ్మ ఉత్తర మీయక అన్నకు దాహము కావలె నేమో కనుగొని వలదన్న పిమ్మట మౌనము వహించి కన్నీరు కార్చసాగెను.

ఆ రాత్రి ఈవైపు వార్తలన్నియు బొల్లనకు తెలిసినవి. తురకలు వచ్చు చున్నా రనుభయముతో సూరన కుటుంబముతో గ్రుడ్లూరు విడిచిపోయెను. అడవులలో వారందరును చెప్పరాని కడగండ్ల పాలయిరి. సూరన శిఖాయజ్ఞోప వీతములు తురకనాయకు డొకడు తీయించ బోవుచుండగా తానే తొలగించుకొని ఆతుర సన్యాస విధానమున ప్రేషోచ్చారణమొనర్చి ఊర్ధ్వబాహువై ప్రాణములతో మాత్రము వెడలిపోయె నని తెలిసినది. ఆతడు శ్రీ విద్యారణ్య యతీంద్రుల పాదము లాశ్రయించి క్రమసన్యాసము పుచ్చుకొనె నని జనశ్రుతి కలదు. కాని నిశ్చయవార్త తెలియలేదు. పోతమ్మ యెట్లో అడవిలోనుండి బయటపడి శ్రీశైల ప్రాంతములో శ్రీ శంకరస్వామల యాశ్రమములో భర్తృ పాద ధ్యాన తత్పరయై యున్నది. కోడలు అడవిలో తప్పిపోయి కొంత కాలము చెంచుల గూడెములోను మరికొంత కాలము యవనుల స్కంధావారములోను ఉండి మల్లారెడ్డి నౌకలచే విడిపింప బడినది. అప్పుడే ఆక్కడకు చేరిన ఎర్రయ దాని నొల్లక పొవుటచే మల్లారెడ్డి తన భటుల నిచ్చి ఇక్కడికే పంపినాడు. ఎర్రయ ఆ పిమ్మట మనస్సు చెల్లక ఏరి కోరుకొని తురకల చేతిలో నున్న మోటు పల్లికి ప్రభుకార్య సాధనకు వెళ్లుచున్న కొందరు బ్రాహ్మణులతో కలసి వెళ్ళినా డట! వాని క్షేమవార్త తెలియలేదు. ఆ దుర్గనాయకుడు బహు క్రూరుడట.

'వాని పేరేమి?'

'అలావదీనట అన్నయ్యా!-' చెల్లెలే చెప్పినది.

బొల్లన వెకిలినవ్వు నవ్వెను. 'ఆ దౌర్భాగ్యుడా? - వాడైతే నీ పెద్ద కొడుకు బసవన్నే!'

'అయ్యో, అయ్యో!' అనుచు ప్రోలమ్మ వా డిక్కడ చేసిన ఆగడ మంతయు వర్ణించినది. తండ్రిని శూలముతో పొడిచి తమ్ములను గొంతులు పిసికి తన్ను కత్తితో గాయపరచిన ఉదంత మంతయు ఏడ్చుచు పోలమ్మ విన రించినది. వా డా ఊరికి చిచ్చు పెట్టించినదియు చెప్పి విలపించినది. ఆరాత్రి తెల్లవారు జామున ఎవరో పరహిత వైద్యులట వారు వచ్చి తమకు ప్రాణ ములు పోసి బ్రదికించి నదియు చెప్పినది.

తన పెద్దకుమారుని ఓసెత్తుటకే సోమయాజి అసహ్య పడుచుండెను. ఈ కథలతో అర్ధరాత్రము వరకు గడచినది.

'అన్నయ్యా. నా కొక్కటే దిగులురా! సాక్షాత్తుగా అశోకవనములో ఉన్న సీతామ్మవారి-లె ఉన్న మహాలక్ష్మిని ఏక్షైనా పెనిమిటితో కూర్చవలె! అన్నివిధముల చెడిపోయిన ఆపెద్దవాడు జంబెము లేకుండ ఇంటికి వచ్చిన నాడే పోయినా డనకొని ఒక్క ఏడ్పు ఏడ్చి ఊరకున్నాను. కాని దీని గోడు రాత్రిం బవళ్లు చూడలేకున్నాను, అన్నయా!'—అని పోలమ్మ కన్నీరు కార్చినది.

ఆరాత్రి యంతయు మరి మూడు పవళ్లు రాత్రులు బొల్లన మనస్సులో మథనపడెను. అతనిని బాధించుచున్నది మహాలక్ష్మి సంగతి కాదు, ఎర్రయ సంగతియు గాదు. తన దొడ్డిపట్ల అనుభవముచే బసవన్న చేతిలో ఎర్రయకు మోటుపల్లిలో ఎట్టి అపాయము నుండదని ఆతనికి నిబ్బరము కలిగినది. నిష్క లంకురా లగు మహాలక్ష్మిని భర్త తాను చెప్పినచో గ్రహింపక పోడనియు ఆతనికి ధైర్య మున్నది. ఆతనిని బాధించుచున్నది బసవన్న విషయమే! ఆతడు సర్వవిధముల చెడిపోయెను. వానిని బాగుచేయు పెట్లా అను చింతయే బొల్లనను బాధించుచున్నది!

బొల్లన స్వయముగా ధర్మశాస్త్రములు అధ్యయనముచేసిన వాడుకాడు ఎంత దోషమునకు ఎట్టి ప్రాయశ్చితము విధింపవలెనో అత డెరుగడు. ఆ మూడుదిన ములు తన బావమరదితోడను గ్రామములోని ధర్మవిదు లగు ఇతరవృద్ధుల తోడను బ్రహ్మహత్యాది మహాపాతకములు చేసినవారికి ఎట్టి ప్రాయశ్చిత్తములు శాస్త్రములు విధించినవో. ఏదో సందర్భము కల్పించుకొని ప్రస్తావించి తెలిసి కొనుచు దీర్ఘముగా నాలోచించు చుండెను, మూడవనాటి సాయంకాలమున కాత డేదోనిశ్చయమునకు వచ్చెను. వెంటనే ఆతడు చెల్లెలిని బావమరదిని ఆమరునాటి తెల్లవారు జాముననే సకుటుంబముగా మోటుపల్లికి ప్రయాణ మగుటకు సిద్ధము కావ-సిన దని అత డాదేశించెను.

బొల్లన మాటకు తిరుగు లేదు, మహావిద్వాంసుడును సోమపీథియు నగు నాతని బావమరది కారణ మేమనికూడ ప్రశ్నింపక అగ్నులతో ప్రయాణ మయ్యెను. రెండెడ్ల బండిపై ప్రోలమ్మయు మహాలక్ష్మియు యాత్రావసర వస్తు వులతో బయలుదేరిరి. అగ్ను లున్న కావడిని సోదరులు రామలక్ష్మణు లిద్దరు

ఒక రలసి నప్పుడు ఒక రెత్తుకొనుచు దారి సాగుచుండిరి. మహాలక్ష్మిని వదలక వెంట వచ్చిన చిన్నయ్య బండి తోలుచుండెను. ఆతని కుక్క కోటవారికి కాపుగా వెంట వచ్చుచుండెను.

వా రందరు మోటుపల్లి చేరుటకు ముందటి రాత్రి మకాము చేసిన చోటు ననే, మోటుపల్లి దుర్గము మల్లారెడ్డి వశమైన వార్తయు, దుర్గాధిపతి అలావదీను పట్టువడె ననియు, ఆతడు చేసిన నేరములు విచారించి శిక్షింప నున్నా రనియు, వారికి తెలియ వచ్చినది. మోటుపల్లి పతనముతో ఆ చుట్టుపట్టుల ప్రదేశ మంతయు సర్వబాధా వినుర్ముక్త మైయున్న దనియు వారికి తెలిసినది. బొల్లన మోటుపల్లి వార్త విన్న దాది నిప్పులపై అడుగు లిడుచున్నట్లు ఆరాట పడు చుండెను.

61

మల్లారెడ్డి మోటుపల్లి కొనినందున ఇక నిరంతరాయముగా సప్తద్వీప సద్యస్తు సందోహంబు దన కిచ్చునెచ్చెలిగా జేసి సముద్రం బ్రీతి గావింప నగు నని ధైర్యం కలిగినది. పట్టువడిన దుర్గములో చేయవలసిన ప్రయత్నము లెన్నియో ఉండును. పూడిపోయిన పరిఖ మరల లోతు చేయింపవలెను. పడిపోయిన గోడలు బురుజులు కొమ్మలు దిడ్లు గవనుు గోపురములు బాగుచేయింప వలెను. ఆవల ముంచిన పడవలు తేలదీసి దెబ్బతిన్న నౌకలు బాగుచేయింపవలెను. అట్టి సమస్త కార్యములు సాధించుటకు స్థపతులు నియమింపబడిరి. కోటలో మారుమూలల శత్రువు లెవరైన దాగి యున్నా రేమో గాలింపవలసి యున్నది. ఆ పని భటులు కొనసాగించుచున్నారు. ఆహార సామగ్రి సరిచూడవలసి యున్నది, అది పుష్కలముగా అచిదేవయ నౌకలలో సప్తద్వీపములనుండి కొనిరాబడి యున్నది. అది యిప్పుడు సముచిత స్థానములకు చేర్చుచున్నారు. వచ్చిన నాయకులకు దళపతులకు వీరులకు సపత లకు శిల్పులకు ఖనకులకు నివాసము లేర్పరచి, వారి వారి సేవల కనుగుణముగా బహుమానములు పంచిపెట్టవలసి యున్నది. వారికి సుఖనివాసము లేర్పరచి వారి వారి సాహసకృత్యములు లెక్కలు వ్రాయించుచున్నారు. అందులకై శతాధిక లగు కరణములను వారిపైనుండు రాయసములను లెక్కలు తయారుచేసి కవిలె సంపతులకు అందించుచున్నారు. గాయపడినవారి కందరకు చికిత్సలు చేయిం

చుట ఎంతో అవసరము. అందుకు కోటలో ముందేచేరిన పరహితవైద్యులను, మల్లారెడ్డి సేనలవెంటను అవచిదేవయ నౌకలందును వచ్చిన బహు సంఖ్యాకులగు వైద్యులును వారి యనుచరులును నియోగింపబడి వారివిధులు నిర్వహించుచున్నారు, ఇట్లే ఎన్నెన్నియో నిత్యకృత్యములు జరిగిపోవుచున్నవి.

అన్నిటి తోపాటు బందీలుగా చిక్కిన శత్రుసైనికుల నేమి చేయుటా అనునది పెద్ద ప్రశ్న. వారిలో పలువురు జీతముల కాశపడి సేనలో చేరినవారే. వారిలో దుర్మార్గ కృత్యములు చేసినట్లు నిరూపింప బడినవారిని కఠినముగా శిక్షింపకుండ వదలుటకు వీలులేదు. అట్టివారిలో అగ్రగణ్యుడు దుర్గాధిపతి యగు అలావదీను.

బంధితు లగు దోషులను విచారణ చేయుటకు చత్వరములం దన్నిటిలో అనేకములగు అధికరణ స్థానములు స్థాపింపబడినవి. నిందితులు దుష్కృత్యము లొనర్చినట్లు ఏమాత్రము సాక్ష్య మున్నను అట్టివారికి సర్వసామాన్యముగా శూలారోపము దండముగా విధింపబడి వెంటనే అక్కడనే అమలు జరుపబడు చున్నది. శూలారోపితు లైన దోషుల మూల్గులతో చత్వరములు రేయింబవలు ప్రతిధ్వనించు చున్నవి. అత్యల్ప దోషులు కశాఘాతములతో వదలివేయబడు చున్నారు. జంగమదేవర ఎక్కడను కనపడలేదు. ఆతడు చీకటిలోనుండి అవతరించినట్లే, చీకటి లోనికి అదృశ్య డయ్యెను. అలావదీను విచారణ దుర్గమధ్యమున బసవ శంకర ధ్వజస్తంభము నొద్దనే, దుర్గము పట్టువడిన మరునాటి మధ్యాహ్నమున ప్రారంభ మైనది. అప్పటి కాతడు పరహిత వైద్యుల చికిత్సచే పరిపూర్ణముగా స్వస్థుడు కాకున్నను కొంత కోలుకొని దోషారోపకులు చెప్పెడు నవి విని తన్నడుగు ప్రశ్నలకు సమాధాన మీయగల స్థితిలో నున్నాడు.

ఆతని దోషవిచారణ మొనర్చు నధిక రణములో మల్లారెడ్డి పంటరెడ్డి దేసటరెడ్డి అవచిదేవయ రత్తగేహి మొదలగు సేనానాయకులే కాక కమలనాభామాత్యుడు మొదలగు పలువురు విద్వద్బ్రాహ్మణులు గూడ అధికరణకు లై యుండిరి. వారి ఎదుట అలావదీను అర్గళబద్ధుడై నిలుచుండెను.

అలావదీను చేసిన నేరములు అసంఖ్యాకములుగా నుండెను. ఒక్కొక్క దోషారోపకుడే వచ్చి ఆతడు చేసిన రాక్షస కృత్యములు తాను పడ్డ వ్యధయు

కన్నుల నీ రేకధారగా కార్చుచు గద్గద స్వరముతో తెలుపుచుండ సభ్యులకును కన్నీరు వచ్చుచుండెను. ఒకడు చెప్పినది పూర్తియైన పిమ్మట, 'నీ వా పని చేసితివా ?' అని అధికరణికులు ప్రశ్నించుచుండ, అలావదీను వినీతుడై తల వంచి చేసితి నని సంప్రతిపత్తి తెలుపుచుండెను.

ఒకరివెంట నొక దోషారోపకుడు వచ్చి అతడు చేసిన ఘాతుక కృత్యములు వర్ణించుచుండ శ్రోతల హృదయములు రోషముతో మండిపోవుచుండెను. కాని దోషారోపణ మొక్కొక్కటే ముగిసిన పిమ్మట ఆతడు జంకక వినయముతో ఒప్పుకొనుచున్న విధానము చూచిన కొలది వారికి ఆశ్చర్యముతోపాటు జాలియు కలుగుచుండెను.

'ఇత డెన్ని దోషములు చేసినను అసత్య దోషముమాత్ర మెరుగనట్లున్నాడు. ఏమి, వీని నిర్భయమగు సత్యవాక్కు !' అని అధికరణికులలో బుద్ధిమంతు లగువారు ఈ పరమ పాతకునిపై తమ యంతరంగములలో కలుగుచున్న గౌరవ భావమునకు తమలో తా మాశ్చర్యపడుచుండిరి.

జాముసేపు ఎందరెందరో వచ్చి ఆతడు చేసిన అపరాధము లుద్ఘాటించుచుండిరి. అప్పటికి దోషారోపకులు వెనుకపట్టిరి. దోషారోపకులు ఇక నుండుట నిశ్చయించి అధికరణికు లందరిపక్షమున కమలనాభామాత్యుడే అలావదీను నిట్లు ప్రశ్నించెను.

"అలావదీన్, నీవు బ్రాహ్మణకులములో జన్మించితివా?"

"మచ్చలేని సద్బ్రాహ్మణకుటుంబములో మచ్చగా జన్మించితిని."

"పేరు?"

"బసవన్న."

"నీ విన్ని మహాపాతకములు చేసితి నని ఒప్పుకొంటివి నీ వింకను చెప్పికొన దలచిన దేమైన నున్నదా?"

"ఉన్నది. ఈదోషారోపకులు నాదోషము లన్నియు పూర్తిగా చెప్పలేదు నేను చేసిన మహాపాపము లింకను గలవు."

ఆ మాటల కందరు నివ్వెరపడుచుండ నాతడిట్లు తనదోషము లుద్ఘోషించెను.

"నేను సోమయాజియు వేదవిదుడు నగు నాతండ్రిని చంపితిని. వేద విదు లగు తమ్ముల నిరువురను హత్యచేసితిని. మా తల్లినిగూడ సంహరించితిని—!"

అంతవరకు అవచిదేవయ మాటాడలేదు. ఇప్పు డాతనికి ఎక్కడలేని రోషము అసహ్యము కలిగి రోజుచు నిందితుని ముఖమైన చూచుట కిచ్చగింపక పెడమొగము పెట్టుకొని యిట్లు ప్రశ్నించెను.

"నీవు చేసిన పాపకార్యములు ఒప్పుకొనుటతో ఆగక, ఇంకను మా చెవులు వినలేకున్న మహాపాతకముల నుద్ఘోషించుచున్నావు. సిగ్గయిన లేక ఇవి మహా ఘనకార్యము లని గర్వించి పలుకుచున్నావా! ఏమి?"

ఈమారును అలావదీను వినతుడై శాంతముగా నుత్తర మిచ్చెను.

"శ్రేష్ఠి, నేను విద్వద్బ్రాహ్మణ కుటుంబములో జననము నొందితిని. నేను శ్రద్ధ చూపకపోయినను మాశాఖ యగు కృష్ణయజుర్వేదము నాకు వాచో విధేయ మైనది. పెద్దలు చెప్పెడి మాటలయందును నా కప్పుడు ప్రమాణబుద్ధి లేకున్నను, అవి నిరంతరము నాచెవుల బడుచుండెడివి. ప్రారబ్ధకర్మము ఆవిధ ముగా నాచేత పాపకార్యములు చేయించినది. తానుచేసిన పాపములకు నిస్కృతి వాంఛించువాడు వాని నుద్ఘాటింపవలె నని పెద్దలు చెప్పగా విని యుండుటచేతనే ఇక్కడ కూడిన పెద్దలయెదుట ఇప్పు డుద్ఘాటించుచున్నాను. అదిగాక ప్రభుదండము పొందిన పాతకములకు యమదండ ముండదుగదా! అంతే కాని గర్వము కాదు. ఈలోకమున్పై ఆశ లేనివానికి ఇంకను గర్వము మిగిలియుండునా?"

శ్రేష్ఠికే ఈమాటలతో నాతనిపై గౌరవభావము ఉదయించినది. సభ్యులకు జాలి అతిశయించినది.

కమలనాభామాత్యుడు. "నీవు చెప్పుకొనవలసినదై పోయినదా?"

అలావదీను : 'మహాత్ములారా, నేను చేసిన మహాపాపముల కన్నిటికి తగినట్లు కఠినశిక్ష విధించి నన్ని మహాపాతకములనుండి విముక్తుని గావింప మిమ్ము నేను వేడుచున్నాను. అంతే! పరిషత్తుకు నా నమస్కారము!'

కమలనాభామాత్యుడు : 'ఎవరైనను ఈదోషికావించిన దోషములకు దండతైక్ష్యము తగ్గించుటకు ఈతని సుగుణము లేమైన చెప్పగలరా?'

అందరును మౌనము వహించుట గమనించి మల్లారెడ్డియే లేచి యిట్లు పలికెను.

"అధికరణికులలో ఒకడ నైయున్న నేను చెప్పుట తగ వగునో కాదో ఎరుగను గాని తెలిసిన నిజము అడిగినప్పుడు చెప్పకుండుట మహాదోష మని పెద్దలు చెప్పగా విందును గనుక పలుకుచున్నాను. యుద్ధభూమిలో వెన్ను చూప నివాడు పుణ్యాత్ము డందురుగదా! నే నీతని నెదరించి యుద్ధము చేసితిని. ఒక్క క్షణకాల మైనను ఈతడు వెనుకంజ వేయక స్మృతి యున్నంతవరకు వీరోచిత ముగా పోరాడెను!"

మల్లారెడ్డి వచనములకు అలావదీనుకంటె సభ్యులు మల్లారెడ్డి ధర్మనిష్ఠనే శ్లాఘించిరి.

అధికరణికు లందరు ఆలోచించుకొనిరి. వారి కందరకు విచిత్రమైన అభిమాన మీ దోషిపై కలిగినది. ఐనను ధర్మనిర్ణయములను పాటింపక ఉల్లంఘించుటకు వారు అశక్తులు. ఏకగ్రీవముగా అలావదీనుకు వా రిట్లు దండము విధించిరి.

"ఇతనిని ఈ ధ్వజస్తంభమునకు అంటగట్టి, ఎదురుగా ఇరువదివిండ్ల దూరమున అష్టోత్తర శతసంఖ్యకు లగు నేర్పరు లైన ధానుష్కుల నిలువబెట్టి, అందరు నేకకాలమున ఈతని హృదయ భాగమును లక్ష్యముగా వేసి చెరియొక బాణము విడువవలెను! ఆ బాణప్రయోగముతో ఇతడు ప్రాణములు వదలినను జీవించినను ఇత డీవరకు చేసిన సమస్త పాపములనుండి విముక్తుడు కాగలడు! రేపు మధ్యాహ్నమే ఈ దండము నిర్వర్తింప బడవలెను!"

ఈ తీర్పు సభ్య లందర యనుమతితో ముమ్మారు కమలనాభామాత్యుడే ఉద్ఘోషించెను. సభ్యుల తీర్పు విని అలావదీను వినయముతో వంగి పరిషత్తుకు నమస్కరించి, 'ధన్యోస్మి కృతకృత్యోహ' మ్మని పలికెను.

అవచిదేవయకు హృదయములో జాలి పొంగుచుండ కొంత కరుణ చూపదలచి 'ఈ దండము నిర్వర్తించుటకు ముందు నీ కేమైన చివరి కోరిక లున్నచో తెలుపుకొన వచ్చును. సభ్య లాలోచింపగలరు' అనెను.

అలావదీను "శ్రేష్ఠీ, ఉన్నవి అవి తీర్చుటకు మీ కెవ్వరికిని అభ్యంతర ముండగూడదు. రేపు ఉదయమునసే నా ప్రాయశ్చిత్తమునకు సహాయ పడుటకు

పురోహితు నొకనిని మంగలి నొకనిని నాకు దయచేయింప నర్థింతును. రేపు పూర్ణిమ కనుక సముద్ర స్నానము చేయుటకును నా కనుజ్ఞ యిప్పింప వేడెదను."

సభ్యు లందరు నాలోచించి యాతని అభ్యర్థనములు మన్నించిరి. చెంచు దొర తోకరాజునే ఫాణుష్కుల నేరుటకు వినియోగించిరి.

* * *

అలావదీను ఆరాత్రి యంతయు తనకు కమలనాభామాత్యుడు శీఘ్రముగా శుభము రాబోవు చున్నదని చెప్పిన జోస్యము మీదనే మనస్సు నిలిపి ఆలోచింప దొడగెను. తనవలె పాపములు చేసిన వానికి ప్రభుదండముచే ప్రాణవిమోక్షముకంటె శుభ మే ముండును! ఇట్లనుకొనుచు ఆతడు తా నీజన్మ మెత్తిన దాదిగా చేసిన సత్కార్యములను దుష్కార్యములను లెక్కచేయ దొడగెను. ఆతడు చేసిన సత్కార్యములే యెక్కువ. ఎంతటి దుర్మార్గుని విషయమున నైన నంతే సత్కార్యము చేయుట ప్రకృతి సిద్ధము. దుష్కార్య కరణము స్వభావ విరుద్ధము. ఐనను విపరీత కార్యములందే మానవుల స్మృతులు గాఢముగా లగ్నము లగును. అందుచే నాతనికిని తక్కువ సంఖ్య గల దుష్కృత్యములే మాటిమాటికి తలపున బారుచు సత్కార్యముల నన్నిటి నాచ్ఛాదింప సాగెను.

ఆ పిమ్మట నాతడు తన సుగుణములను అవగుణములను గూర్చి ఆలోచన మొదలుపెట్టెను. అవగుణములే ఎక్కువ భాసించుచున్నవి. ఐనను తాను తుదివరకు మల్లారెడ్డి ప్రకటించినట్లు వీరోచితముగా పోరాడితి ననియు, స్వామిద్రోహము తలపెట్టలేదనియు తలచుకొని తృప్తిపడెను. మరియు తన కెన్ని అవగుణము లున్నను తాను సత్యమే కాని అసత్య మాడియుండలే దని తృప్తికలుగ మొదలుపెట్టెను.

తరువాత నాతడు తాను లోకములో నెవరియెడ నైనను నిష్కల్మష మైన ప్రేమ చూపితినా అను ఆలోచనలో పడెను. వెంటనే చెల్లెలు మహాలక్ష్మి భాసించినది. అది కేవలము మహాలక్ష్మియే దానియందు పుట్టిన దాది ఇంతవరకు మనస్సులో కాని వాక్కులోగాని చేతలోగాని ఎట్టి కాఠిన్యము తాను తలపెట్టి యుండ లేదని ఆతనికి తోచినది. తాను తండ్రిపై కోపించెను. తమ్ముల రామ లక్ష్మణులను ద్వేషించెను. తల్లిని విసిగించెను. బావపైగూడ ఎప్పుడో కోపిం

చెను. కాని తాను చెల్లెలిపై నిరంతరాయముగా వాత్సల్యమే పరపియుండెను, అది వాత్సల్యమా, భక్తియా? .ఏమియో అతనికే అర్థము కాలేదు ఏమైనను చెల్లెలిని తలచుకొన్న కొలది ఆతని హృదయములో అమృతస్రావ మై ఆనంద ముప్పొంగ నారంభించెను. ఒక్క వ్యక్తిని నిష్కల్మషమైన ప్రేమతో భావించి నది తలచుకొన్నంతనే, ఆతని హృదయములో స్వర్గసుఖతుల్య మగు ఆనం దము కలుగుచున్నదే! మరి ఈ లోకములోని మానవుల నందరను ప్రాణికోటి నందరిని అట్టి ప్రేమతో చూడగల పుణ్యాత్ముల ఆనందాతిశయ మెంతగా నుం డునోగదా, అని ఆతనికి మాటిమాటికి ఊహ ఉప్పతిల్లుచుండ, మహాలక్ష్మినే ప్రేమాతిశయముతో ధ్యానింపసాగెను. దానిని భావించినకొలది పావనభాగీరథీ ప్రవాహము ఆతని హృదయములో వాకలు కట్టుచు తన పాపపంకము నంతటిని క్షాళనము చేయుచున్నట్లు ఆతనికి తోచెను. ఆ ఆలోచన తోడనే ఆత డా రాత్రి యంతయు గడపెను. అంతగా మహాలక్ష్మిని భావించుచున్నను ఆమెను చూడవలె నను కోరిక యాతనికి కలుగలేదు. ఈ పాపిష్టి స్థితిలో చెల్లెలి కంటబడ నాత డిచ్చగింపలేదు.

ప్రాతఃకాలమున లేచునప్పటికి వేదవిదుడగు పురోహితుడును మంగలియు సిద్ధముగా నుండిరి. ఆ పురోహితుని సాహాయ్యముతో తాత్కాలిక యజ్ఞోపవీత మాతడు ధరించి సమంత్రకముగా ప్రాయశ్చిత్తాంగ మగు ఆయుష్కర్మ చేయిం చుకొనెను. ఇప్పు డాతని గెడ్డములు మీసములు పోయినవి, శిరస్సు ముండనము చేయించుకొనగా అదృష్టవశమున ముడిపడునట్లు శిఖయు నేర్పడినది. అంతట మృత్తికాస్నానమును అఘమర్షణస్నానమును గావించి పంచగవ్యప్రాశన మొనర్చి విధివిధానమున యజ్ఞోపవీతము ధరించి సంధ్యావందనాదిక మొనర్చి యథాశాస్త్రీయముగా సముద్రస్నానము నిర్వర్తించెను. ఆతనికి సింధుస్నానాంగ ముగా దానము చేయవలె నని బుద్ధి పుట్టినది. తన కేమున్నది? తన మందిర ములో విలువగల వస్తువు లెన్నో ఉన్నవి. అవి తాను దానము చేయవచ్చునా? మల్లారెడ్డికి తన సందేహము వార్తాహరుని మూలమున తెలియజేయగా నాతని మందిరములోని వస్తువులు తన యిచ్చవచ్చినట్లు వినియోగింప వచ్చు నని అనుజ్ఞ వచ్చినది. అతడు వెంటనే యందు గల తన శయ్యాసనములు, నిత్యావ సర పాత్రాదులు, నిలువయున్న ధనము - సమస్తము భక్తిపూర్వకముగా నా పురోహితునికి బ్రహ్మార్పణముగా దాన మొనర్చెను.

అంతటితో నాతనికి హృదయభార మంతయు తీరిన ట్లయ్యెను. ఆత డంతట సావిత్రీ మంత్రము హృదయములో దృఢముగా అనుసంధింప జేసి కొని, తన చెల్లెలిని మహాలక్ష్మిని తద్దేవతా రూపముతో ధ్యానించుచు నిర్భయ ముగా మధ్యాహ్న వేళకై నిరీక్షించు చుండెను.

నిర్ణీత కాలమునకు మూడు గడియలు ముందుగా నాతని ధ్వజస్తంభము నొద్దకు భటులు తెచ్చిరి. నూటఎనిమిదిమంది చెంచులు నిలుపవలసిన స్థాన ములు రేఖలతో గుర్తింపబడినవి. చెంచులును దండము నిర్వర్తించుటకు తమ ధనుస్సు వెక్కు-పెట్టి ధనుష్టంకారము లొనర్చుచు బాణసంధానమునకు సిద్ధముగా నుండిరి.

అలావదీను దండ నిర్వహణము చూచుటకు పలువు రధికరణికులే కాక మోటుపల్లి పట్టుకొనిన వీరులును పురనివాసులును చుట్టుప్రక్కలనుండి గ్రామీ ణులును తండోప తండములుగా ధ్వజస్తంభమున కెదురుగా నున్న విశాల ప్రదే శమునకు చేరుకొనిరి.

ఇప్పుడు దండన మనుభవింప నిలిచియున్న అలావదీను వేషము చూడ వారి కందరకు నాశ్చర్య మైనది. ఆతడు కట్టిన ఎర్రని వస్త్రముల కాంతి పసి నిమ్మపండువంటి ఆతని శరీర చ్ఛాయలో ప్రతిఫలించుచు అపూర్వశోభ చేకూర్చు చుండెను, ఈతడు అలావదీను? ఇప్పుడు చూడగా నితడు బ్రాహ్మణుడుగా కన బడుచున్నాడే! ఆతని వర్చస్సు కప్పువడియున్నను, మేఘము చాటుననుండి సూర్య తేజస్సువలెనే బాసించుచున్నది.

దండసమయ మాసన్న మగుచున్నది. ఆతని నిర్భయత చూడగా ఇన్ని దుష్కార్యము లొనర్చిన అలావదీనేనా ఇతడు. అని అందరకు నాశ్చర్యముగా నున్నది. వారిలో నొకడు, ఇతడు పూర్వము బసవన్న యను బ్రాహ్మణుడట, అని అందిచ్చెను. ఆమాట జన మందుకొని అప్పటినుండి అలావదీను నామ ముచ్చరింపక బసవన్న యనియే ఆతని నిర్దేశింప దొడగిరి.

ఈ బసవన్న సోమయాజులుగారి కుమారుడట! వేదము క్రమాంతము అధ్యయన మొనర్చెనట, ఇతని బంధువు లందరు మల్లప్రభువుకు వేమప్రభువుకు సహాయము చేయుచున్నారట. పాపము, వీనికి ఏదో ప్రారబ్ధకర్మ వశాత్తుగా దుస్సహవాసము ప్రాప్తించి సహవాసి దోషముచే దుర్బుద్ధులు పుట్టినవి కాని ఈ

వేషము చూడగా వీని కుటుంబములోని పెద్దలు చేసిన తపఃఫలము పుణ్యఫలము ఇప్పు డుద్బుద్ధమై వీని పాపకర్దమము క్షాళనము చేయుచున్నట్లున్నవి. పాప మెన్నడు ఎరుగనివానివలె ఎంత ధైర్యముగా నిలుచున్నాడు! - అత్యుత్కట మైన పాపమే కొందరికి ఉత్తమ మార్గమునకు దారితీసి జ్ఞానులగా చేయు నందురు. ప్రారబ్ధము పాపము చేయించునట్లే పుణ్యమార్గమునకు మాత్రము వీల దారి చూపరాదు! - ఈవిధముగా పరిపరి విధముల జనము లాతని గూర్చి భాషించుచుండిరి. కాని ఆ చిత్రమేమోగాని అందులో నొక్కరును ఆతనిగూర్చి కఠినవాక్కు లాడెడివారు వేరైరి.

రెండు గడియల వ్యవధాన మున్నది. నూట యెనిమిది మంది చెంచు లును వా రుండవలసిన స్థానములలో నిలువబెట్టబడిరి, ధ్వజస్తంభమునకు సరిగా ఇరువది విండ్ల దూరమున చవితి చంద్రరేఖ యాకారమున వారందరు నిలిచి యున్నారు. వారు రంగురంగుల గోచులు ధరించిరి. చేతులను చెవులను పెద్ద కడియములు ఆభరణములుగా నలంకరించుకొనిరి. వారి కందరకు కొంచెము దూరముగా కుడిప్రక్కను చెంచుదొర తోకరాజు చేత నొక జేగంటపూని నిలిచియుండెను. ఆతడు చెంచుల కీ ట్లాజ్ఞాపించెను.

"నేను మొదటిగంట మ్రోగించి నంతనే మీరు బాణములు ప్రయోగిం చుటకు సిద్ధముగా మీస్థానములలో ముందుకు ఎడమకాలు వెనుకకు కుడికాలు వేసి నిలుచుండవలెను. రెండవగంటకు బాణములు నారిలోపోసి లాగి ఆ దోషి ఎదురురొమ్ముకు సరిగా గురిచూచి ఉండవలెను. మూడవగంటకు మీ బాణ ములు ఒక్కపెట్టున వదలవలెను. తెలిసినదా, జాగ్రత్త!"

తోకరాజు నాజ్ఞ లాలకించి నూట యెనిమిదిమంది చెంచులును, 'బుద్ధి దొరా, బుద్ధి దొరా, బుద్ధి దొరా,' అని హుంకరించిరి.

తోకరాజు సమీపముననే గడియారములోని యిసుకరేణువులు క్రిందికి జారుచు కాలము చూపుచున్నవి.

ధ్వజస్తంభమునొద్ద నిలుచున్న బసవన్నకు వారి నందరను చూచుట వేడుకగా నున్నది. తోకరాజును చూడచూడ వానికి తనపాపము లన్నియు భస్మము చేయుటకు భిల్లరూపమున నవతరించి పార్వతీశ్వరు డనిపించుచుం డెను తక్కిన చెంచులు ప్రమథగణము లనిపించిరి. కళ్యాణవేళకై నిరీక్షించు

చున్న వరుని వలెనే బసవన్న సర్వాంగములు ఆనందముతో వెల్లివిరియుచుండ పులకరించుచుండెను. ఆతని జూచుచున్న ప్రేక్షకుల కందరకును రోమాంచము కలుగుచున్నది.

గడియ వ్యవధాన మున్నది. ధ్వజస్తంభమున కానుకొని నిలిచియున్న బసవన్నను దాని కిప్పుడు తోకరాజు పాశములతో దృఢముగా బంధించెను. ఒక పాశము భుజములకు కొంచెము దిగువగా తిరిగినది రెండవ పాశము మోచేతుల కించుక ఎగువను తిరిగినది. ఆరెండు పాశములును చెంచుల కాతని వక్షస్థలమును లక్ష్యముగా గుర్తు చేయుచుండెను. తక్కిన పాశములు ఆతని చేతులకు కొంచెము పైగా నొకటియు, తొడలపైనుండి యొకటియు, పాదము లపై నొకటియు తిరిగినవి. బాణప్రయోగము చేయునప్పు డాతడు కదలకుండు టకే అవి యుద్దేశింపబడినవి. కాని నిశ్చలుడై నిలుచుండి యుండిన ఆతని నా పాశములతో కట్టివేయ వలసిన అవసర మున్నట్లే తోచుటలేదు.

తోకరాజు తన్ను స్తంభమున కంటగట్టు చుండగా బసవన్నకు చిత్రమైన ఆలోచన ముదయించెను. ఇప్పుడు మరణ దండనము నిర్వర్తింప నున్నది తన కేనా అనిపించినది. కాదు తన్నావహించిన పాప పురుషునకు! ఆ పాప పురు షుని శోషింప జేయవలెను, దహింపజేయ వలెను. వెడల గొట్టవలెను. తన్ను గాక ఎవరో పాపిని బంధించి మరణ దండనము వేయుచుండిరని తోచి వేడు కగా నాతడా కార్యక్రమము తిలకింప సాగెను.

బంధములతో చిక్కి నిలుచున్న బసవన్నను చూచుచున్న చెంచుదొర కిప్పు డాకస్మికముగా నాతనిలో చెంచులక్ష్మి ఆకారము భాసించినది. పురుష వేషము ధరింప జేసినచో చెంచులక్ష్మి సరిగా నిట్లే యుండునని ఆతని కిప్పుడు తోచినది, అందుపై నాతడు చిత్రమైన ఆవేశముతో బసవన్న వంక తిలకిం చెను. బసవన్న నుదురు చెంచులక్ష్మి నుదురే. ఆతని కన్ను లామె కన్నులే. అతని ముక్కు, అతని చెవులు, అతని నోరు అతని మెడ, అతని పాదములు, అతని ఛాయ - సర్వము అచ్చముగా చెంచులక్ష్మి పోలికే! అతని హృదయ కోశములో ఇప్పుడు చెల్లెలి పవిత్ర రూపము ప్రేమూర్తియై అధిష్ఠించి యుండు టచేత నేమోగాని ఆతని ముఖము కర్కశత్వ మేమియు లేక కుసుమకోమల మై చంద్రకాంతి కాంతమై ప్రకాశించుచున్నది.

ఒక్క క్షణకాలము తోకరాజుకు సందేహముతో వెనుబాటు కలిగినది. మరల నతడు మనస్సు దిటవు చేసికొని తన స్థానమునకు పోయి నిలుచుండి చెంచు లందరు నిర్ణీత స్థానములలో నిలుచుండిరో లేదో సరిచూచెను. వా రం దరు సరిగా నిలుచుండిరి. కాని వారికిని ఆవల బసవన్నలో చెంచులక్ష్మి భాసించి నది. నల్లగా కారుచీకట్లవలె నున్న వారి కాయములతో భక్తిభావ మావేశించి దివ్యకాంతి తేజరిల్ల జేయుచున్న దని తోకరాజుకు కనిపించినది.

తోకరాజు వెంటనే మొదటి గంట మ్రోగించినాడు. చెంచు లందరు నొక్కుమ్మడి ప్రకృతి నొంది ప్రత్యూఢపాదులై ధనుస్సులు ముందుకు చాచి బాణములతో సిద్ధముగా నుండిరి.

పావుగడియ వ్యవధాన మున్నది. తోకరాజు రెండవ గంట మ్రోగించి నాడు వెంటనే చెంచు లందరు తమతమ ధనుస్సులలో బాణములు సంధించి ఆ కర్ణాంతము లాగి బసవన్న రొమ్ముకు గురిపెట్టి నిశ్చల బాహూహస్తములతో లక్ష్యైక దృష్టులై ప్రయోగమునకు సిద్ధముగా నుండిరి.

అంత జనసమూహ మక్కడ కూడియున్నను చీమ చిటుకన్న వి పించునంత నిశ్శబ్దముగా నున్నది. ఎప్పుడు మూడవగంట వినబడునో, ఎప్పుడు బాణములు వదలబడునో, ఎప్పుడు బసవన్న రొమ్ము జర్జరితమై రక్తములు గ్రక్కునో అని ఆవేగముతో నందరునిరీక్షించుచుండిరి. ఆ దృశ్యము తాము చూడలే మనుకొనుచునే, చిత్రముగా నాకృష్టులై ఆ వంకకే అనిమేషదృష్టులతో తిలకించు చున్నారు.

బసవన్నయో? ఆతడు కన్నులుగూడ మూయ లేదు. ఆతని యంగము లలో ఎక్కడ నెంతమాత్రము చలనములేదు. ఆతడు స్మృతి తప్పియున్నాడా? రానున్న మహాపద తలచుకొన్నంతనే ధీరులైన వారే నిశ్చేష్టు లగుదురు; వారిని మైక మావేశించును. కాని బసవన్న సర్వాంగములు మోక్షకాంత ఆలిం గనము నిరీక్షించుచున్న మహాయోగి అంగములవలెనే ఆనందాతిశయముతో పొంగుచున్నవి. ఆతని నేత్రము లర్ధనిమీలితములై నాసాగ్రభాగమున నిలిచి యున్నవి.

ఆ యారునిముషముల వ్యవధియు ప్రేక్షకులు భరింపలేక దడదడ లాడు చున్న గుండెలతో నిముషమొక యుగముగా గడుపుచుండిరి.

* * *

మల్లారెడ్డియు కమలనాభామాత్యుడును అక్కడికి రాలేదు. దుర్గము స్వాధీనమై మూడవరోజు ప్రవేశించినను ఎర్రయ జాడ వారికి తెలియలేదు. మల్లారెడ్డికి మోటుపల్లి విజయ మచే నెంతమాత్రము సంతోషము లేకున్నది. తన మిత్రుని జీవిత మర్పించి సంపాదించిన మోటుపల్లి విజయమే కాదు, జగద్విజయ మైనను అతని కేమియు సంతోషము కలిగింపనేరదు. ఆత డిప్పుడు ఆర్తుడై దుర్గము మూలమూల లన్నియు గాలింప జేయుచున్నాడు. ఎక్కడ క్రొత్తశవము కనిపించినను దానిని గుర్తించుటకు ఎర్రయను బాగుగా నెరిగిన వారిని బంపియో తానే స్వయముగా నేగియో ఎర్రయ దేహము కాదని తేల్చుకొనుచుండెను.

క్రిందటి రెండు రాత్రులును మల్లారెడ్డికి నిద్దుర లేదు. అతనికి వర్ణింప రాని ఆరాటము కలుగుచున్నది. ఎర్రయను అతని మాటలను తలచుకొని తలచుకొని ఆత డేకాంతమున వెక్కివెక్కి యేడ్చుచుండెను. మధ్యమధ్య తనలో తాను, ఎర్రయ్యా, ఎర్రయ్యా, అని సంబోధించుచు పరిపరి విధముల విలపించుచుండెను. శ్రీకృష్ణుని నియోగమునకై ఆక్రందించిన పార్థుని వాక్యములే ఆతనికి మాటిమాటికి గుర్తుకు వచ్చుచుండెను.

ఈనా డుదయము నుండియు అతనికి వెర్రి యెత్తినట్లే యున్నది ఆతడు కమలనాభామాత్యునితో గలసి స్వయముగా దుర్గాధిపతి నివాస స్థానమును ఆపరిసరములను ఎర్రయ కై గాలించుచుండెను. ఎక్కడ నే వస్తువు శవమను భ్రాంతి కలిగించినను, కొట్టుకొనుచున్న గుండెలతో అత డది పరీక్షించుచు కాదని తెలిసికొని తృప్తిపడి నిట్టూర్పు విడుచు చుండెను.

జాము ప్రొద్దెక్కినది. ఎర్రయ జాడ కనబడలేదు. కాని అంతవరకు తాము వెదుకని ప్రదేశ మొకటి అక్కడనే నిగూఢముగా నున్నట్లు వారి కప్పుడు తోచినది. దాని ద్వారము కనుగొను నప్పటికి మూడు గడియలు పట్టినది. ఆ ప్రదేశములో ఎన్నెన్నియో గదులు రహస్య ద్వారములు నున్నవి. ఆశతో మల్లారెడ్డియు కమలనాభామాత్యుడును ఒక్కొక్క గదియే పరీక్షించు చుండిరి. ఆవల చెంచుదొర మొదటిగంట మ్రోగించినది చెవులలో గింగురుమని మ్రోసినది. బసవన్న ఎర్రయ బావమరది యని వా రెరుగుదురు. ఆ ఘంటానాద మాతని మరణదండనమునకు పూర్వరంగమని కూడ వా రెరుగుదురు.

తాడితఘంటా తరంగములు వారి చెవులలో ఉపశమించిన సమయము ననే అక్కడికి చిన్నయ్య తన కుక్కతో వచ్చి ఎవరికొరకై వెదకుచున్నా రని మల్లారెడ్డి నడిగెను. ఎర్రయకొర కని విన్నంతనే చిన్నయ్య తనకుక్కను పిలిచి, కాటా, కాటా, ఎర్రయబాబు ఎక్కడ నున్నాడో చూపు! ఎర్రయ్య బాబును చూపు!' అనుచు దువ్వి వదలినాడు.

కాటడు నేల నలడల వాసన చూచిచూచి సూటిగా నొకచోటికి పోయి వా రంతవరకు చూడకున్న ద్వారముక్రింద ముట్టె పెట్టి నిర్దేశింపసాగెను. బయట వేసియున్న గడియ తీయగా లోపల విశాలమైన వసారాతో చక్కని గదియు దానిముందు చిన్న పూలతోటయు మధ్యలో నొక నూయియు దాని సమీపమునసే ఒక పొదరిల్లును కనిపించినవి. కాటడు ఆ గది యంతయు మూచూచు సంతోషముతో తల యాడించుచు సంచరించి తోటవకకు తిరిగి అచే చూచుచు భయపడుచున్నట్లు నిలిచిపోయెను. చిన్నయ్యయు దానితో నచ్చటనే నిలిచి పోయెను.

గది శూన్యముగా నున్నది. వసారాయందును ఎవరు లేరు. కాని అక్కడ నెవరో ఇంతవరకు నివసించుచున్న లక్షణములు కనిపించినవి. ఉపవన మంతయు వెదకిరి. వారి కెవరును కనిపింప లేదు.

పొదరింటిలోనుండి గంటము గలగల లాడుచున్న శబ్దము వినివచ్చినది. మల్లారెడ్డి హృదయములో అమృతతరంగము పొంగి పొర్లి పొడిచినది. అది సాక్షాత్తుగా ఎర్రయ గంటము చప్పుడే యని మల్లారెడ్డికి తెలిసినది. ప్రేమతో కూడిన చిరపరిచయముచే నాతనికి ఎర్రయ కంఠధ్వనివలెనే ఆతని గంటము గలగలలోని విశిష్టతయు తెలియును. ఒక్కపరుగున మల్లారెడ్డి యా పొదరిం టిలో ప్రవేశించెను. అప్పుడే వ్రాత యాపి ఆలోచించుచున్న ఎర్రయ కనిపిం చెను.

మల్లారెడ్డి అమాంతముగా ఎర్రయను కౌగిలించుకొని ఆనందబాష్పము లతో నాతని శిరస్సు తడిపివేసెను. అంతట నాతని పాదములు రెండును పట్టు కొని కన్నుల కద్దుకొనెను. మరల లేచి కౌగిలించుకొని ఎర్రయ శిరస్సును ముద్దాడెను. ఎర్రయయు ఆనందపారవశ్యముతో మల్లారెడ్డిని కౌగిలించుకొని ప్రక్కనే కూర్చుండబెట్టు కొనెను.

"మల్లయ్యా! మల్లయ్యా! ఈ దుర్గము పట్టుకొంటివి గదా! సరిగా ఎంత మంచి వేళకు నాకు ప్రత్యక్షమైనావు! ఈ పద్యములు విను. ఇప్పుడే పూర్తి చేసినాను. నీవు విన్ననేగాని నా రచన నాకు తృప్తి కలిగింపదు."

ఇంతలో ఆవల చెంచుదొర మ్రోగించిన రెండవ గంట వినబడినది. ఆ గంట మల్లారెడ్డి హృదయములో శూలఘాతమువలె ప్రతిధ్వనించినది. ఆత డొక్కమారుగా ఉలికిపడెను. మరల బలవంతముగా నతడు ప్రకృతి నొంది ఎర్రయ పద్యములు వినుచుండెను.

"భవరోగంబుల కౌషధంబు భవపాపజ్వాలకున్ వైరి దు
ర్భవపంక ప్రవిశోధనంబు భవభావస్ఫార తృష్ణాహరం
బవిరోధం బకలంక మక్షయరసోదాత్తంబు భక్తప్రియో
త్సవ మెందున్ భవనాశినీజలము నిత్యస్తుత్య మిమ్మేదినిన్.

"భవనాశిని భవనాశిని
భవనాశిని యనుచుఁ బలుకు భక్తజనులకున్
భవనాశిని భవనాశిని
యవుటకు భువియందు సందియంబును గలదే!"

కమలనాభామాత్యుడు వారి అనురాగ సంభాషణమునకు విఘ్నము కలి గించు నిచ్ఛ లేక లోపలికి రాక పొదరింటి వాకిటనే యుండి వారి మాటలను ఆ పద్యములను ఆలకించుచుండెను.

చెంచుదొర మ్రోగించిన మూడవగంట వినిపించినది. మల్లారెడ్డి ఉలిక్కి పడి లేచి ఎర్రయను కౌగిలించికొని కన్నీరు విడుచుచు గద్గద స్వరముతో నిట్లనెను.

"ఎర్రయ్యా, ధర్మవిధి ఎంత కఠిన మైనను నిర్వహింప బడినది. ఆ గంట మీ బావమరదిపై నూటయెనిమిదిమంది చెంచు ధానుష్కులు ఒక్కమ్మ డిగా బాణములు వదలుటకు సంజ్ఞ భవనాశినీ స్మరణము అతనిని మరణము నుండి రక్షించుగాక! - నా కా ఆశ లేదు!"

ఎర్రయ ఒక్క క్షణకాల మాలోచించి ఇట్లనెను: "చివరిసారి నా కాతడు కనిపించినపుడు సరిగా నృసింహావతారా విర్భావము అప్పుడె వర్ణించిన ఆనం

దాతి శయముతో నుంటిని. ఏమైనను నీకు తప్పక పరమ శుభము రానున్నది. యుద్ధములో వెనుకాడని వారికి శుభమే కలుగును. పోయిరా' అంటిని. ఆతడు ప్రభుదండముచే దేహము విడిచినను విడువకున్నను పునీతుడే కాగలడు. ఆతడు రణరంగములో వెనుకాడ లేదుగదా! పాపమోక్షణము కంటె శుభకరమైన దేమున్నది, మల్లయ్యా!"

"బసవన్నకు దీర్ఘాయుర్దాయ మున్నది. నూరు కాదు, వేయి బాణములు వేసినను ఆతడు మృతి నొందడు. శీఘ్రమే తండ్రిచే మహాగ్ని చయనము చేయించి అవబృధ స్నానముచే పూతతరు డగు పుణ్యయోగము ఆతని జాతక ములో స్పష్టముగా నున్నది. ఆతని జీవితము విషయమున ఎవరికి ఎట్టి బెంగయు నుండ సపసరము లేదు!" అనుచు సరిగా నప్పుడు కమలనాభామా త్యుడు పొదరింట ప్రవేశించెను.

తా నక్కడ సుఖముగా ఇన్నినాళ్లను శ్రీ లక్ష్మీనృసింహావతార గ్రంథ రచనముతో కాలక్షేప మొనర్చినది ఎర్రయ డెప్పుచుండ వారందరు నక్కడ నుండి కదలి ధ్వజస్తంభము నొద్దకు బయలుదేరిరి. చిన్నయ్యయు కానితో వారిని అనుగమించెను.

ఆ ధ్వజస్తంభము దిక్కునుండి చిత్రముగా వారికి జనసమూహ మొన ర్చుచున్న జయజయ నినాదములు వినవచ్చినవి. దోషిని దండవిధానమున వధిం చిన ప్పుడు జన మట్టి జయనినాదము లొనర్పదు. బసవన్న బ్రదికి యుండవలె నని తోచుచుండ హృదయములో లేని యాశతో మల్లారెడ్డి నడచుచుండెను.

* * * *

బసవన్నకు అధికరణికులు విధించిన దండమును అది నిర్వర్తించు సమ యమును ఆ ఉదయము దారిలోననే బొల్లనకు తెలియ వచ్చినవి. ఆతడు నిప్పు లపై నడుగు వేయుచు శివ మెత్తిన వానివలె కాళ్ళు నిలువకుండ బావమరదిని తొందరపెట్టుచు, ముందుకు పోవుచు వెనుకకు వచ్చుచు, బండి యెడ్ల నదలింపు మని చిన్నయ్యను తొందర చేయుచు వచ్చుచుండెను. సోమయాజి కాళ్లు చచ్చు పడి నట్లై అడుగు పెట్టలేక బండి నెక్కెను. రామలక్ష్మణులును నిస్సారులై కదలుచుండిరి. పోలమ్మ తన పెద్దకుమారుని అవస్థ తలచుకొని తలచుకొని విల పించుచుండెను. మహాలక్ష్మి తన పెద్దన్నకు తనపై గల అపార వాత్సల్యము

నిరంతరాయముగా భావన చేయుచు నాతని ప్రాణములతో నుంచి పవిత్రుని గావింప శ్రీశైల మల్లికార్జునకు మ్రొక్కుకొను చుండెను.

ఎట్లో వారు మోటుపల్లి సమీపించిరి. దుర్గద్వారములో ప్రవేశించుచుండగా వారికి చెంచుదొర మ్రోగించిన మొదటి గంట వినిపించినది. చిన్నయ్య ఎడ్ల పగ్గములు లక్ష్మణున కందిచ్చి బండి దూకి తన కాటనితో పట్టణములోనికి పరువెత్తెను.

ప్రథమఘంటానాదము వినబడినంతనే బొల్లనకు శుభశకునమను నానందముతో పాటు కలవరపాటును కలిగినది. వెంటనే ఆతడు ప్రయాణమంత్రములు పఠించుచు దుర్గప్రవేశ మొనర్చెను.

"య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వమంగలా
తయో స్సంస్మరణా త్పుంసాం సర్వతో జయమంగలమ్.

లాభ స్తేషాం జయ స్తేషాం కుత స్తేషాం పరాభవ:
ఏషా మిందీవరశ్యామో హృదయస్థో జనార్దన:.

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమా మ్యహమ్.

యత్ర యోగీశ్వర: కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర:
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ.

సర్వమంగల మాంగల్యే శివే సర్వార్థసాధికే
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తు తే!"

వారు మూడు వీదులు దాటునప్పటికి చెంచుదొర రెండవ గంట విన్న వచ్చినది.

వీదు లొక్కొక్కటియే దాటుచు ధ్వజస్తంభము దిక్కుగా వారు పోవుచుండిరి. ఇంతలో మూడవగంట వినిపించినది. కొంతసేపు కోట యంతయు నిర్మానుష్యమైనట్లు నిశ్శబ్దముగా నున్నది. మరి కొంతసేపటికి జయజయ ధ్వానములు మిన్ను ముట్టుచున్నవి.

వారు ధ్వజస్తంభమును సమీపించుచుండగా అక్కడనుండి మహాజనము విచ్చిపోవుచు చేయుచున్న కోలాహలము వినిపించినది.

"ఆహా! బసవన్న బ్రదికినాడు! బ్రదికినాడు!- వాని తల్లిదండ్రుల అదృష్టవిశేషమెట్టిదో! వాని పూర్వజన్మపుణ్య మెంతటిదో! నూటఎనిమిది మంది చెంచు లొక్కసారిగా వదలిన బాణములలో ఒక్కటి కూడ ఆతనికి తగుల లేదు- ఏమి మంత్రమును పఠించెనో! ఏ దేవతలు అడ్డుపడిరో! అతనిది వజ్రకాయమా! రొమ్ముకు వజ్రకాయము రాచుకొనెనా! ధ్వజస్తంభముమీదనున్న బసవశంకురుడే కాపాడినాడు! బసవన్న బ్రతికినాడు! బ్రతికినాడు!

బసవన్న బ్రదికినా డని స్పష్టముగా చెవుల వినబడినంతనే బొల్లన ఆకస్మికముగా ఆనంద పారవశ్యముతో వీధిలో కూలబడి పోయెను. బండిలోని వా రందరు ఎక్కడివా రక్కడ నిశ్చేష్టులై బొల్లనను సమీపించుటకుగూడ శక్తులు కాకుండిరి. తండ్రి అగ్నిహోత్రపు కావడిని తెచ్చుచున్న రాముడు నడువ లేక భూమిపై జలము ప్రోక్షించి కావడి దింపి కూరుచుండెను.

మహాలక్ష్మి నిబ్బరము తెచ్చుకొని బండి దిగివచ్చి మామ పాదములు సంవాహన మొనర్పసాగెను. అంతలో పోలమయు దిగి వెంట తెచ్చిన జలము అన్న ముఖమున చిలకరించు చుండెను. సోమయాజియు రామలక్ష్మణులును శైత్యోపచారము లారంభించిరి.

సరిగా నప్పు డక్కడికి మల్లారెడ్డియు ఎర్రయయు కమలనాభామాత్యు డును చిన్నయ్యతోసహా ధ్వజస్తంభము దగ్గరకు పోవుచు వచ్చిరి. వారికిని బస వన్న బ్రతికినా డని తెలిసినది.

*　　*　　*　　*

తోకరాజు మూడవగంట మ్రోయించి నంతనే నూట యెనిమిదిమంది చెంచులును ఏకకాలమున తమ ధనుస్సులనుండి బాణమోచన మొనర్చిరి. అన్ని బాణములును అన్ని పిట్టలవలె రివ్వున బసవన్న వక్షస్థలము చేరినవి. సరిగా అప్పుడు పిట్టలు పోరాడుచున్నప్పుడు వలె కలకల మొకటి ఆ బాణములలో కలి గినది. ఒకదాని కొకటి తగిలి బాణములలో ఒక్కటియు బసవన్న రొమ్మున గ్రుచ్చుకొన లేదు. వానిలో ఎక్కువ భాగము ప్రక్కగా రాచుకొని పోవుచు గాయపరచినవి. అందుండి ఓడిన రక్తముతో అతడు కట్టిన ఎర్రని పుట్టములు మరింత ఎర్ర నైనవి. బాణముల తాకిడికి బసవన్న స్మృతి తప్పి కట్టిన త్రాళ్ళపై నొరగెను.

వెంటనే పరహిత వైద్యులు ఆతని శయ్యపై చేర్చి నాడి పరీక్షించి జీవించి యున్నాడని ప్రకటించిరి. వా రాతని గాయములును దెబ్బలును పరిశీలించి ప్రాణాపాయము లేదనియు ప్రకటించిరి.

అప్పుడు జన సమూహములు జయ జయ నినాదము లొనర్చెను.

62

బొల్లన శీఘ్రముగనే స్వస్థుడయ్యెను కమలనాభామాత్యుని సూచన నంగీకరించి మల్లారెడ్డి వారి నందరను కమలనాభామాత్యుని నివాసమునకు చేర్చుట కేర్పాట్లు చేయుచుండెను.

తోకరాజు తన కప్పగించిన దండవిధి నిర్వర్తించితి నని నివేదించుటకు ఇద్ద రనుచరులతో మల్లారెడ్డి వద్దకు వెళ్లుచు దారిలో నక్కడ చూచి జరిగిన దంతయు విన్నవించెను.

సరిగా అప్పుడే సమీపమున బండిలోనికి చేరియున్న మహాలక్ష్మిని చెంచు దొర అనుచరులగు చెంచులు చూచి వెంటనే గుర్తించి బండిముందు సాష్టాంగ పడి, "దణ్ణాలు చెంచులక్ష్మీ! దణ్ణాలు!' అనుచు నమస్కరించి లేచి తోకరాజును సమీపించి, 'మన కొండదేవత బండిలో ఉన్నది; దణ్ణముపెట్టు దొరా!' అనిరి. చెంచుదొర మల్లారెడ్డికడ సెలవుకూడ తీసికొనకయే ఒక్కగంతులో బండి వద్దకు వెళ్ళి మహాలక్ష్మికి ముమ్మారు నేలపై సాష్టాంగపడి దణ్ణములు పెట్టెను.

ఈ వార్త అప్పటికే చెంచులలో ప్రాకిపోవుటచే ఆయుద్ధములో పాల్గొనిన చెంచులు మూలమూలల నున్నవారందరు కూడ అక్కడికి చేరుకొనుచుండిరి. ఆ చెంచుమూక రాకతో బండి కదలుటకు వీలులేక పోయినది.

తోకరాజు మల్లారెడ్డికి మ్రొక్కి 'దొరా! మా చెంచులక్ష్మిని మాకు దయ చేయించవలె!' అని ప్రార్థించెను. ఏమి చెప్పవలెనో మల్లారెడ్డికి తోచలేదు.

ఈ సందడి విని విస్సన అక్కడికి వచ్చి సంగతి సందర్భములు విచారించెను. ఐదారు వందలమంది చెంచులు జయజయధ్వనులతో మహాలక్ష్మికి మ్రొక్కిలిడుచు ఆమె యున్నబండిని ఎద్దులతో సహా భుజములపై పెట్టుకొని

మోసికొనిపోవుటకు సిద్ధముగా నున్నట్లు కనిపించు చుండిరి. మహాలక్ష్మికి వారందఱిమీదను అనిర్వాచ్యమైన వాత్సల్యము హృదయములోనుండి పొంగి వచ్చుచుండ వారి నందరను తన అభయహస్తముతో ఆశీర్వదించుచుండెను. ఆమె తల్లియు తండ్రియు సోదరులును తమ మహాలక్ష్మి చెంచులక్ష్మిగా మారి ఇంత పూజ నందుచున్నందుకు తమ కన్నులు తామే నమ్మలేక ముగ్ధులై చూచు చుండిరి. బొల్లన ఆనందపరవశుడై తిలకించుచుండెను. ఎర్రయ మొగ మావ లకు త్రిప్పుకొని దూరముగా నుండెను.

విస్సన్నను చూచినంతనే తోకరాజు చెంచులక్ష్మిని తమకు దయ చేయవల సిన దని అతనినిగూడ వేడుకొనెను.

విస్సన చిరినవ్వుతో, 'తోకరాజా! నీపరివారమును నిశ్శబ్దముగా నుండు నట్లు చేసినచో నీకు తృప్తికరముగా సమాధానము చెప్పెదను' అనెను.

చిత్తమనుచు తోకరాజు తన రెండుచేతు లెత్తి పులివలె ఒక్కగంతు వేసి బొబ్బపెట్టెను. దానితో చెంచులందరు చేతులొగ్గి నిశ్శబ్దముగా నిలిచిరి.

విస్సన :- చెంచుదొరా, చెంచులక్ష్మిని పూజించుటకు మీకెవ్వరాటం కము చెప్పిరి? చెంచులక్ష్మిని పూజ చేయుటకు మాకుమాత్రము అనుజ్ఞ ఈయవా?

తోకరాజు వంగి చెంపలు వేసికొనుచు, 'అయ్యో, దొరా! మా కందుకు అభ్యంతర మేమి?' అనెను.

విస్సన :- 'చెంచులక్ష్మి మీకును మాకును పూజించుటకు అనువైన స్థానమునకేవెళ్లుచున్నది. ఆమె కోరిన చోటికి నీవే చేర్పించు.'

తోకరాజు ఆనందముతో చెంచులక్ష్మికి మ్రొక్కి అమ్మా! నిన్నెక్కడికి చేర్చమందువు?' అని అడిగెను.

మహాలక్ష్మి :- 'నాయనా! వీరిద్దరు నా తల్లిదండ్రులు, వారిద్దరు అన్నలు- వారు మా మామగారు వారు -' ఆమె ఎర్రయను చూపి ఏమియు చెప్పలేక ఆగినది.

చెంచుదోర వారి కందరకు వరుసగా దణ్ణములు పెట్టెను.

మహాలక్ష్మి 'నన్నెక్కడికి ఎవరు బలవంతముగా తీసికొని పోవుటలేదు. మా అన్నలు నన్ను కొనిపోవు చోటికి తీసికొనిపోనీ నాయనా : మీ కందరికి శుభ మవుగాక!'

చెంచు లందరు నమస్కరించి బండికి దారి యిచ్చిరి. బండి కమలనాథా మాత్యుడు నిర్దేశించిన చోటికి సాగిపోయినది.

* * *

ఆనాటి అపరాహ్ణమున మూడు జాములవేళ బొల్లన ఏకాంతముగా ఎర్ర యతో మహాలక్ష్మి ప్రశంస తెచ్చెను.

బొల్లన : 'నాయనా! నిర్దోషురాలగు భార్యను విసర్జించుట మహా దోషమురా!'

ఎర్రయ : 'పెదబాబూ! నీవు చెప్పినది తథ్యమే! అది దోషురాలని నే ననను. అయినను నిర్దోషురాలని నిర్ధారింప బడనది పరిగ్రహించుట యుక్తమా?'

బొల్లన : 'నిర్దోషురాలని నిశ్చయ మైనపుడే పరిగ్రహింపుము. మీఅమ్మ నాయన వద్దనుండి తప్పిపోయిన తరువాత అది ఎక్కడెక్కడ ఉన్నదో విచా రించితివా?'

ఎర్రయ : 'ముందు కొంతకాలము చెంచుల గూడెములో ఉన్నదట.'

బొల్లన : 'ఓరే! ఇందాక చూడలేదురా! చెంచు లందరు దేవతకంటె కూడ ఎంత భక్తి శ్రద్ధలు ప్రదర్శించిరో?'

ఎర్రయ : 'కావచ్చు అయితే మాత్రము?'

బొల్లన : 'బాగున్నది తరువాత ఎక్కడ ఉన్నది?'

ఎర్రయ : చంచల చిత్తుడైన ఒక తురక వద్ద!'

అది విని బొల్లన అదరి పడుచు, 'ఎవరు వాడు? ఎట్లు తప్పించు కొన్నదిరా?'

ఎర్రయ్య : 'శివ్వక్కను అడుగు!'

బొల్లన పంటరెడ్డికి కబురంపి శివ్వక్కను అక్కడికి పిలిపించెను. పంట రెడ్డిని తిట్టుచు శివ్వక్క వచ్చినది. ఇప్పు డామె బిగ్గరగా తిట్టుట లేదు గొణు గుచు తిట్టుచున్నది. ఆమె రాగానే బొల్లనయే ప్రశ్నించెను. బొల్లన కంఠములో నప్పుడు గద్గదిక పొడముచుండెను.

"అమ్మాయీ, తురకల స్కంధావారములో మహాలక్ష్మి ఉన్నప్పుడు నీవును అక్కడ నుంటివా?"

శివ్వక్క : బాబూ, ఉండకేమి? లచ్చమ్మ తల్లి ఆక్కడికి వచ్చినప్పటి నుండి మల్లయ్య విడిపించు నంతవరకు ఆమెను నేను వదలి యుండలేదు.'

బొల్లన : 'ఆ తురక ఎవరు? వాడు మిమ్ము బాధ పెట్ట లేదా?'

శివ్వక్క : 'వాడా బాబూ? మన మల్లయ్య అన్నే! తప్పి దారి ఎట్లో మతము పుచ్చుకొన్నాడే కాని వాడు నన్నెంతో భయభక్తులతో చూచేవాడు! అచ్చమ్మను వాళ్ళ అమ్మకంటె గౌరవముతో పూజ చేసేవాడు! ఐనా చిన్నపిల్ల గనుక ఆ తల్లిని వాని కంట పడనీయకుండ వేయికళ్ళతో కనిపెట్టి కాపాడి నాను, తండ్రీ!'

బొల్లన నిట్టూర్పు విడిచెను. మరికొంతసేపు ఎన్నో విషయము లాత డామెను ప్రశ్నించి పంపివేసి, ఎర్రయవంక తిరిగి, 'విన్నావు కదా, నాయనా! అది నిర్దోషురా లని నీ కిప్పుడు తృప్తి కలుగలేదా?' అనెను.

ఎర్రయ : 'నీకు కలిగినదా?'

బొల్లన : 'ఒరె, అది నిర్దోషురాలు కాదని నా కెన్నడైనా సందేహ ముండినగదా! దాని ముఖము చూడగానే అది దీపశిఖవలె పవిత్రమూర్తి అని నిశ్చయము కలిగినది, నాయనా!'

ఎర్రయ :- 'పెద్దబాబూ, నీవు తలచినట్లే లోకమంతయు తలచునా? అగ్నిశుద్ధి కానిది పరిగ్రహించుట యుక్తమని నేను భావింపను'

బొల్లన మౌనము వహించి దీర్ఘాలోచనలో పడెను. ఆ రాత్రియే మహా లక్ష్మితో నా మరునాడు అగ్నిప్రవేశము చేసి భర్తను సమీపించవలసి యుండు నని ఆత డెరిగించెను: మహాలక్ష్మి జంకులేక మామ యానతి శిరసావహించెను, ఆమె తల్లిదండ్రులను సోదరులను బొల్లన నిశ్చయమునకెదురు చెప్పలేదు.

మహాలక్ష్మి ఆ రాత్రి శుచియై ఉపవసించి జాగరణ మొనర్చి సీతామహా దేవిని భక్తితత్పరయై పూజించెను.

చెంచులక్ష్మి అగ్నిప్రవేశము చేయునున్న దనువార్త మోటుపల్లి యం దంతట ప్రకటింపబడుటచే, అందుకు నిర్ణీతమైన ధ్వజస్తంభము నొద్దకు జను లాబాల గోపాలము గుంపులు గుంపులుగా చేరిరి, బసవన్న చెల్లెలే ఆపిల్ల యని యందరకు తెలిసినందున మరింత ఉత్కంఠతో చుట్టుపట్టుల గ్రామముల

నుండియు ఆ వింత చూచుటకు జనులు తండోపతండములుగా నక్కడికి వచ్చుచుండిరి.

ధ్వజస్తంభవేదిక యొద్ద కమలనాభామాత్యుడు మొదలగు వతసంఖ్యాకులగు వేదవిప్రులు బారులుతీరి కూర్చుండిరి. వారిలో సోమయాజియు అతని కుమారులు రామలక్ష్మణు లిద్దరును గలరు. అందరు భూసురులు స్వస్తివాచనము ఆగ్నేయ మంత్రములతో సలుపుచుండగా ఆ బ్రహ్మసభను వేదపురుషుడు ఆవహించినట్లు తోచుచుండెను. ధ్వజముపై నున్న బసవశంకరుడు గంగడోలు వేదశ్రుతి కనుగుణముగా నూపుచు గాలి కల్లల నాడుచుండెను.

ఒకప్రక్క అవచిదేవయయు రత్తగేహియు నౌకాధిపతులను నిలిచియుండిరి. మరియొక ప్రక్కను మల్లారెడ్డి పంటరెడ్డి దేసటరెడ్డి ఇత్యాది వీరులంద రుండిరి. మల్లారెడ్డి ప్రక్కనే దొడ్డారెడ్డియు నుండెను. అతడు సాహబు వేషము వదలి మౌనముగా తలవంచుకొని యుండెను. ఇంకొకవంక తోకరాజు నతని చెంచుపరివారముగూడ చేతులు కట్టుకొని నిలిచి యుండిరి. ప్రేక్షకజనులు చూచుట కనువైన తావులు చూచుకొని ఎక్కడ కనువైన నక్కడ నుండి వీక్షించుచుండిరి.

ధ్వజస్తంభము నానుకొని బొల్లన పార్శ్వమున ఎర్రయ అహోబల నృసింహుని ధ్యానము చేయుచు అర్ధనిమీలిత లోచనుడై నిలిచి యుండెను. ఆతని కన్నులు అరమోడ్చి యున్నను, ఎదుట నున్న మనుష్యులను గాని వస్తువులనుగాని చూచుచున్నట్లే లేదు. ఆతని వీనులేమియు వినుచున్నట్లు లేదు.

మహాలక్ష్మి తండ్రి సోమయాజి తనతో తెచ్చిన తన అగ్నిహోత్రము నుండి అగ్నిని ఉద్ధరించి కుండములో ప్రతిష్ఠాపించెను, ఆతడును సోమిదేవి పోలమ్మయు మహాలక్ష్మిని తోడితెచ్చి అగ్నిముందు నిలువబెట్టిరి.

మహాలక్ష్మి ఉదయమునానే స్నానము చేసి తల యార్చుకొని ముడివైచికొని పసుపు కుంకుమ ధరించి శుచియై మహాగ్ని జ్వాలవలెను అవతరించిన సీతామహాదేవి వలెను చూచువారికి పొడకట్టుచుండెను.

కుండముతో అగ్ని దక్షిణావర్త శిఖరములతో మహానందపడుచు ఉత్సాహముతో ప్రజ్వరిల్లు చుండెను.

మహాలక్ష్మి అగ్నికి మ్రొక్కినది. అగ్నిభట్టారకు నిట్లు ప్రార్థించినది.

"సదాశుచి వగు అగ్నిభట్టారకా నీకు నమస్కరించు చున్నాను. నేను మనోవాక్కాయములచే పతివ్రత వని నీవును అంగీకరించు నెడల నా భర్త పాదసన్నిధి జేరుటకు నీలోనుండి నాకు దారి అనుగ్రహింపుము సదాశుచీ, నీ కిదే నా నమస్కారము!"

ఇట్లనుచు నామె యగ్నికి నమస్కరించి ప్రదక్షిణము చేసినది. మరల మరల నట్లే ప్రార్థించి మ్రొక్కుచు ముమ్మారు అగ్నిని ప్రదక్షిణించినది.

ఆ పిమ్మట నామె చేతులు జోడించి శిరము వంచి హంసవలె ధీరగమన ముతో కుండము చొచ్చినది అగ్నిదేవు డామెకు దారి యిచ్చినాడు. ఆమె కుండము దాటుచుండగా అగ్నిహోత్రు డామెను తన చేతులతో నెత్తుకొని ఆవల దింపుచున్నట్లే చూచువారికి తోచినది. ఆమె నిరామయముగా నడచిపోయి ఎర్రయ పాదములకు మ్రొక్కగా నాత డామె కరగ్రహణ మొనర్చెను.

సాధువాదములు చెలరేగినవి. వా రిరువురు బ్రాహ్మణ సుదస్సునకు మ్రొక్కి నిలువగా బహువేదమంత్రములతో వారంధరు నాశీర్వదించి అక్షతలు వారి శిరస్సులపై నుంచిరి.

పైన ధ్వజస్తంభము మీద నధిష్ఠించిన బసవశంకరుడు గాలికి రెపరెప లాడుచు 'సాధు శంభుదాసా' అని పలుకుచున్నట్లు భాసించెను.

కూడిన జనసమూహములు ఆనందపారవశ్యముతో జయజయనినాదము లొనర్చుచు, ధన్యులమైతి మని ఉద్ఘాషించుచుండిరి. చెంచులు సంతోషము పట్ట లేక చిత్రచిత్రరీతుల గంతులు వైచుచు నాట్యము లొనర్చుచు పాటలు పాడు చుండిరి.

చికిత్సాలయములో చికిత్స నొందుచున్న బసవన్న తన చెల్లెలు చిచ్చు చొరనున్న దని వినెను. వెంటనే యాతడు వైద్యులు వారించుచున్నను వినక వడివడి నచ్చటికి చనుదెంచెను. అప్పుడే విప్రాశీర్వచనము పూర్తియైనది. ఆతనిని జూడగనే మహాలక్ష్మియు ఎర్రయయు నాతనికి పాదాభివందన మాచ రించిరి. ఆతడు వారి నానందబాష్పములతో నభిషేకించి ఆశీర్వదించెను.

మల్లారెడ్డికి ఆనంద ముద్వేగ మైనది. ప్రక్కనే యున్న దొడ్డారెడ్డి యాతనికి భార మనిపించుచుండెను. అన్న యని గౌరవాదరము లున్నవి. కాని

తురకలలో కలసి యాతడు చేసిన దుష్కార్యములనుండి యాత డింకను నిర్వృతి పొందలేదు. ఆతని స్వేచ్ఛగా నుండ నిచ్చినను, ఇన్నాళ్లను వేరుగనే యుంచి భోజన భాజనాదుల కేర్పాట్లు గావించియుండెను. ఐనను ఆతని నేమి చేయుటో తోచక మోటుపల్లి విజయవార్తతో బాటు దొడ్డారెడ్డి వివరములును నివేదించి ఏమి చేయవలెనో తెలుపవలసిన ధని వేమారెడ్డి నాత డర్థించి యుండెను. ఇప్పుడే అద్దంకినుండి వేగిరివచ్చి వేమారెడ్డి లేఖ మల్లారెడ్డి కంద జేసెను. అది యాతడు చదువుకొని మరునాడే అందరును అద్దంకికి ప్రయాణము కావలసిన దని ప్రస్థానభేరి వేయించెను.

63

మలరథినీ నాథుడు మోటుపల్లి పట్టుకొనిన విజయవార్త అద్దంకిలో వేమారెడ్డి విని పరమానందభరితు డయ్యెను అంత యానందములోగూడ దొడ్డారెడ్డి నేమిచేయవలెనా యను సమస్యయే, మల్లారెడ్డిని వలెనే, ఆతనిని గూడ బాధింపసాగెను. ఆతడు జంకుచునే ముం దావిషయము అన్నమ్మకు నివేదింప బోయెను.

అన్నమ్మ ఇప్పుడు అద్దంకికి పడమర చివర నున్న పోతరాజు గుడి వదలి వచ్చుటలేదు. ఆ గుడి ప్రక్కనే రెండుగదులు వేయించుకొని ఒకదానిలో స్వయముగా వంటచేసి పోతరాజుకు నివేదించి ఆ ప్రసాదము మాత్రమే ఆమె భుజించుచున్నది. ఆమె సర్వాంగములలో ఆ కటారి తేజస్సు ప్రతిఫలించు చుండి నూతన వికాసముతో శోభిల్లుచున్నది.

ఆమెతో నిప్పుడు వేమారెడ్డి తమ్ముడు దొడ్డ విషయము ప్రస్తావింపగనే ఆమె చిరునవ్వుతో, ఎంత వెర్రివాడవు, వేమన్నా! నన్నడిగెద వెందుకురా, మీ నాన్న ఇక్కడనే ఉండగా?' అనెను.

వెంటనే వేమారెడ్డి గ్రహించి తల్లియొద్ద సెలవు తీసికొని ప్రోలయ యొద్దకు వెళ్ళెను. ఆత డిప్పుడు అద్దంకికి తూర్పుచివర మఠము నిర్మించుకొని అందులో నేకాంతవాస మొనర్చుచుండెను. తండ్రికి వేమారెడ్డి దొడ్డ సంగతి నివేదించి, ఏమి చేయు మని నీ యాజ్ఞ?' అని అర్థించెను.

ప్రోలారెడ్డి వెంటనే వెకిలినవ్వు నవ్వుచు. 'ఎంత వెర్రివాడవు, వేమన్నా: న న్నడిగెద వెందుకురా. రమ్మని వెంటనే పిలిపింపక ?' - అనెను.

అందుపై వేమారెడ్డి దొడ్డయతో రమ్మని మల్లయ్యకు వార్త పంపి యుండెను.

మల్లారెడ్డి మోటుపల్లి లో రక్షణాదులకు కావలసిన సన్నాహము లన్నియు గావించి సేనలో ఎక్కువ భాగము వెంట దీసికొని అద్దంకికి బయలుదేరెను.

అవచిదేవయ శ్రేష్ఠి తన సౌకాధిపతులను కొందరు నావిక సైనికులను వెంటగొని తన మత్తగజము నధిరోహించి తన కున్న యన్ని గౌరవ చిహ్న ములతో ప్రయాణ మయ్యెను. వందిమాగధులు కైవారములు చేయుచు బిరుద గద్యములు ఆడంబరముగా చదువుచుండ శ్రేష్ఠిలోవి మూర్తీభవించిన ట్లాతడు సాగుచుండెను.

చెంచులు సహకార పర్ణాదులతో నలంకరించిన శిబికలో తోకరాజు అధివ సించెను. చేతులకు కాళ్ళకు చెవులకు కడియములు మెడలలో పూసల పేరులు శిరస్సులపై ఉష్ణీషములలో నెమలి పింఛములు అలంకరించుకొని జేగంటలు చెవులు గింగురు మనిపించుచుండ ఆడుచు పాడుచు చెంచుదొరలు దారి సాగు చుండిరి.

పంచభిక్షము రామలింగము సోమలింగము ప్రభాకృతులు గల మనోజ్ఞము లగు శకటములపై నారోహించి బయలు దేరిరి. అంతకంటె చిన్న ప్రభలున్న శకటములపై వారి తోడి స్థపతులను పరివేష్ఠించి వచ్చుచుండిరి;

మల్లారెడ్డి పంటరెడ్డి దేసటరెడ్డి మొదలగు వీరులు అశ్వములపై వచ్చు చుండిరి. వారికిని వారి అశ్వములకును కవచాదులు తప్ప ఇతరా లంకారము లేవియులేవు. అయినను వారి శౌర్యమే సర్వాలంకారములకంటె విశిష్టమైన అలంకారమై తేజరిల్లుచుండ వీరోచితమగు తీవితో కదలుచుండిరి.

కమలనాభామాత్యుడును పరహిత వైద్యులును విస్సనయు బొల్లన సోమ యాజి ప్రోలమ్మ ఎర్రయ మహాలక్ష్మి మొదలగువారు ఎవరి వీలు కొలది వారు శకటములందును అందలములందును బయలుదేరిరి.

ఇప్పుడు ఆసమీప భూభాగమే కాక తూర్పు సముద్రమునుండి పశ్చిమ మున అహోబలము వరకు మధ్యాంధ్ర భూమి యంతయు యవన నిర్ముక్తమై

ఎట్టి అపాయము లేకున్నది వారల అద్దంకి ప్రయాణము మేళములతో తాళము లతో నృత్యములతో గీతములతో వివిధ వినోదములతో పెండ్లివారి యూరేగింపు వలెనే సాగుచున్నది. దారి పొడవునను వారు విడియుటకు పెద్దయెత్తున పందిళ్ళు పాకలు వేసి గ్రామీణులును పౌరులును సమస్త సదుపాయములను కల్పించు చుండిరి. బొల్లన కది రామదండు కదలిక వలెనే తోచినది.

మూడవనాటికి వా రద్దంకి చేరిరి. అక్కడ మహా వైభవముగా వారికి మర్యాదలు జరిగినవి. మాచారెడ్డి అన్నారెడ్డి చిట్టయ పోతయ నూకయ రెడ్లు మొదలగు నాప్తు లందరు వేమారెడ్డికి సహాయభూతులై యుండ వారికెదురు వచ్చి ఆదరముతో పురప్రవేశము చేయించి వారందరకు ఉచితమైన వసతులు కల్పించిరి. ఈ ప్రయత్నములతో రామాప్రగ్గడకు మల్లినాధునకు తీరికయే లేదు.

ఆ రాత్రియే వేమారెడ్డి బంధువులందరు పోతరాజు దేవాలయము ఆవర ణములో కులసభ చేసిరి. ఎన్నిమారులు రమ్మని వార్త పంపినను ప్రోలయ అక్కడికి రాలేదు. వచ్చినవా రందరిలో వృద్ధుడు మాతామహుడు అగు దొడ్డా రెడ్డి రామాప్రగ్గడయు మల్లినాథుడును విస్సనమంత్రియు కమలనాభామాత్యుడును మాత్రము ప్రేక్షకులుగా నుండుటకు ప్రత్యేక మా సభకు ఆహ్వానింపబడిరి.

కులపెద్దయై దొడ్డారెడ్డి వ్యవహరించెను. ఆత డాసభ యెదుటికి దొడ్డ య్యను పిలిపించి ఆతడుచేసిన తప్పులన్నియు వివరింపుమని కోరెను.

అంతట దొడ్డయ్య కులపెద్దలందరకు దండము పెట్టి వినీతుడై తల వంచి గద్గదస్వరముతో, తా నేసందర్భములలో ఇస్లాము మతము స్వీకరించి నదియు, పశ్చాత్తాపముతో తల్లిని దర్శించి పాపవిముక్తి పొందెడి నిండుకోరి కతో వెనుక నొకమారు తిరిగివచ్చి దురదృష్టవశమున ఎట్లు మరలిపోయినదియు ఆ పిమ్మట తానుచేసిన గోమాంస భక్షణాదికమును బ్రాహ్మణహింసయును సమస్తము దాపక విపరించి తాను చేసిన దోషములకు తప్పు విధించి నలువు రిలో ఒకనినిగా గ్రహింపుడు అని ఆరెడ్డి కుల సభను ఆర్థించెను.

రెడ్లందరును తర్జన భర్జన లొనర్చిరి. వారందరును వెనుక ఆతనిని తమలో కలుపుకొనుట కంగీకరించిన వారే! కాని ఆతడు తిరిగి యవనులవద్దకు పోయిన తరువాత చేసిన గోమాంసభక్షణాదులు వారి నిప్పుడు కలతపెట్టు

చున్నవి వారికేమి చేయక పాలుపోక ప్రైగ్గడలతో కర్తవ్యమును గూర్చి సంప్ర దించిరి.

కమలనాభామాత్యుడు, స్పష్టముగా మీ సందేహములు ప్రశ్నలరూపమున నిబంధించినచో ఆలోచింపగలము!' అని దొడ్డారెడ్డితో చెప్పెను. దొడ్డారెడ్డి తక్కినవారితో నాలోచించి రెండుప్రశ్న లీవిధముగా నడిగెను.

" (1) ఇతడు చేసిన అభక్ష్యభక్షణమునకు అపేయపానమునకు ప్రాయ శ్చిత్తమున్నచో నేమి ?

(2) ఇతడు కావించిన హత్యాదులకు నిర్వృతి ఎట్టిది? "

ప్రైగ్గడ లాలోచించిరి. కమలనాభామాత్యుడు వారి నిర్ణయము నిట్లు తెలియజేసెను.

"ఇతనికి వారము రోజులపాటు పయోవ్రతము విధించినచో ఇతడు కావించిన అభక్ష్యభక్షణము అపేయపానముల వలన గలిగిన దోషము ఉపశ మింపగలదు-"

కమలనాభామాత్యుడు రెండవప్రశ్నకు ఉత్తరము చెప్పబోవుచు సందే హించుచుండెను.

సరిగా నా సమయమున నక్కడికొక పిచ్చివాడు తుపానువలె దురుసుగా నందరిని త్రోసికొని వచ్చి ఒళ్లు తెలియకుండ పడిపోయెను. స్మృతిలేకున్నను ఆవేశముతో నత డిట్లరచుచుండెను.

'ఒరే భడవా. నా జంధ్యము తెంపించి నానోట గోమాంసము బలవం తాన కుక్కించి ప్రాణము తీసిన పాపానికి నిష్కృతి చెప్పేవా రెవరురా?

'ఓరి పశువా. నాశిఖ పీకించి నా గొంతులో బలవంతముగా సుర పోయించి ప్రాణము దీయించిన పాతకానికి నివృత్తి చెప్పేదెవరురా?'

ఇద్దరు మాట్లాడుచున్నట్లు రెండు గొంతులతో స్మృతి తప్పిపోయిన అతని నోటనే ఆ మాటలు వచ్చుచుండెను. అతడు తనకు భయపడి ఇస్లాము మతము పుచ్చుకొని రసూలుగా మారిన బ్రాహ్మణుడని దొడ్డయ వెంటనే గుర్తించి యాతని కాళ్ళపైబడి క్షమింపుమని దీనముగా ప్రార్థించెను.

రసూలుకు కొంతవడికి స్మృతివచ్చి కళ్ళు నులుముకొనుచు లేచి దొడ్డయ పంక తీవ్రదృష్టిలో చూడసాగెను. ఆతనికి తానక్కడి కెట్లు వచ్చినదియు

తెలియదనుచు, తన్ను ఇద్దరు బ్రహ్మరాక్షసు లావేశించి బాధ పెట్టుచున్నారని గోల పెట్టెను. కమలనాభామాత్యుడు రసూలును ప్రశ్నించి పూర్వకథ యవగాహన మొనర్చుకొని దొడ్డయ్య నిట్లనెను.

"దుర్మరణముచే బ్రహ్మరక్షో జన్మము ప్రాప్తించిన ఆ యిద్దరు వేదవిప్రులకు వారి జ్ఞాతులచే యథాశాస్త్రీయముగా ప్రేతకర్మాదులు చేయించి వారిపేర రెండు శివాలయములు కట్టించి ప్రతిష్ఠ చేయింతునని వెంటనే మ్రొక్కుకో; -"

దొడ్డయ అట్లే భక్తి వినమ్రుడై మ్రొక్కుకొనెను. వెంటనే రసూలు వికృతమైన నవ్వుతో వికృతాకారము నొందెను. అతనినోట రెండు కంఠము లిట్లు వెలువడినవి.

'కమలనాభా, మా దుర్గతి తప్పించు దారి చూపినందుకు నీకు శుభమగునయ్యా! - నీ వంశములో కవిసార్వ భౌముడు పుట్టగలడయ్యా! -' ఈ మాటల వెంటనే ఆ రెండు కంఠములు జంటగా కలిపి ఉత్సాహాతిశయముతో ఆశీర్వచనపు [illegible]సలు వర్షించెను. ఎంత సుస్వరముతో నున్నను ఆ వేదమంత్రములు వికృతముగనే వినబడినవి. ఆ వేదఘోష శాంతించినంతనే రసూలు ప్రకృతి నందెను,

అప్పుడు రసూలు దీనముగా అక్కడివారి కిట్లు నివేదించుకొనెను:

'అయ్యా, నేను సాంగముగా వేదాధ్యయనము చేసినవాడను. సంస్కృతాంధ్రములలో ప్రౌఢముగా కవిత్వము చెప్పిన సాహిత్యవేత్తను. ఆ సమయములో శిఖాయజ్ఞోపవీతములు స్వయముగా విసర్జించి సన్యసించిన ప్రాజ్ఞుల ధైర్యము నాకు లేకపోయినది. మొండి చరచి తురకలనెదిరించి ప్రాణములు పోగొట్టుకొన్నవారి సాహసమును నాకు లేకపోయినది. నేను భయపడి ఇస్లాము మతము స్వీకరింతు నని ప్రాణములు దక్కించుకొంటిని. ఇప్పుడీ ప్రాణములు బరువుగా నున్నవి. అపవిత్రమైన యీ రూపముతో హృద్గతమైన వేదమంత్రము లుచ్చరింపలేను, బలవంతముగా పుచ్చుకొన్న ఇస్లాముమీద అభిమానమంతకంటె లేదు- నాకు గతియేమి?'

ఎవరును మాటాడలేదు. రసూలు మరల మరల నదే గొడవగా చెప్పుకొనసాగెను. సభ సాగుటలేదు. అతనిని బలవంతముగా పంపివేయుటకును

వీలు కాకున్నది. తుదకు కమలనాభు డాతనివంక జాలి చూపులతో తిరిగి యిట్లనెను.

'నిజమే. పిరికిపందలైన వారికి నిష్కృతిచెప్పుట కష్టసాధ్యమే. నీపిరికి దనము కనిపెట్టియే ఆ బ్రహ్మరక్షస్సులు నిన్ను ఆవహించినవి. ఆ బ్రహ్మరక్షస్సులకు దుర్గతి తొలగిన తర్వాత నీ యాప్తులను కలిసికొని పరిషత్తును కూర్చి నీకు గతి కల్పింపుమని ప్రార్థింపవలసి యుండును!' ప్రస్తుతము ఇక్కడి వారు చేయగలది లేదు!'

రసూలును వెంటనే ఆ సభలోనుండి 'పదపద' మని అతని నావహించిన బ్రహ్మరక్షస్సులే బలవంతముగా నావలికి గొంపోయెను.

కులపెద్ద దొడ్డారెడ్డి యడిగిన రెండవ ప్రశ్న యట్లే నిరుత్తరముగా నిలిచిపోయెను.

దొడ్డయ్యకు వెంటనే వివాహముకూడ చేయవలెనని వేమారెడ్డి ఉద్దేశించి ప్రస్తావించెను. కాని రెడ్డి పెద్దలలో నొక్కరును పిల్ల నాతనికిచ్చి వివాహము చేయుటకు సుముఖత చూపలేదు. భోజన బాజనాదులతో కలుపుకొనుట వేరు. ఇట్టి పూర్వచరిత్ర కలవానికి పిల్లనిచ్చి కలుపుకొనుట వేరు!

దొడ్డయ తన కులపెద్దల మనఃప్రవృత్తి వెంటనే గమనించెను. ఆతడు తాను పయోవ్రతము పూర్తిచేసి యావజ్జీవము బ్రహ్మచారిగా నుండి, తాను తిరిపి మెత్తియైనను ఆ యిద్దరు బ్రాహ్మణులకును శివాలయములు కట్టించి శివ సేవ చేయుచు జీవిత శేషము గడుపుదునని పెద్దల యెదుట ప్రతిజ్ఞ చేసెను.

64

అద్దంకిలో విజయోత్సవములు వసంతోత్సవములు ఏకముఖముగా వైభవముతో సాగుచున్నవి.

విజయదశమినాడు వేమారెడ్డి ఘోడెయవాయ గంగయ గురుదేవులకు వందన మాచరించి, అనుజ్ఞగొని వచ్చి, పేరోలగము తీరెను. సభామధ్యమున సింహాసనముపై బసవశంకర విగ్రహము ప్రతిష్ఠింపబడినది. దాని పాదముల నుండి ఆడంబరరహితమై అనలంకృతమైన ఉదాత్తమగు నాసనమున వేమా

రెడ్డి యుపవిష్టుడయ్యెను. సభ్యులు కూడ అట్టి యాసనములే అలంకరించిరి. వందిమాగధులు లేరు. వెండిబెత్తములవారు లేరు. ఛత్రములు లేవు. చామరములు లేవు. కైవారములు లేవు. వీచోపులు లేవు. పూర్వపు రాజమర్యాద లేమియు లేకున్నను ఆసభ మహోదాత్తమై విరాజిల్లు చున్నది.

ఆ సభలో తూర్పు సముద్రమునుండి పశ్చిమమున అహోబలము వరకును, ఉత్తరమున కృష్ణాతీరమునుండి దక్షిణమున పెన్నాతీరము వరకు గల మధ్యాంధ్రదేశము పరిపాలించుటకు జరిగిన ఏర్పాట్లన్నియు వివరింపబడి స్థిరపరుపబడినవి. ప్రాతకోటలు బాగుచేయించుట క్రొత్తవి నిర్మించుట పంటరెడ్డికి అప్పగింపబడినవి. సేనలు సిద్ధముచేయు ఉద్యోగు లందరిపై అధికారము దేసటరెడ్డికి ఈయబడినది. మోటుపల్లి విజయ విశేషము లన్నియు మల్లారెడ్డి సభా సమక్షమున అన్నకు నివేదించెను.

రాజకార్యము లన్నియు ముగిసిన పిమ్మట చేయవలసిన ధర్మకార్యముల ప్రస్తావన వచ్చినది. ఆ సభలో మోటుపల్లిపట్టుకొనుటలో నూతన రణసాధనలు మహాచతురతతో నిర్మించి, పంచభిక్షము రామలింగమును ఆతని సోదరుడు సోమలింగమును చేసిన మహా సహాయమును విన్నన నివేదించెను. వేమారెడ్డి ఆ సభాసమక్షమున వారిని శాఘించి జాంబూనదాంబరాభరణములతో నాదరించి మరియు నిట్లనెను.

"నేను ఈ ధర్మకార్యము నిర్వహించిన పిమ్మట పాతాళ గంగనుండి శ్రీశైలమునకు సోపానములు కట్టించుటకును, అహోబల పర్వతమునకు సోపానములు నిర్మించుటకును మ్రొక్కుకొంటిని. అవి నిర్వహించు భారము మీమీద పెట్టదలచితిని. మీ రంగీకరింతురా ?'

రామలింగము పాతాళగంగ సోపానములును సోమలింగము అహోబల సోపానములును నిర్మించుట కంగీకరించి తాంబూలము లిమ్మని అర్థించిరి. వేమారెడ్డి ఆనందముతో వారికి కర్పూరవిటిక లర్పించెను.

ఇంకను రాజ్యములో చేయవలసిన ధర్మకార్యములు నిర్వహించు భార మంతయు వేమారెడ్డి తనప్రెగ్గడలగు రామాప్రెగ్గడకును మల్లినాథునకును అప్పగించెను.

అప్పుడు వేమారెడ్డి అవచిదేవయ శ్రేష్ఠివంక తిరిగి యిట్లనెను:

"శ్రేష్ఠిదేవా, మీరు మా కీయుద్ధయాగములో చేసిన సాహాయ్యము అద్వితీయ మైనది. అందుకు మీకు కృతజ్ఞులము. మిమ్మెంత శ్లాఘించినను చాలదు. మొదట మీరు అప్పుగా నిచ్చిన రణసాధనము లన్నియు నష్టమైనవి. పోను తక్కిన వన్నిటిని మాత్రమే గ్రహించుట కంగీకరించితిరి. అవి తిరిగి యిచ్చుటకు మాకు సమ్మతి కానిచో వాని మూల్యముతో తృప్తి చెందుటకును ఒప్పుకొంటిరి. ఇప్పుడు మిగిలియున్న రణసాధనముల నన్నిటిని, గజములు హయములు ఖడ్గములు కుంతములు శూలములు- ఆహారపదార్థములతో గూడ మా కవిలెసంప్రతులు పట్టికలు వ్రాయించి సిద్ధము చేసినారు. మావారు కట్టిన లెక్కను వాని విలువ కోటిసువర్ణము లైనది. మేము కట్టించిన విలువలు సరిగా నున్నవో లేవో దయచేసి మీరు పరీక్షించి తేల్చింపుడు! మరియు మీ రిచ్చిన సాధనములచే నష్టపడిన సాధనములకు ముబ్బిడిగా మాకు శత్రువులవద్ద నుండి సాధనములు లభించినవి. అందుచే నష్టపడని సాధనములకుగూడ విలువ మీ కర్పించుకొనుట మాకు ధర్మవిధిగా తోచి అవికూడ లెక్కలు కట్టించినాము. అవి మరియొక కోటి సువర్ణములకు తేలినవి. అవిగో పట్టికలు. ఈ రెండు కోట్ల సువర్ణములును మీ కంగీకార మైనచో అర్పించుటకు మా ప్రైగ్గడలు సిద్ధముగా నున్నారు. అవి గ్రహించి మమ్మందరను ఋణవిముక్తులను గావింప నర్థించుచున్నాను."

రామాప్రైగ్గడ అప్పుడే పత్రములు అవచిదేవయ శ్రేష్టి చేతులలో నుంచెను.

అవచిదేవయ శ్రేష్ఠి ప్రైగ్గడ తనచేత బెట్టిన పత్రములను పరిశీలింపకయే చిరునవ్వు నవ్వుచు ధీరముగా నిట్లు వచించెను.

"కార్య ప్రారంభమున మీ రన్నట్లే మీతో నట్టి ఒప్పందము చేసికొన్న మాట సత్యమే. ఈ ధర్మక్రతువు మీరింత సమర్థతతో నిర్వహించితిరి గనుక ఇప్పుడు మీవలన మేము ముందు అప్పుగా నిచ్చిన వస్తువులతో ఉన్నవానికి గాని పోయినవానికి గాని, ఎట్టి మూల్యమును గ్రహింప దలప లేదు. అందుచే ఆ రెండుకోట్ల సువర్ణములును మీ కిదే ఈ విజయావసరమున కానుకగా సమర్పించుకొనుచున్నాము. గ్రహింపుడు. మీరు ఋణవిముక్తుల రైతిరి. అంతే కాదు, వేమప్రభూ! ఈ తీరభూమి రక్షణకై మీకు అధమపక్షమున పదునైదు

మహానౌక లైనను కావలసి వచ్చును. మోటుసల్లిలో పట్టువడిన సుల్తానువారి పదునైదు నౌకలే గాక, మా నౌకలలో మరి పదునేను నౌకలును మీకు సమర్పించుకొనుచున్నాము. వాని నేరికొనుటకు నౌకామర్మదక్షు లైన మీ మల్లారెడ్డిని విస్సనమంత్రిని నియోగింపుడు!"

అ మాటలకు సభ్యులు నిర్ఘాంతపోయి అపచిదేవయ వితరణమును వేనోళ్ళ శ్లాఘించిరి. వేమారెడ్డి యాతని కానుక లంగీకరించి ప్రైగ్గడలతో సంపదించి ఆ మహాసభాసమక్షమున అపచిదేవయకు "వశీకృత నిఖిలభూభుజ సతతత్యాగధ్వజ" అను బిరుదములు ఇచ్చినట్లు కమలనాభామాత్యునిచే సభా ముఖమున ముమ్మారు ఉద్ఘోషింపజేసి బిరుదచిహ్న మగు కనకధ్వజము త్వరలో బహూకరింతునని ప్రకటించెను.

అంతట వేమారెడ్డి ప్రేమపూర్వకముగా చిన్నితమ్ముడగు మల్లారెడ్డిని తన సమీపమునకు పిలిచి, 'తమ్ముడా నీవు నా కేమియు కానుక ఈయలేదేమి?' అని అడిగెను.

మల్లారెడ్డి తెల్లపోవుచు, 'మహాప్రభూ, నా సమస్తము మీదే యై యుండగా వేరుగా కానుక ఏమి అర్పింపగలను?' అని యడిగెను.

వేమారెడ్డి ముఖమున చిరునవ్వు తాండవ మాడుచుండుటచే ఏదో చమత్కార మున్నదని సభలోనివా రందరు వ్యగ్రతతో నిరీక్షించుచుండిరి.

వేమారెడ్డి : 'కాదు, తమ్ముడా! నేనే నిన్నొక కానుక అర్థింప నెంచితిని.'

మల్లారెడ్డి : 'అవశ్యము అర్పింతును!'

వేమారెడ్డి : 'బాగుగా నాలోచించుకొని వాగ్దాన మిమ్ము సుమా!'

మల్లారెడ్డి : 'మహాప్రభూ! మీరు కోరుదానికి ఆలోచన మక్కరలేదు. నా వశమున నున్న దేని నైనను హృదయ పూర్వకముగా నర్పించుకొందును!'

వేమారెడ్డి : 'సరే నేను కోరున దొక్కటే. నీ ప్రాణ మిత్రమును ఎర్రయను నా కిమ్ము!'

ఈమారు మల్లారెడ్డి చిరునవ్వు కాదు, ఫక్కుమని బిగ్గరగా నవ్వెను. ఎర్రయ నా వశమున నున్న వస్తువు కాదే, అర్పించు టెట్లు?"

వేమారెడ్డి : 'మల్లా, ఈమాట లెక్కడ నేర్చితివిరా?'

ఇట్లనుచుండగనే ఎర్రయ తన యాసనమునుండి చివాలున లేచి వచ్చి మల్లారెడ్డి చేతులతో తన రెండుచేతు లుంచి, 'మల్లయ్యా! ఇదిగో నన్ను నీ వశమున నర్పించు కొనుచున్నాను. నీ వశమున నున్న వస్తువునుగనే నన్ను నీ ఇచ్చ వచ్చినట్లు చేసికొన వచ్చును!' అనెను.

ఆ తామ్ర మైన సర్వావయములతో ఎర్రయ తన కరపద్మములు మల్లారెడ్డి చేతులలో నుంచగా, నాతడు దిగ్గజము హస్తమంచున్న సహస్రదల రక్తాంబు జమువలె భాసించెను.

మల్లారెడ్డి, 'ఎర్రయ్యా, శ్రీకృష్ణుడు నారద మహర్షికి దాన మిచ్చుటకై సత్యభామకు తన్ను సమర్పించుకొని పాప మామెను పలుపాట్లు పాలుచేసి నట్లే అమాయికుడి నగు నన్ను నీవును త్రిప్పలు పెట్టదల చితివా? అనెను.

ఎర్రయ, 'నీ కాభయము లే' దనుచు వీపు చరచెను.

అంతట మల్లారెడ్డి అన్నా, నీకు వట్టి ఎర్రయను ఇచ్చుట యుక్తము కాదు, ఇతనిని అలంకరించియే యిత్తును!' అనుచు ప్రక్కనున్న దంతపు బరణిలోనుండి కంఠహార మొకటి పైకి తీసెను. ఆ హారములో పదకముగా తనకు తోకరాజు మున్నెన్నడో శ్రీశైలారణ్యములో కానుకగా సమర్పించిన పెద్ద పద్మరాగమణి అందముగా కూర్పబడి యున్నది. ఆ పద్మరాగమున్న పదకము ఎర్రయ వక్షఃస్థలమును కౌస్తుభమణివలె నలంకరించు నట్లు ఆ హారమును మల్లారెడ్డి ఎర్రయ కంఠమున వేసెను. అప్పు డాతడు ముసిముసి నవ్వులతో ఎర్రయ రెండుచేతులును తన రెండుచేతులతో అనురాగముతో భక్తితో పొదివికొని వేమారెడ్డి వంకకు బయలుదేరెను.

మల్లారెడ్డి దేహ మంతయు రోమాంచ కంచుకిత మైనది. ఆతనికి ఆనంద బాష్పములు పొడియుచుండెను.

వేమారెడ్డి ఆనంద పరవశుడై ఆసనమునుండి లేచి ఎదురు వచ్చి మల్లారెడ్డి యర్పించిన ఎర్రయ రెండు హస్తములు తన రెండు హస్తములతో గ్రహించి కన్నుల కద్దుకొనెను.

సభలో కూడిన పెద్ద లందరు ఎర్రయను వేమారెడ్డిని, మల్లారెడ్డిని సాధు వాదములతో నాశీర్వదించిరి.

అప్పుడు వేమారెడ్డి ఎర్రయను ఉన్నతాసనమున నుపవిష్టునిగావించి చంద నాదులతో నర్పించి కర్పూర తాంబూలము చేతి కిచ్చి మహాసభాసమక్షమున సవి నయముగా నిట్టనెను.

"ఎర్రనార్యా. నీవు సకలభాషా కవిత్వవిశారదుడవు. సాధుసమ్మతుడవు. నిత్యసౌమ్యమతివి. భవ్యుడవు కాన నీమీద నాకు పక్షపాతము గలదు. ఘను డైన నాతమ్ముడు మల్లరధినీనాధుడు నిన్ను ఆతతశ్రీతో సముపేతుని చేసి ఎలమి మీద చేపట్టి మా కిచ్చుటచేత చేతోమోదము చేకూరినది. స్వయముగా శ్రీరామ చంద్రునివలననే రామకథ వినునట్లు నీనోటనే మాకు రామకథ వినవలె నని కుతూహలము గలిగినది. మాకు శ్రీరామకథ నీమధుర గంభీర కవితావాణితో విని పింప ప్రార్థించుచున్నాము."

వేమారెడ్డి అభ్యర్థనము విని సభ్యులు సాధువాదము లొనర్చిరి. శ్రీరామ చంద్రునివలెనే ఈ ఎర్రయయు మహాలక్ష్మిని అగ్నిప్రవేశము చేయించి పరిగ్ర హించినది, వారి చిత్తములలో హత్తుకొని యుండుటచేత వేమారెడ్డి పలుకులు ఎంతయు సముచితముగా నున్నవని శ్లాఘించిరి.

ఎర్రయ ఎర్రని దేహము మరింత ఎర్రనై దాడిమీకుసుమశోభతో భాసించెను. అది శిష్టజనరంజక మైన అలౌకికవాణీ పరివేషమై ఆతని నావరిం చెను. ప్రహర్షపులకిత దేహుడై అత డిట్లనెను.

"వేమప్రభూ! కృతార్థుడ నైతిని వల్మీక సంభవముని వాఙ్మయము పావనమైనది. దుష్టశిక్షణ శిష్టరక్షణ చణు డగు శ్రీరామచంద్రుల వృత్తము కడు వేడుకతో విను నాయకుడవు నీవు. ఈ విధముగా నాఅభీష్టసిద్ధికి ఎన్నియో సంఘటిల్లినవి. కావున కళ్యాణావహ మహనీయరచనతో శ్రీమద్రామాయణము చెప్పెదను. సద్భావమున నవధరింపుము!'

ఇట్లని ఈ పద్యముతో నాశీర్వదించెను.

"శ్రీకిం బ్రేమపదంబు భూమికి నతి స్నిగ్ధుండు దుగ్ధాబ్ధిశ
య్యాకేళీ రతుఁ డాదివేధకు గృహంబై యొప్పు నాభిస్థ నా
ళీకమ్మం గలవేల్పు లోకములఁ చాలింపం బ్రభుం డుత్తమ
శ్లోకుం డన్నమవేమభూవిభున కిచ్చున్ సుస్థిరై శ్వర్యముల్."

* * * *

మధ్యాంధ్ర భూమికి శ్రీరామ విభు డగు వేమారెడ్డి ప్రభువుగా నేర్పడెను. అంతట అగ్రహారములు వెలసి దేశము కర్మిష్ఠులగు విద్వద్బ్రాహ్మణులతో నిండి యజ్ఞధూమములతో నావరింపబడి, స్వాహా స్వధాకారములతోడను వేదనాదముల తోడను ఘోషించు చున్నది.

దేవాయతనములలో దేవతామూర్తుల నూతన కాంతులతో విలసిల్లుచు భక్తుల పూజ లందుచు వరప్రదములై వెలయుచున్నవి.

గ్రామగ్రామము లందును వీరులు రణసాధనములతో పాటు కోటరక్షణ భారము వహించుచున్నారు.

వైశ్యశ్రేష్ఠులు బొరియంలో పొదల మాటున గుట్టలచాటున దాచి యుంచిన తమ ధనములు వెలికి దీసి నిర్భయముగా బేహారములు చేయుచు దేశమును సంపన్న మొనర్చు చున్నారు.

దున్నకుండుటచే కొంతకాలము బీడుపడియున్న భూములను కృషీవలులిప్పుడు దున్ని పండించుచున్నారు. విశ్రాంతి గొన్న పిమ్మట ఉత్సాహాతిశయించు నట్లే, భూదేవి ఇప్పుడు ఇబ్బడిగా ముబ్బడిగా పంట లందించుచుండుటచే దేశము సుభిక్షముగా నున్నది.

వేమారెడ్డి చుట్టపు మేరు వను ప్రఖ్యాతి వహించి చెరువులు గుళ్లు ప్రతిష్ఠించు చున్నాడు. నిధులు నల్లండ్లును నిలుపుచున్నాడు. తోటలు సత్రములు చలిపందిళ్లు వెలయ బెట్టించు చున్నాడు. హేమాద్రి పరికీర్తన మైన వ్రతములు దానములు అన్నియు నిర్వహించుచున్నాడు. భూదేవి పునఃపునరుక్త కృతి శుభాపణులతో శోభాయమానమై మహాభాగ్యములతో అలరారు చున్నది.

చెదలువాడలో సోమయాజి ప్రోలమసోమిదమ్మతో మహాగ్నిచయన మొనర్చినాడు. దాని నిర్వహణభారమంతయు అతనిజ్యేష్ఠపుత్రుడు బసవన్న వహించి వచ్చిన బంధువులకు పెద్దలకు సమస్తమర్యాదలు చేయుచుండెను. కరాపర్తి నుండి బొల్లన కుటుంబమే కాక జన్నన కుటుంబమును వచ్చినది. గ్రుడ్లూరు నుండి పోతమ్మయు ఎర్రయయు మహాలక్ష్మయు వచ్చిరి.

శ్రీశైలమునను నుండి శ్రీశంకర సంయమీంద్రుల నారాయణ స్మరణ పూర్వక మగు శ్రీముఖము వచ్చినది.

హంపీ విరూపాక్షమునుండి జగద్గురు శ్రీ విద్యాశంకర విద్యారణ్య యతీంద్రుల శ్రీముఖముతో పాటు వారి నూతనశిష్య డగు శ్రీ కళ్యాణానంద యతీశ్వరుల స్వహస్తలిఖిత శ్రీముఖమును వచ్చినది. ఆది పూర్వాశ్రమములో సూర్యకవి లిఖిత మని సదస్యు లందరు గుర్తించి అనందించిరి.

ఆ మహాగ్నిచయనాంతమున అవబృధస్నానముతో బసవన్న పూతతరు డయ్యెను.

ఎర్రయ రామాయణావతారికలో వేమారెడ్డి యొక్కయు అతని సోదరు లయు బంధువులయు అనుచరులయు వీరధర్మ కార్యములు సత్యోక్తులతో విస్తరించి ప్రస్తావించెను. వేమారెడ్డికి ధర్మిష్ఠలోకమునం దంతట అత్యుత్తమ ఖ్యాతి వెలసినది.

వేమారెడ్డి రామాయణకథ ఎర్రయవలన సమగ్రముగా వినెను. అయి నను అతడు కావ్యామృతాస్వాదనతో తనియలేదు. ఎర్రయ మహాభారతములో అరణ్య పర్వశేషము పూరించినను ఆంధ్రమహాభారతము సంపూర్ణమైన దని ఆతనికి తృప్తి కలుగలేదు. హరివంశము భారతపరాంశ మగుటచే దానినాతడు శ్రద్ధగా అధ్యయనము చేయుచుండెను.

ఒకనాడు వేమారెడ్డి పేరోలగ ముండి ఎర్రయను సంభావించి భారత పరాంశ మని బుధులు ప్రశంసించు హరివంశమును గూడ తెలుగున రచించి తనకు వినిపింపు మని వేడికొనెను. ఎర్రయ హరివంశము పూర్వోత్తర భాగము లతో సంపూర్ణముగా నన్నయభట్ట తిక్కన కవినాథులు చూపిన పావన మార్గ మున ఆంధ్రీకరించి మహాభారతము ఆంధ్రభాషలో సంపూర్ణముగా నవతరింప జేసి కవిత్రయములో ప్రబంధపరమేశ్వరుడు అను విశిష్ట గౌరవము సంపా దించెను.

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

V.R.NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

Acc no 10048

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B113
పుస్తకం పేరు	మల్లారెడ్డి
తారీఖు	31 December 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	485
పెద్ద సైజు పేజీలు	NO
ఖాకీ పేజీలు	VIII
లేని పేజీలు	NO
తయారు చేసినది	Bhavyasri Pagadala
పేజీలు విడదీసినది	Pagadala Hasmath
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good

missing

6,17,89,90